




జ్ఞాన యోగం

విచారణ

సర్వ వేదాంత శిరోభూషణం






సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. మహానుభావులైన సాధకులు, జిజ్ఞాసువులు జ్ఞాన ప్రచారార్ధం తాము సేకరించిన విలువైన గ్రంధాలను **ఆర్కైవ్** వెబ్ సైట్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ సైట్(https://archive.org), గూగుల్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్ (www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **ఆర్కైవ్** వారి వెబ్ సైట్: https://archive.org/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని

సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో సాధకులు,జిజ్ఞాసువులు **ఆర్కైవ్** వెబ్ సైట్ ద్వారా అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు.వారిని సంప్రదించగలరు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు*

ఆర్కైవ్ వారి వెబ్ సైట్:


https://archive.org/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఆశంసనము

నాలోన గల వెల్గు నా పరిసరములు
వారి రూపమున కన్పట్టు గాక !

(ఆత్మ సాక్షాత్కారము)

నా యుచ్చరించెడి నాదమా వెల్గుగా
వినిపించి, కనిపించి, వెలయు గాక !

(ఆత్మానుభవము)

నాలోన వెలుపల నేలు నిశ్శబ్దంబు
ప్రేమగా సాక్షాత్కరించు గాక!

(బ్రహ్మానుభవము)

మా కంఠ శబ్దాల చీకట్లు వెలుగుగా
కరిగించి అది మమ్ము కలుపు గాక!

(మౌన వ్యాఖ్య)

తెలివికిని సద్గుణంబుల బలము గూర్చి
నా ప్రణాళిక విశ్వ ప్రణాళికగను
వ్యాప్తమై విశ్వమూర్తి రూపంబునందు
నిలుచుగావుత శాశ్వత నిలయమగుచు

(పరిపూర్ణము)

- మాస్టర్ ఇ.కె.

కాల ప్రచోదితమై వచ్చెడి గ్రంథములకు రచయిత, పాఠకుడు, గ్రంథము, గ్రంథానుభూతి యివియన్నీ కాలాగ్నియే. ఈ శాశ్వత సనాతన శాస్త్ర విషయములను రాణింపజేయునది, రాణించునది, ఆ కాలాగ్నియే. ఋగ్వేదమందలి శ్రు॥ “అగ్నిమీళే పురోహితం” అను సూచన యిదియే.

- గ్రంథకర్త

సల్లక్షణ శోభితులైన
సచ్ఛిష్యులెల్లరకూ !!

- అంకితం

ఓం

సర్వ వేదాంత శిరోభూషణము

శూన్యం - సర్వం, సర్వం - శూన్యం

గురుస్తుతి

1. **శ్లో॥ గురుమధ్యేస్థితం విశ్వం । విశ్వమధ్యేస్థితో గురుః ।**
గురుర్విశ్వం నచాన్యోస్తి । తస్మై శ్రీ గురవేనమః ॥

తా॥ ఈ ప్రపంచమంతయు సద్గురువునందున్నది. సద్గురువు ప్రపంచమునందు అంతటానున్నాడు. కావున ప్రపంచమంతయు సద్గురువే. అన్యం లేనే లేదు. అట్టి ఈశ్వర స్వరూపుడైన సద్గురువునకు నమస్కారము.

2. **శ్లో॥ శ్రీమత్పరబ్రహ్మ గురూస్మరామి ।**
శ్రీమత్పరబ్రహ్మ గురూభజామి ।
శ్రీమత్పరబ్రహ్మ గురూవదామి ।
శ్రీమత్పరబ్రహ్మ గురూనమామి ।

తా॥ ప్రకాశము గల పరబ్రహ్మ స్వరూపమైన సద్గురువును స్మరించుచున్నాను, సేవించుచున్నాను. పలుకుచున్నాను. అట్టి గురువును గూర్చియే నమస్కరించు చున్నాను.

3. **శ్లో॥ ధ్యానమూలం గురోర్మూర్తిం । పూజామూలం గురోఃపదం ।**
మంత్రమూలం గురోర్వాక్యం । ముక్తిమూలం గురోఃకృపా ॥

తా॥ గురువు యొక్క దేహమే ధ్యానమునకు కారణము. గురువు యొక్క పాదమే పూజించుటకు కారణము. గురువాక్యమే మంత్రమునకు కారణము. గురుకృపయే మోక్షమునకు కారణము. లక్ష్యార్థమున శ్రీ గురుస్వరూపమేదో, ఆ పరబ్రహ్మ స్వరూపమే ధ్యానించదగినది. శ్రీ గురుస్థానమేదో ఆ లక్ష్యమగు పరబ్రహ్మమే పూజింపదగినది. శ్రీ గురుదేవుల తత్త్వోపదేశమే మహామంత్రము మరియు మననము చేయవలసినది. శ్రీ గురుదేవుని అనుగ్రహమే మోక్షం.

4. **శ్లో॥ గురుమూర్తిం స్మరేన్నిత్యం । గురోర్నామసదాజపేత్ ।**
గురోరాజ్ఞాం ప్రకుర్వీత । గురోరన్యన్నభావయేత్ ॥

తా॥ ఎల్లప్పుడును సద్గురు స్వరూపమునే స్మరించవలయును. ఆ సద్గురు నామమునే జపించవలయును. సద్గురు ఆజ్ఞ ప్రకారమే చేయవలెను. ఇతరమగు దానిని తలంచనే కూడదు.

5. **శ్లో॥ నిత్యంబ్రహ్మనిరాకార । నిర్గుణం బోధయేత్పరం ।**
భాసయేన్ బ్రహ్మభావంచ । దీపోదీపాంతరం యథా ॥

తా॥ గురువు, పరబ్రహ్మ ధ్యానమను ఒక దీపమునందు వేరొక దీపమును ప్రకాశింపజేయుచు, శాశ్వతమును, నిర్గుణమును నగు అచల బ్రహ్మమును బోధ చేయవలెను.

6. **శ్లో॥ స్వయంతథావిధోభూత్వా । స్థాతవ్యం యత్రకుత్రనత్ ।**
కిటోభృంగ ఇవధ్యానా । ద్యధాభవతి తాదృశః ॥

తా॥ కీటకము ఏకైక ధ్యానము వలన తుమ్మెద కాగలిగినట్లుగానే, గురు పరబ్రహ్మ ధ్యానము వలన తానే ఆగురు స్వరూపు డగును. అతడెచ్చట నుండినను సరే బాధ లేదు.

7. **శ్లో॥ పిండేముక్తాః పదేముక్తాః । రూపేముక్తాః వరాననే ।**
రూపాతీతేచ యే ముక్తా । స్తేముక్తానాత్ర సంశయః ॥

తా॥ కుండలినీ శక్తి యందును, హంస స్వరూపము నందును, ఆపోజ్యోతి స్వరూప దర్శనమునందును, కళాతీతమైన పరిపూర్ణమందును, ముక్తులగు వారెవరో వారే ముక్తులు. ఈ విషయమందు సందేహము లేదు.

8. **శ్లో॥ ఏకాకి నిస్పృహ శ్శాంతా । శ్చింతాసూయా వివర్జితః ।**
బాల్య భావేనయోభాతి । బ్రహ్మజ్ఞానీన ఉచ్యతే ॥

తా॥ ఒంటరిగా నుండు వాడును, ఇచ్ఛ లేని వాడును, శాంతి గల వాడును, రాగద్వేషాదులు, అసూయ మొదలుగునవి విడచిన వాడై ఎవడు బాలభావముతో ప్రకాశించుచున్నాడో వాడే పరబ్రహ్మమును తెలిసిన వాడని చెప్పబడుచున్నాడు.

9. శ్లో॥ **సర్వజ్ఞ పదమిత్యాహు । ర్దేహే సర్వమయోభువి ।**
సదానందః సదాశాంతో । రమతేయత్రకుత్రచిత్ ॥

తా॥ జీవుడు భూమి యందెక్కడైతే సదానందుడును, సదా శాంతుడును, సమస్త స్వరూపుడు నై క్రీడించుచున్నాడో, దానినే సర్వజ్ఞత్వ పదమని బ్రహ్మవేత్తలు చెప్పిరి.

10. శ్లో॥ **స్వయంబ్రహ్మమయోభూత్వా । తత్పరంచావ లోకయే ।**
పరత్పరతరం నాన్యత్ । సర్వగం తన్నిరామయం ॥

తా॥ జనుడు తాను బ్రహ్మరూపియై, ఆ పిమ్మట, దానికతీతమైన పరస్వరూప మగు కేవలాత్మను జూచును. అట్టి పరస్వరూపమగు పరిపూర్ణము కంటె అన్యమేదియును లేదు. అది యంతటను నిండియుండునదియును, నిరామయమైనదియునై యున్నది. అది దేనికిని ఆధారము కాదు.

శ్లో॥ **కిమావాహనమవ్యక్తే । వ్యాపక్తే కిం విసర్జనం ।**
అమూర్తే చ కథం పూజా । కథం ధ్యాన నిరామయే ॥

శ్లో॥ **తుర్యస్వరూప పరిపూరిత దివ్యభావౌ ।**
సర్వప్రపంచ సృజనాత్మక శక్తియుక్తౌ ।
ధ్యానైక గోచర విశిష్ఠ విశేష తత్త్వౌ ।
శ్రీ దేశికేంద్ర చరణం శరణం ప్రపద్యే ॥

శ్లో॥ **మంగళం దేశికేంద్రాయ । మహనీయ గుణాత్మనే ।**
మంగళం రాజ యోగీంద్రాయ । గురుదేవాయ మంగళం ॥

గుర్వనుగ్రహమ్

1. శ్లో॥ **ఓం నమః ప్రణవార్థాయ । శుద్ధ జ్ఞానైక మూర్తయే ।**
నిర్మలాయ ప్రశాంతాయ । దక్షిణామూర్తయే నమః ॥

శ్రీ శ్రీ శ్రీ అవతార్ మెహర్‌బాబా వారు
V
శ్రీ శ్రీ శ్రీ భగవాన్ సత్యసాయి బాబా వారు
V
శ్రీ శ్రీ శ్రీ దొంతులమ్మ తల్లి వారు
V
శ్రీ శ్రీ శ్రీ బళ్ళ సుబ్బనాగన్న గారు
V
శ్రీ శ్రీ శ్రీ మాతారవిందులు వారు
V
శ్రీ శ్రీ శ్రీ ఉపాసనీ మహరాజ్ వారు
V
శ్రీ శ్రీ శ్రీ తాజుద్దీన్ బాబా వారు
V
శ్రీ శ్రీ శ్రీ షిరిడీ సాయిబాబా వారు
V
బ్రహ్మశ్రీ కొల్లి గురుప్రసాద్ గారు
V
బ్రహ్మశ్రీ కొల్లి కోటయార్యులుగారు
V

బ్రహ్మశ్రీ మన్మదుపు సుబ్బయాచార్యులు గారు

ఓం

ప్రస్థావన

ఈ గ్రంథము సాధన చేయుటకు పక్రమించిన వారికి స్థాయీ భేదములతో తగిన విధముగా వివరించుచున్నది. ఇందు కొన్ని పునరుక్తిగా గనుపించినప్పటికిని మొదట చెప్పిన స్థాయి కంటె, రెండవ సారి చెప్పినది లక్ష్యార్థ భేదముతో నుండుటయే దీనికి కారణము.

అటులనే, సాధకుని అనుభవస్థితి ననుసరించి ఎక్కడికక్కడ సత్యమే చెప్పబడినట్లుండును. అయినను సాధకునికి అంతకంతకు స్పష్టత, సమన్వయము సిద్ధించుటయే గాక, నిర్ణయ పద్ధతిలో అనుభవములోనికి తీసికొనిపోగలదు.,

ఇందు వేరు వేరు సిద్ధాంతములున్నట్లు గనుపించినను ఒకదానికొకటి సంబంధపడి యున్నది. ఒక వరుస క్రమములో ప్రతి అంశము అతీత పద్ధతిగా అనుభవమునకు రాక తప్పదు. దేనినీ వ్యతిరేకించక, అన్నింటినీ దశలవారీగా సాధకుని యొక్క స్థాయి కనుగుణముగా స్వీకరించదగును. అవగాహనానుభవములు పెంపొందించుకొన్నవారు క్రమముగా గమ్యమును చేరెదరు. అతీత పద్ధతిగా అనుభవక్రమములో అధిగమించినవారికి, యే సిద్ధాంతము పైనను వ్యతిరేకత యుండదు. ఇంద నుసరించినది మహావాక్య, వార్తీక వేదాంత నిర్ణయములను నిరసించునదియే బృహద్వాశిష్ఠ పద్ధతి.

ఇట్టి మహోత్కృష్ఠ రచనకు ప్రారంభము నుండి ముగింపు వరకు శ్రీవారందించిన ప్రేరణ, తగిన ప్రజ్ఞాపాటవ ప్రభావమే యీ గ్రంథము యొక్క యిప్పటి స్వరూపము. శ్రీవారి స్వానుభవము గ్రంథానుబంధములో వివరించిన విధముగానుండుటయే సకల సిద్ధాంతముల సమన్వయమునకు ఆధారము. అందువలన యీ గ్రంథము సాధకులను విశాల దృక్పథములోనికి ప్రవేశింపజేసి, వ్యష్టి నుండి సమిష్టిలోనికి తీసికొనిపోవును.

కనుక యీ గ్రంథమును ప్రారంభము నుండి వరుస క్రమములోనే చదువవలెను. సత్సంగములో అనుభవజ్ఞులైన వారి సాన్నిధ్యమున చర్చించుచు సాధనపూర్వకముగా మననము చేసిన బహుళ ప్రయోజనము. శ్రీవారందించిన ప్రేరణ కనుగుణముగ వివిధ గ్రంథములు పరిశీలించి, కొండొకచో గ్రంథములందలి ఉత్తమాంశములను యథాతథముగా నుంచ బడినవి. కారణమేమనగా సిద్ధాంత సమన్వయమునకు గాను, యితర గ్రంథముల ప్రమాణము స్వీకరించి చదువరుల విశ్వాసమును, సాంప్రదాయకతను, సనాతన నిర్ణయములను పెంపొందించుటయే.

సచ్ఛిష్యులకు అమృతసోపానమై గమ్యమును చేర్చగల దైవీ ప్రణాళికగా, ఈశ్వరకృపతో, కాలాగ్ని చోదితమై, మౌనవ్యాఖ్యగా అందించబడి, సవివరమై గ్రంథరాజమై వ్యక్తీకరించబడినది. ఈ గ్రంథము అమూల్యము మరియు గమ్యము చేరునంతవరకు, అమృత సూత్రముగా జననమరణ రహిత స్థితికై సాధకులు చిరకాలము ఆశ్రయించ దగినది. శరణాగతియనెడి నిజగురు హృదయైక్య అనుసంధానమే సర్వులకు శ్రేయోదాయకమైనది.

పరమగురు కరుణచే తెలియబడినదంతయు ప్రస్థావించబడినది.

ఇట్లు

సచ్ఛిష్యులు

పీఠిక

దివ్యాత్మస్వరూపులారా!

పరమేష్ఠి కరుణకు పాత్రమగు సుజనులందరకును నిజగురు చరణ నీరజ రేణువులగు సాధుసత్పురుషుల కందరకును నమస్సులతో !

పరశివ తత్త్వ సారమును శ్రీ వీరబ్రహ్మేంద్రులు, శ్రీ వేమనార్యులు, వశిష్ఠ సాంప్రదాయికులు, అచల సాంప్రదాయికులు, యోగవాశిష్ఠ, జ్ఞానవాశిష్ఠ, బృహద్వాశిష్ఠ పద్ధతులుగాను, వేదాంతము సర్వమును సద్గురువులు ఉపనిషన్మతముగా పరంపరాపద్ధతిగా, గురు శిష్య న్యాయముగా, బుధజన విధేయముగా అందించినారు.

అందలి ముఖ్యాంశములైన జగత్, జీవ, ఈశ్వర భ్రాంతి నిర్మూలనను లక్ష్యముగా స్వీకరించి ఈ సర్వ వేదాంత శిరోభూషణమను గ్రంథ రాజమును శూన్యం – సర్వం, సర్వం – శూన్యం అనెడి సాధన గ్రంథముగా కేవల జ్ఞాన సముపార్జన నిమిత్తమై జీవించెడి ఉత్తమ జిజ్ఞాసువులకు బాసటగా నిలుపవలెనన్న సత్సంకల్పక్రమముగా అందించడమైనది.

శ్రీ గురువుల, సద్గురువుల, పూర్ణ (నిజ) గురువుల, విశ్వ సద్గురువుల అవతారుల కృపకు పాత్రులైన మహనీయుల పర్యవేక్షణచే అందించబడు ఈ గ్రంథము సాధకులకు అమృతత్వమునందించునది. ఇందు సాధనాక్రమము, అనుభవక్రమము, నిర్ణయక్రమము, సూచనాక్రమము, దృఢీకరణ, నిరసన, రహిత పద్ధతులను సాధకులనుద్దేశించి వివరించడమైనది.

ప్రథమాంకము జీవజగత్తులను ఆత్మ దృష్టిచే విచారణ చేయు విధము, సాధన చతుష్టయము, సృష్టి వివరము. ప్రణవము – పంచాక్షరీ క్రమముగా పిండాండ పంచీకరణ ద్వారా, త్రిగుణ సామ్య సృష్టి ద్వారా శరీరత్రయ విలక్షణత్వమును, పంచకోశ వ్యతిరిక్తమునను, అవస్థాత్రయ సాక్షిత్వమును విచారణ పద్ధతిగా అవగాహనతో నిత్యజీవితానుష్ఠానముగా తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిదానములను, ఆత్మానుభవ లక్ష్యముతో వివరించ బడినది.

ద్వితీయాంకమందు జ్ఞాతయైన జీవుడు తాను వ్యష్టియందు ఆత్మస్వరూపుడై సమిష్టియందు బ్రహ్మమై యుండెడు రీతిని బ్రహ్మాండపంచీకరణముద్వారా వివరించి మహావాక్యచతుష్టయము ద్వారా సర్వవ్యాపకత్వమును పొందుట. సచ్చిదానందానుభవము దాని ఉత్కృష్ఠతలను ఎరుక నిర్ణయమునకు లక్ష్యముగా వివరించి బ్రహ్మానుభవము ముక్తి విషయము నిర్ణయింపబడినది.

తృతీయాంకమందు కూటస్థమైన అమనస్క భావము స్థిరీకరించి అష్టతను భావ నిరసనతో కేవల జ్ఞాన పద్ధతిగా, ఎఱుక నిర్ణయ పద్ధతిగా మహావాక్య విచారణపూర్వకముగా జీవేశ్వరైక్య భ్రాంతిని నిరూపించి సద్విద్యయైన సచ్చిదానంద పరిపూర్ణములను స్పష్టముగా వివరించి జన్మరాహిత్యమును ప్రతిపాదించు ద్వాదశి, షోడశి, పంచదశిల ద్వారా బయలు లక్ష్యముగా ఎఱుకానుభవము నిర్ణయింపబడినది.

చతుర్థాంకమందు ఉపనిషన్మత పద్ధతిగా "కదలని అచలమును" నిరూపించుచు యాజ్ఞావల్క్యుడు, అష్టావక్రుడు, పంచశిఖులతో జనకుని సంవాదమును, పరిపూర్ణ భావమును, తృతీయాంకమందు నిరూపించబడిన ఎఱుకను క్రమముగా నిరసించగల సామర్థ్యమును బోధగా అనుభవ పద్ధతిగా ద్వాదశిచే లక్ష్యమైన బయలును నిర్ణయించి షోడశిచే సర్వం శూన్యంగా – లేనదిగా దృఢీకరించి, పంచదశిచే దేశికుల వ్యవహారము కలవలెనె అని నిరూపణ చేసి సర్వం సంపూర్ణముగా శూన్యంబని ఉన్నది ఉన్నట్లుండిపోయెను.

పూర్వ రంగము

దివ్యాత్మ స్వరూపులారా !

ఏదైనా ఒక విషయము శ్రీవారి మనస్సులో ప్రవేశించిన, వారి ఆలోచన తద్విషయమై పరంపరగా సాగి నిర్నిద్రులై, ఏతద్విషయమై నిర్ధారణగా వారి అనుయాయులకు వివరముగా బోధించేవారు. అదే విధముగా సృష్టి వివరము, సాధన విషయము, మహావాక్య విచారణ ద్వారా, పరబ్రహ్మగా అనుభవము నందుట వంటి పరమోత్కృష్టమైన సద్విషయములను సత్సంగము గావించుచు, శ్రీవారి ఆధ్వర్యమున గోష్ఠులను నిర్వహించెడివారు.

ఏతత్పూర్వమునుండి ''అచలము''ను నిర్ణయ పద్ధతిగా తమ అనుయాయులకు వివరించెడివారు. శ్రీవారి అనుభవములను విశదముగా తెలియపఱచి అందరిని సంభ్రమాశ్చర్యముల ముంచెత్తి, ఆనందపఱచెడివారు.

ఇవి అన్నియు ముప్పిరిగొన, ఒకానొక దివ్యసమయమున శ్రీవార్కి దృశ్యముగా వారి "లోచూపు"నకు గోచరించి వానిని సర్వులకు పరమానంద దాయకముగా వివరించినదే యీ గ్రంథరాజమైనది.

సృష్టికి పూర్వము "ఏమీ లేని" స్థితి ఉన్నది. అది తోచుటకు కూడా నిక్షిప్తత

లేని స్థితి సత్యత్వస్థితి ఒకటి. శూన్యము అనుపేర మొదలిడి అద్దానినే శూన్యమనిన్నీ, స్థిరమై, అందు "ఆది విలాసము" ఉప్పొంగి, ఆ ఒక్కటైన పరబ్రహ్మమను భగవంతుడు ఒకటికి కుడివైపున సున్నలుంచినట్లు సృష్టి అనేకమై సర్వముగా తోచిన విధము యీ గ్రంథమందు సవివరముగా చూపడమైనది.

అట్టి అనేకమైన సృష్టిని, మిథ్యగా భావించి, వ్యష్టిగా, ఆత్మగా తాను పరమాత్మగా "నేనను" అనుభవము పొందువరకున్నూ సాధకుడు చేయవలసిన విచారణ, సాధన అధ్యయనములను యీ గ్రంథమందు ఒక క్రమ పద్ధతిలో వివరించడమైనది.

ఈ విధముగా అనేకమైనట్టి సర్వమునుండి జీవుడు, ఆత్మ-పరమాత్మ అను ద్వైతంవరకున్నూ, యింకనూ తానే భగవంతుడనను అద్వైతభావనకు చేరు విధమున్నూ, అనంతమైన సృష్టిగాయున్నప్పటి స్థితియైన ఒకటికి కుడి వైపుననున్న సున్నలు ఒక్కొక్కటి ఎడమవైపునకు జేరి చివరకు అన్ని సున్నలూ లేనివే కాగా జగత్తు మిథ్యయైన విధమున్నూ, సత్యమైన బ్రహ్మమొక్కటేయనిన్నీ శ్రీవారు వారికి దర్శనీయమైనదానిని వివరణగా తెలియజేసినారు.

తుదకు లేనెఱుక అయినట్టి యీ ఒకే ఒక్కటైన పరబ్రహ్మమనెడి తనకు మూలము లేదని గుర్తెఱిగి ఉత్త బట్టబయలులో తనకు ఆధారము గాన రాక, ఉండలేక, తానే లేకపోయిన విధము 'అచల' సిద్ధాంతపూర్వకముగా దెలియజేసినారు.

ఉన్నదేదో ఉన్ననూ, లేనిది లేనే లేకున్ననూ, గుర్తించెడి ఎఱుక విడచిన పిదప, గుర్తించెడిదే లేనందున సర్వమున్నూ శూన్యమే. ఈ విధముగా శూన్యము సర్వముగా వ్యక్తమై మరల ఆ సర్వమున్నూ శూన్యము అయినది. ఇదియే ఈ గ్రంథ నిర్ణయము.

శూన్యము సర్వముగా వ్యక్తమైన విధము ఎట్లనగ బ్రహ్మాండము, అందలి అహము, ఈశ్వరునిగాను, అందుండి పిండాండము, అందలి అహము జీవునిగాను క్రమముగా చైతన్య వికాసమైనది.

ఇట్టి వ్యష్టి అనుభవమున పరిమితమైన జీవుడు సమిష్ట్యానుభవములో ఈశ్వరునిగా మేల్కొను విధము, అందుకు కావలసిన అవశ్య సాధన, బోధ యీ గ్రంథమునందు వివరించబడినవి.

పిండాండములోని జ్ఞాత, బ్రహ్మాండములోని అధి దేవతలు ఈశ్వరునికి ఇంద్రియములు (తత్త్వములు) గా నిర్ణయము. ఈ విధానమంతయూ పిండాండ, బ్రహ్మాండ పంచీకరణల ద్వారా రహస్య త్రయమంత్ర పూర్వకముగా, పరబ్రహ్మానుభవమును పొందుటను వివరించడమైనది.

అట్టి యెఱుకానుభవ స్థితి నుండి ద్వాదశి, షోడశి, పంచదశి మంత్రముల ద్వారా తాను పరబ్రహ్మమనెడి అఖండ ఎఱుకగా గూడలేక, ఎఱుకను విడచి, పరశివమైన పరబయలందు తానే లేకపోవు చైతన్య వ్యావర్తన విధము యిందు సాంగముగా వివరించబడినది.

ఇందు సాంప్రదాయక విధానముగా వివరించుచునే శ్రీవారి స్వానుభవమును గూడ కూర్చి సమన్వయముగా బోధించు యీ సర్వ వేదాంత శిరోభూషణము అనెడి శూన్యం – సర్వం, సర్వం – శూన్యం గ్రంథరాజమయినది.

హరిః ఓం తత్సత్

మేలుకొలుపు (ఆత్మ)

1) తెల్లవారెను భ్రాంతి చీకటి । దీరిపాయెను జ్ఞానము
దయంబల్ల నాయెను। మనసు తిరమై । యెల్ల బయ లాయెన్ ।
ఆత్మా మేలుకొనవే ॥

2) ఉన్నదున్నట్లుండి పాయెను । విన్న కన్నది లేకపాయెను ।
యెన్నగా యీ యెఱుక మూలము । యేమి లేదాయెన్ ॥
ఆత్మా మేలుకొనవే ॥

3) తోచు వృత్తులు దొలగి పాయెను । సూచనయు
గురువాక్య మాయెను । ఉచ్ఛ నీచంబనెటి పలుకులు
ఉత్తవై పాయెన్ ॥ ఆత్మా మేలుకొనవే ॥

4) భూతపంచక శూన్యమాయెను । కూత లేమియు

లేకపాయెను । పాతకంబులు పారిపాయెను । పరమ
పదమాయెన్ ఆత్మా మేలుకొనవే ॥

5) ఇల్లు బయలై తెల్లనాయెను । కల్ల బోధలు చెల్లి
పాయెను । పిల్ల లాటల పోలికాయెను । ప్రేమ
లేదాయెన్ ॥ ఆత్మా మేలుకొనవే ॥

6) పిండ బ్రహ్మాండముల నుండెటి ।
దండియహముల తెలివి బాయెను । ఖండ
ఖండములోను జూడ య । ఖండమై పాయెన్ ॥
ఆత్మా మేలుకొనవే ॥

7) హరిహరాదుల కందకుండెటి । గురుని
వాక్యము నమ్మికాయెను । పరమపదమే బట్ట
బయలై । భావమిక బాయెన్ ॥ ఆత్మా మేలుకొనవే ॥

8) జనన మరణము జడుపు తీరెను । కనుల వేడుక
కాలిపాయెను । మనసు యింద్రియ చలము
లెల్లను । మాయామై పాయెన్ ॥ ఆత్మా మేలుకొనవే ॥

9) జగతి విబుధుల స్వప్నమాయెను । పగలు రాతిరి
లేక పాయెను । ఒకటి రెంటి మూలమారెను ।
ఊహా లేదాయెన్ ॥ ఆత్మా మేలుకొనవే ॥

10) ఇంపుగా నలగండ్ల వెలిగెటి । వెంపటి నరసింహ్వా
గురువరు । పంపునను గోపాల కవిలో । బయలు
బయ లయ్యెన్ ॥ ఆత్మా మేలుకొనవే ॥

* * * * *

1) తెల్లవారెను మోహతిమిరం । బెల్ల బాయెను జ్ఞాన
వుదయం । బల్ల ప్రబలం బాయ । తన మనసెల్ల
స్థిరమాయెన్ ॥ ఆత్మా మేలుకొనవే ॥

2) మూడు గుణములు । ముణిగి పాయెను ।
ఏడు ధాతువు । లెనుక బట్టెను । ఏడ యేమియు ।
లేకపాయెను । ఎఱిగి మేల్కొనవే ॥
ఆత్మా మేలుకొనవే ॥

3) అష్ట తనువులు అడవి బట్టెను । అష్ట మదము లహామిక
మణగెను । కష్ట సుఖముల । కాంక్ష దీరెను ।
ఘనత మేల్కొనవే ॥ ఆత్మా మేలుకొనవే ॥

4) అష్ట ప్రకృతుల ఆటలుడిగెను । అష్టపాశములపుడె
వీడెను । ఇష్ట మేమియు లేకపాయెను ।
ఇపుడు మేల్కొనవే ॥ ఆత్మా మేలుకొనవే ॥

5) వాసనాత్రయ మొదలి పాయెను । ఈషణ త్ర
యమిపుడె వీడెను । విన్న దేమియు లేక పాయెను ।
వేగ మేల్కొనవే ॥ ఆత్మా మేలుకొనవే ॥

6) సాగరంబుల చప్పు లుడిగెను । వాద భేదము
వదలిపాయెను । నాద మప్పుడె నశ్యమాయెను ।
నయమె మేల్కొనవే ॥ ఆత్మా మేలుకొనవే ॥

7) మండలములనె మమతమానెను । కుండలస్థలి
కూలిపాయెను । పండు వెన్నెల భావమాయెను ।
బరగ మేల్కొనవే ॥ ఆత్మా మేలుకొనవే ॥

8) మనసు బుద్ధియు మరల జనియెను । మాని పాయెను
జనన మరణము । మమత ఏమియు లేక పాయెను
మరియు మేల్కొనవే ॥ ఆత్మా మేలుకొనవే ॥

9) గురుడు శిష్యుండేక మాయెను । కులము గోత్ర
ము లేక పాయెను । కుడి యడమలు సమమె
ఆయెను । గురు తెఱుక బాయెన్ ॥ ఆత్మా మేలుకొనవే ॥

10) పరశురాముని సీతరాముల । భజన నిత్యము
సేయుటాయెను । బాగుగా శేషమ్మ భావము ।
బయలులో లే దాయెన్ ॥ ఆత్మా మేలుకొనవే ॥

మేలుకొలుపు (జీవ)

1) కటకట మోసమాయెను ।
మోసమాయెను జీవ చూడగ । మోహపాశము
లధిక మాయెను । గాశి జెందగ, జేసె నీగతి ।
కర్మ మేమందూ ॥ జీవా మేలుకొనవే ॥

2) కల్పశతముల కన్న మిక్కిలి । కాల మాయెను,
తిరిగి చూడగ । అల్ప సుఖ మని, కలలో మురి
యుచు । ఆడుచున్నావు ॥ జీవా మేలుకొనవే ॥

3) కోటి జన్మము లెత్తియును । శతకోటి దుఃఖ
ము లనుభవించుచు । నాటి మాటలు దలచు
కొంటె నాటు నీ మదికి ॥ జీవా మేలుకొనవే ॥

4) ఇరువ దొక వెయ్యి ఆరు నూరులు । జరుగు హం
సలు తరుగు నాయువు । హరిహరాదులు వచ్చి
నిలచిన । ఆగదీ తనువూ ॥ జీవా మేలుకొనవే ॥

5) లేనిపోని దుఃఖజాలము । లోనబడి చెడి
పోవు టెందుకు । మాన అవమానంబు లని । నీ మమత
విడ లేవూ ॥ జీవా మేలుకొనవే ॥

6) నిజగురుండగు సూర్యుడిప్పుడు । నిజముగా
ఉదయించె చూడుము । త్రిజగముల వారంత
మేల్కొని । తెలివి గన్నారు ॥ జీవా మేలుకొనవే ॥

7. బట్టబయలును గురుడు జూపిన । నట్టు లేకను
పుడమి అంచున । పట్టు విడువక గుట్టు మరు
వక । దిట్టమై పోవె ॥ జీవా మేలుకొనవే ॥

8. మాయ తనువై మాయతానై । మాయ పను
లను జేయుచును మరి । మాయ తన మర్మం
బుగనే । మాయమై పోవున్ ॥ జీవా మేలుకొనవే ॥

9. ద్వాదశిషోడషులనె జలధార కర్ణములందు
సోకిన । బాధలన్నియు తొలగి నీవిక । భ్రాంతి
వొదిలెదవూ ॥ జీవా మేలుకొనవే ॥

10. భాగవత శ్రీకృష్ణ దేశిక ప్రభువరుండిటు
రానె వచ్చెను । వేగ గని తను మన ధనంబులు
వీడి । శరణనవే ॥ జీవా మేలుకొనవే ॥

11. పీలుఖాన శంకరుండని పిలిచి । ప్రభువరుం
డేలినారట । మూలమూ లేనట్టి యెఱుకను ।
ముంచి వేసిరటా ॥ జీవా మేలుకొనవే ॥

శ్రీ మద్రాజాధిరాజ మహరాజా యోగీంద్ర చంద్ర
భాగవత కృష్ణ దేశిక ప్రభు మహరాజుకీ
జై జై జై
ఓం
తత్సత్
శాంతిః శాంతిః శాంతిః

సర్వ వేదాంత శిరోభూషణము (పటము)



సర్వ వేదాంత శిరోభూషణము
శూన్యం - సర్వం, సర్వం - శూన్యం

ప్రథమాంకము

గురుధ్యానము :

1. శ్లో॥ బ్రహ్మానందం పరమసుఖదం । కేవలం జ్ఞానమూర్తిం ।
ద్వంద్వాతీతం గగన సదృశం । తత్త్వమస్యాది లక్ష్యం ।
ఏకం నిత్యం విమలమచలం । సర్వధీ సాక్షిభూతం ।
భావాతీతం త్రిగుణ రహితం । సద్గురుం తం నమామి ॥

తా॥ బ్రహ్మానంద స్వరూపుడును, పరమ సౌఖ్యమునిచ్చువాడును, కేవల పరమాత్మ స్వరూపుడును, జ్ఞాన స్వరూపుడును, సుఖదుఃఖాది ద్వంద్వములు లేనివాడును, ఆకాశ సమానుడును, తత్త్వమసి మహావాక్యములచే లక్ష్యార్థమైన అఖండమగు పరబ్రహ్మ స్వరూపుడును, అద్వితీయుడును, శాశ్వతుడును, విమలుడును, చలన వర్జితుడును, బుద్ధికి సాక్షి మాత్రుడును, తలపులకు లోబడక, అతిక్రమించి యుండెడి వాడును, రజస్సత్త్వ తమోగుణములు లేని వాడును అగునట్టి సద్గురు స్వరూపుని గూర్చి నమస్కరించుచున్నాను.

**2. శ్లో॥ అహంనిర్వికల్పో నిరాకార రూపః ।
విభూత్వాచ్చ సర్వత్ర సర్వేన్ద్రియాణాం ।
నచాసంగతం నైవ ముక్తిర్నమేయః ।
చిదానంద రూపః శివోఽహం శివోఽహం ॥**

తా॥ సర్వేంద్రియములకంతటికిని ప్రభువై వెలసినట్లుండుటచే, నేను నిర్వికల్పుడును, నిరాకారుడను, నిస్సంగత్వముగాని, ముక్తి గాని, ప్రమేయము గాని నాకు లేవు. చిదానంద రూపుడగు శివుడను నేనే. నేనే శివుడను.

3. శ్లో॥ స్థూల సూక్ష్మ సకారణాంతర ఖేలనం పరిపాలనమ్ ।

విశ్వతైజస ప్రాజ్ఞ చేతసమంతరాత్మ నిజాంశుకమ్ ।
సర్వకారణ మీశ్వరం నిటలాంతరాళ విహారకమ్ ।
ప్రాతరేవహి మానసాంతర భావయేద్గురు పాదుకామ్ ॥

తా॥ స్థూల సూక్ష్మ కారణములతో క్రీడించునది, భక్తులను పరిపాలించునది ప్రపంచమునకు తేజస్సును కూర్చునది, అంతరాత్మయే వస్త్రముగా కలది, సర్వకారణములకు కారణమైనది, లోకమును శాసించునది, భ్రూమధ్యమున విహరించునదియు నైన శ్రీ సద్గురు పాదుకా ద్వయమును ప్రతిదినము ఉదయముననే ధ్యానింతును.

4. శ్లో॥ ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యా సాంప్రదాయ కర్తృభ్యో ।
వంశ ఋషిభ్యో మహద్భ్యో నమోగురుభ్యః ॥

5. శ్లో॥ అస్మద్గురు సమారంభం కృష్ణ సాందీప మధ్యమాం ।
ఓంకార పీఠ పర్యంతం వందే గురు పరంపరాం ॥

6. నమో దేవ దేవా । నమో దివ్య తేజా ।
నమోద్వైత తత్వార్థ బోధనాయ ।
మోక్షమొసగు శాస్త్ర రూపమే నీవంచు
నాదు మనమునందు కొలుతు నిన్ను ।
గురుదేవ ! నీకృపా వీక్షణ లేశమ్ము
గూఢమౌ తత్వార్థ బోధకమ్ము ।
ఋజుమార్గమును జూపు ఋషితుల్యుడవు నీవు
మార్గదర్శివి మానవాళికెల్ల ।
దేశకాల వస్తుగుణ రూప జ్ఞానమ్ము
వాస్తవమ్మున భావమాత్రమౌను
యతివరా, శాస్త్రస్వరూపా, నమస్సులివె,
చిద్రూప చిన్మయానంద స్వామి ।

హరిః ఓం

తత్‌సత్ ఓం

1. శ్లో॥ ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే ॥

తా॥ అదియును పూర్ణమే. ఇదియును పూర్ణమే. పూర్ణము నుండి పూర్ణము తీసిననూ (వ్యక్తమైనా) పూర్ణమే మిగులును.

2. శ్లో॥ భావశూన్యం బాహ్యాశూన్యం । మంతః శూన్యం నిరామయం
ప్రభాశూన్యం జ్ఞాన శూన్యం । సర్వశూన్యం నిరామయం
అప్రతర్క్య మవిజ్ఞేయ । మవాఙ్మా న సగోచరం
అమాత్రమవ్యయం దేవం । శివంతం నిష్కళం భవేత్

తా॥ బాహ్యాభ్యంతర ప్రభా, జ్ఞాన శూన్యమైనది. అచలతత్వం. అది తర్కమునకందదు. వాక్కు మనస్సులకు గోచరించదు. అది మాత్రారహితము, అవ్యయము, నిష్కళము, పరశివము.

3. శ్లో॥ అబీజం వృక్ష సంపన్నం । శాఖా పల్లవ వివర్జితం ।
పుష్పం నాస్తి, ఫలం నాస్తి । సంపూర్ణం వృక్ష వర్జితం ॥

తా॥ అవ్యక్తము, మహత్తు, అహంకారము, పృథివి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశము, యీ ఎనిమిది విధములైన మహాప్రకృతే, మహత్తత్వమే, బ్రహ్మాది స్తంభపర్యంతముగా నుండెడు సమస్తాకారములాయెను. ఈ యాకారము లనెడు సర్వమూ బీజరహితమైన వృక్ష సమృద్ధి కొమ్మలు, చిగుళ్ళు, పుష్పములు, ఫలములు లేనిదై శరీరాత్మలనెడు వృక్షములు లేనిదైయుండిననూ, భ్రాంతి వలన దోచుచుండెను. పరిపూర్ణాచలమందు, బ్రహ్మము, అనెడు ఎరుక మరియు యేమియును లేదని భావము.

4. శ్లో॥ సర్వశూన్యమయం రూపం జన్మశూన్యం స్వభావతః
జన్మభావేన మృత్యుశ్చ పరిపూర్ణం స్వభావతః

తా॥ అచలపరిపూర్ణ పరబ్రహ్మము యొక్క స్వరూపము ఆకాశాది సమస్త వస్తువులు లేక, తన్మాత్ర రహితమై సర్వశూన్యమైనదియును, సహజముగా జన్మము లేనిదియును, జనన మరణములు లేని స్వభావముతో అంతటనూ నిండిన

అచల పరిపూర్ణమే ఉన్నదని భావము.

5. శ్లో॥ యథానాహం తథాశుద్ధం । తస్మాత్ శుద్ధే న నిర్ణయః ॥
జగదస్తీతికోఽవేదః । నాస్తి కోనచనిర్ణయః ॥

తా॥ నేను నేననే అహం యే ప్రకారముగానున్నదో, అదే ప్రకారము ఎఱుకనుండును గాని అచల పరిపూర్ణమెన్నటికీ కాదు. ఆ పరిపూర్ణమిట్టిదని అట్టిదని నిర్ణయించుటకు ఎవరికినీ అలవి కాదు. ప్రపంచము లేదని ఎవడు తెలిసికొనుచున్నాడో, అట్టి అచల స్వరూపుని నిర్ణయించుటకు ఎవరికినీ సాధ్యము కాదు.

6. శ్లో॥ ఆత్మాతీతం కేవలాత్మా । దేహోనాస్తి కదాచన ।
ఆస్తినాస్తీతికోఽవేదః । నిర్ణయోనాస్తి సర్వదా ॥

తా॥ అద్వితీయమగు అచలపరిపూర్ణ స్వరూపము, ప్రకృతి ద్వయము గల పరబ్రహ్మమునకు అతీతమైనది. అట్టి కేవలాత్మకు, శరీరములు, ఆత్మ లేవని ఎవడు తెలిసికొనునో, అట్టి అచల స్వరూపునకు, ఎఱుక నిర్ణయమగు ఏర్పాటు (స్థితి) లేదు.

7. శ్లో॥ బిందుః పూర్ణేలయం యాతి। నిర్బీజం భవతీ ధృవం ।
జ్ఞాతృజ్ఞేయాదికం నాస్తి । నాస్తి విద్యాత్మ నిశ్చయం ॥

తా॥ బిందువు పూర్ణమందు లయించును. బీజమగునది నిశ్చయముగా లేదు. తెలిసికొనేవాడు, మరియు తెలియబడునది అనునవి లేవు. జ్ఞానము, ఆత్మ నిశ్చయముగా లేనివి.

8. శ్లో॥ మూలచ్ఛేదో మహాపూర్ణః । కళాతీతో సదాఽమలః ।
మూలాభావమిదం దేహం । కింనాస్తీత్యననుస్మరేత్ ॥

తా॥ మూలము కానరానిది, లేనిది, అంతటనూ నిండియున్నది, కళాతీతమైనది, సదా అమలమైనది అచలము. దేహమునకు మూలము లేదు. ఏమియున్నూ లేదను నిర్ణయమును స్మరింపుము.

పై నిర్ణయమంతయు సంజ్ఞా రూపముగా యీ దిగువ నిరూపించబడుచ్నుది. అది ఎట్లనగా **ఓ౦ం = 1 (ఓ౦) 2 (ఓ) 3 (ఓం)**. ఇందు మొదటిది. ఇది సర్వమయిన ఓంకారమునకు అతీతమైనది. ఎఱుక లేని, సర్వమూ లేని పరబ్రహ్మమైనది. బయలైయున్నది. రెండవది 'ఓ' అను ఒక్కటియైన 'అ'కార, 'ఉ'కారములతో కూడిన ఎఱుక రూపమైన పరబ్రహ్మము. మూడవది అయిన 'ఓం' అనగా అకార ఉకారములు 'మ' కారముతో కూడ కలిసి వ్యక్తబ్రహ్మమై సృష్టికారణమై అక్షర స్వరూపమై వ్యష్టి అనుభవమందు ఆత్మగా, సమిష్టి అనుభవమందు బ్రహ్మగా భాసించుచున్న ఎఱుక రూపమైన సర్వమైనది.

అనగా ఓం....... అనేకమై బ్రహ్మాండమునందు ఈశ్వరునిగాను, పిండాండమందు జీవుడుగాను, ఎఱుక స్వరూపముగా, బయలును అంటక సర్వముగా, ఎఱుక కలిగిన బ్రహ్మముగా ఏర్పడి సర్వసృష్టి ఆవిర్భవించినది.

అది ఎట్లనునది రాబోవు ప్రకరణములందు స్పష్టము కాగలదు.

సంకల్పము

కం॥ పూర్ణమేవ నిరాలంబం
ఆగ్నేయంచ నిర్గుణం తథా
దక్షిణే నిత్యశుద్ధంచైవ
నైరుత్యో నిరుపద్రవం
పశ్చిమే నిష్కలంచైవ
వాయువ్యేచ నిరంజనం
ఉత్తరేచ నిరాకాశో
ఈశాన్యో నిర్మలోభవేత్
ఊర్ధ్వశ్చ నిరాకారతః
అధశ్చ నిర్వికారతః
అంతర్బహిశ్చ సర్వత్ర

ఇంకనూ మరికొన్ని ఉపాసనలు మతములుగా చెప్పబడినట్లు గలవు.

ప్రతీకోపాసన, సూర్యోపాసన, గీతోపాసన, అద్వైతోపాసన, విశిష్టాద్వైతోపాసన, ద్వైతోపాసన, చైతన్యోపాసన, గౌడీయోపాసన, పాశుపతోపాసన, జైనోపాసన, శైవోపాసన, క్రైస్తవోపాసన, మహమ్మదీయోపాసన మొదలగునవి.

అచలోఽయం సనాతనః

తా॥ పరబ్రహ్మము తూర్పున - నిరాలంబమై, ఆగ్నేయమున - నిర్గుణమై, దక్షిణమున - నిత్యశుద్ధమై, నైఋతిన - నిరుపద్రవముగా, పశ్చిమమున - నిష్కళగా, వాయువ్యమున- నిరంజనముగా, ఉత్తరమున - నిరాకాశముగా, ఈశాన్యమున - నిర్మలముగా, ఊర్ధ్వమున - నిరాకారముగా, అధోభాగమున - నిర్వికారముగా, లోవెలి లేక, అఖండమైనది. అచలము సనాతనము శాశ్వతము.

అంకురార్పణ

కేవలాత్మ యనెడి లేనెఱుకయే సర్వమైన అఖండ ఎఱుక - "అంకురము". ఇట్టి అంకురమును పరమగురువునకు కైంకర్యము లేక అర్పణ చేసిన, ఉన్నదేదో ఉన్నది. అండ, పిండ, బ్రహ్మాండములుగాను లేక, పిండ, బ్రహ్మాండ, విశ్వాండములు గాను లేక, జ్ఞాత, కూటస్థ, పరబ్రహ్మములు గాను లేక వివరించబడుచున్న దంతయూ ఎఱుకాభివర్ణనమై "అంకురముగా" యున్నది. అంతయూ లేనిదే. పరిపూర్ణ పరబాహ్యమందు పరశివమై ఏది యున్నదో. అది శాశ్వతము, పరము, జన్మరహితము, సనాతనము.

ఆత్మ విచారణ

విజ్ఞానము లేని విద్య, వివేకము లేని విజ్ఞానము, లౌకికము లేని మనిషి, విచక్షణ లేని పని, విజ్ఞత లేని పాండిత్యము, అర్హత లేని అధికారము, సత్యము లేని వాక్కు, మాధుర్యము లేని సంగీతము, భక్తి లేని పూజ, శీలము లేని మనిషి, వినయము లేని విద్యార్థి, సభ్యులను మెప్పించని ఉపన్యాసము రాణించదు. శ్రమ తప్ప, ఫలితము శూన్యము. శాస్త్ర జన్య జ్ఞానముతో బాటు ప్రతి ఒక్కరూ అనుభవజ్ఞానమును కూడా సంపాదించవలెను. అనుభవంలోకి రాని విద్య, విజ్ఞానాదుల వల్ల ప్రయోజనమేమియూ ఉండదు. మనలో నిలకడగా నిల్వయున్న జ్ఞానం వృథా కాకూడదు. అది వట్టి పాండిత్యముగా మాత్రమే నిలిచిపోరాదు. దానిని అనుభవములోనికి తీసికొని రావడంలోనే ఉన్నది గొప్పతనము. ఇంకనూ లోక కళ్యాణమునకు వినియోగించినపుడే దాని సార్థకత. ఇట్టి అనుభవమును పొందుటకు మూడు దశలను దాటవలసియున్నది. (1) తెలిసికొనుట (2) చూచుట, (3) ప్రవేశించుట. వీటినే "జ్ఞాతుం"(కని), "ద్రష్టుం" (చేరి), "ప్రవేష్టుం" (పొందవలయు) అందురు.

జ్ఞాతుం : శాస్త్రములోనున్న అమూల్యమైన విషయాల గురించి అనుభవజ్ఞుల ద్వారా తెలిసికొనవలెను. అందువలన వాటియందు సహజముగా ఆసక్తి జనించును. అపుడు వాటిని ఎలాగయినా చూచి తీరాలను కోరిక కల్గును. దీనినే జ్ఞాతుం అని అందురు.

ద్రష్టుం : రెండవ దశలో అట్టి శాస్త్రములు, విశేషములు ఎందెందు యున్నవో పరిశీలించి, చూచి, సేకరించెదరు. చదివి ప్రత్యక్షముగా చూచెదరు. అమితమైన పట్టుదలతో విచారించి, అవగాహన చేసికొనెదరు. అప్పుడు ఆనందించెదరు. కొంతవరకు తృప్తి కలిగిన దశలో శాస్త్రజ్ఞానము లభించును. దీనిని ద్రష్టుం అని అందురు.

ప్రవేష్టుం : పై రెండు దశలలో సంతృప్తి చెందిన, ప్రయోజనము చాలదు. దానిలో ప్రవేశించి, లీనమై తాదాత్మ్యం పొందవలెను. అనగా తెలిసికొనిన దానిలో, చూచిన దానిలో లీనమై అనుభవించవలెను. ఆహారము స్వీకరించి, శారీరక శ్రమ చేసినప్పుడే, ఆహారము జీర్ణమై, రక్తరూపమై మానవునికి కావలసిన శక్తినిచ్చును. అటులనే, తెలిసికొని, చూచిన విషయములను అనుభవములోనికి, (ఆచరణలోనికి) తెచ్చుకొని, మానవ కళ్యాణమునకు, దేశ పురోభివృద్ధికి, ఆత్మానుభవమునకు ఉపయోగించినప్పుడే యాప్రయోజనము సంపూర్ణమగును. దీనినే ప్రవేష్టుం అని అందురు.

యద్భావం తద్భవతి

"అస్తం గతయా క్షీణయా మనస్యాం జ్ఞానేన రాఘవ" ఈ అవిద్య క్షయించి నాశనమొందిన, ఆ మూలా విద్యయెట్లు కలిగెనో, యెట్లు వృద్ధి చెందెనో, యెట్లు నశించెనో, అను అంశమును తెలిసికొనగలమని వసిష్ఠులవారు శ్రీరాఘవునకు దెలిపిరి.

ఈ ఉపదేశమందొక రహస్యమున్నది. ఈ ప్రపంచమెచటనుండి ఎటుల వచ్చినదని యుగయుగములుగా విచారించిననూ తెలిసికొనజాలరు. కావున జగత్తు యెటుల కలిగినదనిన రజ్జు సర్ప భ్రాంతి యందలి సర్పమెట్లు యుద్భవించినదో అటులనే. అచటనున్నది త్రాడు, కాని అద్దానినుండి సర్పముద్భవించినది. ఈ సర్పోద్భవ కారణము చూచువాని బుద్ధియందు గల దోషము. అనగా భ్రమ లేక, అజ్ఞానము. కావున సర్ప ఆవిర్భావము కారణము అజ్ఞానము, భ్రాంతి వలన పుట్టెనను జవాబు యుక్తి సిద్ధము. అటులనే త్రాడు స్థానమందున్నది బ్రహ్మము; పాము స్థానమందున్నది జగత్తు. అనగా బ్రహ్మమునే మనము భ్రాంతి వలన జగత్తుగా దలచి, అనేకముగా వ్యవహరించుచున్నాము. ఇచ్చట కూడా చూచు వాని బుద్ధి దోషపూరితమనక తప్పదు.

ఇట్టి బుద్ధి దోషము వలన, భ్రాంతి వలన, ప్రభవించిన విషయమెన్నటికిని సత్యము గాదు. భ్రాంతి నశించినప్పుడు తజ్జనిత విషయము కూడా నశించును; యదార్థము గోచరించును. ఇది వేదాంత సారము.

"అహం అజ్ఞం" నేను అజ్ఞానినని ఎవరికి వారు ఒప్పుకొనక తప్పదు. అనగా శాస్త్ర సిద్ధాంతమునననుసరించి చూడగా, బ్రహ్మమై యుండియు, అట్లు తెలియక జీవుడని అనుకొనుచున్న "నేను" అజ్ఞానినని తెలియవచ్చినది. పురుషుని చిత్తమునాశ్రయించియున్న భ్రాంతి వలన, తన నిజ స్వరూపమును విస్మరించి, అనగా ఆనంద స్వరూపమును మరచి, జీవునిగా భ్రమించి, సుఖమనునది అన్యములోనున్నదని, వస్త్వాశ్రయమని, సంసారమునబడి పరిభ్రమిచుచున్న వానిని గూర్చి "ఆత్మను వెదకి తెలిసికొని ధన్యుడవుకమ్ము" అని శ్రుతి బోధించుచున్నది.

అద్వైత ప్రబోధము, నిజముగా అజ్ఞానమను ఒక వస్తువు కలదని ఋజువు చేసి నిరాకరించుటకు ప్రవర్ధిల్లుట లేదు. ఎల్లకాలము లక్ష్యమునను గానక "నాకు సుఖము లేదు", "ఇది కావలయును", "దానిని నేను సాధింపవలయును, అనుభవించవలయును" అనునట్టి బుద్ధియే జీవత్వము. ఇట్టి బుద్ధి "నేను సుఖ స్వరూపుడను, అప్రకాముడను" అను తెలివిగ సహజముగ పరిణమించవలెను. పై భావమును జ్ఞానమనియు, అనగా జీవత్వ బుద్ధి అజ్ఞానమనియు, సుఖ స్వరూపుడనను బుద్ధి జ్ఞానమని తెలియవలెను. లేని చిక్కులు నెత్తిపై వేసుకొని, దుఃఖమే స్వరూపముగా గిలగిల తన్నుకొనుచు, చచ్చుచు, పుట్టుచు బంధములో నుంటినని తన్నుకొనుచూయున్న జీవుని అట్టి అజ్ఞానము నుండి తొలగించుటకు నీవట్లు అనుకొనుటయే అజ్ఞానము సుమా! అని నిర్వచించి నిజ జ్ఞానమును కలుగజేయుటకే అద్వైత శ్రుతులుద్భవించినవి. ''బంధీకృతులము'' అని అనుకొనుచున్నప్పుడు మనమే అజ్ఞానులము. యదార్థమునకు సర్వము (నేను) దేని వలన సృజింపబడలేదు. కించిదజ్ఞునిగా చేయబడలేదు. ఈ జగత్తు ఒకటి కలదని, ఇందుగల భోగ్యజాతములలో నేనొకడనని, నేను జనన మరణాదులు, సుఖదుఃఖాదులు కలవాడనని అనుకొనుటే అజ్ఞానము. ఎట్లు తలంచుకొనిన అట్లగుచుందుము. "యద్భావం తద్భవతి".

ఆధ్యాత్మిక దృష్టి, శ్రద్ధ, భక్తి, ఈశ్వరానుగ్రహములు లేని కారణమున, పై విధముగానే మానవుడు తనకు తానే ఆవరణ సహిత అజ్ఞానమును నిర్మించుకొనుచున్నాడు. ఇందు ఏది లోపించినను, పరమార్థానుభవము అసంభవము. ఈ విధముగా బాహ్యముగానున్న జీవ, జగత్తులను విచారించినచో యీ లేని ప్రపంచమును, మన అజ్ఞానము వలన ఉన్నదని అనుకొను భ్రాంతి వలన ఈ ప్రపంచము జనించినది. అనగా సర్వము అజ్ఞాన జనితమని తేలినది. కావున ఇంతటి బ్రహ్మాండము "నేననుకొనుట; అనుకొనకపోవుట" లో ఆధారపడియున్నదను మాట చాలా చిత్రముగా (స్వరూపముగా) నున్నది.

రజ్జు సర్ప భ్రాంతి :

సృష్టి మనము కలదనుకొనుటవలన కలిగి, లేదనుకొనుట వలన నశించగలదని నిర్వచించగలిగినందుననూ, దీనిని లోతుగా విచారించవలసి యున్నది. జీవజగత్తులు ఆత్మానుభవమను ఒక్కచోట (పరమాత్మానుభవమున) అసత్యముగా ఋజువుగుచున్నది.

చీకటిలో చూచిన త్రాటిని అజ్ఞానము వలన పాముగా భ్రమించినచో అచ్చోట పాము సృజింపబడినది. కారణాంతరమున యదార్థము గోచరించగా, అనగా త్రాడే నిజమని అనుకొనగానే, త్రాడుయందు సృజించబడిన పాము

మిథ్యయని తేలినది. అందుచే, అనుకొనుటలోనే సృజింపులు, వినాశనములు జరుగవచ్చునను సిద్ధాంతము, దృష్టాంతము మూలమున కొంతవరకు సుబోధకమగును. కావున యీ ప్రపంచము అంతయూ మనోవికారజాతమే. ఎన్ని అవాంతర భేదములున్నను, సూక్ష్మముగా విచారించినచో, అన్నియూ తలంపులే గదా! ఇట్టి తలంపులు స్వతంత్రముగా పుట్టుచున్నవా యనిన "బుద్ధిః కర్మానుసారిణి" మనః, కర్మ, అనురాగముల చేత, కర్మఫల ప్రేరణ చేత ఆచరించిన పనులను చక్ర భ్రమణముగా అనుసరించి తలంపులు పుట్టుచున్నవి. జగత్తు సత్యమను భావము చేత, అజ్ఞానము చేత, నిత్య సుఖ స్వరూపుడైన తనను మరచి తనకు నిరంతర సుఖశాంతులు కావలెనను తలంపు కలుగును.

అహంకారము - ఆత్మ :

వేదాంతము యే సంప్రదాయమునకును, యే తెగకును, యే కోవకును, యే జాతికిని, యే లింగమునకును చెందినది కాదు. వేదాంతమనగా జ్ఞానము, ఆత్మ జ్ఞానము. తన్ను తాను తెలిసికొనుట అనెడి తత్త్వ జ్ఞానము. ఇది మానవునికి తప్పనిసరి. శృతిస్మృతుల యందు విశ్వాసమున్న వారికి ఆత్మజ్ఞానమే అత్యవసరము.

"నేను" లు రెండు కలవు. 1. అహంకారము, దీనినే దేహాత్మ అందురు. ఇది బయటగల నేను. 2.అంతరాత్మ. దీనినే ప్రత్యగాత్మయని కూడా అందురు. ఇది లోపలగల నేను. ఈ రెండింటికీ భేదము తెలియనివారు దేహాత్మనే నేను అని అనుకొనుచున్నారు కాని అది సత్యము కాదు. అది ఆత్మ కాదు. దేహము "నేను" కు పనిముట్టు. పదార్ధమెట్లు దృశ్యమో, దేహాత్మ అయిన అహంకారము కూడా దృశ్యమే. ఈ అహంకారము స్వప్నమున వుండదు, నిద్రలో వుండదు. త్రికాలములోనున్నది సత్యము కాని ఈ దేహము రెండు కాలములలో లేనిది. కావున సత్యమెట్లగును? ఈ విధముగా విచారణ సలిపి, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, ప్రాణము యేదియును తాను కాని యెడల, ఇక ఆత్మ ఏది అనిన, రాకపోకలు లేని, కరచరణ అవయవములు కాని, త్రిగుణ మాలిన్యము చేరని, అణువునఅణువుగా, ఘనమున ఘనముగా ఆకాశమువలె అంతటా నున్ననూ, "నేను, నాది" అను భావము లేక, అగ్నికి వేడిమి వలె, సూర్యునకు ప్రకాశము వలె, ఎఱుకయే స్వభావముగా గలది ఆత్మ. షడూర్ములైన ఆకలి, దప్పిక, శోక, మోహ, జనన, మరణములు వంటి పంచేంద్రియాది సంబంధము లేక పరమానందమైనది ఆత్మ. సర్వజీవులయందు, హృదయముగా, ప్రజ్ఞగా నున్నదే ఆత్మ. దృశ్యములందు దృక్కుగా, చూడబడే వస్తు జాలమును చూచువాడే ఆత్మ. ఇంద్రియ సహాయముతో చూచి, విని, తిని, చెప్పువాడు కేవలము ప్రత్యగాత్మ ప్రతిబింబమై భాసించువాడే కాని స్వయంప్రకాశమైన ఆత్మస్వరూపుడు కాదు. విషయ సమత్వము పొందిన సాధకుడు ఇట్లు ఆత్మ అల్పద్రష్ట కాని, క్రమద్రష్ట కాని, అద్రష్ట కాని, అన్యథాద్రష్ట కాని కాదు అని నిర్ణయమును అంతఃకరణ సాక్షిగా నుండి నిర్ణయించవలెను. బుద్ధి చంద్రుని వంటిదైనప్పటికీ, స్వప్రకాశము కాదు. దానికి, సూర్యుని వంటి ఆత్మకు, అతి సమీపముగా నున్నందున అది ఆత్మతో కలియ వీలున్నది. లక్కా, చెక్కా చక్కగా అంటుకొనును. బుద్ధి, ఆత్మ అట్లు కాదు. సాధనచే మాత్రము కలియును. ఇతర వస్తు సాన్నిధ్యమును బట్టే సూర్యుడిని జగచ్చక్షువు అని చెప్పుచున్నారు. కాని, సూర్యునికి 'నేను' అని కాని, నాది అని కాని, ఒక్క కోరిక కాని లేదు. అతని సాన్నిధ్య మాత్రముననే చీకటి పోయి వెలుగు వచ్చి సర్వమూ ప్రకాశించుట వలన అతడు ప్రకాశకుడయినాడు. అతనికి కర్తృత్వమున ప్రకాశత్వము లేదు. అటులనే ఆత్మ భోకృత్వ కర్తృత్వ రహిత స్వయంప్రకాశము. ఇట్టి స్వయం సాక్షియగు ఆత్మకు ప్రమాణములు లేవు.

పరమేశ్వరుడు :

సమిష్ఠియగు బ్రహ్మమునకు మాయా సంబంధము లేకపోయినను, ఆధ్యాసయున్నట్లు భావించబడుచున్నది. పరమాత్మ ప్రతిబింబముతో కూడి మాయయే, పాలు, పెరుగుగా పరిణమించినట్లు ఆకర్షణశక్తిచే జగద్రూపముగా పరిణమించినది. ఇది మాయయే కాని, ప్రతిబింబము కలది కాదు. మాయ తన్నాశ్రయించినది కాన, మాయ తన స్వాధీనము అయినందున, మాయకు ప్రభువు తానే, పరమేశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. జీవేశ్వర భూతమును మూడు తత్త్వములలో జీవుని భోగార్ధమై, ఈశ్వరసృష్టి యేర్పడినది. ఈశ్వరుడు

ఆప్తకాముడు. సృష్టియందలి సర్వభోగములూ ఈశ్వరుని నుండి యేర్పడినవి. అతడు కోరవలసినదెద్దియునూ లేదు.

"నమే పార్థాస్తికర్తవ్యం త్రిషులోకేషు కించన" అనగా మూడు లోకముల యెడల నాకు ఎట్టి కర్తవ్యము లేదు. సర్వజీవరాసుల చైతన్యము, పరిణామము, నిమిత్తమే, తాను కర్మను సృష్టించుచు ఆజ్ఞాపించుచున్నాడు. తాను కర్మ ఫల ప్రదాత, కర్మలు వాటికవే ఫలము నీయజాలవు. ఈ కర్మకు ఈ ఫలము అని, జడమగు కర్మ స్వయముగా వినియోగించుకొనజాలదు.కర్మకు ఈశ్వరుడు అధిష్ఠానము.

పుట్టుక, సంస్కారము, వేదాధ్యయనము ఇవి యేవి బ్రహ్మత్త్వమునకు కారణము కాదు. వర్తనమే మూలకారణము. పుట్టినది యెప్పుడో యొకప్పుడు మృతినొందక తప్పదు. లోకమున ప్రతి నిమిషము ఎందరో పుట్టుచూ, గిట్టుచూనున్నారు. పుట్టుక, మరణము లేకుండ చేసికొనుట యెట్లు?

ఆత్మ యెన్నడును పుట్టదు. పుట్టని ఆత్మకు మరణము లేదు. కామ్యముతో కూడిన దేహమునకే మృత్యువు, అజ్ఞానమే మృత్యువు; భ్రమ జెందుటయే మృత్యువు; భ్రమ లేకుండుటే అమృతత్వము. మృతినొందునది దేహమే కాని, ఆత్మ కాదు. దేహమెప్పుడునూ మారుచునేయుండును. మార్పు చెందునది, నశించక తప్పదు. నాశము గల దేహమునే 'నేనని' భ్రమపడి, జ్ఞానహీనుడై మృతినొందుట మానవ హీనము, పశుత్వము.

జీవుడు కర్మానుష్ఠానముచే జ్ఞానమును వృద్ధి చేసికొనిన కొలదీ, శరీరములు మారిపోయి, ఉన్నత పరిణామమునందుకొనుచుండును. పచ్చి చింతకాయలోని బెరడు, గుజ్జు, ఈనెలు, గింజలు వేరు చేయ సులభ సాధ్యము కాదు. అటులనే విషయాసక్తులకు, దేహాభిమానులకు, జ్ఞానము అంటదు. పండిన చింతకాయలోని బెరడు మొదలుగునవన్నియునూ లోనున్న పండుతోనే విడిపోవునట్లు దేహాభిమానము ఆత్మను వదలి పోవును. అప్పుడు ఆత్మ స్వచ్ఛముగా విక్షేప ఆవరణములు లేక ప్రకాశించును.

ఉపాసనలు :

"సర్వవ్యాపినమాత్మా సంక్షీరే సర్పివార్పితమ్" పాలలో నెయ్యి కలిసి వున్నట్లే ఆత్మ సర్వవ్యాప్తమై యున్నదనే భావముతో చేసే సాధనే సత్యవతీ ఉపాసన అందురు.

"మాయాతీత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా" "నేనీ సమస్తంలో, అవ్యక్తంగా వ్యాపించివున్నాను. నన్ను అంతటా, నాలో అంతటినీ చూస్తూ ఉండే సత్యవతీ ఉపాసనకు నేను కనుపించకుండా ఉండను. నాకు ఆ ఉపాసకుడునూ కనుపించకుండా ఉండడు" అంటూ వున్నాడు మాధవుడు.

ఆ సర్వాత్మనే అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు కనపడే ప్రకృతిగా మొదలైనవన్నీగా భావనతో చేయబడేదే అంగవతీ ఉపాసన. ప్రాణరూపమై అందరికీ ఆత్మీయమైన వాయువు అన్నింటినీ వెలిగించుచు అగ్ని, ప్రాణముల కున్నూ, వివిధ జీవనాధారములైన అన్నమును ఉత్పాదన చేయడానికిన్నీ అవసరమైన వరుణ (వర్షము) దేవుని గా పరమాత్మను పొగడుటయే అంగవతీ ఉపాసన.

"శంకచక్రగదాపాణి" అని విష్ణువును, "ఏకదంత గజాననా" అని విఘ్నేశ్వరుని, "శూలపాణి" అని ఈశ్వరుడిని, "కోదండపాణి" అని శ్రీరాముడిని, "శిఖిపించమౌళి మురళీధర" అని శ్రీకృష్ణుడిని, "వీణావాణి" అని సరస్వతిని, ఇలా ఆయా దేవతల చిహ్నములను, ధ్యాన పూర్వకముగా మనస్సును తన్మయము చేసికొని హృదయంలో ఆరాధిస్తూ ఉండుట అన్యవతీ ఉపాసన అని అందురు.

"శ్రవణం, కీర్తనం, విష్ణోఃస్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం, తన్మయాసక్తి, పరమవిరహాసక్తి" అని పదకొండు భక్తి సాధనలు కూడా నిదానవతీ ఉపాసనలో చేరును.

సత్యవతీ, అంగవతీ, అన్యవతీ, నిదానవతీ ఉపాసనలు ఒకదానికంటె మరొకటి అత్యుత్తమ స్థితికి కారణములై విశ్వనియంతతో తాదాత్మ్యాన్ని ప్రసాదిస్తాయి. ఇవి ప్రధానమైన ఉపాసనలు.

బ్రహ్మము :

అగ్నినుండి విస్ఫు లింగములు భిన్నములునూ, అభిన్నములునూ యెట్లు

కావో, అటులనే జీవుడు బ్రహ్మమునుండి భిన్నుడునూ, అభిన్నుడునూ కాదు. జీవ బ్రహ్మముల సంబంధము కేవలము ఏకత్వము కాదు. కాని అది కార్యకారణ సంబంధము. మోక్షము పొందువరకూ జీవుడు పరమాత్మ కంటె భిన్నుడు. కాని ముక్తావస్థయందు భేదకారణ శూన్యుడగుటవలన పరమాత్మతో నభిన్నుడు. జీవబ్రహ్మముల భేదాభేదములు రెండును బంధ ముక్తావస్థలపై ఆధారపడును.

దృక్కు:

బ్రహ్మము స్వయంప్రభ. స్వప్రకాశము. ఏ యితర చైతన్యమునకునూ విషయము కాదు. సకలమునెఱుగు ఎఱుకయే బ్రహ్మము. ఇతర పదార్థము లన్నియు దృశ్యములు లేక చైతన్యమునకు విషయములు. "దృగేననతు దృశ్యతే". రూపము దృశ్యమగునపుడు కన్ను దృక్కు. కన్ను దృశ్యమైనపుడు మనస్సు దృక్కు. మనస్సు, బుద్ధి వృత్తులతో దృశ్యమగునపుడు సాక్షి చైతన్యమే దృక్కు. ఈ సాక్షిని ఎవరునూ చూడజాలరు. దృశ్య విషయమంతకును ఆత్మ విలక్షణము. శరీరము ఆత్మ కాదు. ఏలయన ఘటాదులవలె స్థూల సూక్ష్మ కారణములచే ఎఱుగబడుచున్నది. ఆత్మకానిదంతయూ, శుక్తి రజితమువలె దృశ్య మాత్రములే. ఆత్మ తన కోసము తాను కేవలంగానున్నది. విషయ ప్రపంచము ఒకరికొకరి కోసము ద్వంద్వముగా నున్నది. జగము స్వయంసత్తావంతము కాదు. అది బ్రహ్మము నుండి తోచి బ్రహ్మముపైననే ఆధారపడి యున్నది. కనుక అది బ్రహ్మముకంటె తక్కువ సత్యము. ఇంద్రజాలికునిచే ఇతరుల కొఱకు కల్పింపబడిన వస్తు సముదాయము ఎటుల ఇంద్రజాలికుని బాధింపదో అటులనే యీ జగత్తు అను మాయ బ్రహ్మముచే గల్పింపబడినందున, బ్రహ్మమును బాధింపదు.

జగము యొక్క అవస్థాత్రయములతో బ్రహ్మమునకు సంబంధమున్నట్లు తోచుట రజ్జువునందు సర్పదృశ్యమువలె భ్రాంతి ఈ మాయను అసత్తని చెప్పజాలము. సర్పముగా చూడబడిన రజ్జువు భ్రాంతి నశించగనే అది సర్పము గాదని తెలియబడును. కాని ప్రపంచము ఆ విధముగా అదృశ్యమగుట లేదు. జగద్దృశ్యము అనిర్వచనీయము. అనగా దానికదేసాటి. దానిని సత్తని గాని, అసత్తనిగాని వర్ణింపజాలము. జగత్తు సదసత్ విలక్షణమని చెప్పబడును.

కొంతకాలముండును గాన జగత్తు సద్రూపము. ఎల్లకాలముండదు గాన అది అసద్రూపము. ఎవరికైనా ఒక వస్తువు ఆ వస్తువును కాదని వ్యతిరేకించునంత వరకు మాత్రమే సత్యము. వ్యవహారిక దశలో జగము లేదని వ్యతిరేకించుట లేదు. కాని అనేక రూపమగు జగత్తు, వ్యావహారికము, దొలగినప్పుడు అసత్యమగును. ఆది శంకరులు కూడా జగమును మిథ్యయని తలంచును. పారమార్థిక సత్యమునందధిష్ఠానమగు బ్రహ్మముకంటె వేరుగా జూచిన జగము అసత్యము. బ్రహ్మమునకు సంబంధించినదిగా గాంచిన సర్వమునూ బ్రహ్మముగా గాంచగలము. "సర్వం ఖల్విదం బ్రహ్మ".

వాస్తవముగా మాయ, బ్రహ్మములకు సంగతియే (సంబంధమే) లేదు. ఏలయన, కూటస్థ సత్యమెప్పుడును ఛాద్యము కాదు. మాయ సత్పదార్థము కాదు. దృశ్యమును కలిగించునది మిథ్యా జ్ఞానము మాత్రమే, (అవిద్యయే). అవిద్య వున్నంతకాలము జీవుడుండును. సత్యమును గురించిన జ్ఞానము కలుగగనే, అది అంతరించును. మాయను, సత్తనికాని, అసత్తని చెప్పుటకు వీలు లేదు. మనమెట్లు చూతుమో అది అట్లే యుండును. ఈ దృశ్యముకంటె మరే స్వతంత్రమగు నునికియు దానికి లేదు. జగత్తుకు జీవునకును బ్రహ్మమే అధిష్ఠానము. బ్రహ్మము మార్పు చెందని (కూటస్థ) కారణము కాని మాయ మార్పును పొందునట్టి కారణము.

బ్రహ్మము జగద్దృశ్యమునకు అధిష్ఠానమైన పరమ సత్యము. పరివర్తన మున్ను, నానాత్వమున్ను మాయవలన కలుగుచున్నవి. మాయోపాధి వలన బ్రహ్మము జగత్తునకు ఉపాదాన కారణముగా తోచుచున్నది. బ్రహ్మము తన యందే యుండి, అందే లయించుచున్నది.


బ్రహ్మము జగత్తునకు నిజమగు విరక్తి కారణము. మాయ సహకారి కారణము. కార్యకారణములకు అతీతమైన బ్రహ్మము ఉపాదాన కారణము కాజాలదు.

ప్రపంచానుభవముల వలన వేదనము, దుఃఖమును జెందు దృశ్యాత్మయే జీవుడు. జీవుడు దృశ్యము; బ్రహ్మము సత్యము. జగము బ్రహ్మ యొక్క విలాసము. అనేకత్వమునందవలయునన్న అవ్యక్త బ్రహ్మమునందలి సంకల్పము యొక్క

అభివ్యక్తమే అది.

హరిః ఓం

ప్రణవ ప్రకరణము



శ్లో॥ ప్రధమం తారకంచైవ, ద్వితీయం దండముచ్యతే
తృతీయం కుండలాకారం, చతుర్ధం చ అర్ధచంద్రికం
పంచమం బిందుసంయుక్తం, ఓం ఇతి జ్యోతి స్వరూపం ॥

ఆ.వె. లోకంబులు, లోకేశులు
లోకస్థులు దెగిన తుది నలోకంబగు పెం
జీకటి కవ్వలనెవ్వడు
నేకాకృతి వెలుగునతని నే సేవింతున్.

– శ్రీమద్భాగవతము

శ్లో॥ అంతర్జోతి బహిర్జ్యోతి । ప్రత్యగ్జ్యోతిః పరాత్పరః ।
జ్యోతిర్జ్యోతి పరంజ్యోతిః । ఆత్మజ్యోతిః శివోస్మ్యహం ॥

– బ్రహ్మజ్ఞానావళీ మాలా

హంసనే ప్రణవమందురు. ఈ అనాహత శబ్దమగు ప్రణవమందు త్రివ్యాహృతులైన 'అ'కార, 'ఉ'కార 'మ' కారములచే సృష్టియైనది. ఈ ప్రణవము విన్నవారికి, స్మరించువారికి జన్మయుండదు. కేవలము 'అ'కార, 'ఉ'కారములతో ప్రణవము కాలేదు. అందుచే యీ 'ఓ' అను అక్షరము 'మ' కారమను బిందువుతో చేరగా 'ఓం' అను అక్షరమైనది. ఇదే ప్రణవము. ఇది వర్ణత్రయముతో గూడియున్నది. 'అ'కార 'మ'కారములు రెండునూ బ్రహ్మ సంబంధమైనవి. 'ఉ'కారము మాత్రము త్రిపుటిగా తెలుపు, యెరుపు, నలుపు వర్ణములు గలిగియున్నది. ఇది ప్రకృతి సంబంధమైనది. గుణ రహితుడగు పరబ్రహ్మ సంబంధములైన 'అ', 'మ', వాటికి గుణ సహితమగు ప్రకృతి సంబంధమైన 'ఉ', దానికి తాదాత్మ్య సంబంధమైన బిందువుతో కూడిక గల్గి 'ఓం' అయినది. సాంఖ్యము దెలియనిదే ప్రకృతి ద్వయదోష రహిత అచలులు కారు. అనగా ప్రణవము, వనజ మధ్య పదహారు కళలనే భాగములుగానున్నది. అదెట్లన యీ ప్రణవ బ్రహ్మము ఎనిమిది తనువులతోను, నాలుగు పాదములతోను, మూడు స్థానములలో ఐదుగురి అధిష్ఠాన దేవతలో చేరియున్నది. సరసిజమందుండు అష్టదళములు అష్టతనువులుగానున్నవి. దివ్యత్వములో నాలుగు దేహములుండగా ఈ ప్రణవ బ్రహ్మమునకు నాలుగు కారణదేహములు, నాలుగు కార్య తనువులు, మొత్తము అష్టతనువులున్నవి. అందు ఈశ్వర తనువులు నాల్గున్నూ కారణ దేహములనియు, జీవతనువులు నాల్గున్నూ కార్య తనువులనియు అనబడును.

జీవతనువులకు స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణ దేహములనియు, ఈశ్వరతనువులకు ఆనంద (విరాట్), చిన్మయ(హిరణ్యగర్భ), చిద్రూప(అవ్యాకృత), శుద్ధము (పరమాత్మ) లనెడి పేర్లు గలవు. ఈ తనువులుగా నున్న అష్టదళములకు పృధివ్యాప్తే జో వాయురాకాశములు, అహంకారము, మహత్తు, అవ్యక్తములను ఎనిమిది మారు పేరులు గలవు. దీనిలో పృథివ్యపస్తేజో వాయువులు జీవ తనువులు. మిగిలిన ఆకాశము, అహంకారము, మహత్తు అవ్యక్తములు ఈశ్వర తనువులు. ఈ అష్ట తనువులు తనువుపై మెట్టలో నడిబావిలో నుండును. ఈ రహస్యము (కృష్ణబిలము) ను దెలిపినవాడే సద్గురుడు. ఈ ప్రణవ బ్రహ్మకు అవిద్యాపాదము, విద్యాపాదము, ఆనందపాదము, తురీయపాదము అని నాల్గు

పాదములున్నవి. అందున అవిద్యాపాదము కేసరములందు, విద్యాపాదము కర్ణికయందు, ఆనందపాదము లింగము (దుద్దు)నందు, తురీయపాదము మహాకారణము (అతీతము)నందు స్థానములుగా చేసికొనియున్నవి.

ఈ నాల్గు స్థానములు సహస్రారమందు దాని మధ్య భాగమందున్నవి. కమలమందు కేసరములు, కర్ణిక, దుద్దు యున్నవి. కమలమధ్యమందు దుంప యనే (సంచితమనే) మహాకారణమున్నది. అవిద్యాపాదము జాగ్రదావస్థ శ్రవణ కాలముగాను, విద్యాపాదము స్వప్నము మననము గాను, ఆనందపాదము చతుర్థావస్థయైన లక్ష్యార్థ స్వరూపుడై దనరు కాలముగాను యున్నవి. అకారము ఈశ్వరునకు, ఉకారము జీవునకు, మకారము ప్రత్యగాత్మకు అయి యుండుటచే ప్రణవమునకు త్రిస్థానములని చెప్పిరి. ఈ ప్రణవమునకు బ్రహ్మ విష్ణు రుద్ర మహేశ్వర సదాశివులను పంచ దేవతలున్నారు. ప్రణవమందున్న ఐదుకుంట్లు వీనికి స్థానములు. ఐదుకుంట్ల యందైదు భూతములున్నవి. వీరీ భూతములకధి దేవతలు గనుక అచటయున్నారు. అధిదేవతల ప్రేరణ లేక భూతజాలము పనులు చేయలేదు. కనుక భూతములకధి దేవతలున్నారు. ప్రణవమూర్తి సత్తా పంచభూతములందు ప్రాదుర్భవమొందగా దేవతలైనారు. కనుక పంచ భూతము లకు పంచదేవతలనిరి. ఈ పంచ దేవతలు బ్రహ్మాండమున ఈశ్వరునకు తన్మాత్రలుగా శబ్ద స్పర్శ రూప రస గంధములుగానున్నారు. పిండాండమందు జీవునకు పంచభూతములు శబ్ద స్పర్శ రూప రస గంధములను విషయములుగా నున్నారు. వీటికధి దేవతలు బ్రహ్మసంబంధమైన వారగుటచే విషయములకు సత్తా జాస్తిగా యున్నది. గాని భూతములకును, తదధి దేవతలకును మరియొక్క భేదమేదియును లేదు.

కళలు పదునారు. లోక కళలు పదునైదు. అలోక కళయొకటి. దీనిలో ప్రత్యగాత్మ లీనమైన మోక్షము గల్గును. మొత్తము పదునారు కళలు పదునారు భాగములుగానున్నవి. ఈ కళలు అవస్థల సంబంధమైనవి. ఈ అవస్థలు నాలుగైననూ, అంతర్భాగములతో జేరి పదునారు భాగములైనవి. ఒక్కొక్క యవస్థనాలుగు అంతర్భాగములై, ఒకదానిలోనొకటి చేరుటచే, పదునారు అంతర్భాగములైనవని సాంఖ్యులనిరి. జగ్రత్తలో జాగ్రత్త, జాగ్రత్తలో స్వప్నము, జాగ్రత్తలో సుషుప్తి, జాగ్రత్తలో తురీయము, ఈ విధముగా ఒక్కొక్కటి నాలుగై పదునారవస్థలైనవి. లోక కళలు ప్రపంచమును జూపును. ప్రత్యగాత్మ సంబంధమైన అలోక కళ బ్రహ్మానుభవమును బొందించును. కనుక యీ రెండింటికీ భేదమున్నది. తుర్యాతుర్యములకు శరీరమునందధో భాగములను సంచారమున్నప్పటికినీ, ఎల్లప్పుడు ఊర్ధ్వమున అమల జ్ఞానములోని తుర్యాతుర్యములు నెఱుగవలయును.

పై విషయమును స్మరించునపుడు, ప్రణవోపాసనకు పూర్వమే యీ క్రింది వాటిని అనుసరించి జీవించవలెను.

శ్లో॥ ఆహార నిద్ర భయ మైధునాని । సామాన్యమే తత్పశుభిర్నరాణామ్ ।
జ్ఞానోన రాణా మధికో విశేషో । జ్ఞానేన హీనాః పశుభి స్సమానాః ॥
– ఉత్తరగీత

తా॥ ఆహారము, నిద్ర, భయము, మైధునము, సంభోగము అనునవి పశువులకును మనుష్యులకును కూడా సమానముగానుండు గుణములు. పశువుల కంటె మనుష్యుని యందు జ్ఞానమొక్కటి అధికము. అట్టి జ్ఞానమే లేనిచో మనుష్యుడును పశువుతో సమానుడే యగును. కనుక సర్వకాలము భగవద్భక్తి కలిగి గురువుల యందును, పెద్దలయందును భక్తి, సేవలను కలిగియున్నచో శ్రద్ధ జనించును. శ్రద్ధ వలన సత్కర్మానుష్ఠానము కలుగును. సత్కర్మమువలన జ్ఞానము కుదురును. జ్ఞానము వలన ముక్తి చేకూరును.

మనసే హేతువు మనుజుని
మనుగడకును బంధమునకు మాన్యతకెల్లన్ ।
మనసే ముక్తికి మూలము
మనసే దుఃఖంబు దెచ్చు మైమరపించున్ ॥
– బాబా

కావున ఏ సాధన చేయవలెననగా
త్యజదుర్జన సంసర్గం భజసాధుసమాగమం ।

కురుపుణ్య మహోరాత్రం స్మర నిత్య మనిత్యతామ్ ॥

– బాబా

తా॥ అరిషడ్వర్గములనే దుర్జనుల సంగమును శమాది షట్క సంపత్తితో నిర్జించి, పరిపూర్ణులైన సాధుజనుల సేవించి, సదా గుణాతీతునిగా ప్రవర్తించిన పుణ్యబలముతో, నిత్యుడవు కమ్ము.

ఎందువలననగా :

ఉ॥ దేహము పాంచభౌతికము, దేహము కూలగ దప్పుడెన్నడు
దేహినిరామయుండు, గణు తింపగ దేహికి చావుపుట్టుకల్ ।
మోహ నిబంధ బంధనల ముద్రలు, లేవు నిజంబు జూడ ఆ
దేహియె దేవదేవుడు, మదిన్ తలపోయగ ఆత్మరూపుడౌ ॥ – బాబా

కావున

బ్రహ్మమందు మీరు, మీలోన బ్రహ్మంబు,
మీరె బ్రహ్మ, బ్రహ్మ మీరెయయ్యు,
బ్రహ్మమయులు మీరు బ్రహ్మమగుదురు
కాని మోహవశతకానరైరి ।

– శ్రీ భగవాన్ సత్యసాయిబాబా

సృష్టి వివరము :

విశేషార్థము : నిర్వికారనిర్వికల్ప నిశ్చల పరిపూర్ణ పరబ్రహ్మమందు అవ్యక్తము, అవ్యక్తమువలన మహత్తు, మహత్తు వలన అహంకారము, అహంకారము వలన ఆకాశము, ఆకాశము వలన వాయువు, వాయువు వలన అగ్ని, అగ్ని వలన జలము, జలము వలన పృథివి, పృథివి వలన ఓషధులు, ఓషధుల వలన అన్నము, అన్నము వలన శుక్ల శోణితములు, శుక్ల శోణితముల వలన సర్వ జీవ ప్రపంచము సృష్టియాయెను.

ఇంకను, ఆదియందు సంకల్పముచే హిరణ్యగర్భుని సృష్టి అయ్యెను. అతడే బ్రహ్మము. అతనిచే జీవోపాధులు క్రమశః సృష్టి అయ్యెను. హిరణ్యగర్భుడు అను ఆ బ్రహ్మమే సంకల్పముచే మరీచాదులు, సనకసనందనాదులు సృష్టింపబడినవి. సృష్టి విధానమగు సంకల్పమును పాటించి వర్తించుటకుగాను మరీచాదులు కర్మ మార్గమును, సనకాదులు కర్మ రహిత జ్ఞాన పద్ధతిని అవలంబించిరి. ఏ తత్వల మున సర్వ జీవులు యుద్భవములై జ్ఞానాజ్ఞాన మిశ్రితమాయెను.

త్రిగుణసామ్య సృష్టి :

“ఓం” బిందువందు సత్త్వ రజస్తమో గుణములు సామ్యముగానున్నవి. ఇవి బయల్వెడలి సృష్టియైనది. సత్వగుణము జ్ఞాన గుణములందిచ్చ పుట్టించును. రజోగుణము రాగతృష్ణలందిచ్చు పుట్టించును. తమోగుణము విపరీత జ్ఞానము, నిద్రాలస్యాదులు పుట్టించును.

సత్త్వ గుణము యొక్క ఉత్తమగతి వలన బ్రహ్మ, ధర్మదేవత, మహత్తు, అవ్యక్తములు గలిగెను. సత్త్వ గుణము యొక్క మధ్యమగతి వలన సోమయాజులు, ఋషులు, దేవతలు, వేదాభిమానులు, ధ్రువుడు, వర్మ, దేవతలు, పితరులు మొదలగు వారు గల్గిరి. సత్త్వగుణము యొక్క అథమగతి వలన వానప్రస్థులు, సన్యాసులు, బ్రాహ్మణులు, విమాన సంచారులు, నక్షత్రములు, దైత్యులు మొదలైనవారు గల్గిరి.

రజోగుణము యొక్క ఉత్తమ గతి వలన గంధర్వులు, గుహ్యకులు, యక్షులు, విద్యాధరులు, అప్సరసలు మొదలగు వారు గలిగిరి.

రజోగుణము యొక్క మధ్యమ గతివలన రాజులు, క్షత్రియులు, రాజపురోహితులు, వాదము జేయు వారు మొదలగువారు గలిగిరి. రజోగుణము యొక్క అథమగతి వలన మల్లులు, నటులు, యోధులు, జూదరులు, త్రాగుబోతులు మొదలగువారు గల్గిరి.

తమోగుణము యొక్క ఉత్తమగతి వలన చారణులు, పక్షులు, పురుషులు, రాక్షసులు, పిశాచములు మొదలుగా గలవి కలిగెను. తమోగుణము యొక్క మధ్యమ గతి వలన ఏనుగు, గుఱ్ఱములు, శూద్రులు, తురకలు, సింగము, పులి, మొదుగా గలవి కలిగెను. తమోగుణము యొక్క అధమ గతి వలన కొండలు, నదులు, సముద్రములు, వృక్షములు, పురుగులు, తేళ్ళు, చేపలు,

తాబేళ్ళు, మిగిలిన పశువులు మొదలుగా గలిగినవి.

సృష్టి వికాస వ్యావర్తనములు :

ఒకానొక ఆకస్మిక ఘటనగా పరబ్రహ్మమందు ఆది విలాసము ఉప్పొంగగా, ఎఱుకయను సృష్టి ఈశ్వరుడుగా, జీవుడుగా, జగత్తుగా నొక క్రమపద్ధతిలో వికాసమైనది. పరశివసత్తాగా నుండిన "శూన్యమందు, భగవంతుడు "సర్వము" గా తోచెను.

ఆ శూన్యము ఒకటికి కుడివైపున వుంచిన సున్నలవలే మూలా ప్రకృతి (మూల శక్తి) చైత్యగతమై పరబ్రహ్మము అయ్యెను. అందున్న ప్రకాశ బిందువు (కళ) బ్రహ్మస్వరూపం. అందుచేతనే అది అకార స్వరూపము, చంద్ర మండలము అని చెప్పబడుతున్నది. విమర్శ బిందువు శక్తి స్వరూపం. అగ్ని మండలం. దీని బీజం హకారము. వీరిద్దరి సామరస్యమే "అహం" అనే నాదము. ఇదే బ్రహ్మ స్వరూపము.

బ్రహ్మ స్వరూపం సర్వశక్తిమయ మైనది. బ్రహ్మము (పదార్థం) నుంచి విమర్శ బిందువు (శక్తి) ఉత్పన్నమైనది. దీనిలో అన్ని శక్తులు కలసి ఉన్నవి. ఇవి ఆత్మలో చైతన్యమయమయిన స్పందన శక్తిని కలిగించును. అదియును క్షణకాలము. ఆ స్పందన శక్తినే ఇచ్ఛాశక్తి అందురు. ఈ స్పందన కలగగనే జ్ఞానశక్తి ఆవిర్భవించును. అదే విమర్శ బిందువు. మొదట, బిందువు ఒక్కటే ఉన్నది. అదే పరబ్రహ్మ. దాని నుండి సృష్టి ప్రారంభ సమయంలో విమర్శ బిందువు బైటకు వచ్చినది. ప్రకాశ బిందువు యొక్క ప్రతిబింబమే విమర్శ బిందువు. ప్రకాశ బిందువు బింబము. విమర్శ బిందువు ప్రతిబింబము. ఇదే మాయ. ఇదే ఈ సృష్టికి కార్యకారణ రూపమగుచున్నది.

ఇక నామాన్ని గనక చూసినట్లయితే అకారము బ్రహ్మ స్వరూపము. చంద్రమండలము. అదే ప్రకాశ బిందువు. ఈ రెండు వర్ణముల వలన షోడశీకళ "అహం" అయి శివశక్తుల స్వరూపముగా ఏర్పడినది.

వ్యక్తమైన ఇచ్ఛా జ్ఞాన శక్తుల యొక్క సమ్మేళనము చేత, బీజాంకుర రూపమయి నటువంటి సూక్ష్మమైన స్వరూపము కలిగిన "అ"కార "హ" కారముల చేత చూడతగిన శరీరము కలిగి ఆ పరాశక్తి ప్రకాశించుచున్నది. అంటే ఆ పరాశక్తి శివశక్తుల స్వరూపమయిన "అహం" అనే బీజ ద్వయంతో ప్రకాశించుచున్నది.

"అహం" అనే యీ పదంలో సకల శబ్ద జాలము, సకల తత్త్వములు, వస్తువులు యిమిడి ఉన్నాయి. కాబట్టి నామ రూపాత్మకమైన జగత్తుకు ఇదే కార్యకారణ రూపము అవుతున్నది. ఇదే ఆత్మ. ఇదే బ్రహ్మ పదార్థము.

పరమాత్మ అన్ని ప్రాణులయందు "అహం" అనే రూపంలో అతి రహస్యముగా ఉన్నాడు. అయితే జ్ఞాన దృష్టి గల మహనీయులే దీనిని తెలిసికో గలుగు తున్నారు.

అహం అనేది చిత్త స్వరూపము. చిత్తము జ్ఞాన రూపము. ఆ జ్ఞానము విమర్శయుక్తము. ఈ రకంగా విచారించడం వలన అహమనేది ఆత్మ స్వరూపము. శివశక్త్యాత్మకము.

చతుర్దశ భువనాలు నామము, రూపము అని రెండు వస్తువులను కలిగియున్నాయి. ఇందులో నామము శబ్దమయము. ఆ శబ్దము యాభై ఆరు అక్షరాల సమూహము. ఆ అక్షరాలకు మొదటిది 'అ' కారము, చివరిది 'హ' కారము.

ఇక రూపాన్ని చూసినట్లయితే దీనికి చంద్ర సూర్యాగ్నులు కారణ వస్తువులు. ప్రకాశ బిందువే సర్వ కారణ వస్తువు. అదే పరమాత్మ. అది సాధకుల శిరోభాగంలో బ్రహ్మ రంధ్రం దగ్గర ఉంటుంది. ఈ ప్రకాశ బిందువే సాక్షి రూపము. ప్రకాశము అంటే "చిత్కళ", సాక్షి కూటస్థుడు అని చెప్పబడుతోంది.

బిందుత్రయము :

పరమేశ్వరుడు వేదాది శబ్ద జాలానికి మొదటిదైన అకార రూపుడై, తన వలన సృష్టించబడిన సకల ప్రపంచానికి స్థానమైన ఆత్మ శక్తి (చైతన్యము) యందు ప్రవేశించి, శుక్ల బిందువు రూపం పొందాడు. అదే విధముగా విమర్శ శక్తి శుక్ల బిందువులో ప్రవేశించి, రక్త బిందు భావము పొందుతున్నది. ఆ మిశ్రమ బిందువు వలన నాదము పుడుతోంది. నాదము నుండి షోడ దశ

కళలు పుడుతున్నాయి. ఆ కళలే కళాతత్త్వ చతుర్దశ భువనాత్మకాలు. అవే అక్షరాలు. అవి పదజాలమై మంత్రాలయినాయి. ఈ బిందు నాదములు అహమన్న రెండు అక్షరాలకు శరీరంగా ఉన్నాయి. రక్త బిందువు అగ్ని, శుక్ల బిందువు చంద్రుడు. ఈ రెండింటి రూపమైన సూర్య బింబము మిశ్రమ బిందువు. శ్రీ (యోని) చక్రము మధ్యలోనున్నది సంవిద్బిందువు. శ్రీ చక్రానికి మూడు వైపులా బిందువులున్నాయి. సంవిద్బిందువే పరాశక్తి. ఈ నాల్గు బిందువులు కూడి భ్రమణ వేగముతో సర్వమైనవి.

పంచ భూతోత్పత్తి :

వికసనము పొందిన రక్త బిందువు వలన ఆ బ్రహ్మమే అంకురముగా గల శబ్ద బ్రహ్మముగా ఆవిర్భవించింది. ఆ నాదము వలన ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి అనబడే పంచ భూతాలతో కూడిన ప్రకృతి అకారాది హకారాంతము వరకు గల 56 అక్షరాలు ఉత్పన్నమైనాయి.

మహత్తత్త్వ స్వరూపము :

ఈశ్వర ప్రతిబింబ కారణ శక్తి రజోద్రిక్తమై, మహదాఖ్య గల విక్షేప శక్తి ఆవిర్భవించింది. దానియందు గల ప్రతిబింబము హిరణ్యగర్భుడు. ఇతడు దృశ్యాదృశ్యమైన రూపము కలిగి మహత్తత్త్వాభిమానిగా ఉన్నాడు (స్థితి).

అహంకార స్వరూపము :

హిరణ్యగర్భునితో గూడి విక్షేపశక్తి తమోగుణ సహితమై అహంకారమనే స్థూలశక్తిగా ఆవిర్భవించింది. అందులో గల ప్రతిబింబము సర్వజగత్పాలకుడైన విష్ణువను ప్రధాన పురుషుడైనాడు. (స్థితి)

పంచదశ ఆవిర్భావము

ఆత్మ వలన అవ్యక్తము, దాని వలన మహత్తత్త్వము, దాని వలన అహంకారము ఉత్పన్నమైనాయి. ఆత్మ సత్యము, నిత్యము. దాని నుండి వచ్చిన సత్త్వరజస్తమోగుణముల మిశ్రమము. దాని నుంచి వచ్చిన మహత్తత్త్వము అస్పష్టము. దీనివలన కలిగిన అహంకారము స్పష్టమైన రూపము గలది. సర్వకారణ రూపమైన ఆత్మ వల్లనే అవ్యక్త మహత్తత్త్వ అహంకారములు కలిగినవి. కనుక యీ నాలుగు బిందువులకు ఆత్మ అని సంకేతము. ఇదే తురీయ కూటమి.

ఇంకను, సృష్టికి పూర్వము సర్వమైన తనకు సాటియైన రెండవది లేనిదై, ఆది మధ్యాంతములు లేనిదై నామరూపములు లేని శుద్ధ నిర్గుణ నిరాకార పరబ్రహ్మము ఒక్క స్వరూపముగా వెలుగొందెను. ఈ పరబ్రహ్మమును పరిపూర్ణమనియు, అద్వితీయమనియు, సర్వవ్యాపకమనియు, అసంగమనియు, నిశ్చలమనియు, శుద్ధమనియు, నిరాకాంమనియు, నిరంజనమనియు, దృక్కనియు, సంవిత్తనియు, చైతన్యమనియు, బ్రహ్మమనియు, సత్‌చిత్ ఆనందమనియు, అనేక పేర్లతో వర్తించుచున్న అఖండ సచ్చిదానంద పరబ్రహ్మమునందు (రజ్జు సర్పము రీతిగా) (కోహం – నేనెవరు) మహాశక్తి ఒకటి కలిగెను. దానినే ఆవరణమనెడి మూలప్రకృతి అందురు. మలిన సత్త్వ ప్రధానమే రూపములాయెను. ఈ మలిన సత్త్వ ప్రధానము ఆ పరబ్రహ్మమును ఎడబాసి అధోముఖమై ప్రపంచము సృష్టించుటకు కారణమయ్యెను. ఎడబాటువలన దీనిని భిన్నశక్తి అందురు. కాని మూల ప్రకృతి పరబ్రహ్మమును చంద్రుడు – వెన్నెల రీతిగా ఎడబాయక, లోకులకు బ్రహ్మజ్ఞానము కలిగించుటకు కారణమైనందున అభిన్న శక్తియని కూడ అందురు.

ఈ మలిన సత్త్వ ప్రధానము సత్త్వరజస్తమోగుణములతో గూడి అవిద్య యనబడెను. సత్త్వ గుణము గలదియగు మాయయందు, ఆ పరబ్రహ్మము రీతిగా, ఒక ప్రతిబింబము కలిగెను. ఆ ప్రతిబింబమునకే ఈశ్వరుడనియు, భగవంతుడనియు, సగుణసాకార దైవమనియు పేర్లు. మాయా శబలిత బ్రహ్మయగు భగవంతుడు మాయను స్వాధీనముగా చేసికొని మాయా వినోదియగుచు, త్రిగుణాత్మికుండై బ్రహ్మ విష్ణు రుద్ర స్వరూపములతో ప్రపంచ సృష్టి స్థితి సంహారములు చేయుచుండెను.

రజోగుణము కలిగిన అవిద్యాశక్తి నానా విధ సంయోజనములుకలిగి, నానా విధ భిన్న రూపములుగా ఖండ ఖండములుగా నుండును. ఈ అజ్ఞానమందు గూడ పరబ్రహ్మము ప్రతిబింబించెను. ఆ ప్రతిబింబములే జీవాత్మలనబడును. ఈ జీవాత్మలు సుఖదుఃఖాది భోగములను, స్వరూపజ్ఞాన

పరిణామము అనుభవించుటకు గాను భగవంతుడు ప్రపంచము సృష్టింప సంకల్పించి, తమోగుణ ప్రధానమగు విక్షేపశక్తి వీక్షింపగా, తక్షణమే ఆ విక్షేప శక్తి నుండి త్రిగుణాత్మకమైన శబ్దతన్మాత్రముగా నుండు సూక్ష్మ ఆకాశము పుట్టెను. సూక్ష్మ ఆకాశ భూతమునుండి త్రిగుణాత్మకమైన శబ్ద స్పర్శ తన్మాత్రలుగా నుండు సూక్ష్మ వాయు భూతము పుట్టెను. ఆ సూక్ష్మ వాయు భూతము నుండి త్రిగుణాత్మకమైన శబ్ద స్పర్శ రూప తన్మాత్రలుగానుండు సూక్ష్మ అగ్ని భూతము పుట్టెను. ఆ సూక్ష్మ అగ్ని భూతమునుండి త్రిగుణాత్మకమైన శబ్ద స్పర్శ రూపరస తన్మాత్రలుగా నుండు సూక్ష్మ జలభూతము పుట్టెను. ఈ సూక్ష్మ జల భూతమునుండి త్రిగుణాత్మకమైన శబ్ద స్పర్శ రూప రస గంధ తన్మాత్రలుగానుండు సూక్ష్మ పృథివీ భూతము పుట్టెను. ఇవి అన్నియు స్థూలములై, ఈ పృథివియందు ఓషధులు, ఓషధుల వలన అన్నము, అన్నము వలన శుక్ల శోణితములు ఉత్పత్తియయ్యెను. ఆ శుక్లశోణితముల ద్వారా 4 లక్షల నరులు, 30 లక్షల మృగములు, 10 లక్షల పక్షులు, 20 లక్షల వృక్షాది స్థావరములు, 9 లక్షల జలచరములు, 11 లక్షల క్రిమికీటకాది పురుగు రకములు, వెరసి 84 లక్షల రకములైన జంతుజాలములు సంభవించి భౌతిక ఘటసముదాయములై 25 తత్త్వములు అయ్యెను. కనుక ఇవియన్నియు పరమాత్మునియందు కలిగిన త్రిగుణాత్మకమైన మాయ వలననే ఉత్పత్తి అయ్యెను. ఈ విధముగా పరిఢవిల్లిన మాయ వలన ఈ 84 లక్షల జీవరాసులను నానా యోనులయందు వాని జన్మకర్మ వాసనలకనుగుణముగా కర్మ అధిష్ఠానముగా ఉపాధులు పుట్టుచు, గిట్టుచు అనేకత్వ, భేద భావములతో కర్మానుభవమును పొందుచుండును.

పై దెల్పిన సూక్ష్మ పంచభూతములు సత్త్వరజస్తమోగుణములతో గూడుట వలన సత్త్వ సూక్ష్మ పంచభూతములనియు, రజోసూక్ష్మ పంచభూతములనియు, తమో సూక్ష్మ పంచభూతములనియు మూడు విధములు అయ్యెను. అది యెట్లనగా, యీ పంచభూతములనుండి...

1) సత్త్వ గుణ సూక్ష్మ ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివిలు చీలిపోయి సత్త్వగుణ సూక్ష్మ పంచభూతములయ్యెను.

2) రజోగుణ సూక్ష్మ ఆకాశము, వాయు, అగ్ని, జలము, పృథివిలు చీలిపోయి రజోగుణ సూక్ష్మ పంచ భూతములయ్యెను.

3) తమోగుణ సూక్ష్మ ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివిలు చీలిపోయి తమోగుణ సూక్ష్మ పంచభూతములయ్యెను.

పరబ్రహ్మము (భగవంతుడు) స్థూల శరీరము ధరించగల జీవులకు వారి వారి కర్మానుసారము పరిణామము జెందుటకు గాను తమో గుణ సూక్ష్మ భూతములను రెండు భాగములుగా జేసి, మొదటి భాగమును పదునాలుగు లోకములుగా జేసెను. ఇవి భూలోకము, భువర్లోకము, సువర్లోకము, మహర్లోకము, జనోలోకము, తపోలోకము, సత్యలోకము అను ఏడు ఊర్ధ్వ లోకములుగాను, అతలము, వితలము, సుతలము, తలాతలము, మహాతలము, రసాతలము, పాతాళము అను ఏడు అధోలోకములుగాను అయ్యెను.

రెండవ భాగమును 84 లక్షల రకములైన జీవరాసులకు స్థూల శరీరములుగా జేసెను. అది యెట్లనగా, యీ స్థూల పంచభూతములను సమిష్టి, వ్యష్టి అని రెండు భాగములుగా జేసెను.

1) తామసాకాశము వ్యష్టి, సమిష్టియని రెండు భాగములై సమిష్టి భాగము హృదయ స్థానమయ్యెను. వ్యష్టి భాగము నాలుగు భాగములు చేసినంతలో అందులో మొదటి భాగము తామస వాయువుతో గూడి మనస్సునకు స్థానము, రెండవ భాగము తామస అగ్నితో గూడి బుద్ధికి స్థానము, మూడవ భాగము తామస జలముతో గూడి చిత్తమునకు స్థానము, నాల్గవ భాగము తామస పృథివితో గూడి అహంకార స్థానము అయ్యెను.

2) తామస వాయువు వ్యష్టి, సమిష్టి యని రెండు భాగములై సమిష్టి భాగము వ్యానవాయువునకు సర్వ శరీరము స్థానమాయెను. వ్యష్టి భాగము నాలుగు భాగములై, అందులో మొదటిది తామసాకాశముతో గూడి సమాన వాయుస్థానము, రెండవది తామసాగ్నితో గూడి ఉదాన వాయు స్థానము, మూడవది తామస జలముతో గూడి ప్రాణ వాయుస్థానము, నాల్గవది తామస పృథివితో గూడి, అపాన వాయుస్థానము అయ్యెను.

3) తామసాగ్ని వ్యష్టి, సమిష్టి యని రెండు భాగములై, సమిష్టి భాగము నేత్రమనే

చక్షురింద్రియ స్థానమాయెను. వృష్టి భాగము నాల్గు భాగములై, అందులో మొదటిది తామసాకాశముతో గూడి శ్రోత్రేంద్రియ స్థానము, రెండవది తామస వాయువుతో గూడి త్వగిద్రియస్థానము, మూడవది తామస జలముతో గూడి జిహ్వేంద్రియ స్థానము, నాల్గవది తామస పృథివితో గూడి ఘ్రాణేంద్రియ స్థానము అయ్యెను.

4) తామస జలము వృష్టి, సమిష్టియని రెండు భాగములై, సమిష్టి భాగము రస విషయమాయెను. వృష్టి భాగము నాలుగు భాగములై, మొదటిది తామసాకాశ ముతో గూడి శబ్ద విషయము, రెండవది తామస వాయువుతో గూడి, స్పర్శ విషయము, మూడవది తామసాగ్నితో గూడి రూప విషయము, నాల్గవది తామస పృథివితో గూడి గంధ విషయము అయ్యెను.

5) తామస పృథివి వృష్టి, సమిష్టియని రెండుభాగములై, సమిష్టి భాగము పాయురింద్రియ స్థానమాయెను. వృష్టి భాగము నాలుగు భాగములై, మొదటిది తామసాకాశముతో గూడి వాగింద్రియ స్థానము, రెండవది తామస వాయువుతో గూడి పాణింద్రియ స్థానము, మూడవది తామస అగ్నితో గూడి పాదేంద్రియ స్థానము, నాల్గవది తామస జలముతో గూడి గుహ్యేంద్రియ స్థానము అయ్యెను.

ఈ విధముగా ఒక భూతము యొక్క భాగములు మరియొక్క భూతములో చేరుట వలన యీ స్థూల శరీర ఇంద్రియములు లేక గోళకములు 25న్నూ కలిగెను. ఇవి అధ్యాత్మలు లేక ఉపాధి యొక్క సృష్టి వివరము.

అటులనే, సత్త్వ సూక్ష్మ పంచ భూతములు సమిష్టి, వృష్టియై, సమిష్టిలో అంతరేంద్రియములైన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారమను అంతః కరణచతుష్టయమున్నూ, వృష్టిలో పంచ జ్ఞానేంద్రియములను శ్రోత్రము, త్వక్కు, చక్షు, జిహ్వ, ఘ్రాణములు వరుసగా వృష్టి సూక్ష్మ ఆకాశ, వాయు, అగ్ని, జలం, పృథివిల వలన కలిగినవి.

రజో సూక్ష్మ పంచ భూతములు సమిష్టి, వృష్టియై, సమిష్టిలో సమాన, వ్యాన, ఉదాన, ప్రాణ, అపాన వాయువులును పంచప్రాణములు వరుసగా వృష్టి సూక్ష్మ ఆకాశ, వాయు, అగ్ని, జలం, పృథివి వలన కలిగినవి.

ఈ అపంచీకృత సూక్ష్మ పంచభూతములు సత్త్వ, రజో, సూక్ష్మ భూతములుగా సూక్ష్మ శరీరము లేక లింగ శరీరముగా వర్తించుచున్నాది. ఈ మొత్తము 19 తత్త్వములతో గూడిన సూక్ష్మ శరీరముతో జీవుడు తన స్థూల శరీరము ద్వారా సకల భోగములను అనుభవించుచూ, పుణ్య పాపకర్మలు జేయుచూ, మరణ కాలమున స్థూల శరీరమును విడచి, సూక్ష్మ శరీరముతోడ (యాతనా శరీరముతో) స్వర్గనరకాది పదవులజెందుచు, కర్మశేషమునకు గాను మరల భూలోకమందు జన్మ పునర్జన్మలు నెత్తుచుండును.

ఈ పైన దెల్పిన స్థూల, సూక్ష్మ శరీరములు కార్యములు కాగా, వీటికి కారణముండవలెను గనుక, సదసత్‌కాని, చిదచిత్ కాని, అనిర్వచనీయమైన, అనాదియైన, తనకు తానే కల్పితమైన కారణ శరీరమొకటి యున్నదని యూహించబడుచున్నది. ఈ కారణ శరీరమనగా చిత్తము, జ్ఞాతతో గూడినదే. జీవేశ్వర సమాధియే కారణ శరీరము.

మహాకారణ దేహనిర్ణయము

భూతాకాశము - వాయు భువనము

ఆకాశము	**వాయువు**	**తేజస్సు**	**జలము**	**పృథ్వి**
పూర్ణకత్వం	**అఖండత్వం**	**అదాహ్యత్వం**	**అక్లేద్యత్వం**	**అశోష్యత్వం**
అసంగత్వం	**అభేదత్వం**	**ఊర్ధ్వపదత్వం**	**జగజ్జీవత్వం**	**కారణత్వం**
వ్యాపకత్వం	**పరాత్పరత్వం**	**ప్రకాశత్వం**	**పరంజ్యోతిత్వం**	**పావనత్వం**
సర్వబీజకత్వం	**నిర్మలత్వం**	**చైతన్యత్వం**	**అమృతత్వం**	**సమృద్ధ్యత్వం**
అఖండత్వం	**అజరత్వం**	**అనఘ్యత్వం**	**కారుణ్యత్వం**	**సర్వధాతృత్వం**

లక్షణములు : మహాకారణము, మూర్ధ్నిస్థానము, మసురామాత్ర ప్రమాణము, నీలవర్ణము, ప్రత్యగాత్మ అభిమాని, తుర్యావస్థ, సగుణము, వివేక జ్ఞానము, ద్రష్టరూపము, వైభోగిక భోగము, అర్థమాతృక, అథర్వణ వేదము, పరావాక్కు, వాయు మండలము, వాయుతత్వము, వాయువు యొక్క ప్రత్యేక కళలు. (వైరాగ్యము, ముముక్షుత్వము, ఆత్మత్వ పద దర్శనము, తుర్యావస్థ అనెడి యీ నాలుగు వాయువు యొక్క ప్రత్యేక కళలు)

కైవల్య దేహ నిర్ణయము

మహాకాశము - భూతాకాశ భువనము

నిర్విషయ అంతఃకరణలు	నిర్విషయ సమానాదులు	నిర్విషయ రూపాదులు	నిర్విషయ రసాదులు	నిర్విషయ గంధాదులు
మహాకాశము	ఆత్మారామత్వం	స్వయంజ్యోతిత్వం	పరామృతత్వం	భేదాభేదాతీతత్వం
దహరాకాశము	అనామృత చైతన్యత్వం	పరంజ్యోతిత్వం	సమరసత్వం	అభేదాభేదతత్వం
నిరవయాకాశము	చిదీశ్వర భావ మఖిల లీనత్వం	జ్యోతిర్మయత్వం	తత్త్వామృతత్వం	భేదాభేదతత్వం
సూర్యాకాశము	సత్యజ్ఞాన మనంత లక్షణ పరత్వం	ఆపోజ్యోతిత్వం	అమృతత్వం	అఖండత్వం
భూతాకాశము	అంతర్బాహ్య స్ఫూర్తి రహితత్వం	జగజ్యోతిత్వం	బోధామృతత్వం	ద్వయత్వం

లక్షణములు : ఆకాశ, వాయు, అగ్ని, జల, పృథ్వి లీల సూచనలు. నిర్గుణ అద్వితీయమునందు కైవల్య దేహము కననగును. ఇది అనుభవనీయము.

శివ పంచాక్షరీ

కం॥ పంచాక్షరీ బోధించియు
చాంచల్య మడంచివైచె సద్గురు వర్యుల్
అంచిత శ్రీకృష్ణునెంచగ
వశమవునె ధరలోనెవ్వరికైనన్ ॥

శ్లో॥ పంచాక్షర మిదం పుణ్యం । పవిత్రం పాపనాశనమ్ ।
సర్వసిద్ధికరం శుభం । శుచిః సాక్షాన్మోక్షైక సాధనం ॥

మంత్రం : ఓం నమశ్శివాయ । ఓం నమశ్శివాయ నమః ॥

ఓం నమశ్శివా	నమశ్శివాయ
నమశ్శివాయ	మశ్శివాయన
మశ్శివాయన	శ్శివాయనమ
శ్శివాయనమ	వాయనమశ్శి
వాయనమశ్శి	యనమశ్శివా

ఓం నమశ్శివాయ అను మంత్రమునకు అర్థం ఓంకారం పంచభూతాత్మకం

'న'కారమనే బీజము వలన పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, వెరసి దశేంద్రియములు కలిగెను.

'మ' కారమనే బీజము వలన మనస్సు పుట్టెను.

'శి' కారమనే బీజము వలన బుద్ధి జనించెను.

'వా'కారమనే బీజము వలన ఉపవాయువులతో గూడి దశవాయువులు పుట్టినవి.

'య'కారమనే బీజము వలన సత్త్వరజస్తమోగుణములు పుట్టినవి. ఈ మూడు గుణములచే త్రిమూర్తులు పుట్టిరి. ఇదియే త్రిగుణాత్మకంబైన మాయా ప్రపంచము. త్రిగుణాత్మక స్వరూపుండగు పరమశివుడు, ఈ పంచాక్షరీ మంత్ర రాజమును, సద్గురు దక్షిణామూర్తి స్వరూపమున చనుదెంచి, బ్రహ్మాది దేవతలకు (శబ్ద బ్రహ్మము) నుపదేశించిరి. వారి ద్వారా సర్వఋషీశ్వరులు వారి ద్వారా పెద్దలు పూర్వమున గ్రహించి సులభముగా నీ మాయను దాటి ధన్యులైరి.

ఈ ప్రణవ పంచాక్షరీ మహామంత్రమును సద్గురు స్వామి ద్వారా ఉపదేశింపబడి సర్వేంద్రియములకు రాజైన మనస్సును లయింపజేసి, దేహత్రయంబు నేను కాదు, అవస్థాత్రయంబులు నావి కావు, రాగద్వేషములు నాకు లేవు, ఈషణాత్రయములతో నాకు సంబంధము లేదు, అదియే నేను, నేను అది అని, నేను విలక్షణమై సర్వసాక్షినై కాలత్రయా బాధ్యుడైన ఆ పరమ శివుడే నేనను యనుభవము పొందెదనని సర్వదా మననము చేయవలెను.

శ్లో॥ సోఽహం । హంస । శివస్సోఽహం ।
సోఽహం । హంస । దేవాయ నమః ।

ఈ ప్రణవాక్షరంలో నమశ్శివాయ యనే ఐదక్షరములున్నవి. ఇవి యజుర్వేదోక్తమైన పంచాక్షరీ మంత్రమని, నమక మంత్రమని, శివగాయత్రియని అనెదరు.

పరమశివుని పంచముఖముల నుండి పుట్టి పంచ భూతాదియై పంచకర్తలకు, పంచకృత్యములకు, పంచ శక్తులకు, ప్రపంచమునకు, పంచ గోత్రములకు, పంచ సూత్రములకు, పంచావస్థలకు "ఆది" యై పంచ ప్రాణాధారమై, మోక్షప్రదమై యీ పంచాక్షరీ వెలయుచుండును. సర్వ ప్రపంచము యీ ఐదక్షరములలో నున్నట్లు తోచుచున్నది.

దీనిలో 'న'కార 'మ'కారములు సాకారములు, సగుణములుగాను 'శి', 'వా' యనునవి నిరాకారములు నిర్గుణములై యున్నవి. రెండక్షరములకు రూపములుండి, తక్కిన వాటికి లేకపోవుటకు కారణమేమనగా 'న' కార, 'మ'కారములు రెండును, కళ రహితుడగు శిష్యునిగాను, 'శి'కార, 'వా'కారములు గురువుగను, 'య'కారము అసి పదముగాను యున్నవి. అందుచే చివరి యక్షరములు నిరాకారములనిరి మరియు 'న'కార 'మ'కారములు జీవుడుగాను, 'శి'కార 'వ'కారములు ఈశ్వరుడుగను, 'య'కారము యీ రెండింటికి ఐక్య స్థానముగానున్నది. జీవేశ్వరుల ఐక్యము ప్రణవముతో గూడినదే పంచాక్షరి. మరియు ఆదిశక్తికి అవయవములుగానున్నది. అది ఎట్లనగా –

శ్లో॥ ఓం కారే వదనా దేవి । వా య కారౌ భుజద్వయే ।
శి కారో దేహమద్యేఛ । న మ కారౌ పదద్వయే ।
పంచాక్షరీ పరావిద్యా సతారాలింగ రూపిణి ॥

తా॥ ఓంకారము వదనముగాను, వా, య కారములు రెండు భుజములు (వాగ్భవ కూటమి) గాను, శికారము నడుము (మధ్య కూటమి) గాను, న, మ కారములు పాదద్వయము (శక్తి కూటమి) గాను యున్నవి.

ఓమ్
(వదనం)

వా	**య**
(భుజం)	**(భుజము)**

శ
(హృదయము)

న	**మ**
(పాదము)	**(పాదము)**

పంచాక్షరములు పిపీలికాది బ్రహ్మ పర్యంతము సర్వ దేహములందు సృష్టి స్థితి లయ తిరోధానానుగ్రహముల కాధారమై యొప్పుచున్నది. పైన జెప్పిన పదునారు కళలు ఊర్ధ్వాధో భాగముల యందు రెండు మార్గముల ద్వారా సంచారము చేయుచుండును. తత్కళలకు ఊర్ధ్వమున సంచరించునపుడు విజ్ఞాన కళలనియు, అధోభాగమున సంచరించునపుడు అజ్ఞాన కళలనియు పేర్లను బొందును. షోడశ కళయగు తురీయము ప్రత్యగాత్మకు స్థానమందురు.

'అ'కార రూపుడైన తాను 'ఉ'కారముతో గలియక 'మ' కారమను బిందువుతో జేరి చలనము లేక అచల హంసయై, ప్రజ్ఞాన స్వరూపుడై ఆత్మానాత్మలు విచారించి, ఆత్మ ఏదో అనాత్మ ఏదో తెలిసికొని, మహాకారణమే ఉపాధియై యుండు ప్రత్యగాత్మనే లక్ష్యముగానెంచగా, నా ప్రత్యగాత్ముడై యుండే స్థితికే తురీయమని చెప్పుదురు. ఆ ప్రణవ బ్రహ్మము కమల మధ్యము నందుండును. తత్కళ నాడుల ద్వారా దేహమంతా వ్యాపించును. ఆ ప్రణవము ఘంటికయందు చిన్నాద, చిద్బిందు, చిత్కళలుగా యున్నది. ఈ త్రివిధమును విని, కనేవాడే సాంఖ్యుడు. ఇది ఆజ్ఞేయమందుజేరి నాద బిందు కళలుగాయున్నది. సహస్రారమధ్యమున జేరి 'ఉ' కార 'మ'కారములుగా నున్నది. ప్రణవ స్థాన భేదముచే యీ త్రివిధములుగా నున్నది. సహస్రారమందుండు ప్రణవము ఘంటికయందు జేరగా, ప్రాణ వాయువుతో గలియుటచే శబ్ధము కలుగగా, నాద బ్రహ్మమైనది. అంతర్ యిడా పింగళానాడులు బ్రహ్మ దండికి కుడి ఎడమ పార్శ్వములందుండి హృదయము వరకు వచ్చి ప్రాణవాయువును తీసికొని ఘంటిక యందలి ప్రణవ బ్రహ్మను గలియగా హృదయమునందలి ప్రాణవాయువునకును, ఘంటికయందున్న ప్రణవమున కును సంబంధము గలసినది. ఘంటిక సూక్ష్మ శరీర సంబంధమగుటచే అచటి మార్గము సూక్ష్మ మగుట చేతను, ప్రాణవాయువు అచట విజృంభిచుటకు వీలు లేక పోవుట చేతను, ప్రణవము సూక్ష్మ నాదబ్రహ్మమయినది. ఆజ్ఞేయము స్థూల దేహ సంబంధమగుటచే విశాలముగా నుండును. అందుచే ప్రాణవాయువు

విజృంభించుటచే, స్థూల నాద బిందు కళలైనవి. కమల మధ్యమున ప్రాణవాయువు సంచారము లేకపోవుటచే నాదము లేకపోయినది. అచట నుండి రావమును వినవలయును. ప్రాణవాయువు మలిన ప్రకృతి సంబంధమగుట చేత, కమల మధ్యమునందు బ్రహ్మయుండుట చేతను, బ్రహ్మయుండే స్థలమునకు మలిన ప్రకృతి వెళ్ళుటకు సత్తా లేని కారణము చేతను, ప్రాణవాయువునకచట సంచారము లేదు. అచట శుద్ధ వాయువున్నది. అందుచేనచట వేయి హంసలు జపము జరుగుచున్నది. ప్రణవమనే సగుణ బ్రహ్మకు వేణునాద వినోదుడనే పేరు గలదు. ఈ సగుణ బ్రహ్మను తెలిసి యానాదబ్రహ్మలోనైక్యులైన వారే ముక్తులు. సగుణ, బ్రహ్మ, సురంధ్ర, సుషుమ్న అనే పిల్లనగ్రోవిని నాదమును యీ నాదము పిల్లనగ్రోవి గుండా బహిర్గతము కాగ విని ఆనందిచుటచే వేణునాద వినోదుడను పేరు గల్గినది. తాను కొండ మీద వెళ్ళు దారిలో అంతర్వేదియందు ఆ వేణునాద వినోదుడున్నాడు.

ప్రణవమూర్తి కమల మధ్యన కారణ ప్రణవముగాను, ఘంటికయందు సూక్ష్మ ప్రణవముగాను, ఆజ్ఞేయమున స్థూల ప్రణవముగాను, జెలగుచుండును. ఆజ్ఞేయము ద్విదళ స్థానమని, వ్యవహార స్థానమని, ఇంద్ర యోనియని, ఓంకార గృహయని, సిద్ధయోనియని పేర్లతోన్నుది. ఒక స్థలమునకే వ్యవహార భేదముచే యిన్ని పేర్లు గలిగినవి. సంకల్ప వికల్పములనెడి 'హం' 'క్షం' అను రెండు దళములు ఆజ్ఞేయమందుండి ప్రపంచమును సృష్టించుటచే ద్విదళ స్థానమనిరి. పంచకర్తలు ఆజ్ఞేయమునందుండి సర్వేంద్రియములతో సకల పనులను చేయించుటచే వ్యవహార స్థానమనిరి. బ్రహ్మాది పంచకర్తలు ఆజ్ఞేయమందెల్లప్పుడు నుండుటచేత ఇంద్రయోనియనిరి. ప్రణవము ఆజ్ఞేయమందుండి నాదబిందు కళలతో గూడి దివారాత్రములు ప్రణవ ధ్వని ఘోషించుటచే ఓంకార గృహమనిరి. సిద్ధదేవతలెల్ల యిచట రమించుట (బ్రహ్మానందమందుట) చేత దీనిని యోనియనిరి. సహస్రార కమలమందుండి చిచ్ఛక్తి దిగివచ్చి సర్వ క్రియలను జేయించుటకు, పంచకర్తల కాజ్ఞాపించు స్థలమగుటచే దీనిని ఆజ్ఞేయమనిరి.

పుణ్య పాప కర్మ విచారణ

శ్లో॥ పూర్వదళే పుణ్యమతి
ఆగ్నేయే నిద్రాలస్యం, దక్షిణే క్రూరం
నైఋతి పాపం, పశ్చిమే క్రీడాసక్తిః
వాయువ్యేగమనం, ఉత్తరే రతిప్రీతిః
ఈశాన్యే ద్రవ్య దానం, మధ్యే వైరాగ్యం
కేసరే జాగ్రత్తః, కర్ణికాయాం స్వప్నం
లింగే సుషుప్తిః పద్మత్యాగే తురీయం ॥

తూర్పు దళం	–	పుణ్యం
ఆగ్నేయ దళం	–	నిద్ర, సోమరితనం
దక్షిణ దళం	–	క్రూరత్వం
నైఋతి దళం	–	పాపము
పశ్చిమ దళం	–	ఆటలయందాసక్తి
వాయువ్యదళం	–	గమనించుట
ఉత్తర దళం	–	రతియందు ప్రీతి
ఈశాన్య దళం	–	ద్రవ్యమును దానము చేయుట
దళమధ్యన	–	వైరాగ్యం
కేసరములందు	–	జాగ్రదవస్థ (జాగ్రతలో)
కర్ణికయందు	–	స్వప్నావస్థ (జాగ్రతలో)
లింగమందు (దుద్దు)	–	సుషప్త్యావస్థ (జాగ్రతలో)
పద్మ త్యాగమందు	–	తురీయము (జాగ్రతలో)

పుణ్య పాప కర్మలు దళముల కదలికచే గలుగుచున్నవి. అట్టి సర్వము దళములయందు పడునట్టి సత్తా బహిర్గతమై పనిముట్లతోజేరగా వాటితో పని చేయు జీవుడొకడున్నాడు. కనుక ఆ జీవుడే పుణ్యపాపములననుభవించుచున్నాడు. అంతఃకరణ ప్రతిబింబమే జీవుడు. అంతఃకరణ లేనిచో జీవుడుండడు. కనుక అంతఃకరణమే పుణ్య పాపములననుభవించవలెను. కాని అంతఃకరణము జడమగుటవలన అనుభవించదు. ఏ పని చేయదు. జ్ఞాన సంబంధమగు కళ దానియందు జేరగానే ప్రతిబింబించిన యాబింబమే ప్రజ్ఞానమునకు గలిగిన సత్తాతో జేరి జీవుడనబడి పుణ్యపాపములు జేసి, యనుభవించుచుండును.

ఇట్లు జేసిన కర్మ ఫలముగా స్వర్గనరక పదవుల అనుభవము, అనగా సుఖ దుఃఖాలయనుభవము చేయును. ఇదియంతయు బ్రహ్మాకారము కాగా జన్మరాహిత్య మగును. పూర్వ జన్మార్జిత పుణ్యకర్మము గంగ, యమున, సరస్వతులనే పేర్లతో నుండు ప్రవాహ రూపముగా పారుచూ, త్రివేణీ సంగమ స్థానమున విచారణ జేయించుచుండును. ఆ నీరే ఆయా కర్మకు దగిన దళములను కదలించును. ఆయా దళములందున్న, హంస సత్తాతో జేరి విచారణ జేయించుచుండును.

పంచాక్షరీ మంత్రము — తారకామృతసారము

సాధనా చతుష్టయ సంపత్తి

1) నిత్యానిత్య వస్తు వివేకము 2) ఇహామూత్రార్థ ఫల భోగ విరాగము,
3) శమాది షట్క సంపత్తి 4) ముముక్షుత్వము

1) నిత్యానిత్య వస్తు వివేకము :

దీనిని నిరూపించుటకు "బ్రహ్మ సత్యం జగన్మిథ్య", "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ", "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను వాక్యములను పూర్వపక్షముగా స్వీకరించవలెను. "బ్రహ్మసత్యం – జగత్ మిధ్య" అనగా బ్రహ్మయే సత్యము, తద్వ్యతిరిక్తమైన దేహేంద్రియములు, జగత్తంతయు అసత్యమని, ఆభాసయని ఎఱుగుటయే నిత్యానిత్యవస్తు వివేకము.

ఈ జగత్తు రూపములు, నామములు, క్రియలతో కూడి ప్రత్యక్షముగా కనిపించుచు సత్యముగా తోచుచున్నది. కానీ జగమునకు ఉత్పత్తి నాశనములు చెప్పబడినవి. కనుక అనిత్యము.

కొందరు సత్యమనిన, అది యెట్లనగా, మహానది యందు జలము ప్రవహించిననూ, పోయిననూ మరల నూతన జలము వచ్చి చేరినట్లు, ఈ సృష్టి లయించినప్పుడు, పునఃసృష్టి యగుచున్నది. కనుక సత్యమనిననూ, అది నిజముగా పారమార్థిక సత్యము కాదు.

ఎట్లనగా, దృష్టాంతము – ఇంద్రజాలికుడు చేయు విచిత్రములొకప్పుడు మిధ్యయై మరల కనిపించిన యెడల అట్టి ప్రత్యక్షమై తోచిన వస్తువును అసత్యమందురు. కాని సత్యము కాదు కదా!

స్వప్న ప్రపంచము స్వప్నములో మాత్రమే సత్యముగా తోచిననూ, మేల్కొనిన వానికి సత్యము కాదు కదా!

స్వప్నమున అజ్ఞానమందుండ, వానికి స్వప్న జగత్తు సత్యముగానే యుండును. కానీ జాగ్రత్త యందు జ్ఞానము కలవానికి స్వప్న జగంబు అసత్యమగును కదా! అది ఎట్లనగా, స్థూల దేహముండు వరకు జాగ్రత్ ప్రపంచము సత్యముగనే యుండును. సూక్ష్మ దేహముండు వరకు స్వప్న ప్రపంచము తత్కాలమున సత్యముగనే యుండును. ఈ రెండింటికి కారణమగుటచే అవిద్య కారణ శరీరమనబడును. ఈ కారణ శరీరముండు వరకు, స్థూల, సూక్ష్మ దేహములునూ, తదవస్థలునూ సత్యముగనే యుండును. ఈ రెండు రకముల అవస్థలు, ఒక కాలమున వుండి, మరొయొక కాలమున లేకపోవుటచే, ఇవి రెండునూ అసత్యములే అని ఎరుగవలెను. ఈ రెండింటికినీ కారణము అవిద్యయే. అది బ్రహ్మ జ్ఞానముచే దహించిపోవును. కావున బ్రహ్మమే మిగిలియుండును. ఈ బ్రహ్మము దేహములుండినను తదవస్థలకు సాక్షియైనప్పటికినీ, త్రికాలముల యందుండుటచేత, ఆ బ్రహ్మమే పారమార్థిక "సత్త" యనబడును.

కావున బ్రహ్మమే సత్యము, జగత్తు మిధ్య అగుచున్నది. మిధ్య యనగా విచారణ చేసి, నిర్ణయించినచో, ఉన్నది లేనట్లు తోచినందున, అట్టి జగత్తును కల్పితమైనదానిగా వ్యవహరించుట.

కనుక స్థూల దేహములు మరల మరల కలుగక నశించునేని, జగత్తు లయించును. అట్టి లయమందు సూక్ష్మ దేహము నశించక, అనగా భంగము గాక, ప్రకృతియందే యుండును. ప్రళయ కాలమందు, స్థూల దేహములేర్పడుటకు తగిన స్థితి లేనప్పుడు లింగ శరీరము మైనపు ముద్ద యందు స్వర్ణ రవ్వలు పొదగబడియున్నట్లు యుండును. స్థూల దేహమునకు బీజము వంటి కారణ శరీరము అవిద్య యందుండుటచే, బీజముల వలన వృక్షములైన చందమున,

పునఃసృష్టి యందు స్థూల దేహములును, తత్ప్రపంచమునూ కలుగును. బ్రహ్మనిష్ఠులైన అద్వైతులకు జీవ మూలమైన అవిద్యయును, జీవుడునూ బ్రహ్మజ్ఞాన అగ్నిచే దహింపబడియుండును. ఇందుకు "బ్రహ్మాగ్ని దహితే కర్మ" అని భగవద్వాక్యము కనుక, దగ్ధమైన జీవుని వలె వేరు నరకబడిన వృక్షము వలె, ప్రారబ్ధాధీనమైన దేహోపాధి యుండు వరకు దగ్ధపటలమై యుండి, ప్రారబ్ధము తెగిన వెంటనే మోక్షము పొందుదురు. దీనికి దేహ కారణమైన అవిద్య లేదు. కనుక యీ సూక్ష్మ శరీరము లేదు. అందువలన జాగ్రత్ ప్రపంచము లేదు. ఈ దేహత్రయములు లేనివారు సద్యో మోక్షమునే పొందుచున్నారు. ఇందుకు శ్రుతి – "త్వ మేవం విద్వాన్ అమృత యిహభవతి" అనగా, ఆ యొక్క పరబ్రహ్మమును ఎరిగిన బ్రహ్మనిష్ఠుడు యీ దేహమునందే మోక్షమును పొందును.

కావున సాధకుడు నిత్యానిత్య వస్తు వివేకము, అభ్యాసముచే, తాను నిత్యమైన బ్రహ్మముగా భావించి, తద్వ్యతిరిక్తమైన శరీర జగత్తులను నిరసించి, మిధ్యగా నెంచవలెను.

2) ఇహాముత్రార్ధ ఫల భోగ విరాగము:

అనగా ఇహలోకమందు కర్మ జన్యములైన అనిత్యములైన స్రక్చందన వనితాది విషయ భోగములందునూ, పరలోకమున గల కర్మ జన్యములైన అనిత్యములైన రంభాద్యప్సరస స్త్రీల సంభోగాదుల యందునూ, వమనాన్న, మూత్ర – పురీషాదులందు యిచ్ఛ లేకున్న విధముగా ఉండుటే ఇహా మూత్రార్ధ ఫల భోగ విరాగము. ఇట్టి వైరాగ్యము లేనిచో సుఖములు కల్గుటకు గాను జనన మరణములుండును గానీ, మోక్షము లభించదు. అనగా నిత్యమగు బ్రహ్మము కానేరదు.

3) శమాది షట్క సంపత్తి :

ఇవి 1) శమము, 2) దమము, 3) ఉపరతి, 4) తితీక్ష, 5) శ్రద్ధ, 6) సమాధానము.

1.శమము: అనగా అంతరేంద్రియములైన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములను విషయములందు పోనివ్వక, నిగ్రహించి, సద్గురు చరణాదుల యందు నిలుపుట.

శ్లో॥ యతోయతో నిశ్చరతి । మనశ్చంచలమ స్థిరమ్ ।
తతస్తతోనియమ్యై తదాత్మన్యేవ నశంసయేత్ ॥

– భగవద్గీత 6వ అ. 26వ శ్లోకం

తా॥ మనస్సు వేదాంత శ్రవణమున వ్యతిరిక్తమైన విషయాదులకు పోవుచుండిన దీనిని మరలించి వేదాంత శ్రవణమందు నిలుపుట. ఈ అంతరేంద్రియములు అనగా మనస్సు సంకల్పించును. అనగా కోరికలు పుట్టించును. బుద్ధి నిశ్చయించును. చిత్తము చలించును. సందేహమును బుట్టించును. అహంకారము కార్యఫలము యెట్లగునో కదాయను విచారమునకు ఎడమీయక మూర్ఖతతో కార్యమును జేయించును. ఇవియే అంతరింద్రియములు, వాని విషయములు.

ఇట్లెరిగి చంచలమైన మనస్సు యేయే విషయములయందు సంచరించుచున్నదో, యాయా విషయములనుండి దానిని మరలించి గురూపదిష్ట మార్గమున ఆత్మయందు వశపఱచుట.

2. దమము : అనగా బాహ్యేంద్రియములైన జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములను నిగ్రహించి, శ్రవణాది వ్యతిరిక్త విషయములందు ప్రవేశింపనీయక, శాస్త్ర వాక్యముల యందు, సద్గురు ప్రవచితములయందు త్రిప్పి, శ్రవణాదులయందు నిలిపియుండుట.

శ్లో॥ యదా సంహరతే చాయం కుర్మోంగా నీవ సర్వశః ।
ఇన్ద్రియాణింద్రియార్థేభ్యః త్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

– భగవద్గీత 2 వ అ. 58వ శ్లోకం

తా॥ తాబేలు తన కరచరణాద్యవయవములును వెలినుండి తనలోనికి ముడుచుకొనునట్లు ఎవడు విషయములందిచ్ఛ కలిగియుండు తన యింద్రియములను మరలించి, మనస్సును ఆత్మయందే యిముడ్చుకొను చున్నాడో, అతని యొక్క బుద్ధియే మిక్కిలి స్థిరమైనది. మనస్సు నిలచిన

యింద్రియముల న్నియు నిలచును.

ఇట్టి సంపత్తి కలవాడే యోగాభ్యాసముతో ఇంద్రియముల సహాయములు లేకనే జ్ఞాన నేత్రమునందు సర్వమూ గ్రహించగలరు.

3. ఉపరతి : సకల పాప కార్యములలోనికి మనస్సును ప్రవేశింపనీయక, శాస్త్రముల యందు తెలుపబడిన పుణ్యకర్మల చేయుచు, ఫలమును ఆపేక్షింపక, భగవంతునికి అర్పణ చేయుట మరియు కర్తృత్వ, భోక్తృత్వ, అభిమాన, ఫలకాంక్షలు కలుగకుండ, మనస్సుని మహేశ్వరునియందు లయము చేయుటయే ఉపరతి.

శ్లో॥ కామః క్రోధశ్చ లోభశ్చ । దేహేతిష్ఠంతి తస్కరాః ।
జ్ఞానరత్నా పహారాయ । తస్మా జ్జాగ్రథ జాగ్రథా ॥

తా॥ అరిషడ్వర్గములే శరీరమందలి దొంగలు. అవి కామము=కోరిక, క్రోధము =కోపము, లోభము=పిసినిగొట్టుతనము, మోహము=కాంతాకనకములపై నుండెడి తీవ్ర యిచ్ఛ, మదము=ధనము, విద్య, రూపము, అధికారము, తపస్సు, పూజ, కులము, యౌవ్వనము (అను అష్టమదములు) చే అంధకార రూపమైన దురహంకారము గలిగియుండుట, మాత్సర్యము=ఓర్వలేని తనము – ఇవి తత్త్వ జ్ఞానమనెడి రత్నమును దొంగిలించును. కనుక జాగ్రత్తపడవలెను. (మెలకువతో నుండవలెను)

కావున మనస్సు విషయ సంగముతో అధోఃముఖవ్యాప్తి యగును. ఊర్ధ్వ ముఖ వ్యాప్తిని ప్రాణ నిరోధ పూర్వకముగా, గుణాతీత విచారణతో ఆచరించిన నిర్గుణ సాక్షాత్కారమునందును, నిలచును.

కావున సర్వకాల సర్వావస్థలయందును మనస్సును ఊర్ధ్వముఖ వ్యాపనము చేయవలెను. అట్టి యెడ క్రమక్రమముగా ఈశ్వరునియందే నిలచి విషయము లందు పోనీక కడకు జీవేశ్వరైక్యము ఘటించును. ఎట్లనగా

శ్లో॥ పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రియతాత్మనః ॥

– భగవద్గీ 9వ అ. 26వ శ్లోకం

తా॥ ప్రతిఫలాపేక్ష లేక తాను చేయు సర్వకర్మమును పరమపురుషుని కొఱకు అనన్య భక్తితో జేయబడినచో, తాను స్వీకరించునని భగవానులు నుడివిరి.

మనస్సును పై జెప్పిన అభ్యాస యోగము ద్వారా నిలిపి, ఆచరించిన తోడనే స్వప్రకాశమనెడి శుద్ధమగు తెలివి జ్ఞానదృష్టిగా యేర్పడును. అదియే చిత్ప్రకాశమని, ఆపోజ్యోతియని, మూలప్రకృతియని, సర్వసాక్షియని పెద్దలు నుడివిరి. ఇట్లు మనస్సు స్వాధీనమయి, ఆత్మయందు నిలచి క్రీడించుటయే ఉపరతియని యిందలి అంతరార్థము.

4) తితీక్ష : ప్రారబ్ధ కర్మ వశము చేత ఏయే కాలమునకు ఏమి సంభవించునో అదియంతయు అనుభవించుచూ, సమస్త భోగభాగ్యములు కలుగునప్పుడు సంతోషపడక, అవి విడచినప్పుడు దుఃఖపడక మనస్సును బుద్ధియందు నిల్పి పరాత్పరుని యందు మనస్సును లగ్నము చేయుటయే తితీక్ష.

శ్లో॥ యస్సరత్రానభిస్నేహః తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినన్దతి నద్వేష్టి తస్య ప్రజ్ఞాప్రతిష్ఠితా ॥

– భగవద్గీత 2 వ అ. 57వ శ్లో.

ఇట్లు దేహ, ప్రాణ విషయముల ఎడల దేనినీ తానని అభిమానించక ప్రారబ్ధ వశమున యేర్పడు శుభాశుభములను ఉదాసీన బుద్ధితో సాక్షిగా చూచు ప్రజ్ఞానస్థితియే స్థిరము; మరియు తితీక్షకు ఫలము.

5) శ్రద్ధ : శ్రద్ధ యనగా వేద శాస్త్రముల లక్ష్యార్థమైన పరబ్రహ్మయందు అధికమైన విశ్వాసము కలిగి ఉండుట, ఒకవేళ అప్పుడప్పుడు వాత పిత్త శ్లేష్మాదులతో కూడిన యీ దేహము వలన రుగ్మత కలిగియున్ననూ, దేహ భావమందుండక, బ్రహ్మ నిష్ఠతో యుండుట, పామరుడు యే విధముగా భౌతిక విషయములందు కూరుకొనిపోవునో అంతటి తీవ్రముగా భౌతిక, దేహ సంబంధముల వ్యతిరిక్తమైన బ్రహ్మనిష్ఠయందు మునిగియుండుటయే శ్రద్ధ.

6) సమాధానము : యుక్తాహార వివిక్తోవాస జితేంద్రియత్వములతో కూడి, మోక్షము వచ్చునా లేదాయని సందేహించక, ప్రతి దినమునను బ్రహ్మ చింతన యందు కాలము గడుపుచూ, ప్రారబ్ధ వశమున అప్పుడప్పుడు వచ్చు

ప్రతిబంధకములన్నింటినీ లెక్కచేయక, ఓర్పు కలిగి పెద్దలు చెప్పెడి రహస్యములను దెలిసికొనుట యందాసక్తితో నుండునట్లు నిలుపుట. అట్లు తెలిసినవానిని వేదాంత శాస్త్రములయందున్న సంగతులున్నూ ఒకటియే యని శ్రుతి, యుక్తి, అనుభవములతో అంతరమున మనస్సును సమాధానపఱచుటయే దీనికి ఫలము.

4) ముముక్షుత్వము :

అనగా మోక్షమందు ఆపేక్ష కలిగియుండుట. ధర్మార్థ కామములు పదార్థ భోగములనియు, మోక్షము పరమ పురుషార్థమనియు శ్రుతివాక్యము. కావున ఆ మోక్షమే కావలయునని చెప్పినంత మాత్రముననే మోక్షేచ్ఛ కానేరదు. అనగా గృహము దగ్ధమగుచున్నప్పుడు, అట్టి గృహమునందు అగ్ని చేత తప్తుండగు పురుషుండు పుత్ర, మిత్ర, కళత్రాదులు ఏమైపోయినారోయని విచారించక, వారిని విడచి, శీతలములందు ప్రవేశించుటకై తీవ్రముగా యత్నించునట్లు, సంసారమునందు ఆధ్యాత్మిక, ఆది భౌతిక, ఆది దైవికములనెడు తాపత్రయాగ్నిచే తప్తుడైన పురుషుడు ఈ సంసార తాపములు పోగొట్టునట్టి సద్గురువులు ఎచ్చట గలరో, అందుకు సాధనములేమియో అని యత్నించు చిత్త వృత్తికే మోక్షేచ్ఛ లేక ముముక్షత్వము అని చెప్పబడును.

ఈ విధముగా సాధనా చతుష్టయములను వేదాంత శ్రవణము చేయక మునుపే సంపాదించుకొనవలెను. మనస్సు అను బెబ్బులిని, ఆశయను కృష్ణ సర్పమును, కామాదులనెడి దొంగలను నిరాకరించుటకు పై నాలుగు సాధనములు పొందినవాడే అధికారి, అట్టివారు గురు ముఖమున వేదాంత శ్రవణము ప్రారంభించవలెను.

సంస్కారము లేని విజ్ఞానవంతుడు, ఛందస్సు తెలియని కవీశ్వరుడు ఎటులనో సాధనా చతుష్టయ సంపత్తి లేని వారికి శ్రవణాదుల వలన జ్ఞానము సిద్ధించదు.

ఈ సాధనా చతుష్టయమందు, నిత్యానిత్యవస్తు వివేకము ఒక్కటియే యుండి మిగిలినవి లేకున్నచో ఎట్లనగా, లోకములో శాస్త్రజ్ఞులకు నిత్యానిత్యవస్తు వివేకము గలదు. కానీ వారు ప్రాపంచిక, భౌతిక విషయములందాసక్తి కలిగి, కామ్య కర్మలు చేయుచున్నారు. కనుక వారలకధికారము లేదు. రెండవ సాధనమైన ఇహాముత్రార్థ ఫల భోగ విరాగముండి, మిగిలిన రెండు సాధనలూ లేనిచో ఎట్లనగా, కొందరు ఋషీశ్వరులకు కోప తాపంబులధికమై యుండును. అట్టివారు అధికారులు కాజాలరు. కనుక శమాదిషట్క సంపత్తి యుండవలెను.

ఈ మూడు సాధనములుండి ముముక్షుత్వము లేనిచో, ఎట్లనగా, కొందరు కృష్ణాజినములను చంకన బెట్టుకొని, సంసారమును విడచి, దాన ప్రతి గ్రహములన్నూ లేక సంచరించు చుండువారలు శ్రవణాదులు గలచోటనే చేరరు. కనుక వారికినీ అధికారము గానము.

కం॥ దయయు, జుగుప్సయు,
మోహము భయమును సంశయము
గులము బలశాలములన్నియు గూడి
నష్ట పాశములయి వెలయును.
వీనినాత్ముడంటక యుండున్. – శుకచరిత్ర

తా॥ ఈ ప్రకారము కొందరు అష్టపాశములు దగులుకొని దరిగానలేక పరితపించెదరు.

శ్లో॥ ఉత్తమాతత్త్వ చింతాచ । మధ్యము శాస్త్ర చింతనం ।
అథమా మంత్ర చింతాచ । తీర్థ భ్రాంత్యధమా ధమా ॥

తా॥ తీర్థయాత్రల వలననూ, మంత్రానుష్ఠానము వలననూ, శాస్త్రములు చదువుట వలననూ ముక్తి లేదని నిర్ణయము. కేవలము తత్త్వ జ్ఞాన ఫలమైన అపరోక్ష సాక్షాత్కార స్వానుభవము చేతనే ముక్తి సిద్ధము.

కావున సాధనా చతుష్టయమును పూర్తిగా సంపాదించినవారే వేదాంత విచారణమునకు అర్హత, అధికారము పొందెదరు. ఈ సంపత్తి కాయక, వాచక, ఇంద్రియ వ్యాపారంబులతో కూడినది కనుక ప్రాపంచిక విషయములందు ఆసక్తి లేని వారు సులభముగా, ఈ సాధన సంపత్తిని పొందగలరు. ఈ సంపత్తి ద్వారా అధికారి అయిన వారు వేదాంత విచారణకు ఉపక్రమించిన యెడల, వారు ప్రాపంచిక విషయాదులందు ఆశ వీడి, వైరాగ్య చిత్తులై గురువునాశ్రయించి, చతుర్విధ శుశ్రూషలను అధిక శ్రద్ధతో చేయవలెను. ఇట్టి బాహ్య, అంతర శుశ్రూషల

వలన గురువు కరుణా మూర్తియై శిష్యునకు "అహం(గ్రహోపాసన" విధితో మహా వాక్య విచారణను బోధించును.

నన్ను పొందుటకు ద్వాదశ మార్గములు - మెహెర్ బాబా

సాధకుడు తన దివ్యత్వమునను భవించుటకు ద్వాదశ మార్గములు గలవు. ఆ దివ్యత్వము సర్వాంతర్యామి, సర్వోత్కృష్టునిలో సంపూర్ణముగా ఉద్దీపించును.

1. నిరీక్షణ : సహారా ఎడారి ఎండలో పెక్కు దినములు పడియుండి జలము కొఱకు నిరీక్షించువాడెట్లు తపనతో ప్రాధేయపడునో అట్లే నాతో ఐక్యము కోరువాడు ప్రాధేయతా తృష్ణ అనుభవించవలెను.
2. మనశ్శాంతి : ఘనీభవించిన సరస్సు ఎంత ప్రశాంతముగా నుండునో, అంత ప్రశాంతముగా నుండగలిగినవాడు నన్ను పొందును.
3. నమ్రత : ఎట్టి ఆకృతిగనైనను మలచబడి, పోతపోయుటకుపకరించు మట్టికి వున్న నమ్రత, ఓర్పు, సహనము ఉన్న యెడల నన్నెఱుగ గలవు.
4. నిస్పృహ : నిస్పృహ వలన ప్రాణ త్యాగమునకు ఏ విధముగా మానవుడు తెగించునో అట్లే నన్ను వీక్షించనిదే బ్రతుకజాలనను యనుభవము కలిగినవాడు, ఆ సమయమున నన్ను గాంచగలడు.
5. విశ్వాసము : పగలును రాత్రియని చెప్పిన గురువాక్యమును, యెట్టి సందేహము లేక విశ్వసించిన కల్యాణుని వలె దృఢ విశాస్వసమున్న వాడు నన్ను తెలిసికొనగలడు.
6. అన్యోన్యత : తానెఱుగకున్నను, తనతో జీవితాంతము సహచర్యము చేయుచు, కష్టసుఖములలో కూడా వీడక, తనకు హితుడై, అహితుడు కాకుండా శ్వాస తననెట్లు అనుసరించుచున్నదో, అట్టి శ్వాసవలె తనకు నాయందు విశ్వాసమున్నచో వాడు నన్ను తెలిసికొనగలడు.
7. ప్రేమతో సాధన : నాయందలి ప్రేమతో విషయవాంఛల యెడ తనకున్న మోహమును దూరముగా చేయగలిగినప్పుడు, నన్ను పొందగలడు.
8. నిస్వార్థ సేవ : పుణ్య పాపములు, తగిన, తగని భేదములు లేకుండ, సృష్టియంతటను ప్రకాశించుచు విశ్వసేవ యొనర్చు సూర్యుని వలె ఫలాపేక్ష రహిత సేవ యొనర్చిన యెడల నన్ను జయించగలడు.
9. పరిత్యాగము : శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సంబంధ విషయములన్నిటిని నా కొఱకు పరిత్యజించిననాడు, నన్ను పొందగలడు.
10. విధేయత : కంటికి వెలుగు, ముక్కుకు వాసన అప్రయత్నముగానెట్లు తెలిజేయునో, అట్లే సంపూర్ణమైన సహజమగు విధేయతయున్నచో నన్ను చేరగలడు.
11. శరణాగతి : నిద్రలేమి వ్యాధితో బాధపడువాడు ఆకస్మికముగా వచ్చు నిద్రకు నిశ్చింతగా ఏ విధముగా లొంగునో, అదే విధముగా అంత మనస్ఫూర్తిగా నాకు అర్పణ అయిననాడు నన్ను పొందగలడు మరియు తనవానిగా జేసికొనగలడు.
12. ప్రేమ : సెయింట్ ఫ్రాన్సిస్‌కు జీసస్‌యందు ఎంతటి ప్రేమ వున్నదో అంతటి ప్రేమ నాపై వున్నచో నన్నెఱుగుటయే గాక, నన్ను ఆనందపరచ గలడు మరియు సంతృప్తి పరచగలడు.

చతుర్విధ శుశ్రూషలు

(అంతర్భావము - లక్ష్యార్థం)

1) స్థాన శుశ్రూష : జాతి, వంశ, ప్రతిష్ట వీనియందు అభిమానము, దేహాభిమానము విడచి సర్వవ్యాపకమైన సద్గురునికి హృదయ స్థానమందు నిలచి శరణాగతి చేయుటయే స్థాన శుశ్రూష అనబడును.

2) అంగ శుశ్రూష : సూక్ష్మమైన లింగ శరీరము, స్థూలమైన అంగ శరీరము, ఆవరణయే కారణ శరీరము గల సంగత్వముచే నేర్పడు భ్రాంతులైన అరిషడ్వర్గములను, పంచమలములను విడచి, సర్వవ్యాపకమైన సద్గురుని ప్రజ్ఞా స్వరూపముతో మూడవస్థలలో ఆశ్రయించి యుండుటయే అంగ శుశ్రూష

అనబడును.

3) భావ శుశ్రూష : కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, అంతరేంద్రియములు 14 నకున్నూ సాక్షిత్వముగా విలక్షణుడనని తలంచుచూ సర్వ వ్యాపకమైన సద్గురుని హృదయమందు సుస్థిరత గలిగియుండుటయే భావశుశ్రూష అనబడును.

4) ఆత్మ శుశ్రూష : తాను సాక్షినని సుస్థిరతనొందిన ప్రజ్ఞా స్వరూపముగా చిన్మయ ఘనిష్ఠమైన సద్గురునియందు అనన్యమై నిలచి, తాను తానై సచ్చిదానందు డనను అనుభవము పొందుటయే ఆత్మశుశ్రూష అనబడును.

శరీర త్రయ విలక్షణము

సీ॥ జ్ఞానేంద్రియంబులు కర్మేంద్రియములంతరింద్రియంబులు
విషయేంద్రియములు ప్రాణాదులను గూడిపరగ
నిరువదైదు తత్త్వంబులను స్థూల తనువునయ్యె
బాహ్యేంద్రియంబులు పది, ప్రాణమునైదు
ధీమనంబులు సూక్ష్మ దేహమయ్యె, యీ శరీరద్వయ
హేతుకానాద్య విద్యావృతంబై కారణాంగమయ్యె,
మూడు దేహంబులకు నాది మూలమైన క్షరునకు
నక్షరునకు విలక్షణుండ నీవె
రమ్యగుణధామ భద్రాద్రి రామ పరశురామ
నరసింహ్మా దాస సంరక్షితాహ్వ ॥

తా॥ పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, అంతఃకరణ చతుష్టయముతో గూడిన జ్ఞాతయొక్కడు, విషయేంద్రియములైదు, పంచ ప్రాణేంద్రియములు గలసి యీ యిరువదియైదు తత్త్వములు (గోళకములు) గూడి స్థూల శరీరమాయెను.

ఇందలి పంచ జ్ఞానేంద్రియములు, పంచ ప్రాణములు, పంచ కర్మేంద్రియములు, మరియు అంతఃకరణగాన్ను మనస్సు, బుద్ధి గలసి పదునేడు తత్త్వములు (గోళకములందు వసించు ఇంద్రియ పదార్థములు) గూడి సూక్ష్మ శరీరమాయెను.

కార్యరూపమైన పై రెండు శరీరములకు మూలమై అనాద్యవిద్యావృతమై కారణ శరీరమాయెను. మరియు జ్ఞాతయే కారణ శరీరము

ఈ మూడు శరీరములకు విలక్షణమైనది ఆత్మయని యెరుంగవలెను.

– భద్రాద్రి రామ శతకము

శ్లో॥ ఆపాణి పాదోహ మచిన్త్య శక్తిః పశ్యామ్య చక్షుః సశృణోమ్య కర్ణః ।
అహం విజానామి వివిక్తరూపోనచాస్తి వేత్తా మమ చిత్సదాఽహమ్ ॥

తా॥ నాకు యే అవయవాలు లేవు. నాశక్తి అనంతం, కళ్ళు లేకుండా చూస్తున్నాను. చెవులు లేకుండా వింటున్నాను. నాకు యే రూపము లేదు. నాకు సర్వము తెలుసు. నన్ను తెలుసుకొనేది వేరే యేదీ లేదు. నేను నిత్య శుద్ధ జ్ఞాన జ్యోతిని. జ్ఞానానంద స్వరూపోఽహం. – కైవల్యోపనిషత్

ఇంకను భగవంతునిచే గల్పింపబడిన గుణత్రయము ద్వారా యీ లింగ శరీరమనెడు సూక్ష్మ శరీరము ఇట్లున్నది.

గుణత్రయ విభాగ పంచదశ సూక్ష్మ పంచీకరణము.

1) ఆకాశము యొక్క	సత్త్వ	గుణ భాగము	శ్రోత్రము
॥	తమో	॥	శబ్దము
॥	రజో	॥	వాక్కు
2) వాయువు యొక్క	సత్త్వ	॥	త్వక్కు
॥	రజో	॥	స్పర్శ
॥	తమో	॥	పాణి
3) అగ్ని యొక్క	సత్త్వ	॥	నేత్రము
॥	రజో	॥	రూపము
॥	తమో	॥	పాదము
4) జలము యొక్క	సత్త్వ	॥	జిహ్వ
॥	రజో	॥	రసము

॥	తమో	॥	గుహ్యము
5) పృథివి యొక్క	సత్త్వ	॥	ఘ్రాణము
॥	రజో	॥	గంధము
॥	తమో	॥	గుదము

దీనినే త్రివృత్కరణమందురు. ఇది పంచీకరణమందే అంతర్భాగమై యున్నది.

సూక్ష్మ శరీర వ్యవహారము :

జ్ఞాత, కూటస్థుడు అను, అధి దేవత చేత, బ్రేరేపింపబడి సమాన వాయువుతో గూడి, శ్రోత్రేంద్రియము ద్వారా, శబ్ధములను గ్రహించుచు, వాక్కు చేత పలుకుచుండును.

జ్ఞాత, మనోరూపుడై, చంద్రాధి దేవత చేత బ్రేరేపింపబడి వ్యానవాయువుతో గూడి, త్వగింద్రియము ద్వారా, స్పర్శలను గ్రహించుచు పాణీద్రియము ద్వారా, స్పర్శలను గ్రహించుచు పాణీంద్రియము ద్వారా దాన ప్రతిగ్రహములను చేయుచుండును.

జ్ఞాత, బుద్ధి రూపుడై బృహస్పత్యధి దేవత చేత బ్రేరేపింపబడి, ఉదాన వాయువుతో గూడి, చక్షురింద్రియము ద్వారా, రూపములను గ్రహించుచు, పాదేంద్రియము చేత, గమనాగమనములు చేయుచుండును.

జ్ఞాత, చిత్తరూపుడై క్షేత్ర జ్ఞాధి దేవతచేత బ్రేరేపింపబడి, ప్రాణవాయువుతో గూడి జిహ్వేంద్రియము ద్వారా రసములను గ్రహించుచు గుహ్యేంద్రియము చేత మూత్ర విసర్జనము, శుక్ల శోణితములను, విసర్జన చేయుచు సంభోగములయందానందించును.

జ్ఞాత అహంకార రూపుడై, రుద్రాధి దేవత చేత బ్రేరేపింపబడి అపానవాయువుతో గూడి, ఘ్రాణేంద్రియము చేత, గంధములను గ్రహించుచు పాయురింద్రియము ద్వారా, మలమును విసర్జించుచుండును.

జ్ఞాతను విడచి 24 తత్త్వములే సూక్ష్మ శరీర తత్త్వములనబడును. కొందరు 17 తత్త్వములే సూక్ష్మ శరీరమనెదరు.

శ్రోత్రేంద్రియమునకు వాగింద్రియమునకు మైత్రి గలదు. శ్రోత్రము శబ్ధమును వినుచున్నది. వాక్కు శబ్ధమును చెప్పుచున్నది. త్వగింద్రియమునకు పాణింద్రియమునకు మైత్రి గలదు. త్వక్కు స్పర్శమునెఱుగుచున్నది. పాణి దానిని నిర్వాహము చేయుచున్నది. చక్షురింద్రియమునకు పాదేంద్రియమునకు మైత్రి గలదు. చక్షువు రూపమును గ్రహించుచున్నది. పాదము అచ్చటికి గమనము చేయుచున్నది. అట్లే, వివిధ ఇంద్రియములకు మైత్రియుండి, అవి సమిష్టిగా వ్యవహరించుచుండును.

దీనిచే జ్ఞానేంద్రియ కర్మేంద్రియములకును, సత్త్వరజోగుణములకును గల మైత్రి విశదమగును.

పిండాండ పంచీకరణము

పిండాండ సృష్టి నిర్ణయము

1. పంచ భూతములనుండి స్థూల శరీరములు గల్గెను.
2. పంచతన్మాత్రల నుండి యింద్రియములు గల్గెను.
3. పంచశక్తుల నుండి జీవుడేర్పడెను.
4. పంచబీజముల నుండి ప్రాణమేర్పడెను.
5. పంచాధి దేవతలనుండి ప్రత్యగాత్మ గల్గెను.

శ్లో॥ పృథివీ మూర్తిః ఆపఃక్లేదః ద్రవః)
తేజోభి సంతాపః వాయుః ప్రాణః
వియత్ సుషిరాణి బ్రహ్మ అంతరాత్మ
యథాఖలు బ్రహ్మ విభూతిఃలోకే అంతరాత్మ
పురుషేపి అంతరాత్మ కీవిభూతః ॥

తా॥ శరీరమే భూమి. ఇందులోని ద్రవములు తేమ, జలతత్త్వము. శరీరములోని వేడిమి అగ్ని తత్త్వము. ప్రాణమే వాయుతత్త్వము. నవరంధ్రములందున్న ఖాళీ ప్రదేశములే ఆకాశము. శరీరములోని అంతరాత్మ శరీరమంతా వ్యాపించియున్నది.

శ్లో॥ బ్రహ్మణో విభూతిః లోకే ప్రజాపతిః
అంతరాత్మనో విభూతిః పురుషే సత్త్వం
యస్మింద్రోలోకే స పురుషే అహంకారః
ఆతిత్యస్త్వాదానం (గ్రహణశక్తిః) హృద్రో
ప్రసాదః వనవస్సు ఖం, అశ్వినౌ కాంతిః
మరుదు త్సాహః విశ్వే దేవాః సర్వేంద్రియాణి
సర్వేంద్రి యార్థాస్య, తమో మోహః
జ్యోతిః విజ్ఞానం ॥

శ్లో॥ లోకాతీతము, లోకవ్యాప్తమున్ను అయినది బ్రహ్మము. అది లోకములో ప్రజాపతి రూపములోనున్నది. అలాగే దేహాతీతము, దేహవ్యాప్తం అయినది అంతరాత్మ. అది దేహములో సత్త్వ రూపములో విస్తరించినది. లోకములో ఇంద్రుడు అహంకారముగను, సూర్యుడు గ్రహణశక్తిగను, రుద్రుడు రోషముగను, చంద్రుడు ప్రసాద (ప్రకాశ) గుణముగను, వసువులు సుఖముగను, అశ్వినీ దేవతలు కాంతిగను, గాలి ఉత్సాహముగను, విశ్వ దేవతలు ఇంద్రియములు మరియు ఇంద్రియాదర్ధములుగను, చీకటి అజ్ఞానముగను, వెలుగు జ్ఞానముగను ఆవిర్భవించినవి. – చరక సంహిత

పిండాండ పంచీకరణము – పటము
(వేదాంత పంచవిశంతి – 8వ పేజి)

ఆకాశ పంచకము :

ఆకాశములో అర్ధాంశము జ్ఞాతకు గోళకమయ్యెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకలై ఒక పరక వాయువును గూడి మనస్సునకు గోళకమయ్యెను. ఒక పరక అగ్నిని గూడి బుద్ధికి గోళకమయ్యెను. ఒక పరక జలమును గూడి చిత్తమునకు గోళకమయ్యెను. ఒక పరక పృథివిని గూడి అహంకారమునకు గోళకమయ్యెను. ఇవే అంతరేంద్రియములకు గోళకములు. జ్ఞాతకు గురుమూర్తి, మనస్సునకు చంద్రుడు, బుద్ధికి బృహస్పతి, చిత్తమునకు క్షేత్రజ్ఞుడు, అహంకారమునకు రుద్రుడు యీ అంతరేంద్రియములకు అధి దేవతలు.

వాయుపంచకము :

వాయువులో అర్ధాంశము వ్యానవాయువునకు గోళకమయ్యెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకలై ఒక పరక ఆకాశమును గూడి సమాన వాయువునకు గోళకమయ్యెను. ఒక పరక అగ్నిని గూడి ఉదానవాయువునకు గోళకమయ్యెను. ఒక పరక జలమును గూడి ప్రాణవాయువునకు గోళకమయ్యెను. ఒక పరక పృథివిని గూడి అపానవాయువునకు గోళకమయ్యెను. ఇవే పంచప్రాణములకు గోళకములు. సమాన వాయువునకు జయుడు, వ్యానవాయువునకు విశ్వయోని, ఉదాన వాయువునకు అజుడు, ప్రాణ వాయువునకు విశిష్టుడు, అపాన వాయువునకు విశ్వకర్త, యీ ప్రాణేంద్రియములకు అధి దేవతలు.

అగ్ని పంచకము :

అగ్నిలో అర్ధాంశము చక్షువునకు గోళకమయ్యెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకలై ఒక పరక ఆకాశమును గూడి శ్రోత్రమునకు గోళకమయోయను. ఒక పరక వాయువును గూడి త్వక్కునకు గోళకమయ్యెను. ఒక పరక జలమును గూడి జిహ్వాకు గోళకమయ్యెను. ఒక పరక పృథివిని గూడి ఘ్రాణమునకు గోళకమయ్యెను. ఇవే జ్ఞానేంద్రియములకు గోళకములు. శ్రోత్రమునకు అష్టదిక్కులు, త్వక్కునకు వాయుదేవుడు, చక్షువునకు సూర్యుడు, జిహ్వాకు వరుణుడు, ఘ్రాణమునకు అశ్వినీ దేవతలు యీ జ్ఞానేంద్రియములకు అధి దేవతలు.

జలపంచకము :

జలములో అర్ధాంశము రసమునకు గోళకమయ్యెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకమై ఒక పరక ఆకాశమునకు గూడి శబ్దమునకు గోళకమయ్యెను. ఒక పరక వాయువును గూడి స్పర్శకు గోళకమయ్యెను. ఒక పరక జలమును గూడి రసమునకు గోళకమయ్యెను. ఒక పరక పృథివిని గూడి గంధమునకు గోళకమయ్యెను. ఇవే పంచతన్మాత్రలనబడు విషయములకు గోళకములు. శబ్దమునకు పరాశక్తి, స్పర్శకు యిచ్ఛాశక్తి, రూపమునకు ఆదిశక్తి, రసమునకు జ్ఞాన శక్తి, గంధమునకు క్రియాశక్తి, యీ తన్మాత్రలకు అధి దేవతలు.

పృథివి పంచకము :

పృథివిలో అర్ధాంశము పాయువునకు గోళకమయ్యెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకలై ఒక పరక ఆకాశమును గూడి వాక్కునకు గోళకమయ్యెను. ఒక పరక వాయువును గూడి పాణికి గోళకమయ్యెను. ఒక పరక అగ్నిని గూడి పాదమునకు గోళకమయ్యెను. ఒక పరక జలమును గూడి గుహ్యమునకు గోళకమయ్యెను. ఇవే కర్మేంద్రియములకు గోళకములు. వాక్కుకు అగ్ని దేవుడు, పాణికి ఇంద్రుడు, పాదమునకు ఉపేంద్రుడు. గుహ్యమునకు ప్రజాపతి, పాయువునకు మృత్యుదేవత యీ కర్మేంద్రియములకు అధి దేవతలు.

పృథివి కదంబము :

పృథివిలో పృథివి గూడగా పాయువు పుట్టును. పృథివిలో జలము గూడగా, గంధము పుట్టెను. పృథివిలో అగ్ని గూడగా ఘ్రాణము పుట్టెను. పృథివిలో ఆకాశము గూడగా అహంకారము పుట్టెను.

జలకదంబము :

జలములో పృథివి గూడగా గుహ్యము పుట్టెను. జలములో జలము గూడగా రసము పుట్టును.పృథివిలో అగ్ని గూడగా జిహ్వ పుట్టెను. జలములో వాయువు గూడగా ప్రాణవాయువు పుట్టెను. జలములో ఆకాశము గూడగా చిత్తము పుట్టెను.

అగ్ని కదంబము :

అగ్నిలో పృథివి గూడగా పాదము పుట్టెను. అగ్నిలో జలము గూడగా రూపము పుట్టెను. అగ్నిలో అగ్ని గూడగా చక్షువు పుట్టెను. అగ్నిలో వాయువు గూడగా ఉదానవాయువు పుట్టెను. అగ్నిలో ఆకాశము గూడగా బుద్ధి పుట్టెను.

వాయుకదంబము :

వాయువులో పృథివి గూడగా పాణి పుట్టెను. వాయువులో జలము గూడగా స్పర్శ పుట్టెను. వాయువులో అగ్ని గూడగా త్వక్కు పుట్టెను. వాయువులో వాయువు గూడగా వ్యానవాయువు పుట్టెను. వాయువులో ఆకాశము గూడగా మనస్సు పుట్టెను.

ఆకాశకదంబము :

ఆకాశములో పృథివి గూడగా వాక్కు పుట్టెను. ఆకాశములో జలము గూడగా శబ్దము పుట్టెను. ఆకాశములో అగ్ని గూడగా శ్రోత్రము పుట్టెను. ఆకాశములో వాయువు గూడగా సమాన వాయువు పుట్టెను. ఆకాశములో ఆకాశము గూడగా జ్ఞాత పుట్టెను.

ఆకాశతత్త్వస్తబకము :

ఈ జ్ఞానమను జ్ఞాత సమాన వాయువును గూడుకొని శ్రోత్రేంద్రియము ద్వారా సమస్త విధ శబ్దములను గుర్తెరిగి వాక్కు ద్వారా వచించుచున్నది.

వాయుతత్త్వ స్తబకము :

ఈ జ్ఞానమను జ్ఞాత మనోరూపమై వ్యానవాయువును గూడుకొని త్వగింద్రియము ద్వారా స్పర్శను గుర్తెఱిగి పాణి ద్వారా దాన ప్రతి గ్రహణము చేయుచున్నది.

అగ్నితత్త్వ స్తబకము :

ఈ జ్ఞానమను జ్ఞాతబుద్ధిరూపమై ఉదాన వాయువును గూడుకొని చక్షురింద్రియము ద్వారా రూపమును గుర్తెఱిగి పాదము ద్వారా గమనాగమనము చేయుచున్నది.

జలతత్త్వ స్తబకము :

ఈ జ్ఞానమను జ్ఞాత చిత్తరూపమై ప్రాణవాయువును గూడుకొని జిహ్వేంద్రియము ద్వారా రసమును గుర్తెరిగి గుహ్యేంద్రియము ద్వారా ఆనందించుచున్నది.

పృథివి తత్త్వ స్తబకము :

ఈ జ్ఞానమను జ్ఞాత అహంకార రూపమై అపానవాయువును గూడుకొని ఘ్రాణేంద్రియము ద్వారా గంధమును గుర్తెరిగి పాయురింద్రియము ద్వారా మల విసర్జన జేయుచున్నది.

పృథివి పంచకలయము :

పృథివి యొక్క కఠినాంశములో ఆకాశము యొక్క బయలాంశము జేరగా వాక్కు లయము. పృథివి యొక్క కఠినాంశములో వాయువు యొక్క చలనాంశము జేరగా పాణిలయము. పృథివి యొక్క కఠినాంశములో అగ్ని యొక్క తేజాంశము జేరగా పాదము లయము. పృథివి యొక్క కఠినాంశములో జలము యొక్క

ద్రవాంశము జేరగా గుహ్యము లయము. పృథివి యొక్క నిండాంశములో పాయువనే అర్ధాంశము జేరగా పాయువు లయము.

జలపంచక లయము :

జలము యొక్క ద్రవాంశములో ఆకాశము యొక్క బయలాముశ జేరగా శబ్ధము లయము. జలము యొక్క ద్రవాంశములో వాయువు యొక్క చలనాంశము జేరగా స్పర్శ లయము. జలము యొక్క ద్రవాంశములో అగ్ని యొక్క తేజాంశము జేరగారూపము లయము. జలము యొక్క ద్రవాంశములో పృథివి యొక్క కఠినాంశము జేరగా గంధము లయము. జలమనే నిండాంశములో రసమనే అర్ధాంశము జేరగా రసము లయము.

అగ్ని పంచక లయము :

అగ్ని యొక్క తేజాంశములో ఆకాశము యొక్క బయలాంశము జేరగా శ్రోత్రము లయము. అగ్ని యొక్క తేజాంశములో వాయువు యొక్క చలనాంశము జేరగా త్వక్కు లయము. అగ్ని యొక్క తేజాంశములో జలము యొక్క ద్రవాంశము జేరగా జిహ్వాలయము. అగ్ని యొక్క తేజాంశములో పృథివి యొక్క కఠినాంశము జేరగా ఘ్రాణము లయము. అగ్ని అనే నిండాంశములో చక్షువనే అర్ధాంశము జేరగా చక్షువు లయము.

వాయుపంచక లయము :

వాయువు యొక్క చలనాంశములో ఆకాశముయొక్క బయలాంశము జేరగా సమాన వాయువు లయము. వాయువు యొక్క చలనాంశములో అగ్ని యొక్క తేజాంశము జేరగా ఉదాన వాయువు లయము. వాయువు యొక్క చలనాంశములో జలము యొక్క ద్రవాంశము జేరగా ప్రాణవాయువు లయము. వాయువు యొక్క చలనాంశములో పృథివి యొక్క కఠినాంశము జేరగా అపానవాయువు లయము. వాయువు యొక్క నిండాంశములో వ్యానవాయువనే అర్ధాంగము జేరగా వ్యానవాయువు లయము.

ఆకాశ పంచక లయము :

ఆకాశము యొక్క బయలాంశములో పృథివి యొక్క కఠినాంశము జేరగా అహంకారము లయము. ఆకాశము యొక్క బయలాంశములో జలము యొక్క ద్రవాంశము జేరగా చిత్తము లయము. ఆకాశము యొక్క బయలాంశములో అగ్ని యొక్క తేజాంశము జేరగా బుద్ధి లయము. ఆకాశము యొక్క బయలాంశములో వాయువు యొక్క చలనాంశము జేరగా మనస్సు లయము. ఆకాశము యొక్క నిండాంశములో జ్ఞాతయనే అర్ధాంశము జేరగా జ్ఞాత లయము.

తారకామృతసారము - 82, 83, 84, 85, 88 వరకు

అష్ట ప్రకృతి లయము :

పృథివి జలమందును, జలము అగ్నియందును, అగ్ని వాయువునందును, వాయువు ఆకాశమునందును, ఆకాశము అహంకారమునందును, అహంకారము మహత్తునందును, మహత్తు అవ్యక్తమందును, అవ్యక్తము నిర్వికార నిర్వికల్ప అచల పరిపూర్ణ పరబ్రహ్మయందు లయము.

ఆధ్యాత్మిక ఆధి భౌతిక ఆధి దైవతములు (తాపత్రయము)

జ్ఞాత ఆధ్యాత్మికము, జ్ఞేయము ఆధి భౌతికము, గురుమూర్తి ఆధి దైవతము. మనస్సు ఆధ్యాత్మికము. సంకల్పవికల్పములు ఆధి భౌతికము. చంద్రుడు ఆధి దైవతము. ఇట్లే అన్నియు యీ క్రింది విధముగా నున్నవి.

ఆధ్యాత్మికము	ఆధి భౌతికము	ఆధి దైవతము
జ్ఞాత	జ్ఞేయము	గురుమూర్తి
మనస్సు	సంకల్పవికల్పములు	చంద్రుడు
బుద్ధి	నిశ్చయము	బృహస్పతి
చిత్తము	చింతన	క్షేత్రజ్ఞుడు
అహంకారము	అభిమానము	రుద్రుడు
సమానవాయువు	అన్నరసమును అన్ని నరములకు పంచుట	జయుడు
వ్యానవాయువు	దేహమందంటతా వ్యాపించుట, జ్ఞాత సత్తా ప్రసరించుట	విశ్వయోని
ఉదానవాయువు	ఇష్టపదార్ధ భక్షణము, కలవరించుట, మాట్లాడుట	అజుడు
ప్రాణవాయువు	ఉచ్ఛ్వాస్వనిశ్వాసముల	విశిష్టుడు

	చేత సంచరించుట,	
	అన్నమును జీర్ణము చేయుట	
అపాన వాయువు	మలాదులను వెలుపలకు వెళ్ళద్రోయుట, సకల రోమ నాడులయందు వ్యాపించుట	విశ్వకర్త
శ్రోత్రము	చతుర్విధ శబ్ద గ్రహణము	అష్టదిక్పాలకులు
త్వక్కు	ద్వాదశవిధస్పర్శ గ్రహణము	వాయుదేవుడు
చక్షువు	దశవిధ రూపగ్రహణము	సూర్యుడు
జిహ్వ	షడ్విధరుచులను గ్రహించుట	వరుణుడు
ఘ్రాణము	చతుర్విధ గంధ గ్రహణము	అశ్వనీ దేవతలు
శబ్దము	ఏకదేశ శబ్ద గ్రహణము	పరాశక్తి
స్పర్శ	ఏకదేశ స్పర్శ గ్రహణము	ఇచ్ఛాశక్తి
రూపము	ఏకదేశ రూప గ్రహణము	ఆదిశక్తి
రసము	ఏకదేశ రస గ్రహణము	జ్ఞానశక్తి
గంధము	ఏక దేశ గంధ గ్రహణము	క్రియాశక్తి
వాక్కు	వచించుట	అగ్నిదేవుడు
పాణి	దానప్రతిగ్రహణము	దేవేంద్రుడు
పాదము	గమనాగమనము	ఉపేంద్రుడు
గుహ్యము	ఆనందించుట	ప్రజాపతి
పాయువు	మలవిసర్జనము	మృత్యుదేవత

సూక్ష్మ శరీర తత్త్వ లయము :

స్థూల శరీరము కర్మజమగుట వలన కర్మము క్షీణించెనేని స్థూల దేహము క్షీణించును. సూక్ష్మ దేహము సహజమగుట వలన కత్తులచేత నరకబడక, జలము చేత నానక, అగ్ని చేత దహింపబడక, వాయువు చేత శోషింపబడక, వృత్తి ప్రళయము, నిత్య ప్రళయము, దేహ ప్రళయము, మను ప్రళయము, బ్రహ్మ ప్రళయము, విష్ణు ప్రళయము, రుద్ర ప్రళయము, మహేశ్వర ప్రళయము, సదాశివ ప్రళయము, విరాట్పురుష ప్రళయములందు చెడక విదేహ ముక్తి పర్యంతము నుండును. ఇది చెడిన గాని ముక్తి గలుగదు.

ముక్తి గోరువాడు ముందుగా సూక్ష్మ శరీరమును జెరుపగోరక, కారణ శరీరమును చెరుపవలెను. సూక్ష్మ కారణ శరీరములను ఏకకాలమున అధిష్ఠానమందు లయింపజేయవలెను. లేనిచో అన్యోన్యాశ్రయముగా సూక్ష్మమున్న కారణముండును. కారణమున్న సూక్ష్మముండును. ఈ కారణ శరీరము భ్రాంతి జమవుట వలన అపరోక్ష బ్రహ్మ సాక్షాత్కార జ్ఞానము చేత భ్రాంతి నశింపజేసెనేని, భ్రాంతి వలన గల్గిన కారణ శరీరము నశించును అనగా భ్రాంతి వల్ల గలిగినది, భ్రాంతి విడచిన పోవునది లేనిదని, మిథ్యయని తోచును. అట్టి తరి కర్మ వాసనలుండవు మరియు అజ్ఞానము దొలగును. అందుచే లింగ శరీరము ప్రకృతియందు జేరి స్థూల దేహములు బొందదు. ఇదియే జన్మ రాహిత్యము.

మరి యీ సూక్ష్మ శరీరము పైన జెప్పిన ప్రళయములందు నశింపక, కారణ శరీరమందే జేరి యుండినచో, భ్రమ నశించువరకు, అనగా అజ్ఞానము దొలగువరకు, కాలకర్మవశము చేత మరల మరల పుణ్య, పాప, మిశ్రమ కర్మల శేషములచే లభ్యమగు దేవ, మానుష, పశు, పక్షి, క్రిమి, కీటక, జలచర, స్థావర స్థూల శరీరములతో గూడుచు, వీడుచునుండును. అట్లు గాక, కారణ శరీరము నశించిన, యీ సూక్ష్మ శరీరము కారణ శరీరమందు నిల్వ తావు లేక కాష్ఠ రహితమగు వహ్నిచందమున లయించును. అప్పుడా శరీరతత్త్వములు సమిష్టి, వ్యష్టి భేదముల తోడ క్షీణించి సత్త్వ రజో భూత తన్మాత్రములై యుండును గాని, పునర్జన్మయుండదు కావున మరణముండదు. ఇదియే ముక్తి.

పంచకోశ వ్యతిరిక్తము

స్థూల శరీరమునకు అన్నమయ కోశమని పేరు. ఈ కోశము కత్తికి ఒరవలె, ప్రాణమయ కోశమును కప్పెను. అది యెట్లనగా, ప్రాణము లేని స్థూల శరీరమును ఖననము లేక దహనము చేయుచున్నాము. కనుక నేను అను వ్యాపారము ప్రాణమయమైనందున, అన్నమయ కోశము "ఈ వ్యాపారము నాది" అని ప్రాణమయ కోశమును కప్పెను. కనుక అన్నమయ కోశము నేను

కాదు.

అటులనే, ప్రాణమయ కోశము మనోమయ కోశమును కప్పెను. అది యెట్లనగా, జాగ్రత్తలో ప్రాణమున్నది. వ్యాపారమున్నది. సుషుప్తిలో ప్రాణమున్నది. కానీ వ్యాపారము లేదు. ఎందుకనగా, సుషుప్తిలో మనస్సు లేదు. కనుక వ్యాపారము మనస్సునదైయ్యుంది. మనస్సున్నప్పుడే నేను అనెడి వృత్తి వ్యాపారమున్నందున "ఈ వ్యాపారము నాది" అని ప్రాణమయ కోశము, మనోమయ కోశమును కప్పెను.

మనోమయ కోశము విజ్ఞానమయ కోశమును కప్పెను. అది యెట్లనగా, ఒక దృష్టాంతము. ఒక గ్రుడ్డివాడు, ఒక కుంటివాడు దేహ యాత్ర జరుప నిశ్చయించిరి. గ్రుడ్డివాని భుజములపై కుంటివాడు కూర్చుని, దారి చూపుచుండగా, గ్రుడ్డివాడు ప్రయాణము సల్పుచుండెను.

గ్రుడ్డివాడు మనోమయ కోశము వంటివాడు. కుంటివాడు విజ్ఞానమయ కోశము వంటి వాడు. మనస్సు ఎప్పుడునూ, విషయములను ప్రోగు చేయును. కాని, ఆ విషయములలో ఇది మంచిది, ఇది చెడ్డదని పరిశీలనా జ్ఞానముతో నిశ్చయించునది విజ్ఞానమయ కోశము. "ఇట్టి నిశ్చయము ద్వారా జరుగు వ్యాపారము నాది" అని మనోమయ కోశము, విజ్ఞానమయ కోశమును కప్పెను.

విజ్ఞానమయ కోశము ఆనందమయ కోశమును కప్పెను. అది ఎట్లనగా, ఒక దృష్టాంతము. విత్తనముంటేనే వృక్షము వచ్చెను. అద్దమున్నందుననే ప్రతిబింబము గోచరించును. అటులనే ఆనందమయ కోశమున్నందుననే విజ్ఞానమయ కోశము వచ్చెను. "అహం" భావన ఉన్నందుననే వ్యాపారము, వృత్తి కల్గెను. ఈ వ్యాపారమంతయును ఆనందమయ కోశమునదైననూ, నేను కర్తను, భోక్తను అని "ఈ వ్యాపారము నాది" అని విజ్ఞానమయ కోశమును ఆనందమయ కోశమును కప్పెను.

ఆనందమయ కోశము ఆత్మను కప్పెను. అది ఎట్లనగా, ఆనందమయ కోశమన్ననూ, మాయ అన్ననూ, అవ్యక్తమన్ననూ, అవిద్యా సహిత అంతః కరణయన్ననూ ఒక్కటే. ఈ దృశ్యము యావత్తున్నూ ఆత్మ యొక్క సత్తా వలననే కలుగుచుండగా, ఆనందమయ కోశము "ఈ వ్యాపారము నాది" అని ఆత్మను కప్పెను.

ఈ పంచ కోశములన్నియు సమాన సత్తాలు కావు. కనుక ఒకదానికన్నా మరియొకటి వ్యాపకము, పెద్దది. ఆత్మ సత్తా వలన జీవింపబడే ఆనందమయ కోశము ఆత్మను ఎలా కప్పెనో తెలియవలెను. దృష్టాంతము - సూర్యుని సత్తా వలన ఏర్పడిన మేఘములు సూర్యుని కప్పినట్లు, సువర్ణము సత్తా వలన ఉపజీవింపబడ్డ పంచకోశములు ఆత్మను కప్పినవి. అయితే అవి మరొకదానిని కప్పకూడదా? అట్లు కప్పుటకు వీలు కాదు. ఎట్లనగా ఆభరణము సువర్ణమును కప్పినట్లు అనిన సముద్రములోని నీరు సూర్యుని యొక్క వేడిమికి ఆవిరిగా మారి మేఘములు ఏర్పడిన విధముగా, మరల ఆ మేఘములే సూర్యుని కప్పినవి కనుక, కోశములు ఆత్మను గాక, మరొకదానిని కప్పలేవు. అయినను, ఒక కోశము మరియొక కోశమును యెట్లు కప్పెనో తెలియవలసియున్నది. కత్తిని ఒర కప్పినట్లు వీణను గవిశ కప్పినట్లు, చింతపండును చింతగుల్ల కప్పినట్లు, పసిరిగ పురుగును తిత్తి కప్పినట్లు, ఆత్మను కోశములను పేర్లు గలవి కప్పెను.

అట్లే ఆత్మ లక్షణములు పంచకోశములకు లేనందున "ఆత్మ-అనాత్మ" వివేక నిరూపణముతో "నేను పంచకోశ వ్యతిరిక్తుడనగు ఆత్మస్వరూపుడను" అని నిశ్చయించవలెను.

ఆత్మ అవస్థాత్రయమునందు అనుస్యూతమైయున్నది. పంచకోశములు అవస్థాత్రయమునందు అనుస్యూతములుగా లేవు. అది యెట్లనగా

జాగ్రదవాస్థయందు - అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశములు మూడు గుర్తించబడుచున్నవి.

స్వప్నావస్థయందు - మనోమయ, విజ్ఞానమయ కోశములు రెండే గుర్తించబడుచున్నవి.

సుషుప్తావస్థయందు - ఆనందమయకోశము ఒక్కటే గుర్తించబడుచున్నది.

కనుక, పంచ కోశములు తోచుచు, వ్యవహారమునకు వచ్చినను, యివి పరబ్రహ్మమాధరముగా ప్రకాశించెడివే కాని, స్వయంప్రకాశకము గాదని నిర్ణయము. ఆధేయములు, ఆవరణములేగాని, ఆధారము గాదని నిర్ణయము.

ఎఱుక అయిన పర(బహ్మమునకునూ శరీరములు అయిన పంచకోశములకున్నూ ఆధార ఆధేయతను సద్గురు కృపతో అనుభవ పూర్వకముగా నిర్ణయించి, ఆధేయములు ఎన్నటికినీ లేనివేనని దెలిసియుండవలెను.

కం॥ ముప్పదియారవతత్త్వము ॥ యొప్పుగ
తనయందు గన్న యుజ్వల మతికిన్ । ద
ప్పును మాయాలోకము । మెప్పుగు తన్మ
యత జెంది । – మిట్టాడు చుండున్ –
పరాపరము – ముట్టిగను చుండున్ –
దట్టించి యాత్మైక్య । తత్త్వ దర్శనమూని –
పట్టు, లోపట్టుగ – పరిపూర్తినొందెడి
గుట్టు మదిలోనెంచి సుస్థిర – గూఢభా
వము జేర్చి, బయలున – చట్టువలె మది
మరచి తన్మయ – జతనమగు పరిపూర్ణ
మొదవిన – మిట్టాడు చుండున్ – పరాపరము
ముట్టినగను చుండున్

– కందార్ధ రత్నావళి 111వ కం.

తా॥ ఎట్టి ఘనుడైతే తనలోని ముప్పదియారవ తత్త్వమైన, (ప్రత్యక్ పరమాత్మల ఏకరూపైన పరిపూర్ణ పర(బహ్మమును కనునో అతడే మాయాతీతుడు. అట్టివాడు తత్త్వ దర్శనముతో పరిపూర్ణత అను స్థిరమును అనగా బయలును, అచలముగా, తనను మరచి, ఉన్నది ఉన్నట్లుండును. పరాపరములతోనున్న సర్వము ద్విపుటియని గురుకృపచే గుర్తించి వర్తించును అని భావము.

కం॥ చూపున దోచెడు సూక్ష్మపు రూపే గురి
మనన సౌంజ్ఞ రూఢిగ గని, యా దాపున
దర్పణమున గని । నీ పోలిక తీం(డ్రమడచి
నిజపాపగనరా – తుర్యముపైన – భజియించి మనరా –
గజిబిజి లేకను – కనుపాపలోనంటి – విజిత మానసమంది ।
వివశాత్ముడైయుండు ॥ అజమనామయ మ(ప్రమేయం ।
బందగని, యింపొంది, బయలున విజయమందుట, చూడ్కి చెదరని ॥
విధములో గురి యునికి పట్టగు నిజ పాపగనరా – తుర్యముపైన –
భజియించి మనరా ॥

– కందార్ధరత్నావళి – 112 వ కం॥

తా॥ తుర్యాతీతమునందు నేననెడి, మేననెడి అష్టతను భావమంతయు గిట్టించి బయలే స్థిరమని ఎంచి, సర్వదృక్కును లయించి, అంతఃశూన్యమై సద్గురు కృపచే లభించిన లక్ష్యార్థ భావమందే నిలచి, చెదరక, సచ్ఛిష్యుడు కేవలాత్మయైన తన నిజస్థితినందు నిలకడ చెంది, సర్వమైన దివ్యత్వము, జీవత్వములకు గుర్తు ఎఱుక ఒక్కటేనని, అది అఖండమని దానిని బయలంటక యుండునని తెలిసి, అష్టతనువుల తీం(డ్రమంతయు అణచునని భావము. దృదీక్ష సాం(ప్రదాయికముగా గురుకృపచే ఆధారమే లేని వత్తి లేని దీపము వంటి ఆపోజ్యోతి ఆర్యాదర్పణమందు ఏర్పడగా, అట్టి సూక్ష్మపు రూపుయందు "నేననెడి" తురీయమును తొలిమేనులైన జీవతనువు తీం(డ్రమందు అణిచి, అ(ప్రమేయమైన ఈశ్వర చతుష్టయ లక్ష్యమందు చూపు నిలిపి బయలును గుర్తించమని భావము.

కం॥ కమలములో మధురసమును । గమ
లము నందుండి కప్ప । గానని భంగిన్ । త
మలోని దేవునెఱుగని । కుమతుల కేలాగు
గల్గు । కొమరారు భక్తిన్ – భ్రమలను (దొక్కు
– యమల యౌయుక్తిన్ విమలమో దృగ్ద ృశ్య । నీక్ష్యమందెఱు
కను । (క్రమముగ తెగటార్చి । గణుతించి మించుట ॥
శమాదిక గుణకదంబము । సప్తహస్తునకర్పితంబగు । సమ(గ
తిచ్చ సమాగతంబున । స్వ(ప్రకాశ శివోహమననము – కొమరారు
భక్తిన్ – భ్రమలను (దొక్కు – యమలమౌయుక్తిన్ ॥

– కందార్ధ రత్నావళి – 113 వ. కం॥

తా॥ గుణ రహితమైన అచలమే అమలమని అట్టి దానిని లక్ష్యముగా చేకొని దృక్‌దృశ్య వివేకమందు నిర్ణయించిన సర్వదృక్కైన ఎఱుకను (క్రమముగా తెగటార్చు విధమెరుగవలెనన్నది తనలోని దేవుని దర్శించిన సచ్ఛిష్యునకు నిజ గురు కృపా

విశేషమున లభించును. సర్వసాధన సంపత్తులను స్వప్రకాశ శివోహ మననముతో నిజగురునకు అర్పించి స్థిరతనందును. ఇట్లు కాని వారు ఎంత కాలము గురువుల నాశ్రయించినను కమలము వద్ద నున్న కప్ప ఎట్లు కమలమును తెలియలేదో అట్లు బయలునందజాలరు.

కం॥ సాలోక్యము సామీప్యము । చాలున
సారూప్య పదవి । సాయుజ్యంబుల్ ।
నాలుగు పదవులు ముక్తికి - మేలగు పర
తత్త్వమంది - మేటిల్ల వలెరా ।
క్షేత్రజ్ఞుని - చోటెఱుగ వలెరా
ఆటపాటలైన । యంతర్యామి నెన్ని ।
కూట బ్రహ్మానంద । కుండలి జేరుము ।
కోటి సూర్య ప్రభల నలరెడు ॥ కొలువు
కూటము జేరి పిమ్మట । వాటముగ నా
ప్రత్యగాత్మను ॥ వలచి తన్మయ
మేటిల్ల వలెరా - క్షేత్రజ్ఞుని - చోటెరుగ వలెరా ॥

- కందార్థరత్నావళి -114 వ. కం॥

తా॥ జీవన్ముక్తిని క్రమముగా సాలోక్యము, సామీప్యము, సారూప్యము, సాయుజ్యముల విధమున పరతత్త్వమైన క్షేత్రజ్ఞుని ఎఱిగి, అక్షరుడైన అంతర్యామిని కూటస్థమని అనుభవమంది, వ్యష్టియైన ప్రత్యగాత్మను బ్రహ్మానందానుభవమైన, విశ్వసంబంధమైన, అఖండ ఎఱుకయని లక్ష్యించి, కోటిసూర్య ప్రభా భాసురమైన వత్తి లేని దీపమును, ఆపోజ్యోతిని, స్వప్రకాశ శివోహమననమున, అమనస్క మందు స్థిరతనందించుకొని నిజగురు కృపకు పాత్రతనందవలెను.

కం॥ గురుసేవ జేసితివి యా । దరమతి నానంద
మనెడి । తత్త్వామృతమున్ । యిరవొం
ద గ్రోలి సర్వము । పరిభవ మొనరించి
నిన్నే బడయుట మేలు - ఈ క్షణమంది
యుడిగితే చాలు - తడబడకెప్పుడు
తత్త్వాతీతమంది ॥ పడిపొర్లుచుండు
ము । బరికించి నిన్నెంచి ॥ ఘడియఘ
డియకు సత్వరంబున ఘట్టిగను మది
చెదరనివ్వక । దృఢముగా సాలోక్య
మమరుచు । ధీరతను సేవింపనెమ్మ
ది - బడయుట మేలు - ఈ క్షణమంది
యుడిగితే చాలున్ ॥

- కందార్థ రత్నావళి - 115 వ. కం॥

తా॥ సద్గురుకృప చేత తత్త్వామృతమును పానము చేసి వ్యష్టిగా తురీయానుభవమైన ప్రత్యగాత్మనుభవస్థితిని, మహావాక్యమందలి "ప్రజ్ఞానం బ్రహ్మ" గా నిర్ణయమంది, సమిష్టి అనుభవముగా సుస్థిరుడగుటకు పూర్వమెఱిగిన దంతయు నిరసించి ధీరుడై తొలిమేనులు అయిన జీవ తనువులను క్రమమున ఉడిగింపజేసి సర్వవ్యాపకమైన, అఖండత్వమైన, కేవలమైన దృక్స్థితిని నిలుపుకొని యానందించు తత్త్వానందమె "సాలోక్యమ"ని భావము.

కం॥ సకల సుఖ దుఃఖముల దా । ప్రకటితము
గ । నెంచి చూచి ప్రజ్ఞానిధివై - వికటంబు
లేక మెలగిన । నికరంబగు పూర్ణమది యె -
నిజమూనిగనరా - సామీప్యమౌ -
భజియించి మనరా - విజిత మానసదృ
ష్టి । వీక్షించి లోమించి - యజపాదిక్రియ
లొడ్డి - యచలుడైయుండుట - యజ
భవాదులకందనిది । హృదయాంతరాళ
ము నిండియ్యున్నది - గజిబిజిని వీడి నిర్వి
కారము - గతి గనుంగొను దారితోడ్పడి -
నిజమూని గనరా - సామీప్యమౌ - భజియించి మనరా

- కందార్థ రత్నావళి 116వ. కం॥

తా॥ అజునకు, భవునకు కూడా నందనిది అచలము, అట్టి ములుగ్రుచ్చ సందులేక, నిండియున్న దాని గుర్తు నందవలెనన్న, లోవెలి భేదము లేక, బ్రహ్మ భావమున "అహం బ్రహ్మోస్మి" నిక్కముగా, పూర్ణ అనుభవ సారముగా, "సామీప్యము" నందవలయు. అమనస్క స్థితియందుండి, అజపాది సాధనలతో పనిలేక, పరమ హంసలై, పూర్ణ నిర్గుణియైన, అఖండమైన ఎఱుకను నిర్ణయింప నిజగురు కృపకు పాత్రుడగును. వ్యష్టిగా లేక కేవలమైన సమిష్టి అయిన సర్వము తానని బ్రహ్మానందానుభవ పరవశుడగును అని సామీప్యమునకు భావము.

కం॥ అనయములోన యుక్తిగ - కనుగవగీలిం
    చి లెస్స - గనవలె బ్రహ్మం - బనుభవ గమ్యుం
    డ । నీవై - మనుచుండుము । యంతరాత్మ -
    మన్మయమూని - నిర్విషయమౌ -
    తన్మయమూని - సన్మార్గ వృత్తిలో - సారూ
    ప్యమగు గురి - యున్మనిలో జూచి యున్మ
    త్తుడై యుండు - చిన్మయాకృతిలోన బ్రహ్మ
    ము - చెలగి మించెడు చిత్పరంబున -
    జన్మ దుఃఖ నివారణంబగు - జైత్రుడై తిల
    కించి లోగొను - మన్మయ మూని - నిర్వి
    షయమౌ - తన్మయమూని

- కందార్థ రత్నావళి 117వ కం॥

తా॥ త్రిపుటియందు తత్త్వార్థమగు బ్రహ్మమునేనని "తత్వమసి" గా అంతర్ బాహ్య భేదము లేక, వ్యష్టి సమిష్టి భేదము లేక, తన్మయము - మన్మయము - చిన్మయము, ఉన్మని యందు "సారూప్యము" గా నిర్విశేషముగా, నిర్వికారముగా ఉన్మత్తుడై బ్రహ్మానందభరితుడై చిన్మయ ఘనిష్ఠమై, జన్మదుఃఖ నివారకమైన తుర్యాతీతమును, పరిపూర్ణ పరబ్రహ్మమును లక్ష్యించి నిజగురు కృపను పొందును. కేవలానంద మందును అని భావము.

కం॥ సకల చరాచరమంతయు - ప్రకటిత
    ముగ మిథ్య జేసి - పదపడి నీలో - విక
    టంబు లేక మెలగుము - సకలేశుని గాంచు
    టదియే - సాయుజ్యమగురా - గజి
    బిజిలేని - ధ్యేయము గదరా - మాయకు
    వెలియైన - మహనీయ్యతేజము - బాయని
    చూట్కిలో - బయలంది పొందుట - కాయ
    మని యెడు పంజరంబున - ఖం బ్రహ్మం
    పక్షి గనుగొని - వాయువశమగు కుంభ
    కముచే - వాలలాడుచు బయలు జేరు
    ట - సాయుజ్యమగురా - గజిబిజి
    లేని - ధ్యేయము గదరా

- కందార్థ రత్నావళి 118 వ. కం.

తా॥ "అయమాత్మ బ్రహ్మ" అనెడి "సాయుజ్య" పదవిని సర్వముయందు తనను, తనయందు సర్వమును ఉండజూచిన ఘనుడు మాయాతీతుడై, మహనీయుడై సకలేశుడైయుండు అక్షరునిగా, వ్యక్తావ్యక్తమైన పరిపూర్ణ పరబ్రహ్మమును లక్ష్యించి జీవేశ్వరులిరువురు "ఖం" - "బ్రహ్మం" అని కేవల కుంభకమున సాయుజ్యమంది స్థిరమందును. పూర్వానుభవమున కతీతమై తుర్యాతీతమును బయలును నిజగురు కరుణా కటాక్షమున ధ్యేయముగా లక్ష్యించును అని భావము.

కం॥ భయమేమి లేదు నీకిక - జయమొందుము
    హంసనెక్కి - జాణుడవైయా - ద్వయ
    శూన్యమందు జేరుము - నయముగసా
    క్షిత్వమమరు - నమ్ము నా మాట -
    నిర్ధూతుడై - పొమ్ము ఈ బాట -
    ఇమ్మహిలోపల - నీ పరిపూర్ణమ - నొ్సి
    మ్మె । నీ పొమ్మని - సోహంభావమమర -
    జిమ్ము గుణముల జేరనివ్వక - చిత్రదీ
    పము మాడ్కి చూట్కిని - నెమ్మి లోపల జేర్చి
    కళలను - నెఱపియైక్యము నిబ్బరించెదు -

నమ్ము నామాట - నిర్ధూతుడై - పొమ్ము ఈ బాట

- కందార్థ రత్నావళి 119వ కం॥

తా॥ పరమగురుని చేరు నిమిత్తమై పూర్ణ గుర్వాశ్రయమున నిర్భయుడై అంతర్ బాహ్యములందున్న శూన్యమును లక్ష్యించి పూర్ణానుభవమైన అఖండ ఎఱుక నిర్ణయ పద్ధతిన గుణ రహితమై, హంసను తెగటార్చుచు, పూర్ణకళను ఆధారముగా గైకొని, పూర్ణ గురు హృదయమునంది వర్తించును. కేవలమైన, ఆవరణ రహితమైన బయలును నిలుపుటకు, పరిపూర్ణ పరబ్రహ్మమును నిర్ణయించుటకు పూర్ణగురుని కృపను పొందునని భావము.

కం॥ సగుణంబు మాయ గనుమిక - సగుణం

బననిదియె సర్వ - సంకల్పమగున్ - సగు

ణంబుమీరినంతట - యగణితమగు స్వ

ర్గమదియె - యందగ బూను - ఈక్షణ

మందే - పొందికయూను - ముందుగ

నీలోని - ముఖ్యతేజమునంటి - యంధ

కారము దాటి ॥ యాత్మదర్శనమందు ।

యందమగు యా జ్ఞానవౌకను । యంది భవ

సాగరము దాటిన । కుందనము వలె బ్రహ్మ

కళలటు । కోటి భాస్కర తేజమగు గురి -

యందగ బూను - ఈక్షణమందే - పొందికయూను ॥

- కందార్థ రత్నావళి । 120వ. కం॥

తా॥ పూర్ణ గురుకృపచే ఎఱుకను నిర్ణయించెడి విధము ఇట్లందును. సగుణమే మాయ సర్వము, సంకల్పము. దీనిని మీరి నిర్గుణివైన సర్వవ్యాపకమగుదవు. అందులకు తనయందేనున్న అవిద్యా మోహమును స్వప్రకాశత్వమగు జ్ఞాన నౌకచే తరించి కోటి భాస్కర తేజమైన విశ్వసంబంధమైన పరిపూర్ణ పరబ్రహ్మ మును లక్ష్యించి నిర్ణయించుమని భావము.

కం॥ రాగద్వేష కదంబు । వేగమె బొలి

యించి మించి । వెలయుము మదిసం ।

యోగ ప్రాభవముక్తిని । భోగములం

దిచ్చమాను - పుట్టుటల్పున్నా - యం

తకుమున్నె - గిట్టుటల్పున్నా - దిట్టరి

వైనేవు । ధీ జిత ప్రజ్ఞలో । పట్టువిడక

నాత్మ । ప్రత్యక్షమెన్నము । పుట్టు గిట్టు

వు లేనిదిదె పరి॥ పూర్ణతత్త్వ నిరామ

యంబగు । గుట్టు తెమలక బట్టబయటను ॥

కొంకకను । సేవింపదొడరిన - పుట్టు

టల్పున్నా - యంతకుమున్నే - గిట్టుటల్పున్నా ॥

- కందార్థ రత్నావళి 121వ కం॥

తా॥ పరిపూర్ణ భావజ్ఞుడై, జీవేశ్వర జగత్రయంబు యెడల ఉదాసీనుడవై, రాగద్వేషాదుల మించి, జీవన్ముక్తి యందలి సచ్చిదానంద భోగము నందిచ్చను మాని స్థిరతనందినచో పరిపూర్ణ పరబ్రహ్మ అనుభవమంది బట్టబయటను ఉన్నది ఉన్నట్లు ఉండుట సాధ్యమని పూర్ణబోధగా పూర్ణ గుర్వనుగ్రహమున పొందవలయునని భావము.

కం॥ అగణితవైభవ మొసగెడు ॥ సగుణం

బున దెలివి మరచి । సద్భావుడవై । నిగ

మార్థ మెన్నుచుండెడి ॥ తెగువను తేజం

బునంటి - దేవేశుగాంచు - నిరంకుశ

భావమునెంచు । జీవేశు లేక మౌ చిద్గగన

మహిమము । గావించి సేవింపగతి

బ్రహ్మమై దోచు । జీవసాక్ష్యై చెలగు

చుండెడి । చిత్త వృత్తి నడంచి తన్మయ ॥

భావపరమగు ఱిచ్యమైకొను । బట్ట

బయలను శక్తిబూనుక - దేవేశుగాంచు

నిరంకుశ - భావమునెంచు ॥

- కందార్థ రత్నావళి 122వ. కం॥

తా॥ లెక్కించుటకు వీలు కాని వైభవముగా నున్న సర్వమునంతయు సగుణ, నిర్గుణములందు ప్రజ్ఞాస్థితిని వదలి, శృత్యర్థమైన తానే ఈశ్వరుడనని,

పరబ్రహ్మమని ఎంచు, జీవేశ్వరైక్యపదమైన చిద్గగనమును మించి, తాను జీవ జగత్తులకు సాక్షినను చిత్తవృత్తిని నిరంకుశముగా ద్రొక్కివైచి, చిన్మయ భావము నిరసించిన వాడే బట్టబయ లందగలడని పూర్ణగురుబోధ.

కం॥ గురిగురుతులేని దేహము । కరువలిజత
నంబువలన । కాంక్షల కిరవై ॥ తరిమిడి
జన్మములొదవును । నరకమునకు
తెరువిలివియె – నమ్ము నామాట – నెం
జలిమాని – పొమ్ము – ఈబాట – ఇమ్ము
దప్పకనీవు । యేకతమునైన । నెమ్మిలో
గురిదాటి । నిర్జితుడైయుండు । ముమ్మ
రంబగు బయలు బయలున ॥ ముట్టు
చుండిన నిర్భయంబగు । సొమ్ము పొందెద
నక్క జంబుగ । సొరగినిన్మది మరచి
బయలగు – నమ్ము నా మాట –
నెంజలి మాని – పొమ్ము ఈ బాట ॥

– కందార్థ రత్నావళి 123వ. కం॥

తా॥ పరిపూర్ణ భావజ్ఞులను గుర్తింప నశక్యము కాక దేహమునే స్థిరమని గురువుని, గురుతుని దేహమునకే ముడి వేసిన వైకుంతపాళియందు, కడకున్న పెద్ద పాము నోటబడి కాంక్షలయందు మగ్నత చెంది శిశ్నోదరపరాయణులై జనన మరణ దుఃఖ ప్రవాహరూపమగు నరకమున పడిపోవుదురు అనేకులు. ఈ పరిపూర్ణ భావము నందు వారు క్రమమున పూర్ణగుర్వనుగ్రహమున అనుభవ పూర్వకమున పరిపూర్ణ పరబ్రహ్మ నెఱిగి తురీయమును నిర్జించి నిర్భయుడైయున్నవాడై బట్టబయ లందగలడని పూర్ణ గరుబోధ.

కం॥ నీరజ మరందమునకై । దూరంబున
నున్న వచ్చి । తుమ్మెద గ్రోలున్ ॥ యీరీతి
గురుని శిష్యుడు । ధీరమతిజ్జేర్పవలయు –
తెరగంటిబూను – దహరాకాశ – పరబ
యలుబూను – ఉరుతరంబైనట్టి ॥ యున్మ
నిలో వెలి । తిరముగ గుర్తించి దీపింప
జేయగ । దురధిగమమగు దివ్య తేజము ॥
దురంతముగ వెలయుచుండెడి పరాపర
మగు ॥ నిర్వికారము । ప్రాప్తి పొందగ
పరిణమించుము – తెరగంటిలోను –
దహరాకాశ – పరబయలు బూను ॥

– కందార్థ రత్నావళి 124వ కం॥

తా॥ భ్రమరము మకరందము నాస్వాదించు రీతిన నిజ శిష్యుడు పరమగురుని చేరి ధీరుడై అఖండమైన, సర్వమైన, విశ్వసంబంధమైన, పరిపూర్ణ పరబ్రహ్మమును ఉన్మనీభావమును నిరసించి మనోన్మనియై అంతర్బాహ్యము పరిపూర్ణ భావమున ఎఱిగి దహరకాశ స్థితినంది పరబయలును లక్ష్యించవలెను. పరాపరములై, నిర్వికారమై, ప్రాప్తిన తృప్తినంది దివ్య తేజము అయిన కళలను నిరసించవలెనని భావము.

కం॥ లోనిద్ర రిత్తనిద్రని ॥ మానక వదరెడి
జనా(వ)ళీ । మాటలు వీడి వేగ । నీ నిశ్చయమది
తోడ్పడి ॥ స్వానుభవం బంద పరము ।
సమకూరునయ్య – చిన్నభమంద –
విమలమగునయ్య – క్రమముగ ద్వం
ద్వము ॥ ఖండించి యా మీద । సమచూ
ట్కిలోనంటి । సౌభాగ్యమందుము ।
బొమల మధ్యను చూపు చెదరక ।
బూనియుండుము తత్పరంబగు సమర
సత్త్వ సమీక్షణంబున – శాశ్వతంబగు
బ్రహ్మమననము – సమకూరునయ్య –
చిన్నభమంద – విమలమగునయ్య ॥

– కందార్థ రత్నావళి 125 వ. కం॥

తా॥ అవస్థాత్రయ సాక్షియైన బ్రహ్మానుభవమునందు "నిద్రపూనగరాదు. నిద్ర మానగరాదు, నిద్రలోని నిజమగు విద్య భద్రముగా తెలిసినవాడె నిజమగు శివయోగి" అను రీతిన అఖండ ఎఱుక లేక కూటస్థ ఎఱుక నిర్ణయమును క్రమమును ఖండించి విడిపించెడి విధమున శాశ్వతత్వమైన బయలంటి సమర సత్వమును పరిపూర్ణ పరబ్రహ్మముగా నిలచి పరమగురు కరుణచే పోషించును అని భావము.

కం॥ సూటికి పైగను చూట్కిని - కూటస్థుని గాం
చు చక్తి కోటుల లోనన్ - నూటికి యొక
డుండును ము - మ్మాటిని గనిమించు
టెఱిగి - ముక్కొనువాడు - యోగ
సమాధి - రెక్కొనువాడు - గ్రక్కునమది
లోన - గండదై మిన్నంది - ముక్కు తుదమీరిన
మూలము పరమాత్మ - నిక్కి జూచెడు దృ
శ్యమున గురి - నెక్కొనంగను తన్మయం
బగు - దృక్కు బయలున తెలివి మర
చెడు - తేజమలవడ పూర్ణమున గురి -
ముక్కొనువాడు - యోగ సమాధి - రెక్కొనువాడు

- కందార్థ రత్నావళి 126 వ. కం॥

తా॥ త్రిపుటిని మీరియున్న సహజ నిర్వికల్ప సమాధి నిష్ఠుడైన గురు హృదయ మందైక్యత నందిన నూటిక ఒక్కడైనా సచ్ఛిష్యుడు కూటస్థ ఎఱుకను మీరి బయలందు లక్ష్యించి మూలమైన పరమాత్మానుభవమును సాక్షిగా చూచెడి యుక్తిని అనుభవ రూపమున పరిపూర్ణ సద్గురువుల కృపావిశేషమున పొందును.

అవస్థాత్రయసాక్షి

జీవుడు జాగత్స్వప్న సుషుప్తియను మూడు అవస్థలననుభవించుచుండును.

అవస్థాత్రయ నిరూపణ పటము

సంఖ్య	అవస్థ	స్థానము	వాక్కు	భోగము		గుణము	అభిమాని
1	జాగ్రత్	నేత్రము	వైఖరి	స్థూలము		సత్త్వము	విశ్వుడు
2	స్వప్నము	కంఠము	మధ్యమ	సూక్ష్మము	జ్ఞానశక్తి	రజస్సు	తైజసుడు
3	సుషుప్తి		పశ్యంతి	ఆనందము (కారణము)	ద్రవ్యశక్తి (ఇచ్ఛాశక్తి)	తమస్సు	ప్రాజ్ఞుడు

1) జాగ్రదవస్థ :

చతుర్దశేంద్రియములు, చతుర్దశేంద్రియాధి దేవతలు, చతుర్దశేంద్రియ విషయములు అనే 42 తత్త్వముల జాగ్రదవస్థయనబడును. ఇంద్రియములు అధ్యాత్మలు, దేవతలు, ఆధి దైవతములు, విషయములు ఆధి భౌతికములు. అధ్యాత్మ, అధి దైవ, అధి భూతములు మూడును జేరి త్రిపుటి యనబడును. వ్యష్టి జాగ్రదవస్థయందు గల స్థూల శరీరమును నేత్రస్థానములోనుండి అభిమానించు జ్ఞాతను విశ్వుడు, వ్యావహారికుడు, చిదాభానుడు అని యందురు.

సీ॥ పంచవింశతి తత్త్వ పరిపూర్ణమైనట్టి
స్థూల దేహమునందును సురచిరముగా ।
రస స్పర్శవలన రూప రసగంధ వచన
దాన గమనౌత్సర్జనానందములును ।
మానసాహంకార మతి చిత్తముల
గూడి జీవుండు ముఖమున జేరి నిలచి ।
విశ్వనామము జెంది వేర్వేర విభజించి
సకల వ్యాపారములో సలుపుచుండు ।
నదియు జాగ్రదవస్థయునను దినంబు ।
జనితమై జనుచుండును జన్మ రహిత
రమ్య గుణ ధామ భద్రాద్రి రామ
పరశు రామ నరసింహ్మదాస సంరక్షితాహ్వ ॥

తా॥ జీవుడు, పంచవింశతి తత్త్వాకమైన తనువును గూడి చతుర్దశేంద్రియ విషయములనుభవించుచు నేత్రస్థానమందు విశ్వుడనే పేర నిలచి, సకల వ్యవహారములు జేయుచుండును. ఇదియే జాగ్రదవస్థ.

(2) స్వప్నావస్థ : జాగ్రదవస్థయందు శ్రోత్రాదింద్రియములచే ననుభవించబడిన విషయ జ్ఞానముచే దోచునట్టి వాసన లేవియో, అవి సహస్రాంశమునుండు అంతకంటె సూక్ష్మముగా కంఠస్థానములో నుండి హి'తా'యనెడి నాడియందుండి, సకలేంద్రియ రాజైన మనస్సు చేత ననుభవించు యవస్థయే స్వప్నావస్థ. మరిన్నీ సంస్కార స్వరూపవాసన యొక్క శబ్దాది విషయములను, వాని యొక్క జ్ఞానమును అగు నీ ద్వివిధ స్వరూపములును యే నిద్రాకాలమందు కలుగుచున్నదో, దానిని స్వప్నావస్థయందురు. వ్యష్టి స్వప్నావస్థయందు గల సూక్ష్మ శరీరమును అభిమానించు జ్ఞాతను తైజసుడు, ప్రాతిభాసికుడు, స్వప్నకల్పితుడు అని యందురు.

సీ॥ శబ్దాది విషయపంచకము, వాగాది పంచక
మునీ పదియు నిచ్చటను నిల్పి ।
మానసాహంకార మతిచిత్తముల గూడి
సప్తదశ తత్త్వ సౌజ్ఞ సూక్ష్మ ।
దేహమందున, కంఠ దేశంబునను జేరి
నిలిచి, కొంచెము సేపు నిదురజెంది ।
జాగ్రతయందు తా జరిపినట్లుగ క్రియల్
జేసి, మేల్కొని చూడలేశమైన ।
లేదు గనుకను స్వప్నంబనాది పురుష ।
సత్యమిదిగాదు జనితమై జనుచునుండు
రమ్యగుణధామ భద్రాద్రి రామ
పరశురామ నరసింహ్మదాస సరంక్షితాహ్వ ॥

తా॥

(3) సుషుప్త్యావస్థ :

నిద్రయందుండి లేచి "నేనీదినమున యేదియు ఎరుంగను, సుఖముగా నిదురించితిని" అని నిద్రాకాలమందు అనుభవింపబడిన అజ్ఞాన స్మరణ స్వరూపమే సుషుప్త్యవస్థ (గాఢ నిద్రావస్థ)యనబడును. బుద్ధి మొదలగు చతుర్దశేంద్రియముల విలయావస్థయే సుషుప్త్యావస్థ. వ్యష్టి సుషుప్త్యావస్థయందు కారణ శరీరమును హృదయ స్థానమందుండి అభిమానించు జ్ఞాతను ప్రాజ్ఞుడు, పారమార్థికుడు, అపరిచ్ఛిన్నుడు అని యందురు.

సీ॥ కంఠ దేశమునహంకార చిత్తములుంచి
ధీమనంబులరెంట్ని దీసికొనియు ।
కారణ దేహ హృత్కమలమందునజేరి
యజ్ఞాన సన్నిధియందు నిలిచి ।
నది సుషుప్త్యనబడు మహిమీద
సర్వంబు బారిన స్మరణ దప్పి ।
యుంటి తుర్యంబటంచును యోగివరులు ।
చాటుచుందురు జనితమై జనుచునుండు ।
రమ్యగుణథామ భద్రాద్రి రామ
పరశురామ నరసింహ్మదాస సంరక్షితాహ్వ॥

తా॥ జీవుడు అహంకార చిత్తములను కంఠమందుంచి మనోబుద్ధుల దీసికొని కారణదేహము యొక్క హృత్కమలమందు జేరి, అజ్ఞాన సన్నిధియందు నిలిచి ప్రాజ్ఞుడనెడి పేరనుండును. ఇదియే సుషుప్త్యవస్థ.

జీవుడు మనోబుద్ధుల విడచి అవిద్యను గూడి లీనమై మూర్ధ్నమునందు ప్రత్యగాత్మయనే పేరను నిలిచియుండును. ఇదియే తుర్యావస్థ. శరీరముపై సర్పము బారినను, స్మృతి తప్పియుండును.

ఈ విధముగా యే యవస్థకాయవస్థ యందు సాక్షిగా విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడు, సర్వజీవులయందు జ్ఞాత ద్వారా అనుభవించుచున్నాడు. ఒకరి యవస్థయందు మరొకరికి అనుభవములో లేదు. ఈ మూడు అవస్థలను దెలిసికొనువాడు ఒక్కడు సాక్షిగానున్నవాడు. "నేను" అనువాడు. ఈ "నేను" అవస్థాత్రయ సాక్షియే కాక, జీవత్రయము మాయాకల్పితమని నెఱింగి వ్యష్టి సమిష్టిగా శరీరత్రయ విలక్షణుడై, అవస్థాత్రయ రహితుడై, సచ్చిదానంద స్వరూపమైన, ఆ బ్రహ్మమే 'నేనని' లక్ష్యార్థమున అక్షరమైయుండును. ఇట్లు

నిశ్చయజ్ఞానము కలవారు బ్రహ్మవేత్తలు.

ప్రథమాంక ముగింపు

సద్వర్తన గలిగిన జనులు శ్రీ గురు పాదకమలముల నాశ్రయించి తత్త్వ జ్ఞానము తప్ప యితరములను కోరని వారు శ్రీ గురుకరుణచే జిజ్ఞాసువులై ఆత్మ విచారణా క్రమము విషయముగా దెలిసికొని సచ్ఛిష్యులై ఆణవీ దీక్షయను ప్రథమ యుపదేశమును బొందెదరు.

గుర్వాజ్ఞానువర్తులై తగు పాటి సద్గురునన్వేషించి, వారి పాదపద్మముల నాశ్రయించి లక్ష్యమైన ప్రణవ విషయమును, సృష్టి వివరమును, శివ పంచాక్షరిని, చక్కగా నెఱుంగవలెను. అప్పటికి వారిలో దగిన వారలకు బ్రహ్మోపదేశమునకు యుత్సుకులైన వారిని సాధన చతుష్టయ సంపన్నులుగావించి, వారియందు చతుర్విధ శుశ్రూషల ద్వారా అంతర్ముఖ ప్రయాణమును సమావిష్టింపజేసి తమ బిడ్డలుగా, వాచ్యార్థ, లక్ష్యార్థ బోధాక్రమముగా, శరీరత్రయ విలక్షణత్వమును, పంచకోశ వ్యతిరిక్తమును, అవస్థాత్రయసాక్షిత్వమును గూర్చెదరు. ఆ రీతిన, అవగాహన పఱచుకొని జీవించవలెను.

అనుభవార్థమైన నిత్యానిత్యవస్తువివేకము, ఆత్మానాత్మ వివేకములను సదా సహజమై స్వభావమై జీవించు వారలకు ఆత్మసాక్షాత్కార జ్ఞానము సద్గురు కృపా విశేషమున సిద్ధము.

సర్వం సద్గురు చరణారవిందార్పణమస్తు

- ప్రథమాంకం సమాప్తి -

సర్వ వేదాంత శిరోభూషణము
శూన్యం - సర్వం, సర్వం - శూన్యం

ద్వితీయాంకము

గురుధ్యానము :

అర్పణ :

శ్లో॥ ఓం యత్ పాదపద్మ మకరంద జుషాం నరాణాం
సంసార ఘోర భుజగాన్న భవేత్స్మ భీతిః ।
సచ్చిద్ఘనం సకల సౌఖ్య లవాంబు రాశిం
శ్రీ దక్షిణాభిముఖమూర్తిమజంభజేஉహం ॥

తా॥ ఏ పాద పద్మాలలోని తేనెను ఆస్వాదించిన మానవులకు సంసారమనే భయంకరమైన సర్పం వల్ల భీతి లేకుండా పోతుందో అట్టి నిరవధిక సత్తు చిత్తు మూర్తి సకల ప్రాపంచిక సౌఖ్యాలు తనకు లవలేశమాత్రంగాయున్న ఆనంద సముద్రముయైన పుట్టుకలేని శ్రీ దక్షిణామూర్తిని ఆరాధిస్తాను.

అట్టి శ్రీదక్షిణామూర్తి యొక్క అంశలు యీ దిగువ పద్ధతిన దివ్య ప్రణాళికానుసారము యీ మహీ పీఠమును పరమగురువులై నడుపుచున్నారు.

పరశివము లేక - జన్మ రాహిత్యము (పరబయలు)
పరబయలు
అవతారుడు - విశ్వానుభవము (శూన్యం సర్వం - సర్వం శూన్యం)
విశ్వసద్గురువు - విశ్వాననుభవ ప్రవేశము
పూర్ణగురువు - దేశికులు (లేనెఱుక) (దృక్‌దృశ్య వివేకము)
సద్గురువు - బ్రహ్మానుభవము-జీవన్ముక్తి (కార్యకారణ వివేకము)
శ్రీ సద్గురువు - బ్రహ్మోపదేశము (సదసద్వివేదము)
గురువు - తత్త్వవిచారణ-ఆత్మ బోధ (ఆత్మానాత్మ వివేకము)
శ్రీగురువు - ఆణవీ దీక్ష (నిత్యానిత్యవస్తు వివేకము)

శ్లో॥ ఓం ఈశ్వరోగురురాత్మేతి మూర్తి భేద విభాగినే ।

వ్యోమవత్ వ్యాప్త దేహాయ దక్షిణామూర్తయే నమః ॥

తా॥ శ్రీ గురువు యొక్క అనుగ్రహము చేత ఆరంభింపబడిన నాలుగు దివ్యయానములు చైతన్య వ్యావర్తనముగా క్రమ పరిణామమున, అనేకులైన సత్పురుషులు, సద్గురువు యొక్క అనుగ్రహమున సాంగత్యముగా లభించెదరు. అట్టివారు అందరియందును, పరబ్రహ్మ స్వరూపమైన, పరశివ స్వరూపము వర్తించుచున్నది. అన్ని స్థాయిలలో, స్థితులలో ఆ పరశివమే, ఈశ్వరుడే గురు రూపమున ఆత్మగా, పరమాత్మగా, సర్వసాక్షిగా దెలియబడి అనుభవ సిద్ధమైన జీవన్ముక్తిని పరమగుర్వగ్రణియైన దక్షిణామూర్తి మౌనవ్యాఖ్యారూపమున అందించును. కడకు జన్మరాహిత్యమగును. ఇట్లు శూన్యముగానున్న అవ్యక్త సర్వము, మాయా సహితమైనందున వ్యక్తమై, భ్రమ నివారణ అయిన పిదప మౌనవ్యాఖ్య వలన మరల అవ్యక్తమై శూన్యమగుచున్నది.

శూన్యం - సర్వం, సర్వం- శూన్యంను గురుకృపా విశేషమున ఘటింపజేయు పరశివమునకు నమస్సులు.

శ్లో॥ లౌకికాద్ధర్మతో యాతి । జ్ఞానహీనోభవార్ణవే
జ్ఞాన భావేన యత్సర్వం । కర్మనిష్కర్మ సామ్యతి ॥
- సుజ్ఞానదీపం - 202 శ్లో॥

తా॥ జ్ఞానహీనుడగువాడు లౌకికాచారములతో సంసార సముద్రమునందు మునిగిపోవుచున్నాడు. జ్ఞానభావము చేత లోక సంబంధమగు సమస్తమును చేసియు చేయనివాడై కర్మ రహితమైన బ్రహ్మ స్వరూపమును బొందుచున్నాడు.

శ్లో॥ ఏకాకి నిస్పృహ శ్శాంత । శ్చింతాసూయావివర్జితః
బాల్య భావేనయో భాతి । బ్రహ్మజ్ఞానీన ఉచ్యతే ॥
- సుజ్ఞాన దీపం - 203 శ్లో॥

తా॥ ఏకాకిగానుండువాడును, ఇచ్ఛ లేనివాడును, శాంతిగలవాడును, రాగద్వేషాలు అసూయ మొదలైనవానిని విడచిన వాడై బాలభానుప్రభా భావముతో ఎవ్వడు ప్రకాశించుచున్నాడో అట్టివాడు పరబ్రహ్మము దెలిసిన వాడు అని చెప్పబడును.

శ్లో॥ నిత్యం బ్రహ్మరసం పీత్వా । తృప్తోయః పరమాత్మని
ఇంద్రంచ మన్యతే రంకం । నృపాణాం తత్ర కా కథా ॥
- సుజ్ఞాన దీపం - 204 శ్లో॥

తా॥ ఎవడు పరబ్రహ్మ రసమును పానము చేయుచు పరమాత్మ యందు తృప్తి పొందియుండునో వాడు త్రిలోకాధిపతియగు ఇంద్రుని, గవ్వ కూడ లేని దరిద్రునిగా దలంచుచున్నాడు. ఇక రాజుల యొక్క యానంద విషయకమగు వార్త మిక్కిలి స్వల్పమైన దగుచున్నది. దానిని గురించి చెప్పనే అక్కరలేదు.

శ్లో॥ సర్వజ్ఞ పదమిత్యాహ । ర్దేహీ సర్వమయోభువి
సదానందః సదాశాంతో । రమతే యత్ర కుత్రచిత్ ॥
- సుజ్ఞాన దీపిక - 209 శ్లో॥

తా॥ జీవుడు భూమియందు యెక్కడెక్కడ సదానందుడై సదా శాంతుడై, సమస్త స్వరూపుడు నై క్రీడించు చున్నాడో, దానినే సర్వజ్ఞత్వ పదమని బ్రహ్మవేత్తలు జెప్పిరి.

ప॥ సతతంబు లింగమే సరవిసత్తన మించె
చిత్తంగ మనగను చెలువు గాంచె
ఆత్మసంయోగమె ఆనందమనిపించె
నరయంగ సచ్చిదానందమయ్యె
విరచింప లింగమే వెలయ తత్పదమయ్యె
దనరంగ అంగమే త్వం పదంబు
నరయంగ సంయోగ మసి పదంబనుచును
రంగైన నాదంబె లింగమనుచు
బిందువనగను అంగంబు పెంపుగనియె
కళయు సంయోగమనుచును
అంగలింగాను సంయోగమనుట నిదియె
చిత్కళా ధామ శ్రీ గురు సిద్ధ రామ
- సిద్ధరామ శతకము

ప॥ బాలమత్త రీతి బలుపిశాచము భాతి ।
భావమందు భేదభావ మిడిచి ।

దిరుగు చుందురయ్యు గురువులు ధరలోన ।
అఖిల జీవసంగ । ఆత్మ లింగ ॥

– ఆత్మ లింగ శతకము

బ్రహ్మాజ్ఞానావళీ మాల

1. సకృచ్ఛ్రవణ మాత్రేణ బ్రహ్మాజ్ఞానం యతో భవేత్ ।
బ్రహ్మ జ్ఞానావళీ మాలా సర్వేషాం ముక్తి సిద్ధయే ॥

తా॥ ఒక్క పర్యాయము ఈ స్తోత్రము వినినంత మాత్రమున మానవునకు బ్రహ్మ జ్ఞానము కలుగగలదు గాన ఈ బ్రహ్మాజ్ఞానావళీ మాల సర్వులకు తప్పక మోక్షమును కలుగజేయగలదు.

2. అసంగోఽహమసం గోఽహం మసం గోఽహం పునః పునః
సచ్చిదానంద రూపోఽహ మహమేవాహ మవ్యయః ॥

తా॥ జీవాత్మ పరమాత్మలకు భేదము ఔపాధికము గాని వాస్తవము కాదని, ఆ భేద దృష్టి అజ్ఞాన ప్రయుక్తమని, అభేద దృష్టియే సంసృతి హేతువని, జీవపరులకు గల వాస్తవైకత్వ విజ్ఞానము ఆ అజ్ఞానమును వర్తింపజేయునని, భేద హేతువగు అజ్ఞానము తొలగిపోగా జీవునకు గల సహజమగు బ్రహ్మాభావము వ్యక్తమగునని, అదియే అనగా అభివ్యక్త బ్రహ్మాభావమే ముక్తియని ఉపనిషత్సారాంశము. ఈ స్తోత్రమున పరమాత్మ భేదము శారీరుడగు జీవునకు బహుముఖముగా వర్ణింపబడుచున్నది. ఏతత్స్తోత్రార్థము అసకృదనుసంధానము చేయబడినదో, అజ్ఞాన నివృత్తియు, బ్రహ్మాత్మత్వానుభూతియు కలుగగలవు.

నేను ముమ్మాటికి దృశ్య పదార్థములతో దేనితోను సంగము కలవాడను గాను. నేను సచ్చిదానంద స్వరూపుడను. 'అహంమేవాహం' అనగా నేను నేనే. గుణక్రియాది సర్వ విశేష రహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికారదూరుడను.

3. నిత్యశుద్ధ విముక్తోఽహం నిరాకారోఽహమవ్యయః
భూమానంద స్వరూపోఽహ మహమేవాహ మవ్యయః ॥

తా॥ నేను నిత్య శుద్ధుడను – నిత్య ముక్తుడను – నిరాకారుడను – నిరవధికానంద స్వరూపుడను – అహమేవాహం అనగా నేను నేనే; గుణక్రియాది సర్వ విశేషాది రహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికారదూరుడను.

4. నిత్యోఽహం నిరవద్యోఽహం నిరాకారోఽహ మక్షరః ।
పరమానంద రూపోఽహ మహమేవాఽహ మవ్యయః ॥

తా॥ నేను నిత్యుడను – దోష రహితుడను – నిరాకారుడను – నాశము నొందనివాడను – పరమానంద స్వరూపుడను – నేను నేనే – గుణక్రియాది సర్వవిశేష విరహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికార దూరుడను.

5. శుద్ధ చైతన్య రూపోఽహ మాత్మారామోఽహమేవచ
అఖండానంద రూపోఽహ మహమేవాఽహ మవ్యయః ॥

తా॥ నేను పరిశుద్ధమగు చైతన్యమే స్వరూపముగా గలవాడను. నేను నాయందు రమించుచుండు స్వభావము గలవాడను. అఖండానంద (అద్వితీయానంద) స్వరూపుడను. నేను నేనే. గుణక్రియాది సర్వ విశేష విరహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికార దూరుడను.

6. స్వయంప్రకాశరూపోఽహం చిన్మయోఽహం పరోఽస్మ్యహం ।
అద్వైతానన్ద రూపోఽహ హహమేవాఽహ మవ్యయః॥

తా॥ నేను స్వయంప్రకాశరూపుడను. చిన్మయుడను, పరుడను. అద్వైతానన్ద రూపుడను నేనే. నేను నేనే. గుణక్రియాది సర్వవిశేషాది రహితమగు కేవలాత్మ స్వరూపుడను వికారదూరుడను.

7. ప్రత్యక్చైతన్య రూపోఽహం శాంతోఽహం ప్రకృతేః పరం ।
శాశ్వతానందరూపోఽహ మహమేవాఽహ మవ్యయః ॥

తా॥ నేను సర్వాంతరమగు (పంచకోశములకును లోపలిదగు) చైతన్యమే స్వరూపముగా గలవాడను. శాంతస్వరూపుడను. ప్రకృతికి పరమైన అవ్వలి వాడను. సర్వకాల సర్వావస్థలయందును వ్యభిచరించకయుండు ఆనందము స్వరూపముగా గలవాడను. నేను నేనే. గుణక్రియాది సర్వ విశేష విరహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికారదూరుడను.

8. నానా రూపవ్యతీతోహ౽ం చిదాకారో౽హ మచ్యుతః ।

సుఖ రూప స్వరూపో౽హ మహమేవా౽హ మవ్యయః ॥

తా॥ నేను బహు విధములగు రూపములను అతిక్రమించిన వాడను - చిదాకారుడను - నాశమునొందనివాడను - ఆనందైక స్వరూపుడను. నేను నేనే. గుణక్రియాది సర్వ విశేష రహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికార దూరుడను.

9. మాయాతత్కార్య దేహాది ర్మమ నాస్త్యేవ సర్వదా ।

స్వప్రకాశైక రూపో౽హ మహమేవా౽హ మవ్యయః॥

తా॥ సర్వ ప్రపంచోపాసనయగు మాయ గాని, మాయా కార్యములగు దేహాదులు గాని నాకు ఎన్నడు లేనేలేవు. నేను స్వప్రకాశమాత్ర స్వరూపుడను. నేను నేనే. గుణక్రియాది సర్వ విశేష రహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికారదూరుడను.

10. గుణత్రయవ్యతీతో౽హం బ్రహ్మాదీనాం చ సాక్ష్యహమ్ ।

అనంతానంద రూపో౽హ మహమేవా౽హ మవ్యయః ॥

తా॥ నేను సత్వాది గుణత్రయమునతిక్రమించిన వాడను. సృష్ట్యాదికర్తలైన త్రిమూర్తులకును సాక్షిని. అపరిచ్ఛిన్నానంద స్వరూపుడను. నేను నేనే. గుణక్రియాది సర్వ విశేష రహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికార దూరుడను.

11. అన్తర్యామి స్వరూపో౽హం కూటస్థస్సర్వగో౽ స్మ్యహమ్

పరమాత్మ స్వరూపో౽హ మహమేవా౽హ మవ్యయః ॥

తా॥ నేను సర్వ ప్రాణుల హృద్దీపములనుండి వారిని ఆయా కర్మలయందు ప్రవర్తింపజేయు సర్వాంతర్యామి స్వరూపుడను. కూటస్థుడను (నిర్వికారుడను) సర్వవ్యాపకుడను. పరమాత్మ స్వరూపుడను. నేను నేనే. గుణక్రియాది సర్వవిశేష రహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికార దూరుడను.

12. నిష్కలో౽హం నిష్క్రియో౽హంస్స ర్వాత్మాచ స్సనాతనః ।

అపరోక్ష స్వరూపో౽హ మహమేవా౽హ మవ్యయః ॥

తా॥ నేను నిరవయవుడను - నిష్క్రియుడను - సర్వ స్వరూపుడను. జగముల ఉత్పత్తికి ముందుండువాడను - ఎల్లప్పుడును ఉండువాడను. అపరోక్ష (ప్రత్యక్ష) స్వరూపుడను. నేను నేనే. గుణక్రియాది సర్వ విశేష రహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికార దూరుడను.

13. ద్వంద్వాది సాక్షి రూపో౽హ మచలో౽యం సనాతనః ।

సర్వసాక్షి స్వరూపో౽హ మహమేవా౽హ మవ్యయః ॥

తా॥ నేను సుఖ దుఃఖ - శీతోష్ణ - జయాపజయాది సర్వద్వంద్వములకును సాక్షి స్వరూపుడను - చలించనివాడను. ఎల్లప్పుడును నుండువాడను, సర్వ వ్యవహార సాక్షి స్వరూపుడను. నేను నేనే. గుణక్రియాది సర్వవిశేష రహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికార దూరుడను.

14. ప్రజ్ఞాన ఘన ఏవా౽హం విజ్ఞాన ఘన ఏవచ

అకర్తా౽హ మభోక్తా౽హ మహమేవా౽హ మవ్యయః ॥

తా॥ నేను ప్రజ్ఞాన ఘనుడను-విజ్ఞాన ఘనుడను (జ్ఞానమాత్ర స్వరూపుడను) (ప్రజ్ఞాన విజ్ఞాన శబ్దములు భిన్నార్థకములు కావు. ఇట పునరుక్తి దోషావహము కాదు. పునఃపునరను సంధానము సమ్యగ్యోపకారి జ్ఞానము కాగలదు.) కర్తృత్వ భోక్తృత్వములు లేనివాడను. నేను నేనే. గుణక్రియాది సర్వ విశేష విరహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికార దూరుడను.

15. నిరాకార స్వరూపో౽హం సర్వధారో౽హ మేవచ

ఆప్తకామ స్వరూపో౽హ మహమేవా౽హమవ్యయః ॥

తా॥ నేను ఆకార రహితమైనవాడను, సర్వమునకు నేనే ఆధారము. నేను ఆప్త కామస్వరూపుడను. నేను నేనే. గుణక్రియాది సర్వ విశేష విరహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికార దూరుడను.

16. తాపత్రయ వినిర్ముక్తో౽హం, దేహత్రయ విలక్షణః

అవస్థాత్రయ సాక్ష్యస్మిచహమేవా౽హమవ్యయః ॥

తా॥ నేను ఆధ్యాత్మికములు ఆధి భౌతికములు, ఆధి దైవికములు అను త్రివిధములగు తాపములు లేనివాడను. స్థూలము, సూక్ష్మము, కారణము అను త్రివిధ దేహములకంటె వేరైనవాడను. జాగ్రత్స్వప్న సుషుప్తులను, అవస్థాత్రయము

నకు సాక్షిని. నేను నేనే. గుణక్రియాది సర్వవిశేష రహితమగు కేవలాత్మ స్వరూపుడను; వికారదూరుడను.

17. దృగ్దృశ్యౌ ద్వౌ పదార్థౌస్తః పరస్పర విలక్షణౌ ।

దృగ్బ్రహ్మ దృశ్యాం మాయేతి సర్వవేదాన్తడిండిమ ॥

తా॥ దృక్కు అని దృశ్యము అని రెండు పదార్థములు గలవు, అవి రెండును అన్యోన్య విలక్షణ స్వరూపములు గలవి. అందు దృక్కు (చూచునది) సర్వమును ప్రకాశింపజేయు ప్రకాశ స్వరూపము బ్రహ్మ. దృశ్యం (చూడబడునది) ప్రకాశింపజేయ బడునదంతయు మాయ, అని వేదాన్త శాస్త్రము అను డిండిమము (ఢక్క) ఉద్ఘోషించుచున్నది, అనగానిది సర్వవేదాన్త (సర్వోపనిషత్) సార సిద్ధాంతమని భావము.

18. అహం సాక్షీతియో విద్యా ద్వివిచ్యైవ పునః పునః ।

సఏవముక్తో విద్వాన్సఇతి వేదాన్త డిండిమః ॥

తా॥ దృగ్దృశ్య స్వరూపములను వేరువేరుగ తెలిసికొని మాయారూపమగు దృశ్యము నుండి పునః దృగ్వస్తువును వేరు పరచి పునః పునరభ్యాసము చేయుచు నేను స్వసాక్షియగు దృగ్వస్తువు అని (దృశ్య సంబంధము కలవాడను కానని) ఎవడు తెలిసికొనునో వాడే ముక్తుడు. వాడే సద్రూపమగు బ్రహ్మరూపుడు. అతడే ముఖ్యమైన విద్యా సంపత్తి కలవాడు, అని వేదాన్త శాస్త్ర ఘోష.

19. ఘటకుడ్యాదికం సర్వం మృత్తికామాత్రమేవహి ।

తద్వబ్రహ్మ జగత్సర్వ మితి వేదాంత డిండిమః ॥

తా॥ మృత్కారణకములైన కుండలు గోడలు మొదలుగునవియన్నియు (వానియందు మృత్తుకంటె వేరే వస్తువేదియును కాన్పించదు కనుక) మత్స్వరూపమే అని వేదాన్త శాస్త్రముద్ఘోషించుచున్నది.

20. బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నా పరః ।

అనేన వేద్యం సచ్ఛాస్త్రమితి వేదాన్త డిండిమః ॥

తా॥ బ్రహ్మ సత్యమైన (త్రికాలాబాధ్యమైన) వస్తువు. దృశ్యమగు జగత్తంతయు మిథ్య. (తాను లేకయే మరుభూములయందు ఉదకము కానవచ్చినట్లు కానవచ్చుచున్నది.) ద్రష్టయగు జీవుడు బ్రహ్మయే గాని అన్యుడు ఏ మాత్రము కాదు. బ్రహ్మ విషయకమగు శాస్త్ర సారమీ రీతిగా తెలిసికొనవలయును అని వేదాన్త శాస్త్రముద్ఘోషించుచున్నది.

21. అంతర్జ్యోతిర్బహిర్జ్యోతిః ప్రత్యగ్జ్యోతిః పరాత్పరః ।

జ్యోతిర్జ్యోతి స్స్వయంజ్యోతిరాత్మ జ్యోతిశ్శివోఽస్మ్యహమ్ ॥

తా॥ బుద్ధికి, ఇంద్రియాదులకు భాసకమై లోపల భాసించుచున్న జ్యోతిస్సును, వెలుపల సర్వ ప్రపంచ భాసకమై భాసించు జ్యోతిస్సును అనృతజడ దుః ఖాత్మకమగు ప్రపంచముకంటె విలక్షణమగు సత్యజ్ఞాన సుఖాత్మక జ్యోతిస్సును, భౌతికముగాని కేవల చిజ్జ్యోతిస్సును, స్వయప్రకాశమానమగు జ్యోతిస్సును, ఆత్మ స్వరూపమేయైన జ్యోతిస్సును అయియున్న శివతత్త్వమేది కలదో ఆ తత్త్వమే నేనయియుంటిని.

శ్రీ శంకరాచార్యకృత బ్రహ్మ జ్ఞానావళీ మాల సమాప్తము.

బ్రహ్మాండ పంచీకరణము

(సమిష్ఠి)

పిండాండమందు అంతరేంద్రియ, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ, ప్రాణేంద్రియములను, విషయములను వ్యవహరింపజేయుట వాని అధిష్ఠాన దేవతలే ఆధారము. కనుక బ్రహ్మాండమందలి అధిష్ఠాన దేవతలు, ఈశ్వరునికి ఇంద్రియములు. బ్రహ్మాండ పంచీకరణమందు గోళకములన్నియు తత్త్వములైన అధిష్ఠానదేవతలే. ఈశ్వర నిర్ణయ వ్యవహారమంతయు అధిష్ఠాన దేవతల దివ్యత్వమే. మరియు అశరీరముగానున్న స్థితులే.

ఆకాశపంచకము:

ఆకాశములో అర్ధాంశము గురుమూర్తికి గోళకమయ్యెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకలై ఒక పరక వాయువును గూడుకొని చంద్రునికి గోళకమయ్యెను. ఒక పరక అగ్నిని గూడి బృహస్పతికి గోళకమయ్యెను. ఒక

పరక జలమును గూడుకొని క్షేత్రజ్ఞునికి గోళకమయ్యెను. ఒక పరక పృథివిని గూడి రుద్రునికి గోళకమయ్యెను. ఈశ్వరునికివి అంతరేంద్రియములకు గోళకములు. గురుమూర్తి కూటస్థుని (జ్ఞాత) గాను , చంద్రుడు మనస్సుగాను, బృహస్పతి బుద్ధిగాను, క్షేత్రజ్ఞుడు చిత్తముగాను, రుద్రుడు అహంకారముగాను ఈశ్వరునికి అంతరేంద్రియములయ్యెను.

వాయు పంచకము :

వాయువులో అర్ధాంశము విశ్వయోనికి గోళకమయ్యెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకలై ఒక పరక ఆకాశమును గూడి జయునికి గోళకమయ్యెను. ఒక పరక అగ్నిని గూడి అజునికి గోళకమయ్యెను. ఒక పరక జలమును గూడి విశిష్ఠునికి గోళకమయ్యెను. ఒక పరక పృథివిని గూడి విశ్వకర్తకు గోళకమయ్యెను. ఈశ్వరునికివి పంచ ప్రాణములకు గోళకములు. విశ్వయోని వ్యానవాయువుగాను, జయుడు సమాన వాయువుగాను, అజుడు ఉదాన వాయువుగాను, విశిష్ఠుడు ప్రాణవాయువుగాను, విశ్వకర్త అపానవాయువుగాను ఈశ్వరునికి పంచప్రాణములయ్యెను.

అగ్ని పంచకము :

అగ్నిలో అర్ధాంశము సూర్యునికి గోళకమయ్యెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకలై ఒక పరక ఆకాశమును గూడి అష్ట దిక్కులకు గోళకమయ్యెను. ఒక పరక వాయువును గూడి వాయుదేవునికి గోళకమయ్యెను. ఒక పరక జలమును గూడి వరుణునికి గోళకమయ్యెను. ఒక పరక పృథివిని గూడి అశ్వినీ దేవతలకు గోళకమయ్యెను. ఇవి ఈశ్వరునికి జ్ఞానేంద్రియములకు గోళకములు. అష్టదిక్కులు శ్రోత్రముగాను, వాయుదేవుడు త్వక్కుగాను, సూర్యుడు చక్షువుగాను, వరుణుడు జిహ్వగాను, అశ్వినీ దేవతలు ఘ్రాణముగాను, ఈశ్వరునికి జ్ఞానేంద్రియములయ్యెను.

జలపంచకము :

జలములో అర్ధాంశము జ్ఞానశక్తికి గోళకమాయెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకలై ఒక పరక ఆకాశమును గూడి పరాశక్తికి గోళకమయ్యెను. ఒక పరక వాయువును గూడి ఇచ్ఛాశక్తికి గోళకమయ్యెను. ఒక పరక అగ్నిని గూడి ఆదిశక్తికి గోళకమయ్యెను. ఒక పరక పృథివిని గూడి క్రియాశక్తికి గోళకమయ్యెను. ఈశ్వరునికివి పంచతన్మాత్రల గోళకములు. పరాశక్తి శబ్దముగాను, ఇచ్ఛాశక్తి స్పర్శగాను, ఆదిశక్తి రూపముగాను, జ్ఞానశక్తి రసము గాను, క్రియాశక్తి గంధముగాను ఈశ్వరునికి పంచతన్మాత్రలయ్యెను.

పృథివి పంచకము :

పృథివిలో అర్ధాంశము మృత్యుదేవతకు గోళకమయ్యెను. తక్కిన అర్ధాంశము నాలుగు పరకలై ఒక పరక ఆకాశమును గూడి అగ్ని దేవునికి గోళకమయ్యెను. ఒక పరక వాయువును గూడి దేవేంద్రునికి గోళకమయ్యెను. ఒక పరక అగ్నిని గూడి ఉపేంద్రునికి గోళకమయ్యెను. ఒక పరక జలమును గూడి ప్రజాపతికి గోళకమయ్యెను. ఈశ్వరునికివి కర్మేంద్రియములకు గోళకములు. అగ్ని దేవుడు వాక్కు గాను, దేవేంద్రుడు పాణి గాను, ఉపేంద్రుడు పాదముగాను, ప్రజాపతి గుహ్యముగాను, మృత్యుదేవత పాయువుగాను ఈశ్వరునికి కర్మేంద్రియములయ్యెను.

పృథివి కదంబము :

పృథివిలో పృథివి గూడగా మృత్యుదేవత బుట్టెను. పృథివిలో జలము గూడగా క్రియాశక్తి అయ్యెను. పృథివిలో అగ్ని గూడగా అశ్వినీ దేవతలు అయ్యెను. పృథివిలో వాయువు గూడగా విశ్వకర్త అయ్యెను. పృథివిలో ఆకాశము గూడగా రుద్రుడు అయ్యెను.

జలకదంబము :

జలములో పృథివి గూడగా ప్రజాపతి అయ్యెను. జలములో జలము గూడగా జ్ఞానశక్తి అయ్యెను. జలములో అగ్ని గూడగా వరుణుడు అయ్యెను. జలములో వాయువు గూడగా విశిష్టుడు అయ్యెను. జలములో ఆకాశము గూడగా క్షేత్రజ్ఞుడు అయ్యెను.

అగ్ని కదంబము :

అగ్నిలో పృథివి గూడగా ఉపేంద్రుడు అయ్యెను. అగ్నిలో జలము గూడగా ఆదిశక్తి అయ్యెను. అగ్నిలో అగ్ని గూడగా సూర్యుడు అయ్యెను. అగ్నిలో

వాయువు గూడగా అజుడు అయ్యెను. అగ్నిలో ఆకాశము గూడగా బృహస్పతి అయ్యెను.

వాయుకదంబము :

వాయువులో పృథివి గూడగా దేవేంద్రుడు అయ్యెను. వాయువులో జలము గూడగా ఇచ్ఛాశక్తి అయ్యెను. వాయువులో అగ్ని గూడగా వాయుదేవుడు అయ్యెను. వాయువులో వాయువు గూడగా విశ్వయోని అయ్యెను. వాయువులో ఆకాశము గూడగా చంద్రుడు అయ్యెను.

ఆకాశ కదంబము :

ఆకాశములో పృథివి గూడగా అగ్ని దేవుడు అయ్యెను. ఆకాశములో జలము గూడగా పరాశక్తి అయ్యెను. ఆకాశములో అగ్ని గూడగ అష్టదిక్కులు అయ్యెను. ఆకాశములో వాయువు గూడగా జయుడు అయ్యెను. ఆకాశములో ఆకాశము గూడగా గురుమూర్తి అయ్యెను.

ఆకాశభూతస్తభకము :

ఈశ్వరుడనే గురుమూర్తి జయునితో గూడుకొని అష్టదిక్కుల ద్వారా పరాశక్తిని గుర్తెఱిగి అగ్నిదేవుని ద్వారా వచించుచున్నాడు.

వాయుతత్వ స్తబకము :

ఈశ్వరుడనే గురుమూర్తి చంద్రరూపమై విశ్వయోనిని గూడుకొని వాయుదేవుని ద్వారా ఇచ్ఛాశక్తిని గుర్తెఱిగి దేవేంద్రుని ద్వారా దాన ప్రతి గ్రహణము చేయుచున్నాడు.

అగ్ని తత్వ స్తబకము :

ఈశ్వరుడనే గురుమూర్తి బృహస్పతి రూపమై అజుని గూడుకొని సూర్యుని ద్వారా ఆదిశక్తిని గుర్తెఱిగి ఉపేంద్రుని ద్వారా గమనాగమనము చేయుచున్నాడు.

జలతత్వ స్తబకము :

ఈశ్వరుడనే గురుమూర్తి క్షేత్రజ్ఞ రూపమై విశిష్టుని గూడుకొని వరుణుని ద్వారా జ్ఞానశక్తిని గుర్తెఱిగి ప్రజాపతి ద్వారా ఆనందించుచున్నాడు.

పృథివి తత్వ స్తబకము :

ఈశ్వరుడనే గురుమూర్తి రుద్రరూపమై విశ్వకర్తను గూడుకొని అశ్వినీ దేవతల ద్వారా క్రియాశక్తిని గుర్తెఱిగి మృత్యు దేవత ద్వారా మలవిసర్జన చేయుచున్నాడు.

పృథివి పంచక లయము :

పృథివి యొక్క కఠినాంశములో ఆకాశము యొక్క బయలాంశము జేరగా అగ్నిహోత్రుడు లయము. పృథివి యొక్క కఠినాంశములో వాయువు యొక్క చలనాంశము జేరగా దేవేంద్రుడు లయము. పృథివి యొక్క కఠినాంశములో అగ్ని యొక్క తేజాంశము జేరగా ఉపేంద్రుడు లయము. పృథివి యొక్క కఠినాంశములో జలము యొక్క ద్రవాంశము జేరగా ప్రజాపతి లయము. పృథివనే నిండాంశములో మృత్యువనే అర్ధాంశము జేరగా మృత్యుదేవత లయము.

జలపంచకలయము :

జలము యొక్క ద్రవాంశములో ఆకాశము యొక్క బయలాంశము జేరగా పరాశక్తి లయము. జలము యొక్క ద్రవాశంములో వాయువు యొక్క చలనాంశము జేరగా ఇచ్ఛాశక్తి లయము. జలము యొక్క ద్రవాంశములో అగ్ని యొక్క తేజాంశము జేరగా ఆదిశక్తి లయము. జలము యొక్క ద్రవాంశములో పృథివి యొక్క కఠినాంశము జేరగా క్రియాశక్తి లయము. జలమను నిండాంశములో జ్ఞానశక్తియను అర్ధాంశము జేరగా జ్ఞానశక్తి లయము.

అగ్నిపంచక లయము :

అగ్ని యొక్క తేజాంశములో ఆకాశము యొక్క బయలాంశము జేరగా అష్టదిక్కులు లయము. అగ్ని యొక్క తేజాంశములో వాయువు యొక్క చలనాంశము జేరగా వాయుదేవుడు లయము. అగ్ని యొక్క తేజాంశములో జలము యొక్క ద్రవాంశము జేరగా వరుణుడు లయము. అగ్ని యొక్క తేజాంశములో పృథివి యొక్క కఠినాంశము జేరగా అశ్వినీ దేవతలు లయము. అగ్నియనే నిండాంశములో సూర్యుడనే అర్ధాంశము జేరగా సూర్యుడు లయము.

వాయుపంచక లయము :

వాయువు యొక్క చలనాంశములో ఆకాశము యొక్క బయలాంశము జేరగా జయుడు లయము. వాయువు యొక్క చలనాంశములో అగ్ని యొక్క

తేజాంశము జేరగా అజుడు లయము. వాయువు యొక్క చలనాంశములో జలము యొక్క ద్రవాంశము జేరగా విశిష్టుడు లయము. వాయువు యొక్క చలనాంశములో పృథివి యొక్క కఠినాంశము జేరగా విశ్వకర్త లయము. వాయువనే నిండాంశములో విశ్వయోని అనే అర్ధాంశము జేరగా విశ్వయోని లయము.

ఆకాశ పంచక లయము :

ఆకాశము యొక్క బయలాంశములో పృథివి యొక్క కఠినాంశము జేరగా రుద్రుడు లయము. ఆకాశము యొక్క బయలాంశములో జలము యొక్క ద్రవాంశము జేరగా క్షేత్రజ్ఞుడు లయము. ఆకాశము యొక్క బయలాంశములో అగ్ని యొక్క తేజాంశము జేరగా బృహస్పతి లయము. ఆకాశము యొక్క బయలాంశములో వాయువు యొక్క చలనాంశము జేరగా చంద్రుడు లయము. ఆకాశమనే నిండాంశములో గురుమూర్తియనే అర్ధాంశము జేరగా గురుమూర్తి లయము.

పంచ భూత లయము :

కఠినాంశము ద్రవాంశమందు, ద్రవాంశము తేజాంశమందు, తేజాంశము చలనాంశమందు, చలనాంశము బయలాంశమందు, బయలాంశము అహంకారమందు, అహంకారము మహత్తునందు, మహత్తు అవ్యక్తమందు, అవ్యక్తము నిర్గుణ పరబ్రహ్మయందు లయము.

మహావాక్య విచారణ

మహావాక్య విచారణకు ముందుగా అనుబంధ చతుష్టయము తెలియవలెను. అవి యేవనిన –

1) అధికారి – అనగా బ్రహ్మమునెఱుగుట

2) విషయము – అనగా జీవ బ్రహ్మైక్యము

3) సంబంధము – అనగా జీవునకు బ్రహ్మముతో గల సంబంధము తెలియుట

4) ప్రయోజనము – అనగా ఇతర విషయములందు గల ప్రయోజనమంతయు విడచి, ఆత్మానుభవమునే ప్రయోజనముగా కలిగియుండుట.

నాలుగు వేదముల నుండి నాలుగు మహావాక్యములు ప్రధానముగా పెద్దలు వివరించినారు.

1) ప్రజ్ఞానం బ్రహ్మ :

ఇది ఋగ్వేదమునందు, ఐతరేయోపనిషత్తులో చెప్పిన లక్షణ వాక్యము.

ప్రజ్ఞాన శబ్ధార్ధము :

శ్లో॥ యేనేక్షతే శ్రుణోతేదం జిఘ్రతి వ్యాకరోతిచ ।
స్వాద్వస్వాదూ విజానాతి తత్ప్రజ్ఞాన ముదీరితమ్ ॥

తా॥ నేత్రము ద్వారా బహిర్గతమై అంతఃకరణ వృత్తితో గూడినట్టి యే చైతన్యము చేత రూపాదులను పురుషుడు (జ్ఞాత) చూచుచున్నాడో, అట్లే శ్రోత్రము ద్వారా శబ్దములను వినుచున్నాడో, గంధము నాఘ్రాణించుచున్నాడో, శబ్ద సమూహముల నుచ్ఛరించుచూ వ్యవహరించుచున్నాడో, రుచి అరుచుల నెఱుగుచున్నాడో, ఆ చైతన్యమే ప్రజ్ఞానమని చెప్పబడుచున్నది.

విశేషార్ధము

శ్లో॥ ఆత్మ చైతన్య మాశ్రిత్యదేహేంద్రియ మనోధియః
స్వకీయార్థేషు వర్తనే సూర్యాలోకం యథాజనాః ॥

– ఆత్మ బోధ – 20వ శ్లో॥

తా॥ సూర్య ప్రకాశము నాశ్రయించి మనుజులు స్వకీయ కార్యముల నొనరించు రీతి, ఆత్మ చైతన్యము నాశ్రయించి, దేహేంద్రియాదులును తమ తమ సర్వ కర్మలయందును ప్రవర్తించుచున్నవి.

ఇచట చెప్పబడిన ప్రజ్ఞానము, యీ ఆత్మచైతన్యము సమానార్ధకములని గ్రహించదగినది.

బ్రహ్మశబ్దార్ధము :

శ్లో॥ చతుర్ముఖేంద్ర దేవేషు మనుష్యాశ్య గవాదిషు ।
చైతన్య మేకం బ్రహ్మాత్మః ప్రజ్ఞానం బ్రహ్మ మయ్యాపి ॥

తా॥ బ్రహ్మదేవుని యందును, ఇంద్రాది దేవతలయందును, మనుష్యుల యందును, అశ్వము, గోవు మొదలగువాని యందును గల ఒకటియైన చైతన్యమే. బ్రహ్మమగును. ఆ కారణము వలన నాయందు గల ప్రజ్ఞానమున్నూ బ్రహ్మమే యగును.

విశేషార్థము

శ్లో॥ సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।
వినస్తస్య వినశ్యన్తం యః పశ్యతి సపశ్యతి ॥
– భగవద్గీత 13 అ. 27వ శ్లో॥

తా॥ అనిత్యములగు సమస్త భూతములయందు, నిత్యుడైన పరమేశ్వరుడు వ్యాపించియున్నాడు. ఆ దేవదేవుని తనయందును గూడ చూచువాడు పరమాత్మను దర్శించిన వాడగును.

పూర్వోక్త బ్రహ్మ శబ్దము. యీ శ్లోకమున గల పరమేశ్వర శబ్దమున సర్వత్రా వ్యాపించి యుండుట యను ఒకే యర్థము గలవి యని దెలియదగినది.

ఈ మహావాక్యమందు ప్రజ్ఞ + బ్రహ్మ అను రెండు పదములు కలవు. ఈ పదములకు వాచ్యార్థము, లక్ష్యార్థము అని రెండు కలవు. అందు వాచ్యార్థమును విడచి, లక్ష్యార్థమును గ్రహించవలెను.

ప్రజ్ఞానమనగా ఏ జ్ఞానము అంతఃకరణాది వృత్తులతో గూడి, సకలేంద్రియముల ద్వారా సకల వ్యాపారము చేయుచున్నదో ఆ జ్ఞానమే ప్రజ్ఞానమని పేరు కల్గియున్నది. ఇక్కడ అంతఃకరణము, దాని వృత్తులు సకలేంద్రియములు (24) వాచ్యార్థములు. అనగా విచారణ పిదప విడువవలసినవి. అంతఃకరణకు వేరైన సాక్షి 25వది ఏది కలదో అది ప్రజ్ఞానము. అది ఈ పదమునకు లక్ష్యార్థము అయినది. కనుక దీనిని గ్రహించవలెను.

చీమ మొదలగు బ్రహ్మ వరకు సకల ప్రాణుల యందుండే అంతఃకరణ ప్రతిబింబ వృత్తులతో గూడిన ఇంద్రియ వ్యాపార జ్ఞానము సర్వ జన సాక్షాత్కారముగా ప్రత్యక్షమై ప్రకాశించుచున్నది. అట్టి ప్రత్యక్ష జ్ఞానమందు అంతః కరణమున్నూ, ఇంద్రియములున్నూ వాచ్యార్థములు.

ఏ జ్ఞానము నిరుపాధికమై, నిర్విషయమై, కేవలమై, స్వయం ప్రకాశము గలదై, నిత్యముగా యున్నదో అట్టి జ్ఞానము చీమ మొదలుకొని, బ్రహ్మ పర్యంతమూ, సాక్షాత్కారమగును. అంతటానున్న జ్ఞానము ఇట్లు ఏకత్వమును పొందియున్నది. అదియే సహజ సాక్షాత్కార జ్ఞానము. అది "ఏకం చైతన్యం, బ్రహ్మ చైతన్య మేకం బ్రహ్మ" అనే శ్రుతి ప్రకారము ఏకత్వము గలదియగుట వలన బ్రహ్మమని చెప్పబడుచున్నది. ఇచ్చోట చీమ మొదలుకొని బ్రహ్మ వరకు తోచే సకల శరీరములున్నూ, వాటి యింద్రియములున్నూ, వృత్తులున్నూ విడువవలసియున్నది. ఇవి వాచ్యార్థములు.

జ్ఞానము, బ్రహ్మము అనునవి పదములకు గల వాచ్యార్థములు త్రోసివైచి, ఉభయ పదములకు గల లక్ష్యార్థము ఏకం, చైతన్యం, బ్రహ్మము అని గ్రహించవలెను.

పై వాక్యమైన ప్రజ్ఞానం బ్రహ్మ యందు, జ్ఞానమే బ్రహ్మము అనియు, ఆ బ్రహ్మమే జ్ఞానమనియు, ఇట్లు బ్రహ్మము, జ్ఞానము రెండింటికి అభేద స్థితి చెప్పబడి యుండుట వలన, ఈ అర్థమును శిష్యుడు గ్రహించి, "అహం బ్రహ్మాస్మి" అనుచున్నాడు.

2) అహం బ్రహ్మాస్మి :

అహం శబ్దార్థము

ఇది యజుర్వేదమునందు బృహదారణ్యములోని అనుభవ వాక్యము.

శ్లో॥ పరిపూర్ణః పరాత్మాఽస్మిన్ దేహే విద్యాధికారిణి।
బుద్ధేస్సాక్షి తయా స్థిత్వా స్ఫురన్న హ మితీర్యతే ॥

దేశకాల వస్తువులచే అపరిచ్ఛిన్నమగు పరమాత్మ మాయా కల్పితమైన యీ ప్రపంచమందు శమాది షట్క సంపత్తితో జ్ఞాన సంపాదనకు యోగ్యమైనట్టి వేదాంత శ్రవణాద్యనుష్ఠానవంతమగు యీ మనుష్య శరీరమందు బుద్ధికి సాక్షిగా నిర్వికారముగా ప్రకాశిస్తూ, (లక్షణా వృత్తి చేత) "అహం" అనెడి పదముచే "నేను" అని చెప్పబడుచున్నాడు.

విశేషార్థము

శ్లో॥ దేహేంద్రియ మనోబుద్ధి ప్రకృతిభ్యో విలక్షణమ్ ।

తద్వృత్తి సాక్షిణం విద్యాదాత్మానం రాజవత్సదా ॥

తా॥ రాజసభయందు అమాత్యాదుల కంటె నెట్లు రాజు భిన్నుడై వారి కార్యములకు సాక్షియై యుండునో, దేహస్థుడగు ఆత్మయు అట్లే దేహేంద్రియాదుల కంటే విలక్షణుడై వాని యొక్క వృత్తులకు సాక్షియై యుండునని యెఱుంగవలెను.

ఈ రెండు శ్లోకముల యందుండు పరాత్మ, ఆత్మ శబ్దములు అహం శబ్దార్ధకములే యగును. కనుకనే యీ రెండింటికిని సాక్షిత్వము సమానముగా జెప్పబడినదని యెఱుంగవలెను.

బ్రహ్మశబ్దార్ధము :

శ్లో॥ స్వతః పూర్ణః పరాత్మాఽత్ర బ్రహ్మశబ్దేన వర్ణితః

స్వాభావికముగా అపరిచ్ఛిన్నుడగు పై శ్లోకమునందు చెప్పబడిన పరమాత్మ యీ మహావాక్యమునందు "బ్రహ్మ" అనెడి పదముచేత (లక్షణావృత్తి చేత) చెప్పబడుచున్నాడు.

విశేషార్ధము

శ్లో॥ సర్వగం సచ్చిదానందం జ్ఞానం చక్షుర్నిరీక్షతే ॥

– ఆత్మ బోధ 65వ శ్లో ॥

సర్వత్ర వ్యాపకమై సత్యజ్ఞానానంద స్వరూపమగు బ్రహ్మము జ్ఞాననేత్రునిచే దర్శింపబడుచున్నది. అనగా నిచట సర్వగ శబ్దముచే బ్రహ్మ స్వయముగా సర్వదా పూర్ణమైనదని చెప్పబడును. ఒకానొకనిచే నొకానొకప్పుడు బ్రహ్మ పూర్ణముగా జేయబడెనని జెప్పనలవి గాదు. మరియు, సచ్చిదానంద శబ్దము పరమాత్మను బోధించును.

"స్వతఃపూర్ణః పరాత్మా" అన్నను, "సర్వగం సచ్చిదానందం" అన్నను శుద్ధ బ్రహ్మమనియే అర్ధము. కనుకనివి ఏకార్ధకములని తెలియవలెను.

అస్మిశబ్దార్ధము :

శ్లో॥ అస్మీత్యైక్యపరామర్శస్తేన బ్రహ్మ భవామ్యహమ్ ।

అస్మి (అయితిని) అనెడి పదము ఏకత్వమును (జీవ బ్రహ్మైకత్వమును) దెలుపుచున్నది. అందుచేత 'అహం' (నేను) శబ్దమునకు వాచ్యార్ధములైన దేహాదులుగానున్ను, బ్రహ్మమునే యగుచున్నాను.

పై మహావాక్యము జీవబ్రహ్మల ఐక్యానుభవమును దెలుపుచున్నందున దీనికి అనుభవ వాక్యమను నామమేర్పడినది.

విశేషార్ధము :

శ్లో॥ జ్ఞాతృజ్ఞానజ్ఞేయ భేదః పరేనాత్మని విద్యతే ॥

– ఆత్మ బోధ – 41వ శ్లో॥

పరమాత్మయందు జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అను భేదము లేదు. కనుకనే అస్మి యను క్రియాపదముచే బుద్ధికి సాక్షిభూతమును, పరిపూర్ణ పరాత్మయు నగు అహం పద లక్ష్యార్ధమునకున్ను స్వతఃపూర్ణమును, పరమాత్మయు నగు బ్రహ్మపద లక్ష్యార్ధమునకున్ను అభేదము చెప్పబడినది. కనుక సాధకునిచే "తేన బ్రహ్మ భవామ్యహమ్" అని జీవబ్రహ్మైక్యమను భవింపబడును, అని గ్రహించవలెను.

అహం, బ్రహ్మ, అస్మి ఈ మూడు పదములకును ఒకటి నేను, రెండు పూర్ణం, మూడు అయితిని అని అర్ధము. అనగా నేను పూర్ణమై బ్రహ్మము నైతిని. పై వాక్యములో బ్రహ్మము అని యీ చెప్పబడిన వస్తువున్ను, పూర్ణం అని చెప్పబడినదీన్ని, ఈ రెండూ ఒక్కటియే. ఇప్పుడు ఆ పూర్ణము నీ యొక్క బుద్ధికి సాక్షి రూపముగానుండి ప్రకాశిస్తున్నది. అది నేను (అహం) అను పదమునకు అర్ధము కలుగుచున్నది. ఇక్కడ జ్ఞాతయు, తత్త్వములు (24) వాచ్యార్ధములు, కాన విడువదగినవి. బ్రహ్మాండ సాక్షి రూపమగు యీ కూటస్థుడు అనెడి జ్ఞానము నేను అను పదమునకు లక్ష్యార్ధము. సర్వమునకూ ఉపాదాన కారణము. ఇంకనూ బ్రహ్మ అను పదమునకు అర్ధము – స్వతః తనకు తానే పరిపూర్ణుడైన కూటస్థుడు. ఈ రెండవ వాక్యమందు బ్రహ్మ అను పదము లక్ష్యార్ధము. ఇందుకు అనంతముగా తోచుచున్న సృష్టి అయిన 24 తత్వములతో కూడినదంతయు విడవదగిన వాచ్యార్ధము.

బ్రహ్మాండమునకు వెలుపల, లోపల అను భేదము లేక తనకు తానే పరిపూర్ణమైన కూటస్థుడు, యిక్కడ బ్రహ్మ పదమునకు లక్ష్యార్ధము. అనగా

ఆజ్ఞా చక్రం నుంచి బ్రహ్మరంధ్రం వరకు తురీయా కూటమి అందురు. ఇది చంద్ర లోకము. ఇక్కడ చంద్రుడు నిత్యకళా యుక్తుడు. ఇతనికి వృద్ధిక్షయా లుండవు. ఆజ్ఞాచక్రం వరకే సూర్యచంద్రుల గతులు (పగలు, రాత్రి) ఉండును. తరువాతది జ్యోత్స్న లోకము.

ఆ బ్రహ్మము అనగా నేనుకు అర్థము, సాక్షిత్వము. బ్రహ్మమునకు లక్ష్యార్థము స్వతః స్వయం ప్రకాశము - ఆపోజ్యోతి. "అంతర్జ్యోతి, బహిర్జ్యోతి, ప్రత్యక్ జ్యోతి, పరాత్పర, అని బ్రహ్మ జ్ఞానావాళీమాల ఉపదేశించుచున్నది.

బ్రహ్మాది శబ్దాలకు అర్థం, వివరణ తెలిసికొని, స్వరూపాన్ని తన సహస్రారంలో ప్రకాశించే సాక్షి అని భావించి, అదే తన నిజమైన రూపము అని తెలుసుకున్న వారే జీవన్ముక్తులు, స్వరూప వేత్తలు అని చెప్పబడినది.

విమర్శ - 1) నేను, 2) బ్రహ్మము అను రెండు పదములకు వాచ్యార్థములైన బ్రహ్మాండమున్నూ, బుద్ధి రూపమైన జ్ఞాతయున్నూ - ఇవి రెండున్నూ వదలితే పై చెప్పిన లక్ష్యార్థ కూటస్థ స్వరూపమైన "నేను" అనే సాక్షిత్వ జ్ఞానమునకున్నూ, బ్రహ్మ పదమునకున్నూ గల ఏకత్వము "అస్మి" తెలుపుచున్నది. కనుక "అయితిని" అను పదమునకు గల లక్ష్యార్థము నిర్విశేష, నిర్వికల్ప, నిరంజనమగు కూటస్థము అని గ్రహించవలెను.

మరియు నేను, బ్రహ్మం అనే రెండు పదములకు ఏకత్వమును నిరూపించుచున్నది. అస్మి అనగా అయితిని ద్వారా ఇది ఏకత్వమగుచ్నుది. కనుక నేను బ్రహ్మమేననుట స్పష్టమైనది.

3) తత్త్వమసి

తత్‌శబ్దార్థము :

ఇది సామవేదమందు, చాందోగ్యోపనిషత్తులో చెప్పిన ఉపదేశ వాక్యము.

శ్లో॥ ఏకమేవా ద్వితీయం సన్నామరూప వివర్జితమ్ ।
సృష్టేః పురఽధునాఽప్యస్య తాదృక్త్వం తదితీర్యతే ॥

సృష్టికి పూర్వము నామరూపములు లేనిదియు, రెండవది లేనట్టిదియు, ఏకము నగు యే సద్వస్తువు ప్రతిపాదించబడినదో, యిప్పుడునూ అనగా సృష్ట్యుత్తర కాలమందును, విచార దృష్టిచే ఆ సద్వస్తువు యొక్క స్వభావమే "తత్" అనెడి పదము చేత (లక్షణావృత్తిచే) చెప్పబడుచున్నది.

విశేషార్థము

శ్లో॥ వేదాంతవాక్య సంవేద్య విశ్వాతీతాక్షరాద్వయమ్ ।
విశుద్ధం యత్స్వ సంవేద్యం లక్ష్యార్థ స్తత్పద స్యచ ॥

- తత్త్వోపదేశః - 25వ శ్లో॥

వేదాంత వాక్యములచే బాగుగా నెఱుగదగినది. ప్రపంచాతీతమైనది, నాశ రహితమైనది. అద్వైతమైనది, పరిశుద్ధమైనది, స్వయంప్రకాశమైనదియును, ఏదియో అదియే తత్పదమునకు లక్ష్యార్థమగును.

పూర్వోక్త తాత్పర్యము గలదిగానే "వేదాంతవాక్య" ఇత్యాది శ్లోకములందును తత్పదలక్ష్యార్థము బోధింపబడియున్నదని యెఱుంగవలెను.

'త్వం' శబ్దార్థము :

శ్లో॥ శ్రోతుర్దేహేంద్రియాతీతం వస్త్వత్రత్వం పదేరితమ్ ।
ఏకతాగ్రాహ్యతేఽ సీతితదైక్య మనుభూయతామ్ ॥

ముముక్షువు యొక్క దేహేంద్రియములకు అతీతమై స్థూలాది శరీరత్రయము కంటె విలక్షణమైన ఆత్మ స్వయంప్రకాశముగా జ్ఞానరూపమైనది. కనుకనే జడములగు దేహేంద్రియాదులకు సాక్షియై ప్రకాశించుచున్నది. ఈ యాత్మయే 'త్వం' పద లక్ష్యార్థమని చెప్పబడినది.

విశేషార్థము

శ్లో॥ దేహేన్ద్రియాది సాక్షీ యస్తేభ్యో భాతి విలక్షణః ।
స్వయం బోధ స్వరూపత్వాల్లక్ష్యార్థ స్త్వంపదస్యసః

- తత్త్వపదేశః 24వ శ్లో॥

ఆత్మ స్వయముగా జ్ఞాన స్వరూపమైనది. కనుకనే జడములగు దేహేంద్రియాదుల కంటె అది విలక్షణమైనది. అందుచేతనే ఆ దేహాదులకు

సాక్షియై ప్రకాశించుచున్నది. ఈ యాత్మయే 'త్వం' పద లక్ష్యార్థమని చెప్పబడును.

'అసి' శబ్దార్థము

శ్లో॥ ఏకతాగ్రాహ్యతేఽసీతి తదైక్యమను భూయతామ్ ॥

'అసి' అను పదము తత్పద, త్వంపద లక్ష్యార్థముల యొక్క ఐక్యమును ఉపదేశించుచున్నది. ఆ ఏకత్వమును ముముక్షువులనుభవించుదురు గాక! ఈ మహావాక్యమును శ్రీ గురుదేవుడు శిష్యునకు బోధించుటచే నిది ఉపదేశ వాక్యమనబడుచున్నది.

1) తత్ – అది, 2) త్వం – నీవు, 3) అసి – అయితివి అనగా అది నీవైతివి. తత్ – అది అనగా ఈ దృశ్య ప్రతీయమాన సృష్టి అంతా లేనిది కనుక అద్వితీయ అపరిచ్ఛిన్న బ్రహ్మమే అయి ఉన్నది. కాబట్టి తత్ – అను పదమునకు సృష్టికి పూర్వమందున్న అద్వితీయ బ్రహ్మమే లక్ష్యార్థము.

ఆయా సృష్టి కార్యమైన పంచ మహా భూతములున్నూ నామ రూపాత్మకమైన జగత్తున్నూ, సృష్టికర్తయైన బ్రహ్మమున్నూ, పోషక కర్తయైన విష్ణువున్నూ, లయకర్తయైన రుద్రుడున్నూ మొదలుగా గల అధిష్ఠాన దేవతలతోనున్న వ్యవహారము లన్నియూ విడువతగిన వాచ్యార్థములు అయి ఉన్నవి.

తత్ – అది అను పదమునకు ఒక్కటైన అద్వితీయ పరమాత్మ లక్ష్యార్థము. త్వం – నీవు అను పదమునకు దేహత్రయములు, అవస్థాత్రయములు, అన్నమయాది పంచకోశములు, కించిదజ్ఞత్వము మొదలైనవి, ఇందుకు మూలమైన అవిద్య, ఇదంతయు విడువదగిన వాచ్యార్థము.

ఇక లక్ష్యార్థము అనగా దేహత్రయములకు విలక్షణము, అవస్థాత్రయ ములకు సాక్షి. పంచకోశములకు వేరైనది అయిన సచ్చిదానంద స్వరూపమగు ప్రత్యగాత్మ. త్వం – నీవు అను పదమునకు లక్ష్యార్థము.

అది, నీవు అను ఉభయ పదములకు గల వాచ్యార్థములు విడచిపెట్టి, పై జెప్పిన ప్రకారము ఉభయ లక్ష్యార్థములకును గల ఏకత్వము, మూడవది అయిన అసి – అయితిని అను పదము యొక్క లక్ష్యార్థమగును. అనగా "నీవు అద్వితీయ బ్రహ్మమే" అని అర్థము.

దృష్టాంతము : 24 తత్వములకు వేరైనవాడు అవిద్యా ప్రతిబింబుడైన 25వ వాడు జీవుడు. 26వది చైతన్యము. 27వ వాడు చైతన్య రూపుడైన ఈశ్వరుడు. 28వవాడు ప్రత్యగాత్మ. 29వది యీ 28 తత్త్వములకు సర్వసాక్షి అయిన కూటస్థుడు (పరమాత్మ). 30వది జ్ఞాత కూటస్థుల యొక్క ఐక్య రూపమే అద్వితీయ బ్రహ్మము; అనగా 28, 29 తత్త్వముల ఐక్యము, ఈ అసి పదమునకు లక్ష్యార్థమగును.

ఇంకనూ జ్ఞాత ఘటాకాశము వంటివాడు. పరమాత్మ మహాకాశము వంటివాడు. ఇక్కడ ఘటము వలెనే ఉపాధులను తీసివేయగా, ఘటాకాశ –మహాకాశమను పేర్లు విడచి, ఒక్కటైన ఆకాశము అని అర్థము గ్రహించినట్లు జ్ఞాత–కూటస్థుల యొక్క ఉపాధులైన వ్యష్టి సమిష్టి రూపములైన జీవ జగత్తులు తీసివేయగా, మిగిలిన అద్వితీయ బ్రహ్మము ఒక్కటై పరబ్రహ్మమై, అపోజ్యోతియై ప్రకాశించుచున్నది. అదియే లక్ష్యార్థమైన పరబ్రహ్మము.

తత్వమసి అనగా "అదిన్నీ, అది నీవు" అను పదములకు అర్థము సంపూర్ణ లక్ష్యార్థము. అట్టి స్వరూపము ఆకాశము వలె ఆత్మ–బ్రహ్మ సర్వ వ్యాపకమై ఆద్యంతములు లేనిదై అంతటనూ నిండియున్నదని, పరమని గ్రహించవలెను.

4. అయమాత్మా బ్రహ్మ

ఇది అధర్వణ వేదమునందు మాండూక్యోపనిషత్తులో చెప్పబడిన సాక్షాత్కార వాక్యము.

అయంశబ్దార్థము

శ్లో॥ స్వప్రకాశాపరోక్షత్వమయ మిత్యుక్తితో మతమ్ ।

అయం అను యీ పదము చేత ఆత్మ స్వయంప్రకాశము, అపరోక్షము అని చెప్పబడినది.

విశేషార్థము

శ్లో॥ స్వప్రకాశోఽయ మాత్మాచ హ్యపరోక్ష ఇతి శ్రుతః ॥

ఈ యాత్మ స్వయం ప్రకాశము, అపరోక్షము అని వేదములచే చెప్పబడినది. కనుక 'అయం' అను 'ఇదం' శబ్దార్థము విస్పష్టముగా జెప్పబడినది.

ఆత్మ శబ్దార్థము

శ్లో॥ అహంకారాది దేహాన్తా ప్రత్యగాత్మేతి గీయతే ।

అహంకారము మొదలు స్థూల దేహ పర్యంతము గల అనాత్మ పదార్థముల కంటె (అధిష్ఠాన సాక్షిత్వముల చేత) వేరుగా నుండుటచే నియ్యది ప్రత్యగాత్మయని చెప్పబడును.

విశేషార్థము

శ్లో॥ ఇంద్రియాణి పరాణ్యాహుః ఇన్ద్రియేభ్యః పరంమనః ।
మనసన్తు పరాబుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః ।

– భగవద్గీత 3 అ. 42వ శ్లో॥

దేహముకంటె కర్మేంద్రియములు, వానికంటె జ్ఞానేంద్రియములు, వానికంటె మనస్సు, దానికంటె బుద్ధి, ఆ బుద్ధి కంటె ఆత్మ శ్రేష్ఠము లేక విలక్షణమైనది. కనుక అహంకారాది సమస్తమైన అనాత్మ పదార్థముల కంటె కూటస్థుడైన ఆత్మ విలక్షుణుడని భగవద్గీతయందు ప్రతిపాదించబడినది.

బ్రహ్మ శబ్దార్థము

శ్లో॥ దృశ్యమానస్య సర్వస్య జగతస్తత్త్వమీర్యతే ।
బ్రహ్మ శబ్దేన తద్బ్రహ్మ స్వప్రకాశాత్మ రూపకమ్ ॥

కనుపించుచున్న సకల ప్రపంచమునకు అధిష్ఠానమైనట్టియు, పారమార్థికమైనట్టియు, యే సచ్చిదానంద రూపము గలదో, తద్రూపము బ్రహ్మ శబ్దముచే చెప్పబడుచున్నది. ఆ బ్రహ్మము స్వయంప్రకాశము, అపరోక్షమునగు కూటస్థ స్వరూపమే అనగా ప్రత్యగాత్మయే బ్రహ్మము అని బోధించుచున్నది.

విశేషార్థము

శ్లో॥ గృహ్యమానే ఘటే యద్వన్మృత్తికా భాతి వై బలాత్ ।
వీక్ష్యమానే ప్రపంచేఽపి బ్రహ్మైవాఽఽభాతి భాసురమ్ ॥

– అపరోక్షానుభూతి

ఘటమనగానేమి? అని విచారణ బుద్ధితో గ్రహింపబడినట్లైన మట్టియే యెట్లు తప్పక తెలియబడునో, అట్లే ప్రపంచమనగానేమి? అని సూక్ష్మ దృష్టితో పరికించి చూచిన బ్రహ్మమే ప్రకాశించును గాని, యన్యము గోచరించదు. అనగా మట్టియందు కంబు గ్రీవాదికారము, ఘటము యను నామమునూ కల్పితములు. కనుక విచారశీలురకు ఘటము యొక్క సత్యము మట్టియేయని నిశ్చయమగును మరియు రజ్జువునందు పొడవు, సన్నములుకల రూపమున్ను, సర్పము అను నామము ఆరోపితములు. ఇది భ్రాంతిచే భాసించును. దీపమును ఆశ్రయించి చూచినచో భ్రాంతి దొలగి రూపనామములు మటుమాయమై సర్పము యొక్క యథార్థము రజ్జువని తేటతెల్లమగును. ఇట్లే బ్రహ్మమునందు దేవమనుష్య పశుపక్ష్యాదుల రూపనామమగు సమస్త ప్రపంచము అజ్ఞానముచే కల్పితమై నానా విధములుగా భాసించుచున్నది. కనుక సాధన చతుష్టయ సంపత్తియను అధికారమును సంపాదించి, శ్రవణ, మనన, నిధి ధ్యాసముల దృఢముగా నొనర్చిన వారికి రూపనామ భావము తిరోహితమై ప్రపంచము యొక్క పరమార్థము సచ్చిదానందస్వరూప నిర్గుణ పరబ్రహ్మమే యని సంశయ విపర్యయ రహితమగు జీవబ్రహ్మైక్య సాక్షాత్కారము దృఢముగా గల్గును. ఇచట నిదియే (జీవ బ్రహ్మైక్యమే) బ్రహ్మశబ్దార్థము. ఈ బ్రహ్మము స్వప్రకాశము, అపరోక్షమునగు కూటస్థ స్వరూపమే. ఇసుమంతయు భేదములేదు, అని "స్వప్రకాశాత్మరూపకం" అను దానిని బోధించును.

1)అయం – ఈ, 2) ఆత్మ – స్వరూపం, 3) బ్రహ్మ – పరిపూర్ణ స్వప్రకాశం

అయమాత్మాబ్రహ్మ – ఈ స్వప్రకాశ ఆత్మే సర్వ జగత్ప్రకాశమైన బ్రహ్మము అని అర్థము.

అయం ఆత్మా అను పదము వలన యీ స్వప్రకాశ ఆత్మను "నేను" అని అర్థము చెప్పబడుచున్నది. "ఈ" అనగా ఇంద్రియములకు గోచరమగు ఘటమును (సృష్టిని) ఉద్దేశించి, అందు, కనబడని ఆత్మ గురించి, అయం ఆత్మా – ఈ ఆత్మ అనగా అట్టి బుద్ధికి సాక్షియైన ఆత్మకు బ్రహ్మమయమైన స్వప్రకాశాత్మకు గల సంబంధము, అనగా ఆత్మ యొక్క "అపరోక్ష సాక్షాత్కారానుభవము" అని గ్రహించవలెను.

బ్రహ్మము – స్వప్రకాశము. ఇందులో ముఖ్యార్థము, స్వప్రకాశాత్మయే సర్వ సృష్టికి ప్రకాశమైన బ్రహ్మమని అర్థము.

ఇక్కడ బ్రహ్మమునకు, నేనుకు, రెండింటికిని కూటస్థుడైన స్వప్రకాశాత్మ వలన ఏకత్వము చెప్పబడినది. ఇప్పుడు అయం, ఆత్మ, బ్రహ్మ అను మూడు పదములకు వాచ్యార్థము చెప్పబడుచున్నది. ఆ ఆత్మ, జ్ఞాత మొదలు స్థూల దేహము వరకు ప్రత్యగాత్మయని, స్వయం ప్రకాశమని చెప్పబడుచున్నది.

ఇక్కడ జ్ఞాత మొదలు గోటికొన వరకు గల శరీరేంద్రియాది సంఘాత మంతయు విడువవలసిన వాచ్యార్థమే యగును. జ్ఞాత – కూటస్థుడు వలెనూ, ఇక్కడ ఆత్మకు, బ్రహ్మమునకు – రెండింటికి స్వప్రకాశత్వము చేత ఏకత్వము సిద్ధించును. అందువల్ల, ఆ పూర్ణమైన బ్రహ్మము స్వప్రకాశము గల ఈ ప్రత్యగాత్మయై యున్నది. కనుక "ఈ" అను పదము ఆత్మకు స్వప్రకాశ లక్ష్యార్థము దృఢాపరోక్ష బ్రహ్మ – కూటస్థ జ్ఞానము గలది అగునని నిశ్చయింపవలెను.

ఇంకనూ, ఇక్కడ బ్రహ్మ అను పదమునకు సర్వ సృష్టిని విడువదగినది. ఇది వాచ్యార్థము, సర్వ సృష్టి ప్రకాశమైన స్వప్రకాశ–కూటస్థమొక్కటే బ్రహ్మపదమునకు లక్షార్థము అగుట వలన, దీనిని గ్రహించవలెను.

స్వప్రకాశము చేత ఆత్మ బ్రహ్మములకు కలిగిన ఏకత్వమును అయమాత్మా బ్రహ్మయను సాక్షాత్కార వాక్యము వలన కలిగినటువంటి అపరోక్ష సాక్షాత్కారము అనుభవమై యున్నది. అనగా ఆ స్వప్రకాశ బ్రహ్మమే, కూటస్థమైనపుడు ఈ స్వప్రకాశ ప్రత్యగాత్మ అనియు, ఇట్లు కలిగిన ఏకత్వము ముఖ్యార్థము అనుభవార్థముగా గ్రహించవలెను.

ఇంతవరకు "సర్వము" అయిన భగవంతుని స్థితి నుండి తత్ ప్రతిబింబ మాయ, సృష్టి కలిగిన విధము, "ఓం నమశ్శివాయ" మహామంత్రము వలన ఏర్పడిన సృష్టి యందు "సర్వము" అయిన బ్రహ్మమును తెలియుటకు గాను, శరీరత్రయ విలక్షణత్వమును, అవస్థాత్రయ సాక్షిత్వమును, పంచకోశ వ్యతిరిక్తమును అయిన స్వప్రకాశ ఆత్మను తెలిసికొనుట గురించి చెప్పబడినది. పిమ్మట మహా వాక్య విచారణకు అధికారి యగుటయు చెప్పబడినది. ఇట్టి అధికారికి సద్గురువుచే (1) విధి వాక్యమైన "ప్రజ్ఞానం బ్రహ్మ" (2) అనుభవ వాక్యమైన "అహం బ్రహ్మోస్మి", (3) ఉపదేశ వాక్యమైన "తత్వమసి" (4) సాక్షాత్కార వాక్యమైన "అయమాత్మా బ్రహ్మ" అను నాలుగు మహా వాక్యములు బోధించబడినవి.

ఈ విధముగా వాచ్యార్థములైన జగత్తు, శరీరములను విడిచిపెట్టి, లక్ష్యార్థమైన స్వప్రకాశాత్మయైన ప్రత్యగాత్మకు, జ్ఞాతకు, జగత్ప్రకాశమైన బ్రహ్మకు కూటస్థము ఏకత్వము గలదని అపరోక్ష సాక్షాత్కారము కలిగించుటకు అధికారియైన సచ్ఛిష్యునికి సద్గురుమూర్తి కరుణ వలన మాత్రమే సాధ్యమని తెలుపబడినది.

మహావాక్యములు (సారాంశము)

సామాన్యముగా వేదవాక్యవిచారణ త్రివిధమైయుండును. అది విధి వాక్య, నిషేధ వాక్య, సిద్ధా బోధక వాక్యములని చెప్పబడును. యజ్ఞాదులు చేయమనుట మొదలుగునవి విధి వాక్యములు. సురాపానాదులను జేయరాదనుట నిషేధ వాక్యములు. విధి శూన్యముగా బ్రహ్మాత్మైక్య రూప వస్తు మాత్రము బోధించుట సిద్ధా బోధక వాక్యములు. నాలుగు వేదములలో ప్రతిపాదించబడిన ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మోస్మి, తత్వమసి, అయమాత్మ బ్రహ్మ యనునవి సిద్ధా బోధక వాక్యములు. ముఖ్యమైన తత్వమసియను మహావాక్యమునకు తత్, త్వం, అసి యనెడి పదత్రయము. వాటియందు శివ, జీవ తదుభయైక్యమనెడిదే క్రమముగా అర్థత్రయమగును. మరియు పదార్థ వాక్యార్థములకు సమానాది కరణ్య సంబంధ, విశేషణ, విశేష్య సంబంధ, లక్ష్య లక్షణ సంబంధములే క్రమముగా సంబంధ త్రయమగును. పదార్థములకు వాచ్యార్థ లక్ష్యార్థములు అను అర్ధ ద్వయముండును. వాటియందు పూర్వోక్త స్థూలాది తనుత్రయ సమిష్టి రూపమైన విరాట్, హిరణ్య గర్భ, ఈశ్వరులును బ్రహ్మయందు కూడి "తప్తాయః పిండము" వలె ఏకాకారముగ చూచుటయే తత్పదమునకు వాచ్యార్థమని, ముఖ్యార్థమని, అభిధానార్థమని చెప్పబడును. మరియు తనుత్రయ వ్యష్టిరూపమైన విశ్వ, తైజస, ప్రాజ్ఞులను వారలును ప్రత్యగాత్మను గూడి "తప్తాయః పిండము" వలె ఏకమై దెలియుటె త్వం పదమునకు వాచ్యార్థమని, ముఖ్యార్థమని, అభిదానార్థమని

యొప్పును. మరియు విరాట్పురుషాదులను పృధక్కరించిన నిరుపాధిక బ్రహ్మమే తత్పద లక్ష్యార్థమని, శోధిత తత్పదార్థమని చెప్పబడును. పిదప విశ్వాది జీవత్రయములను పృధక్కరించిన నిరుపాధిక ప్రత్యగాత్మయే త్వంపద లక్ష్యార్థమని, శోధిత త్వం పదార్థమని చెప్పబడును.

లక్షణ త్రయము :

(1) జహర్లక్షణ (2) అజహల్లక్షణ, (3) జహద జహర్లక్షణము అని మూడు విధములు. (1) గంగాయాం ఘోషః, (2) ప్రతి వసతి కుంతాః, (3) ప్రవిశంతి సోయం దేవదత్తః అనునవి ఉదాహరణములు. వీటియందు 1) గంగా శబ్దము తనకు ప్రవాహరూపమైన ముఖ్యార్థము.ఘోషము అను గొల్లపల్లెకు అవకాశత్వము ఘటించదు. కావున వాచ్యార్థమును విడచి, తీరమును లక్ష్యించును. 2) కుంత శబ్దము తన ముఖ్యార్థమును విడువకనే కుంతధారులైన పురుషులను లక్ష్యించును. 3) సః అను శబ్దము భూతకాల దేశ వయో విశిష్టుండైన దేవదత్తుని గూర్చి జెప్పును. అయం అను శబ్దము వర్తమానకాల దేశ వయో విశిష్టుండగు దేవదత్తుని చెప్పును. ఇట్లు ఉభయ విరుద్ధ పదార్థములకు ఐక్యత్వమును ఘటించును. ఇట్లు విరుద్ధాంశలు విడచి, లక్ష్యార్థమైన సమానాంశలు గ్రహించవలెను.

తత్వమసి అను వాక్యమునందు తత్ యను పదమే వాచ్యార్థమైన సర్వజ్ఞత్వాదులతో కూడిన సద్గుణ విశిష్టుండైన అపరోక్ష బ్రహ్మమును చెప్పుచుండును. త్వం అను పదమే వాచ్యార్థమైన కించిదజ్ఞత్వాదులతో కూడిన హీన గుణ విశిష్టుడైన పరోక్ష జీవుని చెప్పుచుండును. ఇట్లు ఉభయ విరుద్ధ ధర్మములు గల పదార్థములకేకత్వము లభించదు. కావున ఉభయ పదార్థగత పరోక్షత్వ అపరోక్షత్వాది విరుద్ధ ధర్మాంశములను విడచి, అవిరుద్ధ చైతన్య మాత్రమైన లక్ష్యార్థమనెడి బ్రహ్మ కూటస్థులను స్వీకరించిన, అదే ఇదియని, ఇదే అదియని యీ విధముగా తాదాత్మ్యమును ఘటింపుచుండును. అసి అను పదము ఉభయ లక్ష్యార్థములయందున్న అపరోక్షత్వాదులు అవిద్యాకల్పితములని బోధింపుచు సఫలమగునట్లు నిర్ణయించిన ఆత్మునికి అఖండైకరస బోధ మాత్రమే సిద్ధమనుట వాక్యార్థమగును. ఘటాద్యుపాదులను “నేతి”, “నేతి” (ఇది కాదిది కాదు) అని నిషేధించి యొక్కయేయనినట్లు, మనుజత్వమును విడచి, నీవే ఈశ్వరుడనిన రీతి “తత్వమసి” అను మహావాక్యమునందు ప్రత్యగాత్మ పరమాత్మల ఏకత్వమును గ్రహించవలెను.

ఈ విధముగా నాల్గు మహావాక్యముల విచారణమును చేసి, యద్దానిని మనన నిధి ధ్యాసగ అభ్యాసము జేసి, అనుభవమును పొందవలెను.

బ్రహ్మానుభవము

శ్లో॥ నామరూపాభిమానస్స్యాత్ సంసారః సర్వదేహినామ్ ।
సచ్చిదానంద దృష్టిస్స్యాత్ ముక్తిర్వేదాంత డిండిమః ॥
– వేదాంత డిండిమము

తా॥ సమస్త జీవులకును దేహాత్మ బుద్ధియే బంధముగాను, సచ్చిదానంద దృష్టియే మోక్షముగాను యున్నది. నామరూపాత్మకమగు యీ దేహమే “నేననెడి” భావమే జీవులకెల్లరకును జననమరణాదిరూప సంసారమగును. “ఈ దేహము నేను కాదు. సచ్చిత్సుఖరూపమగు ఆత్మనే నేను”, అనెడి యీ దృష్టియే “జీవన్ముక్తి” అగును. ఆత్మ దృష్టి గలిగినగాని, దేహము నేననెడి బుద్ధి శిథిలముగాదు. దేహాదులను తననుగా తలంచుటయే బంధము. ఈ తలంపు దొలగిపోవుటయే మోక్షము. అన్యమైన దానియందు అహంబుద్ధి తోపకుండుటే ముక్తి.

శ్లో॥ సచ్చిదానంద సత్యత్వే మిథ్యాత్వే నామరూపయోః ।
విజ్ఞానతే కిమిదం జ్ఞేయం ఇతి వేదాంత డిండిమః ॥
– వేదాంత డిండిమము

తా॥ సచ్చిదానంద స్వరూపమగు నాత్మ సత్యముగా నుండుటయు, నామరూపములు మిథ్యగానుండుటయు కనిపెట్టినచో ఇంకనూ దెలిసికొనవలసినది యేమీ లేదు. అది యెట్లన, అన్ని ఘటములయందున్నది మృత్తికయే, అన్ని వస్త్రముల యందున్నది దూదియే, సర్వమానవుల ఉపాధుల యందున్నది రక్త మాంసాదులే. అట్లే సమస్త ప్రపంచమును బరిశీలించి విచారించిన ప్రపంచమే యుండదు. సర్వవ్యాపక, అంతర్యామి యగు సచ్చిదానంద రూపమగు ఒక్క ఆత్మ మాత్రమే

యుండును. ఇతరముండదు. కావున జగత్తు మిథ్య, "పరమాత్మ అస్థిత్వమే ఏకం, నిత్యం, సత్యం".

శ్లో॥ యథా స్వప్న ప్రపంచోఽయం మయి మాయా విజృంభితః ।
తథా జాగ్రత్ప్రపంచోఽయం మయి మాయా విజృంభితః ॥

తా॥ స్వప్న ప్రపంచము యెట్లో, జాగ్రత్ప్రపంచము గూడ అట్లే నాయందు మాయగానే ప్రకటమైనది. ఆత్మను దెలిసికొనిన అంతయు తెలిసినట్లే.

శ్లో॥ సాలంబనం నిరాలంబం సర్వాలంబావలంబితమ్ ।
ఆలంబే నాఖిలాలంబం ఇతి వేదాంత డిండిమః ॥

తా॥ ఆశ్రయముగలది (దృశ్యవర్గము) సర్వాధిష్ఠానమగు నిరాలంబ తత్త్వముగా నున్నది. ఎట్లన, ఆశ్రయముగా నుండుట చేత ఆ తత్త్వము, ఆశ్రయించుకొను అన్నింటి చేత ఆశ్రయముగా జేసికొనబడియున్నది. అనగా నామరూపాత్మకమగు దృశ్యము స్వతఃగానే ఆధారము లేక యుండజాలదు. నిరపేక్షముగా, నేది యుండగలదోయది బ్రహ్మము. కనుక ఆత్మగానుండుటయే స్థిరత్వమగును. మరియొకటి స్థిరత్వము కానేరదు. బుద్ధి, వృత్తుల సంధులలో యే నిరాలంబ తత్త్వము వెలుగొందుచున్నదో యది పూర్వబుద్ధి వృత్తికి చివరయగుచ్నుది. కలుగబోవు బుద్ధి వృత్తులకు అదే మొదలగుచున్నది.

శ్లో॥ నకుర్యాత్ న విజానీయాత్ సర్వం బ్రహ్మేత్యనుస్మరన్ ।
యథా సుఖం తథా తిష్ఠేత్ ఇతి వేదాంత డిండిమః ॥

తా॥ సర్వమున్నూ బ్రహ్మ మాత్రమేయని ధ్యానించుచు యేమియు చేయక అన్యమేమియు భావింపక సుఖముగా నుండవలెను. ముముక్షువు అత్యావశ్యక మగు దేహనిర్వహణాది రూపమగు దానికంటె భిన్నమైన చేష్టను విడచిపెట్టి ఆత్మ సుఖమునకు ఆటంకము గలుగని విధముగా సదా మెలగ వలెను. తత్త్వవిదుడు తనవలె సమస్తమును గూడ బ్రహ్మమునుగానే స్మరించుచు, యేమియు చేయక బ్రహ్మభిన్న భావన రానీయక మునియై ఆత్మ సుఖమున కాటంకము గలుగని విధమున నుండును. ఇది ఆరూఢుడైన జీవన్ముక్తుని పరమగు అర్థము. "నిరాలంబమగు నాత్మతత్త్వమునే స్మరించుచు, దుఃఖరహితుడవై, నిశ్చింతుడవై సుఖముగా నుండుము" అని శ్రుతి వాక్యము.

ఆత్మ దృష్టియందు ఈ జగత్తు మిథ్య. దీనికి ఉనికియే లేదు. అదంతయూ మాయ. ఈ జగత్తు జన్మించుట మరణించుట, యీ అసంఖ్యాక జీవులుత్పన్న మగుట, అంతరించుట, ఇవన్నీయూ స్వప్న సంఘటనలు. జీవాత్మ యనునదే లేదు. ఇక అనేక జీవాత్మలెట్లుండును? కలదొకటే అఖండ పరిపూర్ణము. ఒకే సూర్యుడు అనేక జలాశయములలో ప్రతిఫలించిన అనేకుడుగా గనుపించిననూ, కోటానుకోట్ల జలబిందువులందు కోటానుకోట్ల సూర్యబింబములు ప్రతిఫలించి ననూ, అందన్నియూ పరిపూర్ణ సూర్యబింబములే అయ్యెను. కనుక కలదొకే బింబమైనట్లు, జీవాత్మలన్నియు వేర్వేరు మానసములందు దీపించు ప్రతిఫలరూపములు. ఈ విభిన్న మానసములన్నియు వివిధ జలబిందువుల వలె ఆ ఒక్క వస్తువునే ప్రతిబింబించుచుండును. ఈ విభిన్న జీవ రూపములలో ఆ ఒక్క భగవంతుడే ప్రతిఫలించుచున్నాడు. దీనికి మార్పు లేదు, రాదు. దానిని అర్థముజేసికొనలేని జీవులను మాయకు వశులైనవారనే చెప్పవలెను. స్వప్నము కూడా ఒక సత్యవస్తువుమీదే ఆధారపడియుండవలెను. ఆధారవస్తువు లేనిచో ఆధేయము నిలువజాలదు. మూలాధార పదార్థమునుండియే ఆధేయ వస్తుజాలమంతయూ ఆవిర్భవించినట్లు గోచరించుచున్నది. ఆ మూలాధారమే ఈశ్వరుడు. అతడే భగవంతుడు. అతడే పూర్ణుడు. అదే మనస్సుగా, జీవునిగా, దేహముగా, ఆత్మగా, స్వప్న మాతృనిగా తోచియున్నట్లు అజ్ఞాన సంబంధ భావన. సత్యదృష్టికి లోకమంతా సచ్చిదానంద స్వరూపమే. స్వప్న దృశ్యములు కలుగుటకునూ, విలీనమగుటకునూ మూలము మనస్సే. ఆ స్వప్నావస్థలో అది నిజమని తలంచి రోదన, ఆహ్లాదము, భయము, విచారము పొందుచున్నాము. మెలకువయైన వెంటనేయవన్నియు అసత్యమని దెలిసి చింతించకున్నాము. అటులనే జగత్తు స్వప్నతుల్యము. అంతా ఈశ్వరుని నుండియే కలిగి, దిరిగి ఈశ్వరుని యందేలయమగుచ్నుది. ఈ జన్మలు, పునర్జన్మలు, రాకపోకలు అన్నియు మాయాకల్పితములు; భ్రాంతి, అసత్యము. యదార్థముగా నీవు పరిపూర్ణుడవు. నీవే ఈశ్వరుడవు. ఈ జ్ఞానానుభూతినొందిన వారికి ఈ జగత్తులో జీవ బ్రహ్మైక్య సిద్ధి గలుగును.

తన్ను తాను విచారించుకొనుట మోక్షమార్గమని అనేకమంది పెద్దలు చెప్పుదురు. కాని యీ విషయమునకు తాను స్వతంత్రముగా చూచుకొనిన అదే ఆత్మ; అదే నేను. నేను, ఆత్మ వేరు కాదు. ఆత్మ, పరమాత్మ వేరు కాదు. ఈ నేను, నేను అను దారములు ఉపాధి భేదముచే వేరయి ఆత్మ అను ఒక వస్త్రము నుండియే అనేక అసత్యనేనులుగా తోచును. కాని, అన్ని నేనులలో నున్నది చెక్కుచెదరక యేకంగా ఉన్న ప్రత్తియే పరమాత్మ. పరమాత్మయను ప్రత్తిలేనిచో నేను అను దారముండదు. నేనను దారము లేనిచో ఆత్మయను వస్త్రముండదు. తుదకు యీ మూడు రూపక్రియలు త్రిమూర్తి స్వరూపమే. ప్రత్తియను పరమాత్మ అవిభాజ్య యేకాత్మ; దివ్యాత్మ.

శ్లో॥ జీవాత్మ పరమాత్మైక్యావస్థా త్రిపుటి రహితా ।
పరమానంద స్వరూపా శుద్ధ చైతన్యాత్మికా సమాధి ః ॥

తా॥ జీవాత్మ పరమాత్మలకైక్యమును జేయవలెను. నేను అనెడిదియే జీవాత్మ. తాను అనెడిదియే పరమాత్మ. ఈ జీవాత్మ పరమాత్మలకైక్యమగుచో సాక్షిత్వము కూడా పోయి పరబ్రహ్మమందైక్యమగును. వాచాజ్ఞానముగా కాక, అనుభవ జ్ఞానము గలిగియుండవలయును.

శ్లో॥ ఊర్ధ్వ శూన్యమధః శూన్యం మధ్యశూన్యం యదాత్మకమ్ ।
సర్వశూన్యం తదాత్మేతి సమాధిస్తస్య లక్షణమ్ ॥
ఊర్ధ్వ పూర్ణమధః పూర్ణం మధ్యపూర్ణం యదాత్మకమ్ ।
సర్వపూర్ణం తదాత్మేతి సమాధిస్తస్యలక్షణమ్ ॥

తా॥ పైనను, క్రిందను, నలు ప్రక్కలను, దృగ్గోచరమగు పదార్థమంతయు నశించునదనియు, ఎచట ఏ వంక జూచినను అంతటా ఆత్మ స్వరూపమే నిండి నిబిడీకృతమైయున్నదని భావించుటయే సమాధి లక్షణము. తనకంటె అన్యము లేదని భావించి సమస్తము తన స్వరూపమేయని తలంచగా, సాక్షిత్వము కూడా పోయి పరబ్రహ్మమందైక్యమగును. ఈ మార్గములో దప్ప వేరు మార్గమున ముక్తి లేదు.

శ్లో॥ తయోరేషసగ్ం స్తావోయ ఏషోన్తర్హృదయ ఆకాశః ॥
– బృహదారణ్యకోపనిషత్.

తా॥ అంతర్హృదయమందలి చిదాకాశమే జీవేశ్వరులనెడి స్త్రీ పురుషులకు సంయోగ స్థానము. అట్టి స్థానమందే రమించి, సుఖము ననుభవించ వలెను గాని, అన్యమైన (స్త్రీల) అనాత్మ విషయముల మీద కోరిక విడువవలెను.

సచ్చిదానందము

సత్ = నశించక అన్ని కాలములయందుండునది.

చిత్ = స్వప్రకాశజ్ఞాన స్వరూపమగునది.

ఆనందము = నిరంతరము అవిచ్ఛిన్న సుఖమునే యిచ్చునది.

ఇట్టి లక్షణమగు పరబ్రహ్మమును అనుసంధానము చేయుటవలననే ఎడతెగని సుఖము కలుగును. కట్టెయందు నిప్పువలెనే, పుష్పములయందు వాసనవలెనే, పాలయందు నేయివలెనే, సమస్త భూతములయందు ఆత్మ స్వప్రకాశముగానున్నది.

శ్లో॥ మన ఏవ జగత్సర్వం మన ఏవ మహారిపుః
మన ఏవ హి సంసారో మన ఏవ జగత్రయమ్ ॥
– ఋభుగీత 2 అ. 3 శ్లో॥

తా॥ మనస్సే సర్వ ప్రపంచము, మహా శత్రువు, మహా సంసారము, లోకత్రయంబగును. మనస్సుచే సర్వము గల్పింపబడును, పరిపాలింపబడును, స్మరింపబడును. కనుక మనస్సే సంసార కారణమైయ్యుంది. దీనివలననే దుఃఖము, పాపములు, సంకల్పము, జీవుడు, చిత్తము, అహంకారము, మహాబంధము, అంతఃకరణ, పంచభూతములు, తన్మాత్రలు, విషయములు, కోశములు, అవస్థాత్రయములు కలిగెను. కావున ప్రపంచమంతయూ మనోవికారమే గాని సత్యము గాదు.

"అన్నం బ్రహ్మేతి వ్యజానాత్"
"ప్రాణో బ్రహ్మేతి వ్యజానాత్"
"మనో బ్రహ్మేతి వ్యజానాత్"

"విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్"
"ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్"

– తైత్తిరీయోపనిషత్

తా॥ అన్నము, ప్రాణము, మనస్సు, విజ్ఞానము, ఆనందము బ్రహ్మ స్వరూపమని దెలిసికొనవలెను. ఇట్లు తెలిసినవాడే ముక్తుడు.

శ్లో॥ అకార్య కార్య వకీర్ణేస్తేనో భ్రూణహా గురు కల్పనః
వరుణోపామఘ ఘర్షణస్తస్మాత్పాపాత్ప్ర ముచ్యతే ॥

– తైత్తిరీయోపనిషత్

తా॥ సద్గురు ప్రసాద తీర్థమనెడు బ్రహ్మానంద సముద్రమునందు స్నానము చేసిన ముక్తి కలుగును కాని, కాశీ, రామేశ్వరములు దిరిగినంత మాత్రమున ముక్తి రాదు. స్వర్గలోకమునకు మీదుగా పరమాకాశమునందుండెడి మోక్షపదము కర్మ చేతను, సంతానము చేతను, ధనము చేతను బొందదగినది కాదు. మనస్సన్యాసము చేతనే పొందదగినది.

మరియు సత్యవాక్పరిపాలన వల్లనే ముక్తియనియు, తపస్సుచేతనే ముక్తియనియు, అంతరింద్రియ నిగ్రహము చేతనే ముక్తియనియు, అట్లే దానము వలన, ధర్మము వలన, బ్రహ్మచర్యనియమము వలన, వైశ్వ దేవము మొదలుగా గల కర్మల చేతను ముక్తియని పలు తెఱంగుల జనులు చెప్పుచున్నారు. పై దేని వలననూ ముక్తి గానము. కేవలము పరబ్రహ్మమందు లీనమైనగాని ముక్తి లేదు.

మహాకర్త, మహాత్యాగి, మహాభోక్తయను యీ మూడింటి చేతనే బుద్ధి విశ్రాంతి పొందగలదు.

మహాకర్త : జననమరణ వార్ధక్యముల యందు సుఖదుఃఖముల జెందక యుండువాడును, జాగ్రత్స్వప్న సుషుప్తవ్యస్థలు లేనివాడును, దృక్దృశ్యముల భేదభావము లేనివాడును, సత్యాసత్యములు, ధర్మాధర్మములు, ప్రియాప్రియములు అనెడి భేదములు లేనివాడును, అహంభావము, మాత్సర్యములు లేనివాడును, సమస్తమునకు సాక్షియగువాడును, మహాకర్తయని చెప్పబడును.

మహాత్యాగి : ఏ కోరికయు లేనివాడును, సంకల్ప రహితుడును, మహాకర్తయగు వాడును, మహాత్యాగియని చెప్పబడును.

మహాభోక్త : కోరిక లేక, ప్రారబ్ధవశమున నేవేళకేది లభించినను, సమభావముతో నుండువాడును, కలిమి లేములయందు సమభావము గలవాడు, రుచులన్నిటిని సమముగా జూచి బ్రహ్మానందముతో భుజియించువాడును, బూడిదను చక్కెరను సమముగా చూచువాడును మహాకర్తయనియు, మహాత్యాగియనియు, మహాభోక్తయని చెప్పబడును.

కం॥ సమభావననెందు విరో
ధము వడయక కోర్కెలెల్లదా వీడ్కొని ప్రా
ప్తము ననుభవించునెవ్వం
డమలమతీ । యతడె పో మహాభోక్త ధరన్ ।

బ్రహ్మవేత్తలు

మోక్షము ఆగంతుకమా లేక స్వాభావికమా? మోక్షమనగానేమి? బంధము లేకపోవుటయా? బంధము ఎప్పటినుండి వచ్చినది? ఈ సందేహమునకు జవాబుగా సృష్టిలోనికి వస్తే కదా బంధము అనినచో సృష్టికి పూర్వమున్నదేదో అదే మోక్షమని చెప్పవలెను. సృష్టి జాలములో పడుటే బంధము. సృష్టి పూర్వమున్న ఆత్మ, త్రికాలా బాధ్యమైనది, కనుక మోక్షము, లేక ఆత్మ స్థానము, స్వాభావికమే గాని ఆగంతుకము కాదు. అయితే సృష్టికి కారణమైన వస్తువును బంధమనవలెను. మోక్షమనరాదు. లేదా, ఆ సృష్టికి కారణ వస్తువు లేని స్థితియేదో దానిని మోక్షమనవచ్చునా? లేదా? పరిపూర్ణ బ్రహ్మమునందు సృష్టి కారణమగు వస్తువు పుట్టనే లేదు; కనుక బంధమూ లేదు; మోక్షమూ లేదు; రెండూ మిథ్య; మోక్షమును ఆగంతుకమని అనరాదు మరియు స్వాభావికమని కూడా అనరాదు.

కనుక బంధమోక్షములు రెండూ భ్రాంతి రూపములే. అందుకే కృష్ణదేశికుల వారు "రోసితి మోక్షా దృపేక్ష" అని అన్నారు.

బ్రహ్మమునను భవించుటలో సాధకుడు అధిగమించే స్థితులీక్రింది విధముగానున్నవి.

1) బ్రహ్మవిదుడు, 2) బ్రహ్మవిద్వరుడు, 3) బ్రహ్మవిద్వరీయుడు, 4) బ్రహ్మవిద్వరిష్ఠుడు. ఈ నల్గురును జీవన్ముక్తులే. కర్మలచే పుణ్యలోకములు కలుగును అని భ్రాంతి యిందెవ్వరికినియుండదు. ఆకాశము అన్నిటిలో కలిసియున్నట్లున్నను, దేనితోనూ కలియక అసంగమై యున్న విధముగానే ప్రాపంచికులతో కలిసియున్ననూ వీరెట్టి సంగము లేకనే వర్తించుచుందురు. అంత్యమున వీరందరును విదేహముక్తి బొందుదురు.

(1) బ్రహ్మవిదుడు : లోక సంగ్రహార్ధము అనగా తాను ఏ పనులు చేయకున్నచో తనను జూచి, లోకులు చెడుదురని, వర్ణాశ్రమాచార ధర్మములను యథావిధిగా నిర్వర్తించుచుండును, కాని అసంగముగా పాటించుచుండును. ఆ కర్మలచే, తన బ్రహ్మ నిష్ఠ చెడునే యని భీతి జెందదు. చేసిన కర్మ ఫలములను బ్రహ్మార్పణము జేయుచుండును. జీవనోపాధి వరకే వృత్తియందుండి భుక్తి క్రియ నిర్వర్తించుచుండును. యదృచ్ఛ లాభ సంతుష్టి గలిగి ప్రారబ్ధరీత్యా కలుగు సుఖ దుఃఖములకు తాను విలక్షణుడై ఖేదమోదములు లేక నిత్యసంతుష్టుడై యుండును.

కర్మఫల త్యాగియై నిత్యనైమిత్తి కర్మలను విధిగా జరుపును. యదృచ్ఛాలాభసంతుష్టియును, నిరహంకారమును సర్వభూత దయాళుత్వమును గలిగి ఆత్మారాముండును, ఆత్మ తృప్తుండునై అరిషడ్వర్గంబులు లేక మానావమానములు శత్రుమిత్రులనెడు బేధములు లేక సంచరించువాడును, గుణాతీతుడును, కుమ్మరి పురుగువలె అంటియుండక యుండువాడును బ్రహ్మవేత్తయని చెప్పబడును. అగ్నిచే కాలిన పత్రము, పత్రము వలెనే గనపడునట్లు, అజ్ఞాన దృష్టి చేత శరీర సహితముగా గనబడును. నిజముగా చూచినచో అశరీరుండనియే జెప్పవలయును. ఆతడే, సుందర స్త్రీని సూకరమును సమానముగా చూచును.

(2) బ్రహ్మవిద్వరుడు : కర్మలను వదలి సంప్రాప్త సుఖదుఃఖములను అనుభవించుచు సమాధి నిష్ఠాగరిష్ఠుండైయుండువాడు.

శరీరము పడిపోకుండా నిలచుటకై నిష్ఠ నుండి తానుగానే మేల్కొని అన్నపానాదులారగించును.

(3) బ్రహ్మవిద్వరీయుడు : సర్వకాలములందు సహజ అమనస్కరాజ యోగనిష్ఠాగరిష్ఠుండై పరుల వలన మేల్కొలుపబడి, కించిదాహారంబునుగొనుచు నిద్రబోవు వానివలె విశ్వమును మరచియుండువాడు.

(4) బ్రహ్మవిద్వరిష్ఠుడు : ఇతరులు వాని నిష్ఠ నుండి మేల్కొల్పి అన్నపానాదులిచ్చినా స్వీకరించడు. అసలు బ్రహ్మ నిష్ఠ నుండి చలించడు. బాహ్యాంభంతరములు మరచి నిరంతర నిర్వికల్ప సమాధి నిష్ఠుండై ప్రకాశించువాడు.

బ్రహ్మవేత్త నియమములు :

"అన్నం ననింద్యాత్" = అన్నమును నిందించకూడదు

"అన్నం నపరిచక్షీతంః" = అన్నమును పరిహరించకూడదు

"అన్నం బహుకుర్వీత" = అన్నమును మర్యాద చేయవలెను.

పరిపూర్ణభావజ్ఞుడు : ఈ నల్వురిలో ఏ తరగతికిన్ని చెందడు. అందరివలె నుండి అన్ని పనులు జేసి, కేవలము ప్రాపంచీకుని వలె మెలుగుచుండును. కాని గురుకృపచే మేల్కొని అశరీర పద్ధతి తెలిసి కర్తృత్వ రహిత కర్మాచరణ చేయుచుండును. ఎఱుక పదవియున్న వాడు కాదు. గాన అతనిని బ్రహ్మవేత్తయని గాని, బ్రహ్మవిదుడని గాని యనరాదు. అతడు జీవుడు కాదు; బ్రహ్మమూ కాదు. పరిపూర్ణ బ్రహ్మము అవిజ్ఞేయమై మనోవాక్కుల కగోచరమైయున్నది. కనుక బ్రహ్మమునకు నేతృత్వమూ లేదు. దాని నెఱిగినవాడు బ్రహ్మవేత్త కాదు. కనుక కృష్ణదేశి కేంద్రుల వారు...

కం॥ "పరమ హంసాశ్రమధరుని,
పరిపూర్ణబోధవాని పనులు సమమె
వారినెఱుగక నుతినిందలు
గరపిన తత్ఫలము ప్రజలకగు జుమీ" అన్నారు.

ముక్తి విషయము

ముక్తియనగా విడుపు అని యర్థము. బంధములనుండి విడుపునకే

ముక్తియని చెప్పుదురు.

ముక్తి రెండు విధములు :

1) జీవన్ముక్తి – స్వరూపలయము

2) విదేహ ముక్తి – అరూపలయము

జీవన్ముక్తుడు : సుఖమునకు సంతోషించడు. దుఃఖమునకు వ్యసనపడడు. మంచి వాసనలను గ్రహించలేడు. రాగద్వేషములు లేనివాడును, అహంకారము లేనవాడును, ప్రత్యుపకారము చేయువాడును, తన కార్యముల వలన కలిగెడు హాని వృద్ధులకు భయపడనివాడును, పరమోపశాంతి గలిగి యుండువాడును, తనవలన లోకులకు భయమును గలుగ జేయనివాడును, పరుల జూచి భయపడని వాడును, జ్ఞానేంద్రియముల చేత దెలిసికొనియు సుఖదుఃఖములను జెందనివాడును, ఏకాగ్ర చిత్తము గలవాడును, సర్వభూత దయాళుత్వము గలవాడును, నిత్య తృప్తి గలవాడును, యదృచ్ఛాలాభ సంతుష్టియు, మృదుమదుర సంభాషణయు గలవాడును, మనో సంకల్పములు లేనివాడును, అన్య స్త్రీల యందు కోరిక లేని వాడును, ప్రియ, అప్రియములు లేక నిద్రబోవువానివలె సంచరించువాడును, సుషుప్తి దశయందు వలె జాగ్రతదశయందును సంకల్పము లేనివాడునై ఏ కోరిక లేక, ఆశయును లేక సహజ నిర్వికల్ప సమాధి యందుండు వాడును, శత్రువు మిత్రువు సమానముగా గలవాడును, నడచునపుడుగాని, కూర్చుండు నపుడుగాని, జాగ్రతయందు గాని, సుషుప్తియందు గాని, స్వప్నమందుగాని, పరుండునపుడు గాని, నిద్రించునపుడు గాన చిత్తము విచారపరము గాకుండునట్టి వాడు, జీవన్ముక్తుడని యెన్నబడును.

శ్లో॥ చిదాత్మాఽహం పరాత్మాఽహం నిర్గుణోఽహం పరాత్పరః ।
ఆత్మ మాత్రేణ యస్తిష్ఠేత్ స జీవన్ముక్త ఉచ్యతే ॥
దేహత్రయాతిరిక్తోఽహం శుద్ధచైతన్యమస్మ్యహమ్ ।
బ్రహ్మాహఽమితి యస్యాన్తః స జీవన్ముక్త ఉచ్చతే ॥
ఆనన్దఘనరూపోఽస్మి పరానన్దఘనోఽస్మ్యహమ్।
యస్య దేహాదికం నాస్తి స జీవన్ముక్త ఉచ్యతే ॥
శుద్ధ చైతన్య రూపాత్మా సర్వసంగ వివర్జితః ।
నిత్యానన్దప్రసన్నాత్మా స జీవన్ముక్త ఉచ్యతే ॥

విదేహముక్తుడు : జనన మరణములు శరీర ధర్మములు గనుక, వాటిని పొందనివాడును, ఆది మధ్యాంతరహితమై, మనస్సును, దేహమును లేనివాడును, స్థూల, సూక్ష్మ కారణ, మహాకారణ శరీరములు లేనివాడును, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ, హిరణ్మయ కోశములు లేనివాడును, పృథివ్యాపస్తేజో వాయురాకాశములనెడు పంచభూతములు లేనివాడును, అచల పరిపూర్ణుడును, సమస్తమందు అంతర బాహ్యములందు నిండి నిబిడీకృతమై యుండువాడును, నిర్గుణ సాక్షాత్కార పరబ్రహ్మ స్వరూపమే స్వరూపముగా గలవాడును, విదేహముక్తుడని చెప్పబడును.

శ్లో॥ బ్రహ్మభూతః ప్రశాన్తాత్మా బ్రహ్మానన్దమయస్సుఖీ ।
స్వచ్ఛరూపో మహామౌనీ వై దేహీ ముక్త ఏవ సః ॥
చిత్తవృత్తిమతీతో యశ్చిత్త వృత్త్యవభాసకః ।
చిత్తవృత్తి విహీనాత్మా వై దేహీ ముక్త ఏవ సః ॥
సర్వమాత్మాఽహమాత్మాఽస్మి పరమాత్మా పరాత్మకః ।
నిత్యానన్దస్వరూపాత్మా వై దేహీ ముక్త ఏవ సః ॥
స్వమాత్మని స్వయం తృప్తః స్వమాత్మానం స్వయంచర ।
ఆత్మానమేవ మోదస్వ వైదేహీ ముక్తికో భవేత్ ॥

పురుష ప్రయత్నము చేత మున్ముందుగా ధనమునార్జించి, ఆ ధనము వలన సద్గుణ సంపన్నులగు సాధువుల నాదరించెనేని "సాధూనాం దర్శనం పుణ్యమ్" అను న్యాయము వలన సజ్జన సాంగత్యమును విషయ రహితమును గలుగును. విషయ సుఖములయందు ఇచ్ఛ లేమి వలన విచారణ కలుగును. విచారణ వలన చిత్తోపశాంతియును, ఆత్మావలోకనమును గలుగును. చీకటిలో నడచువాడు, మోడు చెట్టును జూచి దొంగయని భయపడినట్లు రూపనామము లతో గూడిన ప్రపంచమును సత్యమని నమ్మి

శ్లో॥ మాతానాస్తి పితానాస్తి నాస్తిబంధు సహోదరాః ।
అర్థం నాస్తి గృహం నాస్తి తస్మాజ్జాగ్రథ జాగ్రథః ॥

తా॥ తల్లియు, దండ్రియు, చుట్టములు, అన్నదమ్ములు, ధనము, యిల్లు నశించుననియు ఆ కారణము వలన జాగ్రత్తతో నుండవలెను. అని తెలియక

"అన్యాయార్జితం విత్తం సహమూలం వినశ్యతి" యను ప్రమాణము చొప్పున అన్యాయముగా ధనమును సంపాదించి, ఆ ధనము ముందుండిన మూలధనముతో సహా నశించును అని తెలియకనే సంతోషించుచుండెదరు. ముముక్షువు అట్లు కోరక, నేను బ్రాహ్మణుడను, అగ్ర కులమందు పుట్టినవాడను, గృహస్థుడను, విద్యాధిక్యత గలవాడను, సదాచార సంపన్నుడను, సోమయాజిని, యజ్ఞములన్నియు జేసినవాడను, వైశ్వ దేవాది కర్మలు చేసినవాడను అనెడి విశేషములన్నిటిని విడచి భయరహితుడై పుత్ర మిత్ర కళత్రాది విషయమగు కోరికను విడచి అహంకార రహితుడై సమస్తము అసత్యము అని నిశ్చయ జ్ఞానమే సమాధిగా గలవాడై, తనకిష్టములగు వస్తువులను త్యజించి, మనసును విషయములకు బోనీక నిలుపవలెను. అగ్నికి ఉష్ణము వలెనే, మనస్సునకు సంకల్పము విషయము. చిత్త మృతియే మోక్షము. మనస్సు దేనిని అనుసంధానము జేయునో దానిన్ని సర్వేంద్రియ వృత్తులనూ రాజాజ్ఞను మంత్రులు శిరసావహించినట్లు క్షణ మాత్రముననే పొందగలవు. కావున విషయములందు భోగేచ్ఛ లేక మనస్సునందలి మతమును సమూలముగా బోగొట్టుకొన వలయును. నేను దుఃఖయుక్తుడను గాను, నాకు దేహము లేదు, పరిపూర్ణుడను, ద్వయ దోష రహితుడను, నేను మాంసమును, అస్థులను గాను, శరీరత్రయ విలక్షణుడను, అని తెలిసి మహా కారణ స్వరూపుడై సాక్షిగా నుండవలెను. సమాధి తరుణముల యందు భార్యబిడ్డలను దలపక ముక్తి కాంతనే గురిగా నుంచుకొని సమస్త దుఃఖములను విడనాడి "విగతతాపము" అనెడు అరణ్యమందు నిలచి అదియే నిర్జన ప్రదేశము గనుక అట్టి వృత్తిరహితమగు ప్రదేశమందు వర్తించుట వలన బుద్ధి విశ్రాంతి బొందగలదు. మాంసమును దినవలెనని చేప గాలములో జిక్కుబడినట్లు, విషయ సుఖముల కాసించి నశించరాదు.

పరబ్రహ్మ జ్ఞానమును దెలిసికొనుట కాసక్తిగలవాడు ఏ జాతియందున్నను, బ్రహ్మవిద్యోపదేశమునకర్హుడు. మూర్ఖునకు బోధించ గిట్టదు. అట్లు బోధించిన, సమస్త ఆభరణములతో అలంకరింపబడిన తన పుత్రికను కలలో జూచిన వరునకిచ్చి వివాహము జేసినట్లగును.

పుష్యరాగము మొదలగు రాళ్ళన్నియు వజ్రము చేత కోయబడును. వజ్రము వజ్రము చేతనే కోయబడవలయును గాని మరిదేని చేతను కోయబడదు. అట్లే మనస్సు చేతనే మనస్సును భేదించవలయును.

సమాధి లక్షణం :

శ్లో॥ జీవాత్మ పరమాత్మైక్యావస్థా త్రిపుటి రహితా ।
పరమానంద స్వరూపా శుద్ధ చైతన్యాత్మికా సమాధిః ॥

తా॥ జీవాత్మ పరమాత్మల ఐక్యమును జేయవలయును. నేను అనెడిదియే జీవాత్మ; తాను అనెడిదియే పరమాత్మ. ఈ జీవాత్మ పరమాత్మలకైక్య జ్ఞానము లేక అనుభవజ్ఞానమును గలిగియుండవలయును.

శ్లో॥ మాతృవత్పరదాం శ్చ పరద్రవ్యాణి లోష్టవత్ ।
ఆత్మవత్సర్వ భూతాని యుపశ్యతి సపశ్యతి ॥

పరస్త్రీలను తల్లివలె భావించవలయును. పరద్రవ్యము యందాశకూడదు. జీవన్ముక్తుల యొక్క తపో బలిమి తమకపకారము చేయునట్టి దుష్టులెంత బలవంతులై యున్నను, వారిని చెఱచును. తన మేలు కోరునట్టి వారెంత బలహీనులైనను వారికి జయము గలుగజేసి మేలు చేయును. ఇట్లు తపస్సంపన్నుల కోరిక లేకయే జరుగును. కనుక పెద్దల చెంతకు జేరి వారికి తొందరను గలుగజేయగిట్టదు. మనస్సు నందైనను వారి కపకారము జేయ తలంపు గూడదు.

జపము, హోమము, తపస్సులు మొదలగు వానివలన ముక్తికలుగదు. వాయుభక్షణ చేసినను ముక్తి కలుగదు. అట్లైన సర్పములకును ముక్తి కలుగవలెను. నీరు త్రావి జీవించిన ముక్తి కలుగుచో, చేపలు మొదలగు జలచరములకు ముక్తి కలుగవలెను. ఆకులు తిని యుండుటవలన ముక్తి కలిగే యెడల, మేకలు మొదలైన వాటికి ముక్తి కలుగవలెను. తలక్రిందులుగా తపస్సు అనిన, గబ్బిలములకు ముక్తి యుండవలెను. ధ్యానము మౌనముల వలన యనిన,

కొంగలకు ముక్తి గలుగవలెను. శాస్త్రములు పలికిన జాలుననిన, చిలుక పలుకుల వలన, దానికి ముక్తి గలుగవలెను. కనుక పై విధములు మాత్రమే అవలంబించిన ద్వయదోష రషిత జ్ఞానము లేక ముక్తి గలుగదు.

శ్లో॥ ఊర్ధ్వ శూన్య మధ శ్శూన్యం మధ్యశూన్యం యదాత్మకమ్ ।
సర్వశూన్యం తదాత్మేతి సమాధిస్తస్య లక్షణమ్ ॥

శ్లో॥ ఊర్ధ్వపూర్ణ మధఃపూర్ణం మధ్యపూర్ణం యదాత్మకమ్ ।
సర్వపూర్ణం తదాత్మేతి సమాధి స్తస్య లక్షణమ్ ॥

– ఉత్తరగీత

పైనను, క్రిందను, నలుప్రక్కలను దృగ్గోచరమగు పదార్థమంతయు నశించునది యనియు, ఎచట నేవంక జూచినను, ఆత్మ స్వరూపము నిండి నిబిడీకృతమై యున్నదని భావించుటచేత తనకంటె అన్యము లేదని భావించి, సమస్తము తన స్వరూపమేయని తలంచగను, సాక్షిత్వమును గూడబోయి పరబ్రహ్మమందైక్య మగును. ఈ మార్గమున దప్ప వేరు మార్గమున ముక్తి లేదు.

బుద్ధిమంతులైనవారు, కోపము, హింస, పర స్త్రీ వ్యామోహము, దొంగతనము మొదలైన దుర్మార్గములను విడచి, అట్టివి తనకెదురైనను సహనము, శాంతి, త్యాగములతో, చలించక యుండి సద్గురువును వెదకి నాశ్రయించవలెను. సద్గురువు నొసటవ్రాత దుడిచి, భస్మముతో రేఖలు గీచి, హస్తమస్తక సంయోగము జేయగా, శిష్యునికి తెలివి శిరస్సునందు నిలచును. ఆ తెలివియే నీవని గురువు చెప్పును. సూర్యుడు తన కిరణములతో సహా ఎట్లు అస్తమించునో, అట్లే మనస్సున్నూ తన వృత్తులతో సహా అణగి, తనయందే నిలచును. పక్షులు రాత్రులందు చెట్లయందు నిద్రించు రీతి, జీవుడు పరమాత్మయందు నిద్రించును. గోవుల వర్ణములు వేరైనను, వాటి పాలు తెల్లనే అయి, మధురమైనట్లు, భూతములు వేర్వేరయినను పరమాత్మ యొక్కటే యని తెలియవలెను. సద్గురు వెవరైనను, సందేహించక, రహస్యములను దెలిసికొని అరుణి మొదలైన వారి వలె ఊర్ధ్వరేతస్కులై యుండవలెను.

కావున, యీ విధముగా పరబ్రహ్మమును దెలిసి, కేవలము పరబ్రహ్మము నందు లీనమై యుండుటే ముక్తి.

శ్లో॥ భూమిం జలే తదపి తేజసి తచ్చవామో
తం వ్యోమ్నిత త్రిగుణయా సహమయ్యనంతే ।
పూర్ణే విలాప్య పరిశిష్ట మఖండ సంవిత్
స్వానందరూపమనుభూయరమేహమద్య ॥

– ఆత్మవిద్యావిలాసము 40 వశ్లో॥

తా॥ భూమిని జలంలో, దానిని అగ్నిలో, దానిని వాయువులో, దానిని ఆకాశంలో, దానిని త్రిగుణాత్మక మాయతో సహా సర్వపూర్ణమై అనంతమైన నాలో లయింపజేసి, మిగిలియున్న అఖండ చిద్రూప ఆత్మానందాన్ని అనుభవముగా బొంది యిప్పుడు నేను రమిస్తున్నాను.

వ్యా॥ ప్రపంచము కనబడుతుండగానే మహాత్మునికి నిర్లిప్తముగా ఆత్మానందాన్ని అనుభవించడం ఎలా సాధ్యమో యీ శ్లోకము వివరిస్తున్నది.

బాహ్య ప్రపంచము పంచభూతాల వలన యేర్పడినది. వాటికి రూపరస గంధ స్పర్శ శబ్దాదులుగా గ్రహించే అనుభవానికి తెచ్చుకొనే ప్రేరణ శక్తి మూలాధారం నుండి విశుద్ధం వరకు నున్న చక్రాల నుండి క్రమముగా ఇంద్రియాలకు లభించుచుండును. ఏ మార్గంలో సాధన చేసే సాధకుడికైన సాధనలో పురోగమించుచున్నపుడు మూలాధారములోని కుండలిని కదలి, ఒక్కొక్క చక్రమునూ భేదించుకొనుచూ పైపైకి పోవును. ఇలా ఒక్కొక్క చక్రాన్ని అధిగమించుచున్నపుడు ఆ చక్రముల సంబంధించిన భూతము పై చక్రములోని భూతముతో లయమగుచూ తనవైన విషయాలను గూడ లయము గావించుకొనును.

పైన చెప్పబడిన చక్రములకు నామ నిర్ణయము యీక్రింది విధముగా నున్నది.

జీవునికి జగద్వ్యాపార వృత్తి కలిగినపుడు విలువ ఆధారమైయున్నది.

అందువలన మూలాధారమని చెప్పబడును. ప్రభావము చూచుటకు తనచే అధిష్ఠింపబడుట వలన స్వాధిష్ఠానమనబడును. జీవుడు పరమాత్మ నారాధించునపుడు నవరత్న ఖచిత కిరీట కేయూర మంజీర కింకిణీ మొదలైనవి ధ్వనించుచున్నవి. అట్టి ధ్వని స్థానభూతమైయున్నది. కావున దీనికి మణిపూరక చక్రమని పేరు.

జీవుడు సాధన కాలమున తపోభంగము కలిగించునట్టి భూతప్రేత పిశాచాదులు ఉచ్చాటనకు సాధ్యములగు పదిరకములుగా దశవిధ నాదము లొనర్చు స్థానము అనాహతము అనబడును.

జీవడు భయోత్పాదమైన భ్రాంతులను వదలి యాత్మ స్వరూపమైన శుద్ధత్వము బొందును. మరియు శుద్ధత్వము బొందునను నిర్ణయము తనకు కలుగుచున్నది. కావున విశుద్ధమనబడును.

జీవుడు తన యాజ్ఞను చెల్లించుకొను స్థానమునకు ఆజ్ఞాచక్రమని పేరు. జీవన్ముక్తి పొందు ప్రతి మానవుడు ఆనందించునది గావున సహస్రారమని చెప్పబడుచున్నది.

ఆరవదియైన ఆజ్ఞాచక్ర విభేదనము జరిగినప్పుడు మనస్సు కూడా లయమగును; ఏ విషయ వస్తువు యొక్క అనుభవమూ లేక, కేవలమూ తనకు తానుగా నిలచియున్న శుద్ధ చైతన్య అఖండానందరూపమైన ఆత్మలో తాను లీనమైపోవును. ఆ స్థితిని చేరుకున్న మహనీయునికి పాంచభూతాత్మికమైన ప్రపంచము కనబడినప్పటికిన్నీ, ఆత్మానందము మరుగుపడదు, చెదరదు.

శ్లో॥ అజ్ఞాన తన్నిరసనే మయి బోధరూపే
స్యాతాం కథం తిమిర తద్విరతే ఇవార్కే ।
బంధశ్చమోక్ష ఇతికల్పన మప్యసత్యం
భ్రాంత్యైవ భాత్యఖిల సాక్షిణి నిత్యముక్తే ॥

– ఆత్మవిద్యావిలాసము 41వ శ్లో

తా॥ సూర్యుడిలో చీకటి ఉండడము, పోవడములవంటివి ఎలాగుండవో, జ్ఞానరూపమైన నాలో అజ్ఞానముండుటయు, దానిని నిరసించుటయు జరుగజాలవు. ఆ విధముగా బంధమోక్షములు రెండునూ కల్పితములు అది కూడా అసత్యము. నిత్యముక్తుడైన సర్వసాక్షిలో భ్రాంతివలన అసత్యమైనదంతయు భాసించును.

వ్యా॥ ఆత్మానుభవము గలిగి యుక్తుడైన పిదప దెలిసే ముఖ్య విషయమేమనగా అసలు బంధమనేది ఏనాడూ లేదనియు, ముక్తి అనేది అంతకన్నా లేదని దృఢము. సూర్యునిలో లేని చీకటిని తరిమినట్లు, లేని బంధాన్నుండి విముక్తి పొందుట ఏ విధముగా సమంజసము? (సాధనపూర్వకముగా అని భావము)

భ్రాంతి కారణముగా బంధమున్నదనుకొని, సాధన చేయుచున్నామను కొనుచున్నాము. ఈ రెండు కల్పనలే నని పారమార్థిక స్థాయిలో పరతత్వాను భవమున దెలియును.

శ్లో॥ ఆరబ్ధ కర్మాణి చ భోగత ఏవ నష్టే
ప్రాణాదయోఽపి మమ నోత్క్రమితుం సమర్థాః ।
తప్తాగ్ని నిష్ఠ జతువన్మయి పూర్ణబోధే
లీనా భవంతిన పునర్జ ననాదికం స్యాత్ ॥

– ఆత్మవిద్యా విలాసము 42వ శ్లో॥

తా॥ భోగించడం వల్ల ప్రారబ్ధకర్మ నశించిపోయినప్పుడు ఆ ప్రాణాదులకు నిష్క్రమించుటకు గూడ శక్తి లేకుండును. ప్రజ్వరిల్లే అగ్నిలో నుంచిన లక్క వలె, అవి పూర్ణజ్ఞానములో లీనమైపోవును. తిరిగి జన్మ మొదలైనవి యుండవు.

వ్యా॥ సామాన్యులు మరణించినపుడు పంచ ప్రాణములు, దశేంద్రియ శక్తులు, అంతఃకరణ చతుష్టయము జీవాంశతో సహా మరో శరీరాన్ని, మరో లోకాన్ని వెదకుచు వెళ్ళును. వారి కర్మ వాసనల ఫలము యీ సూక్ష్మ జీవులకు శక్తిని, వేగాన్ని యిచ్చును.

పరిపూర్ణ జ్ఞానము గలిగినప్పుడు జీవుడే లేడు. సంస్కారములు, కర్మ ఫలము, క్రొత్త అనుభవములు పొందవలెనను ప్రేరణ గలిగించలేవు. అందుచేత ప్రాణాదులకు వేగము, శక్తి లేక పూర్ణజ్ఞానములో లయించి పోవును; మరో జన్మ అంటూ మరియుండదు.

ఆత్మ విదుడు

శ్లో॥ భావాభావ వికారశ్చ స్వభావా దితి నిశ్చయీ ।
నిర్వికారో గతక్లేశః సుఖేనై వోపశామ్యతి ॥

– అష్టావక్ర గీత 11వ ప్ర. 1వ శ్లో ॥

వ్యాఖ్య ॥ భావాభావ అనగా స్థూల సూక్ష్మ రూపములుగానున్న వికారము (కార్యము) లన్నీ మాయ వలన లేక మాయా సంస్కారమువలననే యుత్పన్నము లగుచున్నవి. అంతేకాని నిర్వికారమగు ఆత్మనుండి యేదియు పుట్టలేదు.

మాయ జడము, ఆత్మ చేతనము. కేవల జడమగు మాయ నుండి కార్యోత్పత్తి కాజాలదు. అట్లే చైతన్యమునుండి అసలే కాజాలదు. ఎందుకనగా నిరవయవమగు ఆత్మ నుండి సాయమగు కార్యముత్పత్తి కాజాలదు. చైతన్య సంబంధము లేనిదే కార్యోత్పత్తి జరుగునని చెప్పినచో, కుమ్మరి లేనిదే కుండ దానంతట అదే మృత్తిక నుండి ఉత్పత్తి కావలసి వచ్చును. స్థూల సూక్ష్మ రూప కార్యములన్నియు మాయ నుండే యుత్పన్నమగుచున్నవనియు, చైతన్యము నుండి గాదనియు చెప్పవచ్చును. అది ఎట్లనగా, సూదంటురాయి చలించకే దాని యొక్క శక్తి చేత చేత లోహము చలించునట్లు. కాని సూదంటు రాయి చలించుట లేదు. అట్లే చైతన్యము యొక్క శక్తి చేతనే అనగా మాయ వలననే కార్యోత్పత్తి యగుచున్నది. కాని చైతన్యము వలన కాదు. జీవాత్మ సత్త వలన శరీరమునందు నఖరోమాదులు త్పన్నమగుచున్నవి. కాని ఆత్మయందు లేదు. ఆత్మ అసంగము, నిర్వికారము. శరీరము వికారి, నశ్వరము. ఆత్మ నిత్యము, చేతనము. శరీరము అనిత్యము, జడము. ఈ విధముగా తలచినచో, శ్రమ లేకనే శాంతిని పొందుచున్నాడు. అన్యుడు పొందజాలడు.

శ్లో॥ ఈశ్వరస్సర్వ నిర్మాతా నేహాన్య ఇతి నిశ్చయీ ।
అంతర్గళిత సర్వాశః శాంతః క్వాపి న సజ్జతే ॥

– అష్టావక్ర గీత 11వ ప్ర, 2వ శ్లో॥

వ్యాఖ్య॥ ఆత్మ సత్త వల్లనే భావా భావవికారములుత్పన్నములగుచున్నవి. ఆయాత్మ ఒకటి జీవాత్మగా, రెండవది పరమాత్మగా రెండు విధములుగానున్నది. ఈ రెంటిలో, ఈశ్వరసత్తా వలన సంపూర్ణ జగత్పదార్థములుత్పన్నములగుచున్నవి. జీవ సత్తా వలన శరీర సంబంధమైన నఖ రోమాదులుత్పన్నమగుచున్నవి. ఎందుకనగా జీవాత్మ తన శరీరముగా మాత్రమే వ్యాప్తమైయున్నది. ఈ కారణము వలన అది పరిచ్ఛిన్నమగుటచే దాని సత్త వలన జగత్పదార్థములుత్పన్నము కాజాలవు. మరి ఈశ్వరుడో సర్వకారణుడు సర్వ వ్యాపకుడు. సమస్త జగత్తునకంటె నధికుడు. ఈశ్వరోపాధియగు మాయ కూడ గొప్పదేయగుట వలన సర్వత్ర ఈశ్వర సత్తా వలన జగత్పాదార్థోత్పత్తి యగుచున్నది. జీవోపాధియగు అంతఃకరణము అల్పశరీరావయవములను మాత్రమే వృద్ధి బొందించును. అల్పోపాధి గలవాడగుటచే ఈశ్వరుడు సర్వజ్ఞుడుగా, సర్వశక్తిమంతుడుగా భావించబడు చున్నాడు. ఇందుకే ఈశ్వరుని జగత్కర్తగా లోకులు దలంచుచున్నారు. వాస్తవమునకతడు కర్త గాడు. కేవల మాయోపాధివలన కర్తృత్వ వ్యవహారము ఈశ్వరునియందు గౌణముగానున్నది. (ఆరోపించబడినది); ముఖ్యముగా లేదు. నిజమునకు ఈశ్వరుడు, జీవుడు గూడ అకర్తలే.

జీవాత్మ, పరమాత్మ భేదమువలన చైతన్యము రెండుగా అనిపించినను, వాస్తవమునకు చైతన్యము ఒక్కటియే చైతన్యమన గురుత్వాకర్షణ, ప్రకాశము, ప్రకంపనలు (శబ్ద) కలిగిన సమిష్టి ఒక్కటియే. కాని కల్పితోపాధుల భేదము వలన చైతన్యము గూడ భేదమగుచున్నట్లు గన్పట్టుచున్నది. "అవిద్యాతత్కార్య రహితశ్శుద్ధః" అవిద్య, తత్కార్యములనుండి రహితమైనదే శుద్ధ చైతన్యము. దీనినే నిర్గుణ బ్రహ్మమని అందురు.

"సర్వ నామరూపాత్మక ప్రపంచాధ్యానాధిష్ఠానత్వం బ్రహ్మత్వమ్॥"

సంపూర్ణ నామ రూపాత్మక ప్రపంచము యొక్క అధ్యాసము అను అధిష్ఠానమే బ్రహ్మము. ఈ శుద్ధ చైతన్య పరబ్రహ్మమునందే నామరూపాత్మకమైన సమస్త ప్రపంచము అధ్యస్తమైయున్నది.

మాయ యనగా సమిష్టి కార్యము విచారించిన లేనిదని నిర్ణయింపబడును. మాయయందు ప్రతిబింబించిన చైతన్యమునకు ఈశ్వరుడనియు, అంతః

కరణమునందు ప్రతిబింబించిన చైతన్యమునకు జీవుడనియు జెప్పుదురు. మాయ ఒక్కటియే గాన, దానియందు ప్రతిఫలించిన ఈశ్వరుడు గూడ ఒక్కడే. అవిద్యాంశమగు అంతఃకరణము అనేకము గాన, దానియందు ప్రతిఫలించిన చేతనము గూడ అనేకమే.

చేతనము మూడు విధములు :

1) విషయ చేతనము : "ఘటా వచ్ఛిన్న చైతన్యమ్ విషయ చైతన్యమ్"

2) ప్రమాణ చేతనము : "అంతఃకరణ వృత్త్య వచ్ఛిన్న చైతన్యమ్ ప్రమాణ చైతన్యమ్।"

3) ప్రమాతృచేతనము : "అంతఃకరణావచ్ఛిన్నమ్ ప్రమాతృ చైతన్యమ్ ।"

ఘటాది విషయమనంతము. దానికి సంబంధించియున్న అంతఃకరణ వృత్తులు గూడ అనంతములే. అంతఃకరణములును అనంతములే. ఈ ఉపాధి భేదములవలన చైతన్యము గూడ అనంతమయిన భేదములయినది. వాస్తవముగా చేతనము మహాకాశమువంటిది. ఘటమఠ్యాద్యుపాధులతో మహాకాశమునకెట్టి సంబంధమెట్లు లేదో, అట్లే కల్పితోపాధులతో గూడ చైతన్యమునకెట్టి సంబంధము లేదు. ఇట్టి నిశ్చయము గల పురుషుడు దేనియందును సంసక్తుడు గాడు.

శ్లో॥ ఆపదః సంపదః కాలేదైవాదేవితి నిశ్చయీ ।
తృప్తః స్వస్థేంద్రియో నిత్యం నవాంఛతి నశోచతి ॥

– అష్టావక్ర గీత 11వ ప్ర. 3వ శ్లో॥

వ్యాఖ్య ॥ ఈశ్వరుడే సర్వజగత్సృష్టికర్త యనినచో ఒకని దరిద్రునిగాను, మరియొకని ధనికునిగాను; ఒకని దుఃఖి గాను, మరియొకని సుఖిగాను చేసి యుండరాదు. కాని పైవిధము ప్రపంచమునందున్నందున, ఈశ్వరునికి గూడ పక్షపాత దృష్టియున్నట్లు దోషము గల్గుచున్నది. ఈశ్వరునికి కర్మలున్నచో, ఆ దోషముల నారోపించుట యుక్తమే. అట్లు గాక,

నకర్తృత్వం నకర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
నకర్మ ఫల సంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥

– భగవద్గీత 5వ.అ. 14వ శ్లో॥

ఈశ్వరుడు జీవులకు కర్తృత్వమును గాని, కర్మలను గాని సృజించుట లేదు. కర్మ ఫల సంయోగమును గూడ కల్పించుట లేదు. ఇవి అనాదినుండి ఆయా సంస్కారముల ద్వారా వచ్చుచున్నవి. కనుక ఈశ్వరుని యందెట్టి దోషమున్ను లేదు.

జడరూపమైన కర్మకు ఫలమెట్లు గలుగుననిన, జీవుడందులకు అసమర్థుడు. కనుక ఫలదాతయగు ఈశ్వరునియందు దోష మారోపించదగునా యనిన, అనగా ఈశ్వరుడు జీవుల చేత శుభాశుభకర్మలను చేయించి, వాటి ఫలితములిచ్చునా, లేక జీవులను పుట్టించి వారిని కర్మచక్రమునందుంచెనా యనిన, అట్లు గాదు. అనాదిగా ప్రపంచము వచ్చి పోవుచునేయున్నది. నూతనమగు వస్తువు దేనినీ, జీవుడు గాని, ఈశ్వరుడు గానియుత్పత్తి జేయుట లేదు. అన్నియు సూక్ష్మముగా భీజరూపమునసున్నవే, కాలకర్మముల వలన యుత్పన్నమగుచున్నవి. సమస్త వృక్ష బీజములున్ననూ, సహకారి కారణ సామాగ్రి లేనిదే అంకురములు గలుగవు. అట్లే మాయ యందు సమస్త పదార్థములు సూక్ష్మముగా భీజరూపముతో నున్ననూ, సహకారి కారణ సామాగ్రి యే విధముగా సమకూరుచున్నదో, అప్పుడే వాటియుత్పత్తియు జరుగుచున్నది. అనగా కేవలము క్షేత్రము గాని, కేవలము బీజము గాని, నీరు లేనిచో యెట్లు ఫలమునీయదో, అనగా యీ మూడున్నూ ఫలమునకెట్లు హేతువులో, అట్లే మేఘస్థానాపన్నుడగు ఈశ్వరుడు, క్షేత్రస్థానీయమగు అంతఃకరణము, బీజస్థానములగు కర్మలు, యీ మూడున్నూ జేరి, ఆయారూపఫలముత్పన్నమగుచున్నది. ఈశ్వర సత్తా రూపమైన వర్షము అంతటా తుల్యమైయున్నందున, ఆయా క్షేత్రములలో ఎవరెవరు ఏయే రూపమగు విత్తనములను పెట్టుకొనుచున్నారో, వారు ఆయా రూపఫలములనే బొందుచున్నారు. ఇందువలననే ఈశ్వరుడు కర్మానుగుణ్యముగా న్యాయకారిగా ఫలమునిచ్చువాడయ్యెను.

ఈశ్వరుడు దయాళుడుగా గుణారోపముచే భక్తులకు, ఉపాసకులకు సాధనా పరముగానే కన్పట్టును. కాని, పాపఫల మనుభవించు వారికి దుఃఖము నుండి విముక్తి చేయజాలడు. అట్లు చేసిన న్యాయకారి కాజాలడు. జీవుని కర్మ ఫలమగు దుఃఖముననుభవించుటచే శుద్ధులగుచున్నారు. అనుభవము వినా కర్మము

విడచిపెట్టదు. ఇందు, ఈశ్వరుడును దయాళుడుగా నుండడు. కనుక ఆపదలు గాని, సంపదలు గాని, జీవుని ప్రారబ్ధకర్మానుసారమే కలుగుచున్నవని నిశ్చయించి, తితీక్షతో వానిననుభవించి, ఏ వస్తువునందు కోరిక లేని వాడై ఎవడు శుద్ధుడగునో, వాడే నిత్యానందమును పొందును.

శ్లో॥ సుఖదుఃఖే జన్మ మృత్యూ దైవా దేవేతి నిశ్చయీ ।
సాధ్యా దర్శీ నిరాయాసః కుర్వన్నపి న లిప్యతే ॥

– అష్టావక్ర గీత 11వ. ప్ర. 4వ శ్లో

వ్యాఖ్య ॥ యదార్థ జ్ఞానము గలవానికి కర్మఫలమంటదు. ఎందుకనగా

1) వారు ఫలాకామనా రహితులై కర్మలను చేయుచున్నారు, అనగా నిష్కామకర్మను చేయుచున్నారు, అనగా భోక్తృత్వరహిత కర్మ చేయుదురు.

2) వారు శిష్టాచారము కొఱకు కర్మను చేయుచున్నారు. అనగా లోకులు జ్ఞానము పొందువరకు శాస్త్ర విహిత కర్మలు చేయవలెను, గాన, జ్ఞానులు వారికవి యవసరము లేకున్నను, పరుల కొఱకు జేయుదురు.

3) వారు కర్మలను దేహేంద్రియ ధర్మములుగా తలంచుచున్నారు. అనగా, తానాత్మయని నిష్ఠలోనుండి దేహముండువరకు, తన కొఱకు గాక, దానికవసరమగు కర్మలను దేహమును నిలుపుట కొరకు దాని ధర్మములుగా తలంచి అకర్మగా కర్మను జేయుచున్నారు.

4) అహంకార రహితులై కర్మలను చేయుచున్నారు, అనగా నేను, నాకు, నాది, నావారు అను వానికి ప్రాధాన్యమివ్వక, చిత్తమందు కోరికలు లేకనే, అవసరమైన కర్మలు చేసి చేయనివాడగును, అనగా కర్తృత్వ రహిత కర్మ చేయును.

శ్లో॥ చింతయా జాయతే దుఃఖం నాన్య దేహేతి నిశ్చయీ ।
తయా హీనస్సుఖీ శాంతః సర్వత్ర గళిత స్పృహ ॥

– అష్టా వక్ర గీత 11వ.ప్ర. 5వ శ్లో॥

వ్యాఖ్య ॥ ఈ ప్రపంచమున పురుషునికి చింతమూలముననే దుఃఖము గలుగుచున్నది. ఇది గ్రహించిన జ్ఞాని చింతను దూరముగావించుకొనుచున్నాడు. అందువలన నతడు శాంత చిత్తమును, స్థిరాంతః కరణమును గలవాడై శ్రమ లేకనే కర్మలు జేసినను, కర్మఫల మనుభవింపకున్నాడు.

శ్లో॥ నాహం దేహో న మే దేహో బోధోఽహమితి నిశ్చయీ ।
కైవల్యమివ సంప్రాప్తో న స్మరత్యకృతం కృతమ్ ॥

– అష్టా వక్ర గీత 11వ ప్ర. 6వ శ్లో॥

వ్యాఖ్య ॥ జ్ఞానికి "నేను దేహమును గాను, ఈ దేహము నాది కాదు, నేను నిత్య బోధస్వరూపుడను" అను నిశ్చయము గలుగుచున్నది. ఎవనికి ఆత్మ జ్ఞానమువలన దేహేంద్రియాదులయందలి అహంతా – మమత్వాద్యభిమానము నశించి, దేనియందును కర్తృత్వాదికము మిగిలియుండదో మరియు కృతాకృత్యస్మరణము గూడా యుండదో అతడే జ్ఞానియని, జీవన్ముక్తుడని చెప్పబడుచున్నాడు.

శ్లో॥ ఆ బ్రహ్మస్తంబ పర్యన్త మహమేవేతి నిశ్చయీ ।
నిర్వికల్ప శ్శుచిశ్శాంతః ప్రాప్తా ప్రాప్త వినిర్వృతః ॥

– అష్టావక్ర గీత 11వ ప్ర. 7వ శ్లో॥

వ్యాఖ్య॥ బ్రహ్మ మొదలుకొని తృణము పర్యంతము గల సంపూర్ణ జగత్తు నా యొక్క రూపమే యైయున్నది. అనగా "నేనే సర్వ రూపుడనైయున్నాను." అను నిశ్చయ జ్ఞానము కలవాడే నిర్వికల్ప సమాధియందుండు జీవన్ముక్తుడు. అతడే విషయ రూపముల సంబంధమునుండి సంగరహితుడైన వాడు; అతడే శాంత చిత్తుడు; అతడే పరమ సంతోషి; అతడే ఆత్మానంద పరిపూర్ణుడు.

శ్లో॥ నానా శ్చర్యమిదం విశ్వం న కించిదితి నిశ్చయీ ।
నిర్వాసనః స్ఫూర్తి మాత్రో న కించి వ శామ్యతి ॥

– అష్టా వక్ర గీత 11వ. ప్ర. 8వ శ్లో॥

వ్యాఖ్య ॥ అధిష్ఠాన చైతన్య సాక్షాత్కారమగుటవలన అధ్యస్తమునకు బాధ కలుగుచున్నది. అనగా ఆత్మ సాక్షాత్కారమైనచో, నానా ప్రకారక ఆశ్చర్య రూప జగత్తు యొక్క నిజ స్వరూపము దెలిసిపోవుచున్నది. అందువలన జ్ఞానికి సమస్త సంకల్పములు నశించి పోవుచున్నవి. జగద్బాధ పోయినచో, పంచ భూతాత్మక ప్రపంచము నశించును. జగత్తే లేనిచో జ్ఞానికి దేహము కూడయుండదు కదా

యనిన, ఆత్మ సాక్షాత్కారమైన పిమ్మట కూడ, ప్రపంచము ఉన్నదున్నట్లే యున్నది. అది యెట్లనగా నాశము రెండు విధములు.

1) బాధ రూప నాశనము 2) నివృత్తి రూపనాశము

"ఉపాదానేన సహ కార్య వినాశో బాధః ।

ఉపాదాన కారణముతో సహా కార్య నాశనమగుటయే బాధారూప నాశము.

"విద్య మానే ఉపాదానే కార్యవినాశో నివృత్తిః ॥"

ఉపాదాన కారణముండగనే కార్యనాశమగుట నివృత్తి రూపనాశము.

జ్ఞానదృష్టి వలన అజ్ఞాన రూప, కార్య రూప జగత్తు నాశనమైపోవుచున్నది. జగత్తునకు నాశరూప భాద కలుగుచున్నది. కాని బాధితానునవృత్తి వలన మాత్రము ప్రతీతమగుచున్నది. మరియు, స్వప్న ప్రపంచమునకు నివృత్తి రూప బాధ జాగ్రద్ధశ యందు గలుగుచున్నది. ఎందుకనగా దానికి ఉపాదాన కారణమైన అవిద్య దానిని కలుగజేయుచున్నది. కారణరూప అవిద్య యుండినను, స్వప్న రూపకార్యము నాశమగుచున్నది. ఇందువలన అది నివృత్తి రూప బాధయని చెప్పబడుచున్నది. అజ్ఞానము అనేక విధములుగా నున్నది. ఏ జ్ఞాని అయితే అంతఃకరణ రూపాంశమగు అజ్ఞాన కార్యమును నశింపజేసికొనుచున్నాడో, అతనికి తన ఆత్మ సాక్షాత్కారము గలుగుచున్నది. తక్కిన ప్రాణులకు గలుగుట లేదు. వారికి జగత్ప్రతీతియే కలుగుచున్నది.

పదిమంది నిద్రించుచూ వారి వారి స్వప్న ప్రపంచములలో విహరించు చున్నందుననూ, ఒక్కడు మేల్కొనిన వాని స్వప్న ప్రపంచము మాత్రము నష్టమైనట్లు, ఈ జగత్తు స్వతస్సిద్ధమగు సత్త శూన్యమైనదనియు, పరబ్రహ్మ సత్త వల్లనే సత్యమైన దానివలె తోచుచున్నదనియు, వాస్తవముగా నీ జగత్తు లేనిదని ఎవడు తెలియుచున్నాడో, వాడు శాంతిని, ఆనందమును పొందుచున్నాడు.

బ్రహ్మనిష్ఠ

శ్లో॥ కాయకృత్యా సహః పూర్వం తతో వాగ్విస్తరానహః ।

అథ చిన్తాసహ స్తస్మా దేవ మేవాహమాస్థితః ॥

– అష్టావక్ర గీత 12వ. ప్ర, 1వ శ్లో॥

వ్యాఖ్య ॥ మొదట శరీర సంబంధమైన క్రియలు, అనగా యజ్ఞాదులను నేను సహింపజాలక పోతిని, అనగా వాటిని విడచిపెట్టితిని. పిదప వాక్కర్మములను నిందాస్తుత్యాదికర్మలను విడచిపెట్టితిని. పిదప మానసిక కర్మ చివరికి సంకల్పాదులను విడచిపెట్టితిని, అనగా శారీరక, వాచిక, మానసిక కర్మలను సంపూర్ణముగా విడచిపెట్టి, యేకాకినైయున్నాను.

శ్లో॥ ప్రీత్యభావేన శబ్దాదేర దృశ్యత్వేన చా త్మనః ।

విక్షేపైకా గ్ర హృదయ ఏవ మేవాహమా స్థితః ॥

– అష్టావక్ర గీత 12వ. ప్ర. 2వ శ్లో॥

వ్యాఖ్య ॥ కాయిక, వాచిక, మానసికములగు నీమూడు విధములగు కర్మలు చిత్త విక్షేప కారకములుగానున్నవి. లోకాంతర ప్రాప్తిని కలుగజేయు యజ్ఞాదికముల వలన శరీర విక్షేపమును, నిందాస్తుత్యాది కర్మల వలన వాగ్విక్షేపమును, వీని వలన మానసిక విక్షేపమును గలుగుచున్నవి. అందువలన నీ మూడు కర్మల యందు గల ప్రీతిని త్యజించుట అవశ్యకమైయున్నది. ఆత్మ చేతనము. మనోబుద్ధ్యాదులు అచేతనములు. అనగా జడములు. జడమైనది చేతన క్రియలను చేయజాలదు. కనుక ఆత్మధ్యానము చేయుటకు చింతా రూపమగు విక్షేపము గూడ నాకు లేదు. నేను సంపూర్ణ విక్షేపరహితుడనై నా స్వరూప స్థితిలో నున్నాను. అనగా నశ్వరములు, ఆత్మ కంటె విలక్షణమగు మనోవాక్కాయములు గాక తద్భిన్నుడనగు సచ్చిదానంద స్వరూపుడనైయున్నాను.

శ్లో॥ సమాధ్యాసాది విక్షేపౌ వ్యవహారస్సమాధయే ।

ఏవం విలోక్య నియమమేవ మేవాహ మాస్థితః ॥

– అష్టావక్ర గీత 12వ ప్ర. 3వ శ్లో॥

వ్యాఖ్య ॥ కర్తృత్వ భోక్తృత్వాద్యనర్థములకు హేతువగు అధ్యాసమూలముననే విక్షేపము గలుగుచున్నది. అట్టి విక్షేపమును దూరమొనరించుటకే సమాధి కొఱకు మానసాది వ్యాపారము లవలసరమగు చున్నవి. ఇట్టి నియమమును చూచియే

మొదట నేను అధ్యాసమును దూరమొనరించితిని. ఇందువలన సమాధి కొఱకు మనస్సు మొదలగునవి అక్కరలేదు. మరేమనగా నేను సమాధి రహితుడనై స్వరూపానంద స్థితిలో నిమగ్నుడనైయున్నాను.

శ్లో॥ హేయోపాదేయ విరహాదేవం హర్ష విషాదయోః ॥
అభావాదద్య హే బ్రహ్మన్నేవ మేవా హమా స్థితః॥

– అష్టావక్ర గీత 12వ ప్ర. 4వ శ్లో॥

వ్యాఖ్య॥ త్యజించుటకు గాని, గ్రహించుటకు గాని యోగ్యమైన వస్తువు లేని కారణమున, అనగా ఆత్మ జ్ఞానము కలిగిన పిదప కించిత్తైనా హేయము, ఉపాదేయము అను భావమే లేని కారణమున హర్ష విషాదములు గూడ నాకు లేవు. ఇందువలన నేను నా స్వస్వరూప స్థితియందే యుంటున్నాను.

శ్లో॥ ఆశ్రమానాశ్రమం ధ్యానం చిత్త స్వీకృత వర్జనం।
వికల్పమమ వీక్షైత్యై రేవ మేవాహమా స్థితః।

– అష్టావక్ర గీత 12వ ప్ర. 5వ శ్లో॥

వ్యాఖ్య॥ ఆశ్రమ సంబంధములగు ధర్మములనుండి, వాటి ఫలముల నుండి నేను రహితుడను. అనాశ్రమ ధర్మాదులనుండి కూడ నేను భిన్నుడను. యోగ ధర్మములగు ధ్యానాదుల నుండి గూడ నేను రహితుడను. ఇవన్నియూ అజ్ఞాన విలసితములై యున్నవి. నేను వీటికన్నింటికిని సాక్షినై, చిద్రూపుడనై యున్నాను.

శ్లో॥ యశ్వరీరేంద్రియాదిభ్యో విభిన్నం సర్వసాక్షిణం ।
పారమార్థిక విజ్ఞానం సుఖాత్మనం చ స్వప్రభం ।
పరంతత్త్వం విజానాతి సోఽతి వర్ణాశ్రమీ భవేత్ ॥

– అష్టావక్ర గీత 12వ ప్ర. 6వ శ్లో॥

వ్యాఖ్య॥ అజ్ఞానం వల్లనే కర్మానుష్ఠానమగుచున్నది. అనగా ఆత్మానుభవము లేనివాడు స్వర్గాది ఫల హేతువులగు యజ్ఞాదికర్మములను చేయుచున్నాడు. ఆత్మజ్ఞానము కలిగినప్పుడే కర్మలను త్యజించుచున్నాడు. ఆత్మ సాక్షాత్కారము పొందినవాడు మరి కర్మలను చేయడు. ప్రారబ్ధవశమున శరీరాది సంబంధ కర్మలను చేయును లేక చేయకుండును. ఇట్టి జ్ఞాని తన నిత్యానంద స్వరూపమునందు స్థితుడై యుండును.

శ్లో॥ అచిన్త్యం చిన్త్య మానోఽపి చిన్తా రూపం భజత్యసౌ ।
త్వక్త్వా తద్భావనం తస్మాదేవ మేవాహమా స్థితః ॥

– అష్టావక్ర గీత 12వ ప్ర. 7వ శ్లో॥

వ్యాఖ్య ॥ బ్రహ్మము అచింత్యము, అవాంగ్మానసగోచరము. అయినను, పరబ్రహ్మమును చింతించుచు నేను చింతాపరుడ నగుచున్నాను. కావున చింతా రూప భావన గూడ నేను విడచి సచ్చిదానంద స్వరూపమగు ఆత్మయందు స్థితుడనైయున్నాను.

శ్లో॥ ఏవమేవ కృతం యేన సకృతాకార్థో భవేద సౌ ।
ఏవమేవ స్వభావో యః సకృతార్థో భవేదసౌ ॥

– అష్టావక్ర గీత 12వ ప్ర. 8వ శ్లో॥

వ్యాఖ్య ॥ ఈ విధముగా సంపూర్ణ క్రియా రహితుడగువాడు తన నిజ స్వరూపమును దెలిసికొని కృతార్థుడగుచున్నాడు. అనగా జీవన్ముక్తుడగుచున్నాడు.

ఉ॥ "బ్రహ్మైవాహమస్మీ త్యపరోక్షజ్ఞానేన నిఖిల కర్మ బద్ధ వినిర్ముక్తో జీవన్ముక్తః ॥

నేను బ్రహ్మమును అను ఏతత్ప్రకారమగు అపరోక్ష జ్ఞానము వలన సంపూర్ణ కర్మ బంధములనుండి విడుదలను పొందినవాడే జీవన్ముక్తుడు.

"దేహ పాతానన్తరం ముక్తిః విదేహ ముక్తిః॥" శరీర పతనానంతరము గలుగు ముక్తి విదేహ ముక్తి. తాత్పర్యమేమనగా సాధనల ద్వారా యెవడు శరీర సంబంధమైనట్టియు, మనస్సంబధమైనట్టియు, యింద్రియముల యొక్కయు క్రియలను సంపూర్ణముగా రహితమొనర్చుకొనునో, అతడు ఆత్మానందానుభవము గల జీవన్ముక్తుడు.

అఖండానందము

శ్లో॥ తత్త్వ విజ్ఞాన నందంశం ఆదాయ హృదయోదరాత్ ।
నానా విధ పరామర్శశల్యోద్ధారః కృతో మయా ॥

– అష్టావక్ర గీత 19వ ప్ర. 1వ శ్లో॥

వ్యాఖ్య॥ నేను తమ యొక్క అనుగ్రహము వలన తమరిచ్చిన తత్త్వ జ్ఞాన రూపమగు పట్టు కారుతో నా హృదయ కుహరములో గల సంకల్ప వికల్ప రూప సందేహ కంటకములను పీకి పారవైచితిని. ఇప్పుడు నా చిత్తమెంతో ప్రశాంతముగా నున్నది.

శ్లో॥ క్వ ధర్మః క్వ చ వా కామః క్వ చార్థః క్వ వివేకితా ।
క్వ ద్వైతం క్వ చ వాఽద్వైతం స్వమహిమ్ని స్థితస్యమే ॥

– అష్టావక్ర గీత 19వ ప్ర. 2వ శ్లో॥

వ్యాఖ్య॥ వినాశ శీలములగు ధర్మార్థ కామ మోక్షము లెక్కడ? వాటిని నా హృదయమునుండి దూరముగా నెట్టివేసితిని. ఇప్పుడు నేను నా స్వరూపస్థితి యందే యుంటున్నాను. అందువలన నాకు వివేకముతో గూడ పనేమియు లేదు. మరియు, చైతన్యాత్మయందే విశ్రాంతినొందుచున్న నాకు ద్వైతాద్వైతము లతో కొంచెమైనను ప్రయోజనము లేదు.

"ఉత్తర్ణేతు గతే పారే నౌకయాః కిం ప్రయోజనమ్ ॥"

నది యొక్క ఆవలి తీరము జేరిన పిదప పడవతో ప్రయోజనమేమి? అట్లే ఆత్మ జ్ఞానము వలన ద్వైతమునకు బాధ కలిగిన పిదప అద్వైతముతో గూడ ప్రయోజనముండదు. ద్వైతములేనప్పుడు అద్వైతముతోనేమి పని? కావున ద్వైతా ద్వైతములు రెండునూ నాయందు లేవు.

శ్లో॥ క్వ భూతం క్వ భవిష్యద్వా వర్తమానమపి క్వ వా
క్వ దేశః క్వ చ వా నిత్యం స్వమహిమ్ని స్థితస్యమే ॥

– అష్టావక్ర గీత 19వ ప్ర. 13వ శ్లో॥

వ్యాఖ్య ॥ కాలము యొక్క స్ఫురణ నాకు లేదు. నా దృష్టిలో భూతభవిష్యద్వర్తమాన కాలములేవియులేవు. ఎందుకనగా, నేను నిత్యము నా స్వకీయ మహిమము నందే స్థితుడనై యుంటున్నాను. నాకన్నిటియందును గన్పట్టునది ఒక్క ఆత్మయే.

శ్లో॥ క్వ చాత్మా క్వ చ వా నాత్మా క్వ శుభం క్వాశుభం తథా ।
క్వ చింతా క్వ చ వా చింతా స్వమహిమ్ని స్థితస్యమే ॥

– అష్టావక్ర గీత 19వ ప్ర. 4వ శ్లో॥

వ్యాఖ్య ॥ నా యొక్క స్వమహిమయందే స్థితుడనైయున్న నా దృష్టిలో ఆత్మ యెక్కడ? అనాత్మ యెక్కడ? ఆత్మానాత్మల వ్యవహారము అజ్ఞానియగు వాని దృష్టిలో గలుగును గాని, జ్ఞాని దృష్టిలో గలుగదు. మరియు శుభముగాని, అశుభము గాని, చింతగాని, నిశ్చింతగాని స్వమహిమయందున్న నాకు లేనే లేవు.

శ్లో॥ క్వ స్వప్నః క్వ సుషుప్తి ర్వా క్వ చ జాగరణం తథా ।
క్వ తురీయం భయం వా పి స్వమహిమ్ని స్థితస్యమే ॥

వ్యాఖ్య॥ నా దృష్టిలో జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలు మూడును లేవు. ఎందుకనగా ఈ మూడవస్థలును బుద్ధి ధర్మములైయున్నవి. ఆ బుద్ధి గూడ మిథ్యాస్వరూపమై యున్నది. మరియు, అంతఃకరణ ధర్మములగు తురీయావస్థయు భయాభయ ములును నాకు లేవు. ఎందుకనగా నాయంతఃకరణమున్ను మిథ్యయే. నేను నిత్యముక్త బుద్ధ స్వరూపుడను.

శ్లో॥ క్వ దూరం క్వ సమీపం వా బాహ్యం క్వాభ్యంతరం క్వ వా ।
క్వ స్థూలం క్వ చ వా సూక్ష్మం స్వమహిమ్ని స్థితస్యమే ॥

– అష్టావక్ర గీత 19వ ప్ర. 6వ శ్లో॥

వ్యాఖ్య॥ సర్వత్ర పరిపూర్ణుడనై నిండియున్న నాకు దూరమెక్కడ? దగ్గరెక్కడ? బాహ్యమెక్కడ? అభ్యంతరమెక్కడ? స్థూలమెక్కడ? సూక్ష్మమెక్కడ? ఇవేవియును నాయందు పొసగవు? నేను పరిపూర్ణుడను.

శ్లో॥ క్వ మృత్యుర్జీవితం వా క్వ లోకాః క్వాస్య స్వలౌకికమ్ ।
క్వ లయః క్వ సమాధిర్వా స్వమహిమ్ని స్థితస్యమే ॥

– అష్టావక్ర గీత 19వ ప్ర. 7వ శ్లో॥

వ్యాఖ్య॥ నిరంతరము తన స్వస్వరూప స్థితియందున్న జీవన్ముక్తుడగు జ్ఞానికి మృత్యువు, జీవనము, జననము, మరణము, లోకములు, లోక వ్యవహారములు, లయము, సమాధి ఏవియును లేవు. త్రికాలా బాధ్యమై ఏకరసమైయున్న ఆత్మకు యీ ధర్మములే లేవు.

శ్లో॥ అలం త్రివర్గ కథయా యోగస్య కథయాఽప్యలవ్ ।
అలం విజ్ఞాన కథయా విశ్రాంతస్య మమాత్మని॥

– అష్టావక్ర గీత 19వ ప్ర. 8వ శ్లో॥

వ్యాఖ్య॥ నిరంతరము ఆత్మయందే విశ్రమించుచున్న నాకు ధర్మార్థ కామములను వర్జించుటవలనను, యోగమును అభివర్ధించుటవలనను, విజ్ఞానము గూర్చి చెప్పుట వలనను ప్రయోజనమేమి? ఈ ధర్మముల కన్న భిన్నమైన ఆత్మ స్థితియందున్న నాకు వీటితో పనియేమి? నేను వీటికి విలక్షణమగు పరమమగు ఆత్మ స్వరూపుడను.

సర్వసాక్షి – కూటస్థుడు – కేవలము

శ్లో॥ క్వ భూతాని క్వ దేహో వా క్వేంద్రియాణి క్వ వా మనః ।
క్వ శూన్యం క్వ చ నైరాశ్యం మత్స్వ రూపే నిరంజనే

– అష్టావక్ర గీత 20వ ప్ర. 1వ శ్లో॥

వ్యాఖ్య॥ సంపూర్ణోపాధియు మలశూన్యుడను గావుననే నేను నిరంజనుడను. అట్టి నిరంజనమగు నా స్వరూపమునందు పృథివ్యాది పంచభూతము లేవు. సూక్ష్మ భూతములగు ఇంద్రియములును నేను కాదు; మనస్సు నేను కాదు. శూన్యము కూడ నాయందు లేదు. ఎందుకనగా సద్రూపాత్మ యందు శూన్యము త్రికాలముల యందును ఉండజాలదు. శూన్యము కల్పితము. అధిష్ఠానము లేనిదే శూన్య కల్పనకు గూడ అవకాశము లేదు. ఈ సంపూర్ణ భూతేంద్రియాది కల్పిత పదార్థములకు నేను సాక్షిభూతుడనైయున్నాను.

శ్లో॥ క్వ శాస్త్రం క్వాత్మ విజ్ఞానం క్వ వా నిర్విషయం మనః ।
క్వ తృప్తిః క్వపి తృష్ణత్వం గత ద్వంద్వస్యమే సదా ॥

– అష్టావక్ర గీత 20వ ప్ర. 2వ శ్లో॥

వ్యాఖ్య॥ ద్వంద్వాతీతుడనగు నాకు శాస్త్రముతో గాని, శాస్త్ర జన్యమగు జ్ఞానముతో గాని ప్రయోజనము లేదు. ఆత్మ విశ్రాంతి వలన గూడ నాకు ప్రయోజనము లేదు. సమస్తమును విడిపోయిన తరువాత నాకు విషయవాసన లెక్కడ? నిర్వాసన కూడా లేదు. తృప్తి లేదు. అసంతృప్తి లేదు. తృష్ణాద్వంద్వము, నిర్ద్వంద్వము మొదలుగునవి నాకు లేనే లేవు.

శ్లో॥ క్వ విద్యా క్వ చ వాఽవిద్యా క్వాహం క్వేదం మమ క్వ వా।
క్వ బంధః క్వ చ వా మోక్షః స్వరూపస్య క్వ రూపితా ॥

– అష్టావక్ర గీత 20వ ప్ర. 3వ శ్లో॥

వ్యాఖ్య ॥ అద్వితీయ చిన్మాత్ర స్వరూపుడనగు నాకు రెండవ సంబంధము లేదు. కనుక మనోధర్మములగు విద్యావిద్యలును, అహంకార మమకారములును, బంధ మోక్షములును లేవు. నాకు బాహ్యా వస్తు సంబంధమేమియును లేదు. అసలు రెండవ వస్తువే లేనప్పుడు, ఇక దేనితో సంబంధము?

శ్లో॥ క్వ ప్రారబ్ధాని కర్మాణి జీవన్ముక్తి రపి క్వ వా॥
క్వ తద్వి దేహ కైవల్య నిర్విశేషస్య సర్వదా ॥

– అష్టావక్ర గీత 20వ ప్ర. 4వ శ్లో॥

వ్యాఖ్య॥ నిర్విశేష, నిరాకార, నిరవయవ ఆత్మ స్వరూపుడనగు నాకు ప్రారబ్ధ కర్మమెక్కడిది? జీవనన్ముక్తి, విదేహ కైవల్యము మొదలగు కల్పిత ధర్మములు నాకు లేనే లేవు.

శ్లో॥ క్వ కర్తా క్వచ వా భోక్తా నిష్క్రియం స్ఫురణం క్వ వా।
క్వాపరోక్షం ఫలం వా క్వ నిస్స్వభావస్యమే సదా ॥

– అష్టావక్ర గీత 20వ ప్ర. 5వ శ్లో॥

వ్యాఖ్య॥ ఏ స్వభావమును లేని నిర్వికార చిన్మాత్ర స్వరూపుడనగు నాకు కర్తృత్వ, భోక్తృత్వ, నిష్క్రియత్వ స్ఫురణములు లేవు. అపరోక్ష (వృత్తిరూప) జ్ఞానమును లేదు. ఎందుకనగా చిత్త స్ఫురణము వలన వృత్తి రూప జ్ఞానముత్పన్నమగుచున్నది. అట్టి చిత్త స్ఫురణ కూడా నాకు లేదు.

శ్లో॥ క్వ లోకః క్వ ముముక్షు ర్వా క్వ యోగీ జ్ఞానవాన్ క్వ వా।
క్వ బద్ధః క్వ చ వా ముక్తః స్వస్వరూపేఽహమద్వయే॥

– అష్టావక్ర గీత 20వ ప్ర. 6వ శ్లో॥

వ్యాఖ్య॥ అద్వైత స్వరూపుడనగు నాయందు భూర్భువాదిలోకములును లేవు. లోకములే లేనప్పుడు, ముముక్షువే లేదు. ముముక్షుత్వమే లేనిచో జ్ఞానవంతుడగు

యోగియు లేడు. ఇట్లగుటవలన ముక్తుడు లేడు, బద్ధుడు లేడు. కేవల అద్వైత రూప ఆత్మయే యున్నది.

శ్లో॥ క్వ సృష్టిః క్వ చ సంహారః క్వ సాధ్యం క్వ చ సాధనం।
క్వ సాధకః క్వ సిద్ధిర్వా స్వస్వరూపేఽహమద్వయే ॥
– అష్టావక్ర గీత 20వ ప్ర. 7వ శ్లో॥

వ్యాఖ్య॥ సృష్టి, ప్రళయాలు గాని, సాధ్యము, సాధనగాని, సాధక, సిద్ధి గాని; యివేవియు అద్వైత రూపాత్మయందు లేవు. అది కేవలము నిత్య శుద్ధ, బుద్ధ ముక్త స్వరూపమే.

శ్లో॥ క్వ ప్రమాతా ప్రమాణం వా క్వా ప్రమేయం క్వ చ ప్రమా ।
క్వ కించిత్క్వ న కించిద్వా సర్వదా విమలస్యమే ॥
– అష్టావక్ర గీత 20వ ప్ర. 8వ శ్లో॥

వ్యాఖ్య॥ ఎవనికి ఒకప్పుడును ఉపాధి రూప మల దోషము లేదో అనగా ఉపాధి భూత శరీరాదికము ఒకప్పుడును లేదో, అట్టి వానియందు ప్రమాతృత్వమెక్కడ? ప్రమాణమెక్కడ? ప్రమేయత్వమెట్లు కలుగును? వాస్తవమునకు ప్రమాత, ప్రమాణము, ప్రమేయత్వము, యీ త్రిపుటి మూడును అజ్ఞాన కార్యములు. స్వప్రకాశ చైతన్యమునందు అజ్ఞానము యొక్క సంభావనయే లేనప్పుడు అజ్ఞాన జనిత కార్యముల యొక్క ఉనికియే పొసగదు. మరియు, "ప్రమ" యనెడి వృత్తి జ్ఞానము గూడ దీనియందు లేదు. ఎందుకనగా వృత్తి జ్ఞానము అంతఃకరణ ధర్మము. అసలా యంతఃకరణమే ఆత్మయందు లేదు. ఇక వృత్తికి అవకాశమెక్కడ?

శ్లో॥ క్వ విక్షేపః క్వ చైకాగ్ర్యం క్వ నిర్బోధః క్వ మూఢతా ।
క్వ హర్షః క్వ విషాదో వా సర్వదా నిష్క్రియస్య మే ॥
– అష్టావక్ర గీత 20వ ప్ర. 9వ శ్లో॥

వ్యాఖ్య॥ సర్వదా క్రియారహితమగు నా స్వరూపమునందు ఏకాగ్రత ఎక్కడిది? మొదట విక్షేపమను నదొక్కటియున్నచో, ఆ విక్షేప నివృత్తికి ఏకాగ్రత అవసరమై యుండెడిది. అసలు విక్షేపమే లేనప్పుడు ఏకాగ్రతతో పనియేమి? ఇక మూఢత్వమున్నప్పుడే కదా తన్నిర్మూలనమునకు జ్ఞానావాశ్యకత. జ్ఞాన స్వరూపమగు ఆత్మయందు త్రికాలములలోను మూఢతయనునది లేనే లేదు. ఇక జ్ఞానముతో పనియేమి? మరియు, హర్ష విషాదములును నాయందు లేవు. ఎందుకనగా, హర్షవిషాదములు అంతఃకరణ ధర్మములు. ఆ అంతఃకరణము క్రియాయుక్తమైనది. ఆత్మ క్రియారహితమైనది. ఆత్మయందు సంతోష విషాదములు లేవు.

శ్లో॥ క్వ చైష వ్యవహారో వా క్వ చ సా పరమార్థతా ।
క్వ సుఖం క్వ చ వా దుఃఖం నిర్విమర్శస్యమే సదా ॥
– అష్టావక్ర గీత 20వ ప్ర. 1వ శ్లో॥

వ్యాఖ్య॥ నిరంతరము నిర్విశేషమగు అనగా వృత్తి జ్ఞానరహితమగు ఆత్మ స్వరూపుడనగు నాయందు వ్యవహారము, వ్యావహారిక పదార్థముల యొక్క జ్ఞానమెక్కడ? మరియు, పారమార్థిక జ్ఞానమునకు మాత్రము అవకాశమెక్కడ? ఎందుకనగా యీ వృత్తి జ్ఞాన, పారమార్థిక జ్ఞానములు రెండును అంతఃకరణ ధర్మములై యున్నవి. సుఖ దుఃఖములు గూడ అంతఃకరణ ధర్మములగుట వలన అవియు నాయందు లేవు. నేను నిత్యసచ్చిదానంద స్వరూపుడను.

శ్లో॥ క్వ మాయా క్వ చ సంసారః క్వ ప్రీతి ర్విరతిః క్వ వా।
క్వ జీవః క్వ చ తద్బ్రహ్మ సర్వదా విమలస్య మే ॥
– అష్టావక్ర గీత 20వ ప్ర. 11వ శ్లో॥

వ్యాఖ్య॥ సర్వదా నిర్మల స్వరూపుడను, ఉపాధి శూన్యుడను అగు నాయందు మాయ ఎక్కడ? మాయయే లేనప్పుడు మాయాకార్యమగు జగత్తెక్కడ? ఆ జగత్తు మూడు కాలములందును నాయందు లేదు. మరియు, ప్రీతియు అదే విధముగా విరక్తియు నాయందు లేవు. ఎందుకనగా నీ రెండునూ మాయయే. అవిద్యా రూప ఉపాధులు గలవియని చెప్పబడుచున్నవి. ఏ ఉపాధియు లేనిది బ్రహ్మమని చెప్పబడుచున్నప్పుడు జీవభావమని బ్రహ్మ భావమని చెప్పుటకే వలను పడదు.

శ్లో॥ క్వ ప్రవృత్తి ర్నివృత్తి ర్వా క్వ ముక్తిః క్వ చ బంధనం।
కూటస్థ నిర్విభాగస్య స్వస్థస్య మమ సర్వదా ॥
– అష్టావక్ర గీత 20వ ప్ర. 12వ శ్లో॥

వ్యాఖ్య॥ కూటస్థ విభాగ రహితుడను, క్రియారహితుడను అగు నాయందు ప్రవృత్తి

ఎక్కడ? నివృత్తి ఎక్కడ? ముక్తి ఎక్కడ? బంధమెక్కడ? ఇవన్నియును నిర్వికారాత్మయందు ఒకప్పుడును ఉన్నవని చెప్పుటకు వలనుపడదు.

శ్లో॥ క్వో పదేశం క్వ వా శాస్త్రం క్వ శిష్యః క్వ చ వా గురుః
క్వ చా స్తి పురుషార్థో వా నిరూపాధేః శివస్యమే ॥

– అష్టావక్ర గీత 20వ ప్ర. 13వ శ్లో॥

వ్యాఖ్య॥ శివస్వరూపుడను అనగా కల్యాణ రూపుడను, ఉపాధి రహితుడను అగు నాకు ఉపదేశమెక్కడ? తన కంటె భిన్నమగు వ్యక్తి యున్నచో ఉపదేశము చేయవచ్చును. రెండవవాడే లేనప్పుడు యిక ఉపదేశమెన్నటికిని సంభవింపదు. అదే విధముగా శిష్యభావ, గురుభావములు గూడ పొసగవు. ఎందుకనగా సమస్త భేదభావములు లేనిదే గదా పరబ్రహ్మము.

శ్లో॥ క్వ చాస్తి క్వ చ వానాస్తి క్వాస్తి చైకం క్వ చ ద్వయం ।
బహునాऽత్ర కిముక్తేన కించిన్నోత్తిష్ఠతే మమ॥

– అష్టావక్ర గీత 20వ ప్ర. 14వ శ్లో॥

వ్యాఖ్య॥ నాయందు అస్తిత్వ నాస్తిత్వ స్ఫురణయే లేదు. ఎందుకనగా అసత్యాపేక్ష వలన "అస్తిత్వ" వ్యవహారమున్నూ ఫలాపేక్ష వలన నాస్తిత్వ వ్యవహారమున్ను గలుగుచున్నది. ఆ వ్యవహారమే నాయందు లేనందువల్ల యీ రెండు నా యందు లేవు. ఏకత్వముగాని, ద్వైతముగాని నాయందు లేవు. పెక్కు చెప్పుట చేత ప్రయోజనమేమిటి? చైతన్య స్వరూపుడనగు నాయందు రెండవ వస్తువుండుటయే పొసగదు.

పరబ్రహ్మము (పరమాత్మ)

సజాతీయ విజాతీయ స్వగత భేద శూన్యమును, పరిశుద్ధమును, సుఖ స్వరూపమును, నాశ రహితమును, పరిపూర్ణమును అగునట్టిదై, సత్తు, చిత్తు, ఆనందము, నిత్యము, నిర్మలము అనెడు పంచలక్షణముల చేత వెలుగునట్టిదైన పరబ్రహ్మము (పరమాత్మ), అణువుల కంటె అణువును, మహత్తులో మహత్తును, నామ రూప క్రియారహితమును, అఖండమును జననమరణములు, సుగుణ దుర్గుణములు లేనిదియును, వివిధ వర్ణములు లేనిదియునైయున్నది.

సజాతీయ భేదము : తన జాతి వస్తువుకన్న తాను భేదముగా నుండుట.
విజాతీయ భేధము : ఇతర వస్తువు కన్న తాను భేదముగా నుండుట.

స్వగత భేదము : తన యందే యుండు అవయవములకు ఇంద్రియములకు పరస్పరము భేదముగా నుండుట.

జాగ్రత దశయందు ఎదుట కనుబడు వస్తువులు కనబడకుండునపుడు యేరూపముండునో అది పరబ్రహ్మము. మనసునకు సంకల్పరాహిత్యము అగునపుడు అదే పరబ్రహ్మము.

పరబ్రహ్మము అవాంగ్మానస గోచరమై, అజరమై, నిత్యరమై,అపక్షయ రహితరమై, వృద్ధి రహితరమై, శరీరము నశించునపుడు తాను నశింపక యుండునది.

"ఆకాశస్య గుణశ్శబ్దో నిశ్శబ్దో బ్రహ్మ ఉచ్యతే" – ఉత్తర గీత

ఆకాశమందు శబ్దమున్నది. శబ్ద రహితమే పరబ్రహ్మము. పరబ్రహ్మము సత్య జ్ఞానానంద స్వరూపము, నిర్వికారము, నిరవయవము, నిత్యము, నిర్దోషము, పరిపూర్ణముగా నున్నది. సగుణ బ్రహ్మోపాసన చేయువారు అర్చిరాది మార్గముగా బ్రహ్మలోకమును పొంది, సుఖములనుభవించి తిరిగి పుట్టుచున్నారు. నిషిద్ధ కర్మలాచరించువారు నరకమున యాతనామయ దేహమును పొంది దుఃఖముల నుభవించుచున్నారు. బ్రహ్మము అవిద్యవలన సగుణ బ్రహ్మమై అయిదు భేదములుగా చెప్పబడును.

1) శుద్ధచైతన్యము : సాక్షిరూపము, పరమాత్మ, అంతరాంతర ఏఱుక (అఖండము)

2) మాయావచ్ఛిన్న చైతన్యము : ఈశ్వరుడు, సృష్టికర్త, సర్వాంతర్యామి, సగుణ బ్రహ్మము. దీనికే శబళ బ్రహ్మమని పేరు. (బ్రహ్మాండమునకు సాక్షి)

3) అంతఃకరణావచ్ఛిన్న చైతన్యము : జీవుడు అంతఃకరణయందు ప్రతిఫలించిన ప్రతిబింబము. బింబ ప్రతిబింబములకు భేదము లేనట్లు, జీవునకు, అంతః కరణావచ్ఛిన్న చైతన్యమునకు భేదము లేదు (పిండమునకు సాక్షి)

4) వృత్యవచ్ఛిన్న చైతన్యము : అంతఃకరణ వృత్తులయందు ప్రతిఫలించు

చైతన్యము. ఇదియే జ్ఞానము. ఇదియే మహదహంకారము (బ్రహ్మాండము)

5) విషయావచ్ఛిన్న చైతన్యము : ఘటము, పటము మొదలుగా గలవి, జ్ఞాన శూన్యమై, వికారాస్పదమై యుండును. (పిండాండము)

ఆత్మ ప్రతిబింబము వలన శబ్ద స్పర్శ రూప రస గంధములు అను పంచతన్మాత్రలు గలిగెను. తద్వారా అపంచీకృత పంచ మహా భూతములు వేరుపడి పంచీకరణమయ్యెను.

మాయోపాధిక బ్రహ్మము సగుణ బ్రహ్మయనియు, కేవలమైన మాయారహిత మగు బ్రహ్మము నిర్గుణమనియు, సగుణ నిర్గుణ విలక్షణమగు బ్రహ్మము నిష్ప్రతియోగిక మనియు పరబ్రహ్మమనియు పెద్దలు చెప్పుదురు.

ప్రత్యగాత్మ వివరణము :

కం॥ వికలత్వమేమిలేకను – భృకుటికిపై
చూడ్కినిలిపి – బిత్తరవోకన్ – శుకవాణి
గలసి బెనగుచు – సుకరంబగు సురతమందు
సోలుచుండుమురా – నిరంతరము –
గ్రాలుచుండుమురా – కాలునికందని –
కరదీప ప్రజ్ఞలో – జాలిబొందక నీవు – జయ
భేరి వేయుము – చాలుచాలిక మెరుపు
జూడరా – జలధరములో మెరయుకైవడి
మేలుమేలనిరే వెలుంగున – మిళితుడై పర
బయలు దాకి – సోలుచుండుమురా –
నిరంతరము – గ్రాలుచుండుమురా –

– కందార్థ రత్నావళి 127 వ కం॥

తా॥ నిజగురు పుత్రుడగు, వికలత్వము లేని చిద్ఘనుడగు, సచ్ఛిష్యుడు తనయందలి 'శిం' అను అనాహత శబ్దమునందు లీనమై, సహస్రారమే స్థానమై, ఉన్మనీ అవస్థయందు, శాంభవీ లక్ష్యమున, త్రిపుటియంతయు నిరంతర హవిస్సులుగా అంతర్యజ్ఞమందు పూర్ణాహుతి యొనర్చి, అఖండత్వమైన విశ్వానుభవమున కంకురార్పణయైన నీవార శూకాగ్ర మందున్న విద్యుల్లేఖయైన ఎఱుకగా కేవలాత్మ స్వరూపుడై బయలును లక్ష్యించునని భావము.

కం॥ విశ్వోత్పత్తికి యజుడని – విశ్వము రక్షింప
బెంప । విష్ణువటని యా । విశ్వము జెరుపను
హరుడని – విశ్వేశ్వరు నెన్ను చుంద్రు – వేర్వే
ర జనులు – నియమాత్మలో – శర్వుని ఘను
లు – నిర్వాణ ప్రజ్ఞలో – నిత్రించు జ్ఞప్తిని
సర్వత్రకెరలుట – సంయోగ ఊచ్చగు –
నిర్వికల్పక హృదయ వాసము – నిత్యసత్య
నిరూఢమ మరెడు పర్వులోగురి పూర్ణ
కలయిక ప్రత్యగాత్మము స్వస్వరూపము –
వేర్వేర జనులు – నియమాత్మలో –
శకర్వుని ఘనులు –

కందార్థరత్నావళి 128వ. కం॥

తా॥ నిత్య శివోహ స్వరూపుడగు నిజగురు కరుణా కటాక్షమున ప్రత్యగాత్మ – పరమాత్మల అభేద స్థితి యందున్న అఖండమగు ఎఱుక నిర్ణయమందు, విశ్వమే విశ్వేశ్వరుడని నిర్ణయించెదరు. సర్వమును నిర్ణయించెడివారలు, అవిద్యా మోహితులై భిన్నత్వమే లేని దివ్యత్వమున, లోకమునందు విచారణగా తెలుపబడు దేవతలనందరినీ, సత్య మనియెదరు. కాని నిర్వాణ ప్రజ్ఞయైన, సర్వవ్యాపకమైన, అఖండమైన కేవలాత్మయందు, నిర్వికల్ప సమాధియందు వారందరూ హృదయస్థులని ప్రత్యక్ పరమాత్మ లభిన్నులని, రూఢి గాంచి స్థిరత నందుదరని భావము.

కం॥ రెంటికి లోవెలితనుదా – నంటిన సర్వంబు
బ్రహ్మమను న్యాయముగా – కంటికి దా
వలమై మి – న్నంటినదే నిర్వికల్ప – మని
యెంచరోరీ – హృత్పదమధ్య – గనిమెలగు
పోరి – తనివి దీరగనీవు – తత్పరజ్ఞప్తిలో

గని మెలగుచుండుము । గత కామము
న మించి । యను మతంబున నప్రమే
యము । నందు బాయక నిండి వెలయగ ।
చెనకి యాత్మని బోధనంబున । చిత్పరం
బగు కలిత పూర్ణ మని యెంచరోరి ।
హృత్పదమధ్య గని మెలగు పోరి ॥

– కందార్థ రత్నావళి 129వ కం॥

తా॥ నిజగురు పుత్రుడగు సచ్ఛిష్యుడు, జీవేశ్వరులకు వెలియైన, అతీతమైన, అఖండమైన, సర్వమైన, నిర్విశేష, నిర్వికార పరబ్రహ్మమగు ఎఱుకను కేవలాకాశ మనెడిది యని, సహజ నిర్వికల్ప స్థితియని, హృత్పుండరీక దహరాకాశమును మించి, తత్పరమై గతకామతయే ఆచరణగా, త్రిపుటి రహితముగా, చిన్మయమైన పూర్ణమంతయూ నిండి, ఇదియంతయూ కేవలాత్మ అంశమని అంది, నిత్యానందుడగునని భావము.

కం॥ తన తనువు తనకు బంధము । తనువున
తన్నెఱుగకున్న । తమ ముగ్రసించున్ ।
తన రూపు తానెఱింగిన । మనుజుడె
పరతత్త్వమందు – మరిగియుండునురా
చిన్మయమంది – మురియుచుండునురా
తరలని ప్రజ్ఞచే ॥ తమము ద్రోసిముక్తి ।
నొఱయు మార్గము మది । నొక్కింత
నెక్కొని । యిరవుగన్గొని యీడితంబని ।
యిచ్చమెచ్చగనుబ్బిపరుడై ॥ గురికి
బయలగు బ్రహ్మమయమును । గోరి
పొందుచు నిర్గుణుండై – మఱిగి
యుండునురా – చిన్మయమంది –
మురియుచుండును రా॥

– కందార్థ రత్నావళి 130వ. కం॥

తా॥ సద్గురు కరుణా కటాక్షమున స్వరూప జ్ఞానానుభవము అయిన ఆత్మానుభవమందు అజ్ఞాన తమము అయిన జీవజగత్తుల మిథ్యానుభవమంతా లేనిదై, పరతత్త్వమనెడి, అఖండ పరబ్రహ్మమనెడి ఎఱుకయందు చిన్మయ మూర్తిగా, సహజముగా, ముక్తి అనుభవమంది కేవలమైన స్థితియందు నిర్గుణ పరబ్రహ్మకు లక్ష్యముగా, బయలును నిర్ణయించి, మూలావిద్యను నిరసించెడి మార్గము నొందుటకు నిజగురువుల నాశ్రయించి, ఆవరణ రహిత విధాన నిర్ణయమంతయూ పరమానందమున అందునని భావము.

కం॥ తనలో తానగు బయలున । తన కన్యము
దోచరాదు । తత్త్వజ్ఞుడవై । కనిగానక
నిన్నఱచిన । ఘనమగు సచ్చిస్స్వరూప
గమనమదేరా – చిదానంద – మమలమ
దేరా – గమకించి హృద్వీధి ॥ గద్దియ పైనెక్కి
విమల మౌచూట్కిలో । వివరించి మించుము ।
క్రమము దప్పక ॥ తన్మయత్వము । కట్టుము
ట్టుచుగిట్టినంతట । కుముద బాంధవు
కాంతి జేరెదు । కోటి భాస్కర చిత్పరంబగు –
గమనమదేరా – చిదానంద – మమలమదేరా ॥

– కందార్థ రత్నావళి 131వ. కం॥

తా॥ షోడశ కళాపరిపూర్ణమైన, చంద్రమండల పూర్ణానుభవమగు, “తనలోతాను”, ఘనమైన, సచ్చిస్వరూపమై, “తనకన్యము” తోచని స్థితియందు తత్త్వజ్ఞుడుగా, గుణరహితమైన దృష్టిచే చిన్మయఘనిష్ఠమందు, తన్మయత్వము, మన్మయత్వము లయించి కోటిభాస్కర తేజమైన, అఖండమైనకా, చిదానందమందు ఎఱుకను, నిర్ణయ పద్ధతిగా తెలిసి, బయలును లక్ష్యించును. కడకు విమలమై ఆవరణ రహితమై తానే లేకపోవును అని భావము.

ద్వితీయాంక సమాప్తి

సద్గురు కరుణకు పాత్రమైన సచ్ఛిష్యులు సదసద్వివేకమునే లక్ష్యముగా పిండాండము నందలి గోళకములు బ్రహ్మాండమందలి తత్త్వ ప్రధానము లైన తన్మాత్రలచే, ఇంద్రియాదిష్ఠాన దేవతలచే నిర్వహించబడు చున్నదని బ్రహ్మాండ పంచీకరణ దృష్ట్యా తాను కూటస్థుడని ఎఱిగి నిజ గురువుల నాశ్రయించి, మహావాక్య విచారణను గావించి, నిత్యానిత్యములు, ఆత్మానాత్మలు, సదసత్తులు, జడచేతన విమర్శనములను అనుభవ పూర్వకముగా సాంఖ్య, తారక యుక్తముగా జీవించి, శేషించిన అమనస్క అనుభవము సచ్చిదానందము. నేను – తాను అనెడి ముక్తి ఘటియించిన విధమంతయు, సద్గురువు హృదయము నందైక్యమై అనుభవించెదరు. తదుపరి తాము స్వీయ ప్రజ్ఞా స్థితినందు బ్రహ్మ నిష్ఠను పొంది, అఖండమగు దానిని లక్ష్యించి కార్యకారణ వివేకమును భావర్ధమును గ్రహించెదరు. కేవలమై బ్రహ్మవేత్తలుగా ఉత్తమోత్తమములుగా సహజ ముక్తినందెదరు.

– ద్వితీయాంకము సమాప్తం –

– సర్వ సద్గురు చరణారవిందార్పణమస్తు –

సర్వ వేదాంత శిరోభూషణము

శూన్యం – సర్వం, సర్వం – శూన్యం

తృతీయాంకము

గురుధ్యానము :

అవతరణ :

శ్లో॥ యస్యప్రసాదా దహమేవ సర్వం । మయ్యేవ సర్వం పరికల్పితంచ।
ఇత్థం విజానామి సదాత్మరూపం । తస్యాంఘ్రిం పద్మం ప్రణతోఽస్మి నిత్యం॥

– సుజ్ఞాన దీపము 181వ శ్లో॥

తా॥ నేనే సర్వమగుచున్నాను. నాయందే సర్వమును గల్పింపబడుచున్నది. ఏ గురువు యొక్క అనుగ్రహము వలన నీ ప్రకారముగా పరమాత్మ స్వరూపమును దెలిసికొనుచున్నానో, అట్టి సద్గురువు యొక్క పాదపద్మములకు యెల్లప్పుడును నమస్కరించుచున్నాను.

శ్లో॥ అజోఽహమమరోఽహంచ। అనాది నిధ నోహ్యహం ।
అవికారశ్చిదానందో । అణోరణియాన్ మహతోమహాన్ ॥

– సుజ్ఞాన దీపము 186వ శ్లో॥

తా॥ నేను పుట్టుక లేనివాడను. నేను మరణము లేనివాడను. నేను ఆద్యంతములు లేనివాడను, వికారములేని వాడను, చిదానంద స్వరూపుడను. మిక్కిలి సూక్ష్మ స్వరూపుడను. గొప్ప వస్తువు కంటెను గొప్పవాడను అగుచున్నాను.

శ్లో॥ అపూర్వమపరం నిత్యం । స్వయం జ్యోతిర్నిరామయం ।
విరజం పరమాకాశం । ధ్రువమానంద మవ్యయం ॥

– సుజ్ఞాన దీపము 187వ శ్లో॥

తా॥ ముందు లేనిదియును, వెనుక లేనిదియును, శాశ్వతమును, స్వప్రకాశమును, వ్యాధి లేనిదియును, పాపము లేనిదియును శ్రేష్ఠమైన చిదాకాశమును, నిత్యరూపమును ఆనందరూపమును, శాసనము లేనిదియును అగుచున్నాను.

శ్లో॥ పిండం కుండలినీ శక్తిః । పదం హంస ముదాహృతం ।
రూపం బిందురితిజ్ఞేయం । రూపాతీతం నిరంజనం ॥

– సుజ్ఞాన దీపము 194వ శ్లో॥

తా॥ ఓ పార్వతీ! పిండమనగా కుండలినీ శక్తి; పదమనగా ఉచ్ఛ్వాస్వ నిశ్వాస రూపమైన హంస స్వరూపము. రూపమనగా బిందువులనెడి అన్నిటిని తెలిసికొన దగిన ద్రష్టయగు యెఱుక; రూపాతీతమే నిరంజనమైన యచల పరిపూర్ణ పరబ్రహ్మము అని తెలిసికొనుము.

శ్లో॥ పిండేముక్తాః పదేముక్తా। రూపేముక్తాః వరాననే ।
రూపాతీతే చ యేముక్తా। స్తేముక్తా నాత్రసంశయః

– సుజ్ఞానదీపము 195వ శ్లో॥

తా॥ కుండలినీ శక్తియందును, హంస స్వరూపమునందును ఆపోజ్యోతి స్వరూప దర్శనమునందును, కళాతీతమైన పరిపూర్ణమందును ముక్తులగు వారెవరో వారే ముక్తులు; సందేహము లేదు.

శ్లో॥ గురుర్ధ్యానే నైవ నిత్యం । దేహీ బ్రహ్మ మయోభవేత్ ।
స్థితిశ్చయత్ర కుత్రాలి । ముక్తోఽసౌ నాత్ర సంశయః ॥

– సుజ్ఞాన దీపము 196వ శ్లో॥

తా॥ శిష్యుడెక్కడ యుండినను, ఎల్లప్పుడు సద్గురు స్వరూప ధ్యానము చేతనే బ్రహ్మ స్వరూపియై ముక్తుడగును. సందేహము లేదు.

శ్లో॥ తథైవ జ్ఞానవాన్ జీవః । పరమాత్మని సర్వదా॥
ఐక్యేనర మతే జ్ఞానీ । యత్రకుత్ర దివానిశమ్ ॥

– సుజ్ఞాన దీపము 198వ శ్లో॥

తా॥ పరమాత్మ జ్ఞానము గల జీవుడు ఎల్లప్పుడును పాలు నీరు మొదలైనవి యెట్లు ఏకత్వమును బొందునవియో ఆ ప్రకారముగానే పరమాత్మయందైక్యమును బొందుచున్నాడు. బ్రహ్మజ్ఞానముచే జనుడు ఏ ప్రదేశములందైనను, రాత్రింబగళ్ళు పరమాత్మతో జేరి ఆనందించుచున్నాడు.

శ్లో॥ జ్ఞేయం సర్వమతీంచ । జ్ఞానాంచ మనుఉచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం సమంకృత్వా । యథానాన్యత్ ద్వితీయకం ॥

– సుజ్ఞాన దీపము 211వ శ్లో॥

తా॥ జ్ఞానమును, జ్ఞేయమును రెండును మనస్సుగానే చెప్పబడుచున్నది. జ్ఞానజ్ఞేయములు భిన్నములు గాక యొకటియనిన మాయయేనని రెండవది యేదియును లేదు. ఇదియే అఖండము, సర్వాతీతమగు జ్ఞేయము. బ్రహ్మమును గ్రహించు మనస్సే జ్ఞానము.

శ్లో॥ స్వయం బ్రహ్మమయోభూత్వా । తత్పరం చా వ లోకయేత్ ।
పరాత్పరతరం నాన్యత్ । సర్వగం తన్నిరామయమ్ ॥

– సుజ్ఞాన దీపము 212వ శ్లో॥

తా॥ జనుడు తాను బ్రహ్మస్వరూపియై, ఆ పిమ్మట దానికతీతమైన పరస్వరూపమగు కేవలాత్మను జూచును. అట్టి పరస్వరూపమగు పరిపూర్ణము కంటె అన్యమేదియును లేదు. అది అంతటను నిండి యుండునదియును, నిరామయమైనదియునై యున్నది. అది దేనికిని ఆధారము కాదు.

శ్లో॥ కిమావాహన మవ్యక్తే । వ్యాపకే కిం విసర్జనం ।
అమూర్తే చ కథం పూజా । కథం ధ్యాన నిరామయే ॥

– సుజ్ఞాన దీపము 213వ శ్లో॥

తా॥ నామరూపాది వికారములు లేని కేవలాత్మయందు ఆవాహనమే కలుగదు. అంతటా నిండియుండెడి పరిపూర్ణమందు విసర్జనమే గలుగదు. ప్రకృతి ద్వయము లేని, రూపము లేని, అశరీరమందు పూజించుట కలుగదు. అత్యంత విలక్షణమగు అచల బ్రహ్మమునందు ధ్యానమే కలుగనేరదు.

గురు పాదుకాస్తవము

1) శ్లో॥ శ్రీ సమంచిత మవ్యయం పరమ ప్రకాశ మగోచరం ।
భేదవర్జిత మప్రమేయ మనంత మాద్య మకల్మషం ।
నిర్మలం నిగమాంత మద్వయ మప్రతర్క్య మబోధకం ।
ప్రాతరేవహి మానసాంతార్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ అష్టైశ్వర్యయుక్తమైన, సర్వమైన ఎఱుక, నాశనము లేనిదైన పరబయలునందు, సర్వవ్యాపక ప్రకాశక లక్షణంతో జీవేశ్వర జగద్భావము దృష్ట్యా చూడబడిన కనబడనదియు మరియు ఏకమై యున్నదియు, ఆద్యంతములు నిర్ణయించుటకు సాధ్యము కాకుండా, పరిమితులను నిర్ణయింపశక్యము కాకుండా, మొట్టమొదటిదైన ఆవరణ దోషము లేనిదియు, స్వచ్ఛమైనదియు, వేదాంతసారమైనదియు, రెండు గాక అఖండమైనదియు, తర్కముచే తెలియరానిదియు, బోధించుటకు వీలుకానిదియు అగు పరిపూర్ణ నిర్ణయము కొరకు సచ్ఛిష్యుడు తన ప్రజ్ఞను సద్గురుప్రజ్ఞ యందైక్యపరచి గురుపాదుకలనబడే కాలభేదము లేని నిజగురు హృదయైక్యము నాశ్రయించవలెనని భావము.

2) శ్లో॥ నాదబిందు కళాత్మకం దశనాద భేద వినోదకం ।
మంత్రరాజ విరాజితం నిజమండలాంతర్భాసితం ।

పంచవర్ణ మఖండ మద్భుత మాదికారణ మచ్యుత ।
ప్రాతరేవహి మానసాంతర్భావయేత్ గురు పాదుకాం ॥

తా॥ సర్వసృష్టికి కారణమైన ఎఱుక నాద, బిందు, కళలలో వ్యక్త రూపముగా, జీవ పరిణామమునందు దశవిధ నాదభేదములచే చైతన్యరూపమై వినోదించుచూ, మంత్ర రాజమైన ఓంకారముచే ఆధారమై, సోమ, సూర్య, అగ్ని మండలములందతర్భూతమైన ప్రకాశ రూపమున, పంచవర్ణములైన అ,ఉ,మ, అర్ధ మాతృక, బిందువులచే సర్వవ్యాపకమై, అఖండముగా, అద్భుతముగా, తానే ఆది కారణముగా, అవినాశిగా గోచరించు ఎఱుక, సద్గురు హృదయైక్యమందు సచ్ఛిష్యుని ప్రజ్ఞ శూన్యము కాగా, లేనిదని తెలియబడి, పరిపూర్ణమైన బయలు స్థితిని నిర్ణయమందుటకు గురుపాదుకలనబడే, కాలభేదము లేని నిజగురు హృదయైక్య స్థితినాశ్రయించవలెనని భావము.

3. శ్లో॥ వ్యోమవద్బహిరంతర స్థిత మక్షరం నిఖిలాత్మకం ।
కేవలం పరిశుద్ధమేక మజన్మహి ప్రతిరూపకం ।
బ్రహ్మతత్త్వ వినిశ్చయం నిరతాను మోక్ష సుబోధకం ।
ప్రాతరేవహి మానసాంతర్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ అంతరిక్షము, బాహ్యాభ్యంతర భేదము లేకుండా ఎట్లున్నదో అట్లున్న బయలు నాశనము లేనిది, సర్వమునందు వ్యాపకమై సర్వము అయిన ఎఱుక నంటకుండా కేవలము, మల, విక్షేప ఆవరణ దోషములు లేని పరిశుద్ధము, పుట్టుక లేనిది. బింబ, ప్రతిబింబములు లేనిది. బ్రహ్మ జ్ఞాన సారముచే నిశ్చయమందిన ఎఱుకను నిశ్చయించుటకు పరిపూర్ణ స్థితియైన, కాలభేదములేనట్టి, మోక్ష రూపమైన సద్గురు హృదయైక్యమనే నిజ సమాధియందు నిస్తరంగ స్థితితో గురుపాదుకలనబడే నిజగురు హృదయైక్యము నాశ్రయించవలెనని భావము.

4. శ్లో॥ బుద్ధిరూప మబుద్ధికం త్రితయైక కూటనివాసినం ।
నిశ్చలం నిఖిల ప్రకాశక నిర్మలం నిజమూలకం ।
పశ్చిమాన్తరఖేలనం నిజశుద్ధ సంయమి గోచరం ।
ప్రాతరేవహిమాన సాంతర్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ సర్వమైన ఎఱుక బుద్ధిరూపముగా వ్యక్తముగాను, అబుద్ధి రూపముగా అవ్యక్తముగాను, త్రిపుటికి ఆధారమైన కూటస్థముగాను ఉన్నది. కాని కదలనటు వంటి బయలునందు పైన చెప్పబడిన సర్వమును ప్రకాశింపచేసెడిది అయిన ఎఱుక, నిర్మలమనెడి ఈశ్వర తను అనుభవముచే, తన మూలముకై సర్వ వేదాన్త సిద్ధాంత నిర్ణయములను నిరసించుచూ వెదకగా, నిజగురు హృదయైక్య స్థితియందు కాలభేదమే లేని బయలును కనును. అట్టి గురుపాదుకలనబడే నిజగురు హృదయైక్య పరిపూర్ణ స్థితిని ఆశ్రయించవలెనని భావము.

5. శ్లో॥ హృద్గతం విమలం మనోజ్ఞ విభాసితం పరమాణుకం ।
నీలమధ్య సునీలసన్నిభ మాదిబిందు నిజాంశుకం ।
సూక్ష్మ కర్ణిక మధ్యమస్థిత విద్యుదాది విభాసితం ।
ప్రాతరేవహిమాన సాంతర్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ అష్టదళ పద్మమైన, అష్టతను అనుభవమూలమైన హృదయ పద్మమునందు ఎఱుక శుద్ధరూపముగా, మనోహరముగా, స్వప్రకాశముగా పరమాణు రూపముగా, బిందు స్థాన అంతరమందు నీలవర్ణము, సునీల వర్ణముచే ప్రకాశించునదియు, శాంభవీ లక్ష్యార్ధ స్థానము అయిన సహస్రారమందు దుద్దు అయిన సుధామండలమున నుండి తటిల్లత వలె సర్వమును ప్రకాశింపజేసెడి ఎఱుక లేనిదని, పరిపూర్ణ స్థితియందున్న గురు పాదుకలనబడే కాలాతీతమైన నిజ గురు హృదయైక్యమైన బయలును ఆశ్రయించవలెనని భావము.

6. శ్లో॥ పంచ పంచ హృషీక దేహ మనశ్చతుష్క పరస్పరం ।
పంచ భూత సకామషట్క సమీర శబ్ద ముఖేతరమ్ ।
పంచకోశ గుణత్రయాది సమస్త ధర్మ విలక్షణం ।
ప్రాతరేవహిమాన సాంతర్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ పంచీకరించబడెడి, జీవేశ్వర జగత్తులను హృత్పద్మస్థానము నుండి, ఎఱుక నాలుగు జీవతనువులను అంతఃకరణముచే, నాలుగు ఈశ్వర తనువులను హృదయ పద్మము నుండి, ఏకముగా నడిపించుచున్నది. పంచ భూతములను, పంచ తన్మాత్రలను, అరిషడ్వర్గములను, షట్చక్రములయందు హంసచే నడుపుచూ సర్వమునూ వ్యక్తీకరించుచున్నది. పంచకోశములకు, త్రిగుణములకు, సమస్త

ధర్మములకు విలక్షణమైన పరిపూర్ణమైన బయలునందు ఇప్పటి లేనివని సద్గురు పాదుకలనబడే కాలాతీతమైన గురు హృదయైక్యమును ఆశ్రయించవలెనని భావము.

7. శ్లో॥ పంచముద్ర సులక్ష్య దర్శన భావమాత్ర నిరూపణం ।
విద్యుదాది ధగద్ధగిత్వ రుచిర్వినోద వివర్ధనం ।
చిన్ముఖాంతర వర్తినం విలసద్విలాసమమాయకం ।
ప్రాతరేవహి మానసాంతర్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ భూచరి, ఖేచరి, షణ్ముఖి, రాధాయంత్ర, శాంభవి ముద్రలలో మూలబంధ, ఉడ్యాణ బంధ, జాలంధర బంధములతో సుధా మండలమును దర్శించగా, సంకల్ప మాత్ర నిరూపణమగునదంతా ఎఱుకయే. విద్యుల్లత వలె, జ్వాలా కిరణమువలె బంగారు కాంతిని, సృష్టి వికాసమును వినోదమును, వ్యాపకత్వమును కలిగినది ఎఱుకయే. చిత్స్వరూప, సచ్చిదానంద, చిదాకాశముల యందు వర్తించి స్వప్రకాశ రూపమగునదంతయూ ఎఱుకయే. కాని ఈ సర్వము మాయాతీతమనెడి పరిపూర్ణ స్థితి అయిన బయలునందు లేనిది. కావున గురు పాదుకమనే కాలాతీతమైన నిజగురు హృదయైక్యమనే స్థితినాశ్రయించవలెనని భావము.

8. శ్లో॥ పంచవర్ణ రుచిర్విచిత్ర విశుద్ధ తత్త్వ విచారణం ।
చంద్ర సూర్య చిదగ్ని మండల మండితం ఘట చిన్మయం ।
చిత్కళా పరిపూర్ణమంతర చిత్సమాధి నిరీక్షణం ।
ప్రాతరేవహి మానసాంతర్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ అకార, ఉకార, మకార, అర్ధ మాతృక, బిందువలనబడే పంచవర్ణ స్వరూపమైన ఓంకార బిందువును ప్రకాశింపచేయునది, దైవమనబడే విశుద్ధ తత్త్వము. తత్త్వ విచారణచే పొందబడిన బ్రహ్మమను నిర్ణయము. చంద్రుడు, సూర్యుడు, చిదగ్ని అనెడి మండల త్రయముచే నడుపబడే బ్రహ్మాండమనెడి ఘటము చిన్మయ దేహము. చిత్కళలచే స్వప్రకాశ స్వరూప జ్ఞానముచే సమాధి నిష్ఠయందు పొందబడే దహరాకాశ అనుభవము అంతయూ ఎఱుకయే. కాని దృశ్యము, ద్రష్ట ద్రష్టాద్రష్ట, అద్రష్ట కానిదైన నిరీక్షణయైన పరిపూర్ణమందు పై చెప్పబడినదంతయూ లేనిదే. కావున కాలభేదము లేని సద్గురు పాదుకలనబడే నిజగురు హృదయైక్యమును ఆశ్రయించవలెనని భావము.

9. శ్లో॥ హంసచార మఖండ నాదమనేక వర్ణ మరూపకం ।
శబ్ద జాలమయం చరాచర జంతుదేహ నివాసినం ।
చక్రరాజ మనాహతోద్భవ మేకవర్ణ మతః పరం।
ప్రాతరేవహి మానసాంతర్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ ఎఱుకచే మూలాధారాది సహస్ర ఫణాంతము వరకూ యున్న హంస సంచారమంతయూ అనాహత శబ్దమందు లయింపగా, సర్వ వర్ణములు, సర్వ రూపములు లయించినవి. శబ్దముచే సర్వసృష్టి యంతటా చరాచరములయందు జీవరాశియందు వ్యాపకమైనదంతా ఎఱుకయే. చక్రరాజమనబడే హృదయ పద్మమందు 'శిం' అను ఏక వర్ణముచే ఎఱుక నిర్ణయమగుచున్నది. కాని ఈ ఎఱుక నాశరహితమైన పరిపూర్ణమందు లేనిదే. కావున గురుపాదుకలనే, కాలభేదము లేని నిజగురు హృదయైక్య స్థితిని ఆశ్రయించవలెనని భావము.

10. శ్లో॥ జన్మకర్మ విలీన కారణ హేతు భూత మభూతకం ।
జన్మకర్మ నివారకం రుచి పూరకం భవతారకం ।
నామరూప వివర్జితం నిజనాయకం శుభదాయకం ।
ప్రాతరేవహి మానసాంతర్భావ యేత్ గురుపాదుకాం ॥

తా॥ జన్మము, కర్మములతో కూడిన సర్వమునకు కారణమైనది, భౌతికము, అభౌతికమనబడే కారణములన్నింటికి కారణమైనది ఎఱుకయే. కాని జన్మకర్మలు లేనిది, సర్వత్ర నిండియున్నది, జన్మరాహిత్యమైన పరిపూర్ణము. నామరూపములు లేనిది, మూలము లేనిది, శుభమైనది, ఉత్తమ పురుష శబ్ద వాచ్యమైనది అయిన బయలు కారణము, కారణాద్భిన్నము, ఖండము, అఖండము, ఏకము, అనేకము, అనబడేవేమీ లేనిది. అట్టి గురుపాదుకలనబడే, కాలభేదము లేని నిజగురు హృదయైక్యమును ఆశ్రయించవలెనని భావము.

11. శ్లో॥ తప్త కాంచనదీప్యమాన మహాణుమాత్ర మరూపకం ।
చంద్రికాంతర తారకై రివ ముజ్జ్వలం పరమాస్పదం ।
నీలనీరద మధ్యమస్థిత విద్యుదాది విభాసితం ।

ప్రాతరేవహి మానసాంతర్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ గురుసూచనచే ఏర్పడిన ఆర్యాదర్పణ మండలి మహాణువు అయిన కాల్చిన బంగారమువంటి ప్రకాశము గల బిందువు ఆధారము లేనిది, రూపము లేనిది. పౌర్ణమి నాటి వెన్నెల వంటిది, నక్షత్ర ప్రకాశము వంటిది, నల్ల కలువ పూవు వంటిది, దక్షిణ నేత్రమందు ఉజ్జ్వలమైన, శుద్ధ ఎఱుకయైన, ఆపోజ్యోతి మహనీయమైన నీల మేఘమండలి మెరుపు వంటిది, స్వప్రకాశమైనది అయిన ఎఱుక అనగా కేవలాత్మ పరిపూర్ణమందు లేనిది. కావున గురుపాదుకలనబడే, కాలభేదము లేని నిజగురు హృదయైక్యమునాశ్రయించవలెనని భావము.

12. శ్లో॥ స్థూలసూక్ష్మ సకారణాంతర ఖేలనం పరిపాలనం ।
విశ్వతైజస ప్రాజ్ఞ చేతసమంతరాత్మ నిజాంశుకం ।
సర్వకారణ మీశ్వరు నిట లాంతరాళ విహారకం ।
ప్రాతరేవహిమానసాంతర్భావయేత్ గురుపాదుకాం ॥

తా॥ స్థూల, సూక్ష్మ కారణముల అంతరమునుండి క్రీడించుచూ మహాకారణ ముగా పరిపాలించునది ఎఱుకయే. విశ్వ, తైజస, ప్రాజ్ఞ, ప్రత్యగాత్మలుగా చైతన్యమునే వస్త్రముగా కలిగినది ఎఱుకయే. సర్వ కారణ రూపమైన (విరాట్, హిరణ్యగర్భ, అవ్యాకృత పరమాత్మలు) ఈశ్వరుడు ఎఱుకయే. ఇట్టి సర్వమందు విహరించునది, భృకుటియందు తెలియబడునది ఎఱుకయే. కాని ఇది పరిపూర్ణమందు లేనిదే. కావున గురుపాదుకలనబడే కాలాతీతమైన, పరమ గుర్వైక్యము నాశ్రయించవలెనని భావము.

పంచ భ్రమ నివృత్తి

శ్లో॥ నిదాఘోనామ యోగీన్ద్రః ఋభుం బ్రహ్మ విదాం పరమ్ ।
ప్రణమ్య దండవద్భూమా వుత్థాయ స పునర్మునిః॥
శ్లో॥ ఆత్మ తత్త్వమను బ్రూహీత్యేవం పప్రచ్ఛసాదరమ్ ।
క యోపాసన యా బ్రహ్మన్నీ దృశం ప్రాప్త వానసి ॥
– స్తోత్రమంజరి

తా॥ మునిపుంగవుడైన నిదాఘుడను యోగీంద్రుడు, బ్రహ్మ విద్వరుడగు ఋభు మహర్షిని సమీపించి, భూమిపై సాష్టాంగ దండ ప్రమాణమాచరించి, ఆ పిదప లేచి, "దయచేసి ఆత్మతత్త్వమునుపదేశింపుడు" అని సాదరముగా ప్రశ్నించెను. మరియు వారితోనిట్లనెను. "ఓ మహాత్మా! ఏయుపాసన చేత నిర్విఘ్నమగు పదవిని పొందిరి?"

శ్లో॥ తాం మేబ్రూహి మహావిద్యాం మోక్ష సామ్రాజ్యదాయినీమ్ ।
నిదాఘ! త్వం కృతార్థోஉసి శృణువిద్యం సనాతనీమ్ ॥
శ్లో॥ యస్యవిజ్ఞాన మాత్రేణ జీవన్ముక్తో భవిష్యసి ।
భ్రమః పంచవిధో భాతి తదేవేహ సముచ్యతే ॥

తా॥ "మోక్షసామ్రాజ్యమునొసంగునదైన ఆ మహావిద్య (ఆత్మ విద్య)ను నాకెఱింగింపుము", ఋభువు "నిదాఘుడా! నీవు నిక్కముగ కృతార్థుడవైతివి. దేనిని తెలిసికొనింత మాత్రమున నీవు జీవన్ముక్తుడవు కాగలవో అట్టి సనాతనమగు బ్రహ్మ విద్యను గూర్చి వచించుచున్నాను. వినుము. భ్రమ ఐదు విధములుగ గోచరించును. వాటి క్రమమిచట వచింపబడుచున్నది".

శ్లో॥ జీవేశ్వరౌ భిన్న రూపా మితి ప్రాథమికో భ్రమః ।
ఆత్మ నిష్ఠం కర్తృగుణం వాస్తవం వా ద్వితీయకః ।
శ్లో॥ శరీరత్రయ సంయుక్తో జీవస్సంగీ తృతీయకః ।
జగత్కారణ రూపస్య వికారి త్వం చతుర్థకః॥
శ్లో॥ కారణాద్భిన్న జగతః సత్యత్వం పంచమో భ్రమః ।
పంచభ్రమ నివృత్తిశ్చ తదా స్ఫురతి చేతసి ॥
– స్తోత్ర మంజరి

తా॥ జీవేశ్వరులు భిన్నరూపులనునది మొదటి భ్రమ. తనయందలి (ఆత్మ యందలి) కర్తృత్వగుణము సత్యమనునది రెండవ భ్రమ. శరీరత్రయముతో గూడి జీవుడు సంగియైయున్నాడనుట మూడవ భ్రమ. జగత్కారణ రూపము (బ్రహ్మము)నకు వికారిత్వము గలదనుట నాల్గవ భ్రమ. కారణము కంటె భిన్నమైనట్టి జగత్తు యొక్క సత్యత్వము ఐదవ భ్రమ. ప్రంచ భ్రమ నివృత్తియు అపుడు (ఆత్మ తత్త్వ విచారణ చేయునపుడు) చిత్తమున స్ఫురించును.

శ్లో॥ బింబ ప్రతిబింపదర్శనేన భేద భ్రమోనివృత్తః ।
స్పటిక లోహిత దర్శనేన పారమార్థిక కర్తృత్వ భ్రమో నివృత్తః ॥

– స్తోత్రమంజరి

తా॥ ఆత్మ సాక్షాత్కార జ్ఞాన పూర్వకమైన బింబ ప్రతిబింబ దర్శనముచే ఆత్మకు భేదభ్రమ నివర్తించును. ఆత్మ, అనాత్మ వివేక పూర్వకముగా విచారించిన స్పటిక లోహిత (ఎఱుపుదనము యొక్క) దర్శనముచే ఆత్మకు పారమార్థిక కర్తృత్వ భ్రమ నివృత్తమగును.

శ్లో॥ ఘటమఠాకాశ దర్శనేన సంగీతి భ్రమో నివృత్తః ।
కనక రుచక దర్శనేన వికారిత్వ భ్రమో నివృత్తః ।
రజ్జు సర్ప దర్శనేన కారణాద్భిన్న జగతః

– స్తోత్రమంజరి

తా॥ సదసద్వివేక పూర్వకముగా విచారించిన ఘటమఠాకాశ దర్శనముచే తాను సంగియను, భ్రమ దొలగును. కనక రుచక (ఆభరణ) దర్శనముచే వికారిత్వ భ్రమ నివారించును. కార్యకారణ వివేక పూర్వకముగా విచారించిన రజ్జు సర్ప దర్శనముచే కారణము కంటె భిన్నమగు జగత్తు యొక్క సత్యత్వ భ్రమ నివారణమగును.

శ్లో॥ తదా ప్రభృతి మచ్చిత్తం బ్రహ్మాకార మభూత్స్వయమ్ ।
నిదాఘ ! త్వమపీత్థం హి తత్త్వ జ్ఞానమవాప్నుహి ॥

తా॥ అప్పటినుండి (ఇట్లు ఆత్మ తత్త్వ విచారణచేసినప్పటి నుండి) నా చిత్తము స్వయముగా బ్రహ్మాకారమాయెను. నిదాఘుడా! నీవున్నూ ఇటులనే తత్త్వజ్ఞానము బడయుము.

సాధన పంచకము

శ్లో॥ వేదోనిత్యమధీయతాం తదుదితం కర్మ స్వనుష్ఠీయతామ్ ।
తేనేశస్య విధీయతా మపచితిః కామ్యే మతి స్త్యజ్యతామ్ ।
పాపౌఘం పరిధూయతాం భవసుఖే దోషోఽనుసన్ధీయతామ్ ।
ఆత్మేచ్ఛావ్యవ సీయతాం నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతామ్ ॥

– స్తోత్రమంజరి

తా॥ ముముక్షువగువాడు వేదము (వ+ ఇదం = ఉన్నది) ఇది మాత్రమే అను శాశ్వతమైన పరిపూర్ణము అగు బయలు ఉన్నదని, ఎఱుకలేనిదేనను దృష్టిని, నిత్యము అధ్యయనము చేయవలెను. అందు వచింపబడినట్టి కర్తృత్వ రహిత కర్మను లెస్సగా నాచరించవలెను. అట్టి సత్కర్మాచరణము వలన పరమాత్మ యొక్క పూజ (ఈశ్వర సత్కారము) గావింపవలెను. అందులకు, సాధనమేమనిన ఇంద్రియ (విషయ) సుఖమున గల కోర్కెలను విడువవలెను. దుష్కర్మ సమూహమును సమాధి నిష్ఠచే బాపవలెను. సాంసారిక సౌఖ్యము, దేహభావమందు చెడుగును భావింపవలెను. ఆత్మేచ్ఛ (మోక్ష కాంక్ష) దృఢముగా నిశ్చయింప బడ వలయును. (ఇట్లు సదభ్యాసములచే మనస్సు పరిపక్వమైనపుడు దేహమనెడి స్వగృహమునుండి నమిష్వ్యానుభవమునకై శీఘ్రంముగ బయల్వెడలవలెను.

శ్లో॥ సంగస్సత్సు విధీయతాం భగవతో భక్తిర్దృఢాధీయతామ్ ।
శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాశు సన్త్యజ్యతామ్ ।
సద్విద్వాక్షర మర్థ్యతాం శ్రుతి శిరోవాక్యం సమాకర్ణ్యతామ్ ॥

– స్తోత్రమంజరి

తా॥ సాధువులు, సత్పురుషులతో సాంగత్యము చేయవలెను. భగవంతునియందు సుస్థిర భక్తి గలిగియుండవలెను. శాన్తి మొదలగు సద్గుణములను లెస్సగా సంపాదించవలెను. కర్తృత్వ, భోక్తృత్వ సహిత కర్మమును త్వరితముగా విడువవలెను. జ్ఞాన నిధియగు సద్గురువును ఆశ్రయింపవలెను. వారి పాదపద్మముల సేవింపవలెను. నాశరహిత వస్తువగు పరబ్రహ్మమొక్కటియే అపేక్షింపబడవలెను. వేదాంత వాక్యములనే నిరంతరము శ్రవణము చేయవలెను.

శ్లో॥ వాక్యార్థశ్చ విచ్యాతాం శ్రుతిశిరః పక్షస్సమాశ్రీయతామ్ ।
దుస్తర్కాత్సు విరమ్యతాం శ్రుతిమతస్తర్కోఽను సన్ధీయాతామ్ ।
బ్రహ్మైవాస్మి విభావ్యతాం అహరహర్గః పరిత్యజ్యతామ్ ।
దేహేఽహం మతిరుజ్ఝ్యతాం బుధజనైర్వాదః పరిత్యజ్యతామ్ ॥

తా॥ ఆ వినిన వాక్యముల అర్థమును, మహా వాక్య లక్ష్యార్థమునాశ్రయించి చక్కగా విచారింపవలెను. ఉపనిషదభిప్రాయమ్మైన పరబ్రహ్మమునే ఆశ్రయించవలెను. కుతర్కములను సంపూర్ణముగా విడువవలెను. వేదసమ్మత

మగు పరబ్రహ్మాధిష్ఠాన నిర్ణయ తర్కము గావింపవలెను. "నేను బ్రహ్మము"నని ప్రతి నిత్యము భావించు చుండవలెను. గర్వము(అహం)ను లెస్సగా పరిత్యజించవలెను. దేహమందలి అహంభావము విడువవలెను. బుధజనులతో వాదము చేయరాదు.

శ్లో॥ క్షుద్వ్యాధిశ్చ చికిత్స్య తాం ప్రతి దినం బిక్షౌషధం భుజ్యతామ్ ।
స్వాద్వన్నం నతుయాచ్యతాం విధి వశాత్ప్రా ప్రాప్తేన సన్తుష్యతామ్ ।
శీతోష్ణాది విషహ్యతాం నతువృధా వాక్యం సముచ్చార్యతామ్ ।
ఔదాసీన్య మభీప్స్యతాం జనకృపా నైష్ఠుర్య ముత్సృజ్యతామ్ ॥

– స్తోత్ర మంజరి

తా॥ ఆకలియనెడి రోగము మాన్పవలెను. (దానికై) ప్రతిదినము షడ్రసములను ఆశింపని రీతిగా భిక్షాన్నమను (ప్రాప్తము) మందును గైకొనవలెను. రుచ్యాహారమును యాచింపరాదు, ఆశించరాదు. ప్రారబ్ధ వశమున ప్రాప్తించిన దానితో సంతుష్టి నొందవలెను. శీతోష్ణాదులను సహింపవలెను. వ్యర్థ వాక్యములనుచ్చరించరాదు. ఔదాసీన్యము (ప్రాపంచిక వ్యవహారములలో ఇచ్ఛ, నిర్ణయములు లేకయుండెడి తాటస్థ్యము) గలిగియుండవలెను. లోకుల నిందాస్తుతులకు ద్వైతములకు చిక్కరాదు.

శ్లో॥ ఏకాన్తే సుఖమాస్యతాం పరతరే చేతస్సమాధీయతామ్ ।
పూర్ణాత్మా సుసమీక్ష్యతాం జగదిదం తద్బాధితం దృశ్యతామ్ ।
ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలాఽన్నాప్యుత్తరైః శ్లిష్యతామ్ ।
ప్రారబ్ధం త్విహ భుజ్యతామథ పర–బ్రహ్మాత్మనా స్థీయతామ్ ॥

– స్తోత్రమంజరి

తా॥ పరబ్రహ్మ నిష్ఠయను ఏకాంతమున సుఖముగా గూర్చుండవలెను. పరబ్రహ్మమున చిత్తమును నెలకొల్పవలెను. పూర్ణాత్మను లెస్సగా దర్శించవలెను. ఈ జగత్తును ఆ యాత్మచే బాధితమైన దానినిగ (అసత్తుగ, మిథ్యగ) పరికింపవలెను. పూర్వకర్మ సంస్కారము (సంచితము) ను జ్ఞానాగ్నియను చితియందు విడువ వలెను. జ్ఞానశక్తి చేత ఇకముందు కూడ (ఆగామి) కర్మ సంగము నొందక యుండవలెను. ప్రారబ్ధమిచట దేహముచే ననుభవింపవలెను.


పై జెప్పిన సాధనములన్నిటిని సాధించిన వెనుక తాను పరబ్రహ్మ స్వరూపుడై నెలకొని యుండవలెను.

శ్లో॥ యశ్శ్లోక పంచకమిదం పఠతే మనుష్యః
సంచిన్త యత్యనుదినం స్థిరతా ముపేత్య ।
తస్యాశు సంసృతి దవానల తీవ్ర ఘోర
తాపః ప్రశాన్తి ముపయాతి చితి ప్రభావాత్ ॥

తా॥ ఎవడు స్థిరబుద్ధి గల్గి యీ ఐదు శ్లోకములు పఠించునో, మరియు లెస్సగా విచారించునో వానికి యీ దేహాత్మరూపమైన సంసార దావాగ్ని యొక్క తీవ్రమైన భయంకర సంతాపము జ్ఞానామృత మహిమ వలన శీఘ్రముగ ఉపశమించు చున్నది.


షట్చక్రములు

ఉన్మీలిత పద్మం = (సహస్రార చక్రం) (బహుదళం) మూర్ధ్నిస్థానం, సమీలిత పద్మం – దళం (108) అక్షములు, సర్వ వర్ణ స్వరూపం. ఫాల భాగం ప్రేరణా చిత్రం. చంద్ర మండలం, నాసాగ్రం చతుర్దశం = ద ప క ఠ
పరిపూర్ణాత్మ స్వరూపుండగు సద్గురు స్వామికి ఒక (1000) వెయ్యి జపం చేయబడును. తెల్లవారుఝామున **4-54 ని॥లు** మొదలు **ఉదయం 6-00 గం॥ల** వరకు జరుగును.




ఆజ్ఞాచక్రం (ద్విదళం) భ్రూమధ్యం మాణిక్యవర్ణం, సదాశివుడనే ప్రత్యగాత్మ = 1000 (వెయ్యి) జపం ఈ ఆజ్ఞాచక్రమందు గల సదా శివునకు **రాత్రి 3 గం॥**


47 ని॥లు మొదలు, **4 గం॥ 53 ని॥ల** వరకు నడుచును.




విశుద్ధ చక్రం : కంఠ స్థానము (షోడశ దళం) అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ,ౡ, ఎ, ఐ, ఒ, ఔ, అం, అః = 16 ధూమ్ర వర్ణం. ప్రాణము, జీవుడనే మహేశ్వరునకు ఈ విశుద్ధ చక్రమునందు గల మహేశ్వరునకు వెయ్యి (1000) జపములు **రాత్రి 2 గం॥ 41 ని॥లు మొదలు 3 గం॥ 46 ని॥ల** వరకు నడుచును.



అనాహత చక్రం : హృదయం, ద్వాదశ దళం. నీల వర్ణం, రుద్రునకు ఆరువేలు (6000) జపము. **రాత్రి 8-00 గం॥ నుండి తెల్లవారుఝామున 2 గం॥ 40 ని॥** వరకు నడుచును. క, ఖ, గ, ఘ, ఙ్ఞ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ




మణిపూరక చక్రము : నాభి స్థానము దశ దళము డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ శ్యామల వర్ణం, విష్ణువునకు 6000 (ఆరు వేలు) జపము **1గం॥ 21 ని॥ మొదలు రాత్రి 8-00 గం॥ల వరకు నడుచును.**




స్వాధిష్టాన చక్రము :

మర్మస్థానము (6) ఆరు దళములు బ, భ, మ, య, ర, ల యోని లేక లింగం, శ్వేత వర్ణము, బ్రహ్మకు 6,000 (ఆరువేలు) జపము **ఉ॥ 6 గం॥ 41 ని॥ మొదలు మధ్యాహ్నం 1 గం॥ 20 ని॥** వరకు నడుచును.



మూలాధార చక్రం :

పాయు స్థానము (గుదము) చతుర్దళములు వ, శ, ష, స పీతవర్ణం. ఆధార చక్రమందు గణపతికి 600 (ఆరువందలు) జపము నడుచును. **ఉ॥ 6 గం॥ మొదలు 6 గం॥ 40 ని॥ వరకు** నడుచును.



శ్రీ షడాధారా ధ్యానం :

1) మూలాధారే । వారిజనేత్రే । ను । చతుష్కే ।
వం । శం । షం । సం । వర్ణ విశాలే । సువిశాలే ।
రక్త వర్ణం । శ్రీ గణనాథం । భగవంతం ।
దత్తాత్రేయం । శ్రీ గురుమూర్తిం । ప్రణతో -స్మి ॥

2) స్వాధిష్టానే । షడ్దశపత్రే । సతులింగే ।
లతాంతా వద్వర్ణ విశాలే । సువిశాలే ।
పీతవర్ణం । వాక్పతి రూపం । ధృహిరాంతం ।
దత్తాత్రేయం । శ్రీగురుమూర్తిం । ప్రణతో -స్మి ॥

3) నాభౌ పద్మే । పత్ర దశారే । డ । ప । వర్ణే ।
లక్ష్మీ కాంతం । గరుడా రూఢం ।
నరవీరం । నీలవర్ణం । నిర్గుణ రూపం ।
దత్తాత్రేయం । శ్రీ సద్గురు మూర్తిం । ప్రణతో -స్మి ॥

4) హృత్పద్మాంతే । ద్వాదశపత్రే । కంఠ వర్ణే ।
సాంబం । శైవం । హంస విశేషం । శమయంతం ।
స్వర్గస్థిత్యస్తం । కుర్వంతం । శివశక్తిం ।
దత్తాత్రేయం । శ్రీ గురుమూర్తిం । ప్రణతో -స్మి ॥

5) కంఠస్థానే । చక్రవిశుద్ధే । కమలాంతేం ।
చంద్రా కారే । షోడశపత్రే । స్వర్ణ వర్ణే ।
మాయాధీశం । బీజ శివంతం । నిజ రూపం ।
దత్తాత్రేయం । శ్రీ గురుమూర్తిం । ప్రణతో -స్మి ॥

6) ఆజ్ఞా చక్రే । భ్రుకుటి స్థానే । ద్విదళాంతే ।
హంక్షం బీజం । జ్ఞాన సముద్రం । గురుమూర్తిం ।
విద్యుద్వర్ణం । జ్ఞాయంతం । నటి వాఖ్యం ।
దత్తాత్రేయం । శ్రీగురు మూర్తిం । ప్రణత్యో -స్మి ॥

7) మూర్ధ్ని స్థానే । వారిజపత్రే । శశిబీజే ।
శుభ వర్ణం । పద్మ సహస్రం । సువిశాలం ।
హం జీవాకం । వర్ణ సహస్రం । తురీయాంతం ।
దత్తాత్రేయం । శ్రీగురు మూర్తిం । ప్రణతోఽస్మి ॥

ఇతి షడాధర ధ్యానం సమాప్తం.

తారక అమస్కములు

సీతారామాంజనేయ సంవాద రూపముగా, సాంఖ్య తారక అమనస్క పూర్ణమైన బ్రహ్మానుభవసారము సవితర్కముగా అందింపబడినది.

ప్రథమ ద్వితీయాంకములలో సాంఖ్యము సాంగముగా బోధింపబడినది. తారకానుభవము అమనస్క సారములు ఈ దిగువన తెలుపబడుచున్నది.

తారకము

చక్రభ్రమణమైన జనన మరణములను, అలలుగా గల సంసార సముద్రమును దాటించునది, నేను జీవుడనే - అజ్ఞానమును దొలగించి, పరబ్రహ్మము నేననే జ్ఞానము వలన కలుగు ఆనందమును వర్ధిల్లజేయునదియే తారకము. దీని విధానము ఈ రీతిగా దెలపడమైనది.

జీవుడనే హంస ఇడ-పింగళ-సుషుమ్నలను త్రివేణీ-భ్రూమధ్య-సంగమములో స్నానము చేయగా, మూలాధారాది షట్కమలాలు వికసింపగా, ఇంద్రియములనే కలువలు ముకుళించగా, సచ్చిదానంద సముద్రములో మనస్సనే చంద్రుడు అస్తమించగా, బ్రహ్మాండమనే పిండాండమును ప్రకాశింపజేసిన, తేజస్సు గల అఖండ చైతన్యమనే సూర్య మండలము, శాంభవి అంతర్లక్ష్యమైన హృదయాకాశములో కనబడును. పరోక్ష విజ్ఞాన చక్షువులు తెఱచి, అజ్ఞానమనే స్త్రీ ఆలింగనమును వదలి, శరీరాభిమానమనే శయ్య దిగి, వైరాగ్య - ఉపరతి - సమాధానమనే దాసీజనము కొలువగా, స్వానుభవానంద మానస సరోవరములో హంస స్నానమాడును.

బుద్ధిని ఇంద్రియాలను ప్రేరేపించే చైతన్య ప్రకాశమే "నేనని" భావించి జ్ఞాన నేత్రమనే దోసిళ్ళతో ఆనంద భాష్పములనే అర్ఘ్యము, ఉదయాస్తమయములు లేని జగత్సాక్షి అయిన సూర్యునికి హంస నమస్కరించును. అట్టి అర్ఘ్యమువలన సందేహమనె మందేహాసురులను నశింపజేసి మౌన జపమునూ, మనోవృత్తి రాహిత్యమనే ధ్యానమునూ, సకామ్యక, క్రియారాహిత్యమనే పూజనూ చేయవలెను. చైతన్యమనే సూర్యుడు మధ్యాహ్న సమయమువలె ప్రకాశించగా, ఆనంద రసానుభవ భోజనము జేసి చిత్త విశ్రాంతి (చిత్తము బ్రహ్మాకారమే) అను తాంబూలము స్వీకరించవలెను. ఇట్లున్నప్పుడు సంకల్పవికల్పములనెడి (అరిషడ్వర్గముల) పక్షుల కలకలము తగ్గి మౌనమైపోవును.

దేహాభిమానమను సూర్యుడస్తమించినచో, జ్ఞానాజ్ఞానములచే చక్రవాక మిధునమునకు వియోగము గలుగునట్లు, విదితావిదిత "వృత్తి"నశించగా కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములనే పద్మములు ముకుళించగా, నేనే బ్రహ్మమనే వృత్తి కలువ వికసించగా, విషయ జ్ఞానమనే నక్షత్ర కాంతి వెలవెల బోవ, దట్టమైన "భావన" అను చీకటి నశింపగా, బ్రహ్మ జ్ఞానమను చంద్రుదు హృదయాకాశములో ప్రకాశించును. అపుడు జీవుడు తురీయావస్థ (ఉన్మన్యవస్థ) అను శయ్యపై ముక్తి కాంతను జేరి నిస్సంకల్పమనెడి బ్రహ్మానందమనే సుఖ నిద్రను పొందును. (తురీయము, అర్థమాతృకము, ఉన్మని, నిరజ అని శుద్ధ సత్త్వమునకు నామాంతరములు)

తదుపరి, శుభాశుభములను సర్వకర్మజాలములనే సమిధలను శాంభవి అనెడి అంతర్లక్ష్యమైన హృదయాకాశములోని అగ్ని మండలములో భస్మము చేసినట్లుగా గనుపించును. అపుడు కామక్రోధములను, దేహాత్మయను యజ్ఞ పశువును ఓంకార ఖడ్గముతో వధించి, నానా విధ వాసన (వాసనాత్రయము= లోకవాసన, శాస్త్ర వాసన, దేహవాస) లనే నేతితో విషయములనే సమిధలను, గురువు వలన పొందిన ఆత్మానుభవ సాధనతో తనకు గోచరించిన పరిపూర్ణ జ్ఞానాగ్నిలో ఆంతరిక హోమము జేసి, ఆనంద రసమనే సోమరస పానము చేయవలెను. యోగతారావళీ యందు ఉన్మనిభావమును ఆదిశంకరులు వివరించిన విధముగా శాంభవి అనగా కొండ నాలుకకు వెనుక, కపాల కుహర

మధ్య కుడి నేత్ర నాడి అంత్యమునకు గోమాంసము లేక జీవస్థానము అని పేరు. ఇట్టి స్థానమునకు రెండంగుళములకు పైన బిందు మండలము, లేక చంద్రమండలము లేక సుధా మండలమను స్థానమునుండి హంస సంచారము ప్రారంభమగును. ఈ స్థానమునాశ్రయించి సంవిత్ప్రకాశముండును. దీనికే చైతన్యమని, బిందువని, ఆత్మయని, బ్రహ్మమని, స్థితి భేదముగా, అనుభవ భేదముగా శాంభవీగా బోధించబడి అనుభవనీయమగుచున్నది. ఇట్టి స్థానము జ్ఞానులకు భూమాగా అంతర్లక్ష్యము. యోగీశ్వరులకు సిద్ధయోని లక్ష్యము. ఇది కేవలజ్ఞానమగు ఎఱుక నిర్ణయమునకు ఆధార స్థానము. యోగసాధకుడైన ముముక్షువు చేయవలసిన విధమిదియే.

హృదయాకాశములో గనుపించిన సూర్యసోమాగ్ని మండలమున (ద్వాదశ కళాత్మక సూర్యమండలము, షోడశ కళాత్మక చంద్ర మండలము, దశ కళాత్మక అగ్ని మండలములు) వ్యాపకమై, ఉగ్రమై, ఉష్ణమై, సద్రూపమై వసంత ఋతువందలి సూర్యుని వలె, పున్నమినాడు వెన్నెలలొలికే చంద్రునివలె, అగ్నిజ్వాల వలె, బంగారమువలె, బంగారు సౌధము వలె, మేఘములోని మెరుపుతీగ వలె, వరిముల్లు వలె సూక్ష్మమై పచ్చని వర్ణముతో పరమాణు రూపమై, గొప్పవానికన్న గొప్పదై అగమ్యమై స్వయంజ్యోతి స్వరూపమైన హిరణ్మయ మండలము (.... నీవారశూక వర్తన్వీ పీతాభాస్వత్యణూపమ తస్యాద్ శిఖాయామధ్యే పరమాత్మా వ్యవస్థితః....) యోగికి కనుపించుచున్నది.

అటువంటి హిరణ్మయ తేజోమండలములో కోటి సూర్యులు, కోటి చంద్రులు, కోట్ల కొలది మెరుపు తీగలు ఒకే సమయములో ఒక్క చోట ప్రకాశించుచున్నట్లు కాంతి వెల్లివిరిసి, పరమై, శుద్ధమై, చిదానంద స్వరూపమై, నిత్యమై, నిరుపమానమైన (...సర్వదేవతామయమైన అనగా సబ్రహ్మా, సశ్శివ, సహరిః, సఇన్ద్రః సఅక్షరః, పరమః స్వరాట్...) పరమాత్మ స్వరూపము ప్రకాశించుచున్నది. అట్టి స్థితి ఎండలో నుంచిన దీపకాంతి ఎండతో గలసిపోయినట్లు, తాను, నేను అను స్మృతి లేనట్టి యోగి మనసు (నీటిలోని ఉప్పు, నీటిలో కరిగిపోయినట్లు) పరమాత్మయందు లయించును. అనగా మనస్సునకును, ప్రాణమునకు లయ స్థానమైన పరబ్రహ్మముతో తాను ఐక్యము చెందును. అట్టి సమయములో యోగి, గాలి లేని చోటయున్న దీపమువలె నిశ్చలముగా నుండును.

ఆ విధమైన స్థితి మనస్సు వాయువు చెదరకుండునపుడు గాని సిద్ధించదు. మనస్సు, ప్రాణ వాయువు, బిందువు అనే బుద్ధి నిశ్చలమైనపుడు గాని చెదరక నిలువవు. (పరమాత్మ స్వరూపమైన) హంసతత్త్వము పూర్తిగ తెలిసిన గాని, బుద్ధి నిశ్చలముగాదు. అట్టి నిశ్చలత్వము ఇడా పింగళా నాడులయందు ప్రాణవాయువుతో బాటు సూక్ష్మమైన తన మనస్సు లక్ష్యముగా ఆత్మ సాక్షాత్కారము పొందితేనే గాని సిద్ధించదు. మనస్సు, వాయువు, బిందువు, హంస తత్త్వాను సంధానముతో నిశ్చలమగును. అట్టి మార్గము తెలియవలెను. హంస తత్త్వము తెలిసిన మహాత్ముడు పరమహంస శ్రేష్ఠుడగును. హంస తత్త్వార్థము సంసార దుఃఖమును నశింపజేయును.

ఈ శరీరములో 72,000 నాడులున్నవి. ఈ నాడులలో ఇడ, పింగళ, గాంధారి, హస్తిజిహ్వ, పూషా, అలంపూషా, విశ్వోదరి, సినీవాలి, కుహు, రక్తాహ్వో అను పది నాడులు ముఖ్యమైనవి. 72,000 నాడులలో ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులున్నూ, నాగ, కూర్మ, కృకర, దేవదత్త ధనుంజయ యను ఉపవాయువులున్నూ యీ దశవాయువులకునూ, దశేంద్రియములకునూ, వశమై సంచరించుచుండును. మనస్సునూ, దశవాయువులను అనుసరించు బుద్ధియనియు, జీవాశ్రయమనియు పిలువబడే బిందువు సంచరించుచుండును. అథోముఖమైన హృదయ కమలము ననుసరించి, తాను అథోముఖమగుచూ, అశ్వములు పరుగెత్తుచున్న విధముగా వాయు సంచారమును అనుసరించి, తాను (బుద్ధి కూడ) విషయములలో సంచరించుచుండును.

బిందువు, మనస్సు, వాయువులు పరస్పరము కలసియుండి ఎప్పుడూ కదులుతూయుండును. కనుక నాడులలో వాయువును కుంభించి, దానితో మనస్సును ఏకము జేసి, జీవుడనే హంసను కలిపి ధ్యానము చేయగా సూక్ష్మ శరీరమందు అంతర సుషుమ్నయందు దశవిధ ప్రణవ నాదములు (చిణి, చిణిచిణి, శంఖ, వేణు, వీణా, తాళ, ఘంటా, భేరి, మృదంగ, మేఘనాదములు)

చిత్కళలు కనుపించును. హకారము, బిందువు, సకారము గలసి హంసయను శబ్దమేర్పడినది. హకారము బ్రహ్మము. సకారము మాయ లేక ప్రకృతి. హకార సకారముల మధ్యనున్న బిందువు ప్రకృతి పురుషుల సంయోగమను అర్ధనారీశ్వర తత్త్వమును దెలియజేయును. హంసయైన జీవుడు శరీరము లోపల, వెలుపల సర్వ వ్యాపకుడై హృదయ కమలములో ప్రకాశించుచుండును.

జీవుడు యోగసాధనచే అంతర సుషుమ్నయందు ప్రవేశించగనే జీవత్వము దొలగి, బ్రహ్మమగును. హృదయ కోశమునుండి ప్రాణము బయటికి 12 అంగుళములు బయటికి వచ్చి ఆగును. దానిని రేచకమని అందురు. రేచకమునకు పట్టు సమయములో సగకాలము బాహ్యములో నిలచియుండు దానిని బహిః కుంభకమనియందురు. తిరిగి బాహ్యవాయువు నాసిక ద్వారా హృదయములోనికి ప్రవేశించును. దానిని పూరకమని యందురు. పూరించుటకు పట్టు సమయములో సగకాలము లోపల నిలచియుండును. దీనిని అంతః కుంభకమందురు. రేచక, పూరక, కుంభక గతులతో సంచరించుచుండు వాయువుతో మనస్సు కలసి, హంసయైన జీవుడు రేయి పగలు 21,600 పర్యాయములు మూలాధారాది షట్చక్రములలో అనగా మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరకము, అనాహతము, విశుద్ధములందు అంతర సుషుమ్నయందు, ఆజ్ఞాచక్రము బాహ్య సుషుమ్నయందు, సుషుమ్నాంతమున సహస్రారమునందు సర్వజీవుల శరీరమందు సూక్ష్మముగా అనేకముగా సంచరించుచుండును.

సుషుమ్నానాడికి కుడి ఎడమలుగానున్న పింగళ, ఇడనాడుల్లో వాయువు నిరంతరము సంచరించుచుండగా, మనస్సు సుషుమ్నయందు వాయు సంచారమును అనుసరించుచుండును. హంసయైన జీవుడు ద్విదళ ఆజ్ఞాచక్ర కమలములో సాక్షి మాత్రుడై యుండుచుండును. హంసకు వ్యక్తి స్థానము, స్వస్థానము ఆజ్ఞా చక్రము. అదే అంతఃకరణము, హృదయము. అదే జనన మరణములకు మూలము. అదే నాద స్థలము. అది మనస్సుకు, బుద్ధికి దృష్టికి కనబడని, హృదయమనెడి జ్ఞాత స్థానము. దానిని హంసోపాసన చేసి సూక్ష్మ దృష్టిని సంపాదించిన వారు మాత్రమే తెలిసికొనగలరు.

హంసను నాదముతో కలిపి లక్ష్యము జేసి చూచినచో గొప్ప ఆత్మ జ్యోతి జనించి, హంసనూ, నాదమునూ నశింపజేయును. అరణులు మధించుట వలన పుట్టిన అగ్ని అరణులను సైతము దహించునట్లు, చిద్రూపమైన అగ్ని హంసను, నాదమును నశింపజేయును. శైవాద్వైతులు (జీవ బ్రహ్మైక్యము గలవారు) బిందు నాదకళలను నిర్వచించినారు. బిందువు=అంగము, నాదము=లింగము, వాటి కలయికయే కళ (ఆత్మ జ్ఞానము), లింగాంగముల సంబంధముతో చిత్కళా స్వరూపుడైన పరమాత్మ చైతన్యము ప్రకాశించుచుండును. వ్యష్టియైన నాదబిందుకళలు లయమై (వెలిగే కర్పూరము తానే లేకపోయినట్లు) కేవల సమిష్టియైన పరమాత్మగా వెలిగిపోవడమే ఉన్మన్యవస్థ. ఇట్టి స్థితి పొందిన యోగి గాలి లేని చోటులో నున్న దీపమువలె నిశ్చలుడై పరిపూర్ణ పరమాత్మ స్వరూపుడై యుండును. ఇదియే తారక యోగము.

అవ్యక్త ధ్వనులతో గూడిన బ్రహ్మ, ప్రణవముతో జేరిన అకార ఉకార మకారాత్మకమైన, నాద బిందు కళలు, పరబ్రహ్మములో ఎప్పుడు జేరునో, అపుడు వెలిగే కర్పూరము చల్లారిపోయే విధముగా కర్మేంద్రియ జ్ఞానేంద్రియములతో గూడిన ప్రాణ పంచకమున్నూ, సంశయాత్మకమైన చిత్తమున్నూ లయింపగా, తానైన బ్రహ్మ జ్ఞాని, గాలి లేని చోట దీపము వలె చలింపనిదిన్నీ, కాలత్రయముచే బాధింప తగనిదిన్నీ, అపరోక్ష జ్ఞానమయినదిన్నీ అయిన సుఖదుఃఖ నివృత్తి పూర్వక ఆనందస్వరూపమై అంతటా నిండినవాడై సదా ప్రకాశించుచుండును.

ఇది తారకయోగము. దీని పిదప అత్యంత అవశ్యమైనది అమనస్క యోగము.

అమనస్కయోగము :

అమనస్కము తెలియనిచో, సాంఖ్యతారకములు దెలిసిననూ వ్యర్థమే. అమనస్కమే బ్రహ్మవిద్య. అది ఉత్తములకు సులభమైనది. ప్రజ్ఞా స్థితనందిన మనస్సు తనకన్న వేరు కాదని నిలచియుండు బ్రహ్మస్వరూపస్థితియే అమనస్కము. ఇది సర్వత్ర సమదృష్టి చేత మాత్రమే తెలిసికొనదగినది. సూర్యునికి చీకటి లేనట్లు, జ్యోతి స్వరూపుడైన నాకు అజ్ఞాన కార్యమైన, అవిద్యా పూర్వక మనస్సుతో సంబంధము లేదని భావించవలెను. మనస్సును, లేనిదానిగా చేసికొన్నవారికి

బ్రహ్మానందము సిద్ధించును. అట్టి ఆనందము సిద్ధించనిచో సంసార దుఃఖ దావానలము చల్లారదు. కొందరు "మనస్సు ఆత్మకంటె భిన్నమై సత్యముగానున్న దనియు, దానిని నిగ్రహించినగాని మోక్షము సిద్ధించదని" చెప్పుట సరికాదు. కనుక కార్యకారణ రూపమైన మనస్సు లేకుండా పోవుటయే అమనస్కయోగము.

మనస్సనేది యదార్థముగా లేకున్నను, అజ్ఞానము వలన దానిని ఏకాగ్రతకు తీసికొని రావలెననియు, చిత్తవృత్తి నిరోధము చేయవలెననియు, కొందరనుట సరికాదు. తానే ఆత్మ అను జ్ఞానము కలిగిన తోడనే మనస్సు యింక కనబడదు. మనస్స సంకల్పాత్మకము. నేను ఆత్మనని భావించుట కూడా సంకల్పాత్మకమే యగుట వలన అట్టి భావన కూడ మనస్సే కదా! ఇట్టి భావము సంకల్పమే అయినప్పటికీ, యీ సంకల్పము ఇతర సంకల్పములన్నిటినీ నశింపజేయును. అగ్ని కట్టెను దహించి, చివరకు తాను కూడ నశించు చందమున, ఆత్మ "నేనే" నను సంకల్పము, ఇతర సంకల్పములను నశింపజేసి, తుదకు తాను (మనస్సు) కూడా నశించును. ఆపై బ్రహ్మములో లయమగుచున్నది. ఇట్టి స్థితిని నిర్వికల్ప సమాధి, లేక అమనస్క సిద్ధి అని అందురు. ఈ సూక్ష్మము దెలియనివారు మనోకల్పిత సంసారమును సత్యమని దలచి జననమరణ ప్రవాహములో బడుచున్నారు.

భ్రమ వలన త్రాడుగానే పాముగా తోచిన, ఆ భ్రమ తొలగిన వెంటనే అది త్రాడుగానే గనుపించినట్లు, భ్రమచే బ్రహ్మము ప్రపంచముగా తోచి, భ్రమ తొలగినచో ప్రపంచమే బ్రహ్మమై భాసించుచున్నది. మనస్సు, మనఃకల్పిత సంసారము సత్యమైనచో, నిద్రలో తానేల లేకుండిన అనుభవము పొందును? మేల్కొనిన పిదప తాను యేమీ యెఱుగనని చెప్పును కదా! కారణావస్థయగు సుషుప్తి యందు "ఏమీ లేదు" అను శుద్ధమగు తెలివియే ఆత్మ. అదే జ్ఞానము. కాని ఆత్మ ఒక పదార్థమని, దానికి జ్ఞానగుణ మొకటున్నదని, యిట్టి జ్ఞానము ఆత్మలో మనస్సంబంధముతో కలుగుతూ, నశిస్తూ యుండునని కొందరు తార్కికుల వాదము సరియైనది కాదు. నిర్గుణ ఆత్మ సృష్ట్యాదులకు కారణమై చైతన్యజ్యోతి స్వరూపమై, నిరుపమానమై ప్రకాశించుచున్నది.

మొదట జగత్తు దృశ్యమై జడముగా కనిపించిననూ, విచారించి అధిష్ఠాన దృష్టితో చూచినపుడు, రజ్జు సర్ప భ్రాంతి ఏ విధంగా లేకుండా పోవునో జీవేశ్వర జగత్తులను భేదభావము లేకుండా పోవును. అపుడే తాను సచ్చిదానందమయు డగుచున్నాడు. ఈ విషయమును వేదములు, బ్రహ్మవేత్తలు ప్రతిపాదించుచున్నారు. తాను బ్రహ్మమను దృఢ నిర్ణయము అనుభవపూర్వకముగా గలిగినప్పుడు సంకల్పాత్మకమైన మనస్సు లేకుండగ పోవును. ఇది గురువు వలన దెలియదగిన రహస్యార్థము. సద్గురూపదేశమును, కృపను పొందినవారై గురువు మర్మమెరిగిన వారికిది కరతలామలకము. అట్టివారు, తమ యెదుటనున్న ఘటమును జూచున్నట్లుగ తమను తాము సాక్షాత్కరింప జేసికొనెదరు.

ఇంద్రియ గోచరము గాని ఆత్మ నిర్విషయము. అభ్యాసావస్థలో ఆత్మ, విషయమువలె గోచరించును. సర్వం బ్రహ్మమయమనే వేదార్థము దృఢమైన పిదప విషయ, నిర్విషయముల భేదము లేక తానే అఖండ బ్రహ్మమగును. స్వర్ణముతో చేసిన ఆభరణములన్నియు స్వర్ణముగానూ, నీటిలోని అలలు, నురుగు, బుడగలన్నీ నీరు గాను, విస్ఫులింగములు, అగ్ని వేరు కావని తెలిసికొన్న విధముగా – బ్రహ్మము వల్ల యేర్పడిన సర్వ ప్రపంచము బ్రహ్మముగానే భావించవలెను. బ్రహ్మము వేరుగనున్నదని భావించువాడు బ్రహ్మము దెలియనివాడు మరియు తనకు తెలియక పోవడమే గాక యితరులను అపమార్గమున పడవేయును.

తాను బ్రాహ్మణుడైనపుడు పలుమార్లు నేనుబ్రాహ్మణునడని అనుట ఎందులకు? బ్రహ్మము తానైనపుడు నేనే బ్రహ్మమునని చెప్పనక్కరలేదు కదా! బ్రహ్మాది దేవతలకు గూడ "నేనే బ్రహ్మమను" అనుభవము గలుగుట దుర్లభము. ఎందుకనగా వారికట్టి భావన కలిగినందుననే బ్రహ్మాది పదవులు పొందిరి. విదేహ కైవల్యమును వారు పొందలేకపోయిరి. ఈ అనుభవము కలుగుటకు వైరాగ్యము, బోధతో కూడిన విజ్ఞానము, ఉపరతి ముఖ్య సాధనములని శ్రుతులు, సద్గురువులు చెప్పుచుందురు.

మోక్షము గోరువారు ఇహ పరలోక భోగ విరాగము గలిగి నేనే తాను అను జ్ఞానము వలె, ఏకం బ్రహ్మమనే జ్ఞానము కలిగిన పిదప ఇంతకుముందు నిజమను తోచే ప్రపపంచము, ఇపుడు మిథ్యగా తెలియును. నిద్రపోయినట్లుగ,

మత్తులోనున్నట్లుగ జగత్తును మరచుట ఉపరతి. మనస్సులో వైరాగ్యము లేని వారికి ఆత్మ విచారణ సాధ్యముగాదు. ఆత్మ విచారణ చేయనివారికి ప్రాపంచిక బంధము నుండి ముక్తి లేదు. వైరాగ్య, విజ్ఞాన, ఉపరతులు లేని వారు శుష్క వేదాంతము చెప్పవలసినదే గాని కలలో గూడ మోక్షము పొందరు. మోహ క్షయమే మోక్షము. ఇక జ్ఞాన లక్షణములను సమూలముగా దెలియవలెను.

దశవిధ జ్ఞాన లక్షణములు : సకల జన ప్రియత్వము, దయ, దాతృత్వము, శోక రాహిత్యము, భయరాహిత్యము, అక్రోధము, జితేంద్రియత్వము, నిర్లోభము, వైరాగ్యము, ముముక్షుత్వము.

ఈషణత్రయ (దారా, ధన, పుత్ర) భ్రాంతి విడచిన గాని విజ్ఞానము గలుగదు. తామస, రాజస ప్రవృత్తులను విడచి, అరిషడ్వర్గములచే ప్రేరేపింప బడక, రాగద్వేషములను జయించి, సాత్త్వికుడై, శాంత చిత్తుడై, బంధకములైన కర్మలయందు భోక్తృత్వ భావమును సన్యసించి, శివకేశవ భేద రహితుడై, తానార్జించిన పుణ్య ఫలమును ఈశ్వరార్పణ గావించి, భక్తి ప్రపత్తులతో నున్నచో చిత్తశుద్ధి గలిగి తీవ్ర మోక్షేచ్ఛ కలుగును. అపుడు ఆర్తితో సద్గురువును దర్శించి, గురువును శివునిగా, విష్ణువుగా, పరమాత్మగా భావించి సేవించవలెను. చతుర్విధ శుశ్రూషలు జేసి, గురోరుచ్ఛిష్ట, బోధ పూర్వక విజ్ఞానము అను భోజనమును స్వీకరించి, వేదాంత శ్రవణము గావించి, సందేహ నివృత్తి పొంది, ఇంద్రియములను తనయధీనములో నుంచుకొనుచు ఏకాంతముగా నుండి, తనకంటె భిన్నమైన శరీర త్రయాదులను నిరసించి, విలక్షణమై, ఆనంద స్వరూపుడై, తాను సంసారి యనెడి భ్రాంతిని విడువనిదే, మోక్షము లభించదు.

ఈ విధముగా భ్రాంతిని విడచి విజ్ఞానపూర్వకముగా అష్టాంగ యోగ అంతర్లక్ష్యమైన రాజయోగ సమాధిలో నిరంతరము ఉండవలెను. ఎట్లు అనగా, "నేతి, నేతి" అనెడి వాక్యముతో దేహేంద్రియాదులు ఆత్మ కాదని నిషేధించి విలక్షణమైన ఆత్మయే బ్రహ్మ స్వరూపమని తెలియుట యమము. వినువాడు, స్పృశించువాడు, చూచేవాడు, తినేవాడు, ఓర్పు గలవాడు, యిట్లు చేయువాడు "నేను" అని తెలిసికొని, అట్టి స్ఫూర్తిని గుర్తెరిగి జితేంద్రియుడై నిశ్చల సమాధిలో నుండుట నియమము. సుఖాసనమున ఆనందము ననుభవించుట ఆసనము.

నామరూపములను తన నుండి తొలగించుకొనుట రేచకము. నిరంతరము తాను సచ్చిదానంద స్వరూపుడనని భావించుట పూరకము. జీవాత్మ, పరమాత్మలు రెండూ ఒకటేనని తెలియుట కుంభకము. ఈ విధమైన ప్రాణాయామము నిరంతరము అభ్యసించవలెను. నేను బ్రహ్మ స్వరూపమునని అనుసంధానము చేయుటయే ప్రత్యాహారము. చైతన్యమనే ఆంతరిక యజ్ఞములోని అగ్నిలో జగత్తనే తృణమును భస్మము చేయుటయే ధ్యానము. ఆ భావమును చిత్తములో సదా నిలుపుట ధారణము. సమాధి స్థితి సవికల్ప సమాధి, నిర్వికల్ప సమాధియని రెండు విధములు. నేను స్వయంప్రకాశుడనను భావము కూడ ఒక సంకల్పమే గనుక అట్టి భావనలో మనస్సు లయించుట సవికల్ప సమాధి. సర్వము మిథ్యయని భావించి తరువాత బ్రహ్మమని తెలిసి, నిర్వికారుడై సంకల్ప శూన్యుడై యుండు టయే నిర్వికల్ప సమాధి.

నిరంతరము ఆనందస్వరూపుడై ప్రపంచములోనే ఉంటూ, ప్రపంచము నంటక యుండుట రాజయోగ సమాధి. ఈ యోగమును, యోగీశ్వరులైన వారు మెచ్చెదరు. అట్టి రాజయోగి సర్వజ్ఞుడై సర్వభూతాత్మ భావుడై ప్రకాశించుచుండును. బాహ్య విషయములపై దృష్టి వెలిచూపు. అంతరింద్రియార్థ ములను జూచుట లోచూపు. ఈ రెండింటిని, సమముగా గుర్తించు చూపు మధ్యమము. ఈ మూడు చూపులను ప్రకాశింపజేయునది శాంభవీ దృష్టి. బ్రహ్మవేత్త తాను బ్రహ్మస్వరూపుడై శాంభవీదృష్టిచే సర్వ వృత్తులను సర్వదా ప్రకాశింపజేయుచుండును.

దృశ్య ప్రపంచమును తెలిసికొనే కన్ను, సహాయపడే మనస్సు కూడా ఆత్మకు దృశ్యమానమగును. ఈ దృశ్యమంతయు నశించే పదార్థమే. ఈ దృశ్యాన్ని చూచే (దృక్కు) చూపు, లేక జ్ఞానము, నశించేది కాదు. ఇవి, అవి అని వర్ణించి చెప్పెడి పదార్థములన్నీ అటువంటి దృక్కు (ఆత్మ)ను ఆధారము చేసికొనియే ప్రకాశించుచున్నవి. ఆత్మ మాత్రము ఎన్నడు దృశ్యము కాదు. దృశ్యమును గ్రహించు దృక్కు ఆత్మ. వెలిచూపునకు కనబడే నామరూపములలో సచ్చిదానందమయమైన తన ఆత్మ స్వరూపమును చూడవలెను. లోచూపుచే, పంచకోశములకు ఆత్మ లక్షణము లేనందున, యివి ఆత్మకు వ్యతిరిక్తములైన

లక్షణములతో నున్నందున, యివి ఆత్మ కాదని నిషేధించి, వాటికధిష్ఠానమైన తన పరిపూర్ణ బ్రహ్మ స్వరూపమును సాక్షాత్కరింప జేసికొని శాంతిని పొందవలెను. తనయందును, సర్వము నందును తనను చూచుకొని, సర్వమయుడై మధ్య దృష్టితో నిరంతరము బ్రహ్మానందము పొందవలెను.

దృక్కు, దృశ్యము, ద్రష్ట అను త్రిపుటియందు భేదము లేక సర్వమునందు సాక్షిగా తానుగా చూచుకొని గాలి లేని చోట ఉంచిన దీపము వలె చలించక యుండు భావము శాంభవి అని అందురు. ఆ విధముగా సమాధి నిష్ఠుడైనవాడు భగవత్స్వరూపుడు. అట్టివానిని వైరాగ్య, విజ్ఞాన, ఉపరతు లాశ్రయించి యుండును. అతడే అమనస్కుడు.

షట్కోశ నిర్ణయము

సృష్టి నిర్ణయము :

1) బ్రహ్మము (పరాకాశము).. ఆత్మ
2) అవ్యక్తము (దహరాకాశము) .... మనస్సు
3) మహత్తు (నిరవయవాకాశము) .... దిక్కులు
4) మహదహంకారము(సూర్యాకాశము) .... కాలము
5) భూతాకాశము ....శబ్ధగుణములు కలది (1)
6) వాయువు...........................శబ్ధ స్పర్శ గుణములు కలది (2)
7) అగ్ని........................ శబ్ధ స్పర్శ రూప గుణములు కలది (3)
8) జలము .... శబ్ధ స్పర్శ రూప రస గుణములు కలది (4)
9) పృథివి .... శబ్ధ స్పర్శ రూప రస గంధ గుణములు కలది (5)

వీనిని నవద్రవ్యములని తత్త్వవేత్తలు నిర్ణయించియున్నారు. వీని కన్న యితర ద్రవ్యములేవియును లేవు. ముమ్మాటికినిదియే సిద్ధాంతము. ఈ నవ ద్రవ్యములందు బ్రహ్మాండ, విశ్వ, పిండాండములు అను మూడు నిర్ణయములు గలవు.

బ్రహ్మాండ నిర్ణయము :

1) పరాకాశము, ఉత్తమ పురుషుడని, స్వయంప్రకాశమని, చేతన బ్రహ్మమని చెప్పబడును.

2) దహరాకాశము అక్షర పురుషుడని, సమిష్ట్యంతఃకరణమని చెప్పబడును.

3) నిరవయాకాశము పరాప్రకృతియని, సూత్రాత్మయని, సమిష్టి ప్రాణమని చెప్పబడును.

ఈ త్రివిధ ద్రవ్యముల సమూహమునకు బ్రహ్మాండమని పేరు.

విశ్వ నిర్ణయము :

సూర్యాకాశము, భూతాకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అను యీ ఆరు ద్రవ్యముల సమూహమునకు విశ్వమని పేరు.

విశ్వాభిమానియగు ఈశ్వరుని నిర్ణయము :

సూర్యాకాశము ఈశ్వరుని అంతఃకరణము.
భూతాకాశము ఈశ్వరుని శిరోభాగము
వాయువు ఈశ్వరుని కంఠ స్థానము
అగ్ని ఈశ్వరుని హృదయ స్థానము.
జలము ఈశ్వరుని కటిస్థానము
పృథ్వి ఈశ్వరుని పాదస్థానము

షట్కోశములు :

విశ్వాభిమానియగు ఈశ్వరుని విరాడ్రూపము అన్నమయ కోశమనియు, జనన మరణములు ఆయన్నమయ కోశ ధర్మములనియు చెప్పబడును. సమిష్టి స్థూల రూపము విరాట్టనియు నీకోశమున జెప్పబడెను.

సమాన రూపమున భూమ్యాకాశము మధ్య భాగమందు పరమేశ్వరుని ప్రాణమయ కోశముండును. వ్యాన రూపమున యీ కోశము సర్వమందుండి జగత్తును ధరించును. ఉదాన రూపమున యీ కోశము తేజస్సునందుండును.

ప్రాణ రూపమున యిది సూర్యుని యందుండును. అపాన రూపమున యిది పృథ్వియందుండును. సర్వమునందు వ్యాన రూపముననున్న సమిష్టి ప్రాణము సూత్రాత్మయని చెప్పబడును.

ఈ సూత్రాత్మ అన్ని దేవతలలో గొప్పది. దీని సామర్థ్యము వలన అధి దేవతలు సమిష్టి ప్రపంచమునకు ప్రకాశము నొసగుచున్నారు. అగ్ని జ్వలించు చున్నది. మేఘములు వర్షించుచున్నవి. నక్షత్రములు రాలకయున్నవి. భూమి క్రుంగక నిలచియున్నది. భూమియందన్నాదులు సముత్పన్నములగు చున్నవి. స్థూల సూక్ష్మ రూపమగు సర్వ ప్రపంచము ధరించబడుచున్నది.

అగ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, ప్రజాపతి, యముడు అను దేవతలు ప్రాణేంద్రియములను కర్మేంద్రియములను గూడి యీశ్వరుని ప్రాణమయ కోశమగును. కాలత్రయ రూపమున యిది సర్వమును ఆకర్షించుచున్నది. కావున దీని ధర్మము ఆకర్షించుటయైయున్నది.

దిక్పాలురు, వాయుదేవుడు, సూర్యుడు, వరుణుడు, అశ్వనీ దేవతలు అను దేవతలు పరమేశ్వరుని జ్ఞానేంద్రియములు మనోధిష్ఠాన దేవతయగు చంద్రుడు జ్ఞానేంద్రియములన్ను జేరుటచేతనున్ను, పరమేశ్వరుని మనోమయ కోశము ఏర్పడెను. జీవుల కర్మానుసారముగ ఫలానుభవములు సృష్టింపబడుట, పరమేశ్వరుని మనోమయ కోశధర్మమైయున్నది.

జ్ఞానేంద్రియములైదు, విశ్వము అనాదియని అభిమానించు బ్రహ్మమనగా సమిష్టి బుద్ధేంద్రియాభిమానియగు బ్రహ్మము చేరి పరమేశ్వరుని విజ్ఞానమయ కోశమేర్పడుచున్నది. స్థితి చేయుట దీని ధర్మము.

పరమేశ్వరుని హిరణ్మయ కోశ నిర్ణయము :

దహరాకాశమగు అక్షర పురుష రూప సమిష్ట్యంతఃకరణాధిష్ఠానము పరమేశ్వరుని హిరణ్మయ కోశమని చెప్పబడును. తెలియజేయుట దీని ధర్మము.

స్వయం ప్రకాశమగు పరబ్రహ్మనిర్ణయము :

తెలియజేయుట, తెలిసికొనుటయను నిర్ణయము లేక, కేవలము ప్రకాశవంతముగా నుండునది స్వయంప్రకాశ పరబ్రహ్మమని చెప్పబడును.

అష్టతను నిర్ణయము

తనువులు అష్ట విధములు. కార్యతనువులు, కారణ తనువులని విభజనము. స్థూల, సూక్ష్మ, కారణ, నిర్మలము అనెడి నాలుగు జీవతనువులు కార్యములు. ఆనంద, చిన్మయ, చిద్రూప, శుద్ధము అనెడి నాలుగు ఈశ్వర తనువులు కారణములు. వీనికే విరాట్ హిరణ్యగర్భ (స్వరాట్) అవ్యాకృత పరమాత్మలను నామాంతరములు.

అష్టతనువుల స్థానములేవియన, ప్రాణ మనస్సుల మధ్య ప్రదేశములన ప్రణవరూపమైన ఓంకారోత్పత్తి గనుక ప్రాణరూపమగు హంస నివాసమునకు ఏ స్థానమో ప్రణవరూపమగు ఓంకార నివాసమునకును అదే స్థానము. కాని హంస వ్యవహారము సూక్ష్మమనియు, ప్రణవ వ్యవహారమగు ఓంకార వ్యవహారము స్థూలమనియు నిర్ణయము.

ప్రణవమునకు నాలుగు పాదములు. అవి 1) అవిద్యాపాదము, 2) విద్యా పాదము, 3) ఆనందపాదము, 4) తురీయ పాదము.

మూలాధారము నుండి సహస్రారకమలము వరకూ నుండు హంస సంచారము ప్రణవోపాసనా పూర్వకముగా అర్చింపబడునపుడు అవిద్యా పాదము కేసరము గాను, విద్యాపాదము కర్ణిక గాను, ఆనందపాదము లింగము గాను, తురీయ పాదము పద్మ త్యాగము గాను నిర్ణయము.

అవిద్యాపాదములు జాగ్రదవస్థగా, శ్రవణ కాలముగాను; విద్యాపాదము స్వప్నావస్థగా, మనన కాలముగాను; ఆనందపాదము, సుషుప్త్యావస్థగా నిది ధ్యాస గాను; తురీయ పాదము బ్రహ్మానుభవముగాను నిర్ణయము.

ప్రణవమునకు త్రివిధ స్థానములు గలవు. అవి –

1) అకారము ఈశ్వర స్థానము, 2) ఉకారము జీవస్థానము, 3) మకార రూపము ప్రత్యగాత్మ స్థానము.

ప్రణవమునకు బ్రహ్మాండమునకు అధిష్టానముగా పంచదేవతలు గలరు. అవి బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు.

ప్రణవ సత్తా వలన పంచ దేతలా? లేక పంచ దేవతల వల్ల ప్రణవ నిర్ణయమా? ప్రణవసత్తా వల్లనే పంచదేవతల నిర్ణయము. పరమాత్మ వలన ప్రణవ నిర్ణయము.

పరమాత్మ రూపమగు ప్రణవమునకు పదునారు కళలుండును. పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరియను నాలుగు పద్ధతులు. జాగ్రత, స్వప్నము, సుషుప్తి, తురీయములని చెప్పబడును. వీనియందు జాగ్రత్తలో జాగ్రత్త, జాగ్రత్తలో స్వప్నము, జాగ్రతలో సుషుప్తి, జాగ్రతలో తురీయము, స్వప్నములో జాగ్రత, స్వప్నములో స్వప్నము, స్వప్నములో సుషుప్తి, స్వప్నములో తురీయము, సుషుప్తిలో జాగ్రత్త, సుషుప్తిలో స్వప్నము, సుషుప్తిలో సుషుప్తి, సుషుప్తిలో తురీయము, తురీయములో జాగ్రత, తురీయములో స్వప్నము, తురీయములో సుషుప్తి తురీయములో తురీయముయని వెరసి మొత్తము పదునారు కళలుగా నుండును.

షోడశ కళలలో పారమార్థిక కళలు నాలుగు. ఇవి – తురీయములో తురీయము ఇందు అలోక కళ తురీయమందు తురీయము. తురీయములో జాగ్రత, తురీయములో స్వప్నము, తురీయములో సుషుప్తి. మిగిలిన పంద్రెండున్నూ లోక కళలు.

ప్రణవమునకు పరిణామ స్వరూపములు గలవు. "నమశ్శివాయ", అను బీజములు, బిందు రూపమునున్న క్రియ, ఇచ్ఛ, జ్ఞాన, ఆది, పరాశక్తులు యనునవియును, వాని వ్యవహారమునకు ఆధార భూతములగు పంచప్రాణములుగా పరిణామము బొందెను. ఇందు "న,మ" అనునవి సగుణము. "శి, వా, య" అనునవి నిర్గుణముగా నుండును. మరియు, "న, మ" అనునవి జీవుడు గాను, "శి, వా, య" అనునవి ఈశ్వరుడు గాను "ఓం" అనునది జీవేశ్వరులకు ఐక్యముగా నుండును. దీనినే తత్వమసి యనియు, తత్పదము "శి వా య" కారములు, త్వంపదము, "న మ" కారములు, అసి పదము "ఓం" కారమని చెప్పబడును. "శివా శివశక్త్యైక్య రూపిణి" అనగా పరమేశ్వరుని ఉపాధియగు ప్రకృతి రూప ఆదిశక్తియందు పంచబీజములు, యీ క్రింది రీతిగానుండును. "ఓం" కారము ముఖము, "వా య " కారములు రెండు భుజములు, "శి, వ" యనునవి, కటి భాగము, "న, మ" యనునవి రెండు పాదములుగా నుండును. ఇది ఆదిశక్తి యొక్క ఆకారమని నిర్ణయము.

ప్రణవ పరిణామమగు పంచాక్షరములు ఆధారముగా స్థావర జంగమాత్మకమైన జీవోపాధులు ఉత్పత్తి, స్థితి, లయ, విస్తీర్ణ, ఆకర్షణములు చేయుట మరియు మారణ, మోహన, స్థంబన, ఆకర్షణ, ఉచ్చాటన చేయుటయను కార్యములు చేయును.

జాగ్రదవస్థయందలి ప్రణవము తురీయ స్థానము బొందు అనుభవమేదియనిన, అకార ఉకార, మకారములగు మాత్రత్రయము, వైఖరీ, మధ్యమ, పశ్యంతి యను వాక్కులయందు చేర్చి పరావాక్కు రూపముగా, అమాతృకాయుత ప్రణవ ధ్యానము చేయగా, అవస్థాత్రయ రహితమగు తురీయమందు జేరును. అప్పటితో ఉత్తరాయణ దక్షిణాయణములు, రాత్రి పగలనెడి వ్యవహారము లేక, కేవల పరబ్రహ్మ నిర్ణయముగా స్వయం ప్రకాశము గలిగి యుండును. ఇదియే స్వానుభవము.

ప్రణవము ఎచ్చెటెచ్చట ఏయే వ్యవహారము జేయుననగా సహస్రార పద్మ మధ్యమున అకార, ఉకార, మకారములుగా నుండును; ఆజ్ఞేయమందు నాద బిందు కళలుగా వర్తించును, ఘంటిక యందు చిన్నాద, చిద్బిందు, చిత్కళలుగా ప్రబలును; ఘంటికయందు ప్రాణవాయువుతో గలియగా ప్రణవమునకు శబ్దము గలిగెను. అందువల్లనే ఉభయ చరములు నుంచి మానవుని వరకు మాత్రమే ధ్వనిని చేయగలుగుచున్నవి.

అంతర ఇడా పింగళ నాడులు బ్రహ్మదండికి కుడియెడమలుగా నుండి హృదయము వరకు వ్యాపించి ప్రాణవాయువు ద్వారా ఘంటికయందు జేరి బాహ్యమునకు ప్రసరించును. కనుక ఘంటిక యందలి ప్రణవమునకు ప్రాణ వాయువుతో సంబంధము గలిగెను.

ఘంటిక సూక్ష్మ శరీర సంబంధము గనుక, దానియందలి ప్రణవమునకు ధ్వన్యాత్మకమగు శబ్దము గలదు. ఈ విధముగా ఘంటిక యందలి ప్రణవమునకు శబ్ధము గలదు. ప్రాణ వాయువుతో సంబంధ పడి నపుడు, వర్ణాత్మకమగు

శబ్ధము కలిగెను. అందువలన స్థూల నాదమగు వైఖరి, స్థూల రూపమగు బిందువు, స్థూల రూపమగు కళ తెలియును. కనుక ఘంటిక యందలి ప్రణవము ఊర్ధ్వ ముఖముగా నున్నప్పుడు సగుణ ప్రణవమని చెప్పబడును.

సగుణ ప్రణవము వినువారికి వేణునాద వినోదులని పేరు. సుషమ్నయను పిల్లనగ్రోవిలో కుంభకమను ప్రాణము పూరించగా పంచ చక్రములలో రంధ్రముల ద్వారా వేణునాదము బయలుదేరును. అట్టి నాదానందము జెందు వారిని వేణునాద వినోదులందురు.

అకార, ఉకార, మకార, అర్థమాత్ర లనునవి ప్రణవమునకు పాద చతుష్టయములు. అర్థమాతృక పరమాత్మ యందుండును. మకారము సహస్రార కమల మధ్యమున, ఉకారము ఆజ్ఞేయమందు, అకారము ఘంటికయందు నుండును. ఇవియే స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణ ప్రణవములుగా చెప్పబడును.

ఆజ్ఞేయమునకు ద్విదళ స్థానమని, ఇంద్ర యోనియని, వ్యవహార పంచక స్థానమని, సిద్ధ యోనియని పేర్లు కలిగెను. అది యెట్లనిన 1) చిచ్ఛక్తి, సహస్రార కమలమునుండి దిగి ద్విదళ స్థానమగు ఆజ్ఞేయమునకు వచ్చి కార్యకర్తలగు అధి దేవతలకు, కార్యానుకూలమగు నాజ్ఞయొసగు స్థానముగనుక ఆజ్ఞేయమని చెప్పబడును. 2) నీవు నేను అని సంకల్ప, వికల్పములుగా వ్యవహరించు హం క్షం అను రెండు దళములయందుండి జీవ సృష్టి జరుగుచున్నది. కనుక ఆజ్ఞేయమునకు ద్విదళ స్థానమని పేరు కలిగెను. 3) ఇంద్రియములు చేయు వ్యవహారములు సరిచూచు స్థానము గనుక ఆజ్ఞేయమునకు వ్యవహార స్థానమని పేరు. 4) పంచ శక్తులకు మూలస్థానమగుటచేత ఇంద్రయోనియని పేరు. 5) ప్రణవము అచ్చట నుండి నాదబిందు కళారూపమగు అహోరాత్రములు ప్రణవ ధ్వని ఘోషించుట చేత, ఓంకార గృహమని పేరు. 6) ఈ స్థానము జేరినవారు సిద్ధ పురుషులగుటచే, దీనిని సిద్ధయోని యని పేరు.

హంస కదలిక వల్ల దళములు కదలినందున కర్మ జరుగుచున్నది. కర్మ వల్ల పాపపుణ్యములు జనించుచున్నవి. జీవుడు వీనిని అనుభవించును. అది యెట్లనగా దళములపైన పరమాత్మ ప్రకాశము సోకుచున్నది. అందువలన దళముల ఛాయ దళముల దిగువన పడుచున్నది. ఆ ఛాయనే జీవుడనియు, ఇట్టి జీవుడు అధోముఖ వ్యాపకమునందు ఆధ్యాత్మ, ఆధి భౌతిక, ఆధి దైవిక దుఃఖముల ననుభవించుచు జనన మరణములను బొందుచుండును. కనుక జీవుడు కర్మానుభవము బొందును.

జీవునకు ఆత్మానాత్మ వివేకము వలన ముక్తి చేకూరును. ఆత్మానాత్మ వివేకము పూర్వజన్మ పుణ్యవశమున సాధనచే, సద్గురు కృపచే, గల్గును. మరియు ఆత్మానాత్మ నిర్ణయము తెలియును. ప్రణవ పాద చతుష్టయమందలి అర్థమాత్రను దెలిసి రేచకపూరక రూపములగు స్థూల హంసల ద్వారా ఆజ్ఞా చక్రమందు దూరి ఘంటిక ద్వారా, సహస్రార కమలమందు ప్రవేశించి కమలమును త్యజించి పరబ్రహ్మమున ఐక్యము గావలయును. ఈ పద్ధతి వలన ఆత్మానాత్మ నిర్ణయము తెలిసి, వ్యవహారములు శూన్యమగును. తత్ఫలితమే ముక్తియని నిర్ణయము.

రాజయోగ షోడశాంగములు

భూమికలు ఏడు, ధారణాంగములు రెండు, ధ్యానాంగములు మూడు, సమాధ్యంగములు నాలుగు, మొత్తము పదునారు.

ఈ సప్త భూమికలలో అజ్ఞాన భూమికలు ఏడు, జ్ఞాన భూమికలు ఏడు.

అజ్ఞాన భూమికలు :

(1) బీజ జాగృతి : వృక్షమునకు ముందు అంకురమేర్పడినట్లు సుషుప్తి నుండి జీవుడు మేలుకొనిన ప్రధమదశ.

(2) జాగృతి : అంకురార్పణానంతరము వృక్షమునకు రెండాకులు గల్గినట్లు మెలకువనొందిన జీవుడే దేహాభిమానముగలిగి ధన ధాన్య గృహారామక్షేత్రాదులు నావియని అభిమానపడునది.

(3) మహాజాగృతి : ద్విదళ మధ్య నుండి కొమ్మలేర్పడి వృక్షాకారము గల్గునట్లు తెలియజేయు విధముగా తన పూర్వజన్మ సంస్కార జ్ఞానమువలన తాను గొప్ప వాడనగుచున్నానను జ్ఞానము (ఊహ) కలుగుట.

(4) జాగ్రత్స్వప్నము : వృక్షము పెంపగును. దాని ఫలములనుభవించి కృతార్థుడనుగాగలనని మనస్సులో తలచినట్లు తాను జాగ్రత్తయందు చేయు కార్యముల వలన గల్గిన ఫలము మనస్సునందు తలచి ఆనందమునొందుట.

(5) స్వప్నము : స్వప్నావస్థయందు శుభాశుభములను గాంచి, మేలుకొని ఆనంద భయములనొంది కొంతకాలమునకు వానిని మరచియుండుట.

(6) స్వప్న జాగృతి : స్వప్నమున తాను గాంచిన విషయములు చాలాకాలము అంతఃకరణ మందుంచుకొని, వాని ఫలముకై వేచియుండుట.

(7) సుషుప్తి : విక్షేపరూపమగు అవస్థను విడచిన తరువాత జీవునికి గలుగు జడరూపస్థితి.

జ్ఞాన భూమికలు :

(1) శుభేచ్ఛ : బ్రహ్మ సాక్షాత్కారమునకు ప్రయత్నించుట.

(2) విచారణ : ఆధ్యాత్మిక విచారణ తప్ప యితర విచారణ చేయకుండుట.

(3) తనుమానసి : శుభేచ్ఛ విచారణలను ఈ రెండు పద్ధతులలో దేనియందు వైరాగ్యము పొడయునో, దానియందు విరక్తి గలిగియుండుట.

ఈ మూడును జాగ్రదవస్థననుసరించినప్పుడు శ్రవణమనన నిధి ధ్యాసలని చెప్పబడును.

(4) సత్వాపత్తి : పై మూడు భూమికల యొక్క అధికాభ్యాసము వలన గలిగిన బ్రహ్మనిష్ఠ. ఇది సూక్ష్మ పద్ధతి యగును.

(5) అసంసక్తి : బ్రహ్మనిష్ఠ మినహా యితర నిష్ఠలు లేక యుండుట.

(6) పదార్థ భావన : ఇతర పదార్థములయందు అనురాగము లేక, బ్రహ్మ పదార్థమునందే భావముండుట.

పై రెండు పద్ధతులు సుషుప్తి పద్ధతులగును.

(7) తుర్యగ : ఇతర స్వరూప లక్షణములు విడచి స్వస్వరూపమునందుండుట. ధారణాంగములు రెండు విధములు : (1) ప్రకృతి ధారణ (2) బ్రహ్మధారణ

ధ్యానాంగములు మూడు విధములు (1) విరాడ్రూపము (2) ఈశ్వర రూపము (3) బ్రహ్మ రూపము.

సమాధ్యంగములు రెండు విధములు (1) సవిచార సమాధులు, (2) నిర్విచార సమాధులు.

సవిచార సమాధులు రెండు (1) సాంఖ్య యోగ పద్ధతి, (2) మహా వాక్య పద్ధతి.

నిర్విచార సమాధులు రెండు (1) సూర్య చంద్రనాడులనేకత్వ మొనర్చి బ్రహ్మదండి నుండి భ్రూమధ్యమునకు తెచ్చి బ్రహ్మమునందైక్యమగుట. (2) ఆర్యాదర్పణ రీతిగ బ్రహ్మనాళమునందు ప్రవేశించి బ్రహ్మమునందైక్యమగుట.

సప్తజ్ఞానాజ్ఞాన భూమికల పద్ధతి, ద్వివిధ ధారణాంగముల పద్ధతి, త్రివిధ ధ్యానముల పద్ధతి, చతుర్విధ సమాధుల పద్ధతి, వెరసి యీ షోడశాంగములను తెలిసి అభ్యసించినది రాజయోగమని చెప్పబడును.

రాజయోగి :

భూమి జలములో, జలము అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశములో, ఆకాశము మహదహంకారములో, మహదహంకారము మహత్తత్వములో, మహత్తత్వము అద్వయ బ్రహ్మములో ఐక్యము చేసిన వాడు రాజయోగి అనబడును.

బ్రహ్మమందైక్యభావము తెలిసిన, అజ్ఞాన వృత్తులణగును. అజ్ఞాన వృత్తులణగిన అవివేక వృత్తులణగును. తదుపరి అభిమాన వృత్తులణగి, రాగాదులు పోవును. రాగాదులు నశించిన కర్మము దొలగును. కర్మము దొలగిన నిర్మల జ్ఞానియగును.

నిర్గుణ వాక్యములు

నేతి - నేతి :

పంచభూతములు నీవుగావు. పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియ

ములు నీవు గావు. పంచ ప్రాణములు అంతఃకరణ చతుష్టయము నీవు గావు. విషయ పంచకము నీవు గావు. చిత్కళలు, కర్మములు నీవు గావు. నీవు కేవలము సచ్చిదానంద రూపమైన సాక్షివి అని యెఱుగవలెను.

షట్చక్రములు, షడ్వర్ణములు నీవుగావు. కామాది శత్రు వర్గములు గావు, షట్కోశములు, షడ్భ్రమలు, షడ్విచారములు, షట్సంపత్తులు, షడ్గుణములు, షడూర్మలు, షణ్మతములు, షట్చాస్త్రములు, షట్కర్మలు నీవు గావు. సప్త ధాతువులు, సప్త కోటి మహా మంత్రములు నీవు గావు. క్షరమును, సదసత్తులు నీవుగావు. నీవు సచ్చిదానంద రూపుడవు అని యెరుగవలెను.

అష్ట తనువులు, అష్టాత్మలు అష్టాంగయోగాది నిష్ఠలు, అష్టమూర్తులు, అష్టపురములు, అష్టమదములు, అష్టాబ్జములు, అష్ట పాశములు, అష్ట స్థలములు నీవు గావు. దశ రంధ్రములు, దశ నామములు, నీవు గావు. పంచశక్తులు, మూల ప్రకృతి నీవు గావు. నీవు చైతన్య స్వరూపమైన సాక్షివని తెలిసికొనుము.

– భద్రాద్రి రామ శతకము

ఈ క్రిందివి నిర్గుణ వాక్యములు :

1) సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ
2) ఏకమేవాఽ ద్వితీయం బ్రహ్మ
3) సర్వం ఖల్విదం బ్రహ్మ
4) నేహనా నాస్తి కించనాః

ఈ వాక్యములను విచారణ చేసెదము.

1) సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ :

సత్యం, జ్ఞానం, అనంతం అని పదవిభజన. "సత్యం" అనగా శాశ్వతమై, కాలపరిచ్ఛేదము లేనిదని అర్థము. "జ్ఞానం" అనగా చిత్తని, స్వప్రకాశమని తేలినది. కనుక ఇది కేవల జ్ఞానమని నిర్ణయము. "అనంతం" అనగా ఆది, మధ్య, అంతం లేనిదనియు, అనగా దేశ పరిచ్ఛేదము లేనిదని అర్థము.

కనుక బ్రహ్మము సర్వకాలములందు, సర్వ దేశములందు ఉండుటచే సర్వవ్యాపకమని, అనంతమని చెప్పబడును. ఇట్టి లక్షణములు గల బ్రహ్మము ఒకటి యున్నదని నిర్ణయము.

2) ఏకమేవాఽద్వితీయం బ్రహ్మ :

ఏకం, ఏవ, అద్వితీయం, బ్రహ్మ అని పద విభజన. బ్రహ్మమునకు ఏకము, ఏవ, అద్వితీయం అను మూడు పదముల చేత ఏకత్వమును సిద్ధింపజేయు చున్నది. ఏకమేవా అనగా ఒక్కటయ్యేదే; అద్వితీయం అనగా రెండవది లేదు. బ్రహ్మయనగా విశాల పూర్ణము. ఈ వాక్యమునకు అర్థము పూర్ణమైన బ్రహ్మము ఒక్కటియేగాని, రెండవది లేదనేది నిర్ణయము. ఈ బ్రహ్మము చిద్రూపము, శాశ్వతము పూర్ణము.

3) సర్వం ఖల్విదం బ్రహ్మ :

ఇదం, సర్వం, బ్రహ్మ, ఖలు అని పద విభజన. క్రమముగా దీని అర్థము ఈ కనబడే సర్వమున్నూ బ్రహ్మమే అయినది. అనగా బ్రహ్మము కంటె అన్యమేమియును లేదు.

తత్పదము, త్వంపదము, అసిపదము, ఆత్మ, అండపిండ బ్రహ్మాండములు, బ్రహ్మ, సత్తు, చిత్తు, సాక్షి రూపము, క్షరాక్షరములు, క్షేత్రక్షేత్రజ్ఞులు, కర్మ జ్ఞానములు, స్థూల దీర్ఘములు మొదలైన సర్వము నీవేనని యెరుగవలెను.

విశ్వ సృష్టివి, విశ్వుడవు, విశ్వ వంద్యుడవు నీవే. వేదవేద్యుడవు, వేదాంతుడవు, వేదస్థుడవు, వేదము నీవే. యజ్ఞకర్తవు, యజ్ఞ భోక్తవు, యజ్ఞరూపుడవు, యజ్ఞము నీవే. దేవదేవుడవు, దేవాత్మకుడవు, దైవజ్ఞుడవు, దైవము నీవే. శిష్యుడవు, పరమ దేశికుడవు నీవే. సగుణుడవు, నిర్గుణుడవు నీవే. నీవే సర్వమునకు సాక్షియని యెఱుగవలెను.

పై మూడు వాక్యములు సర్వమూ బ్రహ్మమేననియు, ఇతరము లేనిదనియు, అది సర్వవ్యాపకమై, అనంతమై, చిద్రూప పరిపూర్ణ మనియు దెలుపు చున్నది.

4) నేహ నా నాస్తి కించనాః

నాహం, కించన, నాస్తి అని పదవిభజన. దీని అర్ధము నామరూపాత్మకమైన ప్రపంచము కొంచెమైననూ లేదు. అనగా బ్రహ్మము మాత్రమే నున్నదని అర్ధము.

ఇట్లు సర్వలోకాతీతమై, ఆద్యంతములు లేని బ్రహ్మ స్వరూపము స్వప్రకాశమనియు, దాని కంటె అన్యమేమియూ లేదని, కొంచెమైనా లేదని ఆరూఢముగా నిన్ను నీవు ఆ బ్రహ్మమేయని గ్రహించినట్లుండుము. ఇట్టి ఆరూఢ లక్షణము అవస్యము.

శ్లో॥ ఊర్ధ్వం పూర్ణం । అధః పూర్ణం । మధ్య పూర్ణం ।

యదాత్మకం సర్వం పూర్ణం । తదాత్మేతి సమాధి స్థస్య లక్షణం ॥

తా॥ పైన, క్రింద, మధ్య, అంతటా పూర్ణమై నిండియున్న స్వప్రకాశ బ్రహ్మము నీవై యుండుము. అట్లుండుటయే సమాధి లక్షణము. ఇది శ్రుతి ప్రమాణము; ఋషిప్రోక్తము; మతమై అనుభవ రూపమై యున్నది. సంశయముండరాదు. అనగా నేను పరబ్రహ్మమునై ఉన్నానో, కాదోయని తోచరాదు. నా స్వరూపమైన బ్రహ్మము నేను కాదనుకొనుట అసంభావన. ఇది కూడదు. నేను దేహమునను కొనుట విపరీత భావన. దేహము పూర్వమే నిషేధింపబడినది కనుక, విపరీత భావన కూడదు. ఈ అసంభావన, విపరీత భావనలకు మరొక శ్రుతి ప్రమాణమేదియునూ లేనందున, నేను అద్వితీయ, స్వప్రకాశ, పరబ్రహ్మమునై యున్నాను. ఇది నిత్య సత్యము.

నేను ఆకాశము వలె పూర్ణుడను. ప్రళయమందు జలముచే ఆవరింప బడిన జగత్తువలె పూర్ణుడను. అట్టి నా చేత సర్వజగత్తూ నిండియున్నది. కనుక నాకు త్యాగము (విడచుట) పరిగ్రహించుట లయించుట యనునవి లేవు.

శ్లో॥ కింగృహ్ణామి । క్వ గచ్ఛామి । కిం కరో మిత్య జ్ఞాని కిమ్ ।

ఆత్మనా పూరితం విశ్వం । మహాకల్పంబు నా యధా ॥

తా॥ ప్రళయమందు జగత్తంతా జలము చేత పరిపూరితమైనట్లు ఆత్మ స్వరూపము చేత యీ జగత్తు నిండి యున్నది. కనుక నేను గ్రహించున దేమియూ లేదు; ఎక్కడకూ వెళ్ళవలసినది లేదు, ఏమియు చేయవలసినది లేదు. దేనినీ విడచుటయు లేదు. ఇది ముముక్షువు సమాధి యొక్క ఫలమని యెఱుగవలెను.

శ్లో॥ ఆచార్య వాక్పురుషో । వేద తస్య తా వదేతి ।

చిర యా వన్నవి । మోక్షేద సంపత్స్యత ఇతి ॥

తా॥ ఏ పురుషుడు సద్గురువుల వద్ద నుండి తత్త్వోపదేశము పరోక్ష, అపరోక్ష జనకములైన మహా వాక్యములను తదర్ధములను పొందుచున్నాడో, ఆ పురుషుడు ఆ కాలమందే, అక్కడనే, ఆ ఘడియలోనే (స్వప్నమధ్యమున ఎక్కడ తెలివి వచ్చిన, అక్కడే స్వప్న భయము, స్వప్న నగరాదులు మిథ్యయగునట్లు) జ్ఞానయుతు డగుచున్నాడు మరియు పరిపూర్ణు డగుచున్నాడు.

జీవేశ్వరుల ఐక్యము

జీవుడనగా సచ్చిదానంద స్వరూపుడైన ఆత్మయును, ఆత్మయందు కల్పితమైన అంతఃకరణమున్నూ, అంతఃకరణ ప్రతిబింబము గలసినది.

ఈశ్వరుడనగా సచ్చిదానంద స్వరూపుడైన బ్రహ్మమున్ను, బ్రహ్మమయందు కల్పితమైన మాయయున్ను, మాయాప్రతిబింబము గలసినది.

జీవునియందు, ఆత్మయందు కల్పితమైన అంతఃకరణమున్ను, అంతఃకరణ ప్రతిబింబమును అంతఃకరణ కార్యమైన దేహేంద్రియాదులను నిరసన జేయగా "ఆత్మ" ఒక్కటే మిగులును.

బ్రహ్మముయందు మాయయును, మాయా ప్రతిబింబమున్నూ, మాయాకార్యమైన ప్రపంచమును విడచి చూడగా, అనగా అలక్ష్యము చేయగా "బ్రహ్మము" ఒక్కటే మిగులును.

అనగా జీవునియందున్న అంతఃకరణము, బ్రహ్మ అధీనములోని మాయ, తత్త్వముగా ఒకటియే అయియున్నది. ఈ రెండును కల్పిత తత్త్వములే. ఇట్టి కల్పితములను లేక భ్రమను అలక్ష్యము చేయగా ఉన్నది ఆత్మ, బ్రహ్మములే యని విచారణలో దేలినది.

ఇక బ్రహ్మము సచ్చిదానంద స్వరూపుడే; ఆత్మ సచ్చిదానంద స్వరూపుడే.

కనుక ఉపాదాన కారణముగా రెండు వస్తువులుండవు గాన ఆత్మే బ్రహ్మ, బ్రహ్మయే ఆత్మ. అట్టి ఆత్మ స్వరూపమే నేను అని నిర్ధారణ చేసికొని, పరిపూర్ణుడై, అద్వితీయుడై, సర్వవ్యాపకుడై, అసంగుడై, శుద్ధుడైయుండు ఆత్మ స్వరూపమునే నేను అని నిష్ఠ గలిగియుండుటే ముక్తి.

శ్రుతి॥ "పరిపూర్ణోఽహం, అద్వితీయోఽహం, సర్వవ్యాపకోఽహం,
అసంగోఽహం, నిత్యోఽహం, శుద్ధోఽహం, స్వప్రకాశోఽహం,
శివోఽహం, ఆత్మోఽహం"

సముద్రములో ముంచిన ఘటము వెలుపల, లోపల నీరు ఎట్లు పరిపూర్ణముగా నుండునో, అట్లే ఆత్మ కూడ సర్వ వ్యాపకముగా, అంతర్యామిగా నుండి పరిపూర్ణ మగుచున్నది. అట్టి ఆత్మ నేనను నిర్ణయమే పరిపూర్ణోఽహం.

మాయాకార్యమైన జగత్తు అద్దమందు కనుపించు ప్రతిబింబము వలె, సత్యము గాదు. ఈ విధమైన విచారణలో ఆత్మ తప్ప యితరము లేదని నిర్ణయము. అట్టి ఆత్మ నేనను నిర్ణయమే అద్వితీయోఽహం.

జగత్తులోని ఆకాశము ఎట్లు సర్వవ్యాపకమో సృష్టి యావత్తూ సమస్త దేశకాల వస్తువుల యందు ఒకే రీతిగా అఖండైకరసముగా వ్యాపించి యున్నట్టి ఆత్మ స్వరూపుడను నేనను నిర్ణయమే సర్వవ్యాపకోఽహం.

ఆకాశమెట్లు సమస్త వస్తువులందు వెలుపల, లోపల యుండియు, అసంగమో అట్లే శరీరత్రయ విలక్షణుడు, అవస్థాత్రయ సాక్షి, పంచకోశ వ్యతిరిక్తము అయిన ఆత్మ, వీటన్నిటి రాకపోకలతో సంబంధము లేక, పుట్టక, నశించక అసంగమైయున్నది. అట్టి ఆత్మయే నేనను నిర్ణయమే అసంగోఽహం.

ఆత్మయే శాశ్వతముగా నుండునది యనియు, అనిత్యమైన దేహాదులకే రాకపోకలని స్థిరమైయుండుట నిత్యోఽహం.

అవిద్య, మాయలవలన తోచు కర్తృత్వములు దొలగి నేను జీవుడను కాను, కేవలాత్మను అనెడి నిర్ణయమే శివోఽహం.

లోకములోని పదార్థములను సూర్యుడెట్లు ప్రకాశింపచేయుచు, తాను స్వప్రకాశమగునో అటులనే దేహేంద్రియాదులను ప్రకాశింపజేయుచు తాను మాత్రము దేనిచే ప్రకాశింపబడక, స్వయంప్రకాశమగు ఆత్మ నేనేనను నిర్ణయమే స్వప్రకాశోఽహం.

దేశకాలాలతో గూడిన వస్తువ్యవహారము మనోవ్యాపారము. దానికి పరిమితులు మరియు నామరూపక్రియలు గలవు. అపరిమితమై, అనంతమై, మనోవ్యాపార (వృత్తి) రహితమై, అవాంగ్మానస గోచరమైన జగత్ప్రకాశమైన బ్రహ్మము నేనను నిర్ణయము నుండుటయే బ్రహ్మైవాఽహం.

దేహేంద్రియాది చతుర్వింశతి తత్త్వాలను కూడియు, కూడకయుండి, విలక్షణము, సాక్షిమాత్రము, ఆధారముగానుండు ఆత్మస్వరూపమే నేనను నిర్ణయము ఆత్మోఽహం.

జ్ఞానసారము

ఈ ప్రపంచము అవిద్య వలన కలిగినది. ఇందులో సత్యవస్తువేది లేదు. చిత్తత్త్వము కంటె భిన్నమైనదేదీ లేదు. కనుక మిథ్యమైన ద్వైతము సత్యమైన అద్వైతమును బాధింపదు. ప్రణవార్థాదులను, వాటి రహస్యమును అభ్యసించి విశుద్ధ చిత్తుడు కావలెను.

ప్రపంచ విషయకమై చిత్తవృత్తి ఉంటే జాగ్రదవస్థలో ఉన్నా అది నిద్రయే. ఎవని చిత్తములో నిరంజనమైన జ్ఞానదీపము వెలుగునో వాడే ప్రబుద్ధుడు. అవిద్య వల్ల కలిగిన యీ బేధములన్నీ నీటి బుడగల వలె, క్షణ మాత్రములో జ్ఞాన సముద్రములో లేకుండపోవును. సంసారమన్నది ఉన్నదనీ, అది తొలగించబడాలి అనుకొనుట మోహము. ఉన్నదన్నది లేదు. కనుక పోవలసినదీ లేదు. వివేకముతో మోహాన్ని నిరశిస్తే సాధారణమైన జ్ఞానము నిస్సంశయముగా లభించును. సాక్షిభూతుడై యీ సంసారమను స్వరమును చూస్తూ ఉండి, దానిలో పాల్గొనరాదు. ఇందు కొఱకు చిదానంద ఘనము, విశుద్ధము అయిన ఆత్మగా తనను తాను భావించవలెను.

సేవ, త్యాగము, వైరాగ్యము కంటె భాగ్యము, సంసారము కంటే శత్రువు లేరు. దృశ్య ప్రపంచమును నేను అనెడి సాక్షియందు లయము చేయు ఉపాయము

తెలియవలెను. ప్రపంచమును లయము చేసిన, తత్త్వము ప్రకాశించును. ఇట్టి ఉపాయము మాండూక్యాది శ్రుతులలో చెప్పబడినది.

అంతరింద్రియ నిగ్రహము, బాహ్యేంద్రియ నిగ్రహము, శమదమాదులు కలవాడు, పాపకృత్యములను వదలినవాడు, ఇంద్రియ సుఖములనుండి ఉపరతిని పొందినవాడు, శ్రద్ధతో కూడినవాడు, మంచి మృదువైన, సుఖకరమైన ఆసనముపై కూర్చున్నవాడు, చిత్తేంద్రియముల శ్రమను జయించినవాడై, నిర్మలమయ్యేంత వరకు శ్రవణము చేయవలెను. అంతఃకరణ శుద్ధి కొఱకు ప్రాణాయామము చేయవలెను. ప్రాణగతిని నిరోధించవలెను. విషయముల మీదినుండి ఇంద్రియములను మెల్లమెల్లగా వికర్షించుకొనవలెను.

దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, జీవాత్మ ఇవి దేనినుండి ఏదేది జన్మిస్తున్నదో శ్రుత్యాదులచేత తెలిసికొనవలెను. పిమ్మట ఆయాభూతములలో, ఆయా దేవతలలో సంకల్ప శుద్ధిచే ప్రాణమస్సంయోగముచే విలీనము (లయము) చేయవలెను. ఆధ్యాత్మికమై దేహేంద్రియాది భావమును వదలి, వాటికి కారణమైన దేవతల యొక్క సమిష్టి రూపుడు, ప్రణవములోని అకారార్థమైన విరాట్టే నేననే భావన చేత ముందుగా విరాట్‌లో స్థితుడు కావలెను. పిమ్మట ఆ విరాట్‌కు కారణము, ఉకారార్థము, సూక్ష్మ భూత లింగ సమిష్టి రూపుడూ అయిన హిరణ్యగర్భునియందు ఆ విరాట్పురుషుని లీనము చేయవలెను. అట్లు హిరణ్యగర్భునియందు నిలచియుండి, పిమ్మట ఆ హిరణ్యగర్భునికి కారణుడు మాయోపహతుడు, మకారవాచ్యుడు అయిన అవ్యాకృతుని యందు, ఆ హిరణ్యగర్భుని నిలయమొందించవలెను. ఆ పిమ్మట అంతటికిని అధిష్టానము ప్రణవములోని అర్థమాత్రాలక్షితము అయిన శుద్ధ బ్రహ్మమునందు అవ్యాకృతుని లయమొందించి స్థితుడైయుండవలెను. ఇదియే ప్రణవోపాసన.

దేహేంద్రియాదులు ఏవేవి దేనినుండి పుట్టినవో వాటిని వాటి వాటి యందు లయమొందిచవలెను. మాంసాదులైన పృథివీ తత్త్వమును భూమియందు, రక్తాది జలతత్త్వమును జలములోను, వీర్యము మొదలైన అగ్నితత్త్వమును అగ్నిలోను, ప్రాణములను వాయుతత్త్వములోను, శరీరరాకాశమును ఆకాశతత్త్వములోను సంకల్పమును చేయక ఉంచవలెను. అనగా తన్మాత్రములు అని భావించి, లయం చేయవలెను. అలాగే ఘ్రాణాదీంద్రియములనుకూడా వీనికి కారణములైన సూక్ష్మపృథ్వి వ్యాదులలో లయము చేయవలెను. తరువాత జీవునికి శబ్దాది భోగసిద్ధికై, కర్ణము మొదలైన గోళకములలో ప్రవేశించినట్టి శ్రోత్రాదియింద్రియ భావముతో గూడిన అధి దేవతలను వాటి దేవతలందు ప్రవేశపెట్టవలెను. అనగా శ్రోత్రమును దిక్కులందు, చర్మమును విద్యుత్తునందు, చక్షువును సూర్యునిలోను, జిహ్వను వరుణునిలోను, ప్రాణమును వాయువులోను వాక్కును అగ్నియందు, పాణిని యింద్రునియందు, పాదాన్ని ఉపేంద్రునియందు, పాయువుని మృత్యువుయందు, ఉపస్థను ప్రజాపతియందు, మనస్సును చంద్రుని యందు, బుద్ధిని బృహస్పతియందు నిస్సంకల్పుడై ఉంచవలెను.

ఈ అధి దేవతలందరున్ను ఆయా ఇంద్రియములకు అధిష్ఠానము. నిజమునకు ఆ అధిదేవతలనే ఇంద్రియములు అని అనుచున్నాము. ఈ విధముగా దేహేంద్రియాదులను వాటివాటి కారణములలో లయమొనర్చి "నేను విరాట్పురుషుడిని" అని భావించవలెను.

అర్ధనారీశ్వరరూపములో బ్రహ్మాండములో నున్న పురుషడే జగత్తుకు అభిన్ననిమిత్తో పాదానకారణుడైయున్న బ్రహ్మము. అన్ని భూతములకు ఆధారమైనవాడు, కారణుడు, ప్రభువు, తండ్రి. కనుక సృజించిన దేవమనుష్యాది కోటికి అన్నపానాదులను, జీవనోపాయమును కల్పించి పోషించుచున్నాడు.

బ్రహ్మాండము కంటె రెట్టింపు భూమి, భూమికంటె రెట్టింపు జలము, జలముకంటె రెట్టింపు అగ్ని, అగ్నికి రెండింతలైన వాయువు, వాయువుకు రెండింతలైన ఆకాశము, ఇట్లు ఒకదానిపైనొకటి చొచ్చిన పంచీకృతము, అపంచీకృతము నైన భూతములచే జగత్తు వ్యాప్తమై యున్నది.

కనుక భూమిని జలములోను, జలమును అగ్నిలోను, అగ్నిని వాయువు లోను, వాయువును ఆకాశములోను సమస్త స్థూలప్రపంచోత్పత్తికి కారణమైన మహాకాశములోను, లయముచేసి, ఆహిరణ్యగర్భాకారములోను, ఉండినవాడై వాసనలు, సూక్ష్మభూతములు, కర్మ, అవిద్య, దశేంద్రియములు, మనస్సు, బుద్ధి, వీటితోకూడిన లింగ శరీరమును మాత్రమే ధరించినవాడై, నేను బ్రహ్మాండమును అను అభిమానము విడచుటవలన ఆ బ్రహ్మాండముకంటె వెలుపలయుంటూ,

సూక్ష్మ భూతరూపమైన సమిష్టి లింగశరీరములో ఆత్మగానుంటూ యుండే హిరణ్యగర్భుడిని నేనే, అని ధ్యానించవలెను.

సూక్ష్మ భూతములయందు అభిమానముగల వాడై యున్న యీ హిరణ్య గర్భుడే బ్రహ్మాండాభిమానమును విడచుటకు పూర్వము, బ్రహ్మాండైశ్వర్యము అనుభవించుట కొఱకై చతుర్ముఖ బ్రహ్మయైయున్నాడు.

ఈ విధముగా "నేను హిరణ్యగర్భుడను" అని భావించిన పిమ్మట అవ్యాకృతునియందు లింగశరీరమును లీనముచేయవలెను. అవ్యాకృతుడనగా అపంచీకృతమైన భూతములకంటె సూక్ష్మతరము, ఉపాధి రూపముచేత మాయాంశమున్ను, చిద్రూపముచేత అవ్యక్తమున్ను. ఈ అవ్యాకృతుడినే సాంఖ్యులు ప్రకృతి అనీ, వేదాంతులు మాయ అనీ, తార్కికులు అణువు అనీ, బౌద్ధులు సంస్కృతి రూపమైన అవిద్య అనీ, చెప్పెదరు. ఆకాశాదిక్రమములో జరిగిన సృష్టి భూమ్యాదిక్రమములో ఉపసంహారము జరుగును. అందుచేత విరాట్ హిరణ్య గర్భ అవ్యాకృతనామములు గలదీ, స్థూల సూక్ష్మ కారణ రూపములు గలదీ, జాగ్రత్స్వప్నసుషుప్తత్రయమును విడచినట్టిదీ,

శ్రు॥ **"శివమద్వైతం చతుర్థంమన్యంతే"** అను శ్రుతిచే చెప్పబడిన ఆత్మతత్త్వ మును ధ్యానించవలెను. అట్టి ధ్యానము చేత లభించిన చరమ సాక్షాత్కార వృత్తిచే, ధ్యానకర్తృకరణ రూపమైన లింగ శరీరము, మూలాజ్ఞానము పోవుట వలన ఘటభంగము కాగానే ఘటాకాశము మహాకాశములో లీనమై నిరతిశయానంద మును అనగా పరబ్రహ్మమును పొందును. దీనినే లింగ శరీర భంగము అందురు.

లింగశరీర బంధమునుండి విముక్తుడనైనాను. నేను చిదాకాశమును కనుక చిదానంద సముద్రములో ప్రవేశించితిని. నేను సర్వోపాధిరహితుడనైన బ్రహ్మమునే! నేను పుణ్యపాప విముక్తము, జగత్కారణము, అద్వితీయము అయిన బ్రహ్మమునే! అని ఇట్లు ముముక్షువు సదా బ్రహ్మమునే ధ్యానించవలెను.

ఇట్లు అభ్యాసము చేయుట వలన పురుషునకు మనస్సు క్షయమై పోవును.మనస్సు క్షయమైపోగా, ఆత్మ ప్రకాశించును. ఆత్మ ప్రకాశించగా సమస్త దుఃఖములు పోవును.

ఈ విధముగా జ్ఞానమార్గము చేతను, యోగమార్గము చేతను, అన్నియు తెలిసికొని ఆత్మ సంధానాభ్యాసము చేయవలెను. ఇట్లు ఆత్మయందు విశ్రమించి యుండగా సద్గురువు తన శక్తి పాతముచే తక్షణమే గురుత్వమును చూపించును. కుండలిని యొక్క షట్చక్రభేదనము చేత బ్రహ్మ రంధ్రముననున్న పరమశివుని తోడి సమావేశము గాని, లేదా జీవుని ఉపాధి పరిత్యాగము చేత పొంద బడిన శుద్ధ బ్రహ్మ రూపత్వమును గాని శక్తి పాతమందురు. శిష్యుని దేహమునందే పరమశివుని సమావేశమును కలిగించు వాడు గురువు.

ఇట్లు ఆత్మయందు విశ్రమించినవానిని సమాధినుండి మేలుకొనునట్లు చేయును. సుషుమ్నాద్వారము ద్వారా శిష్యుని హృదయములో ప్రవేశించి, గురువైన వారు మేల్కొలిపెదరు. గురు వాక్యమును విధిగా శిరసావహించి కర్తవ్యములను నెఱవేర్చు శిష్యుడే జీవన్ముక్తుడు.

ఎఱుక నిర్ణయమునకు సాధనా సంపత్తి - శుశ్రూషలు

సాధనా చతుష్టయము :

సాధనా చతుష్టయ సంపత్తి కలుగవలెను. సద్గురునిచే నిత్య పరిపూర్ణమును, అనిత్య ప్రపంచమును తెలిసికొనవలెను. అష్టైశ్వర్య వనితా పుత్రాది యిహ లోక భోగములను, సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్య, జీవ బ్రహ్మైక్యము వంటి పదవులను, బ్రహ్మలోక పర్యంతాది పరలోక భోగములను పరిత్యజించుట సహజము గావలెను.

బ్రహ్మ విద్యా శ్రవణాదులు తప్ప యితర విషయ వాంఛల యందు మనస్సును చొప్పించక, యితరములపై నిచ్చ లేకుండయుండవలెను. అటులనే జ్ఞాన కర్మేంద్రియముల ప్రవర్తన గురువులచే శ్రవణము చేసిన వాటియందు వర్తింప జేయవలెను. స్వార్థ రహిత కర్మాచరణ, ప్రాప్తించిన సుఖదుః ఖములయందు సమత్వము కలిగియుండుట, సద్గురు నిశ్చయ ప్రబోధయందే శ్రద్ధ కలిగియుండుట మరియు జనన మరణ రహిత పద్ధతి యందు సమాధానము గలిగి, యితర పద్ధతులగు జీవ బ్రహ్మైక్య యోగాంగములందు సమాధానము లేకయుండుట, యీ విధముగా శమాది షట్క సంపత్తి నొందవలెను.

జీవబంధ మోక్షము, దైవబంధ మోక్షము గలుగు పద్ధతిని గాక లేనెఱుకను నిశ్చయించి విడచుట, అచల పరిపూర్ణ పరబయలునందు తనకు మూలము లేదని యూరకుండి జనన మరణ భ్రాంతి నుండి విడుదలగుటకు తగిన గురుస్వామిని తహతో వెదకువానికే ముముక్షుత్వము.

చతుర్విధ శుశ్రూషలు :

పిదప గురునికి చతుర్విధ శుశ్రూషలొనరించవలెను. తన ప్రవర్తనయందు గురుమూర్తికెట్టి యనుమానము రాకుండ త్రికరణ శుద్ధిగా బోధకై నాశ్రయించుటనే యాత్మ శుశ్రూష. నియమితాచారముగా అచల గురువు చూపిన మార్గములో నుండుచు పరిపూర్ణ బోధకు అధికారి లక్షణములు గల్గి యుండవలెను. ఇది అంగశుశ్రూష. తన స్థానమునకు గురుని రప్పించక, తానే గురుని స్థానమునకు బోయి, గురుని విసిగించక, వారి కరుణ గల్గినంతవరకు వేచి, బోధనెఱుగుటయే స్థాన శుశ్రూష. జనన మరణ భ్రాంతి రహితమునకు యేది సద్గురునిచే నిర్ణయింపబడినదో సర్వకాల సర్వావస్థలయందు, దానిలోనే భావముంచుట భావ శుశ్రూష.

ఎఱుక నిర్ణయమునకు మహావాక్య విచారణ

పరబ్రహ్మమును దెలియజేయునవియై పరబ్రహ్మము వలన గలిగి ప్రకాశించు నాలుగు వేదములలో ఋగ్వేదమునందు "ప్రజ్ఞానం బ్రహ్మ" అనెడు సాక్షాత్కార మహా వాక్యముగాను, యజుర్వేదమందు "అహంబ్రహ్మాస్మి"యను అనుభవ మహా వాక్యముగాను సామవేదమందు "తత్వమసి"యను ఉపదేశ మహావాక్యముగాను, అధర్వణవేదమందు "అయమాత్మా బ్రహ్మ"యను సమాప్తి మహావాక్యముగాను నాలుగు మహా వాక్యములు గలవు. ఇవి నాలుగు వేదములు గనుక ఆ వేదముల నాధారము జేసికొని యీ మహావాక్యముల విచారణ చేయు ముముక్షువులకు చిత్తశుద్ధి గలుగుటకు కర్మకాండమున్ను, గురు శాస్త్ర వాక్యములందు విశ్వాసము గలుగుటకు భక్తి కాండమున్ను, బ్రహ్మ సాక్షాత్కార జ్ఞానమునకై జ్ఞానకాండమున్ను గలవు.

తొలుత ప్రజ్ఞానం బ్రహ్మయను సాక్షాత్కార వాక్యమును నిరూపించి, దాని చేత అనుభవము గలుగనందున యజుర్వేద వాక్యమగు అహంబ్రహ్మాస్మి యను మహావాక్యము చేత అనుభవమును జూపెను. ఆయర్థము చక్కగా దెలియుటకు సామవేదమందలి తత్వమసి మహావాక్యము చేత ఉపదేశ క్రమము దెలిపెను. అదే సంపూర్ణమని సమాప్తి పొందుటకు అధర్వవేదమందు అయమాత్మా బ్రహ్మయను మహావాక్యము జనించెను.

ప్రజ్ఞానం బ్రహ్మ (సద్గురు కృప) :

భావార్థం : సర్వజీవులయందున్న చైతన్యమే (ప్రజ్ఞానమే) స్థావర జంగమాత్మకమైన సృష్టియంతటనున్న చైతన్యం (బ్రహ్మము)

వాచ్యార్థము : బ్రహ్మము నుండి పిపీలికము వరకూ ఉన్న సమస్త జగత్తు (స్థూలమంతా)

లక్ష్యార్థము : జీవరాశులయందు ఇంద్రియములనుపయోగించు చైతన్య రూపమయిన జ్ఞాత (ప్రత్యగాత్మ) తన్మాత్ర సహిత మాయా కార్యమయిన, జగత్సృష్టికి అధిష్టానమై కారణమయిన ఈశ్వరీయమయిన చైతన్యం కూటస్థుడు. అఖండ ఎఱుకయందు – ఈ రెండింటి ఏకత్వం.

అనుభవార్థం : పిండరూపమయిన సకలేంద్రియములు అందలి సాక్షి అహమయిన జ్ఞాత లేక జీవుడు లేక ప్రజ్ఞానం మరియు కూటస్థ నిర్మితమైన బ్రహ్మాండము నందలి తన్మాత్రలు, అధిష్ఠాన దేవతలు అందలి సాక్షి అహమయిన కూటస్థుడు లేక అక్షరుడు లేక బ్రహ్మము ఈ రెండు + రెండు కూడి పరమాత్మ లేక పరబ్రహ్మమనెడి అఖండ ఎరుక అని నిర్ణయింపబడుట.

ప్రజ్ఞానం బ్రహ్మయను మహావాక్యమునకు గూడ ప్రజ్ఞానము, బ్రహ్మము అను శబ్దములకు మూడు లక్షణముల ద్వారా, వాచ్యార్థ లక్ష్యార్థములను విచారణ చేసి వాచ్యార్థములను విడచి, లక్ష్యార్థములను గ్రహించవలెను. ప్రజ్ఞాన శబ్దమునకు అర్థము.

శ్లో॥ ఏనేక్షతేశృణోతీదం జిఘ్రతి వ్యాకరోతిచ ।
స్వాద్వ స్వాదు విజానాతి తత్ప్ర జ్ఞానమిదీర్యతే ॥

తా॥ స్వాధిష్ఠాన చిదాభాసుడైన జీవుడు శ్రోత్రముల నుండి బయలుదేరిన అంతః

కరణ వృత్తితో గూడి ఏ జ్ఞానము వలన సకల శబ్దములను వినుచున్నాడో, అట్లే మిగిలిన జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ, అంతరేంద్రియముల నుండి బయలుదేరిన అంతఃకరణ వృత్తులతో గూడి యే జ్ఞానము వలన సకల బాహ్యాభ్యంతర విషయముల నెరుగుచున్నాడో, ఆ జ్ఞానమే ప్రజ్ఞానము.

బ్రహ్మపదమునకు అర్థము :

శ్లో॥ చతుర్ముఖేంద్ర దేవేషు । మనుష్యాశ్వా గవాదిషు ।
చైతన్యమేకం బ్రహ్మాత్మా । ప్రజ్ఞానం బ్రహ్మమేద్యపి ॥

తా॥ చతుర్ముఖ బ్రహ్మ మొదలైన దేవతలయందును, మనుషులు, గజాశ్వముల యందును, కలసి యే చైతన్యమున్నదో ఆ చైతన్యమే బ్రహ్మము.

లోఅర్థమైన బ్రహ్మపదమునకు, బ్రహ్మ మొదలు తన శరీర పర్యంతమైన సకలమును వాచ్యార్థము గనుక మాయా కార్యమని త్రోసి వేయదగినది. వాచ్యార్థము విడువగా, మిగిలిన పరబ్రహ్మ స్వరూపమే నీయందును, నాయందును (శిష్యునియందును, గురునియందును), సర్వమందును, ఉండెడి ప్రజ్ఞానమనెడి చైతన్యము; అదియే బ్రహ్మ స్వరూపము. చైతన్యమని, ప్రజ్ఞానమని, బ్రహ్మమని, ఆత్మయని యీ పేరులన్నీ ఒక్కటే. నేనే బ్రహ్మమని నిర్ణయించబడ వలెను. ఇదియే బ్రహ్మజ్ఞానము.

పంచ జ్ఞానేంద్రియములచే శబ్ద స్పర్శరూపరస గంధములనెడి విషయములను, పంచ కర్మేంద్రియములచే, వచన, దాన, గమన, ఆనంద, విసర్జన విషయములను, అంతరేంద్రియములచే చలన, నిశ్చయ, చింతన, అభిమాన విషయములను, యే జ్ఞానముచే యెరుగబడుచున్నదో, అదియే ప్రజ్ఞానమనబడును.

బ్రహ్మ విష్ణువు రుద్రుడు ఇంద్రాది దేవతలయందును, మనుష్య అశ్వ గజ పశువులు దోమ చీమలవరకు యుండెడి జీవులయందు గుర్తెటిగే చైతన్యమే బ్రహ్మమనబడును. కనుక బ్రహ్మ మొదలు పిపీలికము వరకు యుండెడి శరీరము వాచ్యార్థమని విడచితే, ప్రజ్ఞానము బ్రహ్మము అనేది పలుకు భేదమే కాని, వస్తువొక్కటియేయని యెఱుగవలెను.

అహం బ్రహ్మాస్మి

భావార్థము :

అహం = నేను, బ్రహ్మ = బ్రహ్మమును, అస్మి = అయితిని. "నేను బ్రహ్మమును అయితిని" అని శిష్యుడు సద్గురువునకు తెలుపుట.

వాచ్యార్థము :

పిండాండమంతయును అందలి సాక్షి అయిన ప్రత్యగాత్మతో కూడి వ్యష్టిగా ఆత్మానుభవ నిర్ణయమును బ్రహ్మాండమంతయును అందలి సాక్షి అయిన కూటస్థ బ్రహ్మముతో కూడిన సమిష్ట్యానుభవముగా నిర్ణయము.

లక్ష్యార్థము : పిండాండమందలి జీవుడే బ్రహ్మాండమందలి కూటస్థుడు లేక పరబ్రహ్మము కావున "నేనే బ్రహ్మమును"

అనుభవార్థం : కేవల సమిష్ట్యానుభవ రూపమున సర్వముయందున్న తనను, తనయందున్న సర్వమును, అధిష్ఠాన రూప అఖండ ఎఱుకగా అనుభవ రూపమున నిర్ణయించుట.

అహంబ్రహ్మాస్మి అను అనుభవ వాక్యమునందు యీ మూడు పదములైన అహం, బ్రహ్మ, అస్మిలకు అర్థము.

శ్లో॥ స్వప్రకాశ పరోక్షత్వ మయ మిత్యుక్తితో మతం ।
అహంకారాది దేహాంతం । ప్రత్యగాత్మేతి గీయతే ॥

తా॥ అయం పదముచే స్వవశమై నిత్యా పరోక్షమైయుండునది యీ ఆత్మయే. అహంకారము మొదలు స్థూల దేహ పర్యంతము "నా అహంకారము, నా దేహము" అని యెటిగెడి చైతన్యమే ప్రత్యగాత్మ రూపము. ఇందుకు అర్థము చూడబడెడి సమస్తమును బ్రహ్మమనెడి శబ్దము చేత చెప్పబడిన లక్ష్యార్థము జగదధిష్ఠానమైన బ్రహ్మమే నీవు అని ప్రతిపాదించుచున్నది. కనుక నీవే సచ్చిదానంద స్వరూపమై అద్వితీయమైన ఆత్మ స్వరూపుడవు. నీకు వర్ణాశ్రమములు, వాని ధర్మములు లేవు. నీవు అసంగుడవు. కాలత్రయమందు నీవు జీవుడవు గావు. నీకు ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మలు లేవు. అఖండైక రసమై సుఖ స్వరూపమైన ఆత్మవు నీవు.

ఇట్లని గురువు నీ శిరస్సుపై వారి హస్త స్పర్శము జేసి పూర్ణానుగ్రహము జేసిన, శిష్యుడైన నీవు బాహ్యాంతర ప్రపంచమును మరచి, కొంతసేపు నిర్వికల్ప నిష్ఠయందుండి, వెనుక కన్నులు దెరచి, గురుకృపచే కృతార్థుడవగుదువు.

బ్రహ్మవిద్యకు అధికారియైన దేహమందు బుద్ధికి సాక్షియై స్ఫురియింపు చున్నదియేదో అదియే అహం అనే అర్థమగును. ప్రతిలేనిదై స్వతః పరిపూర్ణ పరమాత్మయైన వస్తువు బ్రహ్మమనే పదమునకు అర్థమగును. అహమే బ్రహ్మము, బ్రహ్మమే అహమని తెలిసికొనుటయే ఆత్మ అనే పదమునకు అర్థమగును. పిండ బ్రహ్మాండములైన ఉపాధులు వాచ్యార్థమని యెఱుగవలెను.

తత్వమసి :

భావార్థము : తత్ + త్వం + అసి = బ్రహ్మము + అహం + ఏకమే నేను బ్రహ్మము ఒక్కటియే.

వాచ్యార్థము : సమస్త బ్రహ్మాండ సృష్టికి పూర్వమున్న పరబ్రహ్మ సత్తా అయిన కూటస్థము తత్ పదము, (1) సమస్త సృష్టియందు సాక్షి అయి చైతన్యమాత్రుడైన ప్రత్యగాత్మ త్వంపదము కలసి అఖండ ఎఱుకగా ఈ జీవ బ్రహ్మైక్యమే అసిపదమునకర్థము

లక్ష్యార్థము : సర్వవ్యాపకము, అనంతముగా తోచుచున్న బ్రహ్మాండమంతా పరబ్రహ్మ సత్తాగా గుర్తెరిగి, సద్గురూపదిష్ట మార్గమున ప్రత్యక్ పరమాత్మలు అభిన్నులని అనుభవ నిర్ణయమందుట.

అనుభవార్థము : అఖండమయమయిన పరబ్రహ్మము ఎఱుక స్వరూపమని పిండము, బ్రహ్మాండము జీవేశ్వరులకు ఉపాధులని, అవి మిథ్యయని గుర్తెఱిగి, గురియైన, కేవల ఎఱుకయైన, పరిపూర్ణ పరబ్రహ్మము అనెడి ఎఱుకను నిర్ణయమందుట.

సృష్టికి పూర్వము అద్వితీయమై, నామరూప క్రియా శూన్యమై, యేకమై, అచలమై ఏదియున్నదో అదియే తత్పద లక్ష్యార్థమగును.

మోక్షాధికారియందు మనోబుద్ధి చిత్తాది దేహేంద్రియములకతీతమై, సాక్షియై తేజరిల్లుచుండెడిదేదియో అదియే త్వంపద లక్ష్యార్థమగును.

పిండబ్రహ్మాండములైన వాచ్యార్థములు విడచిన, ఒక దేహము యొక్క సాక్షిన్నీ, బ్రహ్మాండాతీతమైన పరబ్రహ్మమున్ను ఏకమనియు, సాక్షి సాక్షేయేనని ఐక్యపరచుటయే అసి పదమునకు లక్ష్యార్థము.

తత్వమసి మహా వాక్యమందు తత్పదమని, త్వంపదమని, అసి పదమని మూడు పదములు గలవు. వీనియందు అది యనెడి అర్థము గల తత్పదమునకు వాచ్యార్థము, లక్ష్యార్థము అను రెండు గలవు. వాచ్యార్థమనగా మూలా విద్యా స్వరూపమగు మాయయందు పరబ్రహ్మ ఛాయా ప్రతిబింబుడై, ఈశ్వరుడును, వాని స్థూల సూక్ష్మ కారణ శరీరములును, జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలును, యీ అవస్థలయందు గల పంచకోశములును, ఆ కోశముల యందు అభిమానము గల విరాట్ హిరణ్య గర్భ అవ్యాకృతులను నామములును, సర్వజ్ఞత్వాది గుణములును గూడి తత్పదవాచ్యార్థము. వీనికన్నిటికిని విలక్షణమై సత్యజ్ఞానానంద నిత్యనిర్మలత్వము గల పరమాత్మ తత్పద లక్ష్యార్థము.

నీవనెడు అర్థము గల త్వంపదమునకు వాచ్యార్థము, లక్ష్యార్థము అని రెండు గలవు. వానిలో వాచ్యార్థమనగా తులావిద్యా స్వరూపమైన అవిద్యయందు ప్రతిబింబించిన పరబ్రహ్మ ఛాయా స్వరూపుడైన జీవుడును, వాని స్థూల సూక్ష్మ కారణ శరీరములును, ఆ శరీరములయందు గల జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలును, ఆయాయవస్థల యందు గల పంచకోశములును, ఆ కోశములయందభిమానము గల విశ్వతైజస ప్రాజ్ఞ నామములును, కించజ్ఞత్వాది గుణములును గూడి త్వంపద వాచ్యార్థము. వీనికన్నింటికినీ విలక్షణుడైన ప్రత్యగాత్మ త్వంపదమునకు లక్ష్యార్థము.

పండితులు జహల్లక్షణ, అజహల్లక్షణ, జహద జహల్లక్షణములనెడు మూడు లక్షణములను గ్రహించి, శ్రుతి, స్మృతుల యందలి శబ్దములకు అర్థములను నిర్ణయించినప్పుడు, ఎక్కడ ఏ లక్షణముపయోగపడునో అక్కడ ఆయా లక్షణముచే నిజమైన అర్థమును తెలిసికొందురు.

అట్లే వాచ్యార్థములలో భేదములున్నను, అందలి లక్ష్యార్థమొక్కటియే యైనందున, లక్ష్యార్థము ననుసరించి ఏకత్వమును బొందును. అవిద్యా

కల్పితములైన దేహేంద్రియాదులు నశించుచున్నవి. కనుక ఆత్మయనుట ప్రత్యక్ష విరోధము. కనుక వాచ్యార్థములైన దేహేంద్రియాదులను వదలి, వీనికి విలక్షణమైన పరమాత్మయున్నాడనుట జహల్లక్షణము దీనినంగీకరించిన యెడల ఉపాసకుడును, ముముక్షువును లేకుండా పోవును. కావున అందు అజహల్లక్షణమును గ్రహింపవలయును. అజహల్లక్షణమనగా ఆ దేహేంద్రియాదులతో గూడి జీవుడైన తాను, తనకు ఉపాస్యుడైన ఈశ్వరుని మాయా కల్పితములైన దేహత్రయము, అవస్థాత్రయము, చతుర్దశేంద్రియము లును, సూర్యాది అధి దేవతలును, త్రయావస్థాభిమానులును, మొదలైన వానిని విడువక అపరోక్ష జ్ఞానము కలిగెడు వరకు నవ విధ అంగములు గల త్రివిధ భక్తుల చేత ఆరాధించుచు స్తుతించుచు, ధ్యానించుచుండుటయే.

జహదజహల్లక్షణమనగా "ఏకమేవాఽ ద్వితీయం బ్రహ్మ", "నేహ నా నాస్తి కించన", "బ్రహ్మమాత్రమ సన్నిహి పురుషాన్న పరకించిత్ పురుష ఏ వేదగ్ం సర్వం ఖల్విదం బ్రహ్మ", "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అను శ్రుతులను బట్టి నిర్మలాంతఃకరణుడై పరోక్ష జ్ఞానము నశించగా సాధన చతుష్టయ సంపన్నుడై సద్గురుని వద్ద జేరి తత్వమస్యాది మహావాక్య శ్రవణ, మనన, నిధి ధ్యాసముల చేత లభించిన పూర్ణాపరోక్ష జ్ఞానము గల వాడగుచు, అవిద్యా కల్పితములైన జీవ శరీరాదులను, మాయా కల్పితములైన ఈశ్వర శరీరాదులను విడచి, జీవసాక్షియైన ప్రత్యగాత్మను, ఈశ్వర సాక్షియైన పరమాత్మను విడువక దీప ప్రకాశమే దివిటీ ప్రకాశమైనట్లు త్వంపద లక్ష్యార్థమైన ప్రత్యగాత్మయే, తత్పద లక్ష్యార్థమైన పరమాత్మ యగును. ఆ పరమాత్మయే ప్రత్యగాత్మయని యెఱిగి సుఖముగానుండుటయే జహదజహల్లక్షణము.

అయమాత్మ బ్రహ్మ:

భావార్థము : అయం+ఆత్మ+బ్రహ్మ = నేను (లేక) ఉన్నది అంతా- ప్రత్యగాత్మ - పరమాత్మ. అంతా పరమాత్మ స్వరూపమే అహం - నేను లేనివాడను.

వాచ్యార్థము : సర్వమయిన పిండ, బ్రహ్మాండమంతటా నిండియ్నుది పరమాత్మయే పరబ్రహ్మమే అను నిర్ణయము.

లక్ష్యార్థము : అధిష్ఠాన చేతనరూప చరాచర సృష్టియంతా వ్యాపనమయిన ఎఱుక స్వరూపునకు, బట్టబయలును లక్ష్యార్థముగ నిర్ణయము తెలియుట.

అనుభవార్థము : నిర్గుణ, నిర్వికార, పరబ్రహ్మము అఖండమైన ఎఱుకగా, స్వాధిష్ఠానముగా, తనకు తానుగా, నిర్ణయింపబడినదని, లక్ష్యార్థమైన బట్టబయలందు తనకు మూలము లేనిదని నిజగురుకృపచే నిర్ణయింపబడుట.

ఇంకను దేహేంద్రియాతీతము, స్వచ్ఛము, స్వప్రకాశము, అపరోక్షము, ఆద్యంత శూన్యము, నిత్యము, శుద్ధము, బుద్ధమునైయున్న నిర్గుణ బ్రహ్మమే అయమాత్మయనే పదమునకు లక్ష్యార్థము.

మరియు బ్రహ్మాది పిపీలికాంత తనువుల చరాచరముల కధిష్ఠానమై, ప్రతి లేనిదై, నిరుపద్రవమై, బట్టబయలైయున్నదే బ్రహ్మపదమునకు లక్ష్యార్థమగును. ఈ రెండున్నూ ఒక్కటేయని తెలియవలెను.

నాలుగు మహావాక్యములందును, ఉపనిషద్భాష్యములందును, యోగ శాస్త్రములందును, మంత్ర శాస్త్రములందును నీవే బ్రహ్మవు. బ్రహ్మయే నీవని చెప్పబడుచున్నది.

బ్రహ్మ క్షత్రియ వైశ్య వర్ణములు, బ్రహ్మచర్యాది ఆశ్రమ ధర్మములును, స్వజాతి విజాతి స్వగత భేదములును, నామ రూపకుల గోత్రములును, ఖేద మోదములును, వాదభేదములును నీకు లేవు. నీవే బ్రహ్మవు. ఈ ఆత్మయే బ్రహ్మము.

అసంగము :

తామరాకునకు నీరు, అద్దమునకు రూపము, కుమ్మరి పురుగునకు బురద, నాలుకకు నెయ్యి, సూర్యునకు చీకటి, ఆకాశమునకు వాయువు యేలాగునంటవో, ఆలాగే జ్ఞానులు ప్రపంచమందు సకల వ్యవహారములు చేసియు, అసంగులని యెఱుగవలెను. - భద్రాద్రి శతకము

ప్రజ్ఞానం బ్రహ్మ వివరణము :

కం॥ నేనెఱిగినంత దెలిపెద । లోనెఱుకను మించి
నీవు । లోబయలైనన్ । నీనా భావంబచలము
స్వానుభవాతీతమైన - సారమిదేరా - రేచక

మూని – పూరించిగనరా – ఆరూఢ ప్రజ్ఞ

చె॥ నంతరాత్మయందు – జేరి మిన్నకయుండు –

చిన్మయమమరును – కోరిమించెడు బయలు

నీమది గోప్యకుంభకమూనినంతట – దారిలో

నగు ద్వాదశాక్షరి – తత్త్వమూలము తన్మ

యంబగు – సారమిదేరా – రేచకమూనిపూరించిగనరా॥

– కందార్థ రత్నావళి 179వ కం॥

తా॥ తత్త్వ జ్ఞానమూలమైన పరబ్రహ్మమును నిర్ణయించెడి హంసరూపమయిన అంతరప్రజ్ఞ లేక ప్రత్యగాత్మను సద్గురు కృపాకటాక్షముచే నంది, పొంది, నిజగురు ఆశ్రయమున చిన్మయమైన సచ్చిదానందమంతయు ఎఱుకయని ఎఱిగి, అట్టి దేశికేంద్రుల హృదయముతో ఐక్యమంది బయలును "కాంచి" గురుశిష్య ద్వంద్వము లేని స్థితిని మరియు స్వానుభవాతీతమును కేవల కుంభకమునందు పొందును.

1) అంతఃశూన్యమయిన ప్రజ్ఞా శూన్యమును, 2) బహిర్ శూన్యమయిన (పరబ్రహ్మ సత్తా అయిన) చైతన్య నిరావరణమును, 3) పరిపూర్ణము అనెడి షట్కోశ ఆవరణ రహిత బయలును గురుగోప్యముగా ఈ ఉత్త బట్టబయలు ఏమీ లేదు అను ద్వాదశాక్షరిచే తెలిసి చేసెడి ఎఱుక నిర్ణయమును 'ప్రజ్ఞానం బ్రహ్మ" గా నిర్ణయించుట అని భావము.

కం॥ దృక్కగు దృష్టికి పైగా – ముక్కుతుదన్ నిలిపి

మనసు – మునివైయుండన్ – జిక్కు నీ వున్మనీ

భావము – చక్కగ లోచూడ్కినంటు – ఛాయ

బ్రహ్మమురా – విదితంబైన – న్యాయముగదారా –

మాయవాదులకిట్టి మర్మము దొఱకదు – బా

యని జ్ఞప్తిలో – బయలంది పొందుము.

కాయమున దగు బ్రహ్మతేజము – కంటి

పాపను యంటిమించిన – వేయు విద్దెల

కెక్కుడై మరి – వెలయుచుండెడి ప్రజ్ఞ

లో వెలి – ఛాయబ్రహ్మమురా – విది

తంబైన – న్యాయము గదరా ॥

– కందార్థ రత్నావళి 180వ కం॥

తా॥ శాంభవీ లక్ష్య భావ విదితంబైన అనుభవానంద ఘనమైన ఉన్మనీ యందు సంప్రజ్ఞాత, అసంప్రజ్ఞాత సమాధి భేదముచే మునివై, చిన్మయ ఘనిష్ఠమగు సర్వము బ్రహ్మయని ఎంచి, లోచూపుగా, రూపుకు రూపుగా, మనస్సులో మనస్సుగా, ఎఱుక మరపు భేదము లేని, అఖండ ఎఱుక స్వరూప నిర్ణయ సారమంతయు తెలిసి, బయలును లక్షించ వలెనన్న నిజగురుకృప నందవలెను.

దృగ్దీక్షా సాంప్రదాయమున మాయా విచారణ కతీతమగు దృక్కగు బ్రహ్మమును, వేద విద్యాసారమునకు మించి స్థిరమైయుండెడి చిన్నాద, చిద్బిందు, చిత్కళా సహిత ఆపోజ్యోతి స్థానము, దర్పణ విధానమున సూచన చేయబడి గురుకృపచే ఆర్యాదర్పణమునందు నిరాలంబమగు ఆధారమే లేని సర్వ దృక్ధ్యానము అనెడి అఖండ ఎఱుక నిర్ణయ మందుటయే ముఖ్యము. అందుండి తెలియబడెడి సర్వము ప్రజ్ఞగా, చైతన్యముగా పరబ్రహ్మమైన ఎఱుకగా పరమగురు కరుణనందుటచే తెలియుట – "ప్రజ్ఞానం బ్రహ్మ" అని భావము.

కం॥ మాటకు లక్ష్యము గురియగు – మాటలచే

మనసు కుదిరిమసలకయుండే – మాటున

నిర్గుణమమరెడు – సూటిని నిన్మరచి

యుండే – సూత్ర మందుమురా – నిర్మ

ల తత్త్వగాత్రమందుమురా – నేత్ర ద్వ

యంబుల నిక్కించి – త్రిపుటిపై – సూ

త్రించి లోవెలి – సూక్ష్మము గమకించు –

ఛాత్రుడై పరిపూర్ణ జలనిధి – చంగలిం

చెడు చిత్తనౌకచే – యాత్ర చేయుము

మగు నమలధరి – వందబట్టెడు ప్రజ్ఞ

లోవెలి – సూత్రమందుమురా – నిర్మల

తత్త్వ – గాత్రమందుమురా ॥

– కందార్థ రత్నావళి 181వ కం॥

తా॥ నాదమునకు లక్ష్యము కళ, నాదోపాసనచే అమనస్క మమరి, ప్రకృతి

ద్వయ సూత్రమును, క్షరాక్షర ద్వయ సూత్రమును, త్రిపుటికి అతీతముగా, నుండెడి కూటస్థానుభవమునందు – సత్తే బ్రహ్మమై, చిత్తే జగములై, ఆనందపూర్ణానుభవమే తానని నిర్ణయమైన సచ్చిదానందమనెడి ఛత్రమునందున్న అమనస్క భావమునందు సద్గురు కృపచే కుదిరిన నాదాంతమైన కళయే నిర్గుణమని, తనను మరచి "విరాట్ లేక నిర్మలత్వం" అనెడి ఈశ్వర దేహమందు జ్ఞానిగా చిన్మయమై అమలస్థితినంది, నిజగురుకృపచే అఖండమగు పరబ్రహ్మమగు ఎఱుకనందు సచ్చిదానంద పూర్ణము అంశమని "లోవెలి" సూత్రముచే ప్రజ్ఞాశూన్యమై నిర్మలమైన, శుద్ధమైన, కేవలమైన ఎఱుక నిర్ణయమంది బయలును లక్ష్యించుమని భావము.

కం॥ ప్రజ్ఞానమయము బ్రహ్మము – సుజ్ఞానము
గలిగి మీద – సుఖము జనించున్ – య
జ్ఞాన సూత్రమడచి కృ – తజ్ఞుడవైయభి
నుతించు – తడవేలనయ్యా – యుంకించి
నీలో – జడియకుమయ్యా – తొడరి నీలోప
ల – తోడ్పడు ఎఱుకను పొడసూపకుండ
గ – పోకార్చి బయలంది – కడిమి తోడుత
కదియనొక్కుచు – గడుసరై మరి బయలు
జేయుము – తడవతడవకు తన్మయత్వము
దాకి నిర్జిత పూర్ణమందెదు – తడవేల
నయ్యా – యుంకించి నీలో జడియకుమయ్యా ॥

– కందార్థ రత్నావళి 182వ కం॥

తా॥సద్గురు కృపచే కల్గిన బ్రహ్మానుభవమునకు ప్రజ్ఞయే మూలమని – జీవ – బ్రహ్మమును భేదముగా చూచెడి దృష్టి యే సూత్రమని, సర్వదా అజ్ఞాన సూత్రమగు జీవజగత్ భ్రాంతులందు పడక, జడియక, తోచెడి మాయను మర్మమెరిగి మటుమాయము చేసెడి, నిజమైన చిన్మయ లింగమందు (హిరణ్య గర్భమందు) జీవబ్రహ్మము లనునవి లేనివని, తోచెడి అఖండమగు సుజ్ఞానమైన సర్వమై, వ్యాపకమై, సాక్షియై, తుర్యమై, పరబ్రహ్మమై యుండజూచి, అట్టి ఎఱుకను నిజగురుకృపచే "లేని దానిగా" నిరూపించెడు గడుసరితనము అనెడు తురీయాతీతమైన "లింగాంగ భంగము" సూత్రముగా తెలిసి పూర్ణానుభవము నిర్జించెడు నిర్ణయముతో బయలును లక్ష్యించి పొందునదె ప్రజ్ఞానం బ్రహ్మమని భావము.

కం॥ ప్రజ్ఞానమనెడు జ్ఞప్తిని – సుజ్ఞానతపంబు
బూని – సూక్ష్మములోనే – యజ్ఞానమడచి
నిండిన – జిజ్ఞాస సమాధి యది – జితమ
తివగురా – చిత్పరమందే – గతి బ్రహ్మమగు
రా – మితిమీరు ఎఱుకను – మించనివ్వక
నీవు – మతిలోన పూర్తిగ – మహతత్త్వ
మందుము – యుతముగా నాయునికి
నీవగు – యుక్తి లెస్సగ యూని పిమ్మట –
పతిత పావన బ్రహ్మ బయలున – ప్రతిహ
తుండై ప్రబలుచుండెడు – జితమతివగు
రా – చిత్పరమందే – గతి బ్రహ్మమగురా ॥

– కందార్థ రత్నావళి 183వ కం॥

తా॥ మహాకారణమనెడి మహత్తత్వమందు అసం ప్రజ్ఞాత సమాధిచే జీవ జగత్తులకు కారణమైన పరబ్రహ్మము తాననెడి స్థితియందు, "సుజ్ఞాన దీపము" నిచ్చు నిజగురువు నాశ్రయించి, సర్వసాక్షియైన అఖండపుటెఱుక విజృంభించి మండల త్రయపూర్వకముగా విశ్వోత్పత్తిని, పెంపును, హరణమును ఎట్లొనర్చుచున్నదో ఈశ్వర పంచీకరణ ద్వారా తెలియబడి, అట్టి ఎఱుక తానేనని ఎఱిగెడి యుక్తిని నిర్ణయముగా కని, దృఢముగా ఆ పరబ్రహ్మమనెడి ఎఱుక అచలము, అప్రతిహితము అగు బయలును లక్ష్యించిన, తనకు (బ్రహ్మమునకు) మూలము లేక ప్రతిహితమై (భస్మాసురునివలె) తనకు తానే లేనిదగు విధమునంతయు తెలియుటకు అర్హమైన ప్రాథమిక స్థితియే ప్రజ్ఞానం బ్రహ్మయని భావము.

కం॥ తుదముట్టి భూతభావము – మదినిలకడ
లోన జూచి – మారుతమందే – పదవడి ప్ర
జ్ఞాన్వితుడై । సదమలబ్రహ్మంబునంటు –

సౌరుగన్గొనరా – నిరవధికము – జేరి
నీవనరా – దారిలోనేఱుకచే – తారుమా
రుగాక । మీరి చిత్కళలంటి । మిన్నంది
యుందుము । పూరితంబగు హృదయకమ
లము । పొందుపడపరబయలు చెనకు
చు । భూరితరమగు బ్రహ్మకళగని । బొ
మల నడుమను ప్రజ్ఞనంటెదు । సౌరుగన్గొ
నరా – నిరవధికము – జేరి నీవనరా ॥

– కందార్థ రత్నావళి 184వ కం॥

తా॥ సహృదయ చక్రమైన హృదయ కమలమందున్న బ్రహ్మకళయగు నిష్కళయందు, చిన్నాద, చిద్బిందు, చిత్కళలన్నియు లయమై, వత్తి లేని దీపముగా, బ్రహ్మముగా సహస్రార కమల మధ్యమునందుండగా, స్వీయ ప్రజ్ఞ ఆజ్ఞా చక్రమధ్యమై యుండగా తన్మాత్రా వశిష్ఠ బ్రహ్మానుభవమునందు పంచ భూతాత్మక సర్వజగత్తుకు మూలము లేకనే ఉన్నదని స్థితుడై అమనస్క భావమును, కేవల కుంభకమును “ఒరలో కత్తిని ఇమిడ్చినట్లు” ఇమిడ్చినంతనే తానే సదమల బ్రహ్మమము అట్టి తుర్యానుభవసారము అయిన పరబ్రహ్మమనెడి ఎఱుక అఖండమైనది. గుర్తెఱిగె వ్యవహారమునకు ప్రజ్ఞ ఆజ్ఞా చక్రమును, సమాధి రూపమునకు సహస్రారమునను, సంవిత్కళ రూపమున, నిష్కళ అయిన, ప్రజ్ఞ – పరబ్రహ్మ అయిన ఎఱుక సత్తాగా నిర్ణయమునందుటయే ప్రజ్ఞానం బ్రహ్మయని భావము.

కం॥ సాధ్యాసాధ్యముగానిది । భేద్యాభేద్యం
బుగాదు । బొందన చలమున్ । రాధ్యారాధిత
బ్రహ్మము । బాధ్యాబాధ్యంబుగాని – పరి
పూర్ణమయ్యా – రజ్జనమాని – గురిగను
మయ్యా – అరమరలేకను । యంతర్జ్యోతి
నంటి ॥ పరిపూర్తినొందుట । ప్రజ్ఞానం బ్రహ్మ
ము । నిరాలంబము నిర్వికల్పము ॥ నిరతిశ
యమానందమచలము । పరాపరమగు బట్టబయలున
ప్రకాశమున్ గమకించి బొందుట – పరిపూ
ర్ణమయ్యా – రజ్జనిమాని – గురిగనుమయ్యా॥

– కందార్థ రత్నావళి 185వ కం॥

తా॥ అచల పరిపూర్ణ పరబాహ్యము సాధనలచే సాధింపబడనిది అనగా ఆరాధ్యము – ఆరాధితము, భేద్యము – అభేద్యము, సాధ్యము – అసాధ్యము, బాధితము – అబాధితము వంటి సర్వద్వంద్వాతీతమని ద్విపుటి రహితమని నిజగురువుచే బోధించబడుచున్నది. అంతర్జ్యోతి స్థానమునంటి ఎరుకను, వీక్షించిన పటాటోపమైన, ఆడంబరమైన, అనేకమైన, సర్వ ద్వంద్వమైన ఎఱుకనందే అన్ని త్రిపుటులు, ద్విపుటులు అన్ని అరమరికలు, కాని లేనిది అయిన ఈ ఎఱుక చేతలే ఇవియన్నియును అని నిర్ణయమందవలెను.

నిరాలంబము, నిర్వికల్పము, నిరతిశయము, ఆనందము అని ఉపనిషదర్థకమగు అచలము, పరాపర భేదములు లేనిది. అందున్నట్లున్న ఎఱుకతో సంబంధము లేకయున్నది. ప్రకాశమందే ఎఱుకయే అఖండము అని, ఇదయే ప్రజ్ఞానం బ్రహ్మమని నిర్వచనము.

కం॥ అతితేజస్కర బ్రహ్మము । ప్రతి నిమిషము గోరి
చూడ । ప్రత్యక్షమగున్ । ధృతిచేత జూడ
జాలవు । మితికింపగు ప్రజ్ఞ గూడి – మఱిగి
యుండుమురా – పరిపూర్తిగ – నొఱిగియుం
డుమురా – చరమాదిక్రియలెల్ల । చర్చించి
మదిరోసి । చిరజీవభావుడై । చెంగళించి మిం
చు । దురాలోకము బయలులోవెలి । దురంత
మై దావెలయుచున్నది । పరిణమించి
యు బ్రాకుచుండుము । బట్టబయల
గు కట్టు చెదరక – మఱిగియుండుము రా –
పరిపూర్తిగ – నొఱిగియుండుము రా ॥

– కందార్థ రత్నావళి 186వ కం॥

తా॥ సర్వదృక్కగు, స్వయంజ్యోతియనబడు, సర్వమైన, ఎఱుకచే బ్రహ్మముగా తేజరిల్లెడు సచ్ఛిష్యునకు బ్రహ్మము సదా ప్రత్యక్షమైయుండును. కేవల సమిష్ఠియైన ఎఱుకను నిర్ణయించుటకు సచ్ఛిష్యుడు స్వభావమున ప్రత్యగాత్మయై, పరమాత్మానుభవమును పూర్ణముగా నాశ్రయించి, ఇతరములైన కర్మ, భక్తి, యోగ, జ్ఞాన క్రియలనెల్ల విడచి, అనాదియైన జీవభావమును ఒక్క ఉదుటున నిరసించి, గుర్తుకదంబమైన జగత్తును సారరహితమని, లేనిదని, తనకు తానే స్వతః పూర్ణమైయున్న పరబ్రహ్మమనెడి ఎఱుకయే సర్వమనిన్నీ నిజగురు కృపచే నిర్ణయమందును. పరిణామ శీలమంతయు ఎఱుకలోనిదే, అఖండ ఎఱుకను వ్యష్టిగా నున్న ప్రత్యగాత్మకు సమిష్టిగానున్న పరమాత్మకు ఐక్యరూపముగా గాంచి పరబ్రహ్మమనెడి ఎఱుకను లక్షణయుతముగా నిర్ణయించి బయలును లక్ష్యించ వలెననిడి సూత్రము మరువక యుండవలెనని భావము.

కం॥ పంచాక్షరిజపమూనిస ॥ మంచితమగు
జ్ఞాన సిద్ధి । యందినమీదన్ । గించిత్తు
మాయా సోకదు । సంచిత కర్మముల ద్రుం
చి - సాధించునయ్యా - సౌష్టవమొప్ప -
బోధించునయ్యా - మేధాధికంబున
మెండొడ్డి పూర్ణము । న్పొందింప దొడరును ।
పూర్ణకుంభకమూని । శోధకుడవై జ్ఞప్తి
మరువకు । శుద్ధ తత్త్వ నిరామయంబున ।
గాథలన్నియు గీటడంచును । గవియనొక్కె
డు ప్రజ్ఞ నీవని - సాధించునయ్య - సౌ
ష్ఠవ మొప్ప - బోధించునయ్య ॥

- కందార్థ రత్నావళి 187వ కం॥

తా॥ పూర్ణానుభవమును పొందవలెనన్న అక్షర బ్రహ్మాండ నిర్ణయము తెలిసి ప్రణవ పంచాక్షరిని అర్ధమాతృకా సహితమున ఉపాసించిన, నాదబిందు కళలు లయించి జ్ఞాన సిద్ధినందును. మాయను మీరును సంచిత కర్మమైన సమిష్టి అనుభవమును సర్వసాక్షిత్వముచే దృంచి, పూర్ణ కుంభకమైన అంతః శూన్యమందు, శుద్ధ ఎఱుకయందు, బయలును లక్ష్యించవలెనను సూత్రము మరువకయున్న జగత్, జీవ, ఈశ్వరుల భ్రాంతి కథలన్నియు కల వలె దొలగిపోయి అఖండ ఎఱుకను నిర్ణయించెడి స్థితినందునని భావము.

అహం బ్రహ్మాస్మి వివరణము :

కం॥ బ్రహ్మైవాహంబనుచును । బ్రహ్మంబేనను
చు భేద । భావ విగతమౌ । బ్రహ్మ జ్ఞానము
జేయగ । బ్రహ్మాండము మిథ్య యగును -
పాటించిగనరా - నిర్గుణమంది - పాటిం
చవలెరా - బూటకములకొగ్గి - బూనిన
గనలేవు ॥ సూటిదప్పని చూట్కి । సూక్ష్మ
ములో నెంచు । నాటి నెమ్మదినటనమందుచు
నౌను కాదని మిన్నకుండెడు । కోటి భాస్కర కళ
లమించిన । గుట్టు నీవై వెలుగు తత్త్వము -
పాటించి గనరా - నిర్గుణమంది పాటించ వలెరా ॥

- కందార్థ రత్నావళి 188వ కం॥

తా॥ విశ్వమందలి అనంతముగానున్న మండల త్రయములందు వ్యాపకమైయున్న, సూర్యతేజమువంటి అఖండ ఎఱుక స్వరూపుడవు నీవు అనెడి తత్త్వ రహస్యము మరియు నిర్గుణ స్వరూపానుభవ నిర్ణయమైనంతనే, "అహం బ్రహ్మాస్మి" అనెడి జీవబ్రహ్మైక్యానుసంధాన అనుభవ వాక్యమునకు లక్ష్యముగా అఖండ ఎఱుకను చేకొనినచే బ్రహ్మాండము మిథ్యయగును. బ్రహ్మానుభవ స్థితితో విశ్వమందలి ఈశ్వర తనువులందలి, అనేక బ్రహ్మాండములేర్పడిన స్థితిని, సూటి దప్పక లక్ష్యించిననే, "హిరణ్య గర్భ" అనెడి స్థితిని కాంచవచ్చునను. తత్త్వ రహస్యము అగు అఖండ ఎఱుక నిర్ణయమును నిజగురుకృపచే పట్టవచ్చును.

బ్రహ్మాండమంతయు అఖండ ఎఱుక యందు అంశీభూతమని, లేని కలయని, నటనయని, మౌనవ్యాఖ్యను పాటించెడి నిర్ణయమందుండుటె అహం బ్రహ్మాస్మి అని భావము.

కం॥ చింతలు లేకను బయలున । సుంతైనను చూ

ట్కి నిలిపి సూక్ష్మాత్ముడవై । కొంత తడవెం
చి చూచిన । వింతలు చేటొందు బయలే ।
విలశితాకాశం - అహమస్మితి । నిలయ
ప్రకాశం - పలుమారు జ్ఞప్తిలో । ప్రత్య
క్షమందెదు । తలపు మన్మయమూని । దన
రారజేయుము । విలయమగు నజ్ఞాన బం
ధుర । వీక్షకలయిక పూర్ణతత్త్వము ।
నెలవెలంగున నివ్వటిల్లెడు ॥ నిర్మలంబగు
బట్టబయలే - విలశితాకాశం - అహమ
స్మితి - నిలయ ప్రకాశం ॥

- కందార్థ రత్నావళి 189వ కం॥

తా॥ బ్రహ్మతేజము నుట్టిపడే, ఆత్మానుభవుడై విలసిల్లు సచ్ఛిష్యుని దివ్యాహమనే బంధాలనుండి విముక్తిని చేయుటకు నిజగురుడు బోధించు అనుభవ సారమిది.

నాద, బిందు, కళలనే త్రిపుటిని మించిన బ్రహ్మానుభవమున అత్యంత విలక్షణమై, పరిమిత అహంకార రూపమైన జీవుడు, అనంతుడైన, బ్రహ్మమైన, పరిణామములో, చైతన్య వ్యావర్తనములో, తన లక్ష్యమైన బయలును, పూర్ణతత్త్వమై తన రూపైన అఖండ ఎఱుకను మరచి, సాపేక్షముగా నిర్ణయింపబడెడి జీవ - బ్రహ్మములు (ఈశ్వరుడు) అను ద్వంద్వమునందలి వింతలలో చిక్కుపడి విద్యామదమునంది మన్మయ, తన్మయ, చిన్మయ జగత్తులందు సత్యత్వ భ్రాంతి అనెడి అవిద్యా మోహము నందకుండునట్లు "పలుమారుల జ్ఞప్తి" చేయుచు "నిర్మలమైన" బయలును ప్రత్యక్షముగా నందు వరకూ లక్ష్యించమని భావము.

కం॥ తక్షణమారెంటికిపై - యక్షర తత్త్వంబు
నెఱిగి - యంతర్ముఖుడై - శిక్షిత నిర్గుణ జ్ఞ
ప్తివి ల - క్షణ బ్రహ్మంబునందు - లయమొం
దవలెరా - అహమస్మీతి - మయమొంద
నగురా - అయమాత్మ బ్రహ్మమౌ॥ నం
తర్జ్యోతి నంటి - నియమాత్ముడై యుండు
నిత్యోహముబ్బును - జయము విలసిల్లగను
నెమ్మది । జాలములు ఖండించినెక్కొని - రయ
మునను పరిపూర్ణమందిన । రాకపోకలు
రావుదప్పును - లయమొందవలెరా -
అహమస్మీతి - మయమొందనగురా ॥

- కందార్థ రత్నావళి 190వ కం॥

తా॥ నిత్యోహమనెడి శాశ్వత స్థితి నందవలెనన్న జీవ-జగత్తుల యుక్తమైన షడూర్ములను నిర్జించి, అక్షరపదవియైన కూటస్థ ఎఱుకను, నిజ సమాధియందు నిర్వికల్పముగా, నిర్గుణజ్ఞప్తితో పరబ్రహ్మమందు బ్రహ్మాండ జ్ఞానమును లయమొందింపగా, నేనడి అహం - జీవుడు - తాననెడి బ్రహ్మము, స్వయంజ్యోతియైన, స్వప్రకాశమైన, సర్వమునకు రాకపోకలనిచ్చెడి అఖండ ఎఱుక యందు ఏకమగును. అట్టి తరి త్రిపుటియందలి మాయాజాలమంతయు మిథ్యయని ఖండించి, పరమగురు కరుణచే పరిపూర్ణ భావజ్ఞుడైన, రాకపోకలు, జరామరణ (వ్యాధులు) లేని స్థితినందునని భావము.

అయమాత్మ బ్రహ్మ వివరణము :

కం॥ అయమాత్మా బ్రహ్మంబను - నియమము
లోచూపునంటి - నిర్గుణివైనన్ । భయమొం
దదు గురురాయని దయకును పాత్రుండవీవె -
తరి గొనుమయ్యా - నిర్గుణ మూని గురి
గనుమయ్యా - సరిలేక వెలుగొందు ॥ సమ
దృష్టి బూనుక - విరమించకను జ్ఞప్తి । వె
న్నంటి జూడుము - తరముగా నిదితత్త్వగో
ప్యము - తన్మయంబగు బ్రహ్మ భావము - ప
రిణ మించెడు బయలులోపల - ప్రబోధిత
మగు నిర్గుణత్త్వము - తరి గొనుమయ్యా -
నిర్గుణమూని - గురి గనుమయ్యా ॥

– కందార్థ రత్నావళి 191వ కం॥

తా॥ తత్త్వజ్ఞాన రహస్యమైన 'బయలు'ను లక్ష్యించిన ఎఱుకకు ఉపాధులగు తన్మయములు, బ్రహ్మమయములు ఆవరణ సహితమై వర్తించునవే కాని శాశ్వతము కావు అనెడి నిర్ణయము "నిర్గుణాత్మ జ్ఞాన సిద్ధి"ని లోచూపుతో, లక్షణ త్రయముచే, నిరసించిన సంకల్ప, వికల్పములు మరల ఆవృత్తినందక నిర్వికల్పమందే నిలచి నిజగురుకృపయందే నిలచును. నిర్గుణ, లక్ష్యార్థమైన బయలును అఖండ ఎఱుక అనెడి స్వప్రకాశ "శివోహం" అనెడి పరబ్రహ్మమే చూపి విరమించుననెడి "సర్వము" యొక్క రహస్యమని నిజగురుని వెన్నంటి చూచి లేని ఎఱుక నిర్ణయ మందవలె నని భావము.

కం॥ అయమాత్మ బ్రహ్మమైనది – నయముగ మదినిలి
పిలోన – ననువై యుండన్ – భయమెల్ల దీరును
న్మని – దయగల గురుశక్తి గూడి – దాకు
చుండుమురా – హృత్పద్మము – సోకి
యుండుమురా – రాకపోకలు లేక – రంజిల్లు
పరమాత్మ – నేకీభావుండవై – యిం పొందు
చుండుము – నీకు నీవై నిత్యసుఖమున – ని
స్తరంగాంభోధికై వడి – సోకి మించెడు బయ
లు నంటుము – సౌరది బ్రహ్మానంద పూర్ణము –
దాకుచుండుమురా – హృత్పద్మము –
సోకియుండుమురా ॥

– కందార్థ రత్నావళి 192వ కం॥

తా॥ బ్రహ్మానంద పూర్ణమైన ఎఱుక సత్తా వల్లనే స్వయంజ్యోతి కిరణ ప్రసారము ఉన్మనీభావ గర్భమండలి, కపాల కుహర మధ్యమండలి, హంస జన్మ స్థానమైన చంద్రమండలము లేక సుధా మండలమునుండి హృత్పద్మమునకు కిరణ ప్రసారము జరుగు రీతి అనుభవమున గురుసత్తాతో తెలియబడును. సమిష్టి అనుభవము నందలి సంచితము వల్ల నేర్పడే సర్వభయము దీరును.

జనన, మరణములు ఎఱుకచే నిర్ణయింపబడుచున్నవని బయలుకు అవి లేవని లక్ష్యించి తానే పరమాత్ముడనని, అలలు లేని సముద్రము వంటి అఖండ ఎఱుకా నుభవమున నిత్యసుఖము ననుభవించుచూ విశ్వమును ఆధారముగా చేసికొనునని భావము.

కం॥ త్రిపుటికిపైనిడి చూట్కిని – యుపమరివై
తొలగనివక – యుత్కృష్ట గతిన్ – విపుల
మతి నిన్ను నేమరి । తపమున నయమాత్మ
బ్రహ్మ – దాకుచుండుమురా – బ్రహ్మానం
ద లోకనమగురా – ఆకాంక్షమీరనీ ।
వనమట జెందక । నేక చక్రాకృతి । నిరుమూ
డు దాటుము । యాకు లెల్లను జదివి పద్య
ములం । దు భావము నందగోరెడి । పాకమును
గమకించి యాత్మను । ప్రాప్తి పొందగ త్రోవ
లో గురి – దాకుచుండుమురా – బ్రహ్మా
నంద – లోకనమగురా ॥

– కందార్థ రత్నావళి 193వ కం॥

తా॥ శింశుమారక చక్రమనెడి "ఏకచక్రము" హిరణ్మయకోశముగా పిలువబడు చున్నది. ఇచ్చట సచ్ఛిష్యుడు మాయా సహిత త్రిపుటిని గాని, బ్రహ్మ సహిత ద్విపుటిని గాని లేక ఏకమై 30 తత్త్వములు కాక, సహజ నిర్వికల్ప సమాధి అనెడి తపమును చేకొని, బ్రహ్మానందానుభవమునందు సహజముగా నుండును. మరియు సర్వముగానున్న అఖండ ఎఱుక అనుభవమును, అనగా వ్యష్టి సాక్షి, సమిష్టి సాక్షి అయిన ఎఱుక బయలునందు తనను తాను పోగొట్టుకొను మార్గమునందు గురియైన పరబయలును లక్ష్యించి, నిజగురు, పరిపూర్ణ గురుకృపల ప్రాప్తితో ఎఱుకానుభవమును అర్హతతో పొందునని భావము.

తత్త్వమసి వివరణ :

కం॥ తత్త్వమసి యనగ నీలో । తత్త్వంబునుదెల
సి నిన్ను । దలపకయుండన్ । తత్త్వజ్ఞుడవై
యుందువ । తత్త్వంబుల కందనట్టి – దారి

గన్గొనరా – నిత్యానంద – సౌరు గన్గొనరా
సారహీనమగు సం॥ సార దుఃఖముదాటి ।
పోరి బ్రహ్మానంద । పూర్ణములో జేరి । మేరు
శిఖరము పైని చూట్కిని । మెలగు పరశివ
జీవభావము । దారి దోడ్పడి యైక్యమందె
డు । తన్మయాకృతి బట్టబయలగు – దారి
గన్గొనరా – నిత్యానంద – సౌరు గన్గొనరా ॥

– కందార్థ రత్నావళి 194వ కం॥

తా॥ పరశివమైన, తత్త్వాతీతమైనది బట్టబయలు ఎఱుక రూపులైన జీవుడు, ఈశ్వరుడు ఏకమై అఖండమై, బ్రహ్మానందపూర్ణమై, సారహీనమైన సంసార దుఃఖమును పూర్ణముగా దాటి నిత్యానందము నందెడు విధమంతా తత్త్వజ్ఞుని అనుభవమని, బట్టబయలందు ఇట్టి దానికి అవకాశమిచ్చెడి "త్వం అనెడి నేను, తత్ అనెడి తానులు" లేనివని అసి పదమైన బయలే తత్త్వాతీతమని, 'అహం – పదార్థ రహితమని, నిరావరణమని అట్టి బయలునందుండమని భావము.

కం॥ తత్త్వమసి యూని బుద్ధిని । తత్త్వార్థమునె
ఱిగి యెఱుక । తలగిన పిదపన్ । తత్త్వ
మసియందు లక్ష్యము । తత్త్వంబులకై
క్యమగును – త్యక్తమై యుక్తి – అసి పద
మందు రక్తించు ముక్తి – భక్తి మించెడు
రక్తి – బలకొని పిమ్మట ముక్తిని బోధించు
మూలమెన్నుచునుండు । శక్తి కొలది ని
తన్మయంబున । శాశ్వితేశ్వరు నెన్నుచుం
డెడి । యుక్తి మించి గురూక్తి దలగక । యు
న్మనిని గమకించి నంతట – త్యక్తమై యుక్తి –
అసిపదమందు – రక్తించు ముక్తి ॥

– కందార్థ రత్నావళి 195వ కం॥

తా॥ "తత్త్వమసి" యందు అసి పదమే ముక్తిపదమై యున్నది. తత్త్వముల నన్నింటి నుండి ముక్తి నొందించెడి యుక్తిని అనగా నిజగురుకృపచే మూలమైన బట్టబయలును లక్ష్యించినచో మన్మయము, తన్మయము, చిన్మయము అనెడి సర్వము అంతయు తత్త్వముల యందలివే నని, తత్త్వ మూలమందు లేనివని, శాశ్వతమగు పరశివమును గురిగా ఎంచిన, ఎఱుకను మించెడు "ఈ ఉత్త బట్టబయలు ఏమీ లేదు" అనెడు గురూక్తిని ఆశ్రయించి ఉన్మనిని నిరసించి అసి పదమంద వలెనని భావము.

కం॥ లోపల వెలుపల బయలై । యాపదలను లేక
వెలుగు నచలం బదియై । జూపించి జెప్ప
రానిది । తాపసగుణ చిత్సుఖంబు – తలపో
యుమయ్యా – హృద్యమునంటి – కల
మెలుగుమయ్యా – యిల జన్మబాధల । నిగు
రొత్తనివ్వక ॥ కలరూపమును గాంచి ॥ గను
చుందు నెమ్మది । తలపు మఱపులు రెందు
గానిది । తత్త్వమసి వాక్యార్థ లక్ష్యము ।
చలనమొందక జేర్చి పట్టుము । చాలు
నను విడి పుట్టు చావులు – తలపోయు
మయ్యా – హృద్యమునంటి– కలమె
లగుమయ్యా ॥

– కందార్థ రత్నావళి 196వ కం॥

తా॥ తత్త్వమసి వాక్యార్థ లక్ష్యము అయిన కదలనిది అయిన, తలపు, మరపులు కానిది. అయిన, చూపి చెప్పరానిది అయిన, సర్వ వ్యాపక సంవిత్కళకు అవకాశము లేనిది అయిన, అంతర్బహిర్ శూన్యమై అఖండమైన రాకపోకల బాధలు లేనటువంటిదైన, బట్టబయలును లక్ష్యించి, చావు పుట్టుకల మయమైన అఖండ ఎఱుకను హృద్యమని, కలవంటిదని భావించమని, తత్త్వముల వ్యవహారమందు కలవలె మెలగుమని భావము.

కం॥ పెంపగుమది తత్త్వదమున । త్వంపదమ
న్న బ్రహ్మమగును । తలకొని చూడన్ ।
యింపుగ రెంటికి నైక్యము ॥ సొంపుగ

తన్మయత జెంది । సోऽహ మెన్నుమురా
నిత్యోహమందే - సోహణ రోహణ గదరా
బాహాటముగ దృష్టి । ప్రతిఘటింపబూని ।
సాహసంబున మించి । సంయోగమం
దుము । దేహిదేహము శాశ్వితంబను । తెగు
లు తోద్పడి జచ్చిపుట్టును । మోహరించి
యు పూర్ణమందుట । మోక్షమార్గము బట్ట
బయలగు । సోऽహ మెన్ను మురా - నిత్యో
హమందే - సోऽహణ గదరా ॥

- కందార్థ రత్నావళి 197వ కం॥

తా॥ దేహి-దేహములనెడి తత్, త్వం లు తెగులు వంటి ద్వంద్వములని అందుచే చావు పుట్టుకలందు భ్రమణము చెందుట, తత్ + త్వం ల సంయోగమైన 'అసి' పదమును బహిరంతరములందు పూని, సాహసమున, పూర్ణ గురు సత్తాచే, సోऽహం భావమందు ముక్తి ఘటియించే జీవేశ్వరైక్యమును తలపొంది, తన్మయత్వము చెంది, నిత్యోహమనెడి అఖండ ఎఱుకను "నేనడి" పూర్ణ అనుభవమునంది, బట్టబయలునందు ఇట్టి ఎఱుకకు, సోऽహంకు స్థానము లేదను అనుభవము పొందవలెనని భావము.

కం॥ తానగు తత్పదమందెదు జ్ఞానికి తోడ్తోడ
మాయ । జ్ఞప్తికి యుక్తై । పోనడచు నాత్మ
సుఖ సు॥ జ్ఞానామృతమంది గ్రోలు - జ్ఞా
నము బూను - నిర్గుణమంద - జ్ఞానము
మాను - మానక హృద్వీధి । మధ్యలో గుర్తిం
చి తాను నేనక ను, దన రార మించిన । మా
నితంబగు బయలులో వెలి మౌనవృత్తిని
మెలగి తన్మయ । మూని త్వంపద బ్రహ్మ
పరమున । నుజ్వలుండై మించియుండెడి
జ్ఞానము బూను - నిర్గుణ మంత -
జ్ఞానము మాను ॥

- కందార్థ రత్నావళి 198వ కం॥

తా॥ హృత్పద్మమధ్యమందు నేనను జీవుడు, తానను బ్రహ్మము. ఈ రెంటి అఖండ రూపైన ఎఱుకను మించుటకు పూర్ణగురు హృదయైక్యము పొందిన, తాను అనెడు తత్పదము, జ్ఞానము, మాయయని జ్ఞప్తిని "ఈ ఉత్త బట్టబయలు ఏమీ లేదు" అను యుక్తి ఎఱిగి, మించి, నేను అనెడి ఆత్మ సుఖమనెడు సుజ్ఞానామృతము సహజమై, నిర్గుణమై, మౌన సమాధిచే బహిరంతరములందు శూన్యమై, త్వం పద బ్రహ్మమును మించి, అసి పదమైన బట్టబయలంది యుండుటే నిర్గుణ జ్ఞాన సిద్ధియని భావము.

జీవేశ్వరైక్యము - భ్రాంతి

అణువు మొదలు మహామేరుపర్యంతము గల సకల వస్తువుల బాహ్యాభ్యంతరముల యందు ఆత్మ నిండియున్నది. ఈ ఆత్మ ఖండఖండము లైనట్లు వస్తువుల యొక్క భిన్నత్వము వలన తోచుచున్నది. ఒకే వస్తువు యొక్క లోపల, వెలుపల నుండే ఆత్మ, వస్తువు యొక్క ఆవరణముచే ఖండములుగా లేదు. తెంపు లేక అఖండము గానేయున్నది. కనుక ఉపాధిగతుడై యున్న జీవునికి నిరుపాధికమై యున్న పరమాత్మకు జీవోపాధివలన ఖండత్వము స్ఫురించుచున్నదే గాని, ఆత్మ యొక్క అఖండ వ్యాపకత్వము వలన భగ్నము కాలేదు. కనుక ఆత్మ భిన్న భిన్న వస్తువులయందు ఖండఖండములు గాక, వస్తువులే లేనప్పుడెట్లు అఖండముగానున్నదో అట్లే, వస్తువు లున్నప్పుడు కూడ అఖండముగా నున్నట్లు దోచు భ్రాంతికి ఆ వృత్తి సహిత కల్పిత నామరూపములె కారణమైయున్నది. నిజమునకు ఖండములే కాలేదు కనుక అఖండమొనర్చ వలెనని తలంచుటయు భ్రాంతియే అయివున్నది.

ఈ భ్రాంతికి ప్రతిబింబమువంటి పరిమిత వాదములు చాల వరకు కారణము. బింబమొక చోట, ప్రతిబింబమొకచోట గాన వచ్చి, ఆరెంటి మధ్య (బింబ ప్రతిబింబ దృష్టాంతములో) యెడము (ఖాళీ) లేక అవకాశము గాన వచ్చుటచే, ఆ రెంటినీ ఐక్యము చేసికొనవలెనని భ్రాంతి యుదయించినది. జీవునకు ప్రతిబింబమున్న తోచు దృష్టాంతము చెప్పబడినది. కనుక జీవేశ్వరైక్యము

లేక ప్రత్యగ్బ్రహ్మైక్యము సాధించవలెననెడి భ్రాంతికి కారణమైనది. అద్దము, నీరు మొదలగునవి యున్నప్పుడే ప్రతిబింబమునకు యునికియున్నది. అట్లే ఉపాధియున్నప్పుడే జీవేశ్వరులకు ఉనికియున్నది. జీవుడు అవిద్యోపాధియనియు, ఈశ్వరుడు మాయోపాధియనియు చెప్పబడుచున్నారు. అవిద్యా, మాయా ఉపాధులు మిథ్యా స్వరూపములని చెప్పబడుచునే యుండగా రెండు ప్రతిబింబములొకదానితో నొకదానికి గాని లేక అధిష్ఠాన చేతనముతో నా రెంటికి గాని ఐక్యము చెప్పుట హాస్యాస్పదమే యగుచున్నది. అద్దము బ్రద్దలైనా నీరు లేకపోయినా ప్రతిబింబములే లేకుండా పోవుచున్నవి. ప్రతిబింబములప్పుడే మైనవి? నిజబింబము వద్దకేగి దానితో నైక్యమైనవా? ప్రతిబింబము ఏ స్థానమున తోచినదో, ఆ స్థానమందే లేకపోయినది గాని, నిజ బింబముతో నైక్యము బొందలేదనుట స్పష్టము.

ఆత్మ స్వర్వవ్యాపకమని అంగీకరించిన, ఐక్యము చెప్పరాదు. ఏలననగా ఐక్యత చెప్పిన, ఆత్మకు ఏకదేశీయత చెప్పవలసివుండును. జీవేశ్వరుల ఉపాధులైన అవిద్యామాయల యందు ప్రతిఫలించిన అధిష్ఠాన చైతన్యము ఏకమయ్యే వున్నది. కనుక ఐక్య పఱచుటయనేది భ్రాంతి. కనుక జీవేశ్వరైక్యము లేక ప్రత్యగ్బ్రహ్మైక్యము అనుట భ్రాంతి జన్యవాదము. ఇట్టి భ్రాంతులవలన సర్వభ్రాంతి రహితము లేక జనన మరణ భ్రాంతి రహితము కాజాలదు.

కం॥ మరణ సుషుప్తులు జెందిన పురుషుడు ।
మేల్కొనినవాడు భువితదితరుడౌ పురుషుడు ।
కలగను వాడిని యెఱిగుండుము ।
మొదటి యాతడెఱుగ డీరెంటి ।
రెండవ పురుషుడెఱుగు నీరెంటి ।
నిర్వుఱొక్కటె సుమ్మీ తిరిగి పుట్టుచునుండ్రు ।
తిరిగి పుట్టడు వాడి గురుబోధ నెఱిగితే ॥

తా॥ అవస్థాత్రయ సాక్షియైనను, అవస్థలందున్నను, ఇద్దరూ ఒక్కటే. వాడు తిరిగి పుట్టుచుండును. కాని గురుబోధనెఱిగినవాడు తిరిగి పుట్టడు. అనగా ఈశ్వరునిగా కూడ ఉండడు.

సచ్చిదానందము - పరిపూర్ణము

"సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ యోవేద నిహితం
గుహాయాం పరమే వ్యోమన్"

సత్యమే సత్తు; జ్ఞానమే చిత్తు; అనంతమే ఆనందము. ఈ మూడున్నూ సగుణము కావు. దీనికి, వాచ్యార్థము, లక్ష్యార్థము, అనుభవార్థము, నిర్ణయార్థము అని నాలుగు విధములుగా వివరించవలెను.

1) జాగ్రత సత్తు, స్వప్నము చిత్తు, సుషుప్తి ఆనందము. ఇవి వాచ్యార్థము.

2) సకలేంద్రియ సమూహము సత్తు, సకలేంద్రియ భాసకత్వము చిత్తు, యీ రెండింటికి విలక్షణమై సుఖకరమైనది ఆనందము. ఇది లక్ష్యార్థము.

3) వృత్తి సత్తు, వృత్తి ప్రకాశమైన జ్ఞానము చిత్తు, యీ రెండింటిని విచారించి, సత్తా మాత్రమై అతీతమైనదే ఆనందము. ఇది అనుభవార్థము.

4) ప్రత్యగాత్మ సత్తు, పరమాత్మ చిత్తు, "అది తాను" అని తెలియడమే ఆనందము. ఇది నిర్ణయార్థము.

ప్రత్యగాత్మ పరమాత్మల భేదము :

ప్రత్యగాత్మ	పరమాత్మ
పంచకోశ సాక్షి	పంచభూత అధిష్ఠానము
పిండాండాశ్రయమైనది	బ్రహ్మాండాశ్రయమైనది
సచ్చిదానంద లక్షణము గలది	సత్యజ్ఞానానంత లక్షణము గలది.

కాని యీ రెండూ ఒక్కటే.

జగత్తు సత్తు, జీవుడు చిత్తు, యీ రెండింటికీ ప్రకాశమై, యీ రెండింటినీ గుర్తెఱిగే బ్రహ్మమే సర్వమని తెలియడమే ఆనందము.

ఈ సచ్చిదానందములు అన్నియు గుణములు, గుణాధారములుగా చెప్పబడినందున, అదిన్నీ పరిపూర్ణముగాదు.

"సచ్చిదానంద హీనోయ ఏవైవాత్మా సనాతనః"

సచ్చిదానందములు సగుణములు కనుకనే పరబ్రహ్మ సచ్చిదానంద హీనుడని శ్రుతి చెప్పినది. అంతేగాక

"సాలంబస్యావ్యప నిత్యత్వం నిరాలంబస్య శూన్యతః"

గుణాధారము కూడా గుణమే కాని నిర్గుణము గాదు. కనుక దీనిని పరిపూర్ణమనుట అసంభవము.

సత్తు అనగా మూడు కాలములందున్నది. నేను వెనుక పుట్టితినని, పుట్టినపుడెల్ల పుణ్యపాపములు చేసి, అనుభవించుచున్నానని, ముందు కూడా పుట్టి అనుభవించెదనని, యీసల్లక్షణము చెప్పును. కనుక సత్స్వరూపత్వమున్ను, సర్వ ప్రపంచము నా చేత ప్రకాశింపబడుచున్నదని, అందువలన తను చితస్స్వరూపమున్ను, సర్వాధిష్ఠాన హేతువు వల్ల వృత్తి శూన్యమైనపుడు ఆనందమున్ను ఉన్నవి. కనుక ఈ లక్షణములన్నియు నీ యందున్నవి. వెలుపల ఎలాగున్నవనిన, మూడు కాలాలయందున్నది కనుక, సత్తున్ను, సూర్య చంద్రాగ్నులను ప్రకాశింపచేయుచున్నది కనుక చిత్తున్ను, సర్వ దుఃఖ ధ్వంసమే ఆనందమున్ను అగుచున్నది.

సత్తు, చిత్తు, ఆనందములు భిన్నములు గావు. అగ్నియందు లోహితోష్ణ ప్రకాశములెట్లో, అటులనే, మరియు యివి యీ దేహమునకు గాని, నేనైన ఆత్మకేమీ లేదు. దేహము అనృతము గాన, దేహ విలక్షణమై దేహాధిష్ఠానమైన ఆత్మసత్త నిన్ని, దేహము జడ స్వరూపము కనుక దీనిని ప్రకాశింపజేసి, గుర్తెఱిగేడిది చిత్తనిన్ని, దేహము దుఃఖము కనుక, దేహమును గుర్తెరిగెడి చైతన్యము విలక్షణము కనుక, ఆనందమనిన్ని చెప్పబడును. దేహ వికారాలే గాని, ఆత్మకే వికారము లేదు.

సుఖదుఃఖములు ఆత్మకు, దేహానికి రెండింటికిని ఏనాడు లేవు. రెండు ఒక్కటే. దీనిని విడచితే, అది అనుభవించదు. దాన్ని విడచితే ఇది అనుభవించదు. అదే కాకుండా, ఎఱిగేదానికే అన్నీగాని, ఎఱుగని దానికి ఏమీ లేదు. బ్రహ్మమనిన, వేదములనిన, ప్రమాణమనిన, అన్నీ ఎఱుకైన నాకే. కాని నేనే మాయకు మూలము. నేను, నావల్ల నైనవన్ని అసత్యమే. అవి నా సత్తా వల్ల కలిగినవే గాని నేను ఏమి చేయలేదు. నీవు లేకుంటే ఏమీ లేదు. కనుక నీవు గురుముఖతః మూలము తెలిసికొని, అది కూడ నీకు మూలముగాదని యెఱిగి, దేహ పతనమునకు ముందే నీవే లేకుండ పోయినచో దేహ పతనము జరిగి, తిరిగి రావు.

అనుభవార్ధము చేత నేనవుతాను, నేను లేకపోతాను. దృశ్యమే సత్తు, దృక్కే చిత్తు, దృష్టే ఆనందము. అదే అంతర్బహిరములను ప్రకాశింపజేయునది. శ్రుతిస్మృతుల చేత ప్రసిద్ధమై, అంతరమందు యోగ లక్ష్యము చేత సాధ్యమై, జ్యోతిర్మయమై, స్వరూపమైన ఆనందమే మోక్షమని అందురు. కాని పరిపూర్ణమైన పరబ్రహ్మ దృశ్యము గాదు; దృక్కు కాదు; నీవైన ఆనందము మాయ. కనుక మాయను కనుటయే మోక్షమనినన అది యెట్లు జన్మరాహిత్యము? కాన వచ్చేది మాయయేగాని, పరిపూర్ణమైన పరబాహ్యము గాదు.

కొందరు చిత్తలయమే మోక్షమందురు. అట్లయిన మూర్ఛ, సుషుప్తి, తూష్ణీభూత వస్తువులందును మోక్షము ఉండవలెను. దీనివంటిదే సమాధి. గురు సత్తా, బోధల వలన మాయ అను తెఱదీస్తే సాక్షాత్కార పరిపూర్ణ పరబయలే స్వతస్సిద్ధము. తాను ఎక్కడా లేదు కనుక తనకు సత్తు, చిత్తు, ఆనందములును, అనృత, జడ, దుఃఖములును లేవు.

నిర్ణయార్థము ఎట్లనగా, అసత్యమును సహించనిదే సత్తు; జడత్వము పొందనిదే చిత్తు; ప్రియాప్రియరహితమే ఆనందము. ఈ సచ్చిదానంద స్వరూప బ్రహ్మము ఎవరికిన్నీ పూర్ణమైనట్లు ఏ విధంగాను కనుపించదు. కలసి, కలియకా సర్వత్రా ప్రకాశించుచున్నదనిన అది మాయయే, సచ్చిదానంద స్వరూపము పూర్ణము కాదనుట యెట్లు?

"అసద్వాయిదమగ్ర అసీత్ – తతోవై సదా జాయతే"

సత్తుకు జన్యత్వము అంగీకరించుట వలన నాశనము కలుగుచున్నది. కనుక సత్తు పూర్ణము కాదు.

"యజ్జన్యం తజ్జడం, తన్నశ్యభవతి సదసద్రహితం పూర్ణ మనా మయ రూపకం".

స్వయం ప్రకాశమైన చిత్తున్నూ పూర్ణము కాదు. ఎందుకనగా,

శ్లో॥ 'ప్రభాశూన్యం, తమశ్శూన్యం, బుద్ధిశూన్యం, నిరామయం,
త్రిశూన్యం యో నిజానీయాత్ సద్యో ముచ్యేత బంధనాత్"
– ఉత్తరగీత

శ్లో॥ "జ్ఞానమానందగ్ం బ్రహ్మాయిత్యుక్తం మూఢమానవైః
భ్రాంతి మూల మిదం జ్ఞానం, జ్ఞానం భ్రాంతిస్తు నిశ్చితం,
జ్ఞానాత్సంజాయతేఽనందః ఆనందం భ్రాంతి లక్షణం
సత్యజ్ఞానమనంతం చ మాయా గుణమితి శ్రుణు"

కనుక సచ్చిదానంద స్వరూపము పరిపూర్ణము కాదు. అస్తి సత్తు, భాతి చిత్తు, ప్రియం ఆనందము అస్తి భాతి ప్రియములు నామ రూపములందే గాని నామరూప రహితమందు లేవు. కనుక అస్థి భాతి ప్రియములు బ్రహ్మమనిన్ని, నామరూపములు మాత్రము మాయ యనిన్ని యనగూడదు. గురుకృప చేత పరిపూర్ణ బోధ పొందిన జగదాధారమై, ప్రకృతి పురుషాత్మకమై కనుపించెడి ఎఱుక ఎంత మాత్రము నిలువదు. ఈ నిలువని ఎఱుకయే విద్యావిద్యలకు సాక్షి . సూర్యునియందు ఉదయాస్తమానములు ఏలాగున కల్పితమగుచున్నవో, ఆలాగే ఎఱుకయందు సర్వము కల్పితమైనది. కనుక దృక్స్వరూపమై, అస్తి, భాతి, ప్రియ స్వరూపమై, స్వరూపమందున్న ఎఱుక పరిపూర్ణ బ్రహ్మము కాదు.

పరిపూర్ణము సర్వ వ్యాప్తము. ఆకాశ రహితము, ఇది సర్వ పరిపూర్ణము, అవకాశ రహితము, నిరూపము, గంతవ్యదేశ విహీనము, రాకపోకలు లేక అనిర్వాచ్యమై చరాచరములందు నిబిడమైనది. రెండవదేదీ పూర్ణము కాదు. పరిపూర్ణము అచలము. అంతకంటే యే స్థలము లేనందున ప్రతిఫలించదు. అంతేకాక, మాయ గగన కుసుమము వంటిది గాన, ప్రతిఫలితము కాకూడదు. పగలు తేజస్సు, రాత్రి తమస్సు ప్రతిఫలితమే గాని, అది గగన ప్రతిబింబము కాదు. ఉన్నదన్ననూ, ఏ తీరుగానున్నది? ఏ తీరైనా గాని, అలా చెప్పకూడదు. పరిపూర్ణము అవిచ్ఛిన్నము, కనుక అంగీకారము కాదు.

ఆ పరిపూర్ణమెట్టిదనిని సర్వవ్యాప్తము, నిరూపము, ఏ వికారములు లేనిది, ఏ లక్షణములు లేనిది. కనుక సచ్చిదానంద స్వరూపమైన అస్తి భాతి ప్రియములే, అన్ని నామరూప పద్ధాములయ్యెను. అదే మాయా స్వరూపము. అదే తాను తాననే తెఱను గురుకృప చేత తీసి చూచినచో అంతయూ పరిపూర్ణమే. దేశకృత, కాలకృత, వస్తుకృత పరిచ్ఛేద రహితమై అభిన్నమై, ఆద్యంత రహితమై సజాతీయ విజాతీయ స్వగత భేదరహితమై చరాచరముల నిండి నిబిడీకృతమై స్వతస్సిద్ధమై ఉత్పత్తి, స్థితి, లయ రహితమైయున్నదే పరబయలు (అంతరిక్షము) సగుణ నిర్గుణ రహితము, జ్ఞాతృజ్ఞాన రహితము, సర్వకాల సర్వావస్థలయందు అది ఒక్క తీరే.

ఇట్టి పరిపూర్ణము కొఱకు ఏ సాధనలు అక్కరలేదు. ఒకచోట మరచిన వస్తువు మరొక చోట వెదకిన యేలాగు దొఱకదో, అలాగే సాధనానంతర నిరపేక్షకమైన పరిపూర్ణము సాధనల చేత లభ్యము కాదు. మరి ఎటులనిన, పరిపూర్ణమును ఎఱిగి, ఎఱుకను ఎఱుగక, ఎఱిగినది మరువక, తాను లేకపోవడమే; పంచముక్త్యతీమే పరిపూర్ణ బోధ స్థితి; అనగా సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్య, సార్ష్ణత్వ దృక్పథ స్థితి. అదే మహాకైవల్యమని అందురు. ఈ ఐదున్నూ కర్మ జ్ఞాన ముక్తులు. అటువంటివి అయిదూ గాక, సర్వాతీతమై, స్వస్వరూరూప రహిత అహంకార వర్జితాచల స్థితి గలవానికి తానైన ఎఱుక సర్వకాల సర్వాస్థల యందు లేనేలేదు. ఇదే సత్యము. ఇదే దృఢము. ఇంతకన్న ఎక్కువ లేదు.

జీవేశ్వర కూటస్థ బ్రహ్మ విచారణ

జీవుడనగా అంతఃకరణము, అంతఃకరణాధిష్ఠాన చైతన్యము మరియు అంతఃకరణ ప్రతిబింబ చైతన్యము గలసినదని చెప్పుదురు. ప్రతిబింబ చైతన్యమనగా ప్రతిఫలించిన చైతన్యమని భావము మాత్రమే. ఇది అంతః కరణావచ్ఛిన్న చైతన్యము. ప్రతిబింబమునకు సుఖదుఃఖము లుండవు. ఇది ప్రతిబింబ వాదము.

యోగ మతము ప్రకారము, జీవరూపేణా, అన్నీ ఈశ్వరుడే చేస్తున్నాడని; కర్తా, భోక్తా ఈశ్వరుడేనని, జీవభావంతో చేసిన పుణ్యకర్మను కూడా ఈశ్వరార్పణ చేస్తుంటారు. ఇవన్నీ మాయాస్వరూపమైన యెఱుక పనులే. ఈ యెఱుక నణచిన వాడే ఉత్తముడు.

అంతఃకరణము జడము. ఇది జీవుని తెలిసికొనుట లేదు. కాని జీవుడు దీనిని తెలిసికొనుచున్నాడు. కనుక అంతఃకరణము కంటె జీవుడు భిన్నుడు.

ఒకేసారి అపరిచ్ఛిన్నుడు, భిన్నుడు అయినందువలన జీవుడు అంతః కరణతో కూడియు, కూడక యున్నాడు. అందువలన కూటస్థుడని పేరు వచ్చినది. అవిద్యవలన జీవత్వము గలిగి కూడియున్నాడు. జ్ఞానము వలన సాక్షి, విలక్షణుడు అయి కూడక యున్నాడు.

అంతఃకరణమున్నూ, ప్రతిబింబమున్ను కూడి జీవుడనిన, రెండున్నూ జడములే. అపుడు జీవునికి కర్తృత్వాద్యహంకారము సిద్ధించదు. అంతః కరణాత్మలుగ గలసి జీవుడైనాడని అనుకొన్న, జడమైన అంతఃకరణమునకు, చిత్తైన ఆత్మకు కూటమి గావలెను. అట్లే సూర్యునికి, భూతద్దమునకు కూటమికాదు అయినను, సూర్యునికి, భూతద్దమునకు సంయోగము కలుగుట వలన, అగ్ని జనించుచున్నది. కనుక ఆత్మ కూటస్థుడగుట జరుగవచ్చును.

అంతకంటె మాయ ఎక్కడా, ఎన్నడూ లేదు. అయినను, అది నిష్క్రియము గాదు. అదే సమస్త కార్యములు జేయును.

"ఏనేక్షతీశ్రుణో తీదం, జిఘ్రతి వ్యాకరోతిచ, స్వాదాస్వదు విజానాతి తత్ప్రజ్ఞానముదీరితం" అది ప్రజ్ఞాన రూపముగా జీవోపాధులయందు పనిచేయు చుండును.

"సఏవమాయాపరిమోహితాత్మా శరీరమాస్తయ కరోతిసర్వం".

ఆ పరమాత్మయే సకల శరీరాలయందు ప్రవేశించి మాయా మోహితమై అందరిచే సకల కార్యములు చేయుచున్నది. అదే మాయ, అదే బ్రహ్మము. బ్రహ్మము విశ్వకారణము కానిది. శుద్ధ నిర్గుణమైనది. పరిపూర్ణ పరబ్రహ్మము. కాని, "యతో వాయిమాని భూతాని జాయంతి ఏన జాతాని జీవంతి యత్ప్రయంత్యభి సంవిశంతి తద్విజిజ్ఞాసస్వత్ప్బహ్మేతి" విశ్వకారణమగునది సచ్చిదానంద స్వరూప బ్రహ్మమని తెలియజేయుచున్నది. ఇట్టి మాయా బ్రహ్మము పరిపూర్ణ పరబ్రహ్మము కాదు. ఈ మాయా బ్రహ్మ రహితమునందే పరిపూర్ణ పరబ్రహ్మ నిశ్చయము.

ఈ బోధ వలన ఎట్లు సూర్య రశ్మికి మంచు విచ్చిపోవునో, అట్లే, సచ్చిదానంద స్వరూపమైన మాయ నశించును.

ఈశ్వరుడే సర్వకర్తయనుది సరికాదు. ఎట్లన సచ్చిదానందరూపమైన చైతన్యమే లేనందున, తత్సంబంధమైన ఈశ్వరుడును లేదు. మూలాభావమై నందున "ఏమీ లేదు".

మాయ, మాయాధిష్ఠాన చైతన్యము, మాయా ప్రతిబింబ చైతన్యము యీ మూడు గలసి ఈశ్వరుడు అని చెప్పుదురు. మాయకు ఈశ్వరత్వము చెప్పరాదు. మాయ జడము కనుక, మిథ్యా భూతము. కనుక, దానియందు స్వతశ్శక్తి లేకపోవుట వలన మాయకు ఈశ్వరత్వము చెప్పరాదు.

"మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితం । మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయమస్మ్యహం॥"

ప్రకృతి, మండల స్థితి, స్థూల సూక్ష్మ కారణములైన దేహాదులున్ను, యితర వస్తువులున్ను, దానినుంచే కలుగుచున్నవి. అదే మాయ.

ఈ మాయ ఎరుక తోచినపుడే పుట్టినది. విచారించి, లేనిదని నిష్ఠ కలిగినపుడు లేకపోవుచున్నది. ఈ రెండున్నూ లేనపుడు, ఏమీ లేదు. విరాట్, హిరణ్య గర్భ, అవ్యాకృత, స్వరాట్ల కంటె అతీతమైనది. అనిర్వచనీయము. అది ఎప్పుడూ లేదు. ఇదే నిశ్చయము. ఇట్టి బోధయే సర్వ భ్రమ రాహిత్యము.

పరిపూర్ణ నిర్ణయము :

శ్లో॥ పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదీర్యతే ।

పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే ॥

ప్రత్యక్షపూర్ణముగా తెలియబడుచున్న ఆత్మను, పరిపూర్ణ పరబ్రహ్మము నందైక్య పఱచుటకు ప్రయత్నము జేయగా అది అట్టైక్యముగాకుండగనే పోవుచున్నది. కనుక పరిపూర్ణమందైక్య మొనరర్చు పద్ధతికి బదులు పరిపూర్ణమునందీ యాత్మ లేనేలేదని నిర్ణయించి, "మూలం లేని యీ గుర్తెఱిగే శరీరము యేమి లేదు." అని శ్రవణ మనన నిధి ధ్యాసలు చేయడము

శ్రేయస్కరము. ఇట్లు గాక, మహావాక్యార్థానుభవ పద్ధతి కొఱకు వార్తిక పద్ధతిగాను, ఆ బ్రహ్మమే నేనను నిర్ణయములోనుంటే, అపరోక్ష పరిపూర్ణమునందు ఐక్యము గాక, తన నిర్ణయముచే తన లేమి తనము తనకు తెలియక, ఎఱుక అధోగతి పాలగును. కనుక నిదుర వచ్చేవరకు, చచ్చేవరకు "మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం (ఎఱుక) యేమీ లేదు." అనియే మననము చేయవలెను. ఈ పద్ధతి వలననే జనన మరణ భీతి దొలగును. పరిపూర్ణమునందు తనకు ఎఱుకకు ఐక్యమున్నదో లేదో అను దాని నిజము దెలిసికోవలయును. ఐక్యమనేది అసంభవమనే సత్యము తాను పూర్తిగా దెలిసికొని పిమ్మట ఆ మార్గము విడువడేని, మోసపోయి ఎఱుకతో అనేక జన్మలెత్తవలసియుండును. కనుక పరిపూర్ణ బోధ నిర్ణయము గురునిచే గట్టిగా తెలిసికోవలెను. అపుడు పరిపూర్ణమే స్వతస్సిద్ధముగా శేషించియుండును. ఈ అచల పరిపూర్ణ పరబాహ్యము యేయితర వస్తువులలో లీనము గాదు; ఇతరమును తనయందు లీనము జేసికొనదు, అని సిద్ధాంతము. వస్తు నిశ్చయ రూప విచారణయందు గూడా నీసత్యమే తెలియబడుచున్నది. ఎట్లనగా, జీవేశ్వర జగత్తులు సాక్షి చైతన్యమునందు యెన్ని పర్యాయములు సృష్టిస్థితిలయములు పొందినా, ఆ పరిపూర్ణ పరబ్రహ్మమునకే సంబంధము లేనట్లు దెలియబడుచున్నది. కనుక జనన మరణ ప్రవాహముతో సంబంధపడియున్న యెఱుక, జనన మరణ సంబంధము లేని పరిపూర్ణ పర బ్రహ్మమునందెట్లు లయమగును? కాబోదని స్పష్టముగా దెలియబడుచ్నుది. కనుక జనన మరణ భ్రాంతి రహితమునకు ప్రయత్నించు మానవుడు అహంబ్రహ్మాస్మి యను ఐక్య భ్రాంతిని, మాయా రూప, కర్మ భ్రాంతిని, విడువవలెను.

కం॥ కర్మమున బుట్టు జంతువు,
కర్మమునను వృద్ధి బొందు కర్మమున జెడున్ ।
కర్మము జనులకు దైవము,
కర్మము సుఖదుఃఖములకు కారణమధిపా ॥

నామరూపాత్మక సర్వదృశ్య సృష్టికి యే బ్రహ్మము, తత్త్వమాధార భూతముగానున్నదో, అదే మనుష్యుని దేహమందు కూడ ఆత్మ రూపమున నివసించియున్నది. కాన మనుష్యుని కర్మాచరణ పద్ధతులు, దేహాత్మలు, యీ రెంటిని విశ్లేషణ దృష్టితో విచారించి కర్మలాచరించవలెనని, స్వచ్ఛందులగు పరిపూర్ణ బోధజ్ఞులగు వారు నిర్ణయించియున్నారు.

ఆత్మ స్వరూప కర్మాచరణ పద్ధతి :

అన్ని ఉపాధులయందు ఆత్మయేకరూపముగా నున్నందున నిర్ణయాను సారముగా యొనర్చిన కర్మలు పరతంత్రముగా నుండవు. అట్లు గాక, ఉపాధి బేధమును బట్టి ఆత్మ వేరై యున్నట్లున్న, అది పరతంత్రమని చెప్పవచ్చును. సృష్టి విధానమందు, అనగా ఆత్మ, చైతన్య పరిణామమునందు కలుగు శరీరాత్మలు యీ రెండునూ ఆత్మ రూపములే గనుక, బేధ పద్ధతిగా నిర్ణయించుటకు వీలు లేదు. అయిననూ–

1) ఆత్మ పంచన్మాత్రల ప్రేరేపణ యందుండును. అనగా ఆత్మ పంచన్మాత్రల ఏకైక రూపమగుటచే సమిష్టి శ్రేయోదాయక కర్మయందు ప్రవర్తించుటకే ప్రేరేపించును మరియు మోక్షానుకూల కర్మమందే అభినివేశము గల్గును.

2) బాహ్య సృష్టియందున్న పదార్థ సన్నివేశముచే, యింద్రియములకు కలుగు ప్రేరణ. ఇది స్వార్థ రూపకర్మలకే దారి తీయును. తిను, త్రాగు, సుఖపడుమనెడి దేహాత్మ భావముచే యింద్రియములు ప్రేరేపించును. ఈ రెండు రీతులు భిన్నముగానే యుండును. మొదటిది ఆత్మ సంబంధము అనగా బ్రహ్మ సృష్టిలోనిది. రెండవది కేవలం జీవునిగా బాహ్య సృష్టికి సంబంధించిన కర్మ సంబంధము. ఈ పద్ధతులు రెండున్నూ పరస్పర విరుద్ధములుగా నుండును. కనుక వాని సంఘర్షణలోనే, మానవుని ఆయుష్షంతయు గడచిపోవును. ఈ రెండింటి నిర్ణయములు దెలిసికొని, కర్మ, సృష్టిల వలన కలుగు ప్రేరణ విడనాడి, శుద్ధాత్మ యొక్క ప్రేరణానుసారముగా మనుజుడు ప్రవర్తించిన యెడల అతడు చేయు వ్యవహారమంతయు సహజముగా మోక్షానుకూలముగనే యుండును.

తన్ను తాను రక్షించుకొనుటెట్లు?

జలప్రళయమునందు సర్వము నశించిన యెడల దానివలన యెవరికి యే పాపము అంటును? అట్లే, ఆధ్యాత్మ, ఆధి భౌతిక, ఆధి దైవిక పద్ధతులతో నింద్రియ వ్యవహారము జరిపించక కేవలం, సాక్షిగా ఆత్మ పద్ధతిలో త్రికరణ

శుద్ధిగా ప్రవర్తించిన వారికి ఏ పుణ్యపాపములు అంటక, బ్రాహ్మీ స్థితికలుగును. అందుచేత గురుమూర్తిచే అచల పరిపూర్ణ పరబయలును దెలిసికొని, కర్మత్యాగ కర్మఫలత్యాగ పద్ధతుల నవలంబించకుండ కర్తృత్వ త్యాగముగా కర్మలాచరించిన యెడల సూర్యాస్తమయ కాలమునకు యెండమావు లెట్లు లేకుండ పోవునో, అట్లే ఆత్మయను యెఱుక, దాని కర్మ, సమూలముగా లేకుండాపోవును.

మనుజునకు ఇచ్ఛయున్ననూ, లేకున్ననూ, ప్రకృతి రూపకర్మ చక్రము, కాలాధీనమై సదా నడచుచుండుటచే, దానితో పాటు తాను కూడా తిరుగక తప్పదు. కాని పరిపూర్ణ బోధజ్ఞులగు వారు ప్రకృతిలో కర్మ పద్ధతిగా ప్రవర్తించక యింద్రియ నిగ్రహముచే బుద్ధిని స్థిరపఱచి, శుద్ధమొనర్చి, సృష్టి క్రమానుసారముగా చేయవలసిన కార్యములు కర్తృత్వ రహితముగా, కేవలము కర్తవ్య నిర్వహణ కొఱకు మాత్రమే చేయుచు పరమ శాంతముతో నుందురు. వీరే నిజమైన వైరాగ్యపరులు. స్థితప్రజ్ఞులు దేశికులుగా చెప్పబడుదురు.

మానవుడు వ్యవహారిక కర్మలను మాత్రము త్యజించి, అడవులకేగి సన్యాసిగా నుండినను, కర్మక్షయమైనదని భావించుట భ్రాంతియేయగును. ఏలననగా తాను జ్ఞానేంద్రియముల చేత, విషయ పంచకము దెలిసి, కర్మేంద్రియముల చేత కర్మమొనర్చుచున్నాడు కర్మాచరణ విధానము భ్రాంతి రహిత స్థితికి అనుకూలముగా నున్నదని, ప్రతికూలముగా లేదని బుద్ధి నిశ్చయము జేసికొన గలిగిన పిమ్మటనే కర్మ రహితము కాగలదు. అంతేగాని చేయవలసిన విధాయక కర్మలను మాత్రమే జేయుచున్నాను, మిగిలిన కర్మలన్నిటిని త్యజించి సన్యాసిగానున్నానని అనుకొనినంత మాత్రమున కర్మ రహితము గాదు.

అగ్ని చేత ఇంధనములు దహించిపోవునట్లుగా, జ్ఞానాగ్నిచే కర్మలన్నీ కాలిపోవును. ఇంకను, తామరాకు మీద నీరుండిననూ, అంటనట్లు, పరిపూర్ణుడు కర్మయను ఇంధనము లేక దహించకుండ యుండును. ఎందుకనగా, కర్మయనునది సంచిత రూపముగాను, ప్రారబ్ధ రూపముగాను, అనుభవింప జేయును. ఇట్లు అనుభవమునకు వచ్చు కర్మ అశరీర పద్ధతికి భంగము లేకుండ ఆచరించినందున, కర్మ రహిత స్థితి బుద్ధిచే నిశ్చయింపబడి, జన్మ రహితమునకు సహజ పద్ధతిగా నుండును.

అట్లు గాక మానవుడు తన స్వేచ్ఛ చేత నిత్య నైమిత్తిక కర్మలాచరించక విడచి, అనగా త్యజించి ఎట్లు యుండగలడు? అగ్నిచే సమిధలను దహించినట్లు, జ్ఞానాగ్నిచే దహించబడి సమాధి నిష్ఠయందుండగలడు. కాని కాలాతీతానుభవము కాలచక్రముతో పాటు శరీరము మరియు బాల్య, యౌవన, కౌమార, వృద్ధాప్యములు పొందుట, వెంట్రుకలు, గోళ్ళు పెరుగుట మొదలుగునవి తప్పుట లేదు. వృక్షాదులకిది తెలియకపోయినను, అవి కాలానుగుణ్యముగా ఋతువులను బట్టి పూత రాలుటలు జరుగుచున్నట్లే, మరియు ఉప్పెన, గాడ్పులచే క్షీణ వృద్ధులు పొందుచున్నట్లే, మానవుడు బాహ్యకర్మలు మాని, పూర్ణ సమాధియందున్ననూ, అంతఃకరణ, జీవోపాధి నశించుట లేదు. అది సన్యాస పద్ధతుల చేత, అనగా కర్మత్యాగ, కర్మఫలత్యాగ పద్ధతుల చేతను, జ్ఞాన సముపార్జన వలనను, కర్మలన్నియును సమూలముగా నశించిపోవునని అనుకొనుట భ్రాంతి మాత్రమే.

కర్మ సమూలముగా నశించవలెనన్న, అచల పరిపూర్ణ స్థితిని అంతః ప్రజ్ఞకు కలిగింపజేసి, సంచిత కర్మ ఫలరాశినుండి, కాల చక్రరీతిగా ప్రారబ్ధ రూపము చెందు కర్మలనాచరించుచు జ్ఞానేంద్రియముల చేత విషయ పంచకము దెలిసికొని, కర్తృత్వ రహిత పద్ధతిగా, కర్మేంద్రియముల చేత కర్మనొనర్చినచో, కర్మ బీజములు, అనగా సంచిత కర్మతో సహా సమూలముగా రహితమగును కనుక తామరాకు మీద నీరున్నను, దాని కంటకుండా నున్నట్లు, నిదుర వచ్చేవరకు, చచ్చేవరకు కర్తృత్వ రహిత కర్మాచరణ యందుండవలెను. ఈ పద్ధతి పరిపూర్ణ బోధవలననే సాధ్యమగును.

పరిపూర్ణ బోధయందు నిర్ణయించిన కర్మ రహిత విధానము :

"మూలం లేని యీ గుర్తెరిగే శరీరం ఏమీ లేదు" అని నిర్ణయముతో కర్మాచరణ గావించుట కర్తృత్వ రహిత విధానముకు ముఖ్యము. మరణావస్థ, మరణ విధానము ప్రత్యేకముగా జ్ఞాపకముండవలసిన పని లేదు. బాల్య, యౌవన, కౌమార, వృద్ధాప్య మరణావస్థను ముఖ్యముగా విచారించుట అవసరము. ఎంతటి మహాత్ములమని అనుకొన్న వారికైనను మరణ కాలమున యేమీ తెలియదు. కనుక కాలచక్ర రూప సంచిత కర్మ తన స్వరూపమునకు లాగుకొని పునరావృత్తిని కలుగజేయును. కనుక అగ్నిచే ఇంధనములు దగ్ధమైనట్లుగా జ్ఞానాగ్నిచే సర్వకర్మలు భస్మమైపోవుననే నమ్మకముతో బాహ్యకర్మలు మానియున్న వారి


గతి యింతియే కాగలదు.

కర్మోపాధికి కారణమగు కేవలాత్మ స్వరూపమైన నేను పరిపూర్ణ పరబాహ్యమునకు సంబంధము లేకనే వున్న నిర్ణయము తెలిసికొనలేక, సర్వత్ర వున్నానని నిర్ణయించుకొని సర్వకర్మ ఫలములు పొందుటకు సత్యలోక, కైలాసములు, జీవేశ్వరైక్య ఫలములు, ప్రత్యగాత్మ పరమాత్మల ఐక్యములు, బ్రహ్మత్వము పొందవలెనని నిర్ణయించుకొని మరణము చెందుచూ అనేక జన్మలు పొందుచూయున్నారు. గురుమూర్తి కరుణ చేత "ఈ ఉత్త బట్టబయలు ఏమీ లేదు" అనెడి అచల పరిపూర్ణమునందు, కర్మకు కారణమగు నేననే యెఱుకకు మూలము లేదని తెలిసినందున సర్వమునకు కారణ రూపమైన "గుర్తెఱిగే శరీరమునకు మూలము లేదని" మననము జేయుచు, కర్తృత్వ రహిత విధానముగా కర్మాచరణము గావించును. ఈ విధముగా చచ్చిన దనుక, నిదుర వచ్చినదనుక ఆచరించును. కనుక మరణము ఏ విధముగా సంభవించిననూ, పునరావృత్తి పొందదు. ఏలననగా, సంచిత కర్మ బీజములు గాని, ఏ భ్రాంతిగానీ అంతఃకరణ యందుండదు. కనుక ఏ విధముగా జూచినను, అతనికి జన్మము కలుగుటకు వీలు లేదు.

శూన్యం - సర్వం, సర్వం - శూన్యం

ఉన్నది పరిపూర్ణమే. భగవంతునికి ఉనికి "భగవాన్ అస్తి" అనునది. ఇంక ఏమి లేదు (1వ పటము)


ఈ పరిపూర్ణము అట్లే యున్నను, అందు పూర్ణము లేకయే తోచినది. అది యదార్థమైన సత్యస్వరముగానుండెను. ఇంక ఏమి లేదు (2వ పటము)



వెనువెంటనే యదార్థమైన సత్యసర్వమందు ఛాయవలె యదార్థ సత్యశూన్యము కలిగెను. (3వ పటము) యదార్థ సత్యసర్వము అనంతము, శాశ్వతము. యదార్థ సత్యశూన్యము గూడా అనంతము. శాశ్వతము. పదార్థము న్నందునే ఛాయ వుండునట్లు, యదార్థ సత్యసర్వము యదార్థ సత్యశూన్యమునకు ఆధారము.


పదార్థము నిశ్చలమైనను, ఛాయ తగ్గుచు, పెరుగుచు, ఉండునట్లు, పూర్ణమైన యార్థ సత్యసర్వము నిశ్చలము, కాని యదార్థ సత్య శూన్యము మాత్రము తగ్గుచు, పెరుగుచు, పరిణామ శీలము. పదార్థపు ఛాయ ఒకప్పుడు కనుపించక పోయినను, అది పదార్థమునంటియే యున్నట్లు యదార్థ సత్యశూన్యము యదార్థ సత్యసర్వము నంటియుండును. కాని వీనితో యదార్థసత్య సర్వమునకెట్టి సంబంధము లేదు.

కనుక, యదార్థ సత్యశూన్యమే తనకు తానుగా వ్యక్తమై, అసత్య సర్వముగా పరిణమించినది. అందు మిథ్యా జ్ఞానము, మిథ్యా అజ్ఞానములు కలిగెను. ఇందు తత్త్వములేర్పడి, బ్రహ్మాండమైనది. (4వ పటము)



ఈ మిథ్యా జ్ఞానము, మిథ్యా అజ్ఞానము సంఘర్షణ వలన అది నామరూప క్రియాత్మకమైనది. అందువలన అంతు లేని ద్వంద్వములుగా, అనేక పరిమిత తాత్కాలిక అసత్య సర్వములు కలిగి పిండాండమయ్యెను. బ్రహ్మాండమందు ఈశ్వరుడు, పిండాండమందు జీవుడు, యీ మిథ్యా జ్ఞానా జ్ఞానముల ననుభవించుచున్నారు.


ఈ పిండాండ బ్రహ్మాండములు ఛాయ వంటి యదార్ధ సత్యశూన్యము నుండి వ్యక్తమైనందున యివి ఆద్యంతములు, ఉత్పత్తి నాశములు కలిగి, పరిణామ శీలముగానుండి, అసత్యము, కల్పితము లేనివి అయి వున్నవి (5వ పటము)



యదార్ధ సత్యసర్వము అనంతముగాను, శాశ్వతముగాను, చలించక, దేనితోను సంబంధపడక యితరమన్నది లేక, ఉన్నవన్నీ అసత్య సర్వమై ఉనికి లేక ఉన్నవి. అసత్య సర్వము ఒకదానికొకటి ఆధారమై బ్రహ్మాండ పిండాండ సృష్టి నిరంతరము సాగుచు, విస్తరించుచు, లయించుచున్నను, వీటికి ఆధారము వ్యక్తమైనట్టి యదార్ధ సత్యశూన్యమైనందున, పరిపూర్ణమందు అన్నీ ఉనికి లేనివే, మిథ్య.


సాపేక్ష దృష్టితో విచారణ చేసినచో శూన్యమే సర్వము; అసత్య సర్వమే యదార్ధ సత్యశూన్యము. ఈ యదార్ధ సత్యశూన్యము ఆది లేని ఆదియందు వ్యక్తమైనందున, వ్యక్తమైనదనుట మాయ. అసత్య సర్వమందున్న బ్రహ్మాండ పిండాండ సృష్టియంతయు పరిపూర్ణమందు లేనిదే.

ఈ విధముగా చూచిన, పిండాండ సాక్షిభావములోని జీవుడు తన అనేక అసత్య తాత్కాలిక సర్వములను అవి లేనివే అయినందున సాధనచే లేకుండా చేసికొన్నచో, జీవుడు తాను లేకపోయి, ఈశ్వరుడుగా మేల్కొనును. బ్రహ్మాండమందు ఈశ్వరుడు అసత్యసర్వమైనందున, పిండ బ్రహ్మాండములన్నీ తానే ఏకముగానున్నాడని జీవబ్రహ్మైక్యమును పొంది, అదే సమయములో అట్టి సాక్షికి మూలము యదార్ధ సత్యశూన్యమైనందున, యీ జీవ బ్రహ్మైక్యము తన మూలమందు నిలచును. (6వ పటము)



ఈ యదార్ధ సత్యశూన్యము వ్యక్తమగుట వాస్తవమునకు, జరుగలేదు గనుక, పూర్ణ స్థితియైన యదార్ధ సత్యసర్వమే ఉన్నది. కనుక యదార్ధ

సత్యశూన్యము ఏమీ లేనిది. ఈ యదార్థ సత్యసర్వమే అఖండ ఎఱుక. (7వ పటము)




పరిపూర్ణము

పరిపూర్ణమందు అది లేదు. పరిపూర్ణమునకున్ను, అఖండ ఎఱుకకున్ను ఎట్టి సంబంధము లేదు. యదార్థ సత్యసర్వమైన అఖండ ఎఱుకకు మూలము ఏది లేదు. పరబయలునందు చూచి, తనకు మూలము అందు గాన రాక, తనకు మూలము లేదనియు, తనకు తానే వచ్చి సమస్తమై యుండెననియు, కాని సర్వము లేనిదేననియు, అఖండ ఎఱుక విడచి ఆద్యంతములు లేని పరిపూర్ణము, అచలము మిగిలి, అదేయున్నది. (8వ పటము)

దీనిని తెలియు ఎఱుక లేనందున, దీనిని అట్టిదిట్టిదని చెప్పరాదు. ఉన్నదేదో ఉన్నది. లేనిది లేనే లేదు. మౌనవ్యాఖ్యయే పరము!

సర్వం - శూన్యం
(ఒక్కటి - సున్న)

(The ONE and the ZERO - Meher Baba)



భగవంతుడు సర్వదృక్కు, సర్వసాక్షి అనెడి సత్యముగా ఒక్కటి అని తెలిసినవారందరు. సత్యము ఒక్కటే, అనేకము కాదు అని కూడా అందురు. అనేకమునకు మూలము ఒక్కటే. అది పరమ సత్యము, పూర్ణము, సనాతనము.

అనేకముగానను న్నదనబడుచున్నదంతయూ, అనగా అసత్య సర్వమంతా భ్రాంతిగతమైనది. సర్వమైన సృష్టియంతయు ఇంతే.

సర్వమనెడి ఒక్కటి అంతా మహాశూన్యము నుండే వ్యక్తీకరించబడినది. అయిననూ యీ ఒక్కటి అయిన సత్యసర్వమున్ను, ప్రతిక్షేపించుటకు, నిర్వచించుటకు వీలు లేదు. చివరికి ఒకటి అని చెప్పుటకు కూడా వీలు కానిది. కావున అఖండముగా తోచుచున్నది.

ఒక్కటిని మహాసాగరముతో పోల్చవచ్చును. మహాసాగరమును ఒకటి అని అనము. ఎందుకనగా ప్రాంత భేదమును బట్టి సాగరములుగా అనేక పేర్లున్నను, అది ఒక్కటే అయిన మహాసాగరము. కనుక రూపనామ భేదములన్నీ భ్రాంతియే. ఈ ఒక్కటి ఒక్కటే! ఇంకేదీ కాదు. ఇది ఉనికిని సూచించునది.

ఒక్కటి అనబడే యదార్థ సత్యసర్వము అనంతము, అఖండముగా తోచబడుచూ, అదే సమయమున సారూప్యముగా తనయందు అనేకము అయిన

అసత్య సర్వములను అనగా అనేక ఒకటులను కలిగియున్నది.

అదే విధముగా మహాశూన్యమునందు సర్వమూ నిండి నిబిడీకృతమై యున్నను, అదే సమయములో భ్రాంతి పూర్వకమగు అనేక శూన్యములు, లేక అసత్య శూన్యములు (ఆయా ఒకటులన్నీ లుప్తమగుచుండగా) యీ మహాశూన్యమునందే యున్నవి.

ఈ అసత్యసర్వములు, ఈ అసత్య శూన్యములు అంతా ఒక్కటికి ఎడమ, కుడిస్థానముల భేదముచే ఏర్పడి వాటి అసత్య విలువలు మార్పు చెందుచున్నను, నిజమునకు వీనికి విలువ లేదు. కావున మహాశూన్యము – సర్వం శూన్యం.

కర్మక్షయము

కర్మక్షయమనగా సర్వకర్మల బంధమునుండియు సంపూర్ణముగా విముక్తియని అర్థము. జంగమ జీవోపాధుల కర్మ వ్యష్టికర్మ. వీనికి మూలము "ఏకోఽహంబహుస్యాం" అనే పరమాత్మ యొక్క కర్మలన్నీ ఉపాధులకు సమిష్టి కర్మ. వ్యష్టి సమిష్టి రూపమగు కర్మయంతయు రహితమైనపుడే సంపూర్ణ కర్మ విముక్తి యనియు, కర్మ క్షయ మనియు చెప్పనగును.

"అహంబ్రహ్మాస్మి" అను పద్ధతియందు జన్మరహితము గాకుండటకు కారణమేమి? అహంబ్రహ్మాసియను జ్ఞానము గలిగిన పిదప జరుగు కాలమంతయు శ్రేయోదాయకముగా జరిగినను, ఆ కాలములన్నిటికంటె, మరణ కాలమెట్లుండునో ప్రధానముగా విచారించినచో, మరణమనేది జీవిత చరమావస్థ; అంతకుముందే బ్రహ్మ జ్ఞానము గలిగియున్న జ్ఞానికి, సంచిత ప్రారబ్ధములు నశించినను, తానైక్యము జెందిన బ్రహ్మ సృష్టికి కారణమగు తన పద్ధతి గలది గనుక, దాని సంకల్పము వలన జన్మాదులు గలిగి సమిష్టి పద్ధతిగా మరల తెచ్చుకొన్నవాడై దానిననుభవింపవలసి వచ్చును. కనుక మరుజన్మ తప్పక రాగలదు.

జన్మరాహిత్యము గోరువారు బ్రహ్మైక్య భ్రాంతిని విడచి, పరిపూర్ణమందు యెఱుక లేని పద్ధతిని దెలిసికొని, మూలం లేని గుర్తెరిగే శరీరం యేమీ లేదన్న నిర్ణయముతో తన చావు తాను దెలిసికొని, ఆయుర్దాయ నిర్ణయము లేకుండగ నుండుట సులభోపాయము గనుకనే

ఆ.వె. చదివి చదివి జనులు చావంగ నేటికి
చావులేని చదువు జదువ వలయు
చదివి చదివి జనులు చచ్చుచున్నారయా
విశ్వదాభిరామ వినురవేమ

అని వేమన యోగి చెప్పియున్నాడు. చావు లేని చదువు అనగా ఆయుర్ధాయమునకు కడపటి కాలము మరణము. ఆ మరణ సమయమునందు యే కోరికయుండునో, ఆ కోరిక సాధించుటకు తత్సుఖానుభూతికి జన్మలు యెత్తవలసియుండును. అట్టి కోరికలకు మూలమగు యెఱుకను మూలము లేనిదని దెలిసికొని, ఆయుర్దాయమున్నంత వరకు జ్ఞాపకముంచుకొన్న యెడల మరణ సమయమున తాను లేకపోవుచున్నాడు. కనుక జన్మకు కారణము లేకుండ పోవుచున్నది. పరిపూర్ణ బోధమార్గమే జన్మరాహిత్యమునకు రాజమార్గము. దీని యందెట్టి సందేహము లేదు; ఇది తథ్యము. అహంబ్రహ్మాస్మి యను పూర్వానుభవ పద్ధతి చూడగా శకునములు చెప్పే బల్లిలా, తన చావుకు శకునము తెలిసికోలేక, కుడితిలో బడి చచ్చినట్లు, తాను బ్రహ్మమని స్థిరమై మరల యెఱుక లోనే యుండినందున జన్మ రాహిత్యము పొందుట జరుగుట లేదు.

అటులనే అయమాత్మా బ్రహ్మయను మహావాక్య జ్ఞానము పొందినవారు కూడా మరణించియు, యెఱుకలోనేయుందురు. కావున మరల జన్మింతురు. కాని పరిపూర్ణమందు యెఱుక లేని పద్ధతిని తెలిసి, ఆయుర్దాయ నిర్ణయము లేకుండుటయే జన్మ రాహిత్యమునకు మార్గము.

జాగ్రదవస్థ యందు తెలసికొను ప్రత్యగాత్మ రూపమైన తెలివిచే జహద జహల్లక్షణము (భాగ త్యాగ లక్షణ) చేత ప్రకృతిని త్యజించినానని, తానను అఖండ బ్రహ్మపద్ధతి పొందితినని, ఆ ప్రకృతియందుంటూనే అనుకొనుచుండును. ప్రకృతిని విడచి, తానుండుట అసంభవము. అందువలన మరణావస్థ పొందు సమయమున, బీజ వృక్షన్యాయముగా, అనగా వృక్షము యొక్క సర్వ ఆకార వికారములు బీజమునందెట్లు యిమిడి యుండునో, అట్లు మరపు రూపము జెంది పునర్జన్మనెత్తును. వార్తిక పద్ధతి యున్నట్లే యుండును. జనన రహిత

విధానము తెలియగోరువారు పరిపూర్ణ నిర్ణయ గురు సాంప్రదాయమునే ఆశ్రయించవలెను.

జన్మ రాహిత్యమునకు మార్గము

రాజబోగములు, తత్సమానమైన యోగుల, సన్యాసుల భోగములు వైభవములు కూడ స్వర్గాది పుణ్యలోకములు ప్రాప్తించగల దానధర్మ, యజ్ఞకర్మలవలె, ఆగామి కర్మలుగా యేర్పడి, యెఱుక చేయు మర్యాదలై, జన్మ రాహిత్యమునీయజాలవు. కావున పైన పేర్కొనిన పదవులు పొందు మార్గములను వమనాన్నమువలె విసర్జించి, సర్వ సంకల్పములకు మూలమైన పురుషుడవు నీవని గాని, మోక్షాపేక్ష గలవానిగా గాని నుండక, యిట్టివన్నియు కూడా భ్రాంతియేనని మనస్సునందుండనీయక పూర్ణాధికారి కావలయును.

"రోసితి మోక్షాపేక్ష రూఢిగ వినుమీ, నీవట్టి యారూఢతగనుమీ" అని పెద్దలు పరిపూర్ణ పరబయలును, గురు ముఖతః దెలిసి, యెఱుక లేక, సేవించిననే అట్టి ఆరూఢత గలుగును. ఆ పిమ్మట శేష జీవితము కర్తృత్వ రహిత కర్మాచరణగా బూని గడపవలెను. జనన మరణ ప్రవాహము నింకింప గోరువారు ప్రథమములో

కం॥ ఏ యాపేక్ష జనించిన, ఆ యాపేక్షలెల్ల
మాయయని దెలియదగున్
ఆయాసమౌను దానను ఛాయని అది వి
డువ దగును క్షేమము కొఱకై ॥

గురుముఖతః పరిపూర్ణ బోధను వస్తు నిశ్చయముగ నెఱిగి, యెఱుక లేక సేవింపదగును.

"ఎఱుక అనెడి ఆటాడించేటి వాడు అతడేరా కర్త" అని సర్వ కర్తృత్వముగా వస్తువైన ఆ పరమాత్మ తానేనని దెలిసి కర్తృత్వము లేకుండ కర్మలు చేయుచుండ వలెను.

అయినను, పరమాత్మ నిర్ణయానుసారమే సకల కర్మలు చేయుచుండవలెను. (కర్తృత్వ రహితముగా)

మంత్ర, లయ, హఠ, రాజ యోగములు జన్మరాహిత్యమునకు సమర్ధములు గావు. తారక, సాంఖ్య, అమనస్కములు గాని, మహా వాక్య విచారణ గాని, వార్తిక పద్ధతి గాని జన్మమును సంపూర్ణముగా తుదముట్టించలేవు. ఏలననగా, జన్మ కారణమును దొలగించిన గాని జన్మరహితము గాదు. ఎవని సంకల్పమున యీ జీవ జగత్తులు నిర్మాణమయ్యెనో, అట్టి సంకల్ప పురుషుడు మిగిలియున్నచో మరల సంకల్పించుచునే యుండును.

"ఇచ్ఛా మాత్ర ప్రభుసృష్టిః" అన్నారు

ఆ ప్రభువు "ఏకోऽహం బహుస్యాం" అని సంకల్పించినపుడు జీవులు వారి వారి పూర్వ సంచితకర్మ విశేషములతో ఉపాధులను దాల్చెదరు. కనుక ఎట్టి సంకల్పములను చేయుటకు తనయందు యెఱుకలేని పరిపూర్ణ పరబ్రహ్మమొకటి యున్నదన, దానియందు సంకల్పరూపమగు యెఱుకకు స్థానము గాని, మూలముగాని లేదని గురుముఖతః గుర్తెఱుగవలెను. అపుడు యెఱుక యొక్క స్థాన, స్వరూప, స్వభావములున్నూ, యెఱుక రహితమగు విధానమున్ను గురుకృపా పాత్రుడై, పరిపూర్ణ బోధ ద్వారా దెలియవలెను. ఆ పిమ్మట ఆ సంకల్ప పురుషుడే బ్రహ్మము నేననే భ్రాంతి విడచి, ఆగామి కర్మ లేకుండగ చేయవలెను. ఈ విధమైన సకల భ్రాంతి రహిత పద్ధతిలో కర్మాచరణ గావించి తనువు విడచిన వాడే వేయించిన విత్తనము మరల మొలకెత్త లేనట్లు, నిర్బీజమై, భ్రాంతి రహితమై, పునరావృత్తి గాక యుండును.

సాధకుని క్రమమైన సాధ్యము లేమనిన, పిండాండమందు జీవుడుగా నుండి, జ్ఞాత కూటస్థుల యేకత్వము ద్వారా బ్రహ్మాండమందు ఈశ్వరుడుగా మేల్కొనును. పిమ్మట ఈశ్వరతను చతుష్టయముతో తాదాత్మ్యత జెంది, ఈశ్వరునిగా ఎఱుక పొందును. ఇట్టి యెఱుక మాయయందు పరబ్రహ్మ రీతి తోచినది. కనుక యీ యెఱుక పరబ్రహ్మమునుండి లేకయే తోచినందున, యీ ఎఱుక విడువదగినది. ఇది ఈశ్వర తనువులుగా తోచి, కొనసాగు చున్నందున, విచారణ చేత ఎఱుక యొక్క సర్వవిలాసమును కూడా భ్రాంతియని యెంచి గురుముఖతః తెలిసికొని, కర్తృత్వ రహిత కర్మాచరణము ద్వారా, ఈశ్వరునిగా కూడ కొనసాగక శేష జీవితమును గడపవలెను.

ఈ విధముగా సర్వము అయిన, ఎఱుక బ్రహ్మము, పిండాండ బ్రహ్మాండములలో జీవ ఈశ్వర తనువులుగా అనుభవము పొందుచూ, తుదకు, సంకల్ప పురుషునిగాను, మోక్షేచ్ఛ గలవానిగాను నుండినను, ఎఱుక విడచినట్లు గాదని, అవి అన్నియు పునరావృత్తికి బీజములుగానే యుండునని, అసలిట్టి యెఱుక ఏనాడూ లేనిదని నిశ్చితుండై యెఱుక అను కల నుండి మేల్కొని, అట్టి లేని ఎఱుకను విడచినచో, తానే లేక పోయి మరల జన్మకు కారణమైన బీజము లేనందున శూన్యమగును.

ఈ లేనెఱుక విడచుటకు ద్వాదశి, షోడశి, పంచ దశి మంత్రములు చెప్పవలసియున్నది. గురుముఖతః సర్వముగా దోచిన యెఱుక విడచి పునరావృత్తి లేని శూన్యముగా జేసికొనవలెను, అనగా అచల పరిపూర్ణ పరబయలునందు, తనకు మూలము లేదనియు, తనకు తానే తోచినందున, తనకు తానే తోచకుండు విధముగా శూన్యము గావలెను.

జనన మరణ భ్రాంతి రహితము

కార్యకారణ గుణ పద్ధతి :

కం॥ మరుపు సుషుప్తియు, మూర్ఛయు,
మరణంబు సమాధియనుచు మానవులెఱుకన్
దొరగిన నొరుని శరీరం
బెఱిగెదరా నరుడు మేనునెఱుగడోయన్నా ।
తననైన తానెఱుగడోయన్నా ।
యెఱుగకుండిననేమి తిరిగి పుట్టుచునుండు
తిరిగి పుట్టడు వాడీగురుబోధనెఱిగిన.

మరపు నుండి జ్ఞప్తియు, సుషప్తినుండి మెలకువయు, మూర్ఛనుండి స్పృహయు, మరణము నుండి పుట్టుకయు, సమాధి నుండి తెలివియు గలిగించుట ప్రత్యగాత్మ యొక్క విధియై యున్నది. అవస్థా నిర్మితములును, కాల నిర్మితములును రాత్రింబగళ్ళును నేర్పడు పద్ధతులుగ ఈ ప్రత్యగాత్మ విధియని తెలియదగును. ఆత్మ రూపమగు స్వప్రకాశము రాత్రింబగళ్ళనై పద్ధతిగానుండు ను గాని, అయనంబునకే నిర్ణయము లేదు. కావున మరపు పద్ధతి యందు ఎఱుక కల్గించును.

జనన మరణ భ్రాంతి ఎందుకు?

పృథివి పైనున్న స్థావర జంగములు మలినపుటెఱుకపై ఆధారపడియున్నవి. కాని అవి కేవల ఎఱుక కాదు. అథోరూపమగు మిశ్రమపుటెఱుకయనియు సర్వ మందర్భూతమైయున్నది. ఐనను దానిలో నేది కూడ రూపనామ క్రియలు పొంద జాలదు. ఎందుకనగా మలినపుటెఱుకకు జ్ఞానోదయము పొందిన మనః ప్రాణములగు మిశ్రమపుటెఱుకకు మధ్యగ కేవలమెఱుక రూపనామ క్రియలు పొందుచున్నది.

కేవలపుటెఱుకయందు నుండు శక్తి యెట్టిదనగా ప్రాణవాయువుల సంచారమగు స్వప్నమునందు శబ్దరహితమైన వాక్కు, దాన రహితమైన పాణి, గమన రహితమైన పాదము, ఆనంద రహితమన పాయువు, విసర్జన రహితమైన ఉపస్థలుగా నుండి క్రియోన్ముఖమగు జాగృతియందు సకలము సృష్టించి, సకల కార్యములు చేయునట్లు పరా రూపమగు ఎఱుక అఖండమై ద్రవరూపముగానుండి అథోరూప పరిణామము వలన రూపనామాత్మకమగు కేవలత్వము నొంది మిశ్రమపుటెఱుక రూపమున క్రియోన్ముఖమగు మలినపుటెఱుకగా పరిణమించును. అనగా సకలమును సృష్టించును.

అఖండపుటెఱుక అథోరూపము పొందుటకు అఖండపుటెఱుక యొక్క యదేచ్ఛయే కాని అచల పరిపూర్ణ పరబాహ్యము యొక్క యిచ్ఛ గాదు. అఖండపు టెఱుక యొక్క యదేచ్ఛా పరిణామము వలన కేవలపుటెఱుక దైవరూపము గాను, మిశ్రమపుటెఱుక జీవరూపముగాను, మలినపుటెఱుక స్థూల రూపముగాను, పరిణమించి, నానా బాధలు పొందుచున్నది. అందువలన బాధల నుండి తప్పుకొనుటకు పరారూపమగు ఎఱుక ప్రయత్నించుచున్నది.

జ్ఞాన రూపమగు ప్రతి క్రియలు విషయారూపములు దాల్చిన మనో సంకల్పములు పరారూపమను ఎఱుకయందు లేవు. అయినను, జాగ్రదవాస్థ యందు అనుభవించిన సకల విషయములు సంపూర్ణాకృతి జెందిన విశ్వరూపమున నుండక స్మరణ రూపముగనో, వాసనా రూపముగనో,

పరారూపమగు ఎఱుకయందు జొచ్చి ద్రవరూపకమగుచున్నవి. అందువలన సంకల్పములు, సంఘటనలు, నానా విధ స్వప్నములు తలవని తలంపుగా వచ్చుచున్నవి. కావున అఖండపుటెఱుక సర్వమునకు మూలకారణమని సిద్ధాంతము.

అఖండపుటెఱుకను రహితమొనర్చలేక మలినపుటెఱుక రహితమే విషయవాసనా రహితమని నమ్ముకొన్న వారలకు తిరిగి విషయవాసనలు సంభవించుచుండును. కావున నిజరహితము. అనగా సర్వమునకు మూలకారణమగు అఖండపుటెఱుకను అచల పరిపూర్ణ పరబాహ్యమునందు జూచి, రహితమొనర్చుకొనవలయును. మరియు ఎంతటి జ్ఞానికైనను పూర్వస్వభావము విడువదు అను లోకోక్తి గలదు. ఇందుకు కారణము అఖండపుటెఱుక యందు దాగియున్న విషయవాసనలు ఏ కాలమందైనను వీలు కలిగినప్పుడు తలయెత్తుచునేయుండును. పూర్వస్వభావము మారక భీజముగా నుండును. కావున అఖండపుటెఱుక రహితమునకు సాధకుడు నిరంతరము ప్రయత్నించవలయును.

మనము పుట్టుటకు పరారూపమగు ఎఱుక జన్మస్థానము. దానినుండి విషయములుద్భవించి మలినపుటెఱుక యందు రూపములు దాల్చుటకు గుణగణముల ప్రవర్తనకు పరారూపమగు అఖండపు టెఱుకయే. జన్మస్థానమగు చున్నది. ఐనను మిశ్రమపుటెఱుక అజ్ఞానములోను, మూర్ఖత్వములోను, అంధకారములోను మాంద్యమగు తమ ప్రభావము కలిగియున్నది. మలిపుటెఱుక లోనికి యోగయుక్తముగా అఖండపు టెఱుకను అవతరింపజేసి, మిశ్రమపుటెఱుక యొక్క రహితమునకు ప్రయత్నించవలయును. అట్లు గాక యితర యే పద్ధతులను అవలంబించినను ఎంతటి మహానుభావుల మని యనుకొన్నను, వారిని మిశ్రమపుటెఱుక విషయ వాసనలలోనికి లాగుచునేయుండును. వారిని తబ్బిబ్బు చేయును.

మిశ్రమపుటెఱుక రూపమైన మనస్సు తమఃప్రధానమైనది. అందువలన విషయవాసనలయందు పదే పదే పరుగిడుచుండును. పరారూపమునకు శ్రద్ధ కలిగి పట్టుదలగా ప్రయత్నించవలయును. చక్రాతి వలె నిన్ననుసరించుకొని యున్న మలినపుటెఱుకను అఖండపుటెఱుకయందు రహిత స్థితిని బొందిన నీవు రాకపోకలు కలిగిన రాజమార్గముగా దారి నేర్పరుపవలయును. ఇట్లు చేయుటలో మిశ్రమపుటెఱుక నుండి యేర్పడిన వాంఛలలోనెట్టి యాటంకము లుండబోవు. ఐనను మిశ్రమపుటెఱుక రూపమైన మనస్సు అఖండపుటెఱుక రూపము బొందినను, దాని స్వభావరహితమునకు కొంత కాలము పట్టును. అట్టి ఆలస్యమునకు నిస్పృహ జెందరాదు. సర్వావస్థలయందు అచల స్థితిలోనుండవలయును.

మిశ్రమపుటెఱుక యొక్క విషయములగు మనఃప్రాణములు అఖండపు టెఱుకత్వము జెందిన వెంటనే బాహ్య విషయములు వీడిపోవును. అందువలన మనఃప్రాణములు చలించక జీవరహితమై యుండును. ఎట్లనగా జీవము గలిగియు లేని విధముగానుండును.

మిశ్రమపుటెఱుక యొక్క విషయములగు మనః ప్రాణములనుండి తరుమబడిన ప్రతి విషయము అఖండపుటెఱుక మరుగునజొచ్చియుండును. ఎట్లనగా భూమిలో పాతిపెట్టిన విత్తనములు కాలానుగుణ్యముగా పైకి మొలకలెత్తినట్లు అఖండపుటెఱుక మరుగునజొచ్చిన కామసంకల్పములు సమయానుకూలముగా పైకి తలెత్తుచుండును. కావున ఎంతటి వానికైనను పూర్వాభ్యాసములు వారి ప్రవర్తనలు మార్పు జెందకయుండి, వీలుగా పైకి వచ్చుచుండును.

శాశ్వతముగా విషయ వాసనల నుండి ముక్తిజెందితినని నమ్మికగలవానికి గూడ తిరిగి విషయవాసనలు సంభవించుచున్నవి. ఇట్లు సంభవించుటకు కారణమేమనగా, సంచిత ఆగామి బీజములు మనః ప్రాణభౌతిక విషయ వాసనలు అఖండపు టెఱుక యందున్నవి. అందువలన వ్యాధులకు, మృత్యువునకు అఖండ యెఱుక కారణముగానున్నది. జ్ఞానాజ్ఞానముల యొక్క కట్టకడపటి శరణాలయము అఖండపుటెఱుకయనునట్టి చూపునకు ఆశ్చర్యము మరియు అభేద్యమునై యున్నది. ఇందుకు ఈ క్రింది కందార్థమిట్లు చెప్పుచున్నది.

కం. నిక్కముగా బీరపీచుల చిక్కు సుమీ
విచ్చరాదు ఛీ యీ యెఱుకన్ మక్కువనే
బోధించిన చక్కని బోధాగ్ని చేత
సాధించుకోరా! విచ్చేచింత చాలించు
కోరా! చక్కని యీ బోధకెక్కాడ యీడౌ

ను! తక్కినబోధాల చిక్కుచూడక దీని
సాధించుకోరా ! విచ్చేచింత చాలించుకోరా !!

అఖండపుటెఱుక యొక్క గర్భకోశమునందు భద్రముగా పోషింపబడుచున్న మన యొక్క కోరికలు కామనావృత్తులు నీవెంతగా నణగద్రొక్కినను వానిని యితర పద్ధతుల చేత ఖండించినను నశించక మరిమరి పైకి మెదలుచు జ్ఞానసిద్ధికి అవి పెడచెవి పెట్టు చుండును. అఖండపుటెఱుకయందు అచల పరిపూర్ణపర బాహ్యమును ప్రవేశపెట్టి, దాని రహితమునకు ప్రయత్నించినప్పుడు నిర్బీజమై అది నశించును. ఇతరయే పద్ధతులు చేత పరారూపమగు ఎఱుక నశించదు. కావున జననమరణ భ్రాంతిరహితము కోరు స్త్రీ, పురుషులు పాప రూపమైన అంఖండపుటెఱుక నశించుటకు అనగా తన నాశమునకు ప్రయత్నము చేయ వలయును, అట్లు కాకున్న జనన మరణ భ్రాంతి రహితము కాజాలదు. ఎందుకనగా, సర్వభ్రాంతి రూపములు గలుగజేయుటకు అఖండపుటెఱుకయే కారణము.

కం॥ ఓపాపరూప యీ బయ । లే పరమాత్మ యని నమ్మి లేనట్టినినున్ ॥
నాపోజ్యోతినని తెలిసి । పట్టున లేనటంచు నెఱుగు ముళక్కిన్ ॥

పరిపూర్ణ బోధ - ప్రస్థావన

ద్వాదశి, పంచదశి, షోడశి మంత్రములు :

షోడశి మంత్రము :

3) మూ ల ము లే ని గు ర్తె రి గే శ రీ రం ఏ మీ లే దు
1 2 3 4 5 6 7 8 9 10 11 12 13 14 15 16

పంచదశి మంత్రము :

2) క ల లో తో చి న శ రీ రం ఎ లా గో అ లా గే
1 2 3 4 5 6 7 8 9 10 11 12 13 14 15

ద్వాదశి మంత్రము :

1) ఈ ఉ త్త బ ట్ట బ య లు ఏ మీ లే దు
1 2 3 4 5 6 7 8 9 10 11 12

తుర్యాతీత కేవలాత్మ పద్ధతి ద్వారా కారణ బోధ వల్ల అవిద్య, అజ్ఞానము నశించును. కారణ బోధయనగా తాను సాక్షియగు ఎఱుకనని, అద్వితీయ బ్రహ్మమని, అన్యము లేదని ఎఱుగుట; ద్వాదశి మంత్రపూర్వకమున యెఱిగిన విశ్వమునూ, దేహమును తాను కానని, మరియు అట్లు ఊరకుండుట. అసలు బ్రహ్మమునకు మూలము లేదు. అనగా కారణము లేదు. కనుక బీజ శూన్యమైనది. నిరావరణమైనది.

ఈ కనబడే శరీరము ఏమీ లేదు. లేకనే కనబడే శరీరము భ్రాంతియని తెలియవలెను. భ్రాంతియై కనబడుచున్న శరీరము కలలో దోచిన శరీరము వంటిదే అనుచూ, మది ఎఱుగుము. శరీరము లేదని చెప్పబడినందున, శరీరమందుండి నిర్ణయించబడిన కారణ సహిత, దృక్సహిత ఆవరణ లేనిదని నిర్ధారణ. కనుక బయలనబడుచున్నది. కాబట్టి, ఈ ఉత్త బట్టబయలిక ఏమీ లేదు.

ఇందుకు మరొక అర్థము చెప్పబడుచున్నది. ఎఱుగునది ఎఱుక. బ్రహ్మ శూన్యము. గనుక ఎఱుక శూన్యమైనది. శూన్యమైన ఈ ఎఱుకకు మూలము లేదు. అనగా బీజము లేదు. అనగా ఎఱుకకు కారణము లేదని గ్రహించవలెను. కారణము లేని కార్యము భ్రాంతియగుట వల్ల, ఎఱుక శూన్యము. ఇప్పుడు ఎఱుక శూన్యమగుట వలన, బ్రహ్మ కూడా శూన్యమైనది. శూన్యమైనది ఎఱుకను విడచిన, బయలే కనుక "ఈ ఉత్త బట్టబయలిక ఏమియూ లేదు." ఇందుకు ముఖ్యాంశము – "శూన్యమైన ఎఱుకను విడచినచో ఉన్నది బట్టబయలు."

అనగా, ఈ శూన్యమైన ఎఱుకను వీడి, జగత్తునూ, జీవుడున్నూ, ఈశ్వరుడున్నూ, నామములున్నూ లేవు. బయలే ఉన్నది.

"నేను బ్రహ్మము" అను పేరున్నూ లేదు. ఉన్నదేదో ఉన్నట్లున్నది.

అందువలన, ఈ ప్రకారము, గుణరహితమై బ్రహ్మమే చిద్రూపము చేత తనకు తానే జ్ఞాన విలక్షణమై, నిరుపాధికమై, నిరుపమానమై, నిర్విషయమై, ఏ

సంజ్ఞలు లేనిదై ప్రకాశించుచున్నది. ఇక్కడ సర్వ సంజ్ఞాతీతమైన బ్రహ్మమునకు జననము లేదు. కావున మరణము కూడా లేదు పూర్ణముగా సంసిద్ధుడైన సచ్ఛిష్యుడు, సద్గురువుల హృదయైక్య నిర్ణయానుసారము రహస్యత్రయ మంత్రములుపదేశించబడును. ఈ మంత్రముల ఉపాసన ద్వారా గురుశిష్యు లిద్దరును శాశ్వతముగా నుండరు. ఇదియే ఎఱుక బ్రహ్మము తన ఎఱుకను విడచి లేకుండపోవుట.

పరిపూర్ణ బోధ :

దృష్టాంత ద్రాష్టాంతకముల చేత ద్వాదశియును షోడశియును పరిష్కారమయినచో సరి. ఇంక ఏమీ లేదు.

సీ॥ సకల దేశములందు సకల కాలములందు సకల వస్తువుల చంచలము లేక । చావు పుట్టుకలేని యీ వుత్త బట్టబయలే కాని రెండోది లేదు లేదు । కలలోన గనుగొన్న గజము మేల్కొని జూడలేశమైనను యేమిలేని భంగి । భ్రమయుక్తమైన మూలము లేని యీ గుర్తెరిగే శరీరము యేమి లేదు । యిదియు గురువాక్య పద్ధతి, విదితమగును । విమర్శించినవాడు వివేక ఘనుడు । రమ్యగుణధామ భద్రాద్రి రామ పరశురామ నరసింహ్మ దాస సంరక్షితాహ్వ ॥

– భద్రాద్రి రామ శతకము

తా॥ సకల దేశములందు, సకల కాలములందు, సకల వస్తువులందు చలనము లేక చావు పుట్టుకలు లేక తనకు తాను స్వతస్సిద్ధమైయున్న, యీ వుత్త బట్టబయలు తప్ప యేమి లేదు. కలలో గనబడిన గజము మేలుకొని చూడగా యేలాగు లేదో, అలాగే మూలములేని యీ గుర్తెరిగే శరీరము యేమి లేదు. ఇది గురు ముఖముగా విచారించవలెను.

సీ॥ ఈ వుత్త బట్టబైలేమి లేదనుచును ద్వాదశాక్షరి చాలదలచవలెను । మూలమింతయు లేక మేలుగానెఱిగెడు యీ శరీర ద్వయమేమి లేదు । యని గురువాక్యంబు విని సంతతము జ్ఞాపకంబుంచవలె, నిది కొంచెమనక । నది నిశ్చయము జేసినిది విడిపించితే పరిపూర్ణమే యుండు బాధలేక । రాకపోకలు రెండును లేక యుండు । నట్టి సూత్రంబు దెలిసిన నచలమగును । రమ్యగుణ ధామ భద్రాద్రి రామ పరశురామ నరసింహ్మదాస సంరక్షితాహ్వ ॥

– భద్రాద్రి రామ శతకము

తా॥ "ఈ వుత్త బట్టబయలు యేమి లేదు". అను ద్వాదశాక్షరిని చక్కగా తలచి, తరువాత కలలో దోచిన శరీరములు యేలాగో అలాగే, "మూలం లేని యీ గుర్తెరిగే శరీరద్వయము యేమి లేదు". అను షోడాశాక్షరిని సదా మరువక యుండవలెను. ఇట్టి గురువాక్యములను అశ్రద్ధ జేయక ద్వాదశిని నిశ్చయము చేసి, షోడశిని విడచిపెట్టిన, పరిపూర్ణమే యుండును. ఇదియే జనన మరణ భ్రాంతి రహితమైన అచల సూత్రమని యెఱుగవలెను.

తృతీయాంక సమాప్తి

కార్యకారణ వివేకానుభవసిద్ధమైన కూటస్థమగు స్థితి లక్ష్యముగా పంచ భ్రమలు నివర్తించబడి, సాధన పంచకమున సదా జీవించు సచ్ఛిష్యునకు సద్గురూత్తమునిచే అమనస్క పాదమందించబడినది.

జ్ఞాతయైన వృష్టి, సమిష్టియై, వృష్టిగా లేనట్టి దృక్ దృశ్య వివేక లక్ష్యముగా నిర్గుణ వాక్యములు, పూర్వోక్తమైన మహావాక్యములను, కూటస్థానుభవ రూపమైన ఎఱుక నిర్ణయ పద్ధతిగా విచారణ ద్వారా పూర్ణ గురూప దిష్ట మార్గమున ఉత్తమాధికారియైన సచ్ఛిష్యునకు బోధింపబడును.

జన్మరాహిత్య విధానమునన్వేషించు అధికారికి, పూర్ణగురువులు, మొద లచలమునెఱిగించు పద్ధతిన సచ్చిదానందము, జీవేశ్వర కూటస్థ బ్రహ్మమును నిరసించు పరిపూర్ణము, దాని నిర్ణయము నెఱిగించు విధమును ద్వాదశి, షోడశి, పంచదశిల బోధకుపక్రమించినారు. మొదలు ఏమీ లేని స్థితియందు ఎఱుక సర్వముగా వ్యక్తమై తనను తానెఱుగుట యంతయు విచారణ, బోధ, సాక్షి నిరసనల పూర్వకముగా సర్వమూ నిరావరణము అగు రీతి సాంగముగా నందించినారు.

– నిజ గురు చరణారవిందార్పణమస్తు –

సర్వ వేదాంత శిరోభూషణము

శూన్యం - సర్వం, సర్వం - శూన్యం

చతుర్థాంకము

గురుధ్యానము :

చూపులో చూపుగా చూచిన యోగికి చూపులెల్లను లింగరూపులగును.

వినికిచే నాదంబు విను మహామహునకు, వినికి యెల్లను నాద వితీతి యగును. మనసుచే లింగంబు మగ్నమౌ ఘనునకు, అంగమై మనసున లీల వెలుగు; తన లోన బైటను తమ మణంచిన మేటి తనువెల్ల బయలుగా దనరుచుండు; నిందు తత్త్వంబు యిది గదా నిశ్చలంబు; పందు వెన్నెల బయలిది, పరమ మిట్టి భావమిరవొందగలవాడు పరమయోగి చిత్కళాధామ శ్రీ గురు సిద్ధ రామ॥

- సిద్ధ రామ శతకం 11వ.ప॥

హంసద్వయంబైన యక్షరంబుల మధ్య అందమ్ముగా బిందు వలరుచుండు, బిందు మధ్యంబున పొందైన నాదంబు, నాదమధ్యంబున నరయ శివుడు, శివ మధ్యముననుండు చెలువైన సూక్ష్మంబు, సూక్ష్మమధ్యమునందు చూడపరము, పరమంబు చేగల్గు భవ్య సద్భావంబు భావ సంపూర్ణత బరగు బయలు, అట్టి బయలెవ్వడైనను యిట్టిదనుచు, నను భవాసక్తి దెలిసిన, అతివినోద నిర్మలానంద సౌఖ్య నిర్నిద్రుడగును ॥ చిత్కళాధామ శ్రీగురు సిద్ధ రామ॥

- సిద్ధ రామ శతకం 14వ.ప॥

వెలిలోను తానయ్యు, వెలిలోను తాగాక వెలిగెడు లింగంబు వెదకవలయు, స్థూల సూక్ష్మంబయ్యు, స్థూల సూక్ష్మముగాని సూక్ష్మ లింగములోన జూడవలయు, కళలో నిష్కళయయ్యు, కళలో నిష్కళ గాక, కళ గల లింగంబు గలియవలయు, బైలులో బైలయ్యు, బైలుబైలును గాని బైలైన లింగంబు బట్టవలయు, తగిలి, తగలని మనసుచే, దగిలి దినము, యెఱిగి యెఱుగని యెఱుకచే యెఱిగి మిమ్ము, మరచి మరువని మరుపున మరగవలయు ॥ చిత్కళాధామ శ్రీగురు సిద్ధ రామ॥

- సిద్ధ రామ శతకం 47వ.ప॥

నిలిచెవాయువటంచు నెమ్మదినెంచెనా, నిలువకప్పుడె మీరు నెలవు దాటి, మనసు లయంబని మమతతో గాతలచెనా తరగకప్పుడె తావు దగిలిపోవు , కుంభకం బిదియని గురుతించి యెఱిగెనా మరల యెప్పటి రీతి మహిని దిరుగు, తేజంబుకను గొని తెలియంగ జూచెనా తెలివియప్పుడె దప్పిదేలిపోవు, నిలుకడదియంచు దనలోన నిలువరించి, ప్రబలమైనట్టి బయలున బట్టరాని, ఇట్టి బ్రహ్మంబు నీవని యెఱుగవలయు ॥ చిత్కళాధామ శ్రీగురు సిద్ధ రామ॥

- సిద్ధ రామ శతకం 48వ.ప॥

ప్రబలిమండలి మధ్య పరమాణురూపమై సంచారమొనరించి, స్థాయినెఱిగి స్థిరమైన కళలచే శృంగాటకంబుపై మెలగక మెలగెడి మేల్మియరిగి, నలు మొగంబుల వాని నయనయన ద్వార తెల్వి కలిగిన బయల్ తెలిసి కలసి, భూలోకమున మించి పొసగిన తావున నిబీడమై యంతటనిండినట్టి భావమెఱిగిన వానిది భావమెంచవాడు ధన్యుండు సుజనుండు, వాడె ఘనుడు, వాడె సుజ్ఞాని, వాడెపో పరమ యోగి ॥ చిత్కళాధామ శ్రీగురు సిద్ధ రామ॥

- సిద్ధ రామ శతకం 56వ.ప॥

మహిత జాగ్రత్థ్సాన మహిమనెంచగ మించి ముదమున శాంభవీ ముద్రయయ్యె, నవల స్వప్నస్థాన మవధాన మెఱిగిన భద్రమౌ ఖేచరీముద్రయయ్యె, మరి సుషుప్తి స్థానమరియంగ నేర్చిన, మొదయు వివేక జ్ఞానముద్రయయ్యె. తెలివి తుర్యంబున దృఢత కల్గినయంత బలువగు మౌనంబు బరగగల్గె. యెఱుక, తుర్యాతిగమనంబు యెఱుగనపుడె చొక్కయమరంగ మౌనాంత మొక్కటగను, పంచముద్రల వరుస ప్రభావమిదియు॥ చిత్కళాధామ శ్రీగురు సిద్ధ రామ॥

- సిద్ధ రామ శతకం 64వ.ప॥

సకల జీవులయందు సరణి జాగ్రతయెంచ ఘనత పిండాకాశ గరిమబూను,

రమణ స్వప్న స్థాన కమనీయ విభవంబెయ లఘుచిదాకాశమనగ మించె, వెలయు సుషుప్తియు వేమారు విలసిల్ల మను మహదాకాశమనగ బరగె, గొనబైన తుర్యంపు గురుతు బింద్వాకాశమయ్యె, తుర్యాతీత మరయ తత్త్వమనెడి ఆకాశమయ్యెను, ఘనత మించి అరయనివి పంచ గగనంబులయ్యె, నిట్టి ఆత్మ గగనంబులెఱిగిన అతడె ఘనుడు ॥ చిత్కళాధామ శ్రీగురు సిద్ధ రామ॥

– సిద్ధ రామ శతకం 66వ.ప॥

కలిత చిన్మయ నేత్రకమలంబులందున్న మరి సూర్యచంద్రాగ్ని మండలముల నలరంగ తన్మధ్య అతి సూక్ష్మ పథమున పరమాణు రూపమై ప్రజ్వరిల్లు, నీలతోయద మధ్య నిలకడౌ మెరుపన, నరయనివ్వమంటి యగ్రమనగ, నుది తమాపోజ్యోతి ఓంకారమనగను, విశ్వమంతయు కన్నులనగ, వెలయు తన్మధ్యముననున్న వెలిప్రకాశ, కలిత మహనియ్య తత్త్వంబె గను గొనంగ, ఠీవి గనుపట్టు కళనెంచ నీవెకావె ॥ చిత్కళాధామ శ్రీగురు సిద్ధ రామ॥

– సిద్ధ రామ శతకం 69వ.ప॥

సతతంబు లింగమే సరవిసత్తనమించె, చిత్తంగ మనగను చెలువుగాంచె, ఆత్మ సంయోగమే, ఆనందమనిపించె నరయంగ సచ్చిదానందమయ్యె, విరచింప లింగమే వెలయ తత్పదమయ్యె, దనరంగ అంగమే త్వంపదంబు, నరయంగ సంయోగ మసిపదంబనుచును, కంగైన నాదంబె లింగమనుచు, బిందు వన గను అంగంబు పెంపుగనియె, కళయు సంయోగమనుచును, అంగలింగాను సంయోగమనుటనిదియె॥ చిత్కళాధామ శ్రీగురు సిద్ధ రామ॥

– సిద్ధ రామ శతకం 70వ.ప॥

తా॥ 1) లింగమనగా సత్తు + తత్పదము (నాదము)
2) అంగమనగా చిత్తు + త్వంపదము (బిందువు)
3) ఈ రెంటి సంయోగమనగా ఆనందము – అసిపదము (కళ)

బాహ్య దృష్టి విడిచి బైలందు లక్షించి, లక్ష్యమందు మూడు లక్షణములు దెలిసినట్టి వాడు దేవుడనంబడు ॥ అఖిల జీవ సంగ ఆత్మ లింగ ॥

– ఆత్మ లింగ శతకము 50వ ప॥

బాలమత్తరీతి బలు పిశాచము భాతి భావమందు బేధభావమిడిచి దిరుగుచుందురయ్య గురువులు ధరలోన ॥ అఖిల జీవ సంగ ఆత్మ లింగ ॥

– ఆత్మ లింగ శతకము 82వ ప॥

కారణంబు శివుడు కార్యంబు జీవుడు, కార్యకారణంబుగాని బయలు, గానలేరు జనులు ఘనమగు కృప చేత ॥ అఖిల జీవ సంగ ఆత్మ లింగ ॥

– ఆత్మ లింగ శతకము 113వ ప॥

ఇట్టి పరమగోప్యమెవ్వరెఱుంగరు, యెఱిగినట్టి వారు తిరిగిరారు, తిరిగి రాని మరుగు తెలియుట కష్టంబు ॥ అఖిల జీవ సంగ ఆత్మ లింగ ॥

– ఆత్మ లింగ శతకము 119వ ప॥

గురుకృప

కం॥ మేనెఱుకని రెంట్లోనొక । దానిని
యెడబాసిచేయ తరమా పనులన్ ।
మేనికి యెఱుకకు గావున । మేనన
యెఱుకెఱుక యనిన । మేనాని యె
ఱుగూ । యీ రెంట్ని నీవు నేనాని
యెఱుగూ । యెఱిగి వీట్లతో బ
యలు నెరిగి మేనెఱుకాల । తిరిగి
చూడకు చూస్తే గురుని పాదము
లాన, మేనాని యెఱుగూ । యీ
రెంట్ని । నీవు నేనాని యెఱుగూ ॥

– శుద్ధ నిర్గుణ తత్వ కందార్ధదర్వులు 216వ కం.

తా॥ ఓ శిష్యుడా । తనువు, యెఱుక ఈ రెంటిలో తనువును విడచి యెఱుకయు, యెఱుకను విడచి తనువును యివి ఏ కార్యములు చేయజాలవు. కనుకనే, తనువు, యెఱుక రెండూ ఒకటే. తనువనినా, యెఱుకనినా తనువని తెలిసికొనుము. తరువాత వీటిచే శక్తి ద్వయ నిరాసకంబైన అచల పరిపూర్ణ పరబయలును తెలిసికొని తనువు యెఱుకల రెండింటిని మరల చూడకుము. చూచిన యెడల సద్గురుపాదముల సాక్షిని తప్పినవాడవగుదువే యని భావము.

కం॥ మరుపు సుషుప్తియు మూర్ఛయు । మర
ణంబు సమాధి యనుచు మానవు లెఱుకన్ ।
దొరగిన నొరుని శరీరము । నెఱిగెదరా నరుడు ।
మేను నెఱుగడో యన్నా । తననైన తా । నెఱు
గడో యన్నా । యెఱుగ కుండితె యేమి
తిరుగి పుట్టుచునుండు । తిరిగి పుట్టువాడె ।
తనదైన తా నెఱుగడో యన్నా ॥

– శుద్ధ నిర్గుణ తత్వ కందార్ధదర్వులు 217వ కం.

తా॥ ఓ శిష్యుడా । మరుపు, సుషుప్తి, మూర్ఛ, మరణము, సమాధియను యవస్థలు మోక్షము నిచ్చునని మానవులు యా యవస్థలయందు ఒరుగుదురు. ఆ సమయమున ఇతరులను గాని, తన శరీరమును గాని, తన్ను తాను గాని యెఱుగుట లేదు. అటుల ఎఱుగక పోయినను, వారు యితరుల వలెనే జనన మరణములు జెందుచుందురు. వారు సద్గురు కరుణచే అచల పరిపూర్ణ ప్రబోధ జెందిన యెడల, జనన మరణములు జెందరని భావము.

కం॥ పరిపూర్ణ యెఱుక లివి యని । యెఱుగని
బయలందు లేని యెఱుక తనకు దా । నరుదెంచిట
గురుశిష్యుల । తెరుగును మాట్లాడి రెంట్ని । దెలి
సి తా జనునూ । ఆపై మాటా । పలికె దే ది కనూ ।
అరమర లేకనే నెఱిగించినట్టియీా । గురుబోధ
పాత్రూల నెఱుగాక తెలిసేవు । తెలిసి
తా జనునూ । ఆపై మాట । పలికె దే ది కనూ ।

– శుద్ధ నిర్గుణ తత్వ కందార్ధదర్వులు 218వ కం.

తా॥ ఓ శిష్యుడా । ఇది పరిపూర్ణము, ఇది యెఱుక యని యెఱుగని అచల పరిపూర్ణ పరబయలునందు లేని యెఱుక తనకు తానే వచ్చి గురుశిష్య న్యాయముగా సంభాషణ చేసి పరిపూర్ణమును, యెఱుకను, ఈ రెంటిని యెఱిగి, యెఱుక తన లేమిని తెలిసికొని, తనకుతానే లేకపోవును. అటు తర్వాత నచల పరిపూర్ణ పరబయలు ఇట్టిది యని జెప్పువారు లేరు.

కం॥ స్థిరమగు పరిపూర్ణమున । స్థిరమగు యీా యెఱుక
నెఱుక దెలియు జగములన్ । యెఱిగిన దెఱుకే కద
స । ద్గురుకృపచే యెఱుక బోతె । గురుశిష్యు
లేరి । నోరెత్తాక । మరి వినరోరి । గురుని పాదము
లాన గురుతు లేనటువంటి । పరిపూర్ణ మొక
టుండు పలుకరా దట్లుంటె గురుశిష్యులేరీ ।
నోరెత్తాక । మరి విననోరి ॥

– శుద్ధ నిర్గుణ తత్వ కందార్ధదర్వులు 219వ కం.

తా॥ ఓ శిష్యుడా । స్థిరమైన అచల పరిపూర్ణ పరబయలును అస్థిరమైన యెఱుకను, యెఱుకనే యెఱుగునట్టి ప్రపంచమును యెఱుగునట్టిది యెఱుకనే కదా! సద్గురు కటాక్షముచే యెఱుక బోయిన యెడల, గురువును, శిష్యుడును యెఱుకతోనే లేకపోదురు. కనుక నీవు నోరు కదల్పక నేను చెప్పినది వినుము. సద్గురు పాదార విందముల సాక్షిగా గుర్తుయనెడి యెఱుక లేనటువంటి అచల పరిపూర్ణ పరబయలు మాత్రముండును. ఎఱుక లేనందున దాని నెఱుగునది గాని, ఇట్టిదని చెప్పునది గాని లేదని భావము.

కం॥ బయలెఱుకలు శిష్యునకున్ । దయతో గురు
డెఱుక జేసి తరువాతను సం। దియమేమి
లేకయెఱుకన్ । నయమున విడిపించు గురుడూ ।
నయశాలి గాదా । నీమదికి నాటేన లేదా ।

భయభక్తి । గురుసార్వభౌమూని సేవ ।
నిశ్చయముగా జేసితే జయమందెదవు, గురుడు ।
నయశాలి గాదా । నీ మదికిది నాటేన లేదా ॥

– శుద్ధ నిర్గుణ తత్వ కందార్ధదర్పులు 220వ కం.

తా॥ ఓ శిష్యుడా । సద్గురుడు సచ్ఛిష్యునకు అచల పరిపూర్ణ పరబయలును, యెఱుకను, ఈ రెంటిని వస్తు నిశ్చయముగా దయతో నెఱిగించిన తదుపరి ఈ సందియములు లేక అనాయాసముగా యెఱుకను విడిపింపజేయునట్టి సద్గురుడే ఉత్తముడు. ఈ విషయమును నీ మనంబున బాగుగా నాటించుకొని భయభక్తిచే దేశిక చక్రవర్తికి సేవలు సలిపితివేని యెఱుక తనంతట తానే లేకపోవును. జయప్రదము గల్గునని భావము.

కం॥ పది రెండక్షరములు గల పదముల మంత్రార్థమెరి
గి । సద్గురు కృపచే పదియారక్షరములు గల ।
యది యెట్టిదో తెలిసినేని । యతడే సద్గు
రుడూ యవి రెండెఱుగ । నతడేడీ గురుడూ
మొదటిది పరిపూర్ణమును దెల్పు నెఱుకాను ।
తదనంతరపుది బోధను జేయునివి
దెలిసి । నతడే సద్గురుడూ యివి రెండెఱుగ ।
నతడే డీ గురుడూ ॥

తా॥ ఓ శిష్యుడా । సద్గురు కరుణచే స్వచ్ఛమైన ద్వాదశాక్షరి మంత్రమును తెలిసికొని, షోడశాక్షరి మంత్రమును యెఱిగిన యెడల అతడే సద్గురుడని చెప్పతగును. ఈ రెండు మహామంత్రములు తెలియనివాడు సద్గురువు కాదు. ఎందుకనగా, మొదటిది ద్వాదశాక్షరి అచల పరిపూర్ణ పరబాహ్యమును సూచించును. రెండవదగు షోడశాక్షరి లేని యెఱుకను లేదని యెఱిగించునని భావము.

పరిపూర్ణము

కం॥ ఎఱుక తనకు దావిడిపో । దెఱుకను విడిపించ
లేరు యెవ్వరు ధాత్రిన్ । గురుడొకడు తప్ప ।
గురునకు పరిచర్యమొనర్చి బోధ పద్ధతి విని
నన్ ॥ తిరిగి రాని పద్ధాతిగనినన్ । పరిపూర్ణ
యెఱుక యేర్పరుచ నెఱుక లేక । హరిని ।
స్వప్నముగన్న । కరి మ్రగ్గినట్లవు । యీ పద్ధతి వినినన్ ।
తిరిగిరాని పద్ధతి గనినన్ ॥

– శుద్ధ నిర్గుణ తత్వ కందార్ధదర్పులు 131వ కం.

తా॥ ఓ శిష్యుడా । ఎఱుక తనంతట తాను విడిపోదు. ఈ జగములో సద్గురు మూర్తి తప్ప మరి యెవ్వరును ఎఱుకను విడిపించలేరు. ఆ సద్గురు మూర్తి ఆజ్ఞానుసారము ఆత్మ, అంగ, స్థాన, భావ శుశ్రూషల నొనర్చుకొనుచు అచల పరిపూర్ణ బోధ పద్ధతిని, మరల జన్మకు రాని క్రమమును యెఱుగవలయును. ఆ సద్గురు మూర్తి అచల పరిపూర్ణ పరబయలును, ఎఱుకను వేర్పాటు చేయుట వల్ల యెఱుక పోవును. ఎట్లనగా సింహమును కలయందు జూచిన యేనుగు నశించినట్లు, ఎఱుక నశించునని భావము.

కం॥ నేనెవ్వడనను జీవుడు । నేనే నేననున శివుడు ।
రెండనకన్ తానుండు నచల మివిటిని నేనెఱిగి
నను । పైది నేనెట్ల నేననకున్న తానెట్లనీ నీ ।
నేనన్న దాంట్లోదె నీ – నా ప్రసంగాము । తా నన్న
దాంటోనె తలపోయ వలెనిట్లు । నే నెట్లనీనీ ।
నేననకున్న తా నెట్లనీనీ ॥

– శుద్ధ నిర్గుణ తత్వ కందార్ధదర్పులు 132వ కం.

తా॥ ఓ శిష్యుడా । నేనెవ్వండనో నాకు తెలియదు యనువాడు జీవుడు. నేనే బ్రహ్మనని తెలిసినవాడు శివుడు. ఈ రెండును యనక యుండునది అచల పరిపూర్ణ పరబయలు. వీటిని తెలిసికొని నేనను ఎఱుకపోయిన యెడల అచల పరిపూర్ణ పరబయలు నేననీ, తాననీ యనదు. నేనను ఎఱుకయందే నీ యొక్క, నా యొక్క ముచ్చటలు. తానైన అచల పరిపూర్ణ పరబయలునందు నేనని

తాననే ఎఱుక పద్ధతులు లేవని తలంచుము అని భావము.

కం॥ తనువుతో వచ్చిన యెఱుకే । తనువును
తనువనుచు తనను తానని యెఱుగన్ ।
తనువును బాసిన మీదట । తననా దేహమును
రెంట్ని । తానెఱుగ దపుడూ । అది గనుక
తా లేనేలే దెపుడూ । అనుమాన రహిత । మిం దచ
లమున్నది, కంటే । తన మాట తలపోయ । తనకై
స్గ్గె । తనకు తా నెఱుగ దపుడూ । అది గనుక
తా । లేనేలే దెపుడూ ॥

తా॥ ఓ శిష్యుడా । శరీరముతో వచ్చిన ఎఱుక, శరీరమును శరీరమని, తనను తాను తెలిసికొనును. ఈ ఎఱుక శరీరమును విడచిన తరువాత, తనను, శరీరమును, రెంటిని తెలిసికొనదు. అందుచేతనే ఈ ఎఱుక ఎప్పుడు లేనిదేయని ఎఱుగుము. ఈ ఎఱుక సందేహ రహితముగా అచల పరిపూర్ణ పరబయలు ఉన్నదని ఎఱిగితే తన స్థితిని తెలిసికొనుటకు తానే సిగ్గుపడి తన్ను గాని, శరీరమును గాని, ఎఱుగ లేకపోవునని భావము.

యాజ్ఞవల్క్య జనక సంవాదము (సాక్షిత్వ నిరసన)

జనక మహారాజు జ్ఞానయజ్ఞమును చేయ సంకల్పించి బ్రహ్మవేత్తల నందరినీ ఆహ్వానించి ఆయజ్ఞారంభమున గోష్ఠి నిర్వహించెను. అంతట వారిలో నీవిధముగా సంవాదము కల్గెను.

సప్తవిధమేధ లేవని అశ్వలుడడిగెను. యాజ్ఞవల్క్యుడు వివరించెను. పండ, మేధ, శర్వ, శత్వ, గృహీత, శ్రౌతి, ప్రతిభయని బుద్ధి ఏడు విధములుగా నుండును.

1. పండ : అచల తత్త్వమును సూచన చేయగనే గ్రహించు బుద్ధి.

2. మేధ : గురుముఖతః శ్రవణముచేసిన దానిని మరువకనద్దానిని జ్ఞప్తియందుం చుకొను బుద్ధి.

3. శర్వ : పరిపూర్ణ పరబాహ్యము ఊహాపోహలచే నెఱుంగరానిదని గుర్తెఱిగి గురుమూర్తి కరుణకు పాత్రుడై, వారి వలన నిజతత్త్వమును తెలిసికొనునట్టి బుద్ధి.

4. శత్వ : సామాన్య, విశేష విషయములను చక్కగా గురుముఖతః నెఱుంగు బుద్ధి.

5. గృహీత : నేనే పెద్దననుకొనక పెద్దలు జెప్పెడి సూక్తులను ఏమరక వినునట్టి బుద్ధి.

6. శ్రౌతి : గురుసేవ, గురుభక్తి, గురునిష్ఠ కలిగి గురూపదిష్ట విషయములను చక్కగా ననుష్టించుచు, ఆచరణలో పెట్టు బుద్ధి.

7. ప్రతిభ : గురువు వలన శ్రవణము చేసిన విషయములను శ్రుతి, స్మృతి, అనుభవయుక్తముగా వినువారికి, తగిన విధముగా వారి వారి మనస్సులను హత్తుకొనిపోవునట్లు ప్రబోధ చేయగల బుద్ధి.

పై జెప్పబడిన సప్తవిధ మేధాసంపన్నుడగు మహానుభావుడినే బ్రహ్మవేత్తయని అందురు.

బ్రహ్మమెట్టిదనియు, దానినుండి బ్రహ్మాండ సృష్టి ఎట్లుజరిగెనని అశ్వలుడడిగెను. గుహ్యాతి గుహ్యమయినది. సూర్య భగవానుని నుండి తాను గ్రహించినది, అయిన అచల పరిపూర్ణ పరబాహ్యమును యాజ్ఞవల్క్యుడు వివరించుచున్నాడు.

ఇది సృష్టికి అతీతమైనది.

శ్రు॥ సర్వకాలే సదావ్యాప్తం సర్వదేశేషు వ్యాపితమ్ ।
నిష్కామం నిర్మలం శుద్ధం అచలం శబ్దం వర్జితమ్ ॥
తేజోంధకార రహితం బాహ్యం బ్రహ్మన సంశయః ।
సచ్చిదానంద రూపత్వం మాయా ఇత్యభిధీయతే ॥

అచలము శబ్ద వర్జితము; సర్వకాలములయందు అంతట వ్యాప్తమైనది; సర్వదేశములందు వ్యాపించినది; నిష్కామము, నిర్మలము, శుద్ధమైనది. తేజోంధకారములు లేని బయలే బ్రహ్మము. సచ్చిదానంద రూపమే మాయయని చెప్పబడును. అదియును గాక

శ్రు॥ ప్రజ్ఞాన హీన వాక్యాత్మా తత్వమస్యాది వర్జితమ్ ।

బ్రహ్మోఽహం భావహీనాత్మా అయమాత్మేతి వర్జితమ్ ॥

ఇది ప్రజ్ఞానమను వాక్యహీనమై యున్నది. తత్వమసి మున్నగు వాక్యములు లేనది, బ్రహ్మైవాహమను భావము లేనిది, అయమాత్మయను వ్యవహారము లేనిదగు కేవలాత్మను గురుమూర్తి ద్వారా దృఢనిశ్చయము చేసికొనినవాడు నేనే బ్రహ్మమమనెడి భ్రమను జెందడు. విసనకఱ్ఱ గాలికి పర్వతములు ఊగనట్లు చలించడు.

సృష్టి విధానము : పరాకాశమును ఉత్తమ పురుషుడనియందురు. దీనిని స్వయం ప్రకాశ బ్రహ్మమని కూడ చెప్పెదరు. దహరాకాశమును అక్షర పురుషుడు, సమిష్టి అంతఃకరణము, అవస్థాత్రయ సాక్షియని యందురు. నిరవయాకాశమును పరాప్రకృతి, సమిష్టి వ్యానము, సూత్రాత్మ, క్షర పురుషుడనియందురు.

అకార, ఉకార, మకార అర్థ మాతృకతో గూడిన "ఓం" అను ప్రణవశక్తియే సదాశివ నామమయ్యెను. అనగా నమశ్శివాయ యనే పంచ బీజములే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనెడి పంచభూతములయ్యెను. ప్రణవమునకు పైన గలది స్వప్రకాశము. దీనినే వృక్షమునకు ఊర్ధ్వ మూలము అని యందురు. మరియు క్రింది భాగమున అధోశాఖలు గల అశ్వద్ధ వృక్షము గలదనియందురు. దీనినే "విశ్వము" అనియు, "సంసారము" అనియు అందురు.

ఆర్తభాగుడు జగత్కారణుడైన ఈశ్వర లక్షణములను వివరించమనెను. యాజ్ఞవల్క్యుడు తెల్పెను. ప్రణవమందుద్భవించిన నమశ్శివాయ యను పంచ బీజములతో పంచభూతము లేర్పడెను. ఎట్లనగా, నకార బీజము వలన పృథివి, దానియందు గంధమేర్పడెను. మకార బీజము వలన జలము, దానియందు రసమేర్పడెను. శికార బీజము వలన అగ్ని, దానియందు రూపమేర్పడెను. వకార బీజము వలన వాయువు, దానియందు స్పర్శయేర్పడెను. యకార బీజము వలన ఆకాశము, దానియందు శబ్దమేర్పడెను. పృథివియే ఈశ్వరుని యొక్క పాదములుగాను, జలమే కటి ప్రదేశముగాను, అగ్నియే హృదయముగాను, వాయువే కంఠస్థానముగాను, భూతాకాశమే శిరస్సుగాను, సూర్యాకాశమే అంతః కరణముగాను నిర్ణయమైనది. ఇదియే విశ్వాభిమానియగు ఈశ్వరుని ఆకారము అని వివరించెను.

ఆర్తభాగుడు జీవుడేర్పడిన విధమునెఱిగింపుమనెను. యాజ్ఞవల్క్యుడు చెప్పదొడగెను. ఈశ్వరుని శిరస్సనబడు ఆకాశము యొక్క అవకాశము వలన జ్ఞానము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనునవి వరుసగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివిల అంశముల వలన గలిగెను. అట్లు వాయువు వలన పంచ ప్రాణములు, అగ్నివలన పంచ జ్ఞానేంద్రియములు, జలము వలన పంచ విషయేంద్రియములు, పృథివి వలన పంచ కర్మేంద్రియములు యేర్పడెను. అంతఃకరణము, అంతఃకరణ అధిష్టాన చైతన్యము, ప్రతిబింబము కలిసి జీవుడయ్యెను. మాయ, మాయాధిష్టాన చైతన్యము, చైతన్య ప్రతిబింబము కలిసి ఈశ్వరుడని యందురు.

శ్లో॥ సమతామై షభూతేభ్యస్తానే వాను విన్యతి ।

వినష్టిమితి మైత్రేయై యాజ్ఞవల్క్య ఉవాచహి ॥

జీవుడు పంచ భూతమయమగు అంతఃకరణమనెడియుపాధి వలన జీవత్వాభిమానముతో స్వప్నరూపముగా శూన్యమొందుచుండును. మరియు,

శ్లో॥ జగద్భ్రమస్య సర్వస్య యథాధిష్ఠానమీరితం ।

త్రయంతేషు తదత్రస్యాద్బ్రహ్మ శబ్ద విచక్షితం ॥

సకల జగత్కల్పనకాధారభూతమై, అనేకమై, వ్యాపకమై యాచైతన్యమే "అహం" "నేను, నేను" అను బ్రహ్మ శబ్దార్ధముతో మాయా జీవేశ్వర స్వరూపమయ్యెను.

శ్లో॥ మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితం ।

మయి సర్వలయం యాంతి తద్బ్రహ్మ ద్వయమస్మ్యహం ॥

స్థూల సూక్ష్మ కారణ మహాకారణ దేహములున్ను, వాని అభిమానము లున్ను, ఆ ఎఱుకనుండియే యేర్పడెను. పుట్టినవి యనుట భ్రాంతియే. మాయా భ్రాంతులకతీతమైనదే. అచల పరిపూర్ణ పరబాహ్యమని సెలవిచ్చెను.

భుజ్యుడు అను గురుపుత్రుడు సృష్టి, దాని కర్తృత్వమును విశదీకరించ

మనెను. యాజ్ఞవల్క్యుడు చెప్పెను. స్వప్రకాశమైన చేతన బ్రహ్మమందు అక్షరపురుషుడేర్పడెను. 84 లక్షల జీవోపాధులకు కూటస్థుడీ యక్షరుడు మరియు ఉపాధులందు వ్యానవాయువాకారమే క్షర పురుషుడని యందురు. వీనికి విలక్షణముగా సాక్షి స్వరూపముగా నుండు వాడే పురుషోత్తముడు. కాని అక్షరునికి, పురుషోత్తమునికి బేధము లేదు. అతనిని తెలియుటకు బ్రహ్మపాద చతుష్టయములో అకారము అవిద్యాపాదముగను, ఉకారము విద్యాపాదముగను, మకారము ఆనంద పాదముగను, అర్ధమాతృక తుర్యపాదముగను గుర్తెఱుగవలెను మరియు అకారము అవిద్యాపాదమును సదాశివునిగను, ఉకారము విద్యాపాదముగను పరాప్రకృతిగను, మకారము ఆనందపాదమును అక్షరపురుషుడు గను లేక సూత్రాత్మగను, అర్ధమాతృక తురీయ పాదమును అధిష్ఠానముగను లేక పురుషోత్తమునిగను తెలియుము.

ఈ విధముగా యాజ్ఞవల్క్యుడు సమాధానము జెప్పుచు, ఉపస్థుడు, కపోలకుడు, గార్గేయిలకు చతుర్వేదములుద్భవించిన విధము, గాయత్రి మంత్రము ఏర్పడిన విధము వేదాతీతమైన పరిపూర్ణ బోధ నెఱింగించెను.

అనంతోపనిషత్తు సారాంశము

చతుర్ముఖుడు అచలపరిపూర్ణ బ్రహ్మ ప్రతిపాదితముగా "త్వమేవ తుర్యాతీత, త్వమేవ అనంతోపనిష ద్విమృగ్యః" అని శ్రీమన్నారాయణుని గూర్చి చెప్పి యున్నాడు; అనగా "నీవే తుర్యాతీతుడవు, నీవే అనంతోపనిషత్తు చేత అన్వేషింపబడెడి వాడవు" అని యీ అనంతోపనిషత్తునందు అవాంగ్మానసగోచర పరిపూర్ణ అచల పరబ్రహ్మ స్థాపనము చేయుచు, "బాహ్యమేవ బ్రహ్మమ్, సర్వపరిపూర్ణమేవ శివమ్, సర్వనాస్తీతి నిశ్చయమ్, బ్రహ్మ విశ్వద్వయం మిథ్యా" – ఇత్యాది విషయోత్కృష్టములు బాహాటముగా బోధించబడుచున్నవి. ఈ అనంతోపనిషత్తు అధర్వణ వేదతైత్తిరీయ శాఖతో జేరి మహానారాయణోపనిషత్తు యంతర్భూతమైయున్నది.

పరమేశ్వరుడగు దక్షిణామూర్తి చతుర్భుజునకు ద్వాదశ, షోడశ తత్త్వాతీతమును బోధించి, ఇంకను ఆ మంత్రార్ధములను విపులముగా చెప్పుచున్నాడు.

అచలమే సత్యమైనది. అది నిరంజనము, నిర్వికల్పము, పరాత్పరము, బయలు. దానిని స్వానుభవము చేత నెఱుగవలెను. దీనికి వ్యతిరిక్తమగు విశ్వ సంబంధమైన జ్ఞానము చేత భ్రాంతియే వృద్ధి పొందును. తత్త్వాతీతమగునిట్టి జ్ఞానము చేతనే జన్మ రాహిత్యము గలుగును. ఏది సర్వమున కతీతమైనదో, ఏది గురు పారంపర్యము వలన బోధింపబడుచున్నదో, ఏది సచ్చిదానందాతీతమై యున్నదో అట్టి పరవస్తువు భక్తి, జ్ఞాన, సత్కర్మల వలన తొలుత ప్రకాశింపబడి, భ్రాంతి విడచిన పిదప ఏమీ లేదు. బ్రహ్మాండము బయలు చేత వ్యాపింపబడి యున్నది. ఆ బయలే సర్వత్ర వ్యావృతమైనది. జ్ఞానియగు వాడు యిట్టి అంత ర్బాహ్యములందు నిస్సందేహముగా అచలుడే యగుచున్నాడు. అచలమునకు సద్రూపము లేదు; చిద్రూపము లేదు; ఆనంద రూపము లేదు. అది నిరంతరము అచలమైయున్నది. ఈ అచలము మనోవాచా మగోచరము. కర్తయును, కార్యమును గానట్టిది; ఆనందాతీతమైనట్టి సనాతనము.

అవాంగ్మానసమగు అచలము ఒకటి గాదు, రెండునూ గాదు. విద్యావిద్య వర్జితము. బంధాబంధాది రహితము. ఎల్లప్పుడు నాశరహితమైయున్నది.

సూక్ష్మాత్సూక్ష్మతరము గాక, మహత్తు కంటె మహత్తని గాక నిర్దేశింపరానిది. తెలిసికొనుటకు గాని, తెలుపుటకు గాని, పొందుటకు గాని సాధ్యము గాదు. పరమాకాశమైనదియు, చలనముకానిదియు, నిరంతరము పరిపూర్ణముగా నిండినదియు, విడచుటకు సాధ్యము గానిదియు, ఆవరణము లేనిదియు, ఇట్టిదని నిర్దేశింపవీలు లేనిదగుచు శాశ్వతమైయున్నది. ఇట్టి అచలమే వ్యవహారార్ధమై బయలనియు, బ్రహ్మమనియు, నిశ్చయింపబడినదై యున్నది.

ఏది ప్రకృతి కంటె పరమైయుండునో, అదియే పరమున్నూ, పర శివమున్నూ అగును. ఆ శివమునకు వేరగునట్టి సర్వమున్ను భ్రాంతి జన్యము. అట్టి భ్రాంతిన విడచిపెట్టి సర్వమున్ను లేదు అనెడి అభిప్రాయము చేత స్వయం ప్రకాశము గానిదియును, ఆధారము లేనిదియును అగు పరిపూర్ణమును నిశ్చయింపదగును.

కోతికి కొమ్ములు ఎట్లు లేకున్నవో, యట్లే చూచువాడు గాని, చూపు గాని, చూడబడు విశ్వముగాని లేనిదేయగును. ఇది సత్యము.

గొడ్రాలి బిడ్డ వలె (బ్రహ్మాస్మ్యహం) నేను బ్రహ్మమైతిని అనెడు భ్రాంతి లేదు. రాత్రి కాలములో చీకటి మిక్కిలి ప్రకాశించును అనెడి భ్రాంతి వలె విశ్వము యొక్క యునికి భ్రాంతి చేతనే యేర్పడినది. సూర్యకిరణములందు మంచు కలదనుట యెట్లు సంభవము గాదో, అట్లే విశ్వము యొక్క యునికిన్ని యసత్యము. అగ్నియందు రసగంధాదులు ఎట్లు లేవో, జలమునందు కాఠిన్యత ఎట్లు లేదో, రెల్లు కొనయందు మదించిన దున్నపోతు విహరించుటయనునది ఎట్లు పొసగదో, అట్లే విశ్వస్థితియు భ్రమ చేత పొసగును గాని, నిశ్చయములో పొసగజాలదు.

కనుక యీ జగత్తును, చూచెడి చూపును, చూచెడి వానిని, ప్రాపంచిక విషయవాసనలను త్రోసిపుచ్చవలెను. ఆత్మ, దేహ, ప్రాణాదులు, వర్ణాశ్రమ ధర్మాదులు ఏమీ లేదని విశ్వసించి, సత్యమగు బట్టబయలే బ్రహ్మమని నిశ్చయింపదగినది.

లోకులు జ్ఞానమును, ఆనందమును బ్రహ్మమని చెప్పెదరు. కాని జ్ఞానము భ్రాంతి మూలమే గాని అన్యముగాదు. జ్ఞానానందములు సైతము భ్రాంతి జన్యములు.

జ్ఞానాత్యం జాయతానందం! ఆనందం భ్రాంతి లక్షణమ్
సత్యజ్ఞానమనంతంచ మాయా గణమితిశ్రుణు
జ్ఞానమానందగం నాస్తి ఇతి వేదాంత నిశ్చయః

జ్ఞానము (ఎఱుక) వలన ఆనందము కలుగుచున్నది. అట్టి ఆనందము భ్రాంతి లక్షణము. సత్యజ్ఞానానందములు మాయాగుణ సంబంధములనియే తెలిసికొని నిశ్చయ స్థితిచే చూడగా జ్ఞానానందములు లేవనియే వేదాంత నిశ్చయము.

సముద్రమునందు అలలు, నుఱుగ, బుడగలు మొదలుగునవి నిరంతరము పుట్టుచు, వేర్వేరుగా గనబడి, నామరూపములు బొంది, ఆ సముద్రమునందే లయమగుచున్నవి. అట్లే స్థావర జంగమాత్మకమైన సమస్తములగు చరాచరములను, అట్లే స్థితిలయములును బొందుచుండును.

"బయలు" నడుమన పుట్టిన ప్రపంచమంతయు "బయలు" నడుమననే నశించుచున్నది. సముద్రమునందు చేపలు, మొదలైన జలచరములు ఎట్లు పుట్టుచు, సంచరించుచూ, నశించుచుండునో అట్లే విశ్వ సముదాయమంతయు వానికవే పుట్టచు, వృద్ధి చెందుచు, లయించుచున్నవి. ఆ బయలునకెట్టి సంబంధము లేక అవ్యయమై స్థిరముగానున్న సముద్రమునందు ముంచబడిన ఘటములలోపలను, వెలుపలను సముద్ర జలమే యున్నట్లును, మరియు ఖాళీగా నున్న ఘటముల లోపల, వెలుపల ఆకాశమెట్లు ఆవరించియున్నదో, అటులనే అచలపరిపూర్ణ బ్రహ్మము అంతర్బహిర్భాగముల యందంతటను నిరంజనమై యున్నది. ఈ బయలుకంటె అన్యమైన జ్ఞానమనెడి ఎఱుక బొత్తిగా లేనిదని నిశ్చయించదగినది.

ఈ విధముగా చెప్పబడిన ప్రపంచాదులు దేనియందుద్భవించుచున్నట్లు తోచుచున్నదే గాని దానియందే లయించుచున్నట్లు తోచుచున్నది గాని, దానికి కారణము గాని, మూలముగాని లేదు. ఇదియే సర్వ విధముల చేతను సత్యమని యెఱుగవలెను.

సమస్తము బయలనుటయే నిశ్చయము గాని, అంతర్బాహ్యములనెడి భేదములు లేనే లేవు. దీనిని దెలియుటకు కర్మధర్మాది వర్తనములతో నిమిత్తము లేదు. అట్లు నిర్గుణము, నిశ్చలము, బాహ్యము, సర్వకాల స్థితమగు పరబ్రహ్మము నిరంతరము సకల దేవతల చేత నమస్కరించబడుచున్నది. అట్టి పూర్ణమైన అచల బ్రహ్మమునకు జాగ్రత్త, స్వప్న, సుషుప్తి, తురీయము, తురీయాతీతములనెడి పంచావస్థలు లేవు. శరీరత్రయ ధర్మములు లేవు. ఎట్టి జ్ఞానాజ్ఞానములు లేవు.

ఆ పరిపూర్ణ బ్రహ్మమొక్కటియే సర్వకాలమందు సమస్త ప్రదేశములందు వ్యాపించి, నిర్వికల్పమై, నిర్మలమై, శుద్ధమై, శబ్ద రహితమై, అచలమైయున్నది. ప్రకాశ, అంధకారములనెడు ద్వంద్వమున కతీతమైన యా బాహ్యమే పరబ్రహ్మము. ఏ7ది సచ్చిదానంద రూపత్వమగునో అది మాయయనియే

చెప్పబడును. ఇందులో సందేహము లేదు.

జనన మరణాదులు గాని, జ్ఞానము గాని, విశ్వము యొక్క స్థితిగతులు గాని, వీనికి ఆధారమగు కారణముగాని యెన్నడును లేదు. అనగా కారణము, జ్ఞానము అనబడు వానితో సహా సమస్తము మిథ్య.

దీనికి సాక్షి లేదని నిర్ణయము. ఆ బాహ్యమే బ్రహ్మమని కూడా నిర్ణయము. ఈ పరతత్త్వమును గూర్చి కారణముగా ఎంత వివరించినను, అది ఎఱుకయనెడి మాయయు, అజ్ఞానముతో సమానమునైయున్నది గాని, పరతత్త్వము నిజమునకు అచలము.

బ్రహ్మ, ప్రపంచములనెడు ద్వంద్వము సైతము మాయయేయని నిశ్చయము. శిష్యుడను విషయము, గురువను విషయము, గురుశిష్య రూపముగా నేర్పుచున్న జ్ఞానము అను విషయము, ఇవియన్నియు ఎన్నడును లేదు. ఎవరి యొక్క బోధనొందిన మాత్రముననే జ్ఞానము, అజ్ఞానము అనెడి ద్వంద్వము నశించునో అట్టి పరిపూర్ణ సద్గురువు యొక్క ఉపదేశము వలననే నిజమైన జన్మరాహిత్యము.

గురూపదేశము చేతనే పొందదగిన యిట్టి జననరాహిత్యమును ఏ యొక్క ఆశ్రమము వలన గాని, ఏ సాధన వల్ల గాని వీలు గాదు. కారణ ఎఱుకను, బ్రహ్మ ఎఱుకను, జ్ఞానమనెడి ఎఱుకను, యిట్టి సకల యెఱుకలను విడచుటయే జన్మ రాహిత్యము; ఎందువలననగా నివియన్నియు లేనెఱుకలే.

సర్వసార పూర్ణోపనిషత్ సారము

ఆ పరబ్రహ్మమును గూర్చి ఎంత తెలిసిననూ, తెలిసినదంతయూ భ్రాంతియే. కనుక భ్రాంతి దొలగి, తాను లేకుండా పోవుటకు మార్గము కావలెను. ఇట్టి భ్రాంతిని తొలగించమని విష్ణుమూర్తి శంకరుని కోరుటయు, శంకరుడు వివరించుటయు, యీ సర్వసార పూర్ణోపనిషత్తు యందలి విషయము.

శంకరుడు వివరించుచున్నాడు :

శరీర త్యాగానంతరము జ్ఞాన సముపార్జన కవకాశము లేదు. ఈ విశ్వాండమంతయు పూర్ణ శుద్ధ పరబ్రహ్మముచే వ్యాప్తిగానున్నది. ఈ పరిపూర్ణతత్త్వము లోపల, వెలుపల నిండియున్నది. "పూర్ణాత్ అన్యతరమ్ నాస్తి". ఈ పూర్ణము కంటె ఇతరమైనది లేదు. అట్టి శుభప్రదమైన పూర్ణ బ్రహ్మతత్త్వమును ఉపాసించెదము గాక !

"నేతినేతీతిశేషితం పూర్ణముచ్యతే". ఇదికాదిది కాదు, అనగా, ఏది మిగులునో దానిని "పూర్ణము" అందురు. స్థూల సూక్ష్మ కారణ, మహాకారణ శరీరములు కాదన్న తరువాత మిగిలినదేదో అదే "పూర్ణము".

"పూర్ణస్యపూర్ణ మాదాయ పూర్ణమేవా వశిష్యతే" నిండియున్నదానినుండి, నిండియున్నదానిని తీసిన యెడల పూర్ణమే మిగులును. "ఆ పరబ్రహ్మ తత్త్వము" జగత్తునందు లోపల, బయట వ్యాపించియున్నది. ఈ విశ్వమంతయు జీవబ్రహ్మమయము. శుద్ధ పరబ్రహ్మతత్త్వమును ఏ "మాయ" బాధించదు. శుద్ధ పరబ్రహ్మ తత్త్వము వలన ఆ పరబ్రహ్మతత్త్వమే విశ్వముగా ప్రకాశించుచున్నది.

పూర్ణాత్ పూర్ణం ప్రకాశతే ! పూర్ణేణ పూరితం సర్వం ! ॥

దేహములోపల వెలుపల ఆకాశమంతయు పరబ్రహ్మతత్త్వమే నిండి యున్నది.

"ఆదిపూర్ణమ్ అంత్యపూర్ణమ్ మధ్యపూర్ణమ్ సంపూర్ణకం"

పూర్ణ పరబ్రహ్మతత్త్వము ఆది మధ్యాంతములయందు నిండియున్నది. ఆద్యంతములయందు నిండియుండి, ములుగ్రుచ్చ సందు లేక యున్న అచల తత్త్వమే మూలము గురించిన విచారణలో చివరకు మిగులునది. పరాకాశము పరిపూర్ణమైయున్నది.

శుద్ధపూర్ణతత్త్వము నిరాధారమైనది. భావము చేతగాని, వాక్కు చేత గాని దీనిని దెలిసికొనలేము. ఇది ద్రష్ట దర్శన వివర్జితం. ఈ అచలతత్త్వము పూర్ణము కంటె పూర్ణమైనది. పరమైనదానికంటె పరమైనది. సర్వ కారణ హీనమైనది. మిక్కిలి శుభప్రదమైనది. ఈ అచలతత్త్వము మహా వాక్యములకు అతీతమైనది. ద్వైతాద్వైతములు లేనిది. ఆభాస విహీనమైనది. ఖండ ఖండములు లేనిది. ఆత్మ శబ్దార్థ విహీనమైనది. అనిర్వచనీయమైనది. చీకటి వెలుగులు లేనిది.

దృశ్యమాన ప్రపంచమంతయు అసత్యము. శూన్యము కూడా లేదు. సాక్షి హీనమైనది. ద్వంద్వ హీనమైనది. ఆత్మ లేనిది, దేహము లేనిది, నిర్మలమైనది యీ అచల పరిపూర్ణ పరబ్రహ్మ తత్త్వము.

"ద్వంద్వహీనం సదాబాహ్యం ! సాక్షి హీనంచ సర్వదా
తమశ్శూన్యం ప్రభాశూన్యం ! ఆత్మశూన్యం అనామయం
నిర్దేహం నిర్మలం పూర్ణ తల్లింగ మచలం భవేత్ "

"మాయా వందితం బాహ్యం తధ్యానంకురు సర్వదా యావత్ పశ్యేఖగా కారమచింతయేత్"

ఈ బాహ్యమంతా మాయతో నిండియున్నది. బాహ్యమైన నమస్కారాదిక మంతయు మాయయే. ఈ విషయమును ఎల్లప్పుడూ ధ్యానించవలెను. ఎంత వరకు యే యే దేవతాకృతులను నీవు దర్శించెదవో, అంతవరకు ఆ దేవతా మూర్తులనే ధ్యానింపవలసినది.

ఈ అచలత్వము వ్యోమాతీతమైనది. సర్వకారణ రహితమైనది. నిరంజనమైనది, అనగా మాలిన్యము లేనిది, నిరపాయమైనది, అనగా యెడబాటు లేనిది. దేహరహితమైనది, ధృఢమైనది.

"వ్యోమాతీత మిదం బాహ్యం ! సర్వకారణ వర్జితం !
నిరంజనం, నిరపాయం ! నిర్దేహం ! అచలం ధృవం"

"తదేవలింగ ఇత్యుక్తం" అనుట వలన అదే లింగమని చెప్పబడినది. అట్టి లింగమని చెప్పబడినది అచలత్వమే. దానిని 'శివం' అని అందురు. శివమునకు మించినదేదియును లేదు. "శివాద్బాహ్యం నకించన" అని, "శివాదన్యమితిర్నాస్తి త్రిలోకేషు నిశ్చితం" అనుటలో త్రిలోకములయందు శివుని (పరిపూర్ణము) కంటె అన్యమేమియు లేదు.

"దృష్టా, దృశ్య అను ద్వంద్వ భావమే బంధహేతువు"

"దృష్టా భావేకుతో భయం" అన్నారు. ద్రష్టయే లేనప్పుడు భయమెక్కడిది? సర్వేంద్రియ వినుర్ముక్తమైన జ్ఞానము యెచ్చట లయమగుచున్నదో, అక్కడ జ్ఞానమును కూడ విసర్జించవలసియున్నది. అదే సమాధి.

"సర్వేంద్రియ వినిర్ముక్తం ! జ్ఞానం యత్ర విలీయతే
తత్ర జ్ఞానం విసృజ్యేత! సమాధిః తస్య లక్షణమ్"

ఆత్మను పరాకాశ స్థితికి జేర్చుటయే సమాధి. ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మలున్నవను భావమును పరిత్యజింపుము. జ్ఞానము లేదు; జన్మయు లేదు.

జ్ఞానదృష్టిచే అజ్ఞానమును దొలగించుకొని, పిదప యా జ్ఞానమును కూడా విసర్జింపవలెను. సర్వమూ భ్రాంతిమయమే గనుక ఏదియూ నీకుండరాదు. మిగులుచున్నది అచల పరిపూర్ణ పరబ్రహ్మతత్త్వమే.

విద్య-అవిద్య, క్షరము-అక్షరము, బంధము-మోక్షము అను ద్వంద్వములను విసర్జించి, నిరహంస మార్గమున నిర్మలుడవగుము. జ్ఞాన - అజ్ఞాన ఆవరణమును విచ్ఛిన్నము జేసి, నిరహంకార స్థితిని బొందుము. అనావరణ స్థితిని బొంది, జీవేశ్వర భావమును విసర్జింపుము. నిర్వికార నిర్దేహ బోధను పొంది సర్వకాల సర్వావస్థలయందు అహంభావమును విడచి, విహిత కర్మాచరణము జేయవలెను. నేను బ్రహ్మమును అను భావమును గూడ విసర్జించి, అహంకార రహిత స్థితియందు ప్రవేశింపుము.

"మూలా భావమిదం జ్ఞాతుం" "నశరీరం నకిమస్తి" అసలు యీ శరీరమే లేదు. ఇంకేమున్నది. ఈ గుర్తెఱిగే దానికి మూలం లేదు. "మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు."

పరాకాశం మిగిలియున్నది. పరాశక్తికి ఉత్పత్తి స్థానము పరమశివుడు. ఆ పరమశివుని నిరాకాశముతోను, పరాశక్తిని పరాకాశముతోను పోల్చవచ్చును. చీకటి వెలుగులొకచోట నిశ్చయముగా జూడలేము. అట్లే ప్రకృతి పురుషులును. కాని యీ ఆత్మ ప్రకృతి పురుషులకు, కూటస్థులకు అతీతమైనది.

నేను నిత్యుడను పరిపూర్ణుడను, నిర్వికారుడను, పేరు లేనివాడను.

బహిరంతరములందు ఆత్మ తత్త్వమును అచల పద్ధతిలో ధ్యానించుచూ, జ్ఞాతృ, జ్ఞానములను పరిత్యజింపుము.

"తద్భావరహితం పూర్ణం ! అష్టవర్ణ వివర్జితం !
షడ్వర్గ రహితం పూర్ణం ! షట్కోశరహితం సదా!"

జ్ఞానమును, విశ్వమును విసర్జించి, ఆత్మ తత్త్వమును ధ్యానింపుము. ప్రకృతి పురుష ద్వయము లేదు.

"ఏకం నాస్తి ద్వయం నహి ! బాహ్యమభ్యంతరం నాస్తి"

ఇది సత్యం. ఈ విశ్వమునకు కర్త, కారణములు లేవు.

"అనుత్పన్న మిదం జగత్" అసలు యీ జగత్తే ఉత్పన్నముగా లేదు.

"జ్ఞాన మధ్యే జగద్భ్రాంతి ! పూర్ణ మధ్యే జగన్నహి"
"జ్ఞానాదికం సర్వనహి ! జ్ఞానం నాస్తీతి నిశ్శంకః ॥

జ్ఞానము మొదలైనవి లేవు. పరిపూర్ణములో జగత్తు లేదు. భావాతీత స్థితియందు దృష్టిని కేంద్రీకరించి నిర్వికార స్థితిని బొందుము.

"నర శృంగేణ చ ఆకాశం భిద్యతే జగదస్థిచ"

మనిషి కొమ్ముతో ఆకాశమును జీల్చుట ఎంత నిజమో, యీ జగత్తు అంత నిజము. గగనారవిందమువలె, రాతి తాట తీసి తాడు పేనుట వలె, మేడి చెట్టు పూలవలె, చెఱకు పండ్ల వలె, జగత్తున్ను భ్రాంతియే. కనుక నశించునది, నశించనిదియను భేదాభేదములు లేవు.

మాయకు కారణము లేదు. గురు శిష్యులిద్దరును లేరు. అపుడు ఉపదేశమెట్లు సంభవము? క్షరాక్షరములు లేవు. ఇక వదలవలసినదియేది? గ్రహించవలసినది యేది? ఉన్నదేది? లేనిదేది? సాధించవలసినదేది?

ఈ సమస్తము పరబ్రహ్మ తత్త్వము చేత ఆవరింపబడియున్నది. శూన్యా శూన్యములు, పూర్ణాపూర్ణములు, బ్రహ్మమాయాద్వయము, యిట్టివేవియు లేవు. అచల తత్త్వము మాత్రమే అంతటా నిండియున్నది.

కనుక కార్యకర్తృత్వములు లేవని దెలిసికొని యా భావమును కూడా విసర్జించి తూష్ణీభావముతో నుండవలెను. ఎక్కువ మాట్లాడుట నిరర్థకము. ఈ

అర్ధవంతమైన సర్వసార పూర్ణోపనిషత్సారము గురుకృపచే అవగతము కాగలదు. వెన్వెంటనే భ్రాంతి దొలగును. ఈ విధముగా మూలంలేని యీ గుర్తెఱిగే శరీరమును, ఎట్టి లవలేశ ఎఱుకయు మిగిలియుండక విడువవలెను.

ద్వాదశి, షోడశి

(అనంతోపనిషత్)

ఈ అనంతోపనిషత్ అన్ని వేదములకు, ఉపనిషత్తులకు అతీతమైనది. "అయం వ్యర్థ బాహ్యకోపీ నభవతి" – ఇది ద్వాదశాక్షరి, అవాంగ్మానస గోచరము, మాయయని గాని, చైతన్యమని గాని, ఆత్మయని గాని, ఆకాశమని గాని, ఆవరణమని గాని నిర్దేశించుటకు వీలులేనిది. ఇదియే అచలము, సత్యము, నిరంజనము, నిర్వికల్పము, పరిపూర్ణ పరబాహ్యము.

శ్రు॥ అతశ్శివ ఏవ సనాతనం । బ్రహ్మ భగవానచల ఏవసత్యం
నిరంజనం నిర్వికల్పం । నీ రంధ్రం చ పరాత్పరం ॥

ఇది అవాంగ్మానస గోచరమైనది, ద్వైతము గాదు, అద్వైతము గాదు, ధర్మము గాదు, మోక్షము గాదు, నరకము గాదు. అమృతమయమును శాశ్వతమునైయున్నది. కావున

శ్రు॥ ద్వైతాద్వైతవిహీనం చ ధర్మాధర్మ వివర్జితం
బంధాబంధాది రహితం అమృతం నాస్తి సర్వదా ॥

"మూలాభావమిదం జ్ఞాతుం నశరీరం నకిమస్తి". ఇదియే షోడశాక్షరి.

శ్రు॥ ఇంద్రజాలమిదం సర్వం యథా మరుమరీచికా
అఖండిత మనాకారం వర్తతే కేవలం శివం ॥

ఇంద్రజాలమయమైన సమస్త ప్రపంచము నిర్జల భూమి యందు ఎండమావుల వలెనే పరిపూర్ణమను నిరాకారమును మంగళ స్వరూపమునగు అద్వితీయమైన అచల పరిపూర్ణ బ్రహ్మమునందు దోచుచున్నది.

శ్రు॥ శుద్ధే సుషుప్తా వివచ తస్మిన్నాహం కదాచన
తద్వత్సదాపి యస్యాస్తి ప్రపంచనాస్తి తస్యవై॥

సుషుప్త్యాది యవస్థలయందుండెడు నేను, యెప్పుడును లేనని తెలిసికొనుచున్నారో వారే యీ చూడబడెడు ప్రపంచమును కూడ నిర్మలమైన పరిపూర్ణమందు లేనిదని గ్రహింతురు. దీనికి దృష్టాంతము :

శ్రు॥ స్వప్నే ప్రతీయ మానాని రూపాణిచ యథాతథా ॥

అనగా కలలో దోచిన శరీరములు ఏలాగు లేవో అలాగే ఎఱుక లేదు. ఇక ద్రాష్టాంతము :

శ్రు॥ కర్పూర దీప సంయోగం జ్యోతి రూపం యథాతథా ॥

అనగా కర్పూరము కళికతో కూడిన యేలాగు వెలిగిన జ్యోతి లేదో, అలాగే కనబడెడి ఎఱుక లేదని ద్రాష్టాంతము. దీనిని నిదుర వచ్చు వరకును, నీవు చచ్చువరకును మరువకుము.

పంచశిఖి జనక సంవాదము

జనక మహారాజు సమస్త రాజ్య కుటుంబ భారమును మోయుచున్నను అశరీర వర్తనుడు. ఎన్ని వేదాంత గోష్టులు జరుగుచున్నను ఆతని మిగిలిన సందేహములు కొన్ని పంచశిఖి మునీంద్రుల వారి ద్వారా ఈ క్రింది విధముగా దీరినవి.

1. ప్రశ్న : ఈ జగము లేదని చెప్పిరి. కంటికి కనబడే యీ జగమెట్లు లేదు?

ఉత్తరము : జగము కలలో దోచెడు భ్రాంతి గాని అన్యము గాదు. స్త్రీతో కూడినట్లు కల వచ్చిన, యింద్రియస్కలనము జరుగుచున్నది కదా! నిజముగా స్త్రీ యున్నదా? కనుక కన్పించునంత మాత్రమున నిజమని భావించరాదు. మేలుకొంటే ఏమీ లేదు. అట్లే గురు వాక్యము చేత మేల్కొనిన ఈ జగము లేదు.

2 (ప్ర) అశరీరులున్నారందరు. అశరీరిని గుర్తించుట ఎలా?

ఉ) అశరీరులకు "నేను, నేను కాదు" అని ఏమీ ఉండవు. వారికి అహంకారము ఉండదు. అశరీరిని కనిపెట్టుటకు అశరీరులే సమర్థులు, సశరీరుల వల్ల కాదు.

జన్మజన్మలకు సంసారము గన్పించును గాని, అశరీరి అయిన గురువు కన్పించదు.

3 ప్ర) జనన మరణ రహస్యమేమి?

ఉ) గుట్టు తెలియక దానితో కూడియుండి యిట్టిదని చూపుటకు యేమి లేదు. అది పంచభూతములు గాదు. గుర్తెఱిగే శరీరము గుర్తు కాదు.

4 ప్ర) పునర్జన్మ ఉన్నదా? ఈ జన్మలు ఎడము లేకుండా వున్నవన్నది నిజమా?

ఉ) ఈ మాట గురుబోధ తెలియని శాస్త్రవాదులు అనేది. నిజగురువు విత్తాపహారుడు కాదు, చిత్తాపహారుడు. శరణన్న శిష్యవరునకు కరుణించి సాంఖ్య తారకములను బోధించి "గురి'' చూపినవాడే బోధగురువు. ఇతరులు బాధగురువులు. గురువే దైవమని గురువే పరతత్త్వమని గురి నిల్పి పరిపూర్ణమును శోధించిన నరుడే నారాయణుడు. దేహమనే తెఱను దీసే గురువు జన్మకర్మల దాటించగలడు. గురునిచే శరీర భ్రాంతి తొలగి నదులు సముద్రములో కలియునట్లు బ్రహ్మైక్య సంప్రాప్తి పొందును.

5 ప్ర) "అది" నీవైయున్నావు అని అందురు. అది ఎట్లు?

ఉ) నీవది, నేనది అనగా అది అహంకారమే. కనుక మాయ తెఱను తొలగించు. అది నీ దేహమని అనకూడదు. ఇది చీకటి వలె చూడగ ఏమీ లేదు. అది అఖండము, స్వప్రకాశము. సముద్రములో తరంగమువలె బ్రహ్మమందు మాయచే నేర్పడిన తనువులు.

6 ప్ర) బ్రాహ్మణులే మోక్షానికర్హులా? బ్రాహ్మణ భావన ఏ విధము?

ఉ) లేని తనువులు ఎన్నడు లేకయున్నవారే (అశరీరులు) బ్రాహ్మణులు. ఇది కులమతాల వల్ల కలుగదు. వాటి వలన కర్మానుభవములే సంప్రాప్తమగు చుండును.

శరీరులకు అశరీరులు పామరులవలె కన్పించుచుందురు. బ్రహ్మ భావము గల వారె బ్రాహ్మణులుగా తెలియవలసినది. అహంకారులు బ్రాహ్మణులను గుర్తించజాలరు.

7 ప్ర) తనువున్న జీవుని అనుభవాలు తొలగిపోతే ఎవరౌతాడు? ఈశ్వరుడెవరు?

ఉ) అంతా దృశ్యమే. దృక్కు జీవుడు. విశ్వమందు వేరుగా వెలుగువాడు ఈశ్వరుడు.

8 ప్ర) ముక్తి సాధన ఏ రీతి?

ఉ) కారణ గురువు యొక్క గురువాక్యమే ముక్తికి మార్గము.

9 ప్ర) ముక్తికి ఏ విద్య కావాలి? మార్గమేది?

ఉ) షోడశాక్షరి విద్యయే ముక్తిని ప్రసాదించగలదు. గురుశుశ్రూషయే ప్రధానము. జప తప యజ్ఞ సంతాన యోగ ధర్మముల కంటె, కైవల్య కారణుడైన గురువు, మిత్ర భావము చూపెడి దేశికులు సరియైన మార్గదర్శికులు.

అతి రహస్యమైన పై తొమ్మిది ప్రశ్నలు జనకుడుగా తగు సమాధానము పంచశిఖి మునీంద్రులు జెప్పిరి. ఇంకను విశదముగా జెప్పదొడగిరి.

మానవుడు సంసారమనే సంకటములో సకల శాస్త్రాను మతమనే సంధి బుట్టి, దారి తప్పి అలసటచే తడబడుచున్నాడు. అశరీరి అనే వైద్యుని చేరి రక్షించమని శరణు వేడినాడు. అశరీరి (సద్గురువు) దయతో అతని చేయి చూచి పూర్వ జన్మాంతరమున నీవు చేసిన పాపములు నిన్ను బట్టి రోగబాధలను కల్గించుచున్నవి. కనుక పరమార్థముగా నీకు కర్మ రోగ బంధము వదిలింతును, కాని దీనికి పథ్యము "నీతి" అను పదునారక్షరములు అనే మాత్రలు (మందు) యిచ్చి బాగుపడమనెను. ఇనుము పరుసమును తాకినచో, బంగారమగు చందమున యీ షోడశాక్షరీ మంత్రసారము, ఆత్మానుభవము. పూర్వానుభవ మును నశింపజేసి, నిరామయునిగ జేసి నిరతిశయముగ నానందమిచ్చును. గురుమూర్తి యిచ్చిన దివ్యౌషధమును సేవించిన శిష్యుడు శాశ్వత పదవి నధిష్ఠించెను.

కావున షోడశి మంత్ర ప్రావీణ్యమును గ్రహించి, దీని భావము మదిలో విడువకుండా ఎల్లప్పుడు మనోవాక్కాయ కర్మలననుభవించవలసియున్నది. దీనికి తోడుగా ద్వాదశాక్షరి మంత్రమును అనుష్ఠించుము. ఇట్టి మంత్రద్వయము రేయింబవళ్ళు స్మరించి, అనుభవించిన, అది సిద్ధించును. అప్పుడు ద్వంద్వమనేది పోయి అశరీరియై సుఖించగలవు. అశరీర వర్తనుని శరీరం కూడా శిధిలమైపోయి, సర్వమును లేకుండగనగును.

గురుసేవకు అనుగుణముగా భ్రాంతి రహితుడువై బ్రతుకుట ముఖ్యము.

గురుమంత్ర ప్రభావము వల్ల, గురుసేవ వల్ల మాత్రమే భ్రాంతి రహితమగును. కనుక స్థిరచిత్తులై యీ బోధను అనుభవములోనికి తెచ్చుకొనవలెను.

యాజ్ఞవల్క్య గార్గేయి సంవాదము

పరిపూర్ణము :

వేదము ప్రతిపాదించు బ్రహ్మమునకు, పరబాహ్యామునకు గల భేదమెట్టిదని ప్రశ్నించిన గార్గేయికి యాజ్ఞవల్క్యుని సమాధానమిట్లుండెను.

వేదప్రతిపాదిత బ్రహ్మము అహం స్ఫురణ జేయుచున్నది. "ఓం ప్రజ్ఞానం బ్రహ్మ" వాక్యము ప్రజ్ఞామయమైనది. "అహం బ్రహ్మాస్మి" వాక్యము అహమును ప్రతిపాదించుచున్నది. "తత్వమసి బ్రహ్మ" వాక్యమునందు తత్, త్వం, అసి అను పదముల ద్వారా అది నేనైతిని అనుటలో అహం ద్యోతకమగుచున్నది. అయమాత్మ బ్రహ్మ వాక్యములో కూడ సృష్టికతీతమగు అహం రహిత పరబాహ్యమును ప్రబోధించుట లేదు. తేజో బిందూపనిషత్తు యందు

"ప్రజ్ఞాన వాచ్యహీనాత్మ
అహంబ్రహ్మాస్మి వర్జితం
తత్వ మస్యాది హీనాత్మ
అయమాత్మేత్య భావతః"
"ఆత్మేతి శబ్దహీనోయ ఆత్మశబ్దార్ధ వర్జితంః
సచ్చిదానం హీనోయ ఏషైవాత్మ సనాతనః"

అని బోధించుచున్నది. అదియే అచల పరిపూర్ణ పరబాహ్యము.

అన్నింటికిని నిరాధారమైన ఆ పరబాహ్యమును తెలిసికొనిన ప్రయోజనమేమని గార్గేయి ప్రశ్నించగా యాజ్ఞవల్క్యుడు ఈ విధముగా బదులిచ్చెను.

సత్తు చిత్తుగా నేర్పడిన సచ్చిదానంద చైతన్య బ్రహ్మ రాకపోకలతో గూడియున్నదే శుద్ధ చైతన్యము. ఇదియు, మాయయు ఒక్కటే.

శ్లో॥ కర్మాకర్మ వినాశంచ మర్మమాయా వివర్జితం ।
అహం పదార్థరాహిత్యం అచలం పరమం ప్రభుం ॥

పరిపూర్ణమందు లేని చైతన్యమనే ఎఱుక స్వప్నమువలె తనకు తానే సృష్టిగా తోచుచున్నది. ఈ పరిపూర్ణమునకు కర్మాకర్మలు లేవు. మాయామర్మములు లేవు. జీవోహం శివోహం అనునవి లేవు. అది ఏమీ లేనిది; ఏమీ కానిది.

శ్లో॥ కాయంకరం స్థలం ప్రోక్తం జీవస్యా నయన స్థలం ।
కాయ జీవన ద్వయోస్సంధి జగమిత్యభి ధీయతె ॥

స్త్రీ పురుష నపుంసక భావములను పొంది చరాచర జంతు సంఘాతమై యుండి కూడా కానట్లున్నదే యీ చైతన్యము. సర్వ జంతు జాలము అంతటా మోహాదులను పుట్టించుటకు భ్రమ కారణమైయున్నది. ఇది ఉన్మీలన నిమీలనముల చేత చక్షు రగ్ర పరమాణు సూక్ష్మ సుశిరజనిత ప్రకాశ భాసమానమై కనుదర్పణమందు, అనగా తన యొక్క కల్పనతో నున్న రూపనామములను దెలియజేయుచున్నది. "జ్వలత్కాలానలా భాసపటిత్కోటి సమప్రభా" అన్నట్లు యీ సృష్టియందు చైతన్యమే చిత్స్వరూపమై అష్టతనువుల చేత పరివేష్టితమైనదే చైతన్యమనెడి ఎఱుక. అదే సర్వభ్రాంతులకు మూలమైనది. దీనిని హరింప జేయుట హరిహరాదులకైనా సాధ్యము గాదు. అట్టి ఎఱుకను సగుణాతీత నిర్గుణాతీతమైన పరిపూర్ణమందు పరశివ స్వరూపుడైన గురుమూర్తియే హరింపజేయగలడు.

ఈ లేనెఱుక ఎట్లు కలిగినదని గార్గియడుగగా, యాజ్ఞవల్క్యుడిట్లు చెప్పెను.

సర్వద్వంద్వ వినిర్ముక్తం సర్వానందమయం పరః ।
సర్వానుభవ వినిర్ముక్తం సర్వాభావ వివర్జితః ।
ఆత్మానాత్మ వివేకాది భేదాభేద వివర్జితః ।
మహావాక్యార్థో దూరః అహమస్మీతి వర్జితః ।
క్షరాక్షర విహీనేన ఉపాధి ద్వయ హీనతః ।
దేశ కాలాధిభిః శ్యం సర్వశూన్యం నిరామయం ॥

అని అన్నట్లు, అచల పరిపూర్ణము సనాతనమైనది. నామరూపములతోనున్న యెఱుక కలదనువాడు గురుబోధ రహితుడు.

ఇంకను శుక్తియందు రజితము వలె, త్రాటియందు పాముపలె, కుందేటి

కొమ్మువలె సర్వప్రపంచమంతటను భాసించుచున్నది. దృశ్యము, దృక్కు, ద్రష్ట తద్భాసన అనునవి ఏమియు లేవు. దేహ ప్రాణాది సంజ్ఞకమగు నాత్మయును లేదు. ఈ సర్వము నిజముగా లేనిదే. బట్టబయలే బ్రహ్మగా నిశ్చయించుకొన వలెను. జ్ఞానానందములు లేవనియు, ఉన్నవనియు మూఢ మానవులందురు. ఈ జ్ఞానము భ్రాంతి మూలమైనది. కావున జ్ఞానమే భ్రాంతియని నిశ్చయమగుచున్నది. భ్రాంతి లక్షణమగు నానంద మనంతమై జ్ఞానమునుండి పుట్టుచున్నది. సత్యము, జ్ఞానము అనునవి మాయా గుణములుగా తెలిసికొనవలెను. జ్ఞాన స్వరూపమగు నానందము లేనిదే. ఇట్లని వేదాంత నిశ్చయము. ఈ లేనెఱుక యొక్క భ్రాంతి నశించుటకు అచల మార్గము తప్ప మరియొక మార్గము లేదు.

సాంప్రదాయ ప్రబోధ

ఎఱుక మూలాభావము. కనుక ఎఱుకను ఎఱిగేటందుకు యితరమేమీ అక్కరలేదు. ఎఱుకను ఎఱిగితే ఎఱుగవచ్చును. కాని పరిపూర్ణము నెఱిగేదెట్లు? ఇదీ (ఎఱుక) అని తెలిసినచో అది యిది కాదు; అనగా పరిపూర్ణము ఎఱుక కాదు. ఇది అది కాదు; అనగా యెఱుక పరిపూర్ణము కాదు. ఇది కానిదే అది అని తెలియనగును; అనగా ఎఱుక కానిదే పరిపూర్ణము

ద్వాదశి, షోడశి మంత్రములు అందరికీ తెలిసినను, అవి ఉపదేశ పూర్వకముగా గ్రహించవలెను. ఉపదేశమిచ్చు వారు అందరూ, యీ బోధకు గురువులు కాజాలరు. ఎందుకనగా దీర్ఘకాలము సేవచేసి తమ గురువుల వద్ద ధర్మ పద్ధతి ప్రకారము గ్రహించినవారి వద్ద బోధ గ్రహించిన యెడల మాత్రమే సాంప్రదాయ ధర్మము చక్కగా పట్టుబడును. అది లేకున్న, అగ్నిలో పడిన మిడత వలె, కుడితిలో పడిన ఎలుక వలె, అంధకూప ప్రవేశము వలె మునిగిపోవును. అనగా, ఇది పోక, అది కాలేక, పుట్టుచు, చచ్చుచు నుండును.

ఈ సాంప్రదాయ ధర్మమును తన తెలివిచేత గాని, పెద్దల సాంగత్యము చేత గాని తెలిసికొనలేడు. ఈ మార్గము పై విధముగా కొంత గ్రహించినను, ఉపనయనము కాని వాడు వేదము చదివినట్లు కాగలదు. బోధలు వినినను, ఆ మార్గస్థుడు కాజాలడు. అగ్ని స్తంభన విద్య గురు ముఖతః తెలియని వాడు అగ్నిలో జొచ్చి నశించినటులనే నశించును, కాని ఎన్నటికినీ కడ తేరడు.

ఈ బోధను ఉన్నదున్నట్లుగా గ్రహించవలెనన్న సాంప్రదాయక ప్రబోధకుడైన గురుమూర్తికి, తత్సంతతికి (ఆయన భక్తమండలికి) సేవ చేసి బోధ గ్రహించిన, అది మింటపెట్టిన దీపము (ఆకాశ దీపము) వలె ప్రకాశించును. వాడెక్కడికి పోయినను కొదువలేదు. ఆ విధముగా ఎఱుకను గురెఱిగినను, ఎఱుక మార్గము తెలిసినను, అది అడవి మార్గమే. ఎందుకనగా గురుకృప లేనిదే అది ఎప్పటికిని, గమ్యమును చేర్చజాలదు. అనగా దానివలన భ్రాంతి రహితము గాదు, భ్రాంతి విస్తారమేయగును. రాగద్వేషాదులు పోనంతవరకును, తానున్నంతవరకును, నిష్ఠ కుదరదు. ఈ నిష్ఠా మార్గము అన్యులకు తెలియదు. ఎందుకనగా, వారు ఎఱుకను నమ్మియుందురు. కనుక వారికి రాకడ పోకడలు తప్పవు.

శ్రు ॥ మృత్యోస్సమాప్నోతినై వచాన్యం నపశ్యతి ॥

వారు మృత్యువు నుండి మృత్యువునకే పోవుదురు. ఎందుకనగా ఎఱుకే మృత్యువు. ఎఱుకను నమ్మినవాడు ఎఱుక చేతనే జనన మరణ ప్రవాహ రూపమైన సంసారమును పొందునని భావము.

ఎఱుక గురుకృప చేతనే పోవును. అప్పుడు లేని ఎఱుక లేకపోయిన యెడల అంతా బట్టబయలే. తాను అనేవాడు చూచెదమనిన, ఎక్కడను లేడు. నిండి నిబిడీకృతమై అంతర్బహిస్సులలో అదే యుండును. చేప నీటియందున్నప్పు డెట్లు మిడిసిపడుచుండునో, అట్లే ఎఱుక ఒక్కటున్న, అన్నీ యుండును. సముద్రములోనే బడబానలముండి సముద్రమునే హరించినట్లు, గురువాక్యము కూడ ఎఱుకే అయినప్పటికీ, ఎఱుకను హరించును.

సాక్షియనిన చేతనాత్మకమైన ఎఱుక. అచేతనమనబడే మాయయూ ఎఱుకే. ఎఱుక ఆ విధముగా చేతనాచేతనాత్మకమైయున్నది. ఇదియే సాక్షికి, మాయకు, ఎఱుకకు గల సబంధము. మాయయన్న లేనిది, కాని ఎఱుకను లేనిది అని

ఎట్లు అనవలెను? అన్నదే లేదని అభిప్రాయము. కార్చిచ్చులో జొచ్చిన మృగ పక్షి కీటకాదులు యేలాగున నిలువవో అలాగు గురువాక్యము చేత ఎఱుక నిలువదు. గురువు దాని సంగతి (ఎఱుక), దీని సంగతి (పరిపూర్ణము) తెలిసినవాడు. కనుక ఎఱుక లేకుండా చేయును. ఏ బోధైనా, యీ బోధకు సమానము గాదు.

ఎందుకనగా, నీళ్ళు పలుచగా నుండును. తైలమున్ను నీటివలెనే యుండును. అయితే తైలము చేత అగ్నికి ప్రకాశము వచ్చును. నీటి చేత అగ్నియే చల్లారిపోవును. ఇతర బోధలన్నీ తైలమువంటివి. ఒక్క పరిపూర్ణ బోధయే నీళ్ళ వంటిది. ఇతర బోధలు భ్రాంతిని విస్తంరింపచేయునే గాని రహితపరచవవు.

శిష్యుడు : అన్నదే లేదనిన గురువాక్యమునకు, గురువు లేక చెప్పినారా, లేదా ఉండి చెప్పితిరా? లేక చెప్పినారనిన, చచ్చినవాడు మాట్లాడగ వినలేదు ఉండి చెప్పితిరనిన, గురువుండగా శిష్యుని "నీవు లేవు" అని ఎలా చెప్పెను? పోని, ఉండి లేక చెప్పితిని అని అనిన, చచ్చినవాడు సగము చచ్చి, సగము చావలేదన్నట్లున్నది.

గరువు : ఆకాశమున ధ్వని వున్నప్పటికిని, అన్నప్పుడూ, విన్నప్పుడూ మాత్రమే ధ్వని తోచును. అలాగే నేను ఉన్నట్లు, అన్నట్లు నీవు విన్నట్లు నీకే తోచినది. అట్లే నీవు అన్నట్లు నేను విన్నట్లు కూడా నీకే తోచినది. నేను ఎప్పుడును లేను... నాకు తోచుటను లేదు. నావలెనె మేల్కొని చూచితే నీకు తెలియగలదు.

మేల్కొని చూచిన పరిపూర్ణము కనబడునా? చూచేది ఎఱుకే గదా! ఎఱుకను నమ్మిన వానికంటె అధముడు లేడు. ఎఱుక కంటెనూ మాయ ఏ లోకమందునూ లేదు. ఆ శరీరమును గుర్తెఱిగితిననే శరీరము లేదు. తోడేలును చూస్తే మేకలెట్లు నిర్జీవమగునో అట్లే గురు సూచన లేకుంటే మరుగు విడదు.

శిష్యుడు : ఉన్న మంత్రమునా, లేని మంత్రమునా ఉపదేశించునది?

గురువు : మూలము లేని మంత్రమయితేనే ముఖ్యము. ఆ మంత్రము స్మరించగానే తాను ఏమి లేకుండా పోవలెను. మూలమున్న మంత్రములు స్మరిస్తే జన్మ సూతక, మృత సూతకములు వచ్చును. మంత్రోచ్చారాణ సూతకములు వచ్చును. మంత్రోచ్చారణారంభమందు జాతాశౌచమున్నూ, మంత్రాంతమందు మృతాశౌచమున్ను వచ్చును. అనగా ఆ మంత్రములకు ఆద్యంతములున్నందు వలన వానికి అపవిత్రత ఉన్నది. అవి కృతార్థత నందింపజాలవు.

అహంబ్రహ్మాస్మి మంత్రములో అహం అనగానే జాతాశౌచము, అస్మి అనగానే మృతాశౌచము సంభవించును. ఓంకార శ్రీకారములు చేర్చినను అంతే. కాని మూలం లేని మంత్రములకు మూలం, అంతం లేనందున ఎట్టి అశుచి లేదు. అవి లేని మంత్రములు కనుక వచించగనే తన్ను లేకుండా చేయును.

"మూలాభావమిదం జ్ఞాతుం న శరీరం నకిమస్తి" అను మంత్రమునకు మూలమేమి లేదు.

మంత్రము కూడా మాయయే, మాయను మాయ పోగొట్టగలదా యనిన, అనగా తమస్సు తమస్సుచే నివర్తియగునా యనిన, సూర్యుడు మాయయే; తమస్సు మాయయే; అయిన్పటికిని, సూర్యుడు చీకటిని పోగొట్టుట లేదా, అటులనే మూలం లేనిది గనుక మూలము లేకుండా చేయును.

"నీచాశ్రయం నకర్తవ్యం కర్తవ్యం మహదాశ్రయం"

కనుక ఎఱుక సంబంధమయిన మంత్రములను పరిత్యజించి పరిపూర్ణ సంబంధమయిన మంత్రములను స్మరించవలెను.

ఎఱుకను పరిత్యజించి, ఆ పరిత్యజించే దానిని పరిత్యజిస్తే ఏమి ఉండునో అదియే నిశ్చయము. పరిత్యజించే దానిని నిర్లక్ష్యము చేసి, లక్ష్యమయిన దానిని లక్ష్యము చేసి, తాను ఎప్పుడూ లేనని తలచడమే నిశ్చయము. ఇదే లేకపోవడము.

తాను లేకపోవుటయే మర్మము. మర్మము తెలిసినచో కర్మ జ్ఞానములు నిర్మూలము. పిశాచము పట్టినవానికి పిశాచము విడచినట్లున్ను, సర్పభీతిని పొందిన వానికి, భయము తీరినట్లున్ను, ఎఱుక అనే భయం తీరితే ఏమీ లేదు. ఎఱుక పోతే ఎఱుకతో కూడిన యావత్తు పోవును.

ఈ విధముగా ఎఱుకపోయిన పిదప అత్యంత విలక్షణమై అంతర్బహిస్సుల చలించకుండ అచలమై బట్టబయలై ఉన్నదేదో యుండును. పరిపూర్ణము ఎక్కడెక్కడ యుండునో అక్కడక్కడల్లా పరిపూర్ణము, ఎఱుక లేదు. ఎఱుక ఉన్న

చోటల్లా పరిపూర్ణమే, ఎఱుక లేదు. అనగా ఎఱుక ఎక్కడా లేదు. పరిపూర్ణమే అంతటాయున్నది. కనుక ఎఱుక పుట్టనే లేదు. ఇది సిద్ధాంతము.

షోడశావస్థలు

1. జాగ్రత్తలో జాగ్రత్త గురుసన్నిధానమున శాస్త్ర శ్రవణము చేయునప్పుడు అడుగదగిన విషయములనడిగి తెలిసికొని మనసున మరపులేకయుండుట.
2. జాగ్రత్తలో స్వప్నము గురువునొద్ద శాస్త్రవిషయములను వినునప్పుడు పరాకుపడుట చేత ఆ విషయములు జ్ఞాపకముండియు నుండక యుండుట.
3. జాగ్రత్తలో సుషుప్తి గురువునొద్ద సద్విషయములను వినవలయునని ప్రారంభించి వినునప్పుడు హెచ్చరిక లేమిచే అవియు బొత్తుగా జ్ఞాపకము లేకపోవుట.
4. జాగ్రత్తలో తురీయము గురువునొద్ద శాస్త్ర శ్రవణము చేయుటచే వస్తుతత్త్వ జ్ఞానము గలిగి ఆ వస్తువు చింతించుట.
5. స్వప్నములో జాగ్రత్త కలగనిలేచి తాను కలలో కన్నవానినెల్ల తప్పక చెప్పుట.
6. స్వప్నములో స్వప్నము కలగని లేచి అందలి విషయములను మరచి మరువక యుండుట.
7. స్వప్నములో సుషుప్తి కలగని మేలుకొని ఆ కలయందు తాను కన్నదంతయు మరచుట.
8. స్వప్నములో తురీయము కలలో తాను కొండ మిదదను ఏనుగు మీదను నెక్కినట్లును లక్ష్మీదేవి తన్ను వరించి పొందినట్లుగని లేచి దాని ఫలమును విచారించి తనకు రాజ్యాధిపత్యము వచ్చుననియు సంపదలు గలుగుననియు నెంచయ యిదియంతయు మనోవ్యాపారము గాని వేరు కాదని నిశ్చయించి బ్రహ్మనిష్ఠనుండి చలింపకయుండుట.
9. సుషుప్తిలో జాగ్రత్త సుఖముగా నిద్రించి లేచి ఆ నిద్ర సుఖమిట్టిదని తెలిసి చెప్పుట.
10. సుషుప్తిలో స్వప్నము సుఖముగా నిద్రించియు దానివలన సుఖమెట్టిదో అది తోచియు తోచకయుండుట.
11. సుషుప్తిలో సుషుప్తి నిద్రించి లేచిన పిమ్మట దాని సుఖమిట్టిదని తెలియక యుండుట.
12. సుషుప్తిలో తురీయము సుఖముగా నిద్రించియు ఆ నిద్రావస్థ అజ్ఞాన విషయమును గాని ప్రజ్ఞానఘన ప్రత్యగ్త్మా మైన నాకు విషయము కాదని తెలియుట.
13. తురీయములో జాగ్రత్త బ్రహ్మనిష్ఠయందుండునపప్పుడు జాగ్రత్తయందలి వ్యాపారములైన యాకలిదప్పులు తోచి ప్రపంచవృత్తి గలుగుట.
14. తురీయములో స్వప్నము ఆ బ్రహ్మ నిష్టయందుదునప్పుడు ఆకలి దప్పులు తోచి ప్రపంచ వృత్తులు కలిగి కలుగకయుండుట.
15. తురీయములో సుషుప్తి బ్రహ్మనిష్ఠయందు వికల్పమేమియు లేకయుండుట.
16. తురీయములో తురీయము జాగ్రస్వప్న సుషుప్తుల వలన గలిగెడు యా పదునైదు భేదములను లేక అఖండ పరిపూర్ణ సచ్చిదానంద పరబ్రహ్మము తానే కాని కనకంటె వేరు గాదు అనెడి వృత్తి భేదము లేక పరబ్రహ్మమగు తాను తానై యుండుట ఇదే అవికల్ప వికల్పము.

1. జాగ్రత్త మనస్సు దశేంద్రియములతో గూడి శబ్దాది విషయములయందు అనుభవము గలిగియుండుట.
2. స్వప్నము జాగ్రత్త క్రమముగ క్షీణించి గాఢనిద్రను పొందక ఆ జాగ్రత్తయందలి విషయముల యనుభవము గలిగియుండుటయే స్వప్నము.
3. సుషుప్తి మానసాది సర్వేంద్రియ వ్యాపార శూన్యమే నిద్రావస్థ.
4. తురీయము దేవుడు గలడనెడి ఆస్తికబుద్ధి కలిగి ప్రమాణముల చేత అసత్తుసత్తు అను భేదము కల లౌకిక కర్మ, ద్వైతాద్వైతముల కల్పన విమర్శించి ఒప్పు జ్ఞానము గలిగి యుండుట తురీయము. యీ నాలుగవస్థలు నొక్కొకటి నాలుగేసి భాగములుగా భాగింపబడి పదియారవస్థలయ్యెను.

ఎఱుక రాహిత్యము

ఎఱుక ఏ కాలమందును లేనే లేదు; ఎక్కడా ఎప్పుడు లేనే లేదు. ఇంకొక చోటైననూ, మరొక దానియందైనను ఉన్నదాయనిన, అది (ఎఱుక) ఎఱుకయందు మాత్రము ఉన్నదని చెప్పవచ్చును. అనగా తన యొక్క ఆవరణమునందు మాత్రమే ఎఱుక ఉన్నది. తన ఆవరణము బైట ఎఱుక ఏమీ లేదు. తన ఆవరణము అనగా దేహేంద్రియ మనస్సులు వగైరాలే. అవి లేకుంటే ఎఱుక పని చేయలేదు. మరణమందు పోకుండా, ప్రకృత్యావరణమునందు ఎఱుకయుండును.

కనుక ఆవరణము లేనిచో ఎఱుక ఉండదా? ప్రకాశావరణము లేని దీపముండనట్లు, బెల్లపుగడ్డ లేక తీపికి ఉనికి లేనట్లు, ఆవరణ లేక యెఱుక ఉండదు. ఏ వృక్షమున కావృక్షము తొలగించిన వనముండనట్లు, ఒక్కొక్క యిల్లు తీసివేయగా, గ్రామముండనట్లు, ఏ పొఱకా పొఱ వొలసిన అరటి స్తంభము ఉండనట్లు, మానసేంద్రియ దేహ సంఘాతమునకే యెఱుకని పేరు. అనగా, అవి లేకుంటే ఎఱుకయున్నూ లేదన్నమాట.

మనస్సున్నంతవరకు ఎఱుక ఉండును. మనస్సు పోయినా ఎఱుక ఉన్నదనగా, మనస్సు పోలేదని నిర్ణయము. సూర్యుడుండి కిరణములు పోవునా? అందువలన మనస్సు పోయినట్లుండినను, అది యింకా సూక్ష్మ స్వరూపమై మనస్సు యొక్క మూలమును గుర్తింపచేయగలదు. అట్లు గుర్తింపజేసినవాడే గురువు.

ఈ సిద్ధాంతమందు జీవన్ముక్తి, విదేహ ముక్తియనునవి అంగీకరించబడవు. ఎందుకనగా, తాను లేడు కనుక తనకు దేహము లేదు. కనుక విదేహ ముక్తి అని చెప్పరాదు. లేనివాడు జీవుడూ కాదు, బ్రహ్మమూ కాదు. కనుక జీవన్ముక్తి లేదు. లేనిదానికి బంధమూ లేదు, మోక్షమూ లేదు. కనుక ఏ విధమైన ముక్తి చెప్పరాదు. తాను ఉండి ముక్తిని పొందుటను మాట నీళ్ళ మూట మాత్రమే. తానే లేకపోయిన, ముక్తి ఎవరికి? అనగా తాను పోవుటయే ముక్తి అనవచ్చును. కాని తాను లేకపోయిన పిదప చెప్పేదెవరు? కరి మ్రింగిన వెలగపండునందు గుజ్జు ఎలా లేకుండా పోవునో, అట్లే లేకుండా పోవును.

జాగ్రదవస్థ నుంచి సుషుప్తిలోనికి పోవునపుడు, నిద్ర వస్తూ వున్నదని తెలిసి, తర్వాత ఏలాగున ఏమీ తెలియని గాఢ నిద్ర వచ్చునో, అలాగునే నేను లేకపోవుచూ ఉన్నప్పుడు లేకపోవడమే ముక్తియని తెలిసి లేకపోతాడు.

సర్వసంగ భ్రాంతి రహితము ముక్తి కాదు. తానున్నంతవరకు తన కర్తవ్యమనేదిన్ని, తద్వారా భోక్తృత్వమును ఉండగలదు. ఆ విధముగా కర్మబద్ధుడవు తున్నంత వరకు జీవన్ముక్తి, విదేహ ముక్తి సంభవించవు. కర్తృత్వ భోక్తృత్వములు, కర్మ బంధములున్నంత వరకు అజ్ఞానము ధ్వంసము కాదు కనుక ముక్తి కలుగదు. సాక్షి, సర్వ స్వరూపుడు అని తెలిసికొన్నను ముక్తి కాదు. ఎందుకనగా, తనకన్యముగా నున్నదానికి కదా, తను సాక్షి? సర్వస్వరూపుడు తానే అయినచో, యిక దేనికి సాక్షి? ఈ రెండును పరస్పర విరుద్ధములు.

మహాసాగరమందు పుట్టిన అలలు, నురుగ, బుడగలు సాగరముకంటే వేరు గావు. అలాగే సాక్షి, సర్వస్వరూపము అనునవి "నేను" యందు పుట్టినా, అవి నా కంటె భిన్నములు గావు. కనుక యివన్నీ "నేను" ఉంటేనే వున్నవి. "నేను" లేకుంటే లేదనే మాటయే ఉండదు. సర్వము ఉంటేనూ, లేదని అనరాదు. నేను అనేవాడు ఎప్పుడున్నాడో వానికి కర్తవ్యము మొదలైన దోషములు సంభవించును. కనుక నేను లేకపోవుటయే ముక్తి. లేకపోయెనా! వాని విషయములో ముక్తియని చెప్పుట కూడా శశివిషాణము వలె ఔపచారకమే.

ఈ పరిపూర్ణ బోధ ఆరూఢము కావలెను. పరిపూర్ణ పరబ్రహ్మము అంతటా సూది మోపుటకైన సందు లేక నిండి నిబిడీకృతమై యున్నదని భావించుట యొక్క మార్గము. అంతటా యనగా సర్వ ప్రదేశాలని కాదు. పరిపూర్ణమను మాట లేదు గాని, పరిపూర్ణమయితే వుండనే ఉండును. అన్నీ పోయే వస్తువులైనపుడు పరిపూర్ణమను మాట కూడా పోయేదే. పరిపూర్ణము తప్ప ఎపుడూ ఏమీ లేదు. ఏమీ కాని, తనయందితరమేమీ లేని పరిపూర్ణము ఎప్పటికీ వుంటుంది. కాని ఉంటుందని చెప్పే ఎఱుకే లేదు, వుండదు.

కనవచ్చే సర్వమూ, తోచబడే సమస్తమూ తన గుర్తుతో సహా ఏమీ లేనే

లేదని భావించుట రెండవ మార్గము. అనగా ఉండచూచుకొని ఊరకుండుట ఒక మార్గమైతే, లేనిది లేదని లేకపోవుట రెండవ మార్గము.

ఎఱుక ముందా? దేహము ముందా? అనిన దేహము లేని (ఆవరణము లేని) ఎఱుక యుండదు. స్థూలమగు దేహమునకు కారణము సూక్ష్మమగు ఎఱుకయే. కనుక రెండూ కలసియే, బీజ వృక్షమువలె ఒకేసారి వచ్చినవే. ఎఱుక దేహములు రెండూ వేరు కావు. రెండూ కలసి ఒక్కటే. దానిని ఎఱుకన్నా, దేహమన్నా, ఏ పేరుతో పిలచినా ఒక్కటే.

తనంతట తానే యెఱుక తోచి, దానికదే చలించి, భ్రాంతి చేత అనేకము వచ్చినట్లు, ఉన్నట్లు, పోయినట్లు తోచును. అంతా స్వప్న తుల్యమే. భ్రమ మాత్రమే. కనుదెరచి కనే స్వప్నము జాగ్రదవస్థ; కనుమూసి కనే స్వప్నము స్వప్నావస్థ. రెండూ కూడ తన యొక్క చలనము చేతనే తోస్తూ ఉంటాయి. పరిపూర్ణమునందు లేక తోచిన ఎఱుక నరస్వప్నము వంటిది. దీనికి స్మృతియో, సంస్కారమో, ఏదో ఒక మూల ఉంటుంది. పరిపూర్ణమందు యెఱుకకు ఏ మూలము లేదు. కనుక దీనిని దీక్షితుల వారు సురస్వప్నమని అన్నారు.

జ్ఞాన సప్తావరణములు

జ్ఞాన (విద్యా) సప్తావరణములనగా (1) సాధన చతుష్టయ సంపత్తి (2) సర్వ బ్రహ్మ బుద్ధి, (3) వైరాగ్య బోధోపరతి, (4) మహా వాక్యార్థ విచారము, (5) చతుర్విధ యోగాభ్యాసము (6) చిద్వస్తు సాక్షాత్కారానుభవము ద్వారా అహంబ్రహ్మేతి నిశ్చయము, (7) అంధుని వలె, జడుని వలె సంచరిస్తూ దృశ్య శూన్యమై తూష్ణీభావము చేత యుండుట.

ఈ సప్తావరణము వలన సత్‌చిత్ ఆనందములు కల్గును. ఇవి వాచ్యార్థ లక్ష్యార్థములు చెప్పుటకే గాని, యివి పరిపూర్ణ పరబ్రహ్మ ప్రతిపాదకములు గావు. కనుక యివన్నియు మాయయే వీనిని నమ్మరాదు.

మొదలు అక్షరాభ్యాసము చేసి, క్రమముగా వేదశాస్త్రములు యేలాగు చదువుకుందురో అలాగే శిష్యునికి వాని అధికారము కొలది వేద శాస్త్ర పురాణములు చెప్పబడినవి. చివరకు వీనితో బని యుండదు.

శ్రుతి ప్రమాణమైనను తొందరపడి అంగీకరించరాదు. ఎందుకనగా మరికొన్ని శ్రుతుల చేతయవి పూర్వపక్షములగును.

దృష్టాంతము :

ప్రారబ్ధం భోగతో నశ్యేత్, తత్త్వ జ్ఞానేన సంచితమ్ ।
ఆగామీ ద్వివిధమ ప్రోక్తం తద్వేష్టీ ప్రియవాదినై ॥

అనగా సంచితమూ, ఆగామీ అను రెండూ పోతవి, కాని ప్రారబ్ధం పోదని అన్నారు. ఎందుకంటే, ఎంత జ్ఞానికైనా ప్రారబ్ధ శరీరము, అందు దోచు వివిధావస్థలు తప్పవు. కాని దగ్ధపటలం రీతిగా శరీరము మిగిలియుండును. అయినను దాని యందు సుఖ దుఃఖములచే నతడు బాధింపబడడు. కస్తూరి అయిపోయినను, దానినుంచి భరిణకు గంధము మాత్రము మిగిలియున్నట్లు, శరీర సంబంధ అహంకార, మమకారములు పోయినను శరీరము మాత్రము పూర్వము వలె నుండును. అలాగే ప్రారబ్ధముండును అని అన్నారు.

ఇది విచిత్రము. ఎందుకంటె, ఒక రాజుకి ముగ్గురు భార్యలుండగా ఒక భార్య మాత్రమే ముతైదువై, మిగిలిన యిద్దరు విధవలెట్లు కాగలరు? అట్లే ఆగామి సంచిత కర్మలుండి, ప్రారబ్ధ కర్మ మాత్రమెట్లు లేకుండును? ఉత్తమాధి కారులైన వార్తికులు, యీ మూడు కర్మలు ఏమి లేవనియన్నారు.

వార్తికకారులే మూల సూత్రము ననుసరించి అట్లు చెప్పినారు. తాను విశుద్ధ జ్ఞాన స్వరూపుడు కనుక జీవ భ్రాంతి యెప్పుడూ లేదు. కనుక ఆగామి, సంచిత ప్రారబ్ధములు మూడున్ను భ్రాంతి లేని వారికి ఏమీ లేవు. జీవ భ్రాంతి కల వారికి మూడు వున్నవి. ఈ మూడింటికి కారణమైన జ్ఞానము పోతే, మూడూ లేవు. అదిన్నీ తాను వున్నంత సేపూ, మూడూ లేవని అన్నా వున్నవి. కనుక గురుకృప చేత మేలుకొంటె ఏమీ లేదు. ఇంతకంటె ఉత్తమ భావన లేదు; యిదే సత్యము. కాని మాటయే మాయ కనుక యిదీ అసత్యమే. కనుక మాటాడి ఆవల మానుదము. ఇన్నిటినీ గుర్తెటిగే ఎఱుకే లేదు, ఎఱుక పుట్టనే లేదు. మొదలు లేకుంటే కొమ్మలు లేనట్లు మూలమే లేదు, లేని యీ గుర్తెటిగే శరీరం ఏమీ లేదు. తాను ఎప్పుడూ లేదు కనుక, తనకు యెప్పుడూ ఏమీ

లేదు.

ఇట్టి ఉత్తమాధికారి దృష్ట్యా మళ్ళీ ప్రారబ్ధం, శరీరం, జగత్తు అని అనకూడదు. ఎందుకంటే, కలలో వచ్చిన శరీరం సగం వుండీ, సగం పోలేదు. ఇట్టి పరిపూర్ణునికి శరీరం, క్రియలు చేయుట లేవా? అంటే, నీకు ప్రారబ్ధమున్నది, నీవు క్రియలు చేస్తూ వున్నావనుట ఎలా వున్నదంటే, వెంట రావద్దంటే యెత్తుకోమని మొత్తుకున్నట్లున్నది. ప్రపంచం గురించి చెప్పాలంటే, ఆత్మతో అనాత్మ పోయెను. గడ్డపార నిలువని గాలికి దూది నిలుస్తున్నది అన్న చందముగా తాను లేదు కనుక తన చేత తోచిన ప్రపంచమూ లేదు. చంద్రాభావమందు చంద్రిక భావము, జలాభావమందు ద్రవ్యత్వా భావము, సాకార భావమందు ఛాయ భావము ఎటుల ఉండవో, అలాగే యెఱుక అభావమందు సమస్తమూ అభావమే. లేదనేదే లేదు. మూల విగ్రహాలు మూల కూర్చుంటే, ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు, పల్లకీ సేవలన్నట్లు, యెఱుకే లేదంటే, యెఱుక చేత చేసే కార్యములు సత్యమనుట అవివేకము.

ఇక ఏమన్నా, అనకున్నా, పుట్టని చావని పరిపూర్ణమే యున్నది. అట్టి పరిపూర్ణమున్నదని, దానియందెఱుక ఎప్పుడూ లేనేలేదని ఎఱుకను అణగద్రొక్క వలెను. ఇది భ్రాంతి లేని బ్రహ్మ బోధ. ఇది వింటే నీళ్ళలో ఉప్పు పోసినట్లు, నట్టేట్లో పుట్టి మునిగినట్లు కాదు. ఎందుకంటే, ఉప్పు, పుట్టి తిరిగి ఏలాగో తెప్పించవచ్చును. కనుక పరిపూర్ణములో ఎఱుక మునిగిపోవునని చెప్పరాదు. ఎఱుకలో ఎఱుక మునిగిపోవును. ఎట్లనగా, నీళ్ళలో నీళ్ళు వలె, పాలలో పాల వలె, అవి తిరిగి తీయబడవు. అలాగే పరిపూర్ణ బోధచే పోయిన ఎఱుక మళ్ళీ తిరిగి రాదు.

ఎఱుకలో ఎఱుక మునిగితే, ఆ రెండు ఎఱుకలు ఏకమై ఎఱుక ఉండుననిన, అట్టి అఖండ ఎఱుక కూడా ఎఱుకలో మునిగి తిరిగి రాకూడదు. ఎందుకనగా ఎఱుక జాడ ఎఱుకలో తప్ప ఎక్కడనూ లేదు. అది దానిలోనే కోల్పోయి, లేకపోవలెను. ఇది పరిపూర్ణ బోధవలన జరుగును. పరిపూర్ణమొక్కటే బయలైయుండును. హరిహరాదులు, జగత్తు అన్నీ పోయినపుడది తమస్సా, బయలా అనిన, అగ్ని యొక్క అభావము తమస్సైనందున, అభావ రూపమైన తమస్సు పరిపూర్ణము గాదు. గుర్తు లేనంత మాత్రముచే తమస్సే పరిపూర్ణమన రాదు. తమస్సున్ను సూర్య చంద్రాదులచే నశించుచున్నది. బయలు అట్లు కాదు. సకల దేశాలయందు, సమస్త వస్తువులయందు, మొదలు చివరలేక, స్వజాతీయ స్వగత భేదములు లేక గుర్తులేక యున్నదే పరిపూర్ణము గాని, తమస్సే పరిపూర్ణము గాదు. తమస్సునకు రూపచలనములు గలవు. సూర్యచంద్రాగ్నుల చేతను, సమస్త విరోధముల చేతను ఏది పోదో అదే పరిపూర్ణ పరబయలు, సమస్త భూత రహితమైనది, స్థాణువు. పరమాత్మ స్థాణువు కాదు, గుర్తెరిగే చైతన్యము, మాయ. అంతా మాయ సత్తా చేత ప్రకాశిస్తూ అణువుకు అణువు, మహత్తు కంటె మహత్త అయి వున్నది. ఏ యింటికి తగినట్లు ఆ యింట్లో దీపమెట్లు ప్రకాశించుచున్నదో, మరిన్నీ, చిన్న వత్తితో సూక్ష్మముగాను, పెద్దవత్తితో స్థూలముగాను ప్రకాశించుచున్నట్లున్నదో, బ్రహ్మాది స్తంభ పర్యతంము ఉపాధులతో గూడి ఎక్కడికక్కడ సరిపడియుండును. ఇట్టిది పరిపూర్ణము గాదు. ఎఱుక గాని ద్రవ్యము పరమాణువైనను లేదు. కనుక ఏదిన్నీ పరిపూర్ణము గాదు.

ఇంతటి గొప్ప ఎఱుకయందు భ్రాంతి ఏలాగు నశించుననిన, వాస్తవముగా యెఱుక పుట్టనే లేదు గాన, గురుకృపచే గుర్తు విడచి మేలుకొనిన పట్టు విడుపు లేని పరిపూర్ణమే స్వతస్సిద్ధము.

వాసనాక్షయము, మనోనాశనమయిన చాలదు. పరిపూర్ణ బోధయే శరణ్యము. ఎందువల్లనంటే, నత్తలు గుల్ల అయితేనే గాని తేలవు. తేలినా వానియంతట అవి ఒడ్డుకు రాలేవు. అలాగే తాను లేని స్థితి (గుల్ల) కుదిరితే గాని సర్వ భ్రాంతులు వాసనారహితముగా వాని అంతటవి నశించవు. పరిపూర్ణ బోధయే తాను లేని గుల్లను ఒడ్డుకు చేర్చిన, తన ప్రయత్నము లేకనే లేకపోవును.

ఉద్ధరిణతో తోడి సముద్రమును జలరహితము చేయనగునా? అట్లే అల్పసాధనల చేత, అల్ప బోధల చేత ఎఱుక భ్రాంతి రహితము గాదు. జ్ఞాన సప్తావరణములు దొలగవు. జన్మ రాహిత్యము సిద్ధించదు.

నిజ వైరాగ్యము

ప్రపంచములో కానవచ్చు వస్తువులు, అనిత్యములు, అసత్యములు, బంధ

కారణములు, భ్రాంతి జన్యములు అని తలచి వానినాశింపక ఇంద్రియ నిగ్రహము కలిగి శాశ్వత సుఖదాయకమైన వస్తువేదైనా కలదా? లేదా? అని యోచించవలెను. తత్ ప్రాప్తికి వైరాగ్యమవసరము. జ్ఞానేంద్రియములకు, మనస్సునకు గోచరించు యీ సమస్తము, ఏదో ఒక కాలమందు నాశనమగునని కేవలాచలస్థితి వీనియందు లేదనియు, ఆ వస్తువులచే కలుగు సుఖదుఃఖములు అనుభవించి తాను కూడా వానితో పాటుగా మార్పు చెందుచూ చుక్కాని లేని నౌకవలె తుద మొదలు కానరాని నిరంతర ఆవేదన నుండి విడుదల కోరి, దుర్లభమైన మానవోపాధిని పొందిన తాను పరిపూర్ణ గురువుల చెంత చేరి, వారి పాదపద్మములాశ్రయించి, మృత్యువు తన్ను మ్రింగక మునుపే, విజ్ఞానవంతుడగు మానవుడు విముక్తి పొందనాశించుట సహజము

కొందరు భార్యబిడ్డలతో కూడిన సంసారము దుఃఖమయమని, తన జన్మకు కారణమైన తల్లిదండ్రులు కూడ తనకు బంధమని, వారి వలన తనకు ఈషణ్మాత్రము కూడా ప్రయోజనము లేదని, వారిని పరిత్యజించి ధర్మశాల వంటి గృహస్థ ధర్మమును వీడి, సన్యసించుచున్నారు. తాము సర్వసంగ పరిత్యాగులమని, అన్నింటిని జయించిన అతీతులమని, వైరాగ్యపరులము మేమే అని భావించుకొనుచు, పవిత్రమైన మానవ జన్మను చేతులారా వ్యర్థము గావించుకొనుచు మోక్షము కొఱకు కర్మ సన్యాసమని యోగ సాధనలని వారికి తోచిన పద్ధతులు అవలంబించుచున్నారు. ఎచ్చటికి వెళ్ళినా, ఎచ్చట ఉన్నా ఎన్ని సాధించినా, భ్రాంతి రహితము కానిదే జన్మ రహితము కాదు. కనుక పరిపూర్ణ ఋషులు "వైరాగ్యము" అను పదమునకు నిజ అభిప్రాయము నెఱుక పరచి, దాని ద్వారా అన్ని వస్తువులకు ముందుగా అధిష్ఠాన చేతన బ్రహ్మ భ్రాంతిరహిత విధానము వస్తు నిశ్చయముగా తెలియజేసి సర్వసంగ పరిత్యాగమనగానేమో తెల్పి కర్మ కౌశలముతో శేష జీవితము గడుపుమని సకల మానవాళికి బోధించుచున్నారు.

మిథిలానగరము అగ్ని జ్వాలలకాహుతియగుచున్నదని దండ కమండలాదులు గైకొని పారిపోయిన సన్యాసివలె గాక ఏ మాత్రము చలించక సంపూర్ణ అంతఃకరణ స్థిమితముతో గురుబోధయందే లగ్న మనస్సుడై యుండిపోయిన జనకుని కథ సుపరిచితమే. కావున పై వేషములు మార్చి, భార్యా బిడ్డలను వదలి సన్యసించుట నిజవైరాగ్యము కాదు. అన్ని రాగములకు మూలము తాను. ఈ యదార్థ జ్ఞానమైన తననూ, తనమీద అభిమానమును వీడజాలక పైపై విషయములు వదలిన మోక్షము సిద్ధించదు. "భ్రాంతి రహితమిదం మోక్షం" అనగా సర్వభ్రాంతులకు మూలమగు తనకు పరిపూర్ణ స్థానము కానిది లేదని, గురుకృపకు పాత్రులై, గురువు వలన తెలిసికొని సర్వభ్రాంతి రహితము గావించుకొనిన సత్పురుషుడే నిజవైరాగ్యపరుడు.

పరమాత్మ సృష్టి విధానములో సన్యాసమునకు తావు లేదు. గృహస్థాశ్రమము అను ధర్మశాలకు కర్తయైన తానుండగా కర్మఫలము అంటక తప్పదు. కనుక పరిపూర్ణ గురువుల చెంతచేరి, వారి కృప చేత అఖండస్థితిని వస్తు నిశ్చయముగా గుర్తెఱిగి, యా అఖండ యెఱుక లేశమైనా లేని పరిపూర్ణ పరబ్రహ్మము ఉండ చూచుకొని, కర్మ కౌశలము ఎఱిగి, వేనియందును భ్రాంతి లేక జనక చక్రవర్తి వలె గృహస్తు అయి, ధన్యజీవితము గడుపుటయే నిజమైన వైరాగ్యము. కావున సర్వులు పై విషయమునందలి యదార్థమును గ్రహించి గురుదేవుల చరణములపై వ్రాలి, జ్ఞానముచే జన్మరహితము గావించుకొనుటయే శరణ్యము.

షడ్విధ సమాధులు

శ్లో॥ సవికల్పో నిర్వికల్ప సమాధి ద్వివిధోభవతు
దృశ్యశబ్దాను విద్ధోయం సవికల్పః పునర్ద్విధ ॥

తా॥ సమాధి సవికల్పమని, నిర్వికల్పమని ద్వివిధము. అందు సవికల్పము దృశ్యాను విద్ధ సవికల్పమని, శబ్దాను విద్ధ సవికల్పమని రెండు తెరగులు.

ఈ రెండును, నిర్వికల్పమొకటియును గూడి మూడు విధములు. ఈ మూడును బాహ్యాంతర భేదముల చేత బాహ్యదృశ్యాను విద్ధ సవికల్ప సమాధి, బాహ్య శబ్దాను విద్ధ సవికల్ప సమాధి, బాహ్యా నిర్వికల్ప సమాధి, అంతర

దృశ్యాను విద్ధ సవికల్ప సమాధి, అంతర శబ్దానువిద్ధ సవికల్ప సమాధి, అంతర నిర్వికల్ప సమాధియని ఆరు విధములు.

అందు తనకంటే అన్యముగా తోచెడు బ్రహ్మ విష్ణు రుద్రేశ్వర సదాశివాది పిపీలికాంతమగు సమస్త చేతనములును, తృణాది మేరు పర్యంతమగు అచేతనములును తన తెలివియందు బుట్టి గిట్టినవి కాబట్టి అవి తన ప్రజ్ఞాన కల్పములని, ఆ ప్రజ్ఞానమే పరబ్రహ్మమని, ఆపరబ్రహ్మమే తానని చూచుట బాహ్య దృశ్యానువిద్ధ సవికల్ప సమాధి.

2) శివరామ గోవింద నారాయణ వాసుదేవ మహాదేవాది సకల నామములలో తన చెవికి వినబడిన నామములు తాను కానని విడచి సర్వనామ విలక్షణమైన పరబ్రహ్మ వస్తువును యోచించుటే బాహ్య శబ్దానువిద్ధ సవికల్ప సమాధి.

3) కామాది స్వజ్ఞప్తి వరకు గల వృత్తులు తనయందు కలిగినపుడు, వానినన్నింటిని అప్పుడప్పుడు ఒక్కొటొక్కటిని క్రమముగా నేను గానని గ్రహించి, నిరసించి వీటికన్నిటికిని విలక్షణమైన పరబ్రహ్మముగా నుండుటయే అంతర దృశ్యాను విద్ధ సవికల్ప సమాధి.

4) రాగద్వేష, కామక్రోధ, లోభమోహ మదమాత్సర్య, యీర్ష్యా దర్ప అహంకారాది స్వజ్ఞప్తి పర్యంతమైన సకలాంతర వస్తు నామములను నేను గాను. అని నిరసించి సర్వ విలక్షణమైన పరమాత్మగా నుండుటే అంతర శబ్దాను విద్ధ సవికల్ప సమాధి.

5) ఈ చతుర్విధ సవికల్ప సమాధులయందు సుస్థిరత కలిగి అంతర బాహ్యములయందు తనకు అన్యమేమియు తోచక, తోచినను, సముద్రమందు ముంచిన కుండలోపల వెలుపల పరిపూర్ణమై ఆకాశమందుంచిన కుండ లోపల వెలుపల శూన్యమైనట్లుండుటే బాహ్య నిర్వికల్ప సమాధి.

6) పైన చెప్పబడిన వృత్తులు ఏవియు లేక అఖండ పరిపూర్ణ సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపమై యుండుటే అంతర నిర్వికల్ప సమాధి.

నిర్గుణ పంచదశ యోగాంగములు

నిర్గుణ యోగాంగములు పదునైదు విధములు 1) యమము 2) నియమము 3) త్యాగము 4) మౌనము 5) దేశము 6) కాలము 7) ఆసనము 8) మూలబంధము 9) దేహ సామ్యము 10) దృక్స్థితి 11) ప్రాణాయామము 12) ప్రత్యాహారము 13) జ్ఞానము 14) ధారణ 15) సమాధి. వీని లక్షణములీ క్రింద చెప్పబడినవి.

1) పంచ భూతములు, త్రిశరీరములు అనెడు బాహ్య దృశ్యములును, చతుర్దశేంద్రియములు అనెడు అంతర దృశ్యములును పరబ్రహ్మమేయనియును, ఆ పరబ్రహ్మమే తానని తలంచి వికల్పము లేక యుండుటయే యమము.

2) వర్ణ రూప, ధ్వని రూపములైన సర్వ శబ్దములును చెవితో వినుచు, మృదువు, కఠినము, వేడిమి, చల్లన మొదలగు స్పర్శములను చర్మము చేత గ్రహించుచూ దశ విధ రూపములను కంటితో చూచుచు, షడ్రసములను జిహ్వతో తెలిసికొనుచు, సుగంధ దుర్గంధ మిశ్ర గంధములను నాశిక చేత ఆఘ్రాణించుచు సుశబ్దాపశబ్దములను నోటబలుకుచు, దాన ప్రతిగ్రహాది సర్వకార్యములను హస్తములతో జేయుచు, పాదములతో నడుచుచు, నాలుగు వర్ణములకు నాలుగు ఆశ్రమములకు తగిన పనుల నెల్లప్పుడును చేయుచు, అంతఃకరణము చేత ఇహ పర విషయములను ఊహించుచు తిరుగునెడల కన్ను, చెవి మొదలైన ఇంద్రియములలో, యీ ఇంద్రియములు చూచుట, వినుట లోనగు విషయములలో యీ విషయములనంటి నడచుచున్నది. యింద్రియములను సాక్షియై వీక్షించువాడను, సచ్చిదానంద స్వరూపుడను. త్రిగుణ సంబంధమైన శాంత–ఘోర–మూఢవృత్తులను, బ్రాహ్మణత్వాదిజాతులును, దీర్ఘ హ్రస్వ స్థూల సూక్ష్మాది రూపములను, శివరామ గోవింద నారాయణ మహాదేవాది నామములను లేనివాడను అని ఎఱిగి ఎల్లప్పుడు ఉల్లాసముతో తన్ను తాను వీక్షింపుచు యీ నియమమును వదలక యుండుటే నియమము.

3) నేను ప్రత్యగాత్మ స్వరూపుడను, శరీరేంద్రియ మనః ప్రాణాదులునే గానని వానియందు అభిమానము వదలుటయే త్యాగము.

4) "యతోవాచో నివర్తనే। అప్రాప్య మనసాసహా॥ అను శ్రుతి చేత వాక్కు వలన యిట్టిది, అట్టిది అని పలుక రాక మనస్సు చేత ఇట్టిది, అట్టిది అని ఊహింపరాక వెలుగు పరమాత్మ తానై మితముగా సంభాషించుచు సంభాషించిన మాటలివియని జ్ఞప్తియుంచక నిస్సంకల్పుడై యెల్లప్పుడు బ్రహ్మానందామృతమును ననుభవించుచూ నుండుటయే మౌనము.

5) ఆత్మానాత్మ జ్ఞానము గల పండితుల చేతను, గురూపదేశము చేతను తెలిసికొనబడునదియై జ్ఞానభూమికల నేడింటిని మీరినదై అంతరేంద్రియ జ్ఞానేంద్రియ కర్మేంద్రియ ప్రాణ అవ్యక్త మహత్ ఆదుల ప్రవర్తనములును, కామ క్రోధ లోభ మోహమదమత్సర భయ సుఖ దుఃఖ జనన మరణాదులును, ఆధ్యాత్మిక ఆధి భౌతిక ఆధి దైవికములనెడి త్రితాపములును, కామ క్రోధాది క్షుద్ర శత్రువుల బాధలును లేక కాల త్రయమందు గలదై నిర్మలమై అప్రాకృతమై సర్వశ్రేష్ఠమై నిరతిశయానంద స్వరూపమై మెరయు పరబ్రహ్మమే యేకాంత దేశము. ఆ స్థలమున నివశించు భక్తుడు జీవన్ముక్తుడై ఆనందమయు డగును.

6) అఖండమైన కాలమును చిగుళ్ళు, ఆకులు, మొగ్గలు, పూవులు, పిందెలు, కాయలు, పళ్లు మొదలగువాని యుత్పత్తి స్థితి లయములకు ముందును, వెనుకను వృద్ధి క్షీణములు లేక ఒక్క తీరుగా వెలుగుచు కాలనియమము లేక ప్రకాశిల్లు పరబ్రహ్మమే కాలము. యోగి ఆ కాల స్వరూపము తానై నిమేషాది పంచకర్తల ప్రళయాంతమైన కాలమునకు లోబడక మెరయుచుండును.

7) సూక్ష్మ శరీరమందుండు ప్రాణ వాయు ధర్మమగు కదలుట, హస్త పాదాదులను చాచుట ముడుచుట, పరుగెత్తుట, యెగురుట, దుముకుట మొదలైనవి స్థూల శరీర ధర్మమైన శరీర పీడయును, కారణ శరీర ధర్మమగు బడలిక, మందము, నిద్ర, ఆయాసము మొదలుగునవియును లేకుండా బ్రహ్మము తానై యుండుటే సుఖాసనము.

8) అష్టపాశ బంధములకు ముఖ్య కారణమైన మూల ప్రకృతి సంబంధము దేనిని సందర్శించిన మాత్రముననే వీడునో, ముప్పదియారు తత్త్వములకు యేది కారణమై యున్నదో ఆ పరబ్రహ్మమే మూలబంధము.

9) సముద్రమున నదులు చేరి అభేదముగానున్నట్లు బ్రహ్మానందమందు చతుర్దశేంద్రియ గుణములను శబ్దము స్పర్శము మొదలైనవి చేరి ఆనందమయమై యుండుటే దేహ సామ్యము.

10) చెవి, చర్మము, కన్ను, నాలుక, నాసిక, నోరు, హస్తము, పాదము, గుదము, గుహ్యము అనెడి వెలుపలి దశేంద్రియముల వృత్తులైన శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము, వచనము, దానము, గమనము, విసర్జనము, ఆనందము అనువాని నెఱుంగునది బాహ్య లక్ష్యము. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనెడు అంతరేంద్రియముల వృత్తులయిన సంశయము, నిశ్చయము, చంచలము, కర్తవ్యము అనువాని నెఱుగునది అంతర్లక్ష్యము. వెలుపలి లోపలి యింద్రియముల విషయముల నెఱుగునది మధ్య లక్ష్యము. జ్ఞానేంద్రియ మనోవృత్తుల నెఱుగునది షణ్ముఖీ. ఈ లక్ష్యముల నెఱుగునది శాంభవీ లక్ష్యము. ఇదియన్ని లక్ష్యములలో ఉత్తమమైనది. ఆ శాంభవీ లక్ష్యము చేత సర్వ దృక్కగు పరబ్రహ్మమునందు దృష్టి నిల్పి వికల్పము లేక యుండుటే దృక్స్థితి.

11) పంచ ప్రాణములను, చతుర్దశేంద్రియములను వాని వృత్తులను పరబ్రహ్మ మని ఆ పరబ్రహ్మము నేనని భావించుటే ప్రాణాయామము. మనస్సునకు వెలుపల కనబడెడు ఘటము పటము మొదలుగునవి యనెడు నామములును, రూపములును లోపల కనబడెడు కామము, క్రోధము, లోభము మొదలుగునవి యనెడు నామములును, రూపములును మాయాకల్పితములు కనుక అవి తాను గానని నిషేధించి, సచ్చిదానంద పరబ్రహ్మము తాననెడి భావమును అంతరంగ మున నిల్పి, ఆ భావమును తొలగనీయక ప్రజ్ఞానమును పరబ్రహ్మమందు లీనము చేసియుండుటే ప్రాణాయామము.

12) పరబ్రహ్మ సంబంధములైన సచ్చిదానంద నిత్యనిర్మల శాంత శమదమాద్యనంత కళ్యాణ గుణములను ప్రకృతి సంబంధములైన కామక్రోధ లోభమోహాది దుర్గుణములను పరమాత్మగా భావించుటయే ప్రత్యాహారము.

13) స్థూల సూక్ష్మకారణ శరీరములు జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు, దశ విధ ప్రాణములు, మనోబుద్ధి చిత్తాహంకారములు మొదలుగు దృశ్యములు నేను గాను. వీనిని తెలిసికొనెడు సాక్షి స్వరూపుడను నేను అని యెంచి, ఆ

నిలకడ తప్పక యుండుటే ధ్యానము.

14) కర్తృకరణ కార్యరూపమైన మనస్సు దేనిని సంకల్పించునో, దేనిని చూచునో, ఆ సంకల్పించినది చూచినది పరమాత్మయను సంకల్పమును ఆ మనస్సునందే స్థిరపరచుట ధారణ యోగము.

15) జాగ్రత్స్వప్న సుషుప్తి తురీయమనెడి యవస్థలయందు దోచిన సమస్త భోగసాధన శూన్య సాక్షాత్కారములనెడి సకలమును పరమాత్మయేయని ఎల్లప్పుడు దర్శించుటయే సమాధి.

అనుభవ స్వరూప జ్ఞానము

1) శిష్య స్వరూపమనగా ప్రజ్ఞానము. సర్వమును గుర్తెఱిగే తెలివియే తాను. స్థాన భేదము చేత జీవుడని, ఈశ్వరుడని, ప్రత్యగాత్మయని, పరమాత్మయని చెప్పబడును. ఎఱుక యన తెలివియకన ఒక్కటే. మలిన జీవుడని, శుద్ధ జీవుడని, మలిన ఎఱుకయని, శుద్ధ యెఱుకయని కూడా చెప్పబడును. ఆజ్ఞా చక్రమందుండి జాగ్రతనెఱుగు వెలితెలివియే మలిన జీవుడు. ఇదియే అనుభవమున మలిన యెఱుక యనబడును. ఇది బహిఃప్రజ్ఞయనబడును.

2) ఘంటికయందుండి స్వప్నమునెఱుగు లోతెలివియే శుద్ధ జీవుడు. అనుభవమున శుద్ధ యెఱుకయని, అంతఃప్రజ్ఞయని అనబడును.

3) అష్టదళముల యొక్క లోపలనుండి సుషుప్తి సుఖము గుర్తెఱుగు నడి తెలివియే ఈశ్వరుడు. దీనినే ఊహ, ఉభయ ప్రజ్ఞయని అందురు.

4) అష్టదళముల యొక్క మధ్యప్రదేశమున మహాకారణ దేహమందు మధ్య తెలివియే ప్రత్యగాత్మ. దీనినే జ్ఞప్తి, అంతరాంతర ప్రజ్ఞయని అందురు. మహాకారణ దేహమందుండి తురీయాతీతమును గుర్తెఱిగే నిరుపమ తెలివియే పరమాత్మయన బడును. అనుభవమున నిర్గుణ జ్ఞప్తియనబడును. దీనికి ప్రమాణము ప్రభులింగ లీల. “ఆ నిర్గుణ జ్ఞప్తియందుండగా పొలుపొందగా నిద్రపోయితిననుచు తెలియు వారెవ్వరు ఆ తెలివియు గాక మరియు అధిప ఇది మర్మమంగథ రాగ్రమధ్య వార్ధినడుమను కృష్ణాశ్రయ ద్వారవతిని ఆత్ముడున్నాడు, సూక్ష్మ దృక్జ్ఞప్తి చేత జ్ఞాత గలవాడవై కను సంజ్ఞ చేత..........”

1) పిండాండములో బ్రహ్మాండమను ఉత్తమాంగమందలి (భృకుటియందు), చిదాభాసుడు, ప్రజ్ఞానుడు, మలిన (ప్రజ్ఞ) యెఱుక స్వరూపులనబడుదురు.

2) పిండాండములో బ్రహ్మాండమను మూర్ధ్నియందలి ప్రత్యగాత్మ పరమాత్మలు శుద్ధ (ప్రజ్ఞ) యెఱుక స్వరూపులబడును.

3) వాచ్యార్థములైన చిదాభాసుడు, ప్రజ్ఞానుడు, లక్ష్యార్థమైన స్వరూపులైన ప్రత్యగాత్మ పరమాత్మలు లేని (ప్రజ్ఞ) యెఱుక యనబడును.

4) శుద్ధ (ప్రజ్ఞ) యెఱుక స్వరూపులైన ప్రత్యగాత్మ పరమాత్మలు తానై లేకపోవుటయే నిర్వికార అచల పరిపూర్ణ పరబ్రహ్మమని యనుభవము.

“మనసిజ తృష్ణ చేతనొక మానవనాధుడు డస్సి యేగుచో వనరుహ నేత్రి గన్పడిన వాడు సరోవర మెక్కడే చెలీయనునది బల్కెనీ జగతి కావలనుప్పర వీధి అందులో ఘన నిబిడాంధకార తతి గల్గిన భావినతిక్రమింపకుండనమగు మెట్ల మధ్య నొక దైవతరాజ శిలాపదంబునుం దాటిన అందొక మెట్టయన్న దచటనొక శంఖము గల్గును. దానిపై నున్కియు గల్గి రాజు మహదోన్నతుడై విలసిల్లు నీ వాతనికడకేగినన్ యమృత దానమొసంగును. వేగమేగు నీ మనసిజ తృష్ణ దీరునని మానిని బల్కెను మానవేంద్రతో ॥

అష్ట దళానుభవ సూత్రము

1. ఆకాశ దళ విషయము : ప్రజ్ఞానం, దళము, నాడి, చెవి, నిరావరణము, రావము, సునాదము, నాదము.

2. వాయు దళ విషయము : నిస్పర్శ, సుస్పర్శ, సూక్ష్మ స్పర్శ, స్థూల స్పర్శ

3. అగ్ని దళ విషయము : నిష్కళ, సుకళ, సుజ్యోతి, జ్యోతి.

4. జల దళ విషయము : నిద్రవము, ద్రవము, సురసము, రసము.

5. పృథివి దళ విషయము : నిర్గంధము, సుగంధము, మిశ్ర గంధము, గంధము.

6. అహంకార దళ విషయము : జాగ్రత్తలో తురీయము, జాగ్రత్తలో సుషుప్తి, జాగ్రత్తలో స్వప్నము, జాగ్రత్తలో జాగ్రత్త.

7. మహద్దళ విషయము : స్వప్నములో తురీయము, స్వప్నములో సుషుప్తి, స్వప్నములో స్వప్నము, స్వప్నములో జాగ్రత్త.

8. అవ్యక్త దళ విషయము : సుషుప్తిలో తురీయము, సుషుప్తిలో సుషుప్తి, సుషుప్తిలో స్వప్నము, సుషుప్తిలో జాగ్రత్త.

పరిపూర్ణ బోధ

తుర్యాతీతమును ప్రతిపాదించు నిశ్చల మార్గమేమనిన ద్వాదశి, షోడశిలు దృష్టాంతద్రాష్టాంతముల చేత పరిష్కారమగుటయే.

సకల దేశములందు సకల కాలములందు, సకల వస్తువులందు, చలనము లేక చావు పుట్టుకలు లేక, తనకు తాను స్వతఃసిద్ధమై యున్న యీ ఉత్త బట్టబయలు తప్ప యేమి లేదు. కలలో గనుపడిన గజము మేలుకొని చూడగ యేలాగు లేదో, అలాగే మూలము లేని యీ గురెఱిగే శరీరము యేమి లేదు. ఇది గురు ముఖముగా విచారించవలెను.

"ఈ ఉత్త బట్టబయలు యేమి లేదు" అనెడి ద్వాదశాక్షరి చక్కగా తలచి, తరువాత కలలో దోచిన శరీరాలు యేలాగో అలాగే "మూలం లేని యీ గుర్తెఱిగే శరీర ద్వయము యేమి లేదు" అనెడి షోడశాక్షరిని సదా మరువక యుండవలెను. ఇట్టి గురువాక్యములను అశ్రద్ధ జేయక ద్వాదశిని నిశ్చయము చేసి, షోడశిని విడచిపెట్టిన, పరిపూర్ణమే యుండును. ఇదియే జనన మరణ భ్రాంతి రహితమైన అచల సూత్రమని యెఱుగవలెను.

– భద్రాద్రి రామ శతకము

సీ॥ బాధితంబైన యీ ప్రకృతి ద్వయము లేని కేవలం పరిపూర్ణ భావమునకు । స్థూల దేహము లేదు సూక్ష్మ దేహము లేదు కారణ దేహ సంఘటన లేదు ఘన మహాకారణ ఘటము లేనే లేదు. జాగ్రదవస్థ లేదు లేదు । లేదు స్వప్నావస్థ లేదు. నిద్రావస్థ లేదు తుర్యావస్థ లేదు లేదు । సర్వమీశ్వరతను చతుష్టయము లేదు । విశ్వతైజస ప్రాజ్ఞాది విభులు లేరు ॥ రమ్యగుణ ధామ భద్రాద్రి రామ పరశురామ నరసింహ్మదాస సంరక్షితాహ్వ ॥

– భద్రాద్రి రామ శతకము

తా॥ ప్రకృతి ద్వయ దోష రహితమై పరిపూర్ణమునకు స్థూల సూక్ష్మ కారణ మహాకారణ దేహములును, జాగ్రత్స్వప్న సుషుప్తి తుర్యావస్థలును, విరాట్ హిరణ్య గర్భ అవ్యాకృత సర్వసాక్షియగు విశ్వతైజస ప్రాజ్ఞ ప్రత్యగాత్మాభిమానులును లేవని యెఱుగవలెను.

పరిపూర్ణ లక్షణము :

సీ॥ ఆద్యంతములు లేని యచలము రెండో ప్రకారంబునెన్నడు గాక యుండు । క్రిందట గాలేదు ముందర గాబోదు ఇప్పుడు గాలేదు. యికను గాదు । సర్వ కాలంబేకసరణిగా కదలక మెదలక వదలక బెదరకుండు । ఈ ప్రపంచంబునకీ పరిపూర్ణంబునకును సంబంధమెన్నటికి లేదు । చావు పుట్టుక లలరె నీ జగమునకును । చావుపుట్టుక లేనిది కేవలాత్మ ॥ రమ్యగుణ ధామ భద్రాద్రి రామ పరశురామనరసింహ్మదాస సంరక్షితాహ్వ ॥

– భద్రాద్రి రామ శతకము

తా॥ ఆది మధ్యాంత రహితమైన అచల పరిపూర్ణము రెండవ ప్రకారము లేదు. క్రిందట కాలేదు, ముందర కాబోదు, యిప్పుడు కాలేదు, యిక కానే కాదు. అది యెప్పుడు ఒక్క తీరుగా నిలచి, కదలక, మెదలక, వదలక, బెదరక యుండును. ఈ ప్రపంచమునకు ఆ పరిపూర్ణమునకు సంబంధము యెన్నడు లేదు. చావుపుట్టుకలు గలిగినది ప్రపంచము; చావు పుట్టుకలు లేనిది పరిపూర్ణము అనబడును.

ఎఱుక నిరసన లక్షణము :

సీ॥ ఆది మధ్యాంత శూన్యంబైన దానిలో పంచభూతములు జన్మించలేదు । బంధముక్తులు లేని పరిపూర్ణమందు నీ పంచకోశములుద్భవించలేదు । జ్ఞాన కర్మంబులు లేని వస్తువుయందు ప్రకృతి ద్వయంబులుత్పతిత లేదు । యచలమునందు మాయా విద్య । లాది యుపాధిద్వయంబులుద్భవము లేదు ।

జగము జీవులు స్థావర జంగమములు । బట్టబయలందు నెన్నడు బుట్టలేదు ॥
రమ్యగుణ ధామ భద్రాద్రిరామ పరశురామ నరసింహ్మ దాస సంరక్షితాహ్వ ॥

– భద్రాద్రి రామ శతకము

తా॥ ఆది మధ్యాంత శూన్యంబైన దానియందు పంచ భూతములు పుట్టలేదు. బంధవిముక్తులు లేని పరిపూర్ణమందు పంచకోశములు పుట్టలేదు. జ్ఞానకర్మములు లేనట్టి బట్టబయలందు ప్రకృతి ద్వయములు పుట్టలేదు. అచలమునందు మాయా విద్యోపాధి ద్వయదోషములు జగద్యుగములు, జీవేశ్వరులు, స్థావర జంగమములు యెన్నడును పుట్టలేదు.

చీమ మొదలు బ్రహ్మ వరకు కలలో యెక్కడినుండి వచ్చినవో గాని, మేల్కొని చూచిన, యొక్కటియు లేదు. బట్టబయలైన అచల పరిపూర్ణము మాత్రము ఎప్పటికి యొక్క తీరుగనుండును.

ప్రకృతి ద్వయ సృష్టి రహితము :

క్షరాక్షరములు, సగుణ నిర్గుణములు, సత్యాసత్యములు, సత్తుచిత్తులు, కారణకార్యములు, జ్ఞానకర్మములు, పురుష ప్రకృతులు, యెఱుక మరుపులు, పాప పుణ్యములు, బంధ మోక్షములు, జనన మరణములు, జడాజడములు, క్షేత్రక్షేత్రజ్ఞులు, జీవదేహములు, మానాభిమానములు, మంచిచెడ్డలు నందు యెప్పుడు పుట్టలేదు.

– భద్రాద్రి రామ శతకము

మాయా నామములు :

చైతన్యమన్న, క్షేత్రజ్ఞుడన్న, జ్ఞానమన్న, అహంకారమన్న, సద్రూపమన్న, చిద్రూపమన్న, స్వస్వరూపమన్న, సాక్షియన్న, ఈశ్వరుడన్న, విష్ణువన్న, పరమాత్మయన్న, బ్రహ్మమన్న, ఆదిశక్తియన్న, ఆనందమనియన్న, పరమపదమన్న, ప్రకృతియన్న యీ మొదలైన పర్యాయ నామములు మాయకే గాని, బట్టబయలునకు లేవు.

– భద్రాద్రి రామ శతకము

కాలాతీత లక్షణము :

బ్రహ్మకల్పములు, యుగములు, సంవత్సరములు, మాసములు, పక్షములు, తిథి వార నక్షత్రములు, గ్రహయోగ కరణలగ్నములు, పర్వములు, ఋతువులు, రాత్రిపగళ్ళు, చీకటి వెలుతురులు, మేఘములు, ఉదయాస్తమయములు, చంద్ర సూర్య గ్రహణములు, త్రివిధ కాలములు, దిశలు, నాదబిందు కళలు, ఆకాశ, జీవనిర్జీవములు, మొదలైనవి కాదు కేవలాత్మ

– భద్రాద్రి రామ శతకము

హేతుత్వరహితము :

కర్తృత్వము, భోక్తృత్వము, స్మర్తృత్వము, మంతృత్వము, జ్ఞాతృత్వము, శ్రోతృత్వము, ఘ్రాతృత్వము, వక్తృత్వము, ధ్యాతృత్వము, పాతృత్వము, శత్రుత్వము, మిత్రత్వము, జైత్రత్వము, గోత్రసూత్రములు, అపవిత్ర పవిత్ర గాత్రములు మొదలైనవి లేవు కేవలాత్మకు.

– భద్రాద్రి రామ శతకము

విషయ రహిత లక్షణము :

దయ, భయము, ధైర్యము, శ్రద్ధ, లజ్జ, శమము, దమము, దర్పము, అహంకారము, ఇచ్ఛ, దంభము, దైన్యము, మదము, లోభము, మోహము, కామము, క్రోధము, మత్సరము, సుఖము, దుఃఖము, క్షయము, వృద్ధి, క్షుత్తు, పిపాస, సంశయము, నిశ్చయము, సంకల్పము, వికల్పము, కంపనము, ఆకుంచనము, గమనము, చలనము, శ్వాసము, నిశ్వాసము, నిసర్గము, వ్యాపకము, రాగము, ద్వేషము, కుటిలము, గర్వము, వేషము, భాష, వినయము, అభిమానము, మొదలైన విషయ సంఘములు (సంగములు) కేవలాత్మకు లేవు.

– భద్రాద్రి రామ శతకము

బోధ స్థితి లక్షణము :

ఈ ఉత్త బట్టబయలు యేమీ లేదనువాడు, రాగవిరాగములు లేనివాడు, మూలం లేని యీ గుర్తెతిగే శరీరం యేమీ లేదనువాడు, జ్ఞాన అజ్ఞానములు

లేని వాడు, ఉన్నది ఉన్నట్లు ఉండజూచిన వాడు, సుకర్మ దుష్కర్మములు లేనివాడు, లేని మాయా విద్యలు యేమీ లేదనువాడు, సర్వజ్ఞత్వ కించిజ్ఞత్వములు, మిథ్యా జగములు లేవనువాడు మరియు బంధమోక్షములు లేనివాడని యెఱుగవలెను.

ఈ ఉత్త బట్టబయలు యేమీ లేదు. అది తనకు తానే స్వతఃసిద్ధమై పరిపూర్ణమైయున్నది. అందులో కలలో గనుగొన్న గజము యేమీ లేనటుల మూలం లేని యీ గుర్తెరిగే శరీరము యేమీ లేదు. ఇదే గురువాక్యము. ఇంతకంటె యెక్కువ లేదు. ఇదే రాజమార్గము. ఇదే అనాయాసము. ఇదే భ్రాంతి రహితము. ఇదే స్థిరము. దీనిని నమ్మినవారికి యే బాధలుండవు. జనన మరణములు తొలగిపోవును అని తెలిసికొనవలెను.

– భద్రాద్రి రామ శతకము

గురుగోప్యము

శాస్త్ర విషయమెంత చదివినను, బోధింపబడినను, గూఢార్థము తెలియక భ్రమ జెందుట కలదు. అందుకే "జతనముగ దాచి చదువుము" అనగా గురు గోప్యమును కాపాడుమని శ్రీ కృష్ణ దేశి కేంద్రుల వారు హెచ్చరించినారు. గురుముఖతః మాత్రమే గుర్తెఱుగ తగిన గురుగోప్య విషయములను కొన్నింటిని వివరించుచున్నారు.

1. శక్తి ద్వయము
2. లక్షణయుతుడెవరు?
3. ప్రాగర్ధ యోగము, చరమార్ధ యోగము ఏవి?
4. పిండాండము, బ్రహ్మాండము ఏవి?
5. సాధన చతుష్టయ సంపత్తి అని గాక, సాధన సంపత్తి అనుటలో ఆంతర్యమేమి?
6. ఘోర సంసారమేది?
7. మొదలచలమునెఱిగించుట ఎందుకు?
8. మొద్దులు ఎవరు? బుద్ధులు ఎవరు?
9. ఆకాశాదికము అనగానేమి?
10. మరుపుకు తన్మాత్రలు ఎట్లున్నవి?
11. నారికేళమందు సలిలము ఎట్లు వచ్చినది?
12. ఈ రెండెన్నడు కలియవో నాడెసున్నసుమీ! ఎఱుక మాట అన్నారు. ఎప్పుడు కలియకుండా పోవుచున్నవి?
13. మేనెఱుకలు ఇప్పుడు దేనందున్నవో చూచి అన్నారు. దేనందు ఉన్నవి?
14. హృదయ పద్మము ఏది?
15. ఎఱు కను కలలో పురుషుడు ఎవరు?
16. గురుకృప ఉంటే బయలు అపరోక్షము అన్నారు. ఎట్లు?
17. ఏ పురుషుడు గురువర్యుని శ్రీపాదము పట్టలేదో అన్నారు. ఆ శ్రీపాదము ఏది?
18. హృదయ గ్రంథి ఏది?
19. క్షరాక్షరోపాధిద్వయదోషము అన్నారు. ఆ దోషమేది?
20. సురస్వప్నము అనగానేమి?
21. రెండు వస్తువుల నడుమ అఖండంబిదె గానుపించు కదా! అన్నారు. ఆ రెండు వస్తువులు ఏవి?
22. అచలము, బట్టబయలు, పరిపూర్ణము అన్నియు ఒక్కటేనా? తారతమ్యము న్నదా?

ఇట్టి గురుగోప్య విషయములు శిష్యులకు సంపూర్ణముగా చెప్పగలవాడే సాంప్రదాయక సద్గురువు. అట్టి సాంప్రదాయక గురువును ఆశ్రయించి, వస్తు నిర్ణయముగా పరిపూర్ణమును, ఎఱుకను ఎఱిగి, సర్వభ్రాంతి రహితము గావించుకొని భక్తి ముక్తి క్రియలందు పూర్ణయోగము పూని రాజ యోగ రీవితో మానవజన్మను సార్ధకమొనరించుకొనవలసియున్నది.

ఆవరణ – నిరావరణ

సృష్టిలో గల సమస్త వస్తువులకు స్థూలమగునొక ఆవరణ అంటూ ఉండక తప్పదు. ఆయావరణయందు తత్త్వరూపముగానో, శక్తి రూపముగానో లేక గుణ రూపముగానో, ఆ వస్తువు యొక్క సూక్ష్మము యిమిడియే ఉంటూ ఉన్నది.

"ఆ బ్రహ్మ స్తంభ పర్యంతము పరమాత్మ స్వరూపకం" అంటే ప్రతి వస్తువు నందు సూక్ష్మ రూపములో పరమాత్మ వ్యాపించి యున్నాడు. "జీవో బ్రహ్మైవ న పరః" దేహాత్మయందు ఆ పరమాత్మే జీవరూపముగానున్నాడు. కనుక సూక్ష్మ రూపములో నున్న ఆ పరమాత్మకు సమస్త దేహములున్ను, వస్తువులున్ను స్థూల రూపములే, అనగా ఆవరణములే.

అపుడిక భగవంతుడు సాకారుడా, నిరాకారుడా అను సమస్య తేలిపోయినట్లే. సాకారుడూ అతడే, నిరాకారుడూ అతడే. మొదటిది అతడి స్థూలరూపము. రెండవది అతడి సూక్ష్మ రూపము.

మందాధికారుల సౌలభ్యమునకై "ఉపాసకానాం హితార్థాయ బ్రహ్మణో రూపకల్పనా" అని విగ్రహారాధనలు ఏర్పడినవి. దేనిని నామరూపకల్పనలతో సామాన్యులు ఉపాసించుచున్నారో దానినే జ్ఞానులు నిరాకార వస్తువుగా ఉపాసించుచున్నారు.

కనుక ఆ ఒక్క పరమాత్మయే సాకారముగా చూచువారికి సాకారముగాను, నిరాకారముగా చూచువారికి నిరాకారముగాను, సర్వత్రా చూచువారికి సర్వత్రాగాను కనుపించును. సృష్టికి పూర్వముండిన రీతిగా జగత్కారణ వస్తువు కనుపించును. ఆత్మ జ్ఞాని తెలిసికొనగోరునట్టి అతీత స్థితిలోనున్న పరమాత్మకే పురుషోత్తముడని పేరు. ఆ పురుషోత్తముడుండుటకు ఒక స్థానమని గాని, లోకమని గాని నిర్ణయించవచ్చునా? అలా ఉంటే ఏక దేశీయుడు, ఖండస్వరూపుడు మాత్రమే అగును. అఖండుడు కాడు. సంపూర్ణముగా విచారించినచో తాను పురుషోత్తముని కంటె భిన్నుడను గానని తెలియవచ్చును. ఇందుకు సాధనారూపముగా ఉత్తర గీత "ఖమధ్యే కురు చాత్మానాం, ఆత్మ మధ్యే చ ఖం కుర" అని ఆదేశించుచున్నది. గురుముఖతః విచారించి గుట్టు తెలిసికొన్నవారు గాని యితరులు యీ సాధనయందు కృతార్థులగుట కష్టము. మన ఊహకందే సమస్తమునకు ఆవరణయున్నదని చెప్పవలెను. జీవేశ్వరులకు కూడా ఆవరణమున్నది. స్థూల సూక్ష్మ కారణ శరీరములు మూడున్ను జీవేశ్వరులకు ఆవరణములైయున్నవి. కనుకనే "మరుపన తొలి మేనులు మూడెఱుకలన నాల్గవ శరీరమీ రెండొకట" అన్నారు కృష్ణదేశి కేంద్రుల వారు.

ఈ శరీరత్రయములో స్థూల దేహమునకు సూక్ష్మ శరీరమున్నూ, సూక్ష్మ శరీరమునకు కారణ శరీరమున్నూ, కారణ శరీరమునకు మహాకారణ శరీరమున్నూ కారణములై మరియు ఆవరణములైయున్నవి. మహాకారణ శరీరమే ప్రత్యగాత్మ. ఇదే సమిష్టియందు పరమాత్మ అయి వున్నది. కారణ శరీరముచే ఆవరింపబడిన ప్రత్యగాత్మకే జీవుడని పేరు.

అయితే, కారణ శరీరమనగా అజ్ఞానము, అవిద్య. ఇదే మిశ్రమ సత్త్వ ప్రధానమగు ప్రకృతి. కనుక జీవునికి అజ్ఞానమే కారణము లేక ఆవరణమై యున్నది. ఈ విధముగా విమర్శించినచో శుద్ధ సత్త్వ ప్రధానమగు మాయ లేక అవిద్యయే ఈశ్వరునికి కారణ శరీరము. ఇంకనూ, ఈ విచారణను పొడిగించినచో మూలప్రకృతియే సృష్టికి కారణమగు పరమాత్మకు ఆవరణముగా దెలియుచున్నది.

అవిద్యావరణము, విద్యావరణము, ప్రకృత్యావరణములను ముఖ్యమగు మూడావరణములు పరిపూర్ణ పరబ్రహ్మమును తెలియుటకు అవరోధములుగా నున్నవి. కనుకనే భగవద్గీతయు "అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః " జీవులు అజ్ఞానావరణమున మునిగి ఏ రీతిగా మోక్షమును పొందగలరు? అని తెల్పెను.

ఈ ఆవరణములన్నీ ఈ క్రింది దృష్టాంతముతో దెలియును.

మహాసముద్రములో గాజు వరలతో ఒక పెద్ద ఆవరణ, అందులో మట్టి వరలతో చిన్న ఆవరణ, అందొక కప్ప యున్నవి. కప్పయే జీవుడు, మట్టి వరలు అంతఃకరణము లేక అవిద్యావరణము. గాజు వరలు మాయావరణము. ఈ రెండావరణముల సమిష్టియే ప్రకృత్యావరణము. త్రికరణ శుద్ధి పూర్వకమగు సత్కర్మానుష్ఠానమున్ను, ధారావాహికమగు రూపోపాసన చేతను, అవిద్యావరణ రూపమగు మట్టి వరలు పలచబడినచో, మాయావరణ రూపమగు గాజు వరలు మాత్రమే శేషించును. కాని నిరావరణ రూపమగు పరిపూర్ణ సముద్రము యొక్క అఖండ స్వరూపము చక్కగా గోచరించుచునే యుండును. ఇదియే ఆవరణము నందే నిరావరణమును జూచు పద్ధతి. ఈ విధముగా సాధకుడు ఆత్మ దృష్టి సాధించి గురుకృపా పాత్రుడై ఆ పిమ్మట జన్మకారణమగు ఎఱుక రహితస్థితి

ఉండజూచుకొని జన్మరాహిత్యమును సాధించగలడు.

హంస సమాధి

ఈ హంసయే మూడు స్థానములందు మూడు విధములగు కార్యములను జేయుచుండును. హంస లేకపోయినచో కార్యములు లేకపోవును. అకార రూపుడైన తాను ప్రత్యక్పరమాత్మలయందు ఐక్యమొందగా హంస లేకపోవను.

ప్రథమ సమాధి : ప్రత్యక్పరమాత్మలను చేరు విధమెట్లనిన హకార రూపుడైన తాను సకారమును చేరక నేనను రెండు వర్ణముల నడుమనుండు పొర్లునందు చేరి తానాపొర్లై, ఘంటికయందలి బిందువును లక్షించగా వ్యాపారమునకు కారణమగు రెక్కలు తెగి వ్యవహారము లేక జీవహంస లేకపోవును.

ద్వితీయ సమాధి : హకార రూపుడైన తాను, సకారమును చేరక, హంసయనే రెండక్షరముల మధ్యనున్న బిందువుతో జేరి తానాబిందువై దళముల మధ్యనున్న దీర్ఘమును లక్షించగా నడకకు కారణమైన చరణములు తెగి నడక లేక పోవుటచే కలహంస లేకపోవును.

తృతీయ సమాధి : హకార రూపుడైన తాను, సకారముతో చేరక రామయనే వర్ణద్వయ మధ్యనున్న, దీర్ఘమును లక్షించి యాదీర్ఘము తానై నాల్గవ దేహమే ఉపాధియగు ప్రత్యగాత్మను విచారించి, తాను లక్ష్యార్థ స్వరూపుడై యా పరమాత్మను లక్షించగా జపమునకు కారణమగు శిరసు తెగిపోయి జపము లేకపోవుటచే అచల హంసయనే పేరు లేకపోవును. దీనినే తురీయమందురు.

చతుర్ధ సమాధి : హంస స్వరూపుడైన తాను ఆ పరమాత్మనెప్పుడు అవలోకించు చుండి యా లక్ష్యమున నిలచి నిరతము తానా పరమాత్మయేయైనాడు. కనుక హకారానామము పోయి పరమాత్ముడైనాడు. దీనినే తురీయాతీతమందురు. ఇదే స్వరూపలయము, పరమాత్మ స్థానము. అవస్థారహితునకు ముక్తి కలుగును. ముక్తియనగా విడచుట, మోక్షమనగా వదలుటయని అర్థము. ప్రత్యగాత్ముడగు తాను పిండాండ బ్రహ్మాండ ద్వయమును లక్షించి బ్రహ్మాండమందుండు శింశుమార చక్రమును పిండాండమున అష్టదళ పద్మమును బ్రహ్మాండము మధ్యన ధృవుని, పిండాండమందు ఘంటికను, బ్రహ్మాండమున సూర్యుని, పిండాండమున ఆజ్ఞేయమును, వీటిని లక్షించగా వాచ్యార్థములు లేకపోవును. లక్ష్యార్థములగు ప్రత్యక్పరమాత్మలు బ్రహ్మాండమందు కనలేకపోయెను. కనుకనే బ్రహ్మమయి తాను పరిణమించే ఉభయ లక్ష్యార్థములను వదలుట మోక్షమనిరి, మరి విడచునదే ముక్తియనిరి. మునులు దీనిని అరూపలయమని పలికిరి.

సూక్ష్మశరీరతత్త్వలయము

సూక్ష్మ శరీరము కర్మజమగుట వలన కర్మము క్షీణించెనేని స్థూల దేహమును క్షీణించును. సూక్ష్మ దేహము సహజమగుట వలన కత్తుల చేత నరుకబడక, నీళ్ళ చేత నానక, నిప్పు చేత కాలక, గాలి చేత శోషింపబడక, వృత్తిప్రళయ, నిత్యప్రళయ, దేహప్రళయ, మనుప్రళయ, బ్రహ్మప్రళయ, విష్ణుప్రళయ, రుద్ర ప్రళయ, ఈశ్వరప్రళయ, సదాశివప్రళయ, విరాట్పురుష ప్రళయము లందును చెడక విదేహముక్తి పర్యంతము నుండును. ఇది చెడిన గాని ముక్తి కలుగదు. ముక్తి కోరినవాడు దీనిని ముందుగా చెరుపక కారణ శరీరమును చెరుపవలెను. అది భ్రాంతి జన్యమగుటవలన అపరోక్ష బ్రహ్మ సాక్షాత్కార జ్ఞానము చేత భ్రాంతి నశించెనేని, భ్రాంతి వలన కలిగిన కారణ శరీరమునూ నశించును.

మరి యీ సూక్ష్మ శరీరము నశించక, పైన చెప్పిన ప్రళయములందు నశించక, యాతనా (దారుణ) శరీరమందు చేరి కారణ శరీర భ్రమ నివారించు దాక కాలకర్మ వశముల చేత మాటిమాటికి పుణ్యపాప మిశ్ర కర్మ లభ్యములగు దేవ, పశు, పక్షి, క్రిమి, జల చర, స్థావర మానుష స్థూల శరీరముతో కూడుచూ, వీడుచూనుండును. కారణ శరీర భ్రమ నివారించు వేళ కారణ శరీరము నశింపగానె కారణ శరీరమందును నిల్వ చోటు లేక స్థూల శరీరమందును నిల్వ తావు లేక కాష్ట రహితమగు వహ్ని చందమున లయించును. అప్పుడా శరీరతత్త్వములు సమిష్టి వ్యష్టి భేదములతోడ క్షీణించి సత్త్వరజో భూత తన్మాత్రములై యుండును.

పరారూప యెఱుక

ఎఱుక నాల్గు విధములు : 1) మలినపుటెఱుక. 2) మిశ్రమ యెఱుక 3)

శుద్ధ ఎఱుక 4) పరారూప యెఱుక

1.మలినపుటెఱుక : మోక్షము పొందవలయునని తలంపుతో జీవకారుణ్యము, మైత్రి మొదలగు విషయములును, నేను, నాది అను అహంకార మమకారముతో గూడిన జనన మరణ రహితమునకు ఏమేమి అవసరమో వాటిని విచారించక, అవి సంపాదించక, ఏమైతే ఏమి లేనిదానికి విచారణ ఏమి? అసలు లేనిదే, అని గురుపూజ సత్కారములు మాని, అసలు విద్యనే మరచి యుండ తలంచునది.

2. మిశ్రమ యెఱుక : సర్వేంద్రియ సహకార స్వరూపమున ప్రత్యగాత్మ రూపమున వెలుగుచూ, తాను సర్వసమన్వయుడై, సర్వాధిష్ఠానరూపమై, ప్రాణ మనస్సుల ఐక్య స్వరూపుడై, సర్వ ప్రకారముల ఉత్తమ గతిని కల్పించునదై, సద్గురు సేవాభి నిరతమై సర్వము ఎఱుగుచున్నది.

3. శుద్ధ యెఱుక : గుణాతీతమై, అవస్థా త్రయములకు సాక్షియైన, శరీరేంద్రియములకు విలక్షణమై, కల్పిత వస్తువు లేనిదై, శుద్ధ స్ఫటికమై, వికారములు కల్పించనిదై, నిజరూపమై పరారూపమగు ఎఱుకను పోలినదై యుండునది.

4. పరారూపమగు యెఱుక : వర్ణింపవీలు పడనిదై, మోక్షమే తానైయున్నదియు, లేని యెఱుకయైయున్నది. జనన మరణ రహిత స్థానమై యున్నది. ఆద్యంతములు లేక, అసలు ఏమీ లేనిది.

కాని యీ లేనెఱుకను ఎన్ని విధముల చెప్పినను ఎఱుక ఒక్కటియే గాన వేరనవలదు, ఒక్కటనవలదు, నాలుగనవలదు, పదియనవలదు, అసలుంటే గదా!

మూడు మంత్రముల అచల మార్గము వేదాతీతము :

"మూలము లేని గుర్తెరిగె శరీరం ఏమీ లేదు" అను షోడశాక్షరములనగా స్థూల సూక్ష్మ కారణ మహాకారణములు నాలుగు, జాగ్రత్త, స్వప్న, సుషుప్తి తుర్యములు నాలుగు, విశ్వ, తైజస, ప్రాజ్ఞ, ప్రత్యగాత్మలు నాలుగు, అకార ఉకార మకార ఓంకారములు నాలుగు, వెరసి పదునారు. అనగా శరీరములు 4, అవస్థలు 4, అభిమానములు 4, ప్రణవములు 4 కలసి పదునారక్షరములు. ఇవియే రహితము, ఏమీ లేదు.

పది రెండక్షరములు ద్వాదశిని షోడశి ఎఱుగనే ఎఱుగదాయె. ఎఱిగినదెల్లా ఎఱుకేనయే! అట్టి ద్వాదశి ఎఱుక రహితమునకు ఏమైనా ఆధారమా? లేక పోయెను. నిజము విచారించగ బయలు ఎఱుకను ఎఱుగనే ఎఱుగదు. ఎఱుగనంటివా? ఎఱుకయే ఎఱుగనిది పరిపూర్ణము. అట్టి ద్వాదశి యొక్క భావము ఈ ఉత్త బట్టబయలు ఏమీ లేదు. ఇది రెండవ మంత్రము.

ఇక పంచదశి మాట విచారించవలెనంటె, అది, యే నిర్ణయము లేనిది. కలగదా! కలమాట అసత్యవాదియై యుండెను. అట్టి అసత్యమెంత విచారించినను అసత్యమే. అట్టి సాక్ష్యము అనగా మూడవదియగు మంత్రము ఎంతవరకు అవసరము?

లేనిదానిని లేదని నిర్ణయించుటకు సాక్ష్యమే అవసరమా? అయిన ఏ మంత్రము స్మరించినను జ్ఞాతయే కదా? అట్టి జ్ఞాతయే సర్వకార్యముల దిట్టయై సర్వకార్యములను ఎఱిగేది, ఎఱింగించునది అదియె ఎఱుక రహితమయ్యేటిది.

మొదట రెండు మంత్రములని, పిదప మూడు మంత్రములని చెప్పుట గురుని స్వవచనము కాదు. నమ్మవలెనన్న ఎన్నియో ఉపమానములు చెప్పవలెను కదా!

కనుక ఇది శివరామ దీక్షితీయ అచలమార్గము. అచల బోధ వేదాతీతము అనుకొనుచు భ్రాంతి రహితులు కావలెను. ఈ అచల బోధకు అనంతోపనిషత్తు ఆధారము. అట్టి అనంతోపనిషత్తు మహానారాయణోపనిషత్తునందు అంతర్భూతమని అనంతోపనిషత్తునందే గలదు. కనుక యిది వేదసారమే కదా!

ఉపనిషత్తుల బోధ ఎఱుక బోధయన్నారు. అదియే అన్నిటికి కర్త గదా! అటులనే ఏదో యొక్క స్మృతియో, శ్రుతియో, పెద్దల వాక్యములో ఆధారము లేక బోధించినచో అది వాచారూపమై ఆధార విహీనమై నమ్మకము లేకపోవునవి అగును. కావున యీ అచల మార్గమునకు ఆధారము కలదు. అందువలన వేదాతీతము.

ಂಓಂ (೦1೦೦೦೦೦)

పుట్టేది చచ్చేది ఒకటి. పుట్టనిది చావనిది ఒకటి. రెండు లేక పోవలె నంటె కోపమేమో! ఒకటి కంటె రెండు, రెంటికి మూడు ఏమీ లేదు. ఉన్నదనునదియే లేక పోవలెను. ఎట్లనగా రాజుగారి పెద్ద భార్య పతివ్రత అనగా రెండవ మాట చెప్పకయే విదితము.

ఒకటి అనగా ఓ అనుకొనుడు. అది వున్న అన్నీ ఉన్నవియే. ఓం కారము నకు ఆవలీవల సున్నాలు పెట్టినారు. అంత మాత్రము చేత ఎఱుక లేనిదగునా! శ్రీ భాగవతుల కృష్ణ దేశి కేంద్రుల వారు "ఒంటుకు వలపల దాపల సున్నలు పెట్టుకున్నారు. వాని జాడ తెలిసికొంటె, నిన్ను నీవు విడచుట తథ్యము". ఇట్టి విచారణ జేసిన మాహానుభావులెందరో యుండిరి. అట్టి సున్నాల జాడ తెలిసికొనగోరి, వారే లేకపోయిరి. అట్టిది ఒకింత విచారింతము.

మొదటి సున్న బయలు. మధ్యన ఓం కారము ఎఱుక, చివరి సున్న ప్రపంచము. ఇట్లు **ಂಓಂ** అయినది. ఓంకారమునకు మొదటి సున్న బయలని అంటె, **ఓ** అను ఎఱుకయు, చివర సున్న అనె ప్రపంచము కల్పితమయ్యెను. కల్పిత రూపమైన ప్రపంచములో **ఓ** రూపమైన నేను; నాకు మొదటనే సున్న యుండెను. నేనెటుల గలిగితినని విచారించగా "నేను" లేనని ధృవపడినది.

నేను పుట్టక మునుపు ఓం కారమని, శివుడు, శక్తి, ముక్తి, పరము, గురువు, శిష్యుడు, బయలను పదము, ఎఱుకను పదము ఎఱుగనే ఎఱుగవు. నేను వెళ్ళిన తరువాత కూడ అంతే. కాని నేనున్నానని భ్రమ ఎప్పుడైతే తోచినదో, అప్పుడే **'ఓ'** కు వలపల సున్న పెరిగినది. అనహ రహిత మార్గములో దాపల సున్న కలిగియే యున్నది. అనగా ఓకు మొదలె సున్న యుండెనని తెలిసిన మీదట ఎన్ని యుండినను వుళ్ళక్కియే. నేననే **ఓ** మధ్య గలిగి మిథ్యయైనది. ఓం కారము యొక్క ఆవలీవల సున్నలు తెలిసికొన్న వారే లేరు. ఎప్పటినుండియో యిప్పటిదాక ఇలా జరుగుచునే యున్నదని భావము.

పరిపూర్ణము :

బయలు గురించి ఎందరో మహానుభావులు విచారించిరి. కొందరు "నేను" ఎంతవరకు పోగల్గునో, అంతవరకు బయలు నేను కంటె ముందే ఉండి యుంటున్నది అని తెల్పిరి. ఏమీ లేదని అంటె నాస్తికమని భావము రాదా? జలభరిత ఘటమునకు నిండు అని, జలరహిత ఘటమునకు ఖాళియని కొందరనిన, అది బయలునకు సమంజసము కాదు. ఎవరేమనినను, "నా, నీ" బేదభావన నిర్ణయ నాస్తియే బయలు. ఎఱుక లేని స్థానము అదియే. అదియే గురు సూచన. ఇది ఎఱిగిన వారికి అగోచరమే లేదు. అనుభవమే అనుభవము. అట్టి అనుభవము అంతస్తు (స్థాయి) గల వారైతేనే తెలియును. తెలియకపోయిన మహాకఠినము. తెలిసికొనుట మహా తేలిక. కనుక బయలు నిర్దేశ్యము కాదు.

అవాంగ్మానస గోచరమై, నామరూపరహితమై అంతటా నిండియుండి కంటికి కనపడునది కాదు, ఖాళీ కాదు. కేవలము ఎఱుక లేని స్థానము, అయినను మూలము గాదు.

ఈ బోధ అంతయు విన్నది కన్నది ఎఱుకయేయని. కాని అట్టిది లేక యుండెను. అనుభవమనిన ఎఱుక విడచుట కదా? ఏమని వర్ణించగలము? నేనను విధమును విచారించుకొనగా నేననునది లేకపోయెను. ఇక పరిపూర్ణమును తెలిసికొంటిని అంటే అది నాస్తియె. మోక్షమా లేకపోయెను. బంధమా ఎగిరిపోయెను. ద్వంద్వమునకు బడదాయెను. ఇది యంతయు గురుశిష్యుల కల్పితమాయెను. ఇక్కడ హద్దు లేకపోయెను, మొద్దువలె పడియుండుట కాదాయెను. కాని సద్విచారణతో కల్పితమైన నేను గురున కేమని వివరించగలదు, ఇంక ఏమియర్పించగలదు? అన్నీ కలగన్న కలగా తీరిపోయెను. మేలుక లేకపోయెను. అనగా ఎఱుక అను కలపోయెను, లేనెఱుకలో మేల్కొని లేకపోయెను. ఇక శిష్యునికి గురుకట్నమివ్వలేక సిగ్గవుచున్నది. గురుబోధాగ్ని అగ్ని వర్షములా కురిసినది. కనుక బీజమేర్పడి, మొలకెత్తుట జరుగదు. బీజమే లేదు కనుక జన్మయే లేదు, మరణమే లేదు. ఏమీ లేదు. ముమ్మాటికిది నిశ్చయము.

ఇట్టి పరిస్థితిలో, శిష్యుని స్థాయిలో, అతడు ఉశ్వాస, నిశ్వాసములు లేని తోలు తిత్తితో సమానము కారాదు. ఉశ్వాసనిశ్వాసములుంటే సరియా, లేకుంటే భ్రమయగునా? వాని ప్రభావమున్నంతవరకు లేని ఎఱుకతో లేక నిలచి, లేని విచారణతో లేకపోయే వారితో, తెల్పుటను, తెలిసికొనుట మంచిది.

ప్రాణాపానముల కలయికతో, ఏర్పడిన ఉశ్చ్వాసనిశ్వాస సంబంధమగు వ్యానరూపమైనవాడు త్రికూట స్థానమందున్న జ్ఞాతగ, పరిణతనొంది సర్వమును ఎఱుగుచు సర్వకార్యకారణ రూపమై ద్రష్టృ, దృక్, దర్శన స్వరూపమై బట్టబయలు దర్శించగోరి తానే లేక, నిర్ణయమైన 'నేను' అను దానికి ఆధార విహీనమై ఏమి లేనివాడై తానే లేకపోయెను. కనుక గురుకట్నముగా శిష్యుని అనుభవమును వివరింపమనగా, ఎఱుక విడచిన శిష్యుని అవస్థ ఏనుగునెక్కిన వానికి కుక్కల భయముండదన్నట్లుండును. పూర్వీకులైన పెద్దలు శ్రీ కృష్ణ పరమాత్మ, శివరామ దీక్షితులవారు, స్వార్థ రహితులై సర్వశ్రేయోభిలాషులైయుండిరి. అటులనే నిమిత్తమాత్రమైన శిష్యుని ఖండ భాగము అఖండైక్యము చెందును. అటులైక్యము చెందిన ఖండము జనన మరణ రహిత స్థానము వీడి వివిధాత్మ స్వరూపమున సృష్టి స్థితి లయములకు పాల్పడునా, తన సంకుచిత భావముల వెల్లడించి తనమనుగడ సాగించగలడా?

ఎఱుక విడచినవాడు బండయో, మొద్దో గాని గురుస్వామి పాదామృత పానమున, ఆ తీరయ్యెను, తన్ను తానెఱిగెను. తనతో సమానము లేదనెను. తానే సర్వమనెను. తానే శుక్లశోణితములు, తానే స్త్రీ పురుషులు, తానే బ్రహ్మ, తానే అచలము, తానె ఎఱిగెనన తాలేకపోయెను. ఏమీ లేని నిర్ణయమందు తానే లేడు. మూలము లేని ఆ మూలమైన వానికి ఏమీ లేదు. తాను లేడు. ముమ్మాటికి నిశ్చయము. అటులైన యాతీరుగనే యుండవలెను. ఏ తీరు పోక, గురువు చెప్పిన తీరు లేక, లేనివారితో లేకయుండవలెను. ఏ పాటైన భ్రమయే. భ్రమ లేని మార్గమిదియె. లేని భ్రమ లేక యున్నవారితో కలసి అనహ రహిత మార్గమెఱిగించ వలెను. అట్టి ఆచరణయే ఆశీర్వచనము.

అసలు అనహరహిత మయ్యేయున్నది. స్వరూపము రహితము. రహిత మార్గమందు ఏమి బోధించినా ఎఱుకయే. ఏ నిర్ణయమైన చేయుదమంటె అవాంగ్మనసగోచరమై చూపులలో గల వస్తువు, చూపులు గల వస్తువు – యివి అన్నీ ఎఱుక అని అనగ, చూపులలో గల వస్తువే నేను అని యనిన, మిగిలిన రెండూ యెవరు? అని తోచును. పోనీ అన్నీ కలసి అనహమని అందామా అంటె, ఎఱుక, మరుపు రెండుగా చెప్పవలసి వచ్చును. అది తప్పు అనుకొన్న ఎఱుకనగా ఏ వస్తువు? అని తోచెను. అదియును గాక "(ఎఱుక) రెండు వస్తువులనడు మన అఖండంబిదె గానవచ్చునదె కనుగొనుమీ" అన్నాడు. ఐతే రెండు వస్తువుల నడుమ ఉన్నదే అఖండమా! లేక అంతటా ఉన్నదా! అంతటా గలది పరిపూర్ణమే గాని ఖండాఖండములు కావు గదా! ఖండమనగా వస్తువు గదా! అఖండమనెటిది లేనిది. అనహము అదియే. అట్టి అఖండమే పరిపూర్ణమని గాని, అచలమని గాని భావించుట కూడా భావ్యము గాదు. ఈ రెండు, మూడు లేని విధానములు ఏమని బోధించవలెను? ఎట్లు మనుగడ చేయవలెను?

పెద్దల వాక్యమేమన, ఏమి బోధించవలసినది లేకపోలేదు. కాని నిజధర్మము మరుగు పడునేమో, జనులవలె జరుపు పనులు అనునట్లు ఏదో తోచి, గురువు శిష్యుని పదే పదే హెచ్చరించు చుండును. అట్లు ధర్మాధర్మ స్వరూప రహిత స్థితి వీడకుండ అనహ రహిత స్థితి కుదుర గలందులకు, భయము పలాయనమొంద గలందులకు దృఢనిశ్చయపరుడై మనుగడ సాగించవలెను.

గురుని యాజ్ఞ ప్రకారము పదునాల్గు భువనముల సంచితమై యున్న యీ లేని ఎఱుక లేనిదనే నిర్ణయము లేకపోయెను. కనుక ఉత్తమ లక్షణయుక్త ప్రబోధ చేత గురుని కోర్కె శిష్యుడు నెరవేర్చవలెను. ఇట్టి దిగ్విజయ స్వరూప అనహ రహిత బోధ ఎట్టివారలకు బోధించవలెను, ఏ రీతిగ మనుగడ సాగించవలెనని, ఇట్టి ఎఱుక లేనిదనే నిర్ణయము లేక పోయెను. ఇట్టి ఎఱుక భ్రాంతి రహిత శిరోరత్నమును గురువులనబడు గురువులకు శిష్యప్రశిష్యులకు ఉత్తమోత్తమాధికారులకు తెలుపవలయును గాని, సకల శాస్త్ర పండిత పరవశులకు గాని ఇతర విమర్శనాజ్ఞానులకు గాని తర్క వితర్కవాదులకు గాని ఒక్క అక్షరమైనను తెలుపరాదు.

"భగవంతుని యందుండుము"

(Stay With God - By Francis Baba Jaan)

అందునుండే మనస్సు వచ్చెను. మనస్సు నుండే సర్వము వచ్చెను. శక్తి పొంగెను. దానినుండి అంతయు వచ్చెను. అది మ్రింగివైచెను. మనస్సు నుండి పదార్థము. పదార్థమే మన సర్వము. ఆదియంతయు శూన్యము. శూన్యమొక్కటే

సర్వమా? శూన్యశిశువే సర్వమా? శూన్యసర్వములొక్కటే. విశ్వరూపము దాల్చె శూన్యము రూపమొక్కటే కాదు విశ్వము. నిరాకార శూన్యమే నిరాకార సర్వము. మరణమే మన పునర్జన్మ. కష్టమే ఒక లాభము. ఇక్కడ చనిపోవుట ఎలా?

మీలో నివశించుట కొఱకు మృత్యువును, మరుజననము సొంతము పోగొట్టుకొనుటకు సర్వము రాబట్టుకొనుటకు సర్వమూ శూన్యమనుటే పరిపూర్ణాధికారమనుట.

అంతయు విడనాడుట యేల? ఆద్యంతము చోటు కొఱకు శూన్యసర్వము లొక్కటే.

ద్వాదశి

ద్వాదశీ భావము

శ్లో॥ ఏతన్మిథ్యా శుద్ధవియత్ । కించిన్నాస్తీతి తేమయా
కృపయా పరమం ప్రోక్తం । భజాగ్రే ద్వాదశాక్షరం ॥

అథమను ః

పదవిభజన : ఎతత్ మిథ్యా శుద్ధ వియత్ కించి న్నాస్తి

అర్థము : ఈ ఉత్త బట్ట బయలు ఏమి లేదు.

ఇది ద్వాదశాక్షరి.

శ్లో॥ నిర్మూలమే తదాజ్ఞానా । చ్ఛరీరం నాస్తి కేవలం
షోడశాక్షరి తత్సిద్ధ । మిదం వస్త్వ నిశంభజే ॥

అథమనుః

పదవిభజన : నిర్మూల మేతదాజ్ఞానా చ్ఛరీరం నాస్తి కేవలం

అర్ధం : మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమి లేదు.

ఇది షోడశాక్షరి.

దృష్టద్రాష్టాంతములు :

ద్రా = స్వప్నేప్రతీయ మానాని రూపాణిచ, యథాతథా ॥
ద్రా = కలలో దోచిన శరీరము యేలాగో అలాగే
దృ = కర్పూర దీప సంయోగం। జ్యోతిరూపం యథాతథా ॥
దృ = కర్పూరము అగ్ని (కళిక) కూడితే యేలాగో అలాగే

తుర్యాతీతము ప్రతిపాదించే నిశ్శబ్ద మార్గము
(శరీర రహిత ప్రకరణము)

శ్లో॥ పూర్ణమదః పూర్ణమిదం । పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్యపూర్ణమాదాయ । పూర్ణమేవా వశిష్యతే ॥

"ఈ ఉత్త బట్టబయలు ఏమి లేదు" అని సిద్ధాంతము. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమి లేదు. ఇదే కోటి మాటలకు జ్ఞాపసకము. ఇంతకంటె యెక్కువ లేదు. కనుక మరువవద్దు. ఈ శరీరమును నమ్మవద్దు.పూర్ణము కంటె ఎక్కువ లేదు, ఏమి లేదు.

కలలో వచ్చిన శరీరము యేలాగనగా, మేల్కొంటె ఏమి లేదు. అలాగే మూలం లేని గుర్తెఱిగే శరీరము యేమీ లేదని నిశ్చయముండవలెను. ఇట్లు నిశ్చయమైనచో భ్రాంతి రహితము. ఆశపడినచో భ్రాంతి రహితము గాదు. ఈ శరీరము మధ్యలో వచ్చినది. మధ్యనే పోయినది. దీనికి మూలం లేదు. ఇది యెప్పుడూ ఉండేది కాదు. మెరుగుడు పువ్వు వంటిది; మేఘం వంటిది; మెరుపు వంటిది; నీటి బుగ్గవంటిది. నిలిచేది కాదు. శాశ్వతమైనది కాదు. చెప్పితే వినవలెను, బాగుగా తెలిసికొన వలెను, దృఢము కావలెను.

ఇట్లు దృఢమయ్యెనా, భ్రాంతి రహితులగుదురు. కలలో వచ్చిన శరీరమునకును, యీ శరీరమునకును యీషత్తు హెచ్చుతక్కువలు లేవు; లేత ముదురు, చిన్న, పెద్దవంటి భేదములు లేవు. రెండును సమానమే. గురువాక్యము చేత మేల్కొనిన ఏమియును లేదు. ఇదే అనాది సిద్ధాంతము.

ఈ గుర్తెఱుగుట అభేద్యము. ఈ శరీరము కంటె ఎందరు వేరుగానున్నారో, వారందరును అభేద్యమే. కనుక జ్ఞానము, కర్మము నిబద్ధియే. గుర్తెఱుగక కర్మలు చేయరు. కనుక గుర్తెఱిగే జ్ఞానమే సకల కర్మలు చేయుచున్నదని చెప్పుచున్నారు.

ఇది అపార్థమే. కనుక వచ్చునపుడు గుర్తెతిగెడు జ్ఞానస్వరూపములై వచ్చుచున్న వన్నీ ఉన్నంతవరకు, జ్ఞానమే యున్నది. మేల్కొన్నచో ఏమియును లేదని అందరికీ ఎఱుకే. ఇపుడేవి గుర్తెతిగితిమో అదే పెద్దల సిద్ధాంతము.

మేల్కొన్న యేలాగున ఏమియును లేకపోవుచున్నదో, అలాగుననే మూలం లేని యీ గుర్తెతిగే శరీరమున్నూ లేదని గురుస్వామి చెప్పగనే, పుట్టని చావనిది, సకల దేశములందును, సమస్తమైన వస్తువులందును స్వతస్సిద్ధమై సర్వకాలము లందు ఒక్క తీరుగానేయున్నది. కనుక జ్ఞానమే సకల భ్రమలకు మూలము.

<u>బోధకు అధికారులు (కొన్ని)</u>	<u>బోధకు అనధికారులు (కొన్ని)</u>
1) సూచన చెయ్యగనే కనుక్కొనేవారు	జ్ఞానభ్రాంతి కలవారు
2) అనుమానము లేనివారు.	మోక్షభ్రాంతి కలవారు
3) భ్రాంతి రహితము కావలెనని మిక్కిలి తహ కలిగిన స్త్రీలు, పురుషులు	అనుభవ భ్రాంతి కలవారు
4) ఒక్కటైనా భ్రాంతి మిగులకుండా సూచన ఎవరు చేయుదురాయని తహతో ఎదురు చూచువారు.	
5) సూక్ష్మ ప్రజ్ఞ వున్నచో గురువుచే పరీక్షింపబడిన పిదప సూచన యివ్వబడవలెను.	ద్వైతాద్వైత భ్రాంతి కలవారు.

సంసారము :

సంసారమనగా మూలం లేని యీ గుర్తెతిగే శరీరం తోచడమే. ఈ శరీరం యెలాగు వచ్చినదో ఫలానా యని ప్రమాణము లేదు. ఇది అప్రమాణమే. ఈ శరీరం లేకమునుపు, కేవలం బట్టబయలే యున్నది. కలలో తోచిన శరీరం ఏలాగో అలాగే. మూలం లేని యీ శరీరం ఏమీ లేదని దృఢముగా నుండవలెను.

చైతన్య నిరసన ప్రకరణము

శ్లో॥ షడ్భూత రహితం పూర్ణమ్ । అష్టావరణ వర్జితమ్ ।
షడ్వర్గ రహితం పూర్ణమ్ । షట్కోశ రహితం సదా ॥

తా॥ ఓ శిష్యుడా! పరిపూర్ణము అయిన పరబాహ్యము చైతన్య సంయుతమైన ఆత్మ, ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అనెడి షడ్భూత రహితమైనది. హిరణ్మయ, ఆనందమయ, విజ్ఞానమయ, మనోమయ, ప్రాణమయ, అన్నమయ అనెడి షట్కోశరహితమైనది. పృథ్వి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, మహత్తత్వము, అహంకారం, ప్రకృతి అనెడి అష్టావరణ వర్జితమైనది. కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము అనెడి షడ్వర్గ రహితమైనది.

ఇది సర్వకాలము ఎడతెగక, నిద్ర వచ్చువరకు, చచ్చు వరకు ప్రతి దినము అభ్యాసము చేసినవానికి పుట్టని చావని అచలమే స్వతస్సిద్ధము గాని, మరియొకటి కాదు. ఇది నమ్మినవారికి రాకడ, పోకడ లేవు.

శిష్యుని కర్తవ్యము :

గురువుల మార్గము శిష్యుల వల్లనే తెలియును. ఎందుకనగా గురువులు లేకనేయున్నవారు. గురుస్వామి వెంట, వెనుక తిరిగి, వారి అనుగ్రహము సంపాదించవలెను. అనుగ్రహము కలిగిన వెంటనే యీ పదిప్రశ్నలడిగి తెలిసికొనవలెను. అంతవరకు దీర్ఘకాలము గురుసేవ చేయుచునే యుండవలెను.

1. ఈ దేహములకు మూలం లేదా?
2. మూలం లేని దేహము యేలాగు కలిగెను?
3. ఈ దేహమునకు ఆధారమెవరు?
4. పుణ్యపాపములు చేసేవారెవరు?
5. తాను వేరే, దేహం వేరేనా? లేదా రెండూ ఒకటేనా?
6. చలనం ఒకటి, అచలం ఒకటేనా? లేదా రెండూ ఒక్కటేనా? వేరువేరా?
7. అచలం ఎక్కడ ఉన్నది. అది ఎటువంటిది?
8. ఈ గ్రంథములు పుట్టని చావని అచలము చేసినదా? లేదా యీ మూలం లేని గుర్తెతిగే శరీరం చేసినదా?
9. పుట్టేది చచ్చేది ఒకటీ, పుట్టనిది చావనిది ఒకటేనా? లేదా యీ రెండూ

ఒకటేనా?

10. ఈ ప్రపంచము ఎటువంటిది?

మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదని గురువాక్యము చెప్పగనే, అదే ప్రకారము నిశ్చయము కావలెను. ఇట్టి గురువాక్యము మూడు కాలములందును లేదు. ఇది నమ్మక మరియొకటి నమ్మినచో ఆశ మాత్రమే గాని, భ్రాంతి మాత్రము పోకుండా, విస్తరించుచునే యుండును. బుద్ధి పరిధిలోని వారికేగాని, తక్కినవారికి అలవి గాదు. ఇది భ్రాంతి లేని విచారణ. ఇది జ్ఞానకర్మములవంటి కలత వాక్యము గాదు.

భ్రాంతి రహిత యుక్తి :

1. అద్వైతమువలె గుర్తెఱిగే చైతన్యము నీవు అన్నట్లు గాదు.
2. చిత్తులో చిత్తు విశిష్టం అన్నట్లు గాదు.
3. నీవు వేరు, ఈశ్వరుడు వేరు అన్నట్లు గాదు.
4. నీవే జీవుడవు, ఈశ్వరుడవు అన్నట్లు గాదు.
5. ద్వైతమున్నది, అద్వైతమున్నది అన్నట్లు గాదు.
6. అంతా చైతన్యమేనను సమరస జ్ఞానము అన్నట్లు గాదు.
7. నేను గుర్తెఱిగే వాడిని కనుక ఇది అపరోక్ష జ్ఞానము అన్నట్లు గాదు.
8. గుర్తెఱిగే విషయము అన్నట్లు గాదు.
9. గుర్తెఱిగే జ్ఞానమే బ్రహ్మము అన్నట్లు గాదు.
10. ఇది గుర్తెఱిగే దృక్కు అన్నట్లు గాదు.
11. గుర్తెఱిగే సాక్షి అన్నట్లు గాదు.
12. గుర్తెఱిగే సాక్షిణి అన్నట్లు గాదు.
13. నీవు గుర్తెఱిగే వాడవు అన్నట్లు గాదు.
14. మోక్షమనే భ్రాంతి వంటిది గాదు.
15. బంధమని భయపెట్టినట్లు గాదు.

ఈ దేహానికాధారము :

కలలో శరీరం యెలాగున వచ్చినదో కలలోని శరీరానికి ఆధారము లేనట్లే, యీ శరీరానికి కూడా ఆధారము లేదు. ఏలాగంటె, మూలం లేని గుర్తెఱిగే శరీరమే నాకు మూలం అన్నది. నన్నే నమ్మవలెనన్నది. నన్ను ఏమీ లేదని నీటిలోని చేపను బయట వేసినట్లు వేశారని అన్నది. నేను రాతి దేవుడిని, కట్టె దేవుడిని తీర్థాలు సేవించేదానిని, అందరిని రప్పించేదానిని, అని చెప్పినను, నా జాడ నాకే తెలియదు. నాకు నేనే వస్తాను, నాకు నేనే ఉంటాను, నాకు నేనే ఏమీ లేదు. నాకు నేనే మూలము. సముద్రములో చేపయున్నట్లు వున్నా, నన్ను రమ్మనేవారు లేరు, పొమ్మనేవారు లేరు. మూలం లేని గుర్తెఱిగే శరీరం ఏమి లేదు. ఈ షోడశీ మంత్రమును సతతము విడువరాదు. ఆమరణాంతము ఉండవలెను.

అచలం :

అచలం ఎక్కడ ఉన్నది అంటె, అది పుట్టని చావనిది. రాకడపోకడ లేనిది. సకల దేశాలయందు, సర్వకాలాలయందు, సమస్తమైన వస్తువులందు మొదలు చివర లేక తనకు తాను స్వతస్సిద్ధమై నిండియున్నది. అచలం ఎటువంటిదనగా, పుట్టేది చచ్చేది దేహమైతే, యీ దేహమునకు మూలము అచలము గాదు. పుట్టని చావనిది అచలము. ఇవన్నీ తోచేది శరీరానికే గాని, అచలము ఎప్పటికీ అచలమే. అపరోక్ష జ్ఞానమువంటిదే. దీనికి యే సాధన, యే ముక్తి, యే అనుభవము పనికి రాదు. నిజగురుకృపయే అట్టి అచలము పొందుటకు కారణము.

శ్లో॥ అశరీరం సర్వదాఽస్తి యీలేక, శరీరం రహితం సదా
ఇదమేకం సద్యోముక్తి, స్సర్వదా భ్రమ వారణా ॥

అనియున్నది గనుక, మూలం లేని యీ గుర్తెఱిగెడి శరీరమేమి లేదు. ఇది రాక మునుపు అచలమే యున్నది. ఉన్నప్పుడు అచలమే యున్నది. చచ్చినప్పుడు అచలమేయున్నది. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు. కోటి మార్లకు ఇదియే జ్ఞాపకము. దీనిని మరువవలదు. కలలోని శరీరం మేల్కొన్న ఏమియు లేదని నిశ్చయముండవలెను.

ప్రపంచము :

ఈ ప్రపంచము ఇంద్రజాలము. ఇది నమ్మరాదు. కలలో వస్తువులు మేల్కొంటే యేలాగు లేవో, అలాగే ప్రపంచము లేనే లేదు. ప్రపంచము ఉన్నదనరాదు. ఈ ఉత్త బట్టబయలుకు ఏమి లేదు. ఈ ఉత్త బట్టబయలుకు ఎఱుక మరపులు లేవు. ఇంతకంటె అధికం లేదు.

అహంకార నిరసన ప్రకరణము

శ్లో॥ స్వపూర్ణ । వ్యతిరేకణ । జీవబ్రహ్మ మయం జగత్ ।

నాస్తి మాయా సదా బ్రహ్మ । నాస్తి నాస్తి విధీయతే ॥

తా॥ ఓ శిష్యుడా! స్వతః పూర్ణమైన పరబాహ్యము జీవ, బ్రహ్మములతో నిర్ణయింపబడే జగత్ సంబంధమైన సమస్తము లేనిది. వ్యతిరేకమైనది, మాయామయమైనది, బ్రహ్మమయమైనది అయిన సర్వమును గురువాక్యము నాశ్రయించి విధేయుడవై విచారించి, దర్శించిన ఎల్లకాలము లేనిదేనని, పరబయలు ఉన్నదని తెలియబడును.

ఈ ఉత్తబట్టబయలు ఏమీ లేదని సిద్ధాంతము. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమి లేదు. ఇంతకంటే అధికము లేదు. ఈ మూలం లేని గుర్తెఱిగే శరీరమే అహంకారము. ఈ గుర్తెఱుగబడేయెఱుకయున్ను అహంకారమే. ఎఱుకయున్ను జ్ఞానమున్ను అహంకారమే. ఈ అహంకారము లేనివారెవరున్ను లేరు. అందరు అహంకార స్వరూపులే. అహంకారము లేకుంటే నిర్ణయము లేదు. అన్నీ అహంవృత్తి వల్లనే. అహంవృత్తి అన్నిటికీ మూలము. అహంకారము వల్లనే అన్ని భూతములు కలిగినవి; అన్ని మతాలు కలిగినవి. అహంకారమే ప్రపంచము, అవతారములు, స్త్రీ పురుషులు. అహంకారమే వేద శాస్త్రములు కల్పించినది. అహంకారము లేకుంటే ఎవ్వరెఱుగు? కనుక అహంవృత్తి లేని గురువుంటె చాలు, ఎఱుక విడువవచ్చును.

ఇరువది యైదవది అయిన ఎఱుక అను అహంకారమే ఆత్మయున్ను, ఆరవ కోశమున్ను. కనుక అహంకారము లేనివారు, యిరువది యారవదియైన అత్యంత విలక్షణులు. వారే యీ శరీరమందు అహంకారము లేకయున్నారు. వారే అశరీరులు. అహంకారము లేకున్నచో, వేదాలు, వేదోక్త మార్గములు, కర్మకాండ, యెవ్వడెఱుగు? అహంకారము లేనిచో, దానితోనే అన్నీ పోవును. ఏమీ లేదు.

అహంకారము పుట్టుక, నాశనము :

అహంకారము ఎవరి వల్లను పుట్టలేదు. కలలో వస్తువుల వలెనే వచ్చినది. కలలోనివి కలలోనే నశించును. కలకు కల నిజము. మేల్కొంటే కలలోనే కల అబద్ధమని నిశ్చయమగును. అహంకారము ఎఱుక ఒక్కటే. ఎఱుకే చిద్రూపము, శ్రీమన్నారాయణ రూపము; అహంకారము లేకుంటే, చిత్తు లేదు, నామరూపాలు లేవు. అహంకారము లేకపోవుటే ముక్తి. అహంకారము లేకున్న జ్ఞానమనునది లేదు. కైంకర్యము చేతనే అహంకారము వదలదు, జన్మ రాహిత్యము కలుగదు. దేహాభిమానము లేకుంటే సరి, కైంకర్యము కంటె అధికమైన భక్తి లేదు. కైంకర్యమనగా చేతనే కడ తేరినారు. కైంకర్యమగుటకు ఆధారము ఏమి లేదు. ఎఱుక అను అహంకారము లేకుండగ నుండుటయే కైంకర్యము. కైంకర్యమే పరమ రహస్యము.

తీర్థ ప్రసాదాలు కైంకర్యమే. కైంకర్యము వల్లనే అహంకారము పోవును. దీనినుంచే పరమశాంతి. ఆచార్యుని కరుణే తీర్థం, ఆచార్యుని సమ్మతమే ప్రసాదము. ఇంతకంటె రహస్యము లేదు. ఈ గుర్తెఱిగే దేహమును ఆచార్యునికి సమర్పించిన సరి. తను మన ధనముల సమర్పణయందు వంచన కూడదు. పుట్టని చావనిది, సకల దేశాలయందు, సర్వకాలములందు, సమస్తమైన వస్తువులయందు మొదలు చివర లేక, చలించక తనకు తానే స్వతస్సిద్ధమై యున్నది అచలమే.

మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదనెడి గురువాక్యమును సదా మరువరాదు.

క్షేత్ర క్షేత్రజ్ఞ నిరసన ప్రకరణము

శ్లో॥ దృశ్యాదృశ్య విహీనాత్మా । ద్రష్టాదృక్ వివర్జితమ్

ఖండా ఖండ విహీనాత్మా । క్షేత్రక్షేత్రజ్ఞ వర్జితమ్ ॥

తా॥ ఓ శిష్యుడా ! శాశ్వతమైన పరిపూర్ణ పరబాహ్యము దృశ్యాదృశ్యములు,

ఖండాఖండములు లేనిది. దృక్ ద్రష్టలు, క్షేత్రక్షేత్రజ్ఞులు కానిది.

కావున ఈ ఉత్త బట్టబయలు ఏమి లేదు, అని సిద్ధాంతమే రాద్ధాంతము. క్షేత్రము – క్షేత్రజ్ఞుడు అన్యోన్యాశ్రయము కనుక యీ రెండూ శరీరమేనని నిర్ణయము. క్షేత్ర–క్షేత్రజ్ఞ లక్షణ ప్రకృతి ద్వయ దోష రహితమే కర్మము, సువ్రతము, పాప పుణ్య రహితము, ధర్మాధర్మరహితము.

శ్రు॥ సమక్షేత్రమీ వంధ్యా పుత్రవత్ ॥

క్షేత్రము మూడు గుణముల వలన అయినది. సత్త్వ గుణమువలననే నేను – నేను అనెడి జ్ఞానము పుట్టినది. ఈ తెలివికి కార్యము క్షేత్రము. గాఢ నిద్రలో కారణమున్నదో లేదో గాని క్షేత్రము లేకపోయెను. క్షేత్రము లేని యెడల క్షేత్రజ్ఞుడుండడు. ఈ క్షేత్రము మాయావిద్యా స్వరూపము గనుక క్షేత్రము మొదలైన విషయములను గుర్తెఱిగెడు పరాఖ్య చైతన్య స్వరూపిణి యనెడు పేరు గల విషయి. అదే అధిష్ఠానము, అదే బ్రహ్మ స్వరూపము, సచ్చిదానంద స్వరూపిణి, జగత్కారణము, ఆనంద సమిష్టి క్షేత్రము సమస్త కార్యములు. అది కారణమగు చైతన్య స్వరూపిణి పరాప్రకృతియే పెద్ద భ్రాంతి. సాక్షిణియై గుర్తెఱిగెడి క్షేత్రజ్ఞుడైన పరాప్రకృతి, అపరాప్రకృతి ద్వయమని సిద్ధాంతము.

క్షేత్రము అవిద్య, క్షేత్రజ్ఞ స్వరూపమే మాయ. "యామాసా మాయ" ఏది లేదో అదే మాయ కనుక మాయ లేనిది. అవిద్య కూడా లేనిది. ప్రకృతి ద్వయమే మాయా విద్యా ద్వయము. మాయయే ఈశ్వరుడు, అవిద్యయే జీవుడు. మాయా విద్యారహితమే భ్రాంతి రహితము. క్షరోపాధిక్షేత్రము. అక్షరోపాధి క్షేత్రజ్ఞ ప్రకృతి.

శ్రు॥ క్షరాక్షరోపాధిద్వయ రహితమేవ విచార్యస్య ఫలం ॥

కల్పనారహితమైన పురుషుడే శుద్ధ పురుషుడు. అట్టివాడు ప్రపంచము న్నదని యెఱుగడు, లేదని యెఱుగడు. ద్వయదోష రహితుడు కనుక అతనికి ఎఱుక మరపులు లేవు. అయినను ఎఱుక లేకపోవుటయు లేదు.

ప్రకృతి ద్వయ దోష రహితములు :

ద్వయ దోష రహితులు యేలాగు యెఱుక యనగా వారికి రాగద్వేషాలు లేవు, మూర్ఖము లేదు, సమయోచిత ప్రజ్ఞ గలదు, దేహాభిమానము లేదు, శాస్త్రాభిమానము లేదు, మనిషి కొద్ది నడిచేవాడు. స్వదృష్టి చేత ఉన్నదో లేదో అన్య దృష్టి చేత ఉన్నట్లు ఉంటుంది.

శ్రు॥ శరీర త్రయాభ్యాః । పరాప్రకృతి నామసిద్ధి ।
రహితాయనమః । సత్యాఖ్య బ్రహ్మ రహితః ।
చిద్రూప రహితః । నిర్గుణ రహితః ।
బంధమోక్ష రహితః । అద్వైత రహితః ।
విద్యావిద్య రహితః । అహంపద చైతన్య రహితః।
త్వంపద చైతన్య రహితః । శబ్ద రహితః ।
పురుష రహితః । గురుశిష్య రహితః ।
లక్ష్యార్థ రహితః । వాక్యార్థ రహితః ॥

తా॥ ఓ శిష్యుడా! పరిపూర్ణ పరబాహ్యమనునది స్థూల, సూక్ష్మ కారణములనే శరీరత్రయములకు అతీతమైన మహాకారణము లేక పరాప్రకృతి రహితమైనది. సత్యస్వరూపుడైన బ్రహ్మము కానిది, చిత్స్వరూప నిర్గుణ బంధ మోక్ష రహితమైనది. అద్వైత రహితము, విద్యా విద్య రహితము. అహంపదమైన 'నేను' అనెడి చైతన్య రహితము, త్వంపద భాసమైన చైతన్య రహితము, శబ్ద రహితము, క్షరాక్షర పురుష రహితము, గురుశిష్య రహితము, లక్ష్యార్థ వాక్యార్థ రహితము, త్రిపుటి రహితము, ద్వంద్వముల రహితము. నీవు నేను లేనిదే నిజరూపము. ఇట్టిది తెలిపేవాడే గురువు. ఇట్టిది వినేవాడే శిష్యుడు.

ప్రకృతి ద్వయ దోషరహితుల వ్యాపారము :

ఈ వ్యాపారము అన్యుల చేత కల్పితము. స్వతః చూడడు, వినడు, మాట్లాడడు, కదలడు, మెదలడు, భోజనం చెయ్యడు మరియు రెప్పపాటు అయినా క్రియ లేదు. కాని అందరివలెనే యుండును. అందరికంటె ఎక్కువ చేయును. తనకు తాను చేయడు కాని చేయును, పట్టువిడుపులు లేవు. సర్వకాలము ఉపాధి ద్వయ దోషరహితులు కనుక యిది రహస్యము. గుర్తెఱిగేది మాయ, అదే అవిద్య, అదే ప్రకృతి. అలాగే గుర్తెఱుగబడేదీ మాయయే. అది కూడా ప్రకృతియే. ఇవి ప్రకృతి ద్వయం. కనుక యీ గుర్తెఱిగేది యెఱుగబడేది కూడా

కలిపి, ప్రకృతి ద్వయమని విచారణ ఫలముగా ఆచార్య స్వాముల వారి చేత తెలుపబడెను. ఈ సిద్ధాంతమే రాద్ధాంతము.

ప్రకృతి ద్వయ లక్షణము :

ప్రకృతికే భ్రాంతి, ప్రకృతికే సంశయము, ప్రకృతికే యోగాభ్యాసము. జ్ఞానమున్ను ప్రకృతే. ప్రకృతి ద్వయమే అవతారములు. క్షేత్రక్షేత్రజ్ఞ స్వరూప ప్రకృతి ద్వయానికే బంధము, మోక్షము. ఈ ద్వయం వలననే వేదశాస్త్ర ఆగమ, పురాణములు. ప్రకృతి ద్వయ దోషరహితునికి యెఱుక లేదు. జ్ఞానాజ్ఞాన రహితమైనదిగనుక యెఱుక లేదు. ఎఱుక ఉన్నదని నిర్ణయకర్త గాడు. తనకు తాను యెఱుగడు, రెండోదాన్ని యెఱుగడు. ప్రకృతి ద్వయరహితమైన ఆ కారణ వస్తువు ప్రకృతి ద్వయాన్ని యెఱుగదు. ప్రకృతి ద్వయ రహితమే విచారణకు ఫలము.

క్షేత్రక్షేత్రజ్ఞ లక్షణ ప్రకృతి ద్వయ దోష రహితమే పరమార్థము. దోషద్వయము లేని అచలము యొక్క సూచనను గురుకటాక్షముచే సంపాదించుకొనవలెను.

అజ్ఞానులకు కర్మకాండ ప్రమాణము. జ్ఞానులకు జ్ఞానకాండ ప్రమాణము. ప్రకృతి ద్వయ దోష రహితులు అజ్ఞానులు కారు, జ్ఞానులు కారు. క్షేత్రక్షేత్రజ్ఞ లక్షణ ప్రకృతి ద్వయ ఉపాధి దోష రహితమే పరమపదము.

శ్లో॥ క్షేత్రక్షేత్రజ్ఞ యోరవ్యం । నామరూప వివర్జితం ।
సదా త్రిపుటి రహితం । సర్వ ద్వంద్వ వివర్జితం ॥

త్రిపుటి యనగా జ్ఞాత-జ్ఞానము-జ్ఞేయము. ద్వంద్వములనగా సత్తు-అసత్తు, చిత్తు-జడము, సుఖము-దుఃఖము, జ్ఞానము-అజ్ఞానము, విద్య-అవిద్య, కారణము-కార్యము, ఆత్మ-అనాత్మ, నిర్గుణము-సగుణము, జ్ఞానము-కర్మ, మోక్షము-బంధము మొదలుగునవి. ఎఱుక లేనిది జ్ఞానాజ్ఞానములు - జ్ఞాత - ద్రష్ట అనునవి లేవు. కనుక త్రిపుటులు, ద్వంద్వములు లేనిదే పరిపూర్ణము.

శ్రు॥ విజ్ఞాన మయోత్పన్నం । జ్ఞాతాజ్ఞానం మనోమయం
ఆజ్ఞేయం బుద్ధ్యోదయ మేవ । ఇతి త్రయోత్పత్తిః పురః జీవః

ప్రకృతి ద్వయమే ఉపాధి ద్వయము, దేహము లేనే లేదు. దేహము లేకున్న అన్నీ పోయెను.

మాయయే విద్యావిద్యలు, ప్రకృతిద్వయము. కాని ఉన్నది అచల పరిపూర్ణము. ఇది ప్రకృతి ద్వయమునెఱుగదు. కనుక ప్రకృతి ద్వయము లేదు. అనగా ఉపాధి ద్వయము లేదు. ఈ దోషము లేకుంటే అంతా అన్నిటిలోను లోపల బయట ఉన్నది అచలమే. దీనికి బాహ్యాంతరములు లేవు.

లేనెఱుక - కేవలాత్మ లక్షణము :

సాధనాసాధ్యపరామర్శ రహితమే ఐక్యము. అదే సుఖదుఃఖ రహితము. అదే ఉత్పత్తినాశరహితము. అదే వృద్ధి క్షయ రహితము. అదే కేవలాత్మ. అదే క్షేత్రక్షేత్రజ్ఞ లక్షణ ప్రకృతి ద్వయ రహితమైన కేవలాత్మ. గురుకృపతో తెలిసినదే నిష్కళ. ప్రకృతి ద్వయము లేకున్నచో కేవలాత్మయే. కనుక పరిపూర్ణమైన బయలేయున్నది. ప్రకృతి ద్వయము మూర్ఛయందు లేదు, ఊరకున్నప్పుడు లేదు, సుషుప్తియందు లేదు, సమాధియందు లేదు, మరణమందు లేదు. ఈ ఐదవస్థలందు యేలాగు లేదో అలాగే గురూపదేశానంతరము ప్రకృతి ద్వయము లేకుండగ, కేవలాత్మ మాత్రమే యున్నది. దీనికి గురుకటాక్షమవసరము.

ధర్మాధర్మ నిరసన ప్రకరణము

శ్లో॥ సత్యాసత్య విహీనంచ । విద్యావిద్య వివర్జితం ।
ద్వైతాద్వైత విహీనంచ । ధర్మాధర్మ వివర్జితం ।

శ్లో॥ చిదేవదేవ చిదమేవలోకా । చిదేవ భూతాని, చిదింద్రియాణి ।
కర్తానిరంతఃకరణం చిదేవ । చిదేవ సర్వం పరమార్థ రూపం ॥

శ్లో॥ చిదీహమస్తీతి చిన్మాత్ర । మిదం చిన్మయ మేవచ ।
చిత్వంచిదహమేతేచ । లోకాశ్చిదితి సంగ్రహః ॥

శ్లో॥ చిదేవ పంచభూతాని । చిదేవ భువనత్రయః
విజ్ఞాన మధునాసమ్య । గహమస్మీ చిదేవహి ॥

శ్లో॥ చైతన్యం శాశ్వతం శాంతం । వ్యోమాతీతం నిరంజనం ।

నాదబిందు కళాతీతం । తస్మై శ్రీ గురవేనమః ॥

తా॥ ఓ శిష్యుడా! పరిపూర్ణ పరబాహ్యమనునది, సత్యాసత్యములు కానిది, విద్యావిద్యలు లేనిది, ద్వైతాద్వైతములు కానిది, ధర్మాధర్మములు లేనిది మరియు చిత్ స్వరూపమైన దివ్యత్వము, ఊర్ధ్వ లోకములు, తన్మాత్రలు, ఈశ్వర తనువులు, సర్వకర్త మొదలుగునవి కానిది ఈ సర్వం పరమార్థ రూపమైనది.

శ్రు॥ సిద్ధోహం, శ్రు ॥ బుద్ధోహం, శ్రు॥ హంసోహం,

శ్రు॥ అహం బ్రహ్మోస్మి, శ్రు॥ జీవేశ్వరైక్య జ్ఞానం

విచారణ ఫలము :

జ్ఞానమే బ్రహ్మ స్వరూపము. పరమాత్మ గుర్తెఱిగేది నేను. ఈ నేను గుర్తెఱిగేది యెక్కడ వున్నదో, అది అపరోక్ష జ్ఞానము; నేను గుర్తెఱిగే ప్రకృతి అనగా సాక్షాత్కారము. సాక్షి గుర్తెఱిగే వాడే. సాక్షిణి అనగా గుర్తెఱిగే చైతన్య స్వరూపిణి. సాక్షి వర్జితము అనగా మాయా రహితము, అవిద్యా రహితము, ప్రకృతి ద్వయ రహితము, క్షరాక్షరోపాధి ద్వయ రహితము. సర్వకాలము ప్రకృతి ద్వయ రహితమే మౌనము.

ఉన్నవానికి ఉన్నదే తోచును, లేనిదానికి లేనిదే లేదు. పుట్టని చావనిది కేవలాత్మ. పుట్టునది, చచ్చునది ప్రకృతి ద్వయము. ఈ ద్వయము లేకుండిన చావు పుట్టుకలు లేనిదేయున్నది. లేనిదెప్పుడును లేదు. ఉన్నదెప్పటికిని లేకపోలేదు. తానే లేకుండిన, ఆ ఉన్న దానినెవ్వడెఱుగు? ఇదే విచారణ ఫలము.

కారణ తను నిరసన ప్రకరణము

శ్లో॥ శుద్ధే సుషుప్తావివచ । తస్మిన్నాహం కథాచన ।
తద్వత్సదాస్తి యస్యాస్తి । ప్రపంచం నాస్తి తన్యవై ॥

తా॥ ఓ శిష్యుడా ! పరిపూర్ణ పరబాహ్యమనునది శుద్ధమైనది, కారణ దేహమనబడే సుషుప్తి కానిది, తత్ స్వరూపము కానిది, సత్తు అను ఉనికి కానిది, ఉన్నదనబడే ప్రపంచం కానిది, వీటన్నింటికీ అన్యమైనది.

సచ్చిదానంద లక్షణము :

గుర్తెఱిగే యెఱుకే సచ్చిదానందము. అదే కన్నులందుండి చూచేది. నేనెఱుగుదు నని యనుభవ మున్నది గనుక, నేనే సచ్చిదానందము. ఈ గుర్తెఱిగెడు సచ్చిదానందముండెనా, అందరూ సత్యమే. ఇది లేకుండిన అందరూ లేరు. ఈ సచ్చిదానందమే పరదేవతయనెడి అమ్మవారు. సర్వమును గుర్తెఱిగే అమ్మవారే. సప్తకోటి మహామంత్ర స్వరూపిణి, సర్వ గాయత్రి, సర్వార్థ ధాత్రి, సావిత్రి, సరస్వతి, సచ్చిదానంద స్వరూపిణి. కనుక అందరూ గుర్తెఱిగే సచ్చిదానంద స్వరూపులే.

తనకు తానె స్వతస్సిద్ధమై ఉన్న అచలమనెడి పరిపూర్ణమునకు, యెఱుక మరపులు లేవు. ఆ పరిపూర్ణమే దేహాకారము గాక ఉన్నది. కనుక గుణములు, వికారము లేవు. ఇంతకంటె ఎక్కువ లేదు. ఉన్నది ఉన్నట్లే ఉన్నది. సర్వకాలము ఒక్క తీరే. ఉన్నది ఉన్నట్లు తెలిపే కలత లేని గురువు కావలెను.

మతాల లక్షణము :

చైతన్యమే క్షేత్రజ్ఞుడు; వాడే సచ్చిదానంద రూపమైన ఆత్మ. వాడే పురుషుడు, వాడే ఆత్మ, వాడే ఈశ్వరుడు, వాడే సర్వమును గుర్తెఱిగే వాడు (సర్వజ్ఞుడు). ఇట్లు అద్వైతము మిథ్యాజ్ఞాన స్వరూపమగుచున్నది. గనుక అమృత వాక్యమును నమ్మినవారికెట్టి సంశయము లేదు.

ఎఱుక లక్షణము :

కన్నులయందున్నది యెఱుక. కనుక అది మాయ. అదే వ్యాపించి, దానికి సమస్త నిర్ణయాలతో చెప్పబడెను. దానికే జ్ఞానమని, చైతన్యమని, జ్ఞప్తియని, క్షేత్రజ్ఞుడని, అవిద్యయని, ఈశ్వరుడని, జీవుడని, యింకను ఆత్మ, ప్రకృతి, మాయ, అహంకారము, పరబ్రహ్మము, సచ్చిదానందము, పరిపూర్ణము, మహా లింగము అని అనేక పర్యాయ నామములు చెప్పబడెను.

జ్ఞాన బీజ - నిరసన లక్షణములు :

గుర్తెఱిగే జ్ఞాన బీజమందు సకల కర్మిష్టులు, చిత్ర విచిత్ర స్వరూపములు, పాప పుణ్యములు, బంధమోక్షములు, సకల ద్వంద్వాలు, సకల సంశయాలు,

సకల నిశ్చయములు యింకను మరెన్నో చెప్పబడినవి. గుర్తెఱిగెడు జ్ఞానమునకు సకల ఉపదేశములు చేయుట, వినుట, వినిపించుట జ్ఞానము. ఈ జ్ఞానమే మిథ్య.

అనేక జన్మల గురుభక్తి, నిష్ఠ, ఫలప్రాప్తి వలన పై జెప్పిన జ్ఞాన బీజ నిరసన కొఱకు గురుని యొద్దకు పోయిన, అట్టి నిజ గురువు అన్నిటికీ మూలం అయినదేదో, దానిని గుర్తింపజేసి అద్దానిని లేకుండా చేయును. సకల బంధనలకు మూలమైన గుర్తెఱిగే యీ శరీరం యేమీ లేకుండ చూచెనా, యిక పుట్టని చావని అచలమే స్వతస్సిద్ధమైయున్నది.

చంచలమనునది నాశనమై యెక్కడ చూచినను అచలమై యుండును. ఏమని యడుగుదమనిన, తాను లేడు, చెప్పుటకు గురుడు లేడు. అచలము మాత్రమే యుండెను. అదే స్వతస్సిద్ధము.

శ్రు॥ నజాయతే, నవిద్యతే ॥

నిజగురు కటాక్షము సంపూర్ణముగా కలిగెనేని, అట్టి వారికి ఏమి లేదు. సర్వకాలము ఒక్క తీరే, ఏక కాల స్థితియే.

కారణ కార్య ప్రకరణము

శ్లో॥ కార్యోపాధిరయంజీవః । కారణోపాధిరీశ్వరః ।
కార్యకారణ తాంహిత్వా । పూర్ణబోధోవశిష్యతే ॥

తా॥ ఓ శిష్యుడా! పరిపూర్ణ పరబాహ్యమనునది కార్యోపాధియనబడే జీవుడు కానిది, కారణోపాదియనబడే ఈశ్వరుడు కానిది, కార్యకారణములకు హితము కానిది, పూర్ణబోధచే నిజగురు కృపచే తెలియబడునది.

కావున సర్వమతముల వారు, వారి వారి మత దేవతలే జగత్కారణమని వాదించినారు. కారణము విత్తనము వంటిది. కార్యము చెట్టువంటిది. నేను సర్వమైన కార్యమును. నేనే మూలమైన కారణమును. కనుక అహంకారమువల్లనే శరరం. ఈ శరీరం సర్వప్రాణులకు సమానము. పుట్టని చావని అచలము సర్వకాలము చలించక ఒక్క తీరుగానే యున్నది.

ఈ గుర్తెఱిగే యెఱుక నేను అనుకొనువాడు అధముడు. ఈ శరీరం నేను అనుకొనువాడు అథమాధముడు. ఈ రెండును లేక ఉన్నవాడు పుట్టనిచావని అచలము. ఈ శరీరం లేని అచలానికి చలనమెన్నటికిని లేదు. దానికి ఎఱుక లేదు, మరపు లేదు. ఎఱుక మరపులు రెండూ ఎఱుకే.

శరీరమైయుండిన యెడల, వారి సాంప్రదాయము బ్రహ్మజ్ఞాన సాంప్రదాయము కావచ్చును. జ్ఞానులైనను, శాస్త్రముల త్రోవను నడచువారు మధ్యములు. పుట్టని చావని అచల సాంప్రదాయమెట్టిది? ఈ శరీరం క్షరము. ఈ గుర్తెఱిగెడు యెఱుకయను ఆత్మ అక్షర పరబ్రహ్మము. అచలము విలక్షణమనెడి యెఱుక కాదు, శరీరము కాదు, యీ రెంటికి అన్యమైన మూడవది యేదియో, అదే ఇరువదియారవది. అది శరీరమందు లేదు. శరీరమందున్న ఇరువదియైదు తత్త్వములు లేకుండిన అచలమే యున్నది. దానికెట్టి యెఱుక మరపులు లేవు.

"ఈ గుర్తెఱిగే శరీరం యేమి లేదు" అను గురువాక్యమును విడువక, సమస్తమైన కార్యములందును ఉండవలెను. భోజన కాలమందు, రతికాలమందు, అన్ని పనులు చేయు కాలములందు, నిద్ర వచ్చుదాక, చచ్చువరకు మరువక యీ గురువాక్యమును అభ్యాసము చేయుచు, సర్వమును విడువకను, చెయ్యకను, శరీరం లేక ఉండవలెను. ఈలాగున ఉన్నవారే మేల్కొన్నవారు. ఇట్టివారు జనన మరణములు లేక సర్వకాలమొక్క తీరుగనే యుందురు. కనుక అది తానుగావలె (సోఽహం) అనువాడు లేకపోయెను. "అది" ఎవ్వరును కాలేరు. "నిర్ణయోనాస్తి సర్వదా" అను శ్రుతి ప్రమాణమును బట్టి ఉన్నది ఉన్నట్లే ఉన్నది.

గీర్వాణ భావార్థ ప్రకరణము

ఆకాశ పుష్పమువలెను, త్రాడు సర్పమువలెను, దారు పురుషుని వలెను, వంధ్యా పుత్త్రునివలెను, ఎండమావులందు నీరువలెను, యీ ప్రపంచము తోచుచున్నదే గాని, నిజముగా ప్రపంచము ఉన్నది కాదు. ఈ ప్రపంచమందు తోచెడు సమస్తమును భ్రాంతియే. శరీరాత్మలు, లోకాలోకములు, భ్రాంతియందలి ప్రతిబింబముల వలెను, ఘటజలమందలి చంద్రునివలెను కనుపించి,

ఒకానొకప్పుడు కనుపడకయే పోవుచున్నవి. కనుక సర్వము భ్రాంతి వల్లనే తోచును, భ్రాంతియే జగత్తునకు కారణము. భ్రాంతి లేని యెడల జగత్తు తోచదు.

దీర్ఘకాలము గురుసేవ చేసిన, భ్రాంతి రహితమగును. నిజస్వరూపమైనదే అచల పరిపూర్ణము. ఈ పరిపూర్ణము కంటె అన్యమేమియును లేదు. ఇది సర్వకాలములందు, సర్వదేశములందు, సమస్త వస్తువులందు చలించక, నిండి నిబిడీకృతమై, అంతర్బాహ్యములు లేక ఎఱుక మరపులు లేక సర్వకాలమొక్క రీతిగా అచలమైయున్నది.

ఉపదేశ ప్రకరణము :

శ్లో॥ ఏతన్మిథ్యా శుద్ధవియత్ । కించిన్నాస్తితి తేమయా ।
కృపయా పరమం ప్రోక్తం । భజాగ్రే ద్వాదాశాక్షరం ॥

తా॥ "ఈ ఉత్తబట్టబయలు ఏమి లేదు" అని రాద్ధాంతమే సహస్ర సిద్ధాంతము.

చరమార్థం :

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య । మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో । మోక్షయిష్యామి మాశుచా ॥

తా॥ ఓ మనిషీ ! సర్వ ధర్మాధర్మములు గల యెఱుక అనెడి అహంకారమును ఆచార్యకృపచే సమూలముగా పరిత్యాగము చేయుము. ఒక్క అహంకారము లేని నన్ను (అచలమును), గురు(ని) మూలముగా, నాకంటె (అచలము కంటె) అన్యము లేదని నమ్ము. అహం లేని నేను, చిద్రూపమైన నిన్ను అహంకారము (ఎఱుక) అనెడి అన్ని పాపముల నుండి (బంధముల నుండి) విడిపించెదను. అట్లయిన, లేకపోయెదవని దుఃఖపడకుము. ఎందుకనగా, నీవు లేకపోవుటయే, పరిపూర్ణమని తాత్పర్యము.

ఎఱుక నాకే యెఱుక, నేనే ఎఱుగుదును. కనుక అహం అను జ్ఞానాజ్ఞానములు లేకపోయిన, అన్నియు పోవును.

స్వరూప లక్షణము :

స్వతస్సిద్ధమైనది కనుక, సర్వకాలము, కల్పనా రహితమై ఉన్నదానియందు, కల్పన ఉన్నట్లును, లేనట్లును ఉండెను. మాయ చేత కల్పనలో పడినట్లు అగుచుండును.

అసంప్రదాయ, సాంప్రదాయ లక్షణములు :

"ఇది అవును, ఇది కాదు". "అంతా అదే, అదే అంతా". "నేనే అంతా, అంతా నేనే". ఇవన్నీ అహంకారమనే యెఱుకయే. ఎఱుక ఉన్నంతసేపు యిలాగుననే అనుకొనుచు, అది పోయిన, దానితోనే లేకపోవును. మరల అది వచ్చిన, దానితోనే భ్రాంతిని విడువక, దఱిదొఱకక కాలము గడపిన యెడల, జనన మరణ ప్రవాహములు వారిని విడువకుండును. భ్రాంతిని గూర్చి సంశయమున్న, భ్రాంతి విడువదు. వారు లోకము తోడి వారే. అహంకారమును విడచినవారు కాదు. ఇందు కొఱకు వెంటనే ఉన్నదున్నట్లు తెలిపెడు నిజగురు సాంప్రదాయమును కనిపెట్టి, అట్టిది తాత్పర్యమైన యెడల, ఆది మధ్యాంత శూన్యమై, రాకడ పోకడ లేక, లేకయుందురు. ఈ నిజస్వరూప స్థితి కంటె అధికము లేదు. కనుక అహంకారమున్నదని యెఱిగినవాడు జ్ఞాని. ఇది యెఱుగనివాడు అజ్ఞాని. ఉన్నదో, లేదోయని అది సంశయము. ఏమీ లేదనిన బౌద్ధుడు. కనుక సర్వకాలము మూలం లేని పరాప్రకృతి స్వరూపమే లేదని, నిజగురుని వలన, నిశ్చయమైన వారే నిజమైన అచలులు.

మూలప్రకృతి నిరసన ప్రకరణము

శ్లో॥ ప్రకృతి పురుషోనాస్తి ।ఏకం నాస్తి ద్వయం నహి ।
బాహ్యాభ్యంతరం నాస్తి । సత్యం సత్యం అహర్నిశం ॥

తా॥ ఓ శిష్యుడా! పరిపూర్ణమే పరబాహ్యము. ప్రకృతి పురుషులు లేనిది. ఏక, ద్వయములు కానిది. బాహ్యాంభతరములు లేనిది. సత్యాసత్యములు, పగలు రాత్రులు కానిది.

గురుసాంప్రదాయ లక్షణము :

మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమి లేదు. ఇట్లు తనకు తానే తాత్పర్యమైన యెడల మరల తోచుటకు ఏమి లేదు. శరీరమును, ఆత్మను గుర్తెఱుగని బట్టబయలు తనకు తానే స్వతస్సిద్ధమై యెన్నటికిని చలింపక యున్నదే

ఉన్నది.

ఇది శరీరం లేని అశరీర సాంప్రదాయము. ఇదే మహా అద్వైతము, ద్వైతాద్వైతరహితమైన పరమతత్త్వము. విశిష్టాద్వైతము, కేవలం అద్వైతము కలలోనైనా లేవు. ఉన్నంత కాసేపు విశిష్టాద్వైతమే. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు గనుక, వ్యవహారము లేదు.

సమాధానము :

ఆచార్య కటాక్షము చేత మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమనే తెఱ తీసి చూచిన వారికి అద్వైతము లేదు, విశిష్టాద్వైతము లేదు. ఈ రెండును లేకుంటే ద్వైతవార్తే లేదు. సర్వకాలము ఈశ్వరుడనెడి వ్యాపకమున్నది. అది గుణములు లేనిది.

శ్రు॥ వికార రహితః ఏవ ఈశ్వరః

అనగా వికారము లేనివాడే ఈశ్వరుడు

సిద్ధాంతము :

శ్రు॥ ఉత్తమః పరుషస్త్వన్యః

అనగా మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం లేకుండిన, ఉన్నదంతయు అచలమే. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమూ ఏమీ లేని యీ బట్టబయలూ యింతకంటె యెక్కువ లేదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం కంటె తక్కువ లేదు. ఈ బట్టబయలే ఉన్నది. ఇదే రాజ మార్గము.

మాయావాదుల మార్గము :

మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం పరబ్రహ్మము. ఈ శరీరాలు స్వతంత్రులైనా పరబ్రహ్మమే. జ్ఞానమే నిర్గుణమని సాధించుట సరికాదు. ఈ శరీరాలు స్వతంత్రులైనచో, కొందరు ఎక్కువ వారు, కొందరు తక్కువ వారు ఎట్లు? కొందరు అగ్ని హోత్రములు చేయగా, మరికొందరు సేవకులు ఎట్లు? కనుక యిట్టి మాయావాదుల మార్గమును విచారించినచో భ్రాంతికే కారణమగును. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమను తెఱ దీసిన ఏమియు లేని అచలమే.

వాసిష్ఠ ప్రమాణము :

ఈ శరీరం ఉన్నదనే భ్రాంతికే అనేక భ్రాంతులున్నవి. "ఉన్న బట్టబయలుకు ఒక్కటైనా భ్రాంతి లేదు. మూలము లేని ఈ గుర్తెఱిగే శరీరము ఏమీ లేదు. ఇక భ్రాంతి ఎందుకు?" అని ఈ విధముగా వసిష్ఠుల వారు రాములవారికి చెప్పెను.

బోధలక్షణము :

ఈ బట్టబయలు పుట్టదు, పుట్టించదు. ఏమి చేయదు. శుక్లము, రక్తము లేవు. రతి, క్రియ లేవు. సహించదు, ఉపేక్షించదు. స్త్రీ పురుషులు కాదు. వికారము లేదు. సర్వక్రియాశూన్యము. దీనికి శరీరంగాని, రాకపోకలు గాని లేవు. ఈ ఉత్తబట్టబయలు సర్వకాలము ఒక్క తీరుగానున్నది. ఇది అభేద్యము, అదాహ్యము, అక్లేద్యము, అశోష్యము అయినను, అన్నింట తారసపడును. ఈ బట్టబయలే సత్యము. ఎఱుక స్వగతము. ఇదే స్థాయి, అచలము, బహుకాలాలది. అన్నీ సరిపోవును.

సంశయము : "సంశయాత్మో వినశ్యతి"

సంశయమే జన్మము. సంశయమే మరణము. సర్వ సంశయములు శరీరమున్నదను వారికిని, ఆత్మయున్నదను వారికిని కలుగును. ఈ రెండును అయివున్న వారికి సంశయములు విడువవు. ఈ లేని శరీరాత్మలకే భ్రాంతులు. సంశయమున్నంత వరకు తిప్పలు. ఉన్నదానికి ఒక్కటైన సాధన లేకయే తనకు తానే స్వతస్సిద్ధమై చలించక, సర్వకాలము ఒక్క తీరుగనే యున్నది.

మహా వాక్య స్వప్రకాశ ప్రకరణము

శ్లో॥ ప్రజ్ఞాన వాక్య హీనాత్మ । తత్వమస్యాది వర్జితం ।

బ్రహ్మోహం భావహీనాత్మ । అయమాత్మేతి వర్జితం ॥

తా॥ ఓ శిష్యుడా! పరిపూర్ణమైన పరబాహ్మము నాలుగు మహావాక్యములచే నిర్ణయింపబడనిది. ప్రజ్ఞానము నేను, బ్రహ్మము నేను అను విధము కానిది. 'అది నేను అయితిని' కానిది. నేను-ఆత్మ-బ్రహ్మము ఇవియన్ని లేనిది.

బట్టబయలు లక్షణము :

"ఈ ఉత్త బట్టబయలు ఏమి లేదు" అని సిద్ధాంతమే సహస్ర కోటి సిద్ధాంతము. ఈ ఉత్త బట్టబయలుకు ప్రత్యగాత్మ లేదు, ప్రాజ్ఞుడు లేదు, తైజసుడు లేదు, విశ్వుడు లేదు. ఇంకను తుర్యావస్థ, సుషుప్త్యావస్థ, స్వప్నావస్థ, జాగ్రదవస్థలు లేవు. దీనికి మహాకారణ, కారణ, సూక్ష్మ, స్థూల, దేహాలు లేవు మరియు అవస్థావాసులు లేరు, అవస్థలు లేవు, శరీరాలు లేవు. మూడు, నాలుగు, పన్నెండు అనునవేవియు లేవు. ఏమీ లేవు.

ఎఱుక లక్షణము :

హిరణ్మయ, ఆనందమయ, విజ్ఞానమయ, మనోమయ, ప్రాణమయ, అన్నమయ కోశములనెడి షట్కోశములున్ను, అన్నీ యెఱుకే. ఈ ఉత్త బట్ట బయలుకు యీ ఆరున్ను ఏమి లేవు. ప్రపంచమున్ను ఎన్నడూ లేదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం చేత అచలము ఇట్టిదని చెప్పుటకు సాధ్యము గాదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఉన్నదనుట తప్పు, అది లేనే లేదు. ఇంతే గాని, ఏ సాధన, ఏ యుక్తి ఏ శ్రుతి పనికి రాదు. కనుక అచలమే శాశ్వతము. ఉన్నదదే.

అసంప్రదాయ లక్షణము :

ఉత్త బట్టబయలు చొరబడదు, వెళ్ళదు, మనుష్యాకారమెన్నడు కాలేదు. ఈ బట్టబయలు తాను చెడి, శరీరాకారము ఎన్నడూ కాలేదు. ఇప్పుడు కాలేదు, ముందర కాబోదు. సర్వకాలము రెండో ప్రకారము గాక, ఒక్క తీరై ఉన్నది. ఉత్త బట్టబయలే నిరంజనము. ప్రజ్ఞానమనెడి యెఱుకయే నిషేధము. కనుక జ్ఞానవాసన, జ్ఞప్తిలు నిషేధము. జ్ఞానము జోలె కూడదు. అది ఉత్త బట్టబయలే కనుక

శ్లో॥ సర్వశూన్యం మాయారూపం। జన్మశూన్య స్వభావతః ।
జన్మభావేన మృత్యుశ్చ । పరిపూర్ణం స్వభావతః ॥

ఈ ఉత్త బట్టబయలు పరిపూర్ణము. దీనివలన పుట్టని ప్రపంచమును యేలాగున ఉన్నదనుట కంటె అబద్ధము లేదు. ప్రపంచము ఉన్నదనుకోరాదు. ఈ ఉత్త బట్టబయలే సర్వకాలము ఉన్నది. ఈ ఉత్తబట్టబయలే నిశ్చయము. చైతన్యము నిషేధము గనుక, జ్ఞప్తి లేని మాయ గనుక, లేని ప్రపంచము లేనేలేదని దృఢము ఉంటే సరి.

బయలు లక్షణము :

ఎఱుకయే, లేని ప్రపంచము. లేని మాయ. ఈ అహంకారమూ లేని మాయయే. లేని మనస్సు లేనే లేదు. ఈ ఉత్త బట్టబయలే పుట్టని చావని పరమాత్మ. ఈ ఉత్తబట్టబయలే నిరంజనము, పరుషోత్తముడు.

శ్రు॥ సచ్చిదానంద స్వరూపిణి । శక్తిశ్రీ పురుషశ్చ ॥

పరమాత్మ వలన పుట్టని ప్రపంచము గురించి ఏమని చెప్పను? ఈ ఉత్తబట్టబయలు వలన ఒక్కటి అయినా పుట్టనే లేదు, పుట్టింది యేమీ లేదు. ఇది మాట్లాడదు. ఊరకే ఉండును. దీనికి సమరసాది ద్వంద్వాలు ప్రాప్తమే లేదు గనుక.

భ్రాంతి లక్షణము :

మాయ ఎట్టిదో, అట్టివాడే ఈశ్వరుడు. ఈశ్వరుడే జీవుడు. జీవుడే అహంకారము. అదే జ్ఞానము. అదే బుద్ధి. లేని మనస్సే జ్ఞప్తి. చిత్తే చిత్తము. అంతఃకరణమన్న యెఱుకే అన్నారు. ఈ ఉత్త బట్టబయలే అమృతము. అంటే మరణము లేనిది. ఇదే పుట్టని చావని పరిపూర్ణము. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం విడిపించే గురువుండెనా, ఇది అతి సులభము.

బోధ లక్షణము :

ఏ గురువును అంటే ఆ గురువును నమ్మక, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం అనెడి ఆవరణము లేని వారినిగా చూచి, వారి ముచ్చట విని, వారి నడతలు జూచి, వారి వద్ద నున్న శిష్యుల జూచి, ఆ శిష్యులు శాంతి చేత ఉన్నారో, లేదా మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం అయి ఉన్నారో, లేదా శరీరం లేక ఉన్నారో గుర్తించిన వారే యిట్టి జాడను కనుగొని, యీలాగున గురువును మొదట నిర్ణయించుకొనవలెను. పిదప కలలోని దేహము వలె, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరము యేమీ లేదని, ఊరకుండి లేకపోవలెను,

పరిపూర్ణమే ఉన్నది.

అమల ప్రకాశ ప్రకరణము

శ్లో॥ జన్మాభావే కర్మం నాస్తి । కర్మాభావే ఫలం నహి ।
ఫలాభావే భయంకుత్ర । భయాభావేన సంశయః ॥

తా॥ ఓ శిష్యుడా! జన్మము, కర్మము, లేనివి. కర్మఫలము, భయము లేనివి. కనుక సంశయము లేక పరబాహ్యము నందుండుము.

భగవానుల లక్షణము :

ఈ ఉత్త బట్టబయలే పుట్టని చావని పరబ్రహ్మము. అదే అత్యంత విలక్షణము. కనుక సకల దేశాలయందు ఉన్నది. సకల కాలాలయందు ఉన్నది. సమస్త వస్తువులయందు ఉన్నది. అదే పరిపూర్ణము.

తాను ఎఱుగడు. జ్ఞానాజ్ఞానాలు లేనివాడు. కనుక ఆదిమధ్యాంత శూన్యుడు. కనుక తాను ఎక్కడ ఉన్నాడు? తనకు మొదలు లేదు, మధ్య లేదు, చివర లేదు. ఉన్న బట్టబయలు యేలాగు ఉన్నదో అలాగే ఉన్నది. అట్టి పరిపూర్ణము మాత్రము సిద్ధము. అభిమానం ఊరపంది. పంది పుట్టుక నెఱిగిన వాడే గురువు. ఈ పరమాత్మయే పరమాత్మ. ఈ పరిపూర్ణమే పరిపూర్ణము. మొట్టమొదట యీ పరిపూర్ణమే ఉన్నది. సర్వకాలము యీ పరిపూర్ణమే ఉన్నది. ఈ పరిపూర్ణము శాశ్వతమైనది. ద్వైతాద్వైతరహితమైన పరతత్త్వము. దీనికి ఏదియును లేదు. ప్రకాశరహితమైన పరతత్త్వమునకు ప్రపంచము పుట్టలేదు.

ఈ ఉత్త బట్టబయలే గనుక, యీ ఉత్త బట్టబయలు ఉత్త బట్టబయలే. దీనివలన ప్రపంచము, మతాలు యెన్నడు పుట్టనే లేదు. ఇప్పుడు పుట్టదు. ముందర పుట్టబోదు. సర్వకాలము ఉత్త బట్టబయలే! పరిపూర్ణమే! ద్వైతాద్వైత రహితమైన పరమతత్త్వము, ప్రకాశ విమర్శనారహితమైన పరమ తత్త్వము యిదేనని విమర్శ లక్షణము.

ప్రభువు లక్షణము :

సూత్ర భాష్యములయందు పుట్టని చావని యీ ఉత్తబట్టబయలు ఉన్నది. గీతా భాష్యమందును, ఉపనిషద్భాష్యమందును పుట్టనిచావనిదే పరబ్రహ్మము. అదే అమృతము, పరిపూర్ణమునకు సూచన. ఇది కారణ కార్యములు లేక ఉన్నది. ఇదే సదసత్తులు గానిది. ఇదే మొదలు చెప్పవలెను. పరమాత్మ వలన పుట్టని క్షేత్రజ్ఞుణ్ణిగాని, క్షేత్రమునుగాని చెప్పరాదు. పుట్టని చావని యీ ఉత్తబట్టబయలే పరమ పురుషుడు. ఈ ఉత్త బట్టబయలుకు ఏమి లేదు. పుట్టని చావని వాడే పరమ పురుషుడు, విలక్షణము. అహంకారము, జ్ఞానాజ్ఞానాలు యీ ఉత్త బట్టబయలుకు ఏమీ లేవు.

అమృత సార ప్రకరణము

శ్లో॥ బంధాబంధ రహితం । అమృతం చాస్తి సర్వదా ।
సూక్ష్మాత్సూక్ష్మతరం నాస్తి । మహతో న్మహిత వర్జితం ॥

తా॥ ఓ శిష్యుడా ! పరిపూర్ణము బంధాబంధము లేనిది సర్వకాలం ఒక్క తీరుగా ఉన్నది అమృతం, సూక్ష్మము, సూక్ష్మతరము కానిది, మహత్తు, అమహత్తు లేనిది.

గురువు :

ఈ ప్రపంచము పుట్టనే లేదు. ఇది నిజ గురువు సందేశము. ఈ ఉత్త బట్టబయలే పరిపూర్ణము. ఈ ఉత్త బట్టబయలు నిజగురువు చెప్పకుండిన కానలేరు.

శ్రు॥ ఆచార్య స్వరూప నివేద్యం ॥, శ్రు॥ ఖం బ్రహ్మ ॥ అని సిద్ధాంతములు.

భ్రాంతి మార్గము మొదటిది కాదు. మొదలుయేది ఉన్నదో అది చెప్పినవాడు నిజగురువు. పుట్టని చావని గురువు కావలెను. శరీరం అయి ఉన్న గురువు పనికిరాదు. అహంకారము అయి ఉన్న గురువు పనికిరాదు. పుట్టని చావనిది యేదో అదే సత్యమని చెప్పే గురువే కావలెను. జ్ఞాన మార్గము నిషేధమే గనుక, పుట్టని చావనిది యీ ఉత్త బట్టబయలు. కనుక ఇది మొదలు చెప్పవలెను.

గురువాక్య లక్షణము :

ఈ ఉత్త బట్టబయలే ఉన్నది. ఈ ఉత్త బట్ట బయలు పుట్టదు, పుట్టించదు. అందుకే ప్రపంచము పుట్టనే లేదు. అది చావదు. పుట్టనిదే అమృతము. అత్యంత

విలక్షణము వలన ప్రపంచము పుట్టనే లేదు గనుక, యిది మొదటి ఉపదేశము. ఇది మహా రహస్యము, రాజగుహ్యము, పరమ గుహ్యము.

అధికారి లక్షణము :

ఈ సిద్ధాంతమును పుణ్యపాపేచ్ఛలున్న వారికి చెప్పరాదు. ఈ ఉత్త బట్టబయలే, నిర్భావము. సతతము మరువక నిరంతరము జ్ఞాపకముండవలెను. ఈ ఉత్త బట్టబయలు వలన సత్తు అసత్తులు పుట్టవు. ఈ ఉత్త బట్టబయలే నిరంజనము. బట్టబయలే తాను, తానే బట్టబయలు, అత్యంత విలక్షణము.

శ్లో॥ నిర్గుణో నిష్క్రియోనిత్యో । నిర్వికల్పో నిరంజనః ।
నిర్వికారో నిరాకారో । నిత్యముక్తోఽస్మి నిర్మలః ।

ఈ ఉత్త బట్టబయలే నిరాకారము, నిర్గుణము, నిర్వికారము, నిరంజనము.

భావాభావరహిత ప్రకరణము :

నేనెల్లప్పుడు అచల పరిపూర్ణ బ్రహ్మమని చెప్పబడుచున్నాను. మాయ ఒకప్పుడు తెలియబడి, మరొకప్పుడు తెలియబడకుండుటయే దానికి స్వభావము. కనుక కనబడుట, కనబడకుండుట రెండును దోష స్వరూపములు. అందుచేత అట్టి మాయ, భ్రాంతిని విడచుటే ధర్మము. మేఘములందు నిమిషనిమిషమునకు రాకపోకలు కలిగిన మెరుపువలెను, ఉత్సవకాలమందలకారయుతుడను మనుష్యుని వలెను, రాతియందలి నిప్పు వలెను, వసంత ఋతువులో అడవి యందు కార్చిచ్చువలెను, మిణుగురు పురుగులవలెను, మాయ, యెఱుకకు రాకపోకలు కలిగియుండుట చేత అది భ్రాంతి రూపకమని చెప్పబడుచున్నది.

అచల పరిపూర్ణమునకు బాహ్యము, అంతరములు లేవు. ఎఱుక మంథనాగ్ని వలె జ్ఞానాగ్ని తనకు తానే ప్రకాశించి, దహింపజేసెడు గుణము కలిగియున్న తీరుగానే, చిదగ్ని యెంతవరకుండునో, అంతవరకుండి, పిదప లేకుండా పోవును. కనుక దానికి మూలము లేదు. ఉన్నట్లుండి వచ్చుట చేత, దాని సామర్థ్యము చేత ప్రసిద్ధమైనది కట్టెయందుద్భవించిన నిప్పు. ఆ కట్టెను కాల్చి తానును సమసిపోవు చున్నది. కనుక భ్రమ యెంతవరకుండునో అంతవరకు ఆ చిదగ్నియుండును. విచారణ చేతనే యెఱుక యనెడు భ్రమ నశించి ఏమియును లేని పరిపూర్ణమేయుండును.

కనుక ఎఱుకయున్నట్లు కనుపించి, కనుపించక పోవుట చేతనే, కుందేటి కొమ్ములవలె, గొడ్రాలి బిడ్డ వలె, ఆకాశపుష్పము వలె లేనిదగుట చేత యీ నిలకడ లేని జ్ఞానము వల్లనే దబ్బరయైన భ్రమ గనుక, జ్ఞానమునూ నిలకడ లేని దబ్బరగానే యున్నది. ప్రపంచ శరీరములను తెలిసికొనునదియే క్షేత్రాధిపతి. అదే జ్ఞానమని ప్రసిద్ధము. దానికే ప్రత్యగాత్మ, ప్రకృతి పురుషులు, కూటస్థుడు, బ్రహ్మము, క్షేత్రజ్ఞుడు, సచ్చిదానందము, పరమాత్మ, పరమేశ్వరుడు అని పేర్లు. సర్వమునకు సాక్షిస్వరూపుడైయున్నాడని, శ్రీమన్నారాయణుడని, పరమశివుడని, వేదవేద్యుడని, విజ్ఞానమని, యిట్టి కారణములచేతనే జ్ఞాన స్వరూపమని చెప్పబడుచ్నుది. కనుక జ్ఞానమే జీవోపాధియని చెప్పబడుచున్నది.

అది యెట్లనగా, జ్ఞానమాకాశతత్త్వముగా కనపడుచున్నది. జీవ పంచీకరణము నందొకటి గనుక, అదియును దానియందలి ప్రతిబింబములును, జీవోపాధియే. మాయా జ్ఞాన ప్రతిబింబితుడైన ఈశ్వరుడును అవిద్య జ్ఞాన ప్రతిబింబితుడైన జీవుడును, ఈ రెండును ప్రతిబింబములే గనుక దానికేయభేద సౌజ్ఞ, అద్వైత సౌజ్ఞ, ప్రత్యగాత్మ, పరమాత్మ సౌజ్ఞ.

అచల పరిపూర్ణ బ్రహ్మమునందు సమస్త గుణములు శూన్యమై దోషరహిత మగుట వలనను, సర్వ శూన్య ఫలమని దృఢముగా నిశ్చయించుటే విచారణ. అట్లు విచారించి, జగజ్జీవేశ్వర భ్రమలను విడచినవాడే బంధమోక్షములు లేనివాడు.

ఇట్టి దృఢనిశ్చయమే క్షేత్రక్షేత్రజ్ఞ భ్రాంతి రహితము, సగుణ నిర్గుణ రహితము, ప్రకృతి పురుష రహితము, జగజ్జీవేశ్వర భ్రాంతి రహితము, జ్ఞానాజ్ఞానరహితము, మాయా విద్యా రహితము, భేదాభేదరహితము, పుణ్య పాప రహితము, కూటస్థ బ్రహ్మ రహితము. లోపల వెలుపల సర్వశూన్యమై నిలిచినదేదియో అదియే పరిపూర్ణ బ్రహ్మము. ఇట్టిది దృఢపడుటే భావాభావ రహితమని తాత్పర్యము.

ఈశ్వర పంచీకరణము

శ్రు॥ సృష్టేః పూర్వం । నామరూప రహిత ।
అఖండ అద్వితీయ । బ్రహ్మ చైతన్యం అస్తి ॥

అనిర్వాచ్యమైన పరశివమనెడి పరబ్రహ్మమందు మూల ప్రకృతియను పరబ్రహ్మణియను మహాసత్తా మూలా విద్య, తులా విద్య, విద్యా విద్య, భేదముచే సర్వవ్యాపియగు పరాశక్తి తనకు తాను యేర్పాటు అయి అతి స్వచ్ఛముగా మూల ప్రకృతియను సుషిరమైయున్నది. ఈ ప్రకృతి కూడ జనన మరణ ప్రవాహ రహితమైన స్వరూపిణియై సదాయున్నది. ఆ పరబ్రహ్మయందు, యీ స్వచ్ఛమైన మూల ప్రకృతి సత్తాచే ముఖమందు ప్రకాశము లేనిదే అద్దముంచుకొన్నప్పుడు ప్రకాశించ నటుల, నీటియందు ప్రతిబింబించిన ఆకాశాదుల వలె ఆ నిర్గుణ పరబ్రహ్మము వంధ్యా పుత్రునివలె, మరుమరీచక వలె, రజ్జుపై తోచిన సర్పము వల, ఆకాశ పుష్పము వలె ప్రతిబింబించియున్నది. ఆ ప్రతిబింబమునకు కూటస్థుడని పేరు. కూటస్థుడనగా త్రిగుణాత్మకమైన ప్రణవము. ఈ ప్రణవము మూడుగా విభాగింపబడినది. త్రిమూర్తులు యీ మూడింటియందు పరబ్రహ్మణి అనెడి మాయ మూడు ప్రకృతులై త్రిశక్త్యాత్మకమై అకార ఉకార మకారములనెడి అక్షరాత్మకమైన వాణి, లక్ష్మి, పార్వతులను నామములచే సత్త్వ, రజ స్తమో గుణాత్మకమైన యా ప్రకృతిత్రయము, మూర్తి త్రయముతో గూడి, సంచరించుచూ యున్నది.

ఇక్కడనే త్రిగుణాత్మకమైన ప్రకృతి విచారణ యావత్తు చేయవలెను. నిరాకార పంచభూత విభాగ లక్షణము అనగా పరశివము, కళ, కాలము, చిత్తు, తమస్సు అనెడి నిరాకార పంచభూతములే.

పరశివము రెండు భాగములై అందులో మొదటి భాగము పరబ్రహ్మమ య్యెను. మిగిలిన అర్థాంశము నాలుగు భాగములై, ప్రథమ భాగము కళలోనున్నూ, ద్వితీయ భాగము కాలములోనున్నూ, తృతీయ భాగము చిత్తులోనున్నూ, చతుర్థ భాగము తమస్సులోనున్నూ గలసి శివ, విష్ణు, బ్రహ్మ, ఇంద్ర స్వరూపములైనవి.

కళ రెండు భాగములై అందు మొదటి భాగము వైకుంఠ కైలాస సత్య ఇంద్రలోకములనెడి నిరాలంబ మార్గమైనది. మిగిలిన అర్థాంశము నాలుగు భాగములై, ప్రథమ భాగము పరశివములో గలసి, తక్కిన మూడు భాగములు దిగువనుండెడు కాలం, చిత్తు, తమస్సులలో గలసి సాకారాదులైన జగత్తులోని వైకుంఠ కైలాస సత్య ఇంద్రలోకములకు క్షేత్రమైనది.

కాలము రెండు భాగములై, అందు మొదటి భాగము సముద్రమందలి బడబాగ్నిగను, మిగిలిన అర్థాంశము నాలుగు భాగములై అందులో ప్రథమ భాగము దావాగ్నిన్నూ, ద్వితీయ భాగము సూర్యాగ్నియున్నూ, తృతీయ భాగము ఆవహనీయాదిశ్రౌతాగ్నియున్నూ, చతుర్థ భాగము జఠరాగ్నియున్నూ అయినది.

చిత్తు రెండు భాగములై, అందు మొదటి భాగము బ్రహ్మమానస సరోవరములందున్నూ, శివుని జటాజూటముయందున్నూ, విష్ణు పాదోద్భవ మున్ను త్రివిధ గంగ, యమున, సరస్వతి రూపిణియై వాటి స్థానములందున్నూ ప్రవహించుచుండే ఆ కూప గంగ యైనది. మిగిలిన అర్థాంశము నాలుగు భాగములై అందులో మొదటిది ఆకాశ గంగయు, రెండవది సముద్ర గంగయు, మూడవది నదీ గంగయు, నాల్గవది తటాక గంగయు అయినవి.

తమస్సు రెండు భాగములై, అందు మొదటి భాగము శరభాది మృగములాయెను. మిగిలిన అర్థాంశము నాలుగు భాగములై అందులో మొదటిది మేరు పర్వతాదులు, రెండవది సువర్ణాదులు, మూడవది మందరాదులు, నాల్గవది ఇనుము, ఉక్కు లోహాదులైనవి.

దీనినే ఈశ్వర పంచీకరణయని కూడా యనెదరు. దీని వల్ల సకల జీవులు సాకారాది భూతములతో గూడి అఖిల జీవ సృష్టియైన యావత్తూ జన్మించెను. ఇదే ఈశ్వర సృష్టి విధానము.

షోడశి

ద్వాదశాక్షరి :

శ్లో॥ ఏతన్మిథ్యా శుద్ధి వియత్ । కించిన్నాస్తి తితే మయా
కృపయా పరమంత్రోక్తం । భజాగ్రే ద్వాదాశాక్షరం

అధమను ః

ఏతత్ మిథ్యా శుద్ధ వియత్ కించి న్నాస్థి

ఈ వృత్త బట్ట బయలు ఏమి లేదు

షోడశాక్షరి

శ్లో॥ నిర్మూలమేతథా, జ్ఞాన, శ్చరీరం నాస్తి కేవలం
మూలం లేని యీ గుర్తెరిగే శరీరం ఏమీ లేదు.

దృష్టద్రాష్టాంతము - పంచదశి

ద్రా. స్వప్నే ప్రతీమానాని రూపాణిచ యథాతథా
ద్రా. కలలో దోచిన శరీరముల యేలాగో అలాగే
దృ. కర్పూర దీప సంయోగం జ్యోతి రూపం యథాతథా
దృ. కర్పూరం కళిక అగ్నితో కూడితే యేలాగో అలాగే

ప్రథమ కల (వేదాంత ప్రకరణము) :

శ్లో॥ అశరీరం సర్వదాస్తి । శరీరం రహితం సదా ।
అయమేవసద్యోముక్తిః । అన్యధా భ్రమ కారణం ॥

మూలం లేని యీ గుర్తెఱిగి శరీరం ఏమీ లేదు అనే సిద్ధాంతము. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే "సర్వం నావలన పుట్టి యున్నది" అని తనవంటి వారితో చెప్పితే నమ్మి ఉన్నది ఉన్నట్లు ఉన్నారు.

పుట్టని చావని అచలం వినదు, చూడదు, అడుగదు, యెఱుగదు. యెన్నటికీ చలించదు. అచలానికి చంచలమైన శరీరములకు కొంచెమైన సంబంధము లేదు. సమస్తమైన మహత్తు గుర్తెఱిగే శరీరానికే గాని, పుట్టని చావని అచలానికి ఒక్కటైనా మహత్తు లేదు. అచలం కనుక, రాకడపోకడ లేదు. సర్వకాలము ఒక్కతీరే. ఈ గుర్తెఱిగే శరీరంతో సంబంధము ఈషణ్మాత్రము లేదు. దానికదే! దీనికిదే ! కాని, యీ గుర్తెఱిగే శరీరమునకు పుట్టని చావని అచలానికి సంబంధము లేనప్పటికిని, సంబంధము ఉన్నదని, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే అన్నది.

నేనూ యీ గుర్తెఱిగే శరీరమే. దేవతా యీ గుర్తెఱిగే శరీరమే.

కాని భ్రాంతి లేని గురువు దొరకుట దుర్లభం. అందరివలె నుంటాడు. గనుక నమ్మిక ఉండదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరము సకల సిద్ధాంతములకు మూలం. ఈ గుర్తెఱిగే శరీరం ఉన్నంతసేపు సమస్తమైన లీలలు అనుభవింపబడతాయి. రెండోదాని చేత అనుభవింపబడదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఒక్కటే గనుక అనుభవం చేతనే అనుభవింపబడతాయి. కనుక అంతా బ్రహ్మానుభవమే.

ద్వితీయ కల (ప్రకృతి పురుష సంయోగ నిరసన ప్రకరణము)

శ్లో॥ త్యజ ధర్మమ ధర్మంచ । ఉభై సత్యానృతం త్యజేత్ ।
ఉభై సత్యానృతే త్యక్త్వా । ఏనం త్యసితం త్యజేత్ ॥

ప్రకృతి, పురుషులు ఎఱుకే, పంచీకరించబడినదంతా ప్రకృతి, సాక్షి, పురుషుడు. ఇవి అన్నీ ద్విపుటిలోనివే. బయలు కాదు. నేను అది అయితిని అను ఐక్యము, సంయోగము అనునవి ఎఱుకలోని భ్రాంతులు. ఎందుకంటే మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఉన్నంతసేపు అనుభవము. ఈ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదని యెపుడు వింటే అపుడే పుట్టని చావని అచలం స్వతస్సిద్ధమౌను సకల దేశములందు, సమస్తమైన వస్తువులయందు, సర్వకాలములందు జ్ఞానకర్మలు యెఱుగక తనకు తానే ఉన్నది. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమి లేదు అని సతతం సర్వకాలము అభ్యాసము చేసినచో ఒక్కటైనా బాధ ఉండదు. ఉన్నదేదో అదే వున్నది.

ఎన్నటికి ఏది మూలమో, అదే కలలో యేనుగ మేలుకొంటే యేమి లేదు అని తనకు తాను దృఢమై వున్నట్లు మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమి లేదు అని దృఢం అయి యేది వున్నదో అదే వున్నది. ఇక ముచ్చట వద్దు. చాలు చాలు యెక్కువ ముచ్చట. ఊరకే అదే వున్నది, అంటే వుండిపోయెను! ఉన్నది ఉన్నట్లు సూచన అయినవారికి ముఖం చెల్లదు. మునుపటి వలె చెలామణి లేదు. చెల్లని రూపాయి వలెనే. రాగి నాణెము పాటిది కాదు. ఇందుకు అనుమానం లేదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరానికి బదులు లేదు. పుట్టని చావని దానికి బదులు లేదు. గురు సాంప్రదాయము ఇలాగ వుండవలెను.

తృతీయ కల (శివశక్త్యోపాధిద్వయ దోష రహిత ప్రకరణము)

శ్లో॥ సర్వశ్యం మాయరూపం । జన్మశూన్యం స్వభావతః ॥
జన్మాభావేన మృత్యుశ్చ । పరిపూర్ణం స్వభావతః ॥

శివశక్తులు ఎఱుకే, బయలు కాదు. చైతన్యము, చేతనము అన్యోన్యాశ్రయ ములు. చైతన్యము శివము, చేతనము, శక్తి, చైతన్యము శక్తి అయిన, సాక్షిత్వము శివము. ఈ నిర్ణయములన్నీ ఎఱుక భ్రాంతులే కాని... సర్వకాలం మొదలు చివర, అచలమే వున్నది. దానికి వుత్పత్తి లేదు. స్థితి లేదు. లయం లేదు. సర్వకాలం ఒక్క తీరే. ఇది నమ్మిన వారికి భ్రాంతి యెన్నటికిన్నీ లేదు. ఎవ్వరికీ అనుమానం లేదు. బ్రహ్మసత్యం అనువారు లేరు. జీవుడు అబద్ధం అనేవారు లేరు. శూన్యం కాదు. కలలో యేనుగు వచ్చి కొంతసేపు వుండి మేలుకొంటే యేమి లేదు.

పుట్టని, చావని అచలం మొదలు చివర సకల దేశాలయందు, సర్వ కాలాల యందు, సమస్తమైన వస్తువుల యందు, తనకు తానే స్వతస్సిద్ధమై యున్నది. కనుక ప్రయత్నము యేమీ లేదు. అదే అచలం, చలించనిది. కనుక గురువాక్యం మరువకూడదు.

"అది వున్నది" అని నమ్మిక అయితే, యిది "తనకై తాను" లేకపోతుంది.

చతుర్థ కల (విద్యా విద్యోపాధి ద్వయ దోష రహిత ప్రకరణము)

శ్లో॥ వ్యాప్య వ్యాపకతా మిథ్యా । సర్వమాత్మేతి శాసనాత్ ।
ఇతి నిర్ధారితం శృత్వా । బృహదారణ్య సంస్థయా ॥

విద్య-అవిద్యలు ఎఱుకే. బయలు కాదు. విద్య-జ్ఞానము, అవిద్య-అజ్ఞానము, విద్య-బ్రహ్మము లేక ఈశ్వరత్వము. అవిద్య-జీవుడు, జీవేశ్వరైక్యము – 'అది నేను అయితిని' వంటి నిర్ణయములన్నీ ఎఱుకలోనివే. భ్రాంతులే. ఎట్లన విద్యావిద్యలు మూలప్రకృతి అయిన ఎఱుకలోనివే. గురు సూచనచే బయలు ఎట్లున్నదనగా...

కలలో ఒక్క స్త్రీ (మూల ప్రకృతి) వచ్చెను, వచ్చి మీరు ఎవ్వరు అని అడిగితే గురుమూర్తి పుట్టని చావని తనకు భయం లేక వున్న తాను సకల దేశాలయందు సర్వకాలాలయందు సమస్తమైన వస్తువుల యందు చలించక సర్వకాలం ఒక్క తీరుగా నున్నదని బదులిచ్చెను. దాని వివరం తెలుపమనగా.

మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు. అని దృఢంగా వుండడమే విచారణకు ఫలం. ఫలితంగా మూలం లేని యీ గుర్తెఱిగే శరీరంతోటి కావలెనని అనుకొన్నా కూడా యేమి లేదు. సర్వకాలం శరీరం లేకపోవడమే విచారణకు ఫలం. మాటిమాటికి కలలో శరీరం మేలుకొంటే యెలాగో అలాగే. దృష్టాంతం వుండవలెను. అది యిది ఒక్కసారే వచ్చి, అది యేమి లేకపోతే ఇది వెనుక చిక్కి, పెండ్లాడి, సంసారి అని అనుకుంటున్నది. దానికంటే ఇది మరీ మాయలది. దీనికి ఆసరా లేక వున్నది. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం గానూ ఏమీ లేదు, లేకుండగానూ యేమి లేదు. ఇది ఎలా? మూలము లేని యీ గుర్తెఱిగే శరీరం యేమి లేదు అని అనుకుంటే చాలు. ప్రయత్నం పట్టదు గనుక స్వతస్సిద్ధమై సర్వ కాలం ఒక్క తీరే. అటువంటి గురు సాంప్రదాయమే భ్రాంతి రహితమైనది. మూలం లేని గుర్తెఱిగే శరీరం వున్నదీ కాదు, లేకపోయినదీ కాదు, అందుకే భ్రాంతి వున్న దానికి యేమి లేదు. అంటే ఒక్కటైనా వుండదు. కల కంటున్న శరీరానికి అనేక భ్రాంతులు వుండి, మేలుకుంటే యేమీ లేదు. కొన్ని వుండి కొన్ని పోయినవి కావు. అలాగే యీ మూలము లేని గుర్తెఱిగే శరీరం ఏమి లేదు. గనుక అంతకంటే యెక్కువ లేదు.

కలలో యేనుగ మేలుకొంటే యేలాగో, అలాగే మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమి లేదు. గురుసూచనకు మూలం లేదు. వేదోపనిషత్సారమగు పరమార్థపు ముచ్చట విడిస్తే చాలు.

పంచమ కల (కలవంటి శరీరం)

రాద్ధాంతంగా వచ్చేది, వున్నంతసేపు వుండేది, కలలో పెద్దపులి (అహం కారము) వలెనే, మేలుకుంటే యేమి లేదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం పుట్టని చావని దాని దర్శనం. గురుమూలంగా సూచన కాగానే యేమీ లేదు. యేనుగుకు సింహం స్వప్నమందు వస్తే యెలాగు మరణమో అలాగే. పుట్టని చావనిది, మొదలు చివర లేనిది, సర్వకాలము ఒక్క తీరుగా నున్నది. సకల

దేశములందు కూర్చుండి యున్నావు గాని, అది నీవు కావు. నీవు అది కాదు. నీకు కొంచెమైనను సంబంధము లేదు. నీ వర్తమానము కలలో వచ్చిన యేనుగు మేలుకుంటే యెలాగో అలాగే

షష్టమ కల (నేనుకు మూలం)

మూలం లేని యీ శరీరం నడమంత్రాన తనకు తానే వచ్చింది. ఉన్నంతసేపు ఉండి, ఊరట కోసం మూలము దరిజేరుదామంటే, నాకు వచ్చేటప్పుడు ఏమి మూలం లేదు. పోదామంటే నాకు ఉండేటందుకు స్థానం యేమీ లేదు. నాకు బ్రతుకున్నంతసేపు చచ్చినట్లు పడియుండవలెను. లేని సమయం వస్తే నేను ఏమి లేదు. రెండోది ఏమీ లేదు. కేవలం అంధకారమే. ఏదైనా దండి ఆసరా దొరికితే నాకు స్వస్థత, లేకుంటే భ్రాంతి లేదు.

ఇట్టి మూలం లేని యీ గుర్తెతిగే శరీరములు అనేక కోట్లు వచ్చినను, వున్నను, ఏమీ లేకపోయినను చలించక యుండేది కావలెను. కాని ఏమీ లేనిది ఎక్కడ నుండి వస్తుంది? ఎక్కడికి పోతుంది? కనుక ఏమీ లేని యీ గుర్తెతిగే శరీరమును "నేను"

బయలు పుట్టని చావనిది. మొదలు చివర లేనిది. సకల దేశములందు, సమస్త వస్తువులందు, సర్వకాలములందు చలించక సర్వకాలమూ ఒక్క తీరుగానే ఉన్నది. ఏమీ లేని యీ గుర్తెతిగే శరీరము అయి వున్న నీకును, దానికిని పట్టదు. కాని దాని జోలి మనకు అవశ్యము కావలెను. ఎందుకనగా, అది మనస్సుకు పడకుంటే, మనస్సుకు శాంతి లేదు.

మూలం లేని యీ గుర్తెతిగే శరీరం ఏమిలేదు, పుట్టనిచావనిదే వున్నది. మూలం లేని యీ గుర్తెతిగే శరీరం ఉన్న దాన్ని కనుక్కొని వుంటే బాధ. ఉన్నదానికి శరీరమే లేదు. యేమి లేని యీ గుర్తెతిగే శరీరం ఏమీ లేదు.

నిద్రలో వెయ్యి యేనుగులు ఉండి మేలుకుంటే ఏమీ లేదు. అలాగే పుట్టని చావనిది, రాకడ పోకడ లేనిది, మొదలు చివర లేనిది, సకల దేశములందు, సర్వకాలములందు, సమస్తమైన వస్తువులందు చలించక, సర్వకాలమూ ఒక్క తీరుగానున్నది. సూచనకాగానే ఏమీ లేని యీ గుర్తెతిగే శరీరం ఏమీ లేదు.

సప్తమ కల (నేనే మూలమను భ్రాంతి)

నేను వేరు, శరీరం వేరు; వారు, మేము శరీరం ఒక్కటే. నన్ను విడచి శరీరం వుండదు. నేను ఏమి చేసిననూ క్రియా శూన్యుడను, అభోక్తను, నేను ఏమి చెయ్యను. అన్నీ దేహధర్మాలే. దేహమే చేస్తుంది. కానీ, శరీరం ఏమి చేస్తుంది? సకల వ్యవహారాలకు కర్తను, గుర్తెతిగే వాడిని. "జ్ఞాత్వాకర్మాణి కుర్వంతి" అనగా సమస్తము అయిన వ్యవహారములు నేనే, కాని స్వతంత్రుణ్ణి కాను.

నేను సత్యము, శరీరం సత్యము, నేను లేనిది శరీరం చెయ్యదు. శరీరం లేనిది నేను చెయ్యను, గుర్తెతిగే నేను జ్ఞానం, శరీరం చేసేది కర్మ. జ్ఞానం సత్యము. కర్మలు సత్యము. ద్వైతం సత్యము.

ఈ చరాచరముల రాకపోకల మొదలు చివర యెవ్వరికీ తెలియదు. ఇది యెంత కఠినం? అందరికీ తెలియకుండా, యీ మూలం లేని గుర్తెతిగే శరీరం నేనని, నిశ్చయం గలవారు, చివర మూలం లేని యీ గుర్తెతిగే శరీరానికి ప్రవేశించేటందుకు స్థానం వున్నదని, మళ్ళీ వస్తుందని, మూలం లేని యీ గుర్తెతిగే శరీరానికి మోక్షమని, ఇదే యిన్ని మార్గాలు చేసిందని నమ్ముతున్నారు. ఇట్టి భ్రాంతి పోవలెనన్న శ్రీఘ్రంగా మూలం లేని యీ గుర్తెతిగే శరీరం లేని గురుస్వామిని వెతకి, పుట్టని చావని జాడ సూచన చెయ్యండని ప్రార్థించవలెను.

మూలం లేని యీ గుర్తెతిగే శరీరం ఏమీ లేదు. నేను వుంటేనే నాకు యెఱుక. నేను ఏమీ లేకుంటే ఏమీ లేదు. ఈ శరీరానికి మూలం యేమీ లేదు. సుషుప్తి అంటారు. అప్పుడు ఎవరూ లేరు. నేను లేను. నేను రాగానే నాతోటి వచ్చినారు. వారూ నావంటి వారే. కాస్సేపుండి చివరకు ఏమీ లేకపోయేది, పుట్టని చావని దాన్ని, వారు యెఱుగరు. నేనూ యెఱుగను.

మూలం లేని యీ గుర్తెతిగే శరీరం చేత పుట్టని చావని దానిని, మొదలు చివర లేనిదానిని, రాకడ పోకడ లేనిదానిని, సర్వకాలములందు సమస్తమైన వస్తువులందు చలించక ఉన్నదానిని ఉండజూచి, కలలో యేనుగ మేలుకుంటే ఏమయ్యెను? ఏమీ లేకపొయ్యెను. "మూలం లేని యీ గుర్తెతిగే శరీరం ఏమి లేదు" అని నిశ్చయమే విచారణకు ఫలము. ఎక్కడ చూచినను పరిపూర్ణమే.

చూపులేదు, మేపు లేదు.

అష్టమ కల (సదసదుపాధి ద్వయ దోష రహిత ప్రకరణము)

శ్లో॥ యదాకాశో హృషీకేశో । నానోపాధి గతోవిభుః
తద్భేదాభిన్న వద్భాతి । తన్నాశో కేవలోభవేత్ ॥

సత్తు, అసత్తు ఎఱుకే. బయలు కాదు. సత్తు ఈశ్వరుడు, అసత్తు జీవుడు అనే ద్విపుటి ఎఱుకే. విచారణచే వివేకం. వివేకముచే చావని పుట్టని దాని నిర్ణయం.

ఎట్లనగా, మూలం లేని గుర్తెఱిగే శరీరం యేమీ లేదు అని నిశ్చయమే విచారణకు ఫలం. కలలో అయోని సంభవుడు ఒకరాజు చతురంగ బలాలతోటి వచ్చెను. వచ్చిన సేనంతా రాజువలెనే అయోని సంభవులు. ఆ రాజు తనకు మూలమేమి యని గురుమూర్తిని అడిగెను. తనతో వచ్చిన వారందరికి ఏది మూలమో అదే రాజునకు మూలమని గురువు సమాధానం చెప్పెను. అదే భ్రాంతి. అందరూ మొదట ఏమీ లేకనే వచ్చినారు. రాజునకు తల్లి తండ్రి ఏలాగు లేరో అలాగే సమస్తమైన వారికిన్నీ లేరు. అందరూ సమానమే, కనుక రాజు ఒక్కడు మాత్రము ఎక్కువా? కనక శరీరం జగత్తు అసత్తని ఆత్మ సత్తని చెప్పునదంతా ఎఱుకలోనిదని యీ సమస్తమంతయు లేనిదని, బయలే ఉన్నదని తెలియుటయే నిర్ణయము. ఈ శరీరమునకు మొదలు చివర ఏమీ లేదు. కలలో కోటి యేనుగులు ఉండియే మేలుకుంటే ఏమయ్యెను? ఏమీ లేదు. శరీరం ఏమీ లేదు అని తెలుసు కదా! ఉన్నప్పుడు మూలం లేదనియూ, గుర్తెఱిగే శరీరం ఏమీ లేదంటే తప్పాయనిన అది తప్పు కాదు. ఎందుకనగా, ఉన్నది యెన్నటికీ లేకపోలేదు. లేనిది కాస్సేపు ఉన్నా ఏమీ లేదు. చలించేది ఏమీ లేదు. కనుక అచలం ఉన్నది.

మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు. అనగానే అచలం స్వతస్సిద్ధం. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరాలకు మూలం ఏమీ లేదు. చివరకు ఏమీలేదు గనుక ఉన్న కాస్సేపు మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు. ఇది గురువాక్యం. ఇది నమ్మిన వారికి బంధం లేదు, మోక్షం లేదు. సర్వకాలం పరిపూర్ణమే. ఇట్టి వారే పుట్టని చావని వారు.

నవమ కల (సత్)

కలలో మరొక రాజు వచ్చెను. వస్తూనే "నా నిర్ణయం బ్రహ్మ నిర్ణయం (సత్) నాకు తెలుసు. నాకు తెలియనిది ఏమైనాయుండినచో దానిని నాకు తీవ్రంగా సూచన చెయ్యండి" అనెను. మరియు "నాకు మూలం యేమీ లేదు. చివరకు స్థానం యేమీ లేదు, నాకు నేనే వచ్చి కాసేపు ఉండి వెంటనే శూన్యమైపోతా" ననెను. శూన్యమంటే యేమీలేదనెను. కనుక రాజు శరీరం లేనిదానిలోనే వున్నట్లు తెలిసినది. సర్వకాలమూ ఒక్కతీరుగా చలించక, బయలు సకల దేశములందు సర్వములందు సమస్తమైన వస్తువుల యందు గట్టిగాయున్నది. ఇందుకు ఎట్టి అనుమానము లేదు. కోటి మాటలకు లేదు. లేదు అన్నా, అదే వున్నది. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు, అనీ అనగానే స్వతస్సిద్ధమైన అచలం తనకు తానే ఉన్నది. ప్రయత్నం చేత సాధ్యం కాదు. ప్రయత్నం చేసేది ఏమీ లేదు. ఈ కలలో కోటి యేనుగులు ఉండియే, యిటు చూడగనే ఏమాయెను? ఏమి లేదని అందరికీ దృఢమే. రాజునకు, వారికి ఒకటి ఎక్కువ కాదు, ఒకటి తక్కువ కాదు. ఉన్నదానికి సంశయము లేదు, దృఢము లేదు, సర్వకాలమున్ను ఒక్క తీరే.

దశమ కల (ఈశ్వరుడు)

కలలో ముసలివాడు (ఈశ్వరుడు) వచ్చెను. వస్తూనే నా మూలం నాకు తెలియదు, ఎంతవారికీ తెలియదు. ఈ రహస్యం చెప్పమనెను. అందుకు గురువు యీలాగనెను. ఇది పుట్టని చావనిది, మొదలు చివర లేనిది, శరీరం లేనిది, రాకడ పోకడ లేనిది, సర్వకాలం ఒక్క తీరుగా వున్నది. క్రియా శూన్యమైనది, భోజనము చెయ్యనిది, ఒక్కటైనా భ్రాంతి లేనిది, సకల దేశాల యందు సమస్తమైన వస్తువులయందు చలించక వున్న దానియందు నీవు ఉన్నావు.

అంతట ఈశ్వరుడు సూచనయైన దానికిని, తనకూ ఏమి సంబంధము లేదనియు తనవంటి వారలే కోట్లు వచ్చినను నీళ్ళలో పరపు బండవలె

వున్నదానికి, ఎంత ప్రవాహము వచ్చిననూ దానికి ఏమి కొదువ? యెక్కువ అయినా నీళ్ళకే గాని, దానికి సర్వకాలం ఒక్క తీరే అని ఈశ్వరుడు పల్కెను. తాము అయోని సంభవులనెను.

అట్లయిన, ఈశ్వరునకు ఎన్నటికినీ మూలం ఏమీ లేదని గురువనెను. చివరకు అతడు ఎక్కడికి పోతాననెను. అది అతని కెఱుకేయనెను. అతడు ఉన్నంతసేపు అతనికెఱుకనెను. అతడెప్పుడూ లేడనెను. అతడు ఎప్పుడంటే అప్పుడే శూన్యం. శూన్యమనగా ఏమీ లేదు. అతడు (సర్వం) లేనిదే. కాని గురువు సూచన చేసింది బయలును. అది రానూ లేదు, పోనూ లేదు. ఉండేది యేమి? లేకపోయేది యేమి? నాకు నేనే ఏమీ లేదు. (నేను అనగా వృద్ధుడు లేక ఈశ్వరుడు)

మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమునకు మొదలు ఏమీ లేదు, చివర ఏమీ లేదు, నడుమ ఉన్నప్పుడు ఏమీ లేదు గనుక, శరీరము ఉన్నపుడు శరీరము లేనిదానిని ఉండజూచి, సర్వకాలమూ శరీరం లేకుండేది. ఇదియే భ్రాంతి లేని మార్గము. ఇంతకంటె అధికం లేదు.

ఏకాదశ కల (అసత్)

కలలో ఒక స్త్రీ (అసత్, మూల ప్రకృతి) వచ్చి, వస్తూనే తనకు మొదలు ఏమీ లేదు. అది ఎఱుగనని వున్నప్పుడు తన వర్తమానం తనకే యెఱుకయనెను. సర్వకాలం శరీరం లేక వున్నది. అట్టిది యెక్కడ ఉన్నదనిన, అది పుట్టని చావనిది, శరీరము ఎఱుక వున్ననూ శరీరాన్ని ముట్టనిది, రాకడ లేనిది, క్రియా శూన్యమైనది. మొదలు చివర లేనిది, సర్వకాలాలయందు సమస్తమైన వస్తువుల యందు చలించక అచలమనే ప్రసిద్ధి చేత వున్నది. ఇటువంటి దానిలో ఆమె యున్నది.

చలం, అచలం యీ రెండే కానీ, మూడోది వివేకమయినా, అవివేకమే. పుట్టని చావనిది మొదలు చివర లేనిది, రాకడ పోకడ లేనిది సర్వకాలం ఒక్క తీరుగా ఉన్నది. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం రాక మునుపే సకల దేశాలయందు సమస్తమైన వస్తువుల యందు తనకు తానే స్వతస్సిద్ధమై యున్నది. ఇటువంటిది ఏమీ చేయదు.

ఈ పుట్టని, చావని దానిలోనే మొదలు యేమీ లేక చివరకు యేమీ లేక యీ కలలోనే ఎఱుక తనకు తానే వచ్చి, సమస్తమయిన నిర్ణయాలు, సకల వినోదాలు, అనేక భాష్యాలు అనంతమయిన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, పట్టణాలు, పల్లెలు, సిద్ధాంతాలు తనకు తాను మనస్సు వచ్చినట్లుగా తానే చేసి, తనకు తానే చివరకు శూన్యమవుతుంది. శూన్యమంటే ఏమీ లేదు.

అందరూ మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే గానీ, కుక్కకు బ్రహ్మ జ్ఞానము అని నానుడి. కోడికి కాలజ్ఞానమని వాడుక. చీమకు దివ్యజ్ఞానమనే వాడుక. ఇవి అన్నీ మూలం లేని యీ గుర్తెఱిగే శరీరాలకే గనుక, గుర్తెఱిగింది ఒక్కటీ లేదు. పుట్టని చావనిది సర్వకాలం ఒక్కతీరుగా ఉన్నది. దానికి మధ్యలో వచ్చి, మధ్య ఏమీ లేకపొయ్యేదానికి కొంచెమైనా సంబంధము లేదు. అది శాశ్వతమయినది. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం మెరుపువలె (ఆపోజ్యోతి వలె) వున్నాననిపిస్తుంది. వెంటనే యేమీ లేదు. అలాగే కలలో రాగానే మనము గుర్తెఱుగుతాము. మనను అవీ గుర్తెఱుగును. వారు, మనము పుట్టని చావని దానిలో లేక వున్నాము. మొదలు చివర లేనిది సర్వకాలం ఒక్కతీరుగానే వున్నది. శరీరం లేనిది, క్రియా శూన్యమైనది, రాకడ పోకడ లేనిది, సకల దేశాలయందు సర్వకాలాల యందు సమస్తమయిన వస్తువుల యందు మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం రాకమునుపే చలించక, తనకు తానే స్వతస్సిద్ధమయి వున్నది. ఇట్టిది అచలం అని నిర్ణయం.

ద్వాదశ కల (జీవుడు)

ఈ కలలో ఒక మనుష్యుడు (జీవుడు) వచ్చెను. వచ్చుచునే స్వతస్సిద్ధమై, ఉన్నదానిని చెప్పుమని గురుస్వామినడిగెను.

మొదలు ఏమి లేదు, చివరకు ప్రవేశించుట కొఱకు స్థానమేది లేదు. మాకు మేమే వస్తిమి. సకల భాగ్యములతో నుంటిమి. మాకు పుట్టని చావనిది, మొదలు చివర లేనిది, సర్వకాలము ఒక్క తీరుగానున్నది, శరీరము లేనిది, క్రియా శూన్యమయినది, సకల దేశములందు, సమస్తమైన వస్తువులందు చలించక తనకు తానే స్వతస్సిద్ధమైయున్నదానిని సూచన చెయ్యగా, వెంటనే మేము

లేకుండగ పోవునట్లు మాకు సూచన చేయండి స్వామి అని యనెను. సాధన చేయనిదే మాకు స్వతస్సిద్ధము కాదు గదా! మాకు మొదలు, చివర ఏమీ లేవు. చివరకేమీ లేదు. మధ్య వచ్చి వున్న మేము మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే మాకంటె అధికము లేదు. నీచము లేదు. మాకు ఏమీ పట్టదు.

మరియొకటి శరీరం లేక కొందరు వున్నారట. అది ఏలాగో అని రెండు ఆశలు (విద్యోపాధి, అవిద్యోపాధి) వున్నవి. అలాగయినచో శరీరం చివరకు ఎక్కడికి పోతుందనగా, ముందు యేమీ లేదు, చివర యేమీ లేదు. ఇది అందరికీ సమానమే. సర్వకాలం శరీరం లేకనే ఒక్క తీరుగా నుండవలెను. ఇట్లడిగిన మనుష్యునికి ఇటువంటిదాన్ని గురుస్వామి వలన సూచన కాగానే

శ్రు॥ ఆకాశ గగనం శూన్యం॥

ఆలాగు యిక్కడ శూన్యం గాదు. కోటి మాటలు వున్నదన్నా మూలం లేని, యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు. కోటిసార్లు లేదు లేదన్నా, పుట్టని చావనిది లేకపోలేదు. అచలమే ఎన్నటికీ ఉండేది.

త్రయోదశ కల (మాయా విద్యోపాధి ద్వయ దోష రహితము)

శ్లో॥ ఉల్కహస్తో యథిలోకే । ద్రవ్య మాలోక్యతాం త్యజేత్ ।
జ్ఞానేనజ్ఞేయమాలోక్య । పశ్చాత్ జ్ఞానం పరిత్యజేత్ ॥

మాయా విద్యయే ఉపాధి. అనగా మాయ, అవిద్య ఈ రెండే ఉపాధి. అనగా మాయకు అధిష్ఠానము ఈశ్వరుడు, అవిద్యకు అధిష్ఠానము జీవుడు. ఇవి జ్ఞేయములు, మాయ, అవిద్య వీనిని చేర్చు మార్గములైన జ్ఞానములు. జ్ఞాన, జ్ఞేయములు కలసి ఏఱుకయే. కాని గురుమూర్తిచే రాకడ పోకడ లేనిది, సర్వకాలం ఒక్కతీరుగా వున్నది, మొదలు చివర లేనిది, పుట్టని చావనిది, సకల దేశాలయందు సర్వకాలాల యందు సమస్తమైన వస్తువులయందు తనకు తానే స్వతస్సిద్ధమయి వున్నది సూచన కావలెను. అలాగే కాదు, యిప్పుడు కలలో వచ్చిన యేనుగు యేలాగో అలాగే. ఇప్పుడు అయితే, సర్వకాలం ఉన్నది కేవలం అది లేక, సముద్రం వలె ఒక్కతీరుగా యుండవలెను. అందుకే బ్రహ్మ విద్య అతి సులభం, అతి కఠినం. "స్వభావం, శరీరం" అనెడి ఆవరణముండెను. అందువలన కలలోని యేనుగు మేలుకుంటే యేలాగు లేదో, అలాగే సూచన చేత, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు. పుట్టని చావని దానికి బదులు లేదు.

చతుర్ధశ కల (మాయ)

ఈ కలలోనే వెనుకటి వారు (మాయ) వచ్చిరి. వచ్చిన వారిలో ఒక్కరు శరీరం లేనివారు అనిరి. ఆయనే గురువు. అదే భ్రాంతి లేని మార్గము. ఇది యిటువంటిది, వచ్చి అడుగగనే, సూచన చేయుచుండగనే తెలిసికుంటాడు. "యిది రాజమార్గము" అని. గురువెట్టిదని సూచన చేయునో అట్టిదానియందే నీవు వున్నావు.

పుట్టని చావనిది ఒక్కదానిని అయినా ముట్టుకోనిది. అనేక మందికి సూచన చేస్తే అనేక మంది భ్రాంతి రహితులు అయినారు. మేలుకుంటే, వారికి మేము ఏమైనా ఉన్నామా? మేలుకుంటే మనకు వారు ఏమైనా ఉన్నారా? వారు, మనము కూడ ఉన్నప్పుడు, లేనప్పుడు దానికి యెన్నటికిని భయము లేదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం వంటిది కాదు. అదియే అది.

పంచదశ కల (అవిద్య)

కలలోనే ఒక మనిషి (అవిద్య) వచ్చెను. వస్తూనే తనకు ఎనిమిది దృష్టాంతాలతో సూచన చెయ్యమనెను. అది ఏమియనగా, తాను మూలం లేని గుర్తెఱిగే శరీరముననెను. అది స్వతస్సిద్ధమయి ఉన్నది. కనుకనే సాధన చేత సాధ్యం కాదు. అది, నేను ఒక్కటే అంటే ఎవ్వరూ నమ్మరు. ఒక్కటీ సరిపోదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం చంచలం. అచలం క్రియా శూన్యమైనది. సకల క్రియలకు మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే మూలం. పుట్టని చావని దానియందే వున్నటువంటివి. అందరూ అనుచుండగా నీవును అన్నావా, లేక

నీకు దృఢమాయెనాయని అడుగగా, అధిష్ఠానమని అనుకోగానే, అన్నాను నేను.

అధిష్ఠానము వుంటే తనకు మూలం వుండనే వుండెను. మళ్ళీ ప్రవేశించేటందుకు స్థానమది కాదా యనిన అదియేమి లేదనెను.

ఎనిమిది ఉపమానాలు

అంశం	ఉపమానం	స్థానం
1. పుట్టని చావనిది ఉన్నదో లేదో	సూర్యుడు	అచలం
2. రాకడపోకడ లేనిది ఉన్నదో లేదో	చంద్రుడు	అచలం
3. శరీరం లేనిది ఉన్నదో లేదో	భూమి	అచలం
4. భోంచెయ్యనిది ఉన్నదో లేదో	అగ్ని	అచలం
5. సకల దేశాలయందు ఉన్నదో లేదో	పదార్థం	అచలం

శ్లో॥ అవినాశితు తద్విద్ధి । యేన సర్వమిదం తతమ్ ।
వినాశద్యువస్యాస్య । నకశ్చి త్కర్తు మర్హసి ॥

– శ్రీ భగవద్గీత

తా॥ దేని చేత, యీ సకల ప్రపంచమున వ్యాపింపబడినదో అట్టి కేవలాత్మ (లేనెఱుకకు) నాశము లేనిదని తెలియుము. నాశము లేని యీ కేవలాత్మకు నాశము గలిగించుట ఎవరికిని శక్యము గాదు. (ఈ శ్లోకము బ్రహ్మతత్త్వమును గూర్చినదని శంకరభాష్యము)

6. ✓ ✓ ✓ ✓ ✓	**శరీరం**	**అచలం**
7. సర్వం కాలం ఒకే తీరుగా చలించక ఉన్నదో లేదో	**చరాచర జగత్తు**	**అచలం**

శ్లో॥ అచ్ఛేద్యోయ మదాహ్యోఽయ । మక్లేద్యోఽశోష్యఏవచ ।
నిత్య స్సర్వగత స్థాణుః । రచలోఽయం సనాతనః ॥

తా॥ ఈ కేవలాత్మ భేదింపనలవి గానిది, దహింపనలవి గానిది, శోషింపనలవి గానిది, నాశము లేనిది, అంతటను వ్యాపించి యుండునది, స్థిర రూపమగునది, చలింపనిది, అనాదియైనది.

శ్లో॥ నైనం ఛిన్దన్తి శస్త్రాణి । నైనందహతి పావకః ।
నచైనం క్లేదయం త్యాపో । నశోషయతి మారుతః ॥

– శ్రీ భగవద్గీత

తా॥ ఈ కేవలాత్మను ఆయుధములు నరుకజాలవు, అగ్ని దహింపజాలదు. నీళ్ళు తడుపజాలవు. వాయువు శోషింపజాలదు.

8. తనకు తానే స్వతస్సిద్ధమై ఉన్నదో లేదో అని అనుమానం లేదు కదా!	**మూల ప్రకృతి**	**అచలం**

శ్లో॥ నజాయతే మ్రియతేవా, కదాచి । న్నాయం భూత్వాభవితావాన భూయః
అజోనిత్యశ్శాశ్వతోఽయం పురాణో। నహన్యతే హన్యమానే శరీర ॥

తా॥ ఈ కేవలాత్మ (లేనెఱుక) ఒకప్పుడు పుట్టదు. ఒకప్పుడు చావదు. ఒకప్పుడుండి మరల మరియొకప్పుడు ఉండనిదియు గాదు. మునుపు లేక వెనుక వచ్చినదియును గాదు. ఎందువల్లననగా నిది పుట్టుక లేనిది, మరణము లేనిది. ఎల్లప్పుడు ఉండునది, అనాదియైనది. శరీరములు హతమైననూ యీ కేవలాత్మ (లేనెఱుక) హతము కాదు.

"మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమి లేదు"

మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం కలలో యేనుగు మేలుకొంటే యేలాగో అలాగే, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేనుగు.

షోడశ కల (దేహిదేహోపాధి ద్వయ దోష రహిత ప్రకరణము)

శ్లో॥ గురుణావరణ త్యాగః । అనావరణ ముత్తమం ।
పరిపూర్ణం పూర్ణమేవా । పూర్ణాచాల సముద్రవత్

దేహి, దేహములు రెండు ఎఱుకలోనివే. బయలు కాదు. దేహి ఈశ్వరోపాధి (చిదగ్ని), దేహము, జీవోపాధి, (చిత్తము) ఈ రెండూ దహరాకాశంలో ఐక్యమనేదే అద్వైతం. కాని, ఈ రెండూ విడివిడిగా లేవు. అఖండమయిన ఎఱుకగా కలిసే ఉన్నవి. కాని బయలు సర్వ ద్వంద్వ రహితము. నిరావరణము.

ఎట్లనగా ఈ శరీరానికి మూలం లేదు. చివరకు ప్రవేశించే టందుకు స్థానం లేదు. పరిపూర్ణం వేరు, శరీరం వేరు. శరీరం వున్నదని యెటువంటి

పశువు అయినా అనదు. పరిపూర్ణ వస్తువొకటే ఉన్నది. మూలం లేని యీ గుర్తెఱిగి శరీరం యేమీ లేదు అని రెప్పపాటంత సేపు మరువక వుండవలెనను. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు అని నిర్ణయం కాక అనుమానపడరాదు. అట్లు ఉండకపోయెనా, యెంత ప్రజ్ఞావంతుణ్ణి అయినా మోసం చేస్తుంది. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే విక్షేపశక్తి. ఈ విక్షేప శక్తియే ఆవరణమునకు మూలం. విక్షేపం చేతనే అనేక ఆవరణాలు వస్తాయి. అందుకే మోసపోకుండుటకు రెంటిని ఏక కాలంలో పోగొట్టే గురు సాంప్రదాయము కావలెను.

పరిపూర్ణము యెప్పటివలెనే ఉంటుంది. పరిపూర్ణము యే తీరుగా నున్నదో ఆ తీరుగా కుదరవలెను. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమి లేదు అని సకల క్రియలు చేసినను, అది క్రియా శూన్యము గాదు, ఇది పరమ గుహ్యము. ఇదే మహా గుహ్యము. దీనికి కలలో యేనుగు వచ్చి మేలుకుంటె ఏమీ లేదు.

పుట్టని చావని పరిపూర్ణమే వుండెను. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం మధ్యలో వచ్చెను, మధ్యలో పోయెను, ఉన్నది ఉన్నట్లే వుండెను. సర్వ కాలం ఒక్క తీరే. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు. ఇది లేకుంటే ప్రసంగాలు వుండవు. ఇది మహా గుహ్యం. పుట్టనిది, చావనిది వ్యవహారం లేనిది, ఏలాగు వ్యవహారం చేయగలదు? గురు కటాక్షం వల్ల ఉన్నది ఉండుట తప్ప మరియొకటి భ్రాంతి లేని మార్గమే లేదు. ఎవరు మూలం లేని యీ గుర్తెఱిగే శరీరాన్ని విడిపించక బోధిస్తారో, వారి ద్వారా భ్రాంతి విడివడదు.

సకల భ్రమలు శరీరంతోటి వచ్చినవి, శరీరంతోటే పోవును. ఉన్నంతసేపు ఒకటి తప్పదు. సర్వం వుంది. సర్వం శరీరంతోటి పోతుంది. శరీరం లేనిది ఉండి లేదు, లేకపోలేదు. సర్వకాలం ఒక్క తీరే. కలలో యేనుగ – యీ శరీరమున్ను ఒక్కటే. ఇది యేమీ లేదు. అది యేమీ లేదు. రెండూ లేకుంటే, ఉన్నదే వున్నది. “శరీరం లేనిదే” వున్నది. కనుక మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం అన్యము గాదు, అదీ కాదు, ఏమీ లేదు. దీనికి సామర్థ్యము విస్తారము కనుక, అబ్బా! అనిపించుకుంటుంది. ధీరులకు కలలో యేనుగ మేలుకుంటే యేలాగో అలాగే సూచన చేయునప్పుడు యేమి లేదు.

అటు తరువాత అంతా పరిపూర్ణము. ఈ శరీరం చిదాగ్ని గనుక యెన్నటికిని నమ్మకూడదు. మహా నమ్మించి చూస్తుండగానే యేమీ లేకపొయ్యేది. ఇది వున్నది, అనుకున్నా శక్యం కాదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు, అని అనుకున్నవాడే సకల భ్రాంతి రహితుడు అవుతాడు. పరిపూర్ణము స్వతఃస్సిద్ధము అయి వున్నది. దానికి యత్నం చేయడమే దీనికి విఘ్నం. యత్నం చేసేదాన్ని తీసివేయడమే యీ ప్రయత్నం.

“మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమి లేదు”. మూడు కాలాల యందు కాలానికి వెయ్యి చొప్పున ప్రతిదినమందు జపం చేయవలెను. అటుల చేసినచో కృతకృత్యుడు అవుతాడు. ఇదిగాక మరియొకటి తగిలెనా, మునిగి తేలడు. ఇంతకంటే అధికం లేదు.

ఏ సాధనా వద్దు ఏ సాధన చేసినా, దేహమనే శరీరం విడవదు. ఎఱుక అనే నిప్పు కాలుస్తూ వుంటుంది. యెఱుక కంటే వేరే నిప్పు లేదు. దేహాలను చిదగ్ని సర్వకాలం చిత్ అనే చింతనిప్పువలె కాలుస్తుంది. సమస్తమయిన శరీరాలు యెఱుకతో కూడ వచ్చినవి. ఎఱుకతో కూడా యేమీ లేదు. సర్వకాలం అచలమే ఉన్నది. శరీరంలో కొంత సత్యము, కొంత అసత్యము అనేది అన్యాయం. అందుకే గురువాక్యం. “మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు” అని వచ్చినది. చలనం లేకుంటే అచలమే స్వతస్సిద్ధం. చంచలం మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే కాని, మరియొకటి లేదు. శరీరం రాకముందు ఒక్కటైనా వికారం లేదు. శరీరమే వికార స్వరూపం.

గురువు అను సింహము మూలం లేని యీ గుర్తెఱిగే శరీరాన్ని యేమి లేదని చెప్పి, అచలము తెలిపితే, ఉండగానే స్వస్థత అయ్యెను. అందుకే శాస్త్రము “నగురోరధికం” అని ఘోషిస్తున్నది.

ఉన్న పరిపూర్ణము గాక, నేను వేరే ఉన్నానేమోనని అనుకున్న, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే నేను అని అనుకున్నట్లు, నాకంటె మునుపే తనకు తానే స్వతస్సిద్ధమయి, చలించకయున్నది. అది నేనెఱుగను. నేను అందులోనే ఉన్నాను. అది నన్నెఱుగదు. నాకంటె వేరే.

పుట్టనిది చావనిదే గాక శక్యం గానిది ఒక వింత వున్నది. ఆ వింతకు మొదలు యేమీ లేదు. విచారిస్తే చివరకు యేమీ లేదు. ఆ వింత "నేను" అని తెలియబడింది. ఆ వింతను వదిలించుకున్నవాడు భ్రాంతి లేనివాడు. ఆ వింత మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే గానీ, మరియొకటి కాదు. సర్వం మూలము లేని యీ గుర్తెఱిగే శరీరముతోటే ఉన్నది. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరంతోటి సర్వం యేమీ లేదు. ఉన్నదేదో ఉన్నది; అది బయలు.

శ్రు॥ నిత్యస్సర్వగత స్థాణు రచలోయం సనాతనః

శ్రు॥ అయ మచలః

శ్రు॥ నిత్యం సర్వగతః స్థాణు స్సనాతనః

శ్రు॥ అయమిత్యత్ర ఆత్మేతికే । చిదిచ్ఛితి తదనత్ జీవభూత ।
క్షేత్రజ్ఞ స్వరూప పరాప్రకృతి స్వరూపత్వాత్ ।
ప్రకృతిర్నామ కింశరీరమిత్యర్థః ॥

అందుకే గురువాక్యము "మూలం లేని యీ గుర్తెరిగే శరీరం యేమీ లేదు."

దృగ్దృశ్యోపాధి ద్వయ దోష రహిత ప్రకరణము :

శ్లో॥ అబీజం వృక్ష సంపన్నం । శాఖాపల్లవ వర్జితం ।
పుష్పం నాస్తి ఫలం నాస్తి । పరిపూర్ణం వృక్ష వర్జితం ॥

దృక్కు, దృశ్యము రెండూ ఎఱుకే, బయలు కాదు. దృక్కు బ్రహ్మము దృశ్యం మాయ అని అద్వైత నిర్ణయం. అనగా ఘటజల ప్రతిబింబము జీవుడు, పటజల ప్రతిబింబము ఈశ్వరుడు (బ్రహ్మము). ఘట, పటములు ఏకమైన జీవేశ్వరులు ఐక్యము. కాని ఇవి అన్ని ఎఱుకలోనివే. భ్రాంతులే. నిరామయమై త్రిపుటి, ద్విపుటులు లేనిది బయలు.

ఎట్లన అందరూ పరిపూర్ణులే కాని మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం నేను అని నమ్మియున్నవారు గనుక వారికంటే పాపాత్ములు లేరు. సకల కులాల వారు ఒక్కటే. పశువులకు మనుష్యులకు సంభాషణ మాత్రమే యెక్కువ తక్కువ. పశువులు పవిత్రం. మనుష్యులు చెడిపోతే పంచగవ్యము పుచ్చుకుంటే పవిత్రులు అవుతారని లోకాచారం. పశువులు యెలాగు నడచినను పాపం లేదు. పశువులు చదువుకోలేదు. చదువుకుంటే గానీ యిది విహితం, అది అవిహితం అని తెలియదు. తెలిసిన నడవకున్నా సరే, యింతే. మనుష్యులకు పశువులకు యెక్కువ, తక్కువ నడత సమానమే. మూలం యెవ్వరికీ యేమీ లేదు. అవాంతర దొరతనమే!

జ్ఞానమును బోధించినవాడు గురువు కాడు. భక్తిని బోధించినవాడు గురువు కాడు. వైరాగ్యమును బోధించినవాడు గురువు కాడు. దేవతా భ్రాంతి బోధించిన వాడు గురువు కాడు. శ్రవణము చేయించినవాడు గురువు కాడు. మననం చేయించినవాడు గురువు కాడు. ధ్యానం చెయ్యమని చెప్పినవాడు గురువు కాడు. ఇట్టివన్నీ కాక జన్మభ్రాంతి లేకుండా చేసినవాడు మాత్రమే గురువు. ఉన్నది ఉన్నట్లు తెలిపినవాడు గురువు. కనుక సర్వ దృశ్యరహితం, దృగ్రహితం బయలని తెలిసిన సర్వమూ శూన్యం. తిరిగి, తానే లేకుండా పోయి ఉన్నదున్న ట్లుండి పోయెను.

జ్ఞానాజ్ఞానోపాధి ద్వయ దోష రహిత ప్రకరణము :

శ్లో॥ నస్వతః ప్రత్యభిజ్ఞానా । న్నిరంశత్వాన్న చాన్యతః ॥
నచాశ్రయ వినాశాన్మే । వినాశ స్యాదనాశ్రయత్ ॥

జ్ఞానము, అజ్ఞానము రెండూ ఎఱుకలోనివే బయలు కాదు. జ్ఞానము ఈశ్వరాధిష్ఠాన నిర్ణయము నిచ్చును. అజ్ఞానము జీవుని అధిష్ఠాన నిర్ణయము నిచ్చును. సర్వమూ నేనే అనే భ్రాంతి రూపమైన ఈశ్వరతను చతుష్టయ అనుభవ రూపమైన ఎఱుకే సమిష్టిగా, వ్యష్టిగా వ్యవహరించుచు అఖండముగా తోచుచూ తన మూలమైనదేదో వెదుకగా తానే లేకపోయి బయలు ఉన్నది ఉన్నట్లుండెను.

ఎట్లనగా మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం అనేక అసత్యాలాడింది. అందరినీ నమ్మించుటకు శాస్త్రాలు చేసి యింటింటా పెట్టింది.

ఇటువంటి ఏమీ లేని దానికి యేమి సాధించానా ఏమీ లేదు, అని చెప్పేనా, కలత లేని సాంప్రదాయమని గ్రహించి, వారి అనుగ్రహమునకు పాత్రుడు ఐతే పుట్టని చావనిది, మొదలు చివర లేనిది రాకపోకడ లేనిది, సర్వకాలం శరీరం

లేనిది క్రియా శూన్యమైంది. తనకు తానే స్వతస్సిద్ధము అయి ఉన్నది. ఎన్నటికి చలించనిది సకల దేశాలయందు సర్వ కాలాల యందు సమస్తమయిన వస్తువుల యందు జ్ఞానకర్మలు లేక, కర్మలకు కారణమనే జ్ఞానం శూన్యమై జగుత్తు వున్నదీ లేనిదీ యెరుగక ఉన్నది యీ బట్టబయలే కాని మరియొకటి కాదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు అని దృఢం చేయును. ఇక సర్వ కాలం ఒక్క తీరే.

బుద్ధిమంతులకు సులభం, వేషధారులకు కఠినం, కోటిసార్లు మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు అని సతతం సర్వకాలం అనుష్టానం చేయవలెను. యిదే గాయత్రీ మంత్రము, పంచదశీ, పంచాక్షరీ. ఇవి అన్నీ యింతకంటే తక్కువే. అష్టాక్షరీ కూడా యింతకంటే తక్కువే. ఎన్ని అయినా గురువాక్యం కంటే తక్కువ. ఏది పడితే అది గురువాక్యం కాదు. శాశ్వతమైనది మొదలు చివర లేక, రాకడ పోకడ లేక, శరీరం యెన్నటికీ లేక, తనకు తానే సర్వకాలం ఒక్కతీరే ఉన్నది.

సర్వ కాలాలయందు శరీరం లేకనే వున్నది.

సమస్తమైన వస్తువులయందు ప్రవేశించక తనకు తానే శరీరం లేక వున్నది. శరీరం లేదు గనుక, యెఱుక లేదు. కర్మలు లేవు. గుర్తెఱిగితే గానీ, కర్మలు చెయ్యదు. కర్మలు లేకుంటే శరీరాలు లేవు. ఎఱుక లేదు, కర్మలు లేవు. కలలో శరీరాలు వచ్చినవి. ఆ శరీరాలు గుర్తెఱుగును. గనుక సకల కర్మలు చేసినవి. గుర్తెఱుగకుంటే కర్మలు పుడతాయా? జ్ఞానం నుంచే కర్మలు. కర్మలకు మూలం యీ గుర్తెఱిగే జ్ఞానమే. జ్ఞానం సత్యము. కర్మలు అసత్యము. యీ కలలోనే ఒక్క సన్యాసి అన్నాడు. కానీ గుర్తే జ్ఞానాజ్ఞానాలు అనే ద్వంద్వముగా ఎఱుకగా నుండి భ్రాంతి చెందిస్తూ, చలిస్తూ ఉన్నది. పుట్టని చావని బట్టబయలుకు ఒక్కటైనా భ్రాంతి లేదు. భ్రమకు మూలం కల. కల కల్పన గాకుంటే శరీరమే లేదు. గనుక భ్రాంతి లేదు. ఎప్పుడు శరీరం లేకుంటే అప్పుడే భ్రాంతి లేదు. గాఢ నిద్రలో మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు. గనుక వ్యవహారమే లేదు.

శరీరం రాగానే కల సిద్ధం. ఈ కలలోనే అనేక భ్రాంతులు సిద్ధం. గుర్తెరుగగానే భ్రమ పుడుతుంది. భ్రమ వలన కర్మలు పుడతాయి. ఈ ఒక్క శరీరం లేకుంటే కర్మలు లేవు, మూలం శరీరమే. ఈ శరీరానికి మూలం యేమీ లేదు. ఏమీ లేని శరీరం ఏమి చేసినా, ఏమీ లేదు. శరీరం చేసిన కర్మలు సత్యం అయితే, గుర్తుఱిగేది సర్వకాలం ఉండవలెను. సర్వకాలం గుర్తెఱిగేది వుంటే, కర్మలు వుండవలెను. కర్మలు, జ్ఞానం రెండూ సత్యమైతే శరీరం శాశ్వతంగా వుండవలెను.

విక్షేపావరణ ద్వయ దోష రహిత ప్రకరణము

శ్లో॥ బీజశూన్యం మనశ్శూన్యం । శూన్యం వ్యోమాది పంచమం ।
క్షరాక్షరాది శూన్యంచ । శూన్యాతీతం నిరంతరం ॥

విక్షేప, ఆవరణము రెండూ ఎఱుకలోనివే. బయలు కాదు. విక్షేప, ఆవరణములు ఉపాధులకే. శరీరులైనా, అశరీరులైనా దీనిలోని వారే. దేహాత్మ భావులైన విక్షేప చోదితులు. అశరీరులైన దివ్యులు లేక సురలు ఆవరణ చోదితులు. ఆవరణ, విక్షేప రహితులు అచలులు, నిరావరణము షట్కోశ రహితము అయిన బయలు నిత్యము, నిర్మలము.

ఎట్లనగా భ్రాంతికి మూలం, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే గానీ, మరియొకటి భ్రాంతికి మూలం కాదు. విక్షేపమున్నచో ఆవరణ యుండి తీరును. ఆవరణ లేనిచో విక్షేపముండదని భ్రాంతివాదులమతము. కానీ ఇవి అన్యోన్యాశ్రయమై, మూలం లేని గుర్తింపే శరీరంగా ఎఱుకతోనే భ్రాంతియై యుండును. కావున సర్వకాలము శరీరం లేని బట్టబయలుకు ఒక్కటైనా భ్రాంతి ఉన్నదని యెటువంటి వాడు అనడు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరానికి భ్రాంతి లేదు, అంటే యెటువంటి అవివేకుడూ, వివేకుడూ కూడా ఒప్పుకోడు.

ఇరువది ఆరవది యెటువంటిదో అటువంటిదాన్ని కనుక్కొని శాంతి చేత వున్నవాడే కృతకృత్యుడు.

క్షేత్ర క్షేత్రజ్ఞ ద్వయ దోష రహిత ప్రకరణము :

శ్లో॥ జగదాఖ్యమహాస్వప్నే । స్వప్నాత్స్వప్నాంతరం వ్రజేత్ ।

రూపం త్యజతినో శాంత । బ్రహ్మ శాంత్తిత్య బృంహితం ॥

క్షేత్రము, క్షేత్రజ్ఞుడు రెండూ ఎఱుకే. బయలు కాదు. క్షేత్రము జీవజగత్తులని. క్షేత్రజ్ఞుడు విశ్వేశుడని అద్వైత నిర్ణయం. ద్వైత, అద్వైత, విశిష్ఠాద్వైతములచే నిర్ణయింపబడనిది అచలము. "నేను–తాను వేరు. నేను తాను అయితిని, నేను తాను ఒకటే" వంటి ప్రతిపాదనలన్నీ ఎఱుకలోనివే భ్రాంతులే. సర్వభ్రాంతి రహితము బయలు. ఎట్లనగా,

శ్రు॥ జీవోపాధి విలయేసతి కేవలోభవతి ॥

అదే తత్వాతీతం. జగత్తు అంటే క్షేత్రక్షేత్రజ్ఞుడు కలసి తత్వ స్వరూపమే. తత్వాతీతం మహా గుహ్యం. పరమ రహస్యం. అందుకే ద్వైతాద్వైత రహిత పరమ తత్త్వం అనే సంజ్ఞ.

గురుమూలంగా, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరము ఏమీ లేదు. అని తాత్పర్యమయినచో అదే మేలుకొనుట. ఇంతే గానీ, ఒక్కటయినా అవస్థ లేదు. ఉన్నది స్వప్నావస్థయను భ్రాంతి. గురుడు మేలుకొలిపితే అదే జాగ్రత. నాలుగు అవస్థలు లేవు. ఈ శరీరం ఒక్కటే. నాలుగా శరీరాలు అనుట అబద్ధం. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరము స్వప్నావస్థ. గురు కటాక్షం చేత మేలుకుంటే అప్పుడే జాగ్రత. ఇంతే కానీ, యెక్కువ ముచ్చట్లు ఏమీ లేవు.

మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేకుంటే ఏలాగు వున్నదో అలాగే వున్నది. కాకపోతినని చింత వున్నచో శరీరం కావలెనని యిచ్ఛ వున్నచో శరీరం ఉండనే వున్నది. క్షేత్రం వీడి, క్షేత్రజ్ఞుడను నేనని, మహావాక్య నిర్ణయమున "అయ మాత్మా బ్రహ్మ" పూర్వకమున అయితినని నిశ్చయం ఉండెనా, మరీ గట్టిగా ఉన్నది. కావున మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేకపొయ్యేది స్వభావము.

అలాగే గురుమూలంగా యెప్పుడు మేలుకుంటే అప్పుడే కొంచెమైనా శరీరం లేక కలలో తోచిన దేహాల వలె వెంటనే యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు. ఈషణ్మాత్రమైన ఆశపడ్డా అంతా వుంటుంది. ఇది రాజమార్గం

ఆత్మానాత్మ ద్వయ దోష రహిత ప్రకరణము :

శ్లో॥ ఆకాశం నైవమాకాశం । సర్వమస్తిన చాస్తిచ ।
ఇతిస్థితం సమం శాంతం । యస్మిన్మౌనం సుషుప్తివత్ ॥

ఆత్మ, అనాత్మ రెండూ ఎఱుకలోనివే. బయలు కాదు. జీవ జగత్తులు ద్వంద్వము. దైవం, సాక్షి, ఆత్మ అనెడిది అద్వైతం. సాక్షి అన్నా, అనుభవమన్నా, అతీతమన్నా అన్నీ సర్వములోనివే, ఎఱుకలోనివే. ఉన్నదున్నట్లుండు సర్వమూ అది కాని, సర్వమూ లేని, సర్వమూ కాని దేదో అదే అచలము – బయలు నిరపేక్ష, వార్తీక, మహావాక్య నిర్ణయముల కతీతము, శూన్యాతీతము. ఎట్లన

ఎట్లన, ఆత్మ, అనాత్మ అనే అడవిలో వున్నచో, తిరుగాడక తప్పదు. ఆత్మ, అనాత్మ అనే సంజ్ఞలన్నీ సకల భ్రాంతులకు మూలము. మూలం లేని యీ గుర్తెఱిగేది శరీరమే గనుక యిది ద్వైతాద్వైత రహిత పరమ తత్త్వం (తత్వాతీతం) అందువలన అది బయలు, అది అచలం.

ఈ బట్టబయలు శాశ్వతముగా నుండనేవున్నది అంటే, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఆగంతుకము. కల తోచినట్లు దేహము తోచుచుండును. ఇందుకు యుక్తి ఏమనగా.

కలలో తోచిన దేహాలు వెంటనే యేమి లేదు అని తనకు యేలాగు దృఢమో, అలాగే మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు అని తాత్పర్యమయితే సరి.

ఈ రెండు దేహాలు ఆగంతుకములే అనగా కలలో తోచిన దేహాలు, యీ దేహాలు ఒక్కటే. రెంటికీ మూలం యేమి లేదు, అని తాత్పర్యమయితే సరి.

మధ్య వచ్చి మధ్య పొయ్యేవాటికి మధ్యనే తోచింది. మధ్యనే యేమి లేదు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం లేకుంటే యేమి తోచదు. సకల భ్రాంతులకు మూలము. మూలము లేని యీ గుర్తెఱిగే శరీరమే.

శరీరంలో కొంత సత్యమని ఆశపడినను, అంతా ఎప్పటి వలెనే ఉంటుంది. శరీరం పుట్టకమునుపే మొదలు చివర లేని యీ బట్ట బయలు తనకు తానే

స్వతస్సిద్ధమై యున్నది.

ఉండి తాను పుట్టదు, రెండోదాన్ని పుట్టించనే పుట్టించదు7. సర్వకాలము చెయ్యక, చేయించక, తనకు తానే జ్ఞానకర్మ సాధన ద్వయం యొక్క అపేక్ష లేక, జ్ఞానం చేత, కర్మల చేత సాధ్యము గాక ఒక్క తీరుగానున్నది. సాధనాసాధ్య పరామర్శ రహితమై తనకు తానే స్వతస్సిద్ధమైయున్నది. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదని, తనకు తానే విచారము చేత, కలలో వచ్చిన శరీరాలు వెంటనే తనకు తానే యేమిలేదని, దృఢమయినట్లు మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం అలాగు కొంచెమైనా యేమీ లేదని తాత్పర్యము లెస్స అయితే, యెప్పటి బట్టబయలే స్వతస్సిద్ధమై యున్నది.

ఆత్మబ్రహ్మోపాధి ద్వయ దోష రహిత ప్రకరణము :

శ్లో॥ దృశ్యదర్శన యోర్లీనం । క్షణక్షణ వినాశనోః ।
కేవలే ద్రష్ట రీక్షీణం । రూపనామామచేతనం ॥

లక్ష్యం, లక్షణం :

అద్వైతమే స్వరూపాన్ని కల్పించేది. లక్ష్యం ఉన్నంతసేపు అనేక లక్షణాలు అనేక స్వరూపాలు తోస్తాయి. అందుకే లక్ష్యం లక్షణాలు ఒక్కటే. కార్యకారణాలకు బేధం లేదు. గనుక భ్రాంతికి మూలం అన్యోన్యం. లక్షణమనే స్వరూపం లేకుంటే లక్ష్యం శూన్యమే. లక్ష్యం జ్ఞానం, లక్షణం చేసేది కర్మలు. జ్ఞాన కర్మలు, మోక్ష సాధనాలు అని ప్రసిద్ధి కద్దు. లక్ష్యాలక్షణ రహితమైనది పరిపూర్ణం. లక్షణం క్షేత్రం. లక్ష్యం క్షేత్రజ్ఞ స్వరూపం. లక్షణజన్యం లక్ష్యం. అన్యోన్య ఆశ్రయం.

విషయి వుంటేనే విషయం. దేహం వుంటేనే దృక్కు. పోనీ, ఆ ముచ్చట యేమి? మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఉన్నంతసేపు వ్యవహారం. ఇప్పుడు యీ మూలం లేని గుర్తెఱిగే శరీరం యేమీ లేదు, అని నిరసిస్తే అప్పుడే పరిపూర్ణము తనకు తానే స్వతస్సిద్ధమై ఉన్నది.

జీవేశ్వర ద్వయ దోష రహిత ప్రకరణము :

శ్లో॥ రూపవస్తు మనోనాశో । యో మయోక్తో రఘుదృహ ।
విదేహ ముక్తోవాసౌ । విద్యతే నిష్కళాత్మకః ॥

జీవేశ్వరులు ఎఱుకే. బయలు కాదు. జీవము సనాతనము, సృష్టి సనాతనము, ఈశ్వరుడు సనాతనము. “దేహో దేవాలయ ప్రోక్తో జీవోదేవ సనాతనః” ఎఱుకయే. సనాతనమై మూలము లేనిదై,ఉన్న అచలమందు ఎఱుక లేనిదే. జీవేశ్వరులు భిన్నులు, అభిన్నులు అను నిర్ణయములు ఎఱుకనే నిర్ణయించు చున్నవి. బయలును కాదు.

ఎట్లన, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం జీవుడు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఈశ్వరుడు. మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే ఆత్మబ్రహ్మ. మూలం లేని ఈ గుర్తెఱిగే శరీరం యేమీ లేకుంటే, యేమి లేని పరిపూర్ణం తనకు తానే స్వతస్సిద్ధమై యున్నది.

అది యెటువంటిది అంటే, యేమిలేని పరిపూర్ణం. తనకు తానే స్వతస్సిద్ధమై యున్నది.

శరీరం పుట్టిన తర్వాత వున్నట్టే వుండి, సమస్తమైన వ్యవహారాలు చేసి, వెంటనే నిద్ర పేరు చెప్పి ఏమీ లేకపోతుంది. ఈ మూడు నాలుగు ఘడియలు ఒకవేళ రెండు ఝాములు వున్ననూ మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఒకసారి యేమీ లేదు. ప్రతి దినమందు యీ శరీరం యెప్పుడు మేలుకుంటే అప్పుడు కల. కొన్నాళ్ళు ఈలాగు ప్రతి దినమందు సుషుప్తిలో యేమీ లేకపోయినట్లు యేమీ లేదు. అది మరణం అన్నారు. ఈ శరీరం పుట్టక మునుపు యేమీ లేదు. చివరకు యేమీ లేదు.

ఈ బట్టబయలు ఉన్నది. ఈ బట్టబయలును విడచి, శరీరం ఏమీ లేదు. “మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం పుట్టక మునుపు యేలాగు ఏమీ లేదో, వచ్చిన తర్వాత కూడా ఏలాగు ఏమీ లేదో, అలాగే వున్నప్పటికిన్నీ, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు” అని కల తోచిన యీ శరీరాలు యెఱుక వుండగానే “యేమీ లేదు” అని తనకు తానే దృఢం అయ్యెను. ఇక చాలు చాలు.

క్షరాక్షరోపాధి ద్వయ దోష రహిత ప్రకరణము :

శ్లో॥ దిత్వైకత్వం దృశేచిత్తం । తదే వాజ్ఞాన ముచ్యతే ।
యేతయో ర్లయో దృష్ట్యా । తజ్ఞానం సా పరాగతిః ॥

ఇందుకు శ్రీ విద్యారణ్య స్వాముల వారు నిర్ణయం చేసినారు. ఈ శరీరం పుట్టక మునుపు నిర్ణయం యేమీ లేదు. ఈ శరీరం చచ్చిన తరువాత నిర్ణయం ఏమీ లేదు. ఉన్నప్పుడు యిలాగే అన్నాడు. అది అంటే....

శ్లో॥ నస్యక్తః పూర్వమస్తై యివన పశ్చాచ్చ
వినాశతః అందే అంత్యేది యాంనాస్తి
వర్తమానో పి తత్తదా ॥

అని సిద్ధాంతము చేసినారు. ఇదే "భ్రాంతికి మూలం లేని" మార్గం అన్నారు. ఇదే బంధభ్రాంతియు మోక్షభ్రాంతియు లేని మార్గం. భ్రాంతికి మూలం లేదు. బంధం యెవ్వరికీ పుట్టని చావనిది, చలించక తనకు తానే స్వతస్సిద్ధమై యున్నది. పుట్టేది చచ్చేది వున్న దానికి యెఱుక లేదు.

ఉన్నదని భ్రాంతి వచ్చియున్నచో, ఆ భ్రాంతి ఎవరికి, దేనికి వచ్చి యుండెనని శోధించగా, అది యేమీ లేదని తోచెను. ఇక భ్రాంతి యెవ్వరికనిన, ఒక శరీరం వంటివే అన్ని శరీరాలు కూడా. ఒక శరీరంతోటి, అన్ని శరీరాలు వున్నవి. అన్నీ తోచినవి. ఒక శరీరం ఏమీ లేకుంటే, అన్నీ ఇంక యేమి లేదు. ఏమీ లేదు.

అది మహాకుశాగ్ర బుద్ధిమంతులకు, మొదలే ఉన్నది ఉన్నట్టు పట్టుపడే మార్గం. ఈ ప్రకరణం మూలం లేని గుర్తెఱిగే శరీరం "నేను" అని వాదించే వారిని లేకుండా చేసే మార్గం.

పరాప్రకృతి ద్వయ దోష రహిత ప్రకరణము :

శ్లో॥ అధిష్ఠానా వశేషోహి । నాశః కల్పితవస్తునః ।
భావోభావహ్యాభావత్వం । భావస్సేవహ్యా భావతా ॥

పరాప్రకృతి, అపరాప్రకృతి ఎఱుకలోనివే. బయలు కాదు. అహము, అభిమానము రెండూ ప్రకృతే. సాక్షిణి అన్నా, నీచే సృష్టించబడి, పోషించబడి, లయించబడుచున్నవన్నా ఎఱుకలోనివే. ప్రకృతి అనే పిండ, బ్రహ్మాండ, విశ్వాండ రూపముల లోని దంతా ఎఱుకే. బయలు కాదు. సర్వమైన ఈ ద్విపుటిలన్నీ "శ్రు॥ భ్రమేణాహం భ్రమేణోహం భ్రమతి ఇతి జగత్ సర్వం" అన్నట్లు రహితమైనదే. కావున కదలనిది బయలు, అచలం.

ఎట్లన, భ్రమలకు మూలం, మూలం లేని యీ గుర్తెఱిగే శరీరమే. అందుకే ఆ శరీరం పుట్టక మునుపు శరీరం యేమీ లేదు. చచ్చిన తరువాత శరీరం యేమీ లేదు, అని తనకు తానే దృఢం ఉన్నట్లు, ఉన్నప్పటికిన్నీ "మూలం లేని యీ గుర్తెఱిగే శరీరం యేమీ లేదు". అని తనకు తానే దృఢం ఉండెనా, వాడే భ్రాంతి లేనివాడు. జ్ఞానానికి ప్రయోజనమైన వైకుంఠాన్ని చూచి, గుర్తెఱిగే జ్ఞానాన్ని పరిత్యజించవలెను అని సిద్ధాంతము.

ఆత్మ అయిన మాయ, ఆత్మ అనే పేరు గల మాయ చేతను, భ్రాంతి రహితం కాక, అద్వైతమనే భ్రాంతి చేత, అక్షరోపాధి అనే పరబ్రహ్మ భ్రాంతి తగిలి, బ్రహ్మ అనే దోష స్వరూపం చేత వుండెనా, సర్వకాలం దోష స్వరూపుడే.

అలాగే క్షేత్ర క్షేత్రజ్ఞులతో కూడా లేకుండా సూచన చేసే గురు సాంప్రదాయం ఆయెనా! ఎన్నటికి భ్రాంతి పుట్టదు. జగజ్జీవులు లేనిది. తనకు తానే స్వతస్సిద్ధమై వున్నది. సర్వకాలం ఒక్క తీరేవున్న దానిలో స్త్రీ ఆకారం తోచదు, పురుషాకారం తోచదు. శరీరం సర్వ కాలం ఉన్న దానిలో లేనట్టే తోస్తుంది. ఏమైనా, మూలం లేని యీ వ్యాపారం చేత శంకలు తోస్తాయి, ఉన్నదానికి నిశ్చయం లేదు. సంశయం లేదు. ఈ శరీరం లేదు. గనుక సర్వ కాలం శరీరం లేకనే వున్నది. గనుక ఒక్కటైన వ్యవహారము లేదు. అందుకే వికారము లేదు. ఆత్మానాత్మల వ్యవహారము లేదు.

శ్రు॥ అయం జీవాఖ్యోపాధి విలయే సతి కేవలో భవతి ॥

క్షేత్రం లేకుంటే క్షేత్రజ్ఞుడు లేనే లేదు. గనుక గురు కటాక్షం యెప్పుడు అయితే, అప్పుడు యివి లేవు. సర్వకాలం కేవలాత్మే ఉన్నది. ఉన్నది పుట్టదు, పుట్టించదు; సర్వ కాలం ఒక్కతీరుగానే వున్నది. ఉండి, చెయ్యదు, చేయించదు; సర్వకాలం ఒక్క తీరే. క్షరమనెడి అక్షరోపాధి, అక్షరమనే క్షేత్రజ్ఞ స్వరూపము! అక్షరోపాధి యీ శరీరమందు వున్న కేవలాత్మను క్షరాక్షరోపాధి ద్వయ దోష

స్వరూపము సృష్టించదు అన్నారు.

ఆత్మ అన్నా, బ్రహ్మ అన్నా, యిరువై అయిదో దానికి సంజ్ఞ మాత్రమే. గుర్తెఱిగేది ఒకటే గనుక, ఆత్మ అనే ఆశ, బ్రహ్మ అనే ఆశ, రెండూ ఒకటే గనుక, పుట్టని చావని దాని జాడ తెలియదు. జ్ఞానం లేదు. కనుక కర్మలు లేవు. శరీరం లేకుంటే యేబాధ లేదు. ఈ శరీరమందు శోధించగా, శరీరం లేనిదే ఉన్నది. కనుక శరీరం లేకుంటే యెఱుక లేదు. కనుక కర్మలు లేవు.

ఈ ఆత్మ, బ్రహ్మము, కూటస్థుడు. వీటికంటే మునుపే స్వతస్సిద్ధమై వున్నది బయలు. మొదలు చివర లేక చలించక వున్నది అచలం. అది బయలు, అది అచలం.

సర్వకాలం జాగ్రత లేదు, స్వప్నం లేదు. సుషుప్తి లేదు. తుర్యం అనే ఆత్మ లేదు. బ్రహ్మ లేదు. యేలాగు ఉన్నదో అలాగే గుర్తెఱుక లేక వున్నది. అందుకే ఉన్నదాంట్లో మునుపు శరీరం పుట్టదు. శరీరం ఉండదు.

రహస్యత్రయము

కోశములారు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ, హిరణ్మయ కోశములు. అన్నరసముతో కూడుకొనిన దేహం అన్నమయ కోశము. ప్రాణేంద్రియ కర్మేంద్రియములు కలసి ప్రాణమయ కోశము. జ్ఞానేంద్రియములు, మనస్సు కలసి మనోమయ కోశము. జ్ఞానేంద్రియములు, బుద్ధి కలసి విజ్ఞానమయ కోశము. అవిద్య మనస్సు కలసి ఆనందమయ కోశము. ఆ మనస్సే సచ్చిదానందమయ స్థితి పొందుట హిరణ్మయ కోశము.

స్థూల శరీరముతో చేయు వ్యవహార గుర్తులు అన్నమయమందు చేరి, ప్రాణమయములో ప్రవేశించి, క్రమముగా మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ, హిరణ్మయ కోశములందు సంక్రమించును. ఈ ఆరు కోశములు ఏకపదార్థమే. అవి ఒక దానిని విడచి మరొకటి లేదు. ఈ షట్కోశ స్వరూపమే ఎఱుక. దీనినే అహమనియు, చైతన్యమనియు, చిత్స్వరూపమనియు నానా పేర్లతో పిలుతురు. దీనికతీతమైనదే అచల పరిపూర్ణ పరబాహ్యము.

సూచన చేసిన తదనంతరము, ద్వయ దోష రహితమైన పరిపూర్ణము నెఱిగెదరు. అట్టివారు ఎఱిగిన ఎఱుకను గురు దక్షిణగ నొసగవలెను. అచల స్థితిని లక్ష్యంలో పెట్టుకొని కోశావరణములను నిరావరణ మొనర్చుకొనవలెను. హిరణ్మయ కోశమును నిర్బీజము చేయవలెను. అపుడు (మలయ మారుతము సోకగనే మేఘావరణము పటాపంచలగునట్లు) మల, ఆవరణ, విక్షేపములు పటాపంచలై పోవును.

పరిపూర్ణ బోధ దృఢీకరణమగుట ఎట్లు? ద్వయ దోష రహితమును, అవకాశ రహితమును ఎఱిగిన ఎఱుక అచలమును ఎఱిగెనేని (భస్మాసురుడు తన హస్తమును తానె తన శిరముపై నిడుకొని భస్మమైనటుల) తనకు తానె నశించును.

శ్లో॥ షట్కోశరహితం నిత్యం షడూర్మిరహితం సదా ।
షడ్భూతరహితం పూర్ణం అచలం పరమం సదా ॥

శ్లో॥ నిస్సంగం నిర్మలం వ్యాప్తం నిరాధారం నిరామయం ।
నిరాకాశం నిష్క్రియత్వం వస్తు మద్రహితం నమః ॥

ఈ పరిపూర్ణమే స్వతస్సిద్ధము. ఇదియే ఉత్త బట్టబయలు. ఇది పంచభూతములు, ఉపరి భూతములైన మహదాది అహంకార విద్యావిద్యలతో గూడియున్న ఆత్మ, మనస్సు మొదలైనవేవియూ కాదు. షట్కోశములు కాదు. వీని కతీతమైన సచ్చిదానందమూ కాదు. అదే ఇది. ఇదే అది అనునది కాదు. నేనైక్యమైతినను స్వానుభూతి కాదు. సత్యం జ్ఞానమనంతం బ్రహ్మమనేది కాదు. పురుషోత్తముడు నేను అనునది కాదు. అద్దమునకు కళాయివలె పురుషోత్తముడు సాక్షి స్వరూపుడు. అదియే హిరణ్మయ కోశము. ఇది రహితమైతేనే పరిపూర్ణం స్వతస్సిద్ధం. అద్దమునకు గల కళాయిని, తుడిస్తే బింబము కన్పించనటుల ద్వాదశీ భావముతో హిరణ్మయ కోశమును నిర్బీజమొనర్చవలెనని గురుని ప్రబోధించెను. అంతట ఈ బోధ విన్న శిష్యులు గురుస్వామికి సాష్టాంగ పరవశులై యాజ్ఞవల్కి మహామహునకు సాష్టాంగ దండ ప్రణామములాచరించి చిత్తరువు వలె నిలచి యుండెదరు.

ఆ గురుమూర్తికి గురుదక్షిణగా నొసగబడిన ఎఱుకను తిరిగి వారినుండే అరువుగా గ్రహించి, లేనెఱుకతో లేకనే పోయి వారి వారి ప్రదేశములకేగి జనుల

వలె పనులను జరుపుకొనుచు కడదేరవలెనని గురుని యాజ్ఞగా మెలగెదరు.

అచల పరిపూర్ణ రాజయోగ మార్గమును గురించిన ప్రబోధ గురుస్వామి వద్ద లభించునని తెలిసిన శిష్యుడు యా మహామహుని చెంతకు వెడలి, తనను దాసునిగా అర్పించుకొని, యట్టి మార్గమును ప్రబోధించుమని వేడుకొనవలెను.

ఆ మౌనిసమ్మతమున శిష్యుడు చిత్తశుద్ధితో నా గురువర్యులకు షోడశోపచారములతో పాదపూజ గావించి, ద్వాదశీ షోడశీ మంత్రములను, హస్తమస్తక సంయోగము ద్వారా త్రివిధ దీక్షలను పొందవలెను. తదనంతరము "అచల పరిపూర్ణమార్గమెట్టిది? దానివలన ప్రయోజనమేమి?" అని ప్రశ్నించవలెను.

గురుస్వామి మొదట ముందుగనెఱింగించి, తదనంతరము అచల పరిపూర్ణమునను గూర్చి బోధించును.

శుశ్రూష ధర్మములు : 1) ఆత్మ శుశ్రూష, 2) అంగ శుశ్రూష, 3) స్థాన శుశ్రూష, 4) భావ శుశ్రూషయని నాల్గు విధములు.

"ఏకో దేవస్య సర్వ భూతేషు గూఢః" అను శ్రుతి వాక్యమననుసరించి మహాకాశమగు స్వప్రకాశ చైతన్య పరమాత్మ పిపీలికాది బ్రహ్మ పర్యంతము సర్వభూతములందు అంతర్యామియై గూఢముగా నుండెను. అనగా పంచకోశములకు అధిష్ఠానమై ప్రత్యగ్రూప హిరణ్మయ కోశముగా నుండి మానవోపాధియందు మనోవాక్కాయములనెడు త్రికరణములకు సూత్రాత్మగా నుండి, ఆయా ప్రవర్తనముల నాకర్షించుచు, ఆహార విహార, ఇహపర వ్యవహారములు జరుపుచుండును. అసత్యమైన ఆధ్యాత్మిక ఆధిభౌతిక, ఆధి దైవిక పద్ధతులలో ప్రవర్తింపచేసిన యెడల నీయాత్మ పాపమనెడు దుష్కర్మలతో కూడి, నీచయోనులందు జన్మాదులు పొందును. కాన హిరణ్మయ పరమాత్మ సాక్షితో త్రికరణ ధర్మమును ప్రవర్తింపచేయుటయే ఆత్మ శుశ్రూషయనబడును.

ఈ స్థూల దేహము పంచభూతముల వలననేర్పడినది. నరములు, అస్థులు, చర్మము రోమము మాంసము మొదలుగునవి భూఅంశలు, శ్వేదము, మూత్రము, రక్తము, శుక్లము, శోణితము మొదలగునవి జలభూతాంశములు. ఆకలి, దప్పి, నిద్ర, ఆలస్యము, సంభోగేచ్ఛ మొదలుగునవి అగ్ని గుణములు, చాచుట, దాటుట, పరుగెత్తుట, వణకుట, నడచుట మొదలగునవి వాయు భూతాంశములు; భయము, కామము, మోహము, క్రోధము, లోభము మొదలుగునవి ఆకాశాంశములు.

వీనిలో ఆకాశాంశములు మహాబలమైనవి. అవి మానవుని అధోగతి పాలు జేయుచున్నవి. వానికి అంతఃకరణమునందు చోటివ్వకూడదు. చోటిచ్చినచో స్థూలదేహము, అమితమయిన యుద్రేకానుసారము జార, చోర, పశుత్వము, రాక్షసత్వము ఇత్యాదికార్యములందు ప్రవేశింపజేయును. కావున యీ దేహమును గురుసేవ, గురు భక్తి, గురునిష్ఠలయందు ప్రవేశపెట్టవలెను. ఆకాశము శూన్యమైనది. ఆకాశగుణములైన భయము, కామము, మోహము, క్రోధము, లోభము మొదలైన రాగాదులునూ శూన్యమైనవి అని గ్రహించి, గురుమూర్తి సూచన చేసిన, అచల పరిపూర్ణ పరబాహ్య నిర్ణయమునందు మహాశూన్య మొనర్చుకొని "క్షమయా ధరిత్రి" యను నటుల భూమికి గల ఓర్పు, సహనములను అంతఃకరణమునకు ఆవరించుకొని, నియమిత ఆహార విహారములందు యీ స్థూల శరీరమును ప్రవర్తింపజేయుట అంగశుశ్రూషయనబడును.

సాధకునకు ధన కనక వస్తు వాహనములు, అష్టైశ్వర్యములు, భుజకీర్తులు, రాజ్య మహారాజ్యాధి పదవులు కలిగియున్నను, అహంకార అభిమానములకు తావివ్వక సామాన్యుని వలె యుండుట స్థాన శుశ్రూషయనబడును. మరియు ఏ నిర్ణయము నందుండుమని తనకు హితోపదేశము చేసియుండునో ఆ నిర్ణయమునందే యుండుట కూడా స్థాన శుశ్రూష యనబడును.

"అపుత్రస్యగతిర్నాస్తి స్వర్గోనైవచ" యనునట్లు పుత్రులు లేనందున నాకు స్వర్గము లేదు అను భ్రాంతితోను, పుత్రులు లేరను మానసిక బాధతోను, దారిద్ర్య నిర్మూలన, ధనాకర్షణల కొఱకును తగిన పూజ, వ్రతములు సలుపవలెనని భావము గాని, పుణ్యలోక ప్రాప్తికై, తీర్థయాత్రలు, పిండ ప్రధానములు, దశదానములు చేయవలెనను భావము గాని, చిత్తవృత్తి నిరోధముకై ఆసన, ముద్ర లక్ష్య, ధ్యానములు చేయవలయునన్న భావములు గాని, అన్నియు భ్రాంతి

దాయకము. కావున జనన మరణ విభ్రాంతికై గురుమూర్తి తనకు అచల భావమును బోధించుచుండగా తన మనస్సును ఏకాగ్రముగ నుంచుకొని ప్రబోధ వినుటయే భావ శుశ్రూషయనబడును. మరియు గురుమూర్తి ప్రబోధ యందే మనసును లగ్నమొనర్చి అన్య విషయములందు మనస్సును పోనివ్వక యుండుటయే భావ శుశ్రూషయనబడును.

కావున పరిపూర్ణ రాజయోగ మార్గావలంబకుడు విధిగా యీ శుశ్రూషా చతుష్టయ విధానమును ఆచరణలో త్రికరణ శుద్ధిగా నుంచినచో, వానికి బోధ అతుకగలదు. 'ప్రథమమున నెఱింగించిననైనది" యని యనగా సాంఖ్య తారక అమనస్క మహావాక్య వార్తికములకన్న మిన్నయగు పరిపూర్ణ రాజయోగ విధానమును గురుమూర్తి చెప్పగా విని, యా భావమును స్థిరీకరించుకొనుటకు తహపడుచుండు శిష్యునికి గురుస్వామి ద్వాదశి షోడశి భావములను బోధించును

ద్వాదశీ భావము :

"అయం వ్యర్థ బాహ్యా కోపీ నభవతి" ఇదియే ద్వాదశాక్షరి.

అయం = ఈ ఆత్మ ; వి + అర్థం = విశేషమైన అర్థము గలదియగు మోక్ష స్వరూపమనియు లేక విగతః + అర్థః = ప్రకృతి సంబంధమైన సంపదలగు మహదహంకారాది అష్ట ప్రకృతులకు పరమైనదనియు, వ్యర్థః = సర్వము, శూన్యమైనది. కాన ఏమియూ లేదనియు బాహ్యః = బయలున; కోపి = ఏదియును; నభవతి = పుట్టలేదు.

బయలు అనగా ఆవరణతో కూడిన భూతాకాశము కాదు. దానికతీతమైన సూర్యాకాశ, దహరాకాశ, నిరయవాకాశ, మహాకాశములు కూడ కానేకాదు. వీనికంటే అతీతమై, అవకాశరహితమై, తేజోంధకార రాహిత్యమై, రాకడపోకడ లేనిదై, రాకడ పోకడ కలిగిన దానికి అవకాశము కాని, వాని యునికిని లేశమాత్రమైనను గుర్తెఱుగనిదై, సర్వకాల సర్వావస్థలయందు ఏకరీతిగా అచలమై, పరిపూర్ణమై బట్టబయలై యున్నదేదో అదే బయలనియు, అచలమనియు, పరిపూర్ణమనియు, గురుగోప్యమనియు, అనంతమనియు, స్థిరమనియు, భూమ యనియు అనేకులు అనేక పేర్లతో పలుకుదురు. కొందరు తెలియక సచ్చిదానంద స్వరూపమైన స్వయంప్రకాశ బ్రహ్మమును కూడా యీ పేర్లతో పిలుతురు. ఇట్టి మాటలు విని భ్రమ జెందకూడదు.

షోడశీ భావము :

"మూలాభావ మిదం జ్ఞాతుః న శరీరం నకిమస్తి" ఇది షోడశాక్షరి

మూలాభావం = మూలము లేని, ఇదం = దీనిని, జ్ఞాతులు = తెలియుటకు, నశరీరం = శరీరము లేదు, నకిమస్తి = ఏమియూ లేదు.

శ్లో॥ జ్ఞానమధ్యే జగన్నాస్తి పూర్ణమధ్యే జగన్నహి
నహి జ్ఞానాదికం సర్వం జ్ఞానమాత్మ స్వరూపకమ్
జ్ఞానం నాస్తీతి నిశ్శంకం విరామోయత్ర చాస్తి చేత్
దృష్టిస్తత్రైవ నిశ్చిత్య నిర్వికార స్థితిర్భవ ॥

అనగా జ్ఞానమధ్యమున యీ జగత్తు లేనట్లు, పరిపూర్ణమందున కూడా జగము లేదు. సర్వము జ్ఞానాదికము గాదు. కాని జ్ఞానం ఆత్మ స్వరూపకము. ఈ జ్ఞానం అనగా ఆత్మ లేదనుట నిస్సంశయము. ఎచ్చట విరామముండునో అచ్చట ఆ పరిపూర్ణమును గూర్చి నిర్వికార స్థితినొందుము.

శ్లో॥ జ్ఞానం త్యక్త్వా జగత్త్యక్త్వా ఆత్మానాం
త్యజ సంతతమ్, పురుష ప్రకృతిర్నాస్థి
ఏకం నాస్తి ద్వయం నహి ॥

శ్లో॥ బాహ్యాభ్యంతరం నాస్తి - సత్యం సత్యమహర్నిశమ్
కర్త కారణ హీనోయ - మనుత్పన్న మిదం జగత్
నరశృంగేణ చాకాశం భిద్యతే జగదస్తిచ
అజాగళస్తనే క్షీరం జాయతే జగదస్తిచ ॥

జ్ఞానమును విడచియు, జగమును విడచియు, ఆత్మను కూడ విడువుము. పురుషుడును లేదు. ప్రకృతియు లేదు. ఇది ముమ్మాటికి సర్వవేళల సత్యము. ఈ పరమాత్మ కర్తృకారణ హీనము. ఈ పరిపూర్ణము నందు ఈ జగత్తు నరశృంగముచే ఆకాశమును ఛేదించు వంటిదై యున్నది. మరియు మేక

మెడచన్నులయందు పాలు గల్గినచో ఈ జగము కూడా నుండవచ్చును.

శ్లో॥ దృగ్ద్రష్టా చద్వయం నాస్తి - నాస్తి జ్ఞప్తి కథం భవేత్
కర్తృకారణ హీనోపి, జగత్సత్యం కథం భవేత్ ॥
ఉపాధి ద్వయగ్ం నాస్తి జీవ బ్రహ్మ కుతో భవేత్
కింబధ్నామి చ, కిం త్యక్ష్యాం కిం గృహ్ణామి రోతికమ్ ॥

దృక్కును, ద్రష్టయు రెండును లేని యప్పుడు, జ్ఞప్తి యెట్లుండును? కర్తృ కారణములే లేవు. జగత్తెట్లు గల్గును? ఉపాధి ద్వయము లేదు. జీవబ్రహ్మమెట్లు గల్గును? దేనిని బంధింతుము? దేనిని విడచి దేనిని గ్రహింతుము? దేనిని జేయుదుము ?

శ్లో॥ కార్యకర్తృ త్వగ్ం నాస్తి । నాస్తి జ్ఞప్తి స్సదా నహి
ఇతి విజ్ఞేయ యద్భావం । తద్భావం తత్పరిత్యజ ॥

కర్తృకార్యము లను జ్ఞప్తియు లేదు. ఇట్లే భావమును తెలిసికొంటివో, ఆ భావమును వదలిపెట్టుము. ఈ రహస్యమును గురుముఖతః తెలిసికొన వలయును. లేనిచో భ్రాంతి వదలదు.

శ్లో॥ గురోర్ముఖేన జ్ఞాతవ్యం నాన్యధా గ్రంధ కోటిభిః
అన్యధా లభితం నాస్తి సత్యం పునః పునః ॥

గురుమూర్తి త్రివిధ దీక్షలతో యీ ప్రబోధను బోధించును. ఆ దీక్షలేవనిన
1) సత్తు చిత్తు ఆనంద అవరోహణ చైతన్య నిరసన దీక్ష
2) అస్పర్శ, అచల యోగ అనుష్ఠాన నిశ్చల నిష్ఠాతదీక్ష
3) రాజయోగ గురుసౌజ్ఞ నిరావరణ దీక్ష

కలలో దోచిన శరీరములు ఏలాగున లేవో అలాగే, దేవతలు, స్వర్గ, నరకములు రథ గజ తురగ పదాతిదళములు సేవకులు, సేనాధిపతులు, రాజులు, చక్రవర్తులు నీవు, నేను సర్వం పరిపూర్ణమందు లేవను భావమును మరువకుము. కర్తృత్వ రహిత కర్మాచరణము పూనుము. ఇదియే గుహ్యాతిగుహ్యమగు అచల పరిపూర్ణ రాజయోగ మార్గము. ఈ మార్గమును వీడరాదు. ఉత్తములైన పురుషులు యిట్టి శిష్యుని ఆశ్రయించినచో వారికి బోధించవలెను. అట్టి గురుని దీవెన, అనునజ్ఞలతో వెడలి విదేహ ప్రవర్తనతో కర్తవ్య పాలన చేయవలెను.

ఈ సృష్టి యంతయు శబ్ద స్పర్శ రూప రస గంధములనే పంచవిధ స్పర్శలకు లోనైయున్నది. భ్రమరము, కీటకమునకు "ఝుం" అను నాదముతో తన రూపము ప్రసాదించుచున్నది. పక్షులు గ్రుడ్లపై కూర్చొని స్పర్శ వలన గ్రుడ్లను తన రూపముగా చేయుచున్నవి. తన కంటి చూపు వలన గ్రుడ్లను తన రూపముగా చేయుచున్నది. ఇదియే అస్పర్శ యోగము.

శ్లో॥ అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ
మక్లేద్యోఽశోష్య ఏవచ
నిత్య స్సర్వగత స్థాణుః
అచలోఽయం సనాతనః ॥

ఈ అచలము సనాతనమైనది. ఇయ్యది అస్త్రశస్త్రములచే ఛేదించుటకు వలను పడనిది, వానకు తడవదు, ఎండకు ఎండదు. అగ్నికి దహింపబడదు. వాయువుచే శోషింపబడదు. నిత్యసత్యమైనది. పరిపూర్ణము అంతటను ములుమోప సందులేక నిండియున్నది.

శ్లో॥ వుల్కాహస్తోయ ధాకశ్చి। ద్ద్రవ్యమాలోక్య తాంత్యజేత్ ।
జ్ఞానేన జ్ఞేయ మాలోక్యం । పశ్చాత్ జ్ఞానం పరిత్యజేత్ ॥

కావలసిన వస్తువును చూచుటకు దివిటీని చేతిలో ధరిస్తావు. ఆ వస్తువు లభ్యమైన పిదప దివిటీని వదలివేస్తావు. అట్లే జ్ఞానము వలన జ్ఞేయమైన పరిపూర్ణమును గ్రహించి, ఆ పిదప జ్ఞానమును పరిత్యజింపుము.

శ్లో॥ అదృశ్యే భావనా నాస్తి దృశ్యమే తద్వినశ్యతి
ఉభయోరంతకం జ్ఞాత్వాకదం ధ్యాయంతి యోగినః

కనుపించని దానియందు భావన యెట్లుండును? కనుపించునది నశించును. ఈ రెంటి యొక్క భేదమును గ్రహించి యోగులు ఎట్లు ధ్యానించుచున్నారు? అనిన,

శ్లో॥ భావాభావౌసదానాస్తి కథం పశ్యతి విశ్వతః

గురుశిష్యాదికం నాస్తి తజ్ఞానం చ సదానహి ॥

బట్టబయలుకు భావము కాని అభావము కాని ఎప్పుడును లేవు. అట్టిచో ప్రపంచము యుండునా? ఎప్పుడును లేదు. గురువు శిష్యుడు అను గుర్తు జ్ఞానం వలన కలుగుచున్నది. అట్టి జ్ఞానము ఎప్పుడునూ లేదు. భావములన్నియు అభావమగుటే బట్టబయలు, అదే స్వతఃసిద్ధము.

ఇట్టి బోధ విన్న మౌన ముద్రయే తప్ప ఏమీ లేదు.

అశరీర పద్ధతి :

కం॥ ఒంటుకు దాపల బింద్వికటం । టించిన కొలది
లెక్క యధికంబగునా॥ వొంటుకు వలపలబింద్వొ
క । టంటించిన లెక్క ఉళ్ళక్కొగదనోయీ ।
వొంటుండి లేం దొ గద నోయీ । తంటా తీరును
జూడు దానివలెనే యెఱుక । కంటె బయలును
తాను గలిగుండి తనకుళ్ళక్కొగదనోయీ ।
వొంటుండీ లేం । దొగదనోయీ ॥

– కందార్థ దరువులు 276 వ. కం॥

తా॥ ఓ శిష్యుడా । ఒకటియను అంకెను వేసి, దానికి కుడి ప్రక్కన సున్నలు గాని, అంకెలు గాని వేయుచున్న కొలది లెక్క అధికమగుచుండును. ఆ ఒకటికి ఎడమ ప్రక్క సున్న పెట్టినచో లెక్క ఉత్తదియగును గనుక ఒంటు ఉండి లేనిదే యగును. అటువలెనే సకల సృష్టికి కారణమైన ఎఱుక యొక్క మూలము అచల పరిపూర్ణ పరబయలుయందు లేదని తెలిసిన, ఎఱుక శూన్యమగును. అయినా ఎఱుక వున్నట్లు తోచిన, ఒకటి లేనిదగునట్లు ఎఱుక లేనిదేయగును.

ఎఱుకయను యీ కలలో నిన్నును, నన్నును, లోకులను, లోకములను నీ లోపలి భ్రమ చేత కనుగొని గురుని కరుణాకటాక్షము పొంది అచల పరిపూర్ణ బయలును మెలకువ గైకొని ఎఱుక యను కలను కల్లగా జేసి నీవు ఎచ్చటికి పోవుదవో అచటికి నీతో సర్వము పోవును. ఈ ప్రకారముగా అచల పరిపూర్ణ పరబయలున్ను, మూలము లేని ఎఱుకన్ను స్పష్టముగా నీకు తెలిసిన యెడల నీవు నిల్వకపోవుదువు.

ఎఱుకయను కలను విడచి పరిపూర్ణ పరబయలున, మేలుక జెందియున్న స్వచ్ఛందులు ఎఱుక పద్ధతులగు "కల" కార్యములు చేయుచున్నను వారు "కల" వారు కాదు. సద్గురు కరుణచే ఎఱుకను విడచి పరిపూర్ణ స్థితి కలిగియున్న నూరిజనుల యునికి నెఱుగక వారు కూడ నెఱుకలోని వారేయని నిర్ణయించు వారలకు అంతఃకరణ దోషము అనుభవింపక తప్పదు.

ప్రపంచమునందు ఏ మానవుడైనను భక్ష్యభోజ్య చోష్య లేహ్యములనెడి పక్వాన్నములు భుజించి, కక్కి మరల భుజింపడు, యతి సంసారమును విడచి తిరిగి పూనడు. దాత, యిచ్చిన ధనము మరల గ్రహించడు. సత్యవంతుడు సత్యము తప్పడు. అటువలెనే బదులు లేనట్టి పరిపూర్ణ పరబయలును, మూలము లేని ఎఱుకను, విడచిన ఏ శిష్యుడు ఎఱుక భ్రాంతిని మఱల గ్రహించడు.

జగము వలన సంకల్పము, సంకల్పము వలన జగము కల్గుచున్నది. ఈ రెండు పుట్టుటకు వేరుగానొక జన్మస్థాన మగుపడదు. ఏ కాలమందైనను, జగమును విడచి సంకల్పము, సంకల్పమును విడచి జగముండదు. గనుక అచల పరిపూర్ణ పరబయలును ఉండజూచి యీ ప్రపంచ సంకల్పముల రెంటిని ఎప్పటికిని తలవకూడదు. అట్లు చేసిన యెడల, వాటి ఉపాధి లేకపోవును. ఎట్లన ఎండమావులయందు నీళ్ళు వున్నట్లు అగుపడినను మిథ్యేయని యెఱిగిన విధమున అని భావము.

గురుడు సచ్ఛిష్యునకు అచల పరిపూర్ణ పరబయలును చలనము కలిగి తెలియుచున్న ఎఱుకను తెలియజేయగా శిష్యుడు రెంటి లక్షణములు తెలిసికొని యుండెను. చలనము కలిగి మూలము లేక తెలియుచున్న ఎఱుకను కర్మ సన్యాసము కర్మఫల త్యాగ పద్ధతిగా గాక, కర్తృత్వ రహిత కర్మాచరణ పద్ధతిగా విడువుమని సద్గురుమూర్తి తెలుపగా తెలిసికొని ఎఱుకను విడనాడిన శిష్యుడు అంతవరకు అతడు తెలిసికొన్న అయమాత్మ బ్రహ్మయను "నేను" ఎట్లుండుననగా పురుషుడు లేని స్త్రీ మహా సౌందర్యవతిగాయున్నను భార్యగా లేనిదే.

ఎఱుకను విడచిన పురుషుని స్థితి ఏ విధముగా యుండునో నని సమరస

బుద్ధితో సకల కార్యములు జేయును గనుక యిది సరిపడుననియు, యిది సరిపడదనియు చెప్పడు. చేయవలసిన సకల కార్యములు చేయుచుండును. స్వార్థము కొఱకు ఏ పనులు చేయడు. వైరాగ్యము పూని చేయవలసిన పనులు మానడు.

అహంబ్రహ్మాస్మియను అహంకారము లేనివాడు విశ్వమనే ప్రపంచమును జూడడు. అహంబ్రహ్మాస్మియను అహంకారము ఉన్నవాడు విశ్వము అనే సంకల్ప రూప (స్వప్న) ప్రపంచము గనుచున్నాడు. తను యొనర్చు కార్యములన్నియు సత్యములను భ్రాంతితో తానే కారణమని నిర్ణయించుకొని జనన మరణ, సంసార బాధల ననుభవించుచున్నాడు. అహంకారము లేనివాడు యీ విశ్వమనే ప్రపంచమున వ్యవహరించుచున్నను యీ సంకల్ప రూప (స్వప్న) ప్రపంచమున కును, కారణ కార్యములకును నేను కర్తనని గాని, భోక్తనని గాని తలంపడు.

కలగని మేలుకొనిన వాడు కలలో కనుగొనిన సుఖదుఃఖముల తెలియుచున్నను, అవి చూడ లేనట్లు, సద్గురు కటాక్షము చెందిన స్వచ్ఛందులకు ఎఱుకయందు పొందుచున్నట్లు తెలియుచున్నను, అవి లేనివేయని తెలియును. ఇట్టి స్థితి గల వారికి యిది గొప్పతనము. అనెడి నిర్ణయమేమైనా యుండునా ఆలోచించవలెను. ఆ విధముగా ఏ లక్షణములు యుండబోవు. కనుకనే సద్గురుడే తల్లి, తండ్రి, ప్రభువు, దాత, కులదైవము, మిత్రుడు, బంధువు అని నమ్మిన యెడల యే సంకటములు ఉండవు.

పరిపూర్ణ స్థితి గల వాడు పరుల యొద్దకు పోయి భూషణయు, దూషణయు చేయడు. ఒకవేళ వారు తనను దూషణభూషణలు చేయుచున్నను, వలదని చెప్పడు, కావలయునని చెవి యొగ్గి వినడు. మరియును వారు మీ వారని, వీరు మావారని చెప్పుకొనుచు పలుమారులు వీధులలో పోరాడుచుండెడి వారిని కూడదని కూడా చెప్పడు.

పంచతన్మాత్రలగు శబ్ద స్పర్శ రూప రస గంధములు తెలిసికొనుటకు కొంచెమైనను అగుపడనటువంటి ప్రదేశమును అచల పరిపూర్ణ పరబయలని యెఱిగి, పంచతన్మాత్రలు ఎఱిగియున్న మూలం లేని ఎఱుక లేనిదే కనుక దానిని, ఉన్నట్లు ఎఱుగక, మరియును బట్టబయలునూ, మూలం లేని ఎఱుకనూ రెంటినీ తెలిసికొన్నది ఈ రెంటిని తెలిసికొనక అచలబోధ స్థితి గలవారలను స్తుతి చేయుచున్నదియు, యితర జనులకు సాధ్యమగునని తాను చెప్పరాదు. ఇతరులు చెప్పినను తాను వినరాదు.

రాజు కపటాత్ముని చంప వలయునని పట్టుదలతో భటుల కాజ్ఞాపించి నపుడు ఆ భటులు కపటాత్ముని చంపులోపల ఆ కపటాత్ముడు తాను అనుభవించు చున్నవాటిని పనులు గమనింప జాలనట్లు సద్గురు ముఖాంతరముగా శక్తి ద్వయ నిరాసకంబైన శుద్ధ నిర్గుణ తత్త్వ పరిపూర్ణ బోధను విని అచల పరిపూర్ణ స్థితి గల వారెవరై యుండినను ఎఱుక ప్రభావమును పాటించి చూడరు.

సద్గురునకు సచ్ఛిష్యుడు తను, మన, ధనములు అను త్రికరణములు సవినయపూర్వకముగా ధారబోసి, జనన మరణ భ్రాంతి రహితమునకు తగువైన అచల పరిపూర్ణ బోధను సంతోషముతో సద్గురువు వలన విని 'నీవు–నేను' అను భేదభావము లేక అచల పరిపూర్ణ లక్షణముగా ప్రవర్తించే అశరీరులతో సరియగువారు యీ భూమి యందు లేదు. అట్టి ఉత్తమ పురుషుడు ఎచ్చట అడుగిడినను లోకులు నమస్కరించవలెను.

గురువులకు గురువగు సద్గురుమూర్తి బోధించెడి శక్తిద్వయ నిరాసకమైన శుద్ధ నిర్గుణతత్త్వ పరిపూర్ణ బోధక్షరాక్షరోపాధి ద్వయ దోష రహిత పరమతత్త్వ అచల పరిపూర్ణ ప్రబోధ తెలిసికొని లేని యెఱుకను విడచి ప్రవర్తించే ఉత్తమ పురుషులను పామర జనులు గుర్తెఱుగ జాలరు. ఎందుకనగా, ఆ సద్గురువు బాలునివలె, ఉన్మత్తుని వలె, పిశాచము వలె, జడుని వలె ఉండును. ఇట్టి సద్గురువునకు తెలియని రహస్యము ఏదియును ఉండదు.

ఉత్తర భాగము

లేనెఱుక లేకపోయినప్పటికిన్ని, కాలమున్నది. పిండాండ బ్రహ్మాండముల

కును, జీవేశ్వరులకును, సర్వమైన ఎఱుకకు ఆధారము కాలము. ఉత్పత్తి, స్థితి, లయములు కాలములోనే జరుగుచుండును. ఈ కాలములో ప్రవేశించిన, ఇట్టి బ్రహ్మాండములు కోటానుకోట్లుగా విశ్వముగా యేర్పడి ఉన్నవి అని తెలియబడును.

గురు రూపమైన ఈశ్వరుని కృప వలన విశ్వానుభవము పొంది, విశ్వాతీతములో ప్రవేశించిన పిదప కాలాతీతమును దర్శించును. అప్పుడు కాలుడు ప్రత్యక్షమై నమస్కరించి కాలానుభవమును కల్గించును. అప్పుడు పిండ బ్రహ్మాండములలో నున్న జీవఈశ్వర తనువుల గురించి సంపూర్ణముగా తెలియబడి, అధిగమించి, యితరులకు తెలియజేయు సత్తా కలిగియుండును. ఐనను, తానుతానుగానే వెంట్రుకవాసి యెఱుకతో నుండి వ్యవహరించు చుండును.

అట్టి యెఱుకను కూడ విడచుటకు, ఈశ్వరుడే గురుస్వామియై అందించిన స్ఫూర్తితో బయలులో వెంట్రుకవాసి ఎఱుకతో ప్రవేశించి, బయలానుభవమును పొంది, పరబయలు లోనికి ప్రవేశించును. ఇవియన్నియు, తనకు మూలము గాదని, తనకు తానే యేర్పఱచుకొన్నవని అనుభవ పూర్వకముగా తెలియబడి నిరసించబడి తనంతత తానే లేకుండగ పోవును.

"ఈశ్వరోగురురాత్మేతి మూర్తిభేద శిభాగినే

వ్యోమవత్ వ్యాప్తదేహాయ దక్షిణామూర్తయే నమః"

ఈశ్వరరూపమైన గురువు ఎల్లప్పుడు, పై వాటికి ఎట్టి సంబంధము లేక ఉండి, యీ స్థితికి ప్రవేశించిన వారిని లేకుండునట్లు అనగా జన్మరాహిత్యము అగునట్లు చేయుచుండును.

ది. 24-4-2005 ఆదివారము తెల్లవారుఝామున 2-00 గం॥లు 4-00 గం॥ల మధ్య శ్రీవారికి స్ఫురించిన విచారణ ద్వారా తెలియబడినది.

సర్వము – శూన్యము అను పదములకు స్ఫూర్తిలో విచారణ జరిగినది. సర్వమనగా ఒకటి అయి వున్నది, రెండు కానిది. సర్వము ఎట్లయినదనిన ఒకటికి సున్నలు కుడివైపు నుంచినపుడు, ఆ ఒకటికి విలువ చెప్పలేనంతగా పెరిగి సర్వమైనది. (ఆది, అంతములు కలిగినదైనది) అనగా నాశనము కలిగనదయ్యెను. – (100000)

రెండు కానిది ఎట్లనగా, ఆ ఒక్కటి (పరబ్రహ్మము లేక ఎఱుక) అయిన సర్వమునకు, అనగా '1' కి సున్నలు లేని (లేనివి కాని మాయ) చేర్చిన విలువ లేని వాటితో వ్యక్తావ్యక్తముగా అనేకమయినది. నిజమునకు అది ఒకటే! రెండు కానిది ఒక్కటి ('1') లేనిదయ్యే విధానమెట్టిదనిన, పరబ్రహ్మమైన '1' ఉండి దానిని విలువ లేనిదిగా గుర్తించేది ఉన్నపుడు, ఆ ఒకటి ఎఱుక ఉన్నదనీ గుర్తించేది లేనపుడు ఆ ఒకటి లేని ఎఱుకగా తెలియును. అనగా ఒకటికి ఎడమవైపు సున్న నంటించిన, ఒకటికి విలువనిచ్చే యెఱుక లేదు. ఆ విధముగా ఒకటి అనబడే ఎఱుక లేనిది (01). అయినప్పటికి, అది పరిపూర్ణము కాదు. ఇట్టి లేనెరుక సంకల్ప, నిస్సంకల్ప, శూన్య, శూన్యాతీతములు. కాలము, కాలాతీతములు ద్వారా పరబయలు అనుభవమందును. పరబయలు పరిపూర్ణము, పరశివము, శాశ్వతము, జన్మరహితము.

ఈ స్ఫూర్తియే శూన్యము – సర్వము, సర్వము – శూన్యము అను గ్రంథమునకు పూర్వరంగమయ్యెను.

ది. 29-10-2005 తెల్లవారితే శనివారము 2-00 గం॥లు 4-00 గం॥ల మధ్య శ్రీవారికి స్ఫురించిన విచారణ ద్వారా తెలియబడినది.

ఒకటికి కుడివైపున సున్నలనంటించినపుడు అవ్యక్తముగాను, శూన్యముగాను, సర్వవ్యాపకముగాను తోచి జ్ఞానముగా వ్యక్తమై, అనుభవమును పొంది, అది మూలా జ్ఞానమని కుడివైపున ఉన్న సున్నల సత్యత్వము తెలిసినంతనే, అది జ్ఞానమును పొందెను. – (100000)

ఒకటికి ఎడమవైపున సున్న సాధనానుభవ నిరసన ద్వారా ఏర్పడినపుడు జ్ఞానాజ్ఞానములు రెండును తామంతట తామే శూన్యమై, తాననెడి యెఱుక, లేనెఱుకయని తెలిసి, పూర్వము పరబ్రహ్మము అయిన ఒకటిని పరిపూర్ణమని యెంచి, అది తనకు మూలముగాదని నిజ గురుస్వామి కృప వలన, యీ ఎడమవైపున ఉన్న సున్న తెలిసికొనినంతనే, తాను లేకపోయెను. – (01)

ఈ '1' ని తెలిసికొనునది లేకపోయిన, ఉన్నదేదో ఉన్నది. లేనిది యెన్నడూ లేదు. ఇదే లేనెఱుక లేకనేపోవుట. – (1)

ఈ ఉన్నది పరిపూర్ణము. దీనిని తెలిసికొనే యెఱుక లేనందున, ఉన్నదని

చెప్పేవారెవరున్నారు? ఉన్నా, లేకున్నా యీ పరిపూర్ణమే స్వతిస్సిద్ధము, సర్వకాలములందును, సర్వకాలములకతీతముగాను ఒక్క రీతిగానుండును. ఈ స్ఫూర్తియే శూన్యము – సర్వము, సర్వము – శూన్యము, అనగా ఎఱుక – లేనెఱుక. ఈ రెండును లేనిదైన సారమే యీ గ్రంథము యీ గ్రంథము యొక్క ముగింపు.

ది. 18-12-2005 ఆదివారము అర్ధరాత్రి దాటిన పిదప సోమవారము తెల్లవారురుఘామున 2గం॥లకు స్ఫురించిన విచారణ ద్వారా తెలియబడినది.

ది. 1-1-2000న స్వామివారు మెహెరాబాదు సందర్శించిన సమయములో, అవతార్ మెహెర్‌బాబావారు శ్రీవారిలో ప్రవేశించుటయే గాక, బాబా వారిలోనే యున్న విశ్వ సంబంధమైన గోళములను కూడా ప్రవేశపెట్టి, అట్టి దర్శనజ్ఞాన విశేషమును సహజ జీవనముగా జేసికొనుమని ఆదేశించిరి.

ఈ పూర్వరంగమే శ్రీవారిని అనేక అనుభవములకు మార్గమేర్పరచుచు, మరల ది. 18-12-2000 సోమవారము తెల్లవారురుఘామున స్ఫురించిన సహజ జ్ఞానము, యీ క్రింది విధముగా వారిచే వివరించబడినది.

శ్రీ భగవాన్ సత్యసాయిబాబావారి జన్మదినమైన ది. 23-11-2005 నుండి గడచిన రోజులలో అధికమైన బాధ భరించలేని విధముగా పరిణమించినది. అనగా కొంతకాలమునుండి సర్వుల సంస్కారములు శ్రీవార్కి బాధలుగా సంక్రమించుట జరుగుచు, యిప్పుడధికమైనది. శ్రీవారు సర్వసాక్షియై నప్పటికిని, అది సంపూర్ణ విలక్షణము కావలసియున్నదని తెలియబడినది. వారిలో అనేక జ్ఞాన జ్యోతులుగా గోచరమగుచున్న స్థితి యిప్పుడు సమిష్టిగా సర్వ వ్యాపకమైన అకండ తేజస్సుగా పరిణమించినది.

ఈ అనుభవ స్థితి యెట్టిదనిన అనేక జ్ఞాన జ్యోతులు కలసి ములుగ్రుచ్చ సందు లేనిదిగా అఖండ తేజోమయముగా, ఒక్కటిగా, సర్వవ్యాపకముగా తానైన సంపూర్ణ విలక్షణమైన అగ్ని తత్త్వమును మీరిన తేజోస్థితిన యుండుట (ధృవస్థితి).

ఈ స్థితిని పొందుట అనగా పృథ్వితత్త్వ, జలతత్త్వ తన్మాత్రల స్థితి నుండి, అధిగమించుట మరియు అగ్ని తత్త్వ తన్మాత్రలలో ప్రవేశించుట అని తెలియబడినది.

శ్రీవారు అగ్ని తత్త్వముగా సమిష్టి స్థితిలో నుండుట వలన వారికి సర్వుల నుండి సంక్రమించిన సంస్కారములు వారి అఖండ తేజస్సులో దహించబడి, నశించగలవనియు, యింతకుముందు వలె బాధించవలనియు తెలియబడెను.

ఈ విధమైన స్థితిలో, వారు సంపూర్ణమైనట్లు తెలియబడెను.

ఇంకనుపై స్థితులైన వాయు తత్త్వ, ఆకాశ తత్త్వ తన్మాత్రలతో గూడుకొని యేర్పడిన విశ్వములో ప్రవేశింపబడవలెనని స్ఫూర్తి కలిగినది. అప్పుడు విశ్వ సంబంధమైన వ్యష్టి, సమిష్టి అనుభవములను ఏక కాలములో పొంది, విశ్వము నుండి కూడ విలక్షణమై పరశివ స్వరూపుడైన గురుస్వామి జూపిన పరబయలు నందు ప్రవేశించి, తనకు పరబయలు ఆధారము కాదనియు, తనకు తానే వచ్చెనని, కనుక తాను లేకపోవుటయే జన్మరాహిత్యము అని తెలియబడినది.

ఈ విధముగా శ్రీవారికి జ్ఞానాజ్ఞానములును లేనెఱుకను విడచుట వద్ద క్రమానుభవము విశదీకరించబడుచు, పరిపూర్ణమందు వారు లేకపోవుటయను స్థితిని ఏక కాలములో స్థిరము జేసికొనుట యనునది కేవలము గురుస్వామి పదవిలో నుండుటకే.

అనుబంధము

శ్రీ మేకా నరసింహారావుగారు చల్లపల్లి మండలం, పాగోలు గ్రామములో 1932లో జన్మించిరి. వారి తల్లి లక్ష్మీ దేవమ్మగారు, తండ్రి సుబ్రహ్మణ్యము గారు. వీరి తొలి గురువులు డాక్టరు కొల్లి గురుప్రసాద్‌గారు. గురుప్రసాద్‌గారి తండ్రి శ్రీ కోటయార్యులు పరమగురువులు. పూర్వము నరసింహారావుగారి తల్లిగారికి శ్రీ కోటయార్యులవారు గురుసూచన యిచ్చుట జరిగినది. శ్రీ కోటయాచార్యుల వారి గురువు శ్రీ సుబ్బయాచార్యులుగారు. వీరు పరమ గురువు. వీరి పీఠము గుంటూరులోనున్నది.

శ్రీ నరసింహారావుగారి యిష్టదైవము భగవాన్ సత్యసాయిబాబా. బాబా వారి చేతిలో నుపకరణముగా, శ్రీ నరసింహారావుగారు (బాబా యిచ్చు మేరకు) వీరి పరిధిలోకి వచ్చిన శిష్యులను గమ్యమము జేర్చుటకు వారు పొందిన దానిని యితరులకు ప్రసాదించుచున్నారు. శ్రీ నరసింహారావు గారు సత్యవాదులు, అపరిగ్రహులు, క్షమాశీలురు, కరుణామయులు, గమ్యము చేరినట్టి

మహామహులు.

మెహెర్‌బాబా వారి పరిధిలోకి అవతారుని దయచే ప్రవేశించినవారై బాబావారు ఇచ్చిన మౌనదినమును శ్రీ రావు గారు 1996 జూలై 9 మరియు 10వ తేదీన పాటించుట జరిగినది. మౌన విరమణ పిదప మరల 12-7-1996 నుండి శ్రీ రావుగారికి ఈశ్వరీయ మౌనము కలిగి ఈ మౌనము బాబావారే ఇచ్చినదగుటచే ది. 22-1-1997 వరకు కొనసాగినది. ఈ మౌనకాలములో మహా యోగము జరిగినది. ఏ కారణముననో వీరికి ప్రాణాపాయ స్థితి సంభవించగా భగవాన్ సత్యసాయిబాబావారు, శ్రీ రావుగారి భ్రూమధ్యమమునకు ఎదురుగా నిలచి వారి బాధను తగ్గించిరి. ఏ ప్రయత్నము లేకనే శ్రీ రావుగారు మామూలు స్థితికి వచ్చి మరల ప్రశాంతతను పొందిరి.

25-12-1999 క్రిస్మస్ శుభదినమున శ్రీ రావుగారు మెహెర్‌బాబా వారి పూనా సెంటరుకు వెళ్ళిన సందర్భములో మెహెర్‌బాబా వారుపయోగించిన మంచమును స్పర్శించగా బాబావారి దివ్యత్వము నిరంతరాయముగా ప్రవహించుట జరిగినది. అలాగే బాబావారింటిలోనున్న నల్లరాతికి తలను తాకించగా, వారు స్పృహ కోల్పోయినారు. మెహెర్‌బాబావారు సద్గురు బాబా జాన్ వలన పొందిన దైవీచైతన్యమును తన పరిమిత దేహము అట్టి దివ్యావేశమును భరించువరకు తన బాధను తట్టుకోలేక యీ రాయికే వారి తలను మోదుకునేవారు. పిదప సద్గురు ఉపాసనీ మహరాజ్ వారు అనుగ్రహించిన సమాంతర భౌతిక చైతన్యమును (దైవీ చైతన్యముతోపాటు) తిరిగి పొందినపుడు బాబావారి తలనొప్పి క్రమముగా తగ్గుట జరిగినది.

ది. 26-12-1999 న పూనా నుండి దిగువ మెహెరాబాద్‌కు చేరగా ది. 27-12-1999 న శ్రీరావుగారి సహచరులందరు మెహెర్‌బాబా వారి సమాధి దర్శనమునకు వెళ్ళిరి. శ్రీ భట్టిప్రోలు కేశవరావుగారు, బాబా సమాధి వద్దనుండగా వారికి, "శ్రీ నరసింహారావుగారిని తీసికొనిరా!" అని బాబావారు స్ఫురింపచేసిరి. మరల "Be carefull, Be careful, Be careful" అని శ్రీ కేశరావుగార్కి 3 సార్లు బాబా ఆజ్ఞ వినిపించెను.

అప్పుడు శ్రీ రావుగారు తన ఆరోగ్యము సరిగా లేనందున మెహెరాబాదు హాస్టలులో విశ్రాంతి తీసికొనుచున్నారు. కాని ఎలాగో బట్టలు వేసికొని దర్శనమునకు సిద్ధముగానున్నారు. శ్రీ కేశవరావుగారు, శ్రీ రావుగారిని తన సహాయముతో సమాధి వద్దకు తీసికొని రాగా, బాబావారు మరల 3 సార్లు "బీ కేర్‌ఫుల్" అని చెప్పినట్లు కేశవరావుగారికి వినిపించెను. శ్రీ బాబావారి సమాధి నుండి మరియు వారి మంచమునుండి స్పర్శ చేత, అనూహ్యమైన దివ్యానుభవము గలిగెను. శ్రీ కేశవరావుగార్కి బాబావారు యీ విధముగా సూచన జేసిరి. "భవిష్యత్తులో దివ్యమైన కార్యక్రమములలో శ్రీ రావుగారు కీలక పాత్ర వహించెదరు" అని.

మెహెర్‌బాబా వారి సమాధి దర్శనానంతరము, రావు గార్కి వాంతులై స్పృహ కోల్పోయిరి. పదునాల్గు భువనముల విశ్వానుభవమైనట్లు రావు గారు తెలిపిరి. దిగువ మెహెరాబాదునుండి టాక్సీలో అహమ్మద్‌నగర్‌లోని బూత్ హాస్పిటల్‌కు తీసికొను వెళ్ళు సమయములో శ్రీరావుగార్కి టాక్సీ అద్దముపై అవతార్ మెహెర్‌బాబా వారి యథాతథ దర్శనము జరుగుచునే యున్నది.

ది. 29-12-1999 న బూత్ హాస్పిటల్ రూమ్ నెం. 9లో ప్రవేశించు వరకు పై దర్శనము చెదరలేదు. వారికి స్పృహ లేని స్థితిలోనే యిదంతా జరిగినది. అన్ని పరీక్షలు జరిపిన పిమ్మట రూము లోనికి వెళ్ళి వారు మంచముపై కూర్చుని యుండగా, "బాబా నా దగ్గరే కూర్చునియున్నారు" అని శ్రీ రావు గారు తెల్పిరి. మెహెర్‌బాబా వారిని అవతరింపజేసిన పంచ సద్గురువులు వరుసగా ఉపాసనీ మహరాజ్, షిర్డి సాయిబాబా, బాబా జాన్, నారాయణ్ మహరాజ్, తాజుద్దీన్ బాబా వారలు కనుపించి వారి దివ్యానుగ్రహమును ప్రసరించిన అనుభవము గలిగినది. ఆయా అనుభవములలో ప్రవేశించుట, అనుభవించుట, చివరకు తాను తానుగా జీవించుట జరిగినది.

ది. 30-12-1999 న "ఇది అంతా పూర్ణము" అని తెలియబడినది. "కాని పరిపూర్ణత్వమింకను తెలియబడలేదు. సంస్కారముతో ప్రేరేపించబడి, చిక్కుకొని, బాధపడుటయే యింతవరకు జరిగినది కాగా, దానికి పై అనుభవమింకను ఉన్నదని" తెలియబడినది. ఇంతకు ముందు పూర్ణానుభవమునే పరిపూర్ణమని భావించినది సరికాదనియు, తాననుభవించినదంతయు

పూర్ణమేననియు, బాబాచే నిర్దేశించబడినది.

ది. 31-12-1999 న విశ్వమంతయు గోళములుగా అవతార్ మెహెర్‌బాబా వారి నుండి ప్రాదుర్భవించి మరల వారిలోనే లయమొందుచున్నట్టి "విశ్వరూప దర్శనము" ఒక రాత్రి, ఒక పగలు కాలమంతా నిలచి యుండెను. కేవల బ్రహ్మాండయుత జ్ఞానముతోనున్న శ్రీ రావు గార్కి విశ్వము యొక్క వివరణ పూర్వము తెలియబడలేదు. ఇప్పుడా విశ్వదర్శనము జరిగి, ఈ సర్వము అనుభవము పొందబడెను. అవతారునిచే విశ్వగత ఎఱుకను, విలక్షణముగానుండే స్థితిని శ్రీ రావుగార్కి పై విధముగా ప్రసాదింపబడెను.

ది. 1-1-2000 న అవతార్ మెహెర్‌బాబావారి దివ్యానుగ్రహము వలన శ్రీ రావు గార్కి సమస్త విశ్వము వారి నుండే ఉద్భవించుచున్నట్లును, కొన్ని గోళములు క్రింది భాగమునకును, మరి కొన్ని పై భాగమునకును వెడలుచు లయమగుచున్నట్లును దర్శనాననుభవము గలిగెను. ది. 31-12-1999 న గోళములు బాబా వారిలో లయమొందగా, ది. 1-1-2000 న గోళములు రావుగారిలో లయము గాక, క్రిందికిని, పైకిని పోయినట్లు అనుభవములో భేదముండెను. కాని గోళముల ప్రాదుర్భావము మాత్రము ఒకే విధముగా నుండెను. ఈ స్థితి వరకు మెహెర్‌బాబా వారు శ్రీ రావుగార్ని తెచ్చి, యిప్పటి దర్శనజ్ఞాన విశేషమును సహజ జీవనముగా జేసికొనుమని ఆదేశించిరి.

తదుపరి, తలవని తలంపుగా పుట్టపర్తి వెళ్ళి, భగవాన్ సత్యసాయిబాబా వారిని దర్శించగా, బాబావారి ముఖములో దివ్య తేజస్సు గోచరించి, తన్మయము జెందిరి. తిరిగి గుంటూరు చేరు వరకు ఆ దివ్యానుభూతిలోనే యుండిపోవుట జరిగినది. పిమ్మట బాహ్యస్పృహ గలిగెను.

శ్రీ నరసింహారావుగారు పొందినవన్నీ దశల వారిగా బాహ్యముగా నున్న గురువుల చేత, ఆంతరంగిక గురువుల చేత, భగవాన్ సత్యసాయిబాబా వారి కృప చేత, అవతార్ మెహెర్‌బాబా వారి కరుణ చేత ప్రసాదింపబడిన దివ్యానుభవములే. వారు పొందిన అనుభవస్థితియే వారి వాస్తవ స్థితి, వారి సహజ స్థితి. వీరి ప్రత్యక్ష పరోక్ష గురుపరంపర ఇట్లున్నది.

1) శ్రీ కొల్లి గురుప్రసాద్ గారు (డాక్టరు) – సద్గురువు
2) శ్రీ కొల్లి గురుప్రసాద్ గారు (డాక్టరు) – శ్రీ సద్గురువు
3) శ్రీ బళ్ళ సుబ్బ నాగన్న గారు – పూర్ణ సద్గురువు
4) శ్రీ దొంతులమ్మ గారు – పూర్ణ సద్గురువు
5) శ్రీ ఉపాసనీ మహరాజ్ వారు – పరిపూర్ణ సద్గురువు
6) శ్రీ అవతార్ మెహెర్‌బాబా వారు – పరమేష్ఠి

శ్రీ కొల్లి గురుప్రసాద్ గారు శ్రీ రావుగారి ప్రథమ సద్గురువు. వారి బాధ్యతను స్వీకరించి, వీరిని అసత్తు నుండి సత్తులోనికి చేర్చి స్థిరపరచినారు. శ్రీ రావు గారికి జీవన్ముక్త అనుభవమును అనుగ్రహించిరి.

సద్గురువనగా సత్, అసత్‌లను విడదీసి, వివరించి, సత్‌లో స్థిరపరచగల సమర్థులు అనగా శిష్యునికి నీవు జీవుడివి కావు, ఆత్మ స్వరూపుడవు అను విషయపరమైన విజ్ఞానమును కలుగజేసి, అట్టి అనుభవమును యిచ్చువారు. శిష్యునికి అతని గుణాత్మకమైన శరీరతాదాత్మ్యత నుండి విడుదల గావించి, వ్యష్టిలో నీవు ఆత్మవు, సమిష్టిలో నీవు పరమాత్మవు అను విషయ జ్ఞానమును కలుగజేయగలరు. శిష్యుడు, విలక్షణుడై తాను అనునది ఏదైతే వున్నదో అట్టి తాను తానుగా తెలియబడును, అనగా సత్యాహముగా తెలియబడును. ఈ అనుభవమే శ్రీ రావుగార్కి కలిగినది.,

తరువాత బాధ్యత శ్రీ సద్గురువులది. ఈ బాధ్యత కూడ శ్రీ గురుప్రసాద్ గారే స్వీకరించిరి.

శ్రీ సద్గురువనగా ప్రకృతి పురుషుల అభేదత్వమును శిష్యునికి అనుభవింపజేయువాడు మరియు బ్రహ్మముగా అయినట్టి అనుభవములో స్థిరపరచువాడు.

త్రిగుణాత్మక జీవుడు జనన మరణ చక్రములో బంధింపబడియుండి, అనగా పిండాండ స్థితిలోని జీవుడు గురూపదేశము తరువాత నేను జీవుడిని కాను, బ్రహ్మమును అని భావించుకొనుచుండును. అట్లు జీవించును అనగా

జీవబ్రహ్మల విచారణ ద్వారా, వేదాంత శాస్త్రముల ద్వారా, శ్రీ సద్గురు బోధ వలన ఎఱిగిన శిష్యుడు బ్రహ్మాండములో బ్రహ్మముగా భావన చేసి, యద్భావం తద్భవతిగా తాను బ్రహ్మమేయగును. ప్రకృతి పురుషుల పంచీకరణను గ్రహించి, తన్మాత్రల స్వరూపమును తెలిసికొన్న శిష్యుడు ఆ రెండింటి అనుభవమును ఒక్కటిగానే యున్నట్లు, రెండుగా గాని వేరుగా గాని లేనట్లు అనుభవ జ్ఞానమును పొందును. అట్టి అనుభవ జ్ఞానములో శిష్యుడు సహజముగా జీవించి, ఆ ఒక్కటైన జ్ఞాన స్వరూపమే తానగును. "సర్వము నేను, నా కంటె అన్యముగా మరియొకటేదియు లేదు" అను సహజ స్థితిలోనుండును. దీనిని త్రిగుణ రహిత సహజ స్థితిలో నున్న శ్రీ సద్గురువు తన్నాశ్రయించిన శిష్యునికి శరణాగతి అనెడి హృదయైక్యముచే అదే అనుభవమును ప్రసాదించును. శ్రీ రావుగార్కి యిట్టి స్థితిని కలగజేసిన శ్రీ సద్గురువైన శ్రీ గురుప్రసాద్ గారే పూర్ణ సద్గురువైన శ్రీ బళ్ళ సుబ్బ నాగన్న వారి వద్దకు గొనిపోయి అప్పగించిరి.

పూర్ణ సద్గురువనగా ప్రకృతి పురుషులకతీతమైనట్టి అనుభవము తనకు తాను గలిగి, స్వయంప్రకాశువై, యితర ప్రకాశములకాధారమై జీవుని బ్రహ్మమునందు ఐక్యము చేయగల సమర్థులు అనగా పిండాండమునకతీతులై మార్పు జెందు ప్రకాశమునకాధారమై తాను మాత్రము మార్పు జెందకయుండు వారు. వీరి అనుగ్రహములో శ్రీ రావుగారు బ్రహ్మానుభవము నుండి కూడ విడుదలై, ఎఱుక బ్రహ్మమును ఎఱుక లేని బ్రహ్మమును విచారణ జేసి, అనుభవములో స్థిరపడిరి.

పూర్ణ సద్గురువు తన శిష్యుని పిండాండ పంచీకరణ ద్వారా విచారణ చేయించి, నాలుగు మహా వాక్యముల ద్వారా త్రిగుణాతీతునిగా నిలిపి, వ్యష్టిలో ఆత్మగా, సమిష్టిలో బ్రహ్మముగా ననుభవింపజేయును. ఇట్టి అనుభవ స్థితిలో జీవుడు బ్రహ్మములో అభేదమొందును. ఇంకను విశ్వసంబంధమైన పరబ్రహ్మములో ప్రవేశించును, విశ్వమును సృష్టిగా జేసికొనును. అట్టి సృష్టిలో తాను బ్రహ్మమను సంకల్పముచే అనగా దివ్యాహాముచే విశ్వములో బంధీకృతుడగును. విశ్వ సంబంధ కార్యకలాపము తనకు సంకల్పముగా ఎఱుకతో సంక్రమించగా, మరల యిట్టి బంధమును భరించలేక, విముక్తి కొఱకై పరితపించుచుండును. అనగా నిస్సంకల్పముచే ఎఱుక బ్రహ్మము నుండి విముక్తుడగుటకు ప్రయత్నించును. ఈ స్థితిలో పూర్ణ సద్గురువు యొక్క అనుగ్రహము చేత దివ్యాహము నుండి విడుదలగును.

త్రిమూర్తుల తత్వములనగా విశ్వ సంబంధములో తమోగుణము బ్రహ్మతత్త్వము, సత్వ గుణము విష్ణు తత్త్వము, రజోగుణము శివతత్త్వము. విశ్వములోని యీ తత్త్వములే మూడు గుణములు. విశ్వమును వేరు చేయగా విలక్షణమైన అనుభవమే విశ్వ సంబంధ బ్రహ్మము. దీనిని యిక్కడ దివ్యాహమందురు. శ్రీ రావుగారి అనుభవము యీ విశ్వమునకు విలక్షణమైన పరబ్రహ్మము.

దివ్యాహము నుండి విడుదల కోరు శిష్యుడిని పూర్ణ సద్గురువు కరుణతో యీక్రింది స్థితులు తెలియజేయును.

1) బ్రహ్మాండ పంచీకరణ, యేతనాత్రలచే బ్రహ్మాండమైనదో, దానికాధారమైన బ్రహ్మాండము బ్రహ్మము.

2) విశ్వ పంచీకరణ, యేతన్మాత్రలచే విశ్వమేర్పడినదో, దానికి ఆధారమైన విశ్వము – పరబ్రహ్మము.

3) ద్వాదశి, షోడశి మంత్రములు, వాని అంతరార్థముల వివరణ, విచారణ.

4) విశ్వ సంబంధమైన బ్రహ్మమును విశ్వము నుండి వేరుపరచి, విలక్షణమైన పరబ్రహ్మముగా నిలచుట.

5) ఎఱుక బ్రహ్మము, ఎఱుక లేని బ్రహ్మము లలో ప్రవేశింపజేసి, విశ్వానుభవములో లేనెఱుక యొక్క అనుభవమును నిలుపుట.

ఈ లేనెఱుక అనుభవ స్థితిలో పూర్ణ సద్గురువు యొక్క కరుణచే, సాధకుడు విశ్వములో విలక్షణముగానుండును. ఈ యెఱుక, లేనెఱుకలు బృహద్వాశిష్ఠ సాంప్రదాయమునందు మాత్రమే నిర్ణయింపబడినవి. ఈ అచల సాంప్రదాయ ములో నేరుగా బయలు యెఱుక, లేనెఱుకల గురించి, వివరించి లేనెఱుకను విడిపించి, అచల పరిపూర్ణ పరబాహ్యము తనకు మూలముగాదనుచు, గురుస్వామిలో సాగిన శిష్యుడు లేకుండా పోవును. శ్రీ రావు గారి అనుభవము

ఇట్లు పూర్ణ సద్గురువు అనుగ్రహించిన విధముగా నున్నది.

బ్రహ్మాండ, విశ్వాండ పంచీకరణము, వాటి తన్మాత్రలు, త్రిమూర్తుల తత్త్వములు, వీటన్నిటి విశ్లేషణ, తత్వాతీతము, బయలు, లేనెఱుక దేనివలన తెలియబడునో, అదే ద్వాదశి, షోడశి మంత్రార్థములు. ఈ మంత్రముల ఉపాసన ద్వారా పై వాటి అవినాభావ సంబంధము తెలిసి, విలక్షణముగా, ఎఱుక లేక, ఉన్నది ఉన్నట్టు ఉండుటయే అనుభవము.

ఇప్పుడు కాలమే ఆధారంగా విశ్వము వరకు ఏమీ లేనిదై, త్రిమూర్తి తత్త్వములు గూడ లేనివై మిగిలినది శూన్యము. సర్వం శూన్యం. అనగా దైవీశూన్యములోనికి ప్రవేశించుట. ఈ శూన్యానుభవమును ప్రసాదించిన మరొక పూర్ణ సద్గురువు దొంతులమ్మగారు. ఇట్లు వీరిద్దరును ఎఱుక అనుభవము, లేనెఱుక అనుభవము కలిగియుండి, అర్హత గల శ్రీరావుగారిని లేనెఱుక అనుభవము కలుగజేసి, వారిని శూన్యములోనికి ప్రవేశింపజేసిరి.

ఇంతకు పూర్వము ది. 17-11-1995 తెల్లవారుజామున 3 గం॥లకు శ్రీ రావుగారికి మూలాధారమందు విద్యుద్దీపము వెలిగించుటకు మీట వేయునపుడు కలుగు శబ్ధము వంటి "టక్" అను శబ్దము మ్రోగిన వెంటనే సహస్రారము తెరువబడి దొంతులమ్మగారు ప్రశ్నించుట, శ్రీరావుగారు సమాధానమిచ్చుట యీ విధముగా జరిగినది.

దొం: ఉన్నావా?

రా : ఉన్నాము కదా! మనమిద్దరము మాట్లాడుతున్నాము కదా!

ఒక సెకను తరువాత

దొ: గొడ్రాలి బిడ్డ సామెత నీకు అనుభవమేనా?

రా: యదార్ధము విచారించినపుడు ఎవరో బిడ్డను తన బిడ్డగా భావన చేసి బంధించబడినది.

ఒక సెకను నిశ్శబ్ధము

దొం : ఉన్నావా?

రా: లేను

దొం : మనిద్దరమూ మాట్లాడుతున్నాము కదా! లేనంటావేమిటి?

అంతట ఊరకుండిరి, ఎట్లనగా

కం॥ ఒరులు నేననక నిండిన దెరిగింపుమదేమొ?
బయలు । యేనొరులనుచున్ యెరుగు నీవెవరు?
యీ లేనెరుకనున । వున్నావు? వుంటె యిది లే
నంచను । నేనొ? నిను నీవు మదినీ లేననుకో!
పరిపూర్ణ । మో? దాన్నే పగిదీ గుర్తెరిగేము?
యిది లేనంచనునేనొ? నినునీ! మదిలేననుకో ॥

– శుద్ధ నిర్గుణ తత్వ కందార్ధదర్వులు 175వ కం॥

పరిపూర్ణ సద్గురువు శ్రీ ఉపాసనీ మహరాజ్ వారు శ్రీ రావుగారికి శూన్యాతీతమునందుంచిరి. అనగా శూన్యమునందు విలక్షణమగుటయే శూన్యాతీతము.

సర్వవ్యాపకమైన శూన్యస్థితినందు ఏ ఉపాది వుండదు. శూన్యతాదాత్మ్యత నుండుట వలన శూన్యములో జరుగు ప్రయాణమును వివరించుటకు సాధ్యపడదు. కాని అనుభవించబడుతూ ప్రయాణము జరుగును. శూన్యములో ప్రయాణమంతా పరిపూర్ణ సద్గురువే తానై నడిపించును. ఇది శ్రీ ఉపాసనీ మహరాజ్‌గారి వల్ల జరిగినది.

ఈ ప్రయాణములో గురుశిష్యులిరువరుకూ ఉపాధి గాని, సంకల్ప వికల్పములు గాని లేనట్టి స్థితి. అందువలన గురుసూచన ఉండదు. శిష్యుని స్వీకారము ఉండదు. ఇద్దరును ఉండరు. గురునడకయే శిష్యుని నడక. "గురుశిష్యులొకటాయే గురువెఱుకబాసెన్" అయినప్పటికి జరుగుచున్నది శిష్యునికి తెలియబడుచున్నది. ఇట్టి ప్రయాణము జరుగునపుడు శ్రీరావు గారు శ్రీ ఉపాసనీ మహరాజ్ వారి నీవిధముగా ప్రశ్నించిరి :

"గురువర్యా! సంకల్పము, ఉపాధి, ఉపాధిగత చైతన్యము, యితరములైన ఇంద్రియములు లేనట్టి స్థితి కదా! ఈ శూన్యము తెలియబడుచునేయున్నదే! ఇది ఎలా సాధ్యము!"

అందులకు పరిపూర్ణగురుని సమాధానము: "ఈ శూన్యములో తెలియబడు

చున్నదంతా మిగిలియున్న వెం(ట్రుకవాసి యెఱుకతోనే! అది లేనిచో యేమీ తెలియబడదు. ఈ వెం(ట్రుకవాసి యెఱుక, అనుభవము కోసమై యున్నట్టిది మాత్రమే". ప్రవేశించేవరకు ఉండి, ప్రయాణానుభవ వివరము తెలియజేయుచూ, చివరకు అది కూడా లేకుండా పోవును. అప్పుడు లేకుండాపోవును. ఇక లేదు.

"పరబయలు చేరువరకు వెం(ట్రుకవాసి యెఱుక ఉండిననే గాని పరబయలు తెలియబడదు"

పై వివరించిన స్థితుల క్రమము యేమనిన :

1) జీవుడు బ్రహ్మముగా అగుట (జీవన్ముక్తానస్థ)
2) పరబ్రహ్మమనెడి బ్రహ్మానుభవము
3) కేవలాత్మ అనెడి లేని ఎఱుకగా పరబ్రహ్మానుభవము
4) విశ్వప్రవేశము
5) శూన్యము
6) శూన్యాతీతము

శ్రీ రావుగారికి ఒక ప్రశ్న మిగిలియున్నది. అదేమనిన "ఎట్టి పరిణామము లేకయున్నదియు, అన్నిటికి మూలమైనదియు ఏదో?"

అన్నిటికి ఆధారము కాలము. అందువలన శ్రీ ఉపాసనీ మహారాజ్ వారు శ్రీరావుగారిని కాలమునందు ప్రవేశింపజేసిరి. కాలమునధిగమించిన పిదప అన్నీ కాలములోనే ఉత్పత్తియై కాలమందే నశించుచున్నవని తెలిసినది.

ఈ స్థితియే కాలాతీతము. అప్పుడు కాలపురుషుడు (కాలుడు) ఎదురై శ్రీరావుగారికి స్వాధీనపడి నమస్కరించెను. ఇట్టి కాలాతీత స్థితియందు సర్వమూ నెంచబోయినపుడు, కాలుడు సవినయముగా ప్రార్థించి తదుపరి మూడు మారులు హెచ్చరించునని శ్రీరావుగారు తెలిపిరి. ఇంకను కొనసాగిన, శాశ్వతమైన పరశివ సత్తాను మరచి, తిరిగి ఎఱుక పాలగును.

ఇప్పుడు "కాలుడు యే ఆధారముతో యీ సృష్టి కార్యమంతటిని నిర్వహించుచున్నాడు" అని కలిగెను. "కాలమున కాధారము బయలా!" అని వారికి సమాధానము కలిగెను. అంతట తనకు కూడా యీ బయలే మూలము అని నిర్ణయమయ్యెను.

అంతట పరిపూర్ణ సద్గురువు యొక్క కరుణా కటాక్షము చేత బయలులో ప్రవేశించి, బయలు యొక్క అనుభవము కూడా పొంది, తిరిగి పరిశీలించి చూడగా, యీ జరిగే వాటికి గాని, తనకు గాని, యీ బయలుకు యెట్టి సంబంధము లేదని తెలియబడినది. ఈ బయలు అనునది తనకు తానుగానేయున్నది. దేనిలోను, దేనితోను లేదు. దేనికీ సంబంధము లేదు. దేనికీ మూలము గాదు. ఈ విధముగా తెలియబడిన శ్రీ రావు గారు వెం(ట్రుకవాసిగానున్న వారే లేకపోయిరి.

పరిపూర్ణ సద్గురువైన శ్రీ ఉపాసనీ మహారాజ్ వారు విశ్వ సంబంధమైన విజ్ఞానమును పరిపూర్ణముగానున్నట్టివారు. ఇతరులను కూడా పరిపూర్ణులుగా జేయగల సమర్థులు. అయినప్పటికిని, అవతార్ మెహెర్ బాబా వారు తమ దివ్య కరుణతో శ్రీరావుగారిని తన సమాధి వద్దకు రప్పించుకొని, సమాధి స్పర్శతో దివ్య దర్శనాల నొసగి, విశ్వ సంబంధ, గోళాల సృష్టి స్థితి లయముల అనుభూతిని ప్రాప్తింపజేయ గలిగినప్పటికిని, శ్రీరావుగార్కి మెహెర్‌బాబా వారే యీ కార్యమును నెరవేర్చిరి. కారణము శ్రీ రావుగార్కి బాబాతో నున్న సన్నిహిత సంబంధమే. అవతార్ మెహెర్‌బాబా వారు దీనిని ఈ విధముగా తెలియజేసిరి.

"శ్రీ ఉపాసనీ మహరాజ్‌వారి ద్వారా నీకు గోళముల యొక్క విషయ వివరణ మాత్రమే తెలియబడినదిగాని, గోళములలో ప్రవేశపెట్టి, వాటి అనుభవము నీకు గలుగజేయలేదు. అందువలన నీవు అదే పరిపూర్ణానుభవ మనుకొని స్థిరపడిపోయావు. కనుక శ్రీ ఉపాసనీ మహరాజ్‌వారు మిగిలిన పనిని నా ద్వారా చేయించారు. నీచే నా సమాధి దర్శనము చేయించుటకు సమయమిప్పుడాసన్నమైనది. దీనిని నీ చేత జరిపించినది నేనే. తదుపరి నీవు సత్యసాయిబాబా వారి ముఖములోని దివ్యతేజస్సును దర్శించి, ఆ తన్మయముతో నుండి, గుంటూరు చేరువరకు అట్లే యుండుట జరిగినది".

ఈ విధమైన విశ్వానుభవము, కాల ప్రవేశమైన పిదప కలుగుటయే పరిపూర్ణమని తెలియబడినది.

శ్రీ రావుగారు చివరి అనుభవము పరశివునిగా తానైనట్టి అనుభవము పరశివుడనగా దేనితోనూ సంబంధము లేకుండా యుండే సత్తా. దాని యొక్క ప్రకాశము చేతనే సర్వమూ ప్రకాశింపబడును. అయినను, అట్టి ప్రకాశింపబడు వానితో పరశివుని యొక్క సత్తాకు యెట్టి సంబంధము లేదు. ఈ సర్వమునకున్ను, బయలుకున్ను కూడా అతీతముగ ఉన్నది. అది దేనిపై ఆధారపడక, దానికదే స్వతంత్రముగా అచలమునకు గూడ సంబంధపడక స్వయంసత్తాతో నుంటూ యుండును.

అన్నిటినీ, యీ సత్తాయే తెలియపరచుచూనుండును. ఆ విధముగా తెలియపరచుచున్నప్పటికిని, వేటికిని యీ సత్తాకెట్టి సంబంధమూ లేదు. ఈ సత్తా అనునది ఒకటి, పై విధముగానున్నదని శ్రీరావుగారు చెప్పిరి. ఇదియే సాంప్రదాయమునకైనను సరిపోయినను, సరిపోకపోయినను, వారి అనుభవమును మాత్రము పరమ సత్యము. గోళానుభవము, కాలాతీతానుభవము, విశ్వానుభవము, పరశివ సత్తా గురించిన అవగాహన మొదలైనవి, వివిధ సద్గురువుల ద్వారా, అవతార్ మెహెర్ బాబా వారి దివ్యానుగ్రహము వలన, భగవాన్ సత్యసాయిబాబా వారి ప్రేమ వలన శ్రీరావు గారికి కలిగినవన్నీ, వారు పొందినవన్నీ సత్యము, యదార్థము.

శ్రీ రావుగారు భగవాన్ సత్యసాయిబాబావారు చేయు దివ్య కార్యక్రమములో, ఒక ఉపకరణముగా మారి కొందరు సాధకులచే నాకర్షింపబడుచూ, వారికవసరమగు సూక్ష్మ శక్తి నందించుచు, వారి కాటంకముగానున్న సంకటములను, బంధములను సూక్ష్మముగా శ్రీ రావుగారి దివ్యశక్తితో, ఆశీర్వచనము ద్వారా బోధచే మరియు దృష్టిచే తొలగించుచు తన యనుభవమును, తగిన విధముగా, తగినవారి కందించుచూ, ఒక్కొక్కప్పుడు, శిష్యుల సంస్కార బాధలు వారి పైకి వేసికొని బాధపడుచు వారి శేష జీవితమంతయు యిట్టి కార్యక్రమమునకంకితమయ్యెను. వారికి సహజ నిర్వికల్ప స్థితిలో గోచరించిన వాక్యములే యీ గ్రంథము తయారుచేయుటకు సకారణమయ్యెను.

– ఓం తత్ సత్ –

మంగళహారతులు

1) గురునకు మంగళ మనరమ్మా । సద్గురు మూర్తిని కనుగొనరమ్మా ।
తరుణులార ఈతనికి భక్తితో వ7ురియుచు మ్రొక్కిన మోక్షము చేకురు
॥ గురునకు ॥

2) క్షరపురుషు డనరాదమ్మా । అక్షరపురుషు డనగాదమ్మా ।
క్షరపురుషాక్షర । పురుషులకావల । పురుషోత్తముడన బరగిన ।
మా యీ ॥ గురునకు ॥

3) క్షేత్రజ్ఞుం డనరాదమ్మా । యీ క్షేత్రమతం డనగాదమ్మా ।
క్షేత్రజ్ఞుని । తత్ కే్త్రంబును యే । మాత్రము దగులక । పాత్రుండైన ।
యీ॥ గురునకు ॥

4) స్మరణరూపు డనరాదమ్మా । విస్మరణ రూపు డనగాదమ్మా ।
స్మరణ లేక విస్మరణ గాక । తత్స్మరణ, విస్మరణ లెఱుకలేని । యీ ।
గురునకు ॥

5) దేహియనుట కనరాదమ్మా । యీ దేహమతం డనగాదమ్మా ।
అహంభావనకంటు సొంటులగు దేహిదేహముల తెఱువుపోనీ । యీ ।
గురునకు ॥

6) పిండరూపు డనరాదమ్మా । బ్రహ్మాండరూపు డనగాదమ్మా ।
పిండాండ బ్రహ్మాండ భాండముల నిండియుండి యివి రెండుగాని । యీ
। గురునకు ॥

7) జ్ఞానియనుట కనరాదమ్మా । అజ్ఞానియనుట కది లేదమ్మా ।
జ్ఞానాజ్ఞానములోన నొక్కటియు తానుగాక శూన్యానికి మీరిన ॥ గురునకు॥

8) యోగియనుట కనరాదమ్మా । మరి భోగియనుట గదిలేదమ్మా ।
యోగిభోగి ఉద్యోగము లంటని । భాగవ తాన్వయ భవ కృష్ణుండనే ।
గురునకు ॥

9) మేలుకీడు లనరాదమ్మా । యే మేలు కీడులది గాదమ్మా ।
కాలకూటమున కన్న మిక్కిలగు జాలమాంబ వ్యథ క్షణములో బాపిన ।
గురునకు ॥

మంగళము నిర్వికారికి । మంగళ మపరోక్ష విహిత ।
మహి తాత్మునకున్ । మంగళము సచ్చిదాత్మకు ।
మంగళము నవద్య చిద్భ-హ్మాది దేవునకు - పరాత్పరు
డౌ - వేదవేద్యునకు - ఆదియంత్యము లేక ।
నమరి చిన్మింటను । నాదాంతరంగుడౌ । నటన
సంపూర్తికి । భేదబుద్ధి విరహిత రేచక । భిన్న
పూరక కుంభకాఖ్య వి । వాద జాంతర్లక్ష్యహిమకర ।
వహ్ని సూర్య సురూప చిద్భ-హ్మాది దేవునకు -
పరాత్పరుడౌ - వేదవేద్యునకు ॥ మంగళం ॥

మంగళము విశ్వమూర్తికి । మంగళ మచల
స్వభావ । మౌనాకృతికిన్ । మంగళము కే
వలాత్మకు । మంగళ మాద్యంత శూన్య - మహి
తన కిపుడూ - శుభమంగళం - నిహితున
కెపుడు - రహిమీర బయలున । రాణిందు
నిజగురు । సహజ పరబ్రహ్మ । సౌజన్యనిధి
కిపుడు । యిహపరంబుల కందకను త । త్వే
క్షణంబున గోచరించెడు । కుహర కూటమరా
ళ గమనుడు । కోటి భాస్కర కాంతి మీరెడు
మహితున కిపుడు । శుభ మంగళం । విహితు
న కిపుడు ॥ మంగళం ॥

గ్రంథ రచనకు పరిశీలించిన గ్రంథరాజములు

1. పరిపూర్ణ ప్రబోధ యాజ్ఞవల్కి జనక సంవాదము
   గ్రంథ కర్త - పరుచూరు పాపయ్య రాజయోగి
2. పరిపూర్ణ రాజయోగ సిద్ధాంత శిరోభూషణము
   గ్రంథకర్త - పరిపూర్ణ దర్శనాచార్య, సదానంద యిలపకుర్తి
   వీర వెంకట రామచంద్రరావు
3. సంపూర్ణ రాజయోగ సిద్ధాంత వ్యాసమంజరి.
   గ్రంథకర్త - పరిపూర్ణ దర్శనాచార్య, సదానంద యిలపకుర్తి
   వీర వెంకట రామచంద్రరావు
4. నిజప్రబోధ విధానము
   గ్రంథకర్త - అచలర్షి దయానంద పొన్నాల రాజయోగి
5. శుద్ధ నిర్గుణ తత్వ కందార్థ దర్పులు - క్షరాక్షరోపాధి ద్వయ దోష రహిత పరమతత్వ కందములు
   గ్రంథ కర్త - శ్రీ మద్భాగవత కృష్ణదేశిక ప్రభువులు (రచన)
   అచలర్షి దయానంద రాజయోగి (భావార్ధ విశేషార్ధము)
6. నిర్గుణాత్మ జ్ఞాన సంయోగము (కందార్థ రత్నావళి)
   గ్రంథ కర్త - ముత్యాల నారిసింహ యోగీంద్రులు
7. అచల గ్రంథము (వేదాంత గ్రంథము)
   గ్రంథ కర్త - శ్రీమాన్ పోకల శేషాచలాహ్వాయులు.
8. పరిపూర్ణము - కొప్పరపు బాల మనోహరరావు
9. శ్రీ శివరామ దీక్షితీయము (బృహద్వాసిష్ఠము)
   అచల బోధ సిద్ధాంతం షోడశి భావం స్వప్న దృష్టాంతం
   గ్రంథ కర్త - శ్రీ మద్రామడ్గు శివరామ దీక్షితులు (పొన్నాల రాజయోగి)
10. ద్వాదశి భావం
    గ్రంథ కర్త - శ్రీ మద్రామడ్గు శివరామ దీక్షితులు (పొన్నాల రాజయోగి)
11. సుజ్ఞాన దీపము అను గురుగీతలు
    గ్రంథ కర్త - శ్రీ మత్పిల్లాన శంకరరావు (తాత్పర్యము)
12. భద్రాద్రి రామ శతకము (భావార్ధ విశేషార్ధ సహితము)

గ్రంథ కర్త – శ్రీ పరశురామ నరసింహ్మదాసు
13. వేదాంత పంచవిశంతి
గ్రంథ కర్త – కొల్లి కోటయార్యులు (సంగ్రహీత)
14. యోగవాసిష్ఠసారము
గ్రంథ కర్త – శ్రీ నోరి శ్రీనాథ వేంకట సోమయాజులు
15. యెఱుక భ్రాంతి రహిత శిరోరత్నము అను గురుశిష్య సంవాదము
గ్రంథ కర్త – శ్రీ శిలిమేరిసైదులు రాజయోగి
16. సిద్ధ రామశతకము –గ్రంథ కర్త – సిద్ధ రామ
17. ఆత్మ లింగ శతకము
గ్రంథ కర్త – ఆకుల గురుమూర్తి యోగీంద్రులు
18. బ్రహ్మ విద్య – పరమహంస
19. బ్రహ్మ విద్యా రహస్యము – గ్రంథ కర్త – బ్రహ్మశ్రీ సాయిసుధాకర్ పూర్ణానంద స్వామీజీ
20. మహా వాక్య విచారణ
గ్రంథ కర్త – సాహిత్య విద్యా ప్రవీణ, వేదాన్తాచార్య
21. స్తోత్రమంజరి
గ్రంథ కర్త – శ్రీ విద్యానంద స్వాములు శ్రీ వ్యాసాశ్రమము (ప్రకాశకులు)
22. అష్టావక్ర గీత
గ్రంథ కర్త – శ్రీ చుక్కా అప్పలస్వామి (వ్యాఖ్యాత), శ్రీ వ్యాసాశ్రమము
23. సీత పాట – గ్రంథ కర్త – శ్రీ పరశురామ పంతుల గురుమూర్తి లింగమూర్తి
24. తారకామృతసారిము – గుజ్జుల నారాయణదాసు
25. ఆత్మ విద్యా విలాసము – వాఖ్యాత – స్వామిని శారదా ప్రియానంద
26. సత్యసాయి వాహిని – భగవాన్ శ్రీ సత్యసాయిబాబా
27. వేదాంత డిండిమము – గ్రంథ కర్త – శ్రీ శంకర భగవత్పాదులు
28. శ్రీ విద్యా సర్వస్వము – గ్రంథ కర్త – శ్రీ క్రోవి పార్థసారథి
29. వివేక చింతామణి వచనము – గ్రంథకర్త – శ్రీ వేంకట మల్ల
30. వేదాంత భావార్థ ప్రదీపిక (శుభకర్ణామృతము)
గ్రంథ కర్త – బ్రహ్మశ్రీ ముమ్మలనేని వెంకట సుబ్బారావు
31. అనుబంధం – శ్రీ మేకా నరసింహారావు గారి జీవితానుభవము

1) అవ్యక్తము 2) మహత్తు 3) అహంకారము

ఆకాశ పంచకం	ఆకాశము	చంద్రుడు మనస్సుగా	బృహస్పతి బుద్ధిగా	క్షేత్రజ్ఞుడు చిత్తముగా	చంద్రుడు అహంకారముగా	అంతరేంద్రియములతో గోళకములు
వాయు పంచకం	జయుడు సమాన వాయువుగా		అజుడు ఉదాన	విశిష్టుడు ప్రాణ	విశ్వకర్త అపాన	పంచ ప్రాణములతో గోళకములు
అగ్ని పంచకం	అష్ట దిక్కులు శ్రోత్రముగా	వాయు దేవుడు త్వక్కుగా	అగ్ని	వరుణుడు జిహ్వాగా	అశ్వనీ దేవతలు ఘ్రాణముగా	జ్ఞానేంద్రియములతో గోళకములు
జల పంచకం	పరాశక్తి శబ్దముగా	ఇచ్ఛా శక్తి స్పర్శగా	ఆది శక్తి రూపముగా	జలము	క్రియా శక్తి గంధముగా	పంచతన్మాత్రలతో గోళకములు
పృథివి పంచకం	అగ్ని దేవుడు వాక్కుగా				పృథివి	కర్మేంద్రియములతో గోళకములు
	ఆకాశ కదంబము	వాయు కదంబము	అగ్ని కదంబము	జల కదంబము	పృథివి కదంబము	

బ్రహ్మము	అవ్యక్తము	మహత్తు	మహదహంకారము	పంచన్మాత్రలు	పంచ మహా భూతములు	జగత్తు	విరాట్టు
ఆత్మ	సదాశివుడు ఈశ్వరుడు రుద్రుడు విష్ణువు బ్రహ్మ	అం యం రం వం లం	పరా శక్తి ఆది శక్తి జ్ఞాన శక్తి ఇచ్ఛా శక్తి క్రియా శక్తి	శబ్దము స్పర్శము రూపము రసము గంధము	సునీలము ధూమ్రము అసితము తెలుపు ఎఱుపు	**అనాత్మ**	**విశ్వ రూపము**
దేవతలు	తత్వ విచారకులు	యోగ అభ్యాసకులు	మతముల వారు	భక్తులు	మంత్ర ఉపాసకులు	మానవులు	**తురీయం**
ఆకాశము స్థూల భాగం కామ, క్రోధ లోభ మోహ - భయము	జ్ఞానము ఎఱుగుట కూటస్థుడు భ్రూమధ్యము ఆకాశం	మనస్సు సంకల్పం చంద్రుడు కంఠము వాయువు	బుద్ధి నిశ్చయం బృహస్పతి ముఖము అగ్ని	చిత్తము చింతన క్షేత్రజ్ఞుడు నాభి జలము	అహంకారము అభిమానాము రుద్రుడు హృదయము పృథ్వి	అధ్యాత్మికము ఆదిభౌతికము ఆదిదైవికము స్థానములు భూతములు	**అంతరేం ద్రియములు**
వాయువు స్థూల భాగము చాచుట - తిరుగుట- పరుగుట - ముడుచుట - దాటుట	సమాన వాయువు వదనము జయుడు నాభి ఆకాశం	వ్యాన వాయువు స్పర్శ విశ్వ యోని సర్వాంగము వాయువు	ఉదాన వాయువు పలికించుట అజుడు కంఠము అగ్ని	ప్రాణ వాయువు ఉశ్వాస నిశ్వాస విశిష్టుడు హృదయము జలము	అపాన వాయువు విసర్జన విశ్వకర్త గుదము పృథ్వి	అధ్యాత్మికము ఆదిభౌతికము ఆదిదైవికము స్థానములు భూతములు	**ప్రాణేంద్రి యములు**
అగ్ని స్థూల భాగము ఆకలి-దప్పి-నిద్ర సంగమము - ఆలస్యం	శ్రోత్రము శబ్దము వినుట దిక్కులు చెవులు ఆకాశం	త్వక్కు స్పర్శనెరుగుట వాయువు చర్మము వాయువు	చక్షు రూపం నెరుగుట సూర్యుడు కన్ను అగ్ని	జిహ్వ రుచినెరుగుట వర్ణుడు నాలుక జలము	ఘ్రాణము వాసన నెరుగుట అశ్వినీ దేవతలు ముక్కు పృథ్వి	అధ్యాత్మికము ఆదిభౌతికము ఆదిదైవికము స్థానములు భూతములు	**జ్ఞానేంద్రి యములు**
జలము స్థూల భాగము స్వేద మూత్ర- శ్లేష్మ శుక్ల శోణితములు	శబ్దము ధ్వని సదాశివుడు చెవులు ఆకాశం	స్పర్శ తాకుట ఈశ్వరుడు చర్మము వాయువు	రూపము వర్ణము రుద్రుడు కన్నులు అగ్ని	రసము రుచి విష్ణువు నాలుక జలము	గంధము వాసన బ్రహ్మ ముక్కు పృథ్వి	అధ్యాత్మికము ఆదిభౌతికము ఆదిదైవికము స్థానములు భూతములు	**విషయేంద్రి యములు**
పృథ్వి స్థూల భాగము నరములు అస్తులు చర్మ-సఖ -రోమ మాంసము	వాక్కు వచనము అగ్ని నోరు ఆకాశం	పాణి దానము ఇంద్రుడు చేతులు వాయువు	పాదము గమనము విష్ణువు కాళ్ళు అగ్ని	గుహ్యము ఆనందము బ్రహ్మ లింగము జలము	గుదము విసర్జన మృత్యువు ముడ్డి పృథ్వి	అధ్యాత్మికము ఆదిభౌతికము ఆదిదైవికము స్థానములు భూతములు	**కర్మేంద్రి యములు**
రాక్షసులు	వచియించును	దానము చేయును	గమనము చేయును	ఆనందించును	మల మూత్రములు విసర్జించును	**పశువులు**	జాగ్రత్తస్వప్న సుషుప్తి

పంచీకరణి పఠం